

కె. బాలగోపాల్

# అంతర్జాతీయం

చరిత్ర - వర్తమానం, ఆధిపత్యాలు - ప్రత్యామ్నాయాలు



# అంతర్జాతీయం

## చరిత్ర – వర్తమానం, ఆధిపత్యాలు – ప్రత్యామ్నాయాలు

కె. బాలగోపాల్

మానవహక్కుల వేదిక ప్రచురణ

“మన ప్రభుత్వం దేశం లోపల తప్పుడు పనులు చేస్తుందని మనం సులభంగానే నమ్ముతాంగానీ దేశం బయట తప్పుడు పనులు చేస్తుందని ఒప్పుకోవడానికెందుకో మనసొప్పదు. దేశం బయట మన ప్రభుత్వం అనేది మన దేశంతో సమానార్థకం అయిపోతుంది. ప్రభుత్వం తప్పు చేసిందనడం దేశమే తప్పు చేసిందడంతో సమానమయిపోతుంది. ఇది ఎంతమాత్రం సహేతుకమయిన వైఖరి కాదు.

....

మనకొక్కరికే సాధ్యమవుతుందనుకున్నంత కాలం దౌర్జన్యంలో తప్పు కనిపించదు. కానీ ఎదుటివారు కూడ ఆ సామర్థ్యాన్ని అలవరచుకున్న నాడు అది దౌర్జన్యంగా కనిపిస్తుంది. ‘అనాగరికం’, ‘మానవతకు మచ్చ’, మంచికీ చెడుకూ మధ్య ఘర్షణ’ మొదలైన మాటలు వినిపిస్తాయి.

....

‘సార్వజనీన ప్రమాణాలను మేము అంగీకరించము’ అని ప్రకటించడం సంవాదాన్ని తప్పించుకోవడానికీ, మన ప్రవర్తనకు ఎవరికీ జవాబు చెప్పకుండా ఉండటానికీ సులభమైన మార్గం. సార్వజనీనమని ప్రకటించుకునే ప్రమాణాలన్నీ నిజానికి సార్వజనీనం కాకపోవచ్చును కాబట్టి అన్ని ప్రమాణాలను విమర్శనాత్మకంగా చూడాలన్న న్యాయమైన అభ్యంతరాన్ని ఈ తప్పుడు ప్రయోజనం కోసం అన్ని రకాల ‘పునాది వాదులు’ వక్రీకరించి వాడుకుంటూ ఉంటారు. మన సంఘ్ పరివార్ గుంపు అందులో ప్రథములు.”

**– కె. బాలగోపాల్**

# అంతర్జాతీయం

మానవహక్కుల వేదిక ప్రచురణ

**Human Rights Forum Publication**

ప్రచురణ సంఖ్య: 48

ప్రచురణ కాలం : అక్టోబర్ 2020

వెల : 200 రూపాయలు

**ముద్రణ :**

అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ,

126 శాంతినగర్, హైదరాబాద్ - 28

ఫోన్ : 23391364, 233041941

Email: anupamaprinters@yahoo.co.in

**ప్రతులకు:**

ఎస్. జీవన్ కుమార్

సెల్ : 9848986286

Email: kumjeevan@gmail.com

వి. వసంతలక్ష్మి

ఫోన్ : 040-23537969

Email: vasantha.aj@gmail.com

**నవోదయ, నవ తెలంగాణ, అనేక, ప్రజాశక్తి బుక్‌హౌస్‌లు**

మా వెబ్‌సైట్: www.humanrightsforum.org

బాలగోపాల్ రచనల కోసం : www.balagopal.org

# మా మాట

**చా**లా దేశాల మీద మనకు కోపం రావడానికి కారణం ఆ దేశాల ప్రభుత్వాలు చేసిన పనులే అయ్యుంటాయి కాని తరచూ ఆ కోపాన్ని మనం ఆ దేశాల ప్రజల మీద చూపిస్తూంటాం. ఇది చాలా తప్పంటారు బాలగోపాల్.

– "యుద్ధమంటే మనుషులకింత ఆవేశం ఎందుకొస్తుంది? మామూలుగా సాదాసీదాగా బతికే వాళ్ళు సైతం ఇంత ఉత్సాహం ఎందుకు చూపిస్తారు? ఇది 'దేశభక్తి' అని చెప్పుకుని గర్విస్తున్నాం కానీ ఇది దేశభక్తా లేక ఒక శత్రువును భావించుకుని మనస్సు నిండా నింపుకున్న ద్వేషభావంలో ఒకరితో ఒకరు మమేకం అయ్యే గుణమా? ఒక పరాయి దేశం మీద, జాతి మీద, ఏదయినా పరాయి సమూహం మీద ద్వేషం మనుషులను చాలా వేగంగా ఏకం చేస్తుంది. అందరూ ఒకటయి వాళ్ళను ఉమ్మడిగా ద్వేషించడంలో ఒక సంతృప్తితో కూడిన భద్రత ఉంటుంది. ఇది నైతికంగా ఏమంత గొప్ప గుణం కాదు గానీ దీనికి దేశభక్తి అని పేరు పెట్టుకొని మనం చాలా నీతిమంతులుగా అనుభూతి చెందుతున్నాం."

ఏ దేశ ప్రభుత్వమైనా ఆ దేశ ప్రజలతోనే కాదు ఇతర దేశాలతో కూడా న్యాయంగా ప్రవర్తించాలి. కాని తమను తాము గొప్ప ప్రజాస్వామ్య దేశాలని భావించుకునే చాలా దేశాలు సైతం ఇతర దేశాల పట్ల ఆ విధంగా వ్యవహరించడం లేదు. ఇది చాలా అప్రజాస్వామికమంటారు బాలగోపాల్.

–"రాజకీయాలలో అబద్ధాలు మామూలే గానీ అంతర్జాతీయ రాజకీయాలు ఈ విషయంలో ఆంతరంగిక రాజకీయాల కన్నా మరీ అధ్వాన్నం. ఎందుకంటే పదవి కోసమో పార్టీ శ్రేయస్సు కోసమో అబద్ధం చెప్పటం తప్పనుకునే వారు సహితం

దేశం కోసం అబద్ధం చెప్పటంలో తప్పేమీ లేదని భావిస్తారు. దానిని అబద్ధంగా గుర్తించడానికి సహితం చాలామంది సిద్ధపడరు."

ఎంత 'మంచి' నియంతృత్వమైనా ప్రజాస్వామ్యానికి ప్రత్యామ్నాయం కాదంటారు బాలగోపాల్.

–"సామాజిక సమస్యలు ఏ మేరకు ప్రజాస్వామికంగా పరిష్కారమవుతాయో ఆ మేరకే అవి నిజంగా పరిష్కారమవుతాయి. 'మంచివాళ్ళ' ఏక పార్టీ నియంతృత్వంలో జరిగే పరిష్కారాలు భ్రమాపూరితమైన పరిష్కారాలే కాక అవి సమస్యలను దాచిపెట్టడానికి మాత్రమే పనికొస్తాయి."

★ ★ ★

బాలగోపాల్‌గారు వివిధ దేశాల గురించి వివిధ సందర్భాలలో రాసిన అనేక వ్యాసాల నుండి ఒక 52 ఎంపిక చేసి ఈ 'అంతర్జాతీయం' తీసుకొచ్చాం. అన్నిట్లోనూ చరిత్రా ఉంది, వర్తమాన ఘటనలపై వ్యాఖ్యానమూ ఉంది, చరిత్ర వర్తమానాన్ని నిర్దేశిస్తున్న వైనమూ ఉంది. అలాగే దేశాల లోపలా, ప్రపంచం పైనా ఆధిపత్యం చెలాయించిన శక్తులు, సిద్ధాంతాల గురించి విశ్లేషణతో పాటు వాటికి ప్రత్యామ్నాయాల గురించిన చర్చ కూడా ఉంది. అందుకే 'అంతర్జాతీయం' అనే ప్రధాన శీర్షికకు 'చరిత్ర–వర్తమానం, ఆధిపత్యాలు – ప్రత్యామ్నాయాలు' అనే ఉప శీర్షికను జోడించాం.

ఈ వ్యాసాలలో అధిక భాగం 1999–2009 మధ్య రాసినవి. మొత్తం 52 లో 7 వ్యాసాలు మాత్రమే అంతకన్నా ముందు రాసినవి. అయితే అవి ఆయా దేశాల పరిణామాలను కూలంకషంగా చర్చించిన సైద్ధాంతిక వ్యాసాలు. తర్వాతి కాలంలో రాసినవి వివిధ సంక్షోభాలకు స్పందించి రాసినవి. ఇక్కడ స్పందన అంటే Response అనే అర్థంలో మాత్రమే కాదు, ఆయా సంక్షోభాలు అక్కడి ప్రజల జీవితాలను ఎంత దుర్భర స్థితిలోకి నెట్టాయో సహానుభూతి చెందినవాళ్ళు మాత్రమే అక్షరబద్ధం చేయగల స్పందన. చదువుతుంటే వారి నిస్సహాయత, ఆవేదన మనలోకి కూడా ప్రవహించి తిష్ట వేసుకుని కూర్చుంటాయి. ఆ తర్వాత ఆ ప్రజలు కోసం వార్తల్లో వెతుక్కోకుండా ఉండలేం. వారికి న్యాయం జరగాలని కోరుకోకుండా ఉండలేం.

జాతీయమైనా, అంతర్జాతీయమైనా బాల్‌గోపాల్‌గారి దృష్టికోణం ఎప్పుడూ బాధిత సమూహాల వైపు నుండే ఉంటుందని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఏ సమస్యను అర్థం చేసుకోవడానికైనా ఆయన ఉపయోగించే కొలబద్దలు హక్కులు, విలువలు,

ప్రజాస్వామ్యం, న్యాయం. ఒక రకంగా ఈ వ్యాసాలు ఆయన రాసిన హక్కుల రచనలకు కొనసాగింపే. దేశం లోపల అన్ని బాధిత వర్గాలకూ ఒక హక్కుగా, విలువగా న్యాయం జరగాలని ఎలా కోరుకున్నారో దేశం బయట కూడా – అది ఏ దేశమైనా (మన దేశం ప్రధాన శత్రువుగా భావించే పాకిస్తాన్‌తో సహా) – బాధిత ప్రజలందరికీ అదే విధమైన న్యాయం జరగాలని ఆయన బలంగా కోరుకున్నారు. సందర్భం వచ్చినప్పుడల్లా 'దేశ ద్రోహం' లాంటి నిందలకు భయపడకుండా ఆయన వారి పక్షాన మాట్లాడుతూనే వచ్చారు. ఐక్యరాజ్య సమితిని బలపరుస్తూ ఆయన రాసిన వ్యాసాలు చదివితే అర్థమవుతుంది బలవంతుల పాలన పోవాలని ఆయన ఎంతగా కోరుకున్నారో.

చివరిగా – ఏ ప్రపంచ సమస్యనైనా ఎలా అర్థం చేసుకోవాలో ఆ పరికరాలను ఆయన ఈ వ్యాసాలలో మనకు అందించారు. 'దేశభక్తి' మాయలో పడకుండా వాటిని వాడుకోవడం మన వంతు.

**మానవహక్కుల వేదిక**

25 సెప్టెంబర్ 2020

# ఇందులో...

## శ్రీలంక

1. శ్రీలంకలో జాతి సమస్య : చారిత్రక, సామాజిక వాస్తవాలు .............. 11
2. మనం చేయవలసింది ఏమీ లేదా? .......................................... 16
3. శ్రీలంకలో చీకటి రాజ్యం .................................................. 22
4. మద్రాసు హైకోర్టు రగడ ముందూ వెనకా.................................. 27
5. శ్రీలంక తమిళుల భవిష్యత్తేమిటి?........................................ 32
6. చివరికి తమిళులకు ఏమీ దక్కదా? ........................................ 36

## పాకిస్తాన్

7. పాకిస్తాన్–భారత్‌ల మైత్రి : పీపుల్స్ ఫోరం కృషి........................... 40
8. 'కార్గిల్ యుద్ధాన్ని' వ్యతిరేకిద్దాం ............................................ 44
9. సమరఘోషలో శాంతిని విస్మరిస్తున్నామా? ................................ 48
10. యుద్ధం–శాంతి–ప్రజాస్వామ్యం .......................................... 53
11. మరో 'సైనిక' ముప్పు ........................................................ 57
12. పాకిస్తాన్ మీద వేయడానికి ఏ రాయి అయినేతేం! ........................ 66
13. కశ్మీర్ గురించి మనమైనా సత్యం మాట్లాడుదాం............................ 71
14. యుద్ధమంటే మనకెంత ఇష్టం!............................................. 75
15. మనకేం కావాలి? ............................................................ 79
16. భారత–పాకిస్తాన్ మైత్రి : స్పష్టతలేని వైఖరి ................................ 82

17. భారత పాకిస్తాన్ చర్చలు : గతి–గమ్యం ........................................ 88

18. ముషార్రఫ్ నోట అమెరికా మాట ఎందుకు వినపడుతున్నట్టు? .......... 93

19. బెనజీర్ హత్య, ప్రజాస్వామ్యం, బలిదానం .............................. 98

20. ఉద్వేగాల మాటున వాస్తవాలు ............................................ 102

21. నిజాలపై అభ్యంతరమా? .................................................. 107

**ఆఫ్ఘనిస్తాన్**

22. ముల్లా మహమ్మద్ ఒమర్‌కు సలాములు .................................. 111

23. ఆఫ్ఘనిస్తాన్ భవితవ్యం ................................................... 115

24. యుద్ధసత్యాలు–మన కర్తవ్యం ............................................ 119

**ఇరాన్**

25. ఇరాన్ అణుశక్తి హక్కులు : భారత్ వైఖరి .............................. 124

**ఇరాక్**

26. ఇరాక్‌పైన అమెరికా దాడిని వ్యతిరేకిద్దాం .............................. 127

27. జార్జి బుష్‌నూ, సద్దాం హుస్సేన్‌నూ ఒకే బోనులో నిలబెట్టలేమా? ...... 138

28. శిశుహంతక అమెరికా పాలకులనెవరు శిక్షిస్తారు? ........................ 142

**పాలస్తీనా**

29. పాలస్తీనా ప్రజాపోరాటం ................................................... 147

**ఇజ్రాయిల్**

30. ఇజ్రాయిల్‌తో మన పాలకుల స్నేహ రహస్యం ............................ 166

31. ఎవరి పాపానికి పరిహారం ఎవరు చెల్లిస్తున్నారు? ........................ 170

**అమెరికా**

32. ఈ ప్రాకులాట అవమానకరం............................................... 174

33. ఇప్పుడు జరగవలసింది ప్రతీకారం కాదు .................................. 177

34. అమెరికా యుద్ధ ప్రయత్నాలలో భారత్ భాగం కాకూడదు ............... 181

35. అమెరికా దురహంకారానికి తాజా బలిపశువులు ఆఫ్ఘన్లు................. 185

36. స్పష్టమవుతున్న అమెరికా ఎజెండా....................................... 188

37. బుష్ గడ్డ మీదనే నిరసనలు .............................................. 191

38. భారత్–అమెరికా ఒప్పందం : ఈ చర్చతో మనకేం పని? ............... 194
39. భారత్–అమెరికా అణు ఒప్పందంలో మనం
సంతోషించడానికి ఏముంది? ............................................ 198

**పోలండ్**

40. పోలండ్ కార్మికోద్యమం.................................................... 202

**రష్యా**

41. చైతన్యం లేని ప్రగతి సోషలిజానికి చేటు.................................. 214

**చైనా**

42. బాండుంగ్ వెలుగు నీడలలో................................................ 224
43. శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం.......................................... 231
44. చైనాలో ఏం జరుగుతోంది? ................................................ 262
45. చైనా ఆర్థికాభివృద్ధి–సింహావలోకనం...................................... 267
46. 'జనచైనా' స్వర్ణ ప్రస్థానం .................................................. 286

**టిబెట్**

47. టిబెటన్లు ఏమైతే ఎవరికేం పట్టింది? ...................................... 291
48. అక్కడ విజయం...ఇక్కడ తప్పిదం ........................................ 295

**నేపాల్**

49. ప్రజాస్వామ్య పునాదులపైనే సోషలిజం .................................... 300

**ఐక్యరాజ్యసమితి**

50. ఐక్యరాజ్యసమితిని కాపాడడానికి ఎవరు సిద్ధంగా ఉన్నారు? ............ 304
51. 'నాటో'మేటిక్ విధ్వంసం ఎన్నాళ్ళు? ....................................... 308
52. ఐక్యరాజ్యసమితి : గతి–గమ్యం ............................................ 314




# శ్రీలంకలో జాతి సమస్య: చారిత్రక, సామాజిక వాస్తవాలు

శ్రీలంక తమిళుల పోరాటం ఇవ్వాళో రేపో జాఫ్నా మీద జెండా ఎగరవేయబోతున్నదని కొన్నాళ్ళ కింద అనిపించింది గానీ వారి కోరిక అంత త్వరగా తీరబోయేది కాదని ఇప్పుడర్థం అవుతున్నది. జాఫ్నా ద్వీపకల్పంలోకి దాదాపు అయిదేళ్ళ విరామం తరువాత ఎల్‌టిటిఇ సాయుధ బలగాలు పునఃప్రవేశించగలిగాయి. అయితే శ్రీలంక సైన్యం అంత సులభంగా అక్కడి నుండి నిష్క్రమించే సూచనలు లేవు. సైనిక జవాన్ల ఆత్మస్థైర్యం బాగా బలహీనపడిందనీ, వారు తుపాకులు వదిలేసి పారిపోవడానికి సిద్ధంగా ఉన్నారనీ పత్రికలు మొదటి వారం రోజులు రాసాయి గానీ, వారి మనోబలాన్ని నిలబెట్టడంలో శ్రీలంక ప్రభుత్వం కృతకృత్యమయినట్టుంది.

ఎల్‌టిటిఇ సాయుధ బలగాలు అయిదేళ్ళ తరువాత పునఃప్రవేశం చేస్తున్నాయంటే అయిదేళ్ళుగా ఎల్‌టిటిఇ జాఫ్నాలో లేదని కాదు. ఏ రాజకీయ ఉద్యమమయినా భౌతికశక్తే కాక భావాల శక్తి కూడ. 'ఈలం' కాంక్ష జాఫ్నా తమిళులలో చాలా బలంగా ఉంది. మెజారిటీ ప్రజలలో ఉందని కూడ నిస్సంకోచంగా చెప్పుకోవచ్చు. వారిలో ఎల్‌టిటిఇ అభిమానులు, అనుయాయులు చాలామందే ఉన్నారు. జాఫ్నా తమిళుల జాతీయవాదానికి తానే ఏకైక ప్రతినిధి అని ఎల్‌టిటిఇ అంటుంది, కాదన్న వాళ్ళను

నిర్దాక్షిణ్యంగా నోరు మూయిస్తుంది. అది నిజం కాకపోయినప్పటికీ ఎల్‌టిటిఇకి చాలా మద్దతు ఉన్న మాట వాస్తవం. సాగించుకోగల వాళ్ళకు ప్రజాదరణ – వేరే ఏ కారణంగా కాకున్నా సాగించుకోగలిగారన్న కారణంగా – పెరగడం సహజం కాబట్టి ఆ మద్దతు బహుశా పెరుగుతుండవచ్చు, ఈ మధ్య పెరిగి ఉండవచ్చు.

తమిళ జాతీయవాదాన్ని గురించి మాట్లాడేటప్పుడు 'జాఫ్నా తమిళులు' అంటున్నామని గమనించే ఉంటారు. జాఫ్నా పట్టణం శ్రీలంక ఈశాన్య భాగాన ఉన్న తమిళ ప్రాంతంలోని ప్రధాన నగరం. శ్రీలంకలో తమిళం మాట్లాడే జనాభా 25 శాతం ఉన్నారు గానీ వారంతా చారిత్రకంగా, సాంస్కృతికంగా ఒకటి కాదు. రాజకీయంగానూ ఒకటి కాదు. తొలి నుండి శ్రీలంక వాసులే అయిన తమిళులు ఈశాన్య ప్రాంత వాసులు. బ్రిటన్‌కు ఆ దేశం వలసగా ఉన్న రోజులలో ఇండియా నుండి ముఠా కూలీలుగా శ్రీలంక మధ్య ప్రాంతంలోని తోటలలో పనిచేయడానికి వలస వెళ్ళిన 'ఇండియన్ తమిళులు' వేరే ఉన్నారు. మూడవ తమిళ వర్గం తూర్పు తీరాన ఉన్న తమిళం మాట్లాడే ముస్లింలు.

ఈ మూడు రకాల తమిళులు కలిసి దేశ జనాభాలో 25 శాతం ఉన్నారు గానీ వేర్పాటువాద తమిళ జాతీయ ఆకాంక్ష ప్రధానంగా ఉన్నది ఈశాన్య ప్రాంతంలోని 'జాఫ్నా తమిళుల'లో మాత్రమే.

తమిళ ప్రజలను, తమిళ భాషను రెండవ శ్రేణికి చెందినవిగా చూస్తున్నారనేది సింహళ జాతిపైన, శ్రీలంక రాజ్యంపైన తమిళుల అభియోగం. రెండు జాతులకూ భాషా భేదమే కాక మత భేదం కూడ ఉండడం సమస్యను పెంచింది. తమిళులు అత్యధిక భాగం హిందువులు కాగా సింహళులు బౌద్ధులు. ఇద్దరిలోనూ కొందరు క్రైస్తవులున్నారు గానీ తమిళులలో బౌద్ధులు గానీ సింహళులలో హిందువులు గానీ లేరు. శ్రీలంక రాజ్యాంగం – చట్టం ముందు అందరూ సమానమేనన్న హామీ ఇస్తుంది. మతం, జాతి, భాష వగైరాల ప్రాతిపదికన వివక్ష పాటించడానికి వీలులేదంటుంది. అయితే బౌద్ధమతానికి శ్రీలంకలో 'ప్రప్రథమ స్థానం' ఉంటుందనీ, ఆ మతాన్ని రక్షించే బాధ్యత, పెంపొందించే బాధ్యత శ్రీలంక రాజ్యాంగం మీదే ఉన్నాయనీ అంటుంది. ఇది సహజంగానే మైనారిటీ మతస్తులకు కంటగింపయింది.

సింహళ భాష శ్రీలంక అధికార భాష. దానితోబాటు 25 శాతం ప్రజలు మాట్లాడే తమిళానికి కూడ అధికార భాషగా గుర్తింపు ఇవ్వాలన్న డిమాండును శ్రీలంక రాజ్యం 1988 దాకా ఒప్పుకోలేదు. ఒప్పుకున్న తరువాత కూడ పరిస్థితి పెద్దగా మారలేదు. శ్రీలంక ప్రభుత్వం తమిళ పౌరులతో సహా అందరితోనూ సింహళ భాషలోనే సంభాషిస్తుంది. కోర్టులలో సింహళ భాషలో పిటిషన్లు వేసుకోవచ్చును గానీ తమిళంలో వేసుకోవడానికి వీలు లేదు. ఉద్యోగ రంగంలో అప్రకటితమైన వివక్ష ఉంది. భద్రతాదళాలయితే నూటికి నూరు శాతం సింహళులతో నిండి ఉన్నాయి. ఈ పరిస్థితి తమిళ మైనారిటీలలో అభద్రత, నిరసన పెంచాయంటే ఆశ్చర్యపోనక్కరలేదు.

అయితే దీనికొక పూర్వరంగం లేకపోలేదు. శ్రీలంక బ్రిటన్‌కు వలసగా ఉన్న రోజులలో తమిళులు వలస రాజ్యానికి కొంత సన్నిహితంగా ఉండి ఉద్యోగ అవకాశాలు, ఇతర ప్రయోజనాలు పొందారు. 'బ్రిటిష్ వలసవాదం అన్నిచోట్లా చేసినట్టే మైనారిటీలను చేరదీసి ప్రయోజనాలు కల్పించింది' అని దీన్ని వ్యాఖ్యానించడం కద్దు. అయితే బ్రిటిష్ వాళ్ళు వెళ్ళిపోతే స్థానిక మెజారిటీ పాలనలో తాము నలిగిపోతామని అన్ని వలస దేశాలలోనూ మైనారిటీలు భయపడిన సంగతి కూడ వాస్తవమే. ఆ భయం అహేతుకం కాదని వలసానంతర చరిత్ర రుజువు చేస్తున్నది. ఆ భయాన్ని బ్రిటిష్ వలస పాలకులు తమకు అనుకూలంగా మలచుకున్నారనుకోవాలా లేక తమ పౌరులలో ఒక భాగమైన ఆ ప్రజల భయాందోళనలకు సానుభూతిగా స్పందించడం మాత్రమే తాము చేసామన్న బ్రిటిష్ పాలకుల వాదనను ఆమోదిస్తామా అనేది ఒక విషయం కాగా, మైనారిటీలు భయపడవలసిన అగత్యం లేదని మెజారిటీగా ఉన్నవారు భరోసా ఎందుకు ఇవ్వలేకపోయారనేది అంతకంటే ముఖ్యమైన విషయం. 'విభజించి పాలించే' వలస నీతిని తిట్టుకోవడం ఈ ఆత్మపరీక్షను తప్పించుకోవడానికి మాత్రమే పనికొచ్చిందేమో ఆలోచించాలి.

ఏమయితేనేం, వలస కాలంలో పాలకుల పంచన చేరి ప్రయోజనాలు పొందారన్న కక్షతో వలసానంతర పాలనలో తమిళులకు సింహళులు సమాన హక్కులు లేకుండ చేసి, ఏ భయంతో వలస పాలకుల పంచన చేరవలసి వచ్చిందని మైనారిటీలు సమర్థించుకుంటాయో ఆ భయాన్నే నిజం చేసారు. తమిళుల డిమాండ్లకు ఏ మాత్రం లొంగకుండ ఉండడం సింహళ జాతీయవాదాన్ని నిర్వచించే సూత్రం అయింది. ఆ

దేశ పాలకులు కొంచెం ఉదార దృక్పథంతో ఒక్కడుగు వెనక్కి తగ్గినప్పుడల్లా సింహాళ జాతీయవాదం ప్రతిపక్షాల రూపంలోనూ, బౌద్ధ భిక్షువుల రూపంలోనూ అడ్డం పడింది. 1957లో అప్పటి ప్రధానమంత్రి బండార నాయకె (ప్రస్తుత అధ్యక్షురాలు కుమారతుంగ తండ్రి), 1965లో అప్పటి ప్రధానమంత్రి సేనానాయకె తమిళ ప్రతినిధులతో చేసుకున్న ఒడంబడికలకీ ఈ గతే పట్టింది.

తప్పుడు పనికి అందమైన పేరు పెట్టుకోగలిగితే ఇంక ఆపేవారు ఉండరు. తమిళులకు సమాన హక్కులు ఇవ్వడం భారత ఆధిపత్య వాదానికి తల ఒగ్గడం అనేది శ్రీలంక రాజకీయాలలో తరచుగా వినిపించే వాదన. అంటే స్థానిక తమిళులను అణచివేయడం భారత సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించడంలో భాగం. అందువల్ల ఎక్కడా లేనిది శ్రీలంకలో మాత్రమే వామపక్ష ఉద్యమమైన జెవిపి (జనతా విముక్తి పెరుమన) కూడ తమిళ మైనారిటీకి 'ఏ రాయితీలూ ఇవ్వడానికి వీలు లేదు' అని వాదిస్తుంది. 'మెజారిటీ ఏంది, మైనారిటీ ఏంది? పౌరులంతా ఒకటే' అంటుంది. మన దగ్గర బిజెపి మాత్రమే ఆ విధంగా వాదిస్తుంది. శ్రీలంకలో మానవతామూర్తి అయిన బుద్ధుడి అనుచరులూ, సమతా న్యాయాల సిద్ధాంతవేత్త అయిన మార్క్స్ అనుయాయులూ ఇద్దరూ అదే బాణిలో మాట్లాడతారు!

ఈ స్థితిలో తమిళ జాతీయవాదం మిలిటెంట్ రూపం తీసుకోవడం పెద్దగా ఆశ్చర్యం కలిగించే విషయం కాదు. దానిని శ్రీలంక సైన్యం అతి క్రూరంగా అణచివేసేకొద్దీ అది మరింత రాటుదేలింది. ఆ మిలిటెన్సీ మొత్తంగా ఎల్‌టిటిఇ గొడుగు కిందికి పోవడం ఆశ్చర్యం కాకపోయినా ఆందోళన కలిగించే విషయం. మిలిటెన్సీలో పెత్తందారీ పోకడలు, క్రూరత్వం, ఆయుధ బలం నుండి వచ్చే అహంభావం ఎప్పుడూ ఎంతో కొంత ఉంటాయి గానీ ఎల్‌టిటిఇ ఈ విషయంలో ప్రపంచంలోని అన్ని మిలిటెంట్ ఉద్యమాలనూ తలదన్నే ఉద్యమం. ఎల్‌టిటిఇ ప్రభావమున్న ప్రాంతాలలో వారి మాట కాదని సింహళులే కాదు, తమిళులు సహితం బతకలేరు. అన్ని తమిళ పోరాట సంస్థలనూ ఎల్‌టిటిఇ బలప్రయోగంతో తనకు లోబరచుకుంది. హక్కుల కోణం నుండి ఈ పెత్తందారీ ధోరణిని విమర్శించినందుకు జాఫ్నా విశ్వవిద్యాలయ అధ్యాపకురాలు, మానవహక్కుల కార్యకర్త అయిన డా॥ రజని తిరనగమను హతమార్చింది. శ్రీలంక ముస్లింలు తమిళులే అయినప్పటికీ జాఫ్నా తమిళుల

జాతీయవాదాన్ని పంచుకోని పాపానికి శ్రీలంక ఉత్తర భాగంలో వారి మనుగడను ఎల్‌టిటిఇ కష్టతరం చేసింది. ఫలితంగా 70 వేలమంది ముస్లింలు తూర్పుకు వలసపోయారు. 'ఈలం అంటూ వస్తే ఎల్‌టిటిఇ నుండి విముక్తి పొందడానికి తమిళు లు ఇంకా పెద్ద పోరాటం చేయవలసి ఉంటుంది' అని ఒక (మద్రాసు) తమిళ రచయిత అన్న మాటలు జోక్ కాదు.

సినిమాలలోనూ విప్లవ సాహిత్యంలోనూ తప్ప స్వచ్ఛమైన హీరోలు, స్వచ్ఛమైన విలన్లు ఎక్కడా ఉండరు. శ్రీలంకలోనూ అంతే. అంతమాత్రం చేత న్యాయాన్యాయాల విలువలు కల్తీ అయిపోవు. తమిళులకు ఆత్మగౌరవంతో సమాన పౌరులుగా బతికే హక్కుంది. దానిని ఒకరు కాదనడమూ అన్యాయమే. ఆ హక్కుకు తామే ఏకైక ప్రతినిధులమని మరొకరు అనడమూ అన్యాయమే.

*రాసిన సంవత్సరం 2000*

*అచ్చయిన తేదీ, పత్రిక తెలియవు*

# మనం చేయవలసింది ఏమీ లేదా?

**ఒ**క్కొక్క విషయంలో ఎవరూ ప్రశ్నించని పరమ సత్యాలు కొన్ని ఉంటాయి. హైందవ సంప్రదాయం నుండి ఇంగ్లీష్ నుడికారంలోకి ప్రవేశించిన 'పవిత్రమైన గోవు' (హోలీ కౌ) అనే మాట దీనిని బాగా సూచిస్తుంది. ఒక్కొక్క విషయంలో కొన్ని పవిత్రమైన గోవులుంటాయి. వాటి పవిత్రతను నిజంగానే అందరూ గౌరవిస్తారని కాదు. అది వారి వారి ప్రయోజనాలను బట్టి ఉంటుంది. కానీ గౌరవిస్తామనీ, అది అనుల్లంఘనీయమనీ అందరూ ఎల్లవేళలా ప్రకటిస్తుంటారు. అందులోనే ఆ గోవుల పవిత్రత ఉంది.

ఒక దేశం పొరుగు దేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోకూడదనేది, పొరుగు దేశాల సమగ్రతనూ సార్వభౌమత్వాన్నీ గౌరవించాలనేది అంతర్జాతీయ రాజకీయాలలోని 'పవిత్రమైన గోవు'లలో ఒకటి. నిజానికి అన్ని దేశాలూ వీలయిన కాడికి పొరుగు దేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకుంటూనే ఉంటాయి. పొరుగు దేశాల సార్వభౌమత్వాన్ని బలహీనపరుస్తూనే ఉంటాయి. కానీ పైకి మాత్రం ఈ గోవు పవిత్రతను ఎవ్వరూ కాదనరు. అంతర్జాతీయ రాజకీయాల మర్యాదలకు తాము అతీతులమని పెడసరంగా పోయే దేశాలు సహితం (అమెరికా వీటిని 'రోగ్' దేశాలు అంటుంది) ఈ ఒక్క మర్యాదకు మాత్రం కట్టుబడి ఉన్నామనే అంటాయి.

కశ్మీర్‌లో చాలా బహిరంగంగానే మిలిటెంట్లకు సాయుధ శిక్షణ, ఆయుధ సహాయం అందిస్తున్న పాకిస్తాన్ సైతం ఈ సూత్రానికి భిన్నంగా వ్యవహరిస్తున్నట్టు ఒప్పుకోదు. కశ్మీరీలు న్యాయమైన పోరాటం చేస్తుంటే పాకిస్తానీలు కొందరు వ్యక్తిగత స్థాయిలో సహాయం చేస్తుండవచ్చు, వాళ్ళు మాకు దొరికిన రోజున తప్పకుండా పట్టుకుంటాం, చట్టం ప్రకారం శిక్షిస్తాం, అంతేగానీ భారత్ అంతర్గత వ్యవహారాలలో మేమెక్కడ జోక్యం చేసుకున్నాం? అంటుంది.

మన ప్రభుత్వం పాకిస్తాన్‌లో అల్లర్లు రెచ్చగొడుతున్నదంటే బహుశా మన దేశంలో చాలామంది నమ్మరు. ప్రపంచ రాజకీయాలలో తమ దేశమొక్కటే నీతిగా నడుచుకుంటుందని నమ్మడం దేశభక్తిని నిర్వచించే లక్షణాలలో ఒకటి. కానీ మనం గనక పాకిస్తాన్ దినపత్రికలు చదివితే మన పాలకులు పాకిస్తానీ గూఢచారి సంస్థ అయిన ఐఎస్ఐ గురించి ఎంత గొడవ చేస్తున్నారో పాకిస్తానీ పాలకులు మన దేశ గూఢచారి సంస్థ అయిన 'రా' గురించి అంతే గొడవ చేస్తున్నారని అర్థం అవుతుంది. పాకిస్తాన్‌లో ఎక్కడ అల్లర్లు జరిగినా ఇందులో 'రా' హస్తముంది అని ఆ దేశంలో అంటుంటారు. పాకిస్తాన్ ప్రభుత్వం అనడమే కాదు, మానవ హక్కుల విషయంలో పాకిస్తాన్ ప్రభుత్వాన్ని చాలా ధైర్యంగా నిలదీసే అస్మా జహంగీర్ వంటి పాకిస్తానీ మానవ హక్కుల నాయకులు సైతం కొన్ని సందర్భాలలో ఈ 'రా' హస్తం సిద్ధాంతాన్ని సమర్థించారు. పాకిస్తాన్‌లో పనిచేసే ప్రముఖ భారత దినపత్రికల విలేఖరులు (వీరు భారతీయులే) కూడ 'రా' పాత్ర ఈ విషయాలలో లేదనలేం అని (వాళ్ళు ఫైల్ చేసే రిపోర్టులలో రాయకున్నా) ప్రైవేట్‌గా ఒప్పుకుంటారు.

శ్రీలంకలోనయినా అంతే. ఎల్‌టిటిఇ ఎదురుదాడిని ఎదుర్కొనడానికి భారత్ సైనిక సహాయం తమకు కావాలని శ్రీలంక ప్రభుత్వం సూచించగా అది మీ అంతర్గత వ్యవహారం, మేము జోక్యం చేసుకోము అని మన ప్రభుత్వం అంది గానీ శ్రీలంక 'తమిళ సమస్య'లో మన వాళ్ళు జోక్యం చేసుకోని రోజు లేదు. ఇప్పుడు కూడ భారత్ జోక్యం అసలే లేదనుకోవడం పెద్ద పొరపాటు అవుతుంది. శ్రీలంక తమిళులకు మన తమిళనాడులోని తమిళ ప్రజలతో సన్నిహిత సంబంధాలున్నాయి. శ్రీలంక తమిళ శరణార్థులు పెద్ద సంఖ్యలోనే తమిళనాడులో ఉన్నారు. వారిపైన ప్రభుత్వ పర్యవేక్షణ బహిరంగంగానే ఉంది. ఈ సంబంధాల ద్వారా భారత ప్రభుత్వం శ్రీలంక 'తమిళ సమస్య'లో ప్రత్యక్షంగా పరోక్షంగా జోక్యం చేసుకుంటూనే ఉంది.

1987కు పూర్వం ఈ జోక్యం చాలా బహిరంగంగా ఉండేది. శ్రీలంక తమిళ పోరాటకారులకు మన తమిళనాడు ఒక ముఖ్య స్థావరంగా ఉంటూ వచ్చింది. రాజకీయ ప్రచారానికి, గాయపడిన వారికి వైద్యం చేయించడానికి, రహస్య సంస్థల నాయకుల 'షెల్టర్'కు కేంద్రంగా ఉండేది. భారత సైనిక బలగాలు ఇక్కడే శ్రీలంక తమిళ మిలిటెంట్లకు సైనిక శిక్షణ కూడ ఇచ్చాయి. దాదాపు 35 క్యాంపులు పెట్టి శిక్షణ

ఇచ్చాయి. తమిళనాడులోని రాజకీయ పార్టీలయితే శ్రీలంక తమిళ పోరాటాన్ని పొగడడం, ప్రచారం చేయడం ఒక జాతర స్థాయిలో చేశాయి. అప్పటి వరకు సాయుధ పోరాటకారులెవ్వరినీ చూసి ఎరుగని తమిళ ప్రజలకు మద్రాసు వంటి నగరాలలో సహితం భుజానికి ఆటోమేటిక్ తుపాకి వేసుకొని తిరుగుతున్న మిలిటెంట్లను చూడడం మామూలు విషయమయింది.

అయితే ఆనాడు సైతం 'శ్రీలంక అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోము' అనే సూత్రాన్ని మన పాలకులు తిరస్కరించలేదు. ఆ గోవు పవిత్రతను కాదనలేదు. తమిళ శరణార్థులకు మాత్రమే ఇక్కడ రక్షణ కల్పించామనీ, అది మానవతా సహాయమనీ, మహోన్నతమయిన మన సంస్కృతీ నాగరికతలకు అటువంటి సహాయం కొత్త సంగతి కాదనీ చెప్పాము. ఒకవేళ ఆ శరణార్థులలో ఎవరైనా తుపాకులు ధరించి తిరుగుతున్న సంగతి సత్యమైతే వారిపైన చట్ట ప్రకారం చర్య తీసుకుంటామని శ్రీలంక ప్రభుత్వానికి మన వాళ్ళు హామీ కూడ ఇచ్చారు. పాకిస్తాన్ కశ్మీర్ విషయంలో ఇదే నటన ప్రదర్శిస్తే మాత్రం మనకు అందులో అంతులేని కపటం కనిపిస్తుంది.

అయితే ఇక్కడ శాఖలు నెలకొల్పిన ఎల్‌టిటిఇ, ఇపిఆర్‌ఎల్‌ఎఫ్, 'ప్లాట్' (PLOTE) వంటి శ్రీలంక తమిళ మిలిటెంట్ గ్రూపులు తమ అంతర్గత కొట్లాటలకు ఇక్కడి శరణార్థుల క్యాంపులను, పట్టణాలను వేదిక చేసుకునేసరికి మన ప్రభుత్వానికీ పోలీసులకూ ఇబ్బంది అనిపించింది. శ్రీలంక తమిళుల జాతీయ ఆకాంక్ష పట్ల ఎనలేని ఆదరణ ఉన్న సామాన్య ప్రజలకు సైతం ఈ కొట్లాటలు ఏవగింపు కలిగించాయి.

1987 తరువాత భారత ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకొని రివర్స్ జోక్యం మొదలుపెట్టింది. శ్రీలంక ప్రభుత్వంతో తమిళ పోరాటకారులు ఏ రకమైన ఒప్పందం చేసుకోవాలో తాను నిర్ణయించి, మద్రాసులో తలదాచుకుని ఉన్న ఎల్‌టిటిఇ నాయకుడి చేత బలవంతంగా ఒప్పించి, దానిని అమలు చేయడానికి భారత సైన్యాన్ని 'శాంతిసేన' పేరిట శ్రీలంకకు పంపించింది. యుద్ధానికి శాంతి అని పేరు పెట్టడం కూడ మన మహోన్నతమైన సంస్కృతీ నాగరికతల లక్షణమని రాజీవ్‌గాంధీ భావించారేమో తెలీదు గానీ భారత శాంతిసేన శ్రీలంకలో యుద్ధమే చేసింది. ఎల్‌టిటిఇ పైన కూడ కాదు, వారి సామాజిక పునాది అయిన శ్రీలంక తమిళులపైన. భారత సైన్యం ఆ ప్రజలపైన పాల్పడిన అత్యాచారాల కథలు ఇక్కడ ఇంకా ప్రచారం కాలేదు

గానీ ఆక్రమణ సేనలు ఏ దేశంలో పాల్పడిన అత్యాచారాలకూ అవి తీసిపోవు. అదే చివరికి రాజీవ్‌గాంధీ చావుకొచ్చిందనేది తెలిసిన సంగతే. భారత సుప్రీంకోర్టే ఈ మాట అనింది. భారత సైన్యం నిర్వహించిన ఈ పాత్ర వల్లనే ఎల్‌టిటిఇ నాయకత్వం వహిస్తున్న తమిళ 'ఈలం' పోరాటం బాగా దెబ్బతిందన్న సంగతి ఎల్‌టిటిఇ గానీ శ్రీలంక తమిళ ప్రజలు గానీ మరచిపోలేదు. ఇతర పోరాట సంస్థలన్నిటినీ ఎల్‌టిటిఇయే మట్టుబెట్టింది కాబట్టి వారి నాయకత్వంలో నడుస్తున్న పోరాటం తప్ప వేరే ఏదీ నామమాత్రంగా తప్ప మిగలలేదు.

ఆ తరువాత ఎల్‌టిటిఇ, శ్రీలంక సైన్యం నువ్వా నేనా అన్నట్టు పోటీపడుతున్నాయి. 'ఆత్మాహుతి బృందాల' దాడుల ద్వారా ఎల్‌టిటిఇ శ్రీలంక రాజధానిలో సైతం పెద్దఎత్తున విధ్వంసానికీ హత్యాకాండకూ పాల్పడింది. అయితే మొన్న ఎలిఫెంట్ పాస్‌ను శ్రీలంక సైన్యం నుండి ఎల్‌టిటిఇ చేజిక్కించుకునే దాకా శ్రీలంక సైన్యానిదే ఈ పోరులో పైచేయిగా ఉంది. ఇప్పుడు పరిస్థితి మళ్ళీ తారుమారయింది.

సైనిక సహాయం కావాలన్న శ్రీలంక ప్రభుత్వ అభ్యర్థనను మన వాళ్ళు తిరస్కరించడంలో సూత్రబద్ధమైన అభ్యంతరమేదీ లేదనేది స్పష్టమే. కశ్మీర్‌లో పాకిస్తాన్ జోక్యం గురించి దొరికిన ప్రతి వేదికలోనూ ప్రతి సందర్భంలోనూ అల్లరి చేసి ప్రపంచ అభిప్రాయాన్ని మనవైపు తిప్పుకోగలుగుతున్నామని మన పాలకులు ఇప్పుడిప్పుడే తమను తాము అభినందించుకుంటున్నారు. సరిగ్గా ఈ సమయంలో ఇది జరిగింది కాబట్టి మీ అంతర్గత వ్యవహారాలలో మేమెట్లా జోక్యం చేసుకుంటాం అని మనవాళ్ళు నీతి మాట్లాడుతున్నారు గానీ కార్గిల్ యుద్ధం జరగకపోయి ఉంటే మనవాళ్ళ జవాబు ఏమయి ఉండేదో.

కారణమేదయితేనేం శాంతి పేరిట యుద్ధం చేయడానికి భారత సైన్యాన్ని ఇంకొకసారి శ్రీలంకకు పంపించకూడదన్న నిర్ణయం సరయినదే. ఆ దేశంలోని తమిళ–సింహళ జాతి సమస్య చాలా సున్నితమైనది. బ్రిటిష్ పాలన కాలంలో మైనారిటీగా ఉన్న తమిళులు వలస పాలకులకు సన్నిహితంగా మెలిగి వలస ప్రభుత్వంలో పదవులు, ఉద్యోగాలు తమ జనాభా దామాషా కంటే ఎక్కువే పొందారు. ఈ కోపం కడుపులో పెట్టుకున్న మెజారిటీ సింహళ జాతీయులు స్వాతంత్ర్యం తరువాత తమిళులకు సమాన హక్కులివ్వడానికి ఒక పద్ధతి ప్రకారం నిరాకరించారు. 'తమిళ ద్వేషం' సింహళ

రాజకీయాలలో ఒక ముఖ్య అంశం అయింది. భాషాభేదమే కాక తమిళులు హిందువులు, సింహళులు బౌద్ధులు కావడం వల్ల మతం తేడా కూడ ఈ విద్వేషంలో భాగమయింది. ఇక్కడి బౌద్ధం దయామయుడు, శాంతిప్రియుడు అయిన గౌతముడి బౌద్ధం కాదు. ఇక్కడ అది అధికార మతం. శ్రీలంక రాజకీయ నాయకులు తమిళ ద్వేషాన్ని విడిచిపెట్టి ఉదార భావాలను అలవరచుకోకుండా గట్టిగా కాపలా కాస్తున్నది బౌద్ధ భిక్షువులే. సింహళ జాతీయులందరిలోకీ మిలిటెంట్లు వీరే. బౌద్ధం అహింస బోధిస్తుంది కదా, తమిళులపైన శ్రీలంక సైన్యం పాల్పడుతున్న హింసను మీరెట్లా సమర్థిస్తున్నారు అని ఒక భిక్షు ప్రముఖుడిని ఒక మానవ హక్కుల కార్యకర్త ప్రశ్నించగా బౌద్ధం బోధించే అహింస బౌద్ధుల విషయంలో మాత్రమే వర్తిస్తుందని ఆ మహానుభావుడు జవాబిచ్చాడు. పాపం గౌతముడు!

'జబ్ తక్ సూరజ్ చాంద్ రహేగా' అని మన దేశభక్తులు కశ్మీర్ గురించి అంటున్నట్టు సూర్యచంద్రులున్నంత వరకు తమిళ ఈలం సాధ్యం కానివ్వమని శ్రీలంక పాలకులు మొండిగా ఉన్నారు. శ్రీలంక సైన్యం తమిళ ప్రాంతాలలో అతి క్రూరమైన అణచివేతకు పాల్పడుతున్నది. అటువైపు ఎల్‌టిటిఇ నాయకులు తమిళ ప్రజలంతా చచ్చిపోయినా ఫరవాలేదు, తమిళ భూభాగం కావలసిందేనని అంతే మొండిగా ఉన్నారు. వేర్పాటుకు తక్కువగా ఏమైనా ఇవ్వడానికి సిద్ధమేనని చంద్రిక (నిస్పృహ వల్లనే కానివ్వండి) అంటున్నా స్పందించడం లేదు. జాతి పేరిట నడిచే పోరాటాలలోనూ, జాతిని ప్రాతిపదిక చేసుకున్న దేశభక్తిలోనూ మనుషుల కంటే భూభాగమే ఎప్పుడూ ముఖ్యమన్న సత్యానికిది మరొక నిదర్శనం.

శ్రీలంకలోని తమిళ ప్రాంతాలలో ఎల్‌టిటిఇకి సపోర్టు చాలానే ఉన్నప్పటికీ ఆ సంస్థే వారి ఏకైక ప్రతినిధి అనడానికి ఆధారాలేమీ లేవు. వేరే ఎవ్వరినీ గొంతెత్తనివ్వకుండా చేసి ఆ స్థానాన్ని ఎల్‌టిటిఇ సంపాదించుకుంది. ఇప్పుడు ఎల్‌టిటిఇ ఒప్పుకోని పరిష్కారం ఏదీ అమలు కాదనేది శ్రీలంక తమిళుల ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేని వాస్తవం.

ఈ పరిస్థితికి అన్ని రకాలుగా బలి అవుతున్నది శ్రీలంక తమిళులేనని వేరే చెప్పనవసరం లేదు. హింస, రక్తపాతం తప్ప వేరే జీవితం తెలియని తరం ఒకటి

తయారయింది. మన పాలకులు సైనిక జోక్యంగానీ, రాజకీయ జోక్యంగానీ చేసుకోనక్కర లేదు గానీ భారత ప్రజలుగా మనం ఈ స్థితి నుండి ఆ ప్రజలను బయటపడేయడానికి కృషి చేయగలిగితే బాగుండును. దురదృష్టమేమిటంటే పొరుగు దేశాల విషయంలో మన ప్రభుత్వాన్ని, ప్రభుత్వ విధానాన్నీ గుడ్డిగా అనుసరించడమే తప్ప అక్కడి ప్రజలతోనూ వారి సమస్యలతోనూ ప్రత్యక్ష సంబంధం పెట్టుకోవడం ఈ యాభై ఏళ్ళలో మనం నేర్చుకోలేదు.

*ఆంధ్రప్రభ దినపత్రిక*

*11 మే 2000*

# శ్రీలంకలో చీకటి రాజ్యం

**ఎల్**టిటిఇ పట్ల సర్వత్రా ఉన్న వ్యతిరేకత కారణంగా శ్రీలంక ప్రభుత్వం నిర్వాకం చర్చకు రాకుండాపోతున్నది. ఇతర సందర్భాలలో యుద్ధరంగం నుంచి రెండు వైపులా వార్తలు కొంతమేరకయినా బయటికొస్తాయి గాని శ్రీలంకలో కొన్ని నెలలుగా ఆ దేశ ప్రభుత్వం నడుపుతున్న 'తుదిపోరు' గురించిన వార్తలు పూర్తిగా ఏకపక్షంగా వస్తున్నాయి. జనవరి 2వ తేదీన శ్రీలంక సైన్యం కిలినోచ్చిని ఆక్రమించుకుందని విన్నాం. జనవరి 9వ తేదీన ఎలిఫెంట్ పాస్‌ను ఛేదించి ములైత్తివు వైపు పయనమయిందని విన్నాం. జనవరి 25వ తేదీన ములైత్తివు సహితం శ్రీలంక సైన్యం హస్తగతమయిందని విన్నాం. ఈ ఊర్లన్నిటినీ తాము 'విముక్తం' చేసినట్టు శ్రీలంక ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఎక్కడా ప్రజలు సైన్యం రాకను ఆహ్వానించినట్టుగానీ విముక్తి పొందినందుకు హర్షం వ్యక్తం చేసినట్టుగానీ వినలేదు. ఆహ్వానించడం, హర్షించడం అటుంచి, శ్రీలంక సైన్యం ప్రవేశించేటప్పటికే ఊర్లు పూర్తిగా ఖాళీ అయిపోయాయని వారే చెప్పగా విన్నాం.

మరి ప్రజలంతా ఏమయ్యారు? వెనక్కి నెట్టబడ్డ ఎల్‌టిటిఇతో పాటు తామూ వెనక్కి వెళ్ళిపోయారు. సైన్యం పురోగమించే కొద్దీ తమిళ ప్రజలు వెనక్కి వెనక్కి – పిల్లా పాపలు, ముసలివాళ్ళు, రోగిష్టులతో సహా – వెళ్ళిపోతున్నారు. వాళ్ళను ఎల్‌టిటిఇ బలవంతంగా తన వద్ద ఉంచుకుందనీ, వాళ్ళను మానవ కవచంగా వాడుకుంటున్నదనీ శ్రీలంక ప్రభుత్వం ఆరోపించింది. ఎల్‌టిటిఇని విడిచిపెట్టి రావడానికి శ్రీలంక ప్రభుత్వం ఒకటికి రెండుసార్లు వారికి గడువులు కూడ విధించింది. ఆ తర్వాత ఎల్‌టిటిఇ పైన తుది దాడికి తమ సైన్యం సిద్ధంగా ఉందని, పౌరులు యుద్ధప్రాంతం నుంచి బయటకొచ్చేదాకా ఆగేది లేదని కూడ శ్రీలంక ప్రభుత్వం కిందటివారం ప్రకటించింది.

ఎల్‌టిటిఇపై శ్రీలంక ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలో నిజం ఉండవచ్చు. తాను తమిళుల స్వేచ్ఛ కోసం పోరాడుతున్న ఏకైక సంస్థ అనీ, తాను ఏం చేసినా తమిళులు భరించవలసిందేననీ ఎల్‌టిటిఇ మొదటి నుంచి అంటున్నది. ప్రతి కుటుంబం ఒక కొడుకును గానీ, కూతురిని గానీ పోరాటానికి ఇవ్వాలనేది ఎల్‌టిటిఇ చాలా కాలంగా తమిళులపైన అమలు చేస్తున్న ఆంక్ష. ఈ మధ్య రెండవ 'బలి'ని కూడ కోరుకుంటున్నదని వినికిడి. అంతర్జాతీయంగా హక్కుల సంస్థలు, ప్రవాస తమిళులు గగ్గోలు పెట్టేవరకు మైనారిటీ తీరని పిల్లలను వాళ్ళు తీసుకుపోతూ వచ్చారు. అంతేకాదు తనతో విభేదించేవారినెవ్వరినీ ఎల్‌టిటిఇ బతకనివ్వలేదు. ఆ దేశంలోనే కాదు, చెన్నైలోనూ హత్యలు చేసింది. కాబట్టి తాను రిట్రీట్ అయ్యేటప్పుడు తమిళ సమాజం తనతోబాటు రిట్రీట్ అయి తనకు కవచంగా ఉండాలని ఎల్‌టిటిఇ ఆదేశించి ఉంటే ఆశ్చర్యపోవలసిందేమీ లేదు.

అయితే ఇది ఒకవైపు సత్యం మాత్రమే. ఒకవేళ తమిళులెవరికయినా ఎల్‌టిటిఇని కాదని బయటికి వచ్చే అవకాశం ఉన్నా ఆ 'విముక్తి'ని వారు కోరుకునే పరిస్థితి లేదు. ఎందుకంటే 'విముక్తి' పొందిన తమిళులను శ్రీలంక ప్రభుత్వం స్వేచ్ఛగా బయటి సమాజంలో కలిసిపోనివ్వదు. వాళ్ళు దశాబ్దాలుగా ఎల్‌టిటిఇ పాలనలోని 'వన్ని' ప్రాంతంలో (శ్రీలంకలో తమిళులు అధికంగా నివసించే ఉత్తర ప్రాంతాన్ని 'వన్ని' అంటారు) నివసించారు కదా, ఎల్‌టిటిఇ అంటే ఇష్టం లేనట్టయితే ఎప్పుడో బయటకు వచ్చేసేవారే కదా! రాలేదంటే ఎల్‌టిటిఇ అభిమానులనే అర్థం కాబట్టి వారందరినీ శ్రీలంక ప్రభుత్వం క్యాంపులలో పెట్టి నిఘా వేసి ఉంచుతుంది. ఆ క్యాంపులలో పరిస్థితులు అధ్వాన్నంగా ఉంటాయనేది చిన్నమాట. అక్కడ బతుకుకే భరోసా లేదు. ఆ క్యాంపులలోకి సైన్యం అదుపులో ఉన్న ముసుగు వేసుకున్న ఇన్‌ఫార్మర్లను తీసుకొస్తారు. వారు ఎవరిని వేలుపెట్టి చూపిస్తారో వారిని సైన్యం తీసుకుపోతుంది. ఆ తరువాత ఆ వ్యక్తి ఏదైనా జైలులో కనిపిస్తే అదృష్టం అనుకోవాలి. తరచుగా వాళ్ళు మళ్ళీ కనబడరు. ముల్లైత్తివు పైన శ్రీలంక సైన్యం దాడికి దిగేనాటికి ఆ ఊరి 37 వేల జనాభాలో ఒక్కరూ మిగలకుండ ఎల్‌టిటిఇ గెరిల్లాలతో పాటు ఉత్తరానికి వెళ్ళిపోయారంటే ఎల్‌టిటిఇ పెట్టిన (లేక పెట్టి ఉండగల) ఆంక్షతోబాటు ఈ వాస్తవం కూడ ఒక కారణమే.

ఆఫ్ఘనిస్తాన్‌లోనూ, ఇరాక్‌లోనూ అత్యంత క్రూరమైన యుద్ధం నెరపిన అమెరికా సహితం చేయని ఒక పనిని శ్రీలంక ప్రభుత్వం చేసింది. అది యుద్ధ ప్రాంతంలో మీడియాను పూర్తిగా నిషేధించడం. 2006 నుంచి ఈ ఆంక్ష అమలులో ఉంది. అందువల్ల అక్కడి నుంచి వచ్చే వార్తలన్నీ అధికారిక వర్తమానాలే. ఇక మానవ హక్కుల కార్యకర్తలు గానీ, ప్రభుత్వానికి అనుకూలురు కాని పరిశీలకులు గానీ అక్కడ తిరగడానికి అనుమతి లేదని వేరే చెప్పనవసరం లేదు. అప్పుడప్పుడు కొన్ని విషయాలయినా బయటికొస్తున్నాయంటే దానికి మూలం 'వన్ని' ప్రాంతంలోని క్రైస్తవ ఫాదరీలు, పాస్టర్ల సాహసమే. వారు మత సంబంధమైన కార్యకలాపాల కోసం బయటికొచ్చినప్పుడు రహస్యంగా మీడియాకూ మానవ హక్కుల సంస్థలకూ చేరవేసే సమాచారమే ప్రభుత్వ ప్రచారాన్ని కొంతవరకైనా ప్రశ్నించడానికి అవకాశం కలిగిస్తున్నది.

ముల్లైత్తీవుకు ఉత్తరాన 10 కిలోమీటర్ల వెడల్పు, 25 కిలోమీటర్ల పొడవు ఉన్న అటవీ ప్రాంతంలో రెండున్నర నుంచి మూడు లక్షల మంది తమిళులు ఇవాళ ఇరుక్కొని ఉన్నారు. వాళ్ళు బయటికి రావడానికి శ్రీలంక ప్రభుత్వం పెట్టిన గడువు అయిపోయింది. 'తుది యుద్ధం' ఇవాళో రేపో మొదలుపెడతానని ఆ దేశ అధ్యక్షుడు మహింద రాజపక్షె అంటున్నాడు. వాళ్ళ జీవితాలకు అక్కడే ఉన్నా భరోసా లేదు. ఈరోజు వారు ఇరుపక్షాల మధ్య నలిగిపోతున్నారనడంలో తప్పులేదు గానీ స్వతంత్ర శ్రీలంకలో వారు తొలినాటి నుంచి అనుభవించిన వివక్ష, భౌతికహింస దీనికి మూలం అని గుర్తించకపోవడం చాలా పొరబాటవుతుంది. భిన్న మతాలు, సంస్కృతులకు అనాదిగా కాకున్నా శతాబ్దాలుగా నిలయం అయిన శ్రీలంకను 1948లో స్వాతంత్ర్యం పొందిన తదుపరి సింహళీయ బౌద్ధులకు చెందిన దేశంగా మలచడానికి రాజ్యాంగ పరంగానూ, వీధి గుండాయిజం రూపంలోనూ ఆ దేశానికి చెందిన మెజారిటీ వర్గం చేసిన ప్రయత్నం ఎల్‌టిటిఇ మొదలుపెట్టిన అంతర్యుద్ధం వెనక ఉంది. శ్రీలంకలో బౌద్ధులే కాక హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. హిందువులు, ముస్లింలు తమిళులు కాగా క్రైస్తవులు తమిళులలోనూ సింహళీయులలోనూ ఉన్నారు. కానీ వీరందరినీ రెండవ శ్రేణి పౌరులుగా బతకమని హెచ్చరించే సింహళీయ బౌద్ధుల జాత్యహంకారం 1948 నుంచే మొదలయింది. శ్రీలంక రాజ్యాంగంలోనే వివక్ష

ఉంది. ఆ దేశానికి అధ్యక్షునిగా సింహళీయ బౌద్ధులు తప్ప వేరే ఎవ్వరూ ఉండడానికి వీలు లేదు. ఆ దేశంలో మాట్లాడే రెండే భాషలు సింహళ, తమిళం కాగా తమిళుల నిరసన సాయుధ పోరాట రూపం తీసుకొని పీకల మీద కూర్చునేదాకా తమిళానికి రెండవ అధికార భాషగా గుర్తింపు ఇవ్వడానికి సహితం సింహళీయులు సిద్ధపడలేదు. ఇక భౌతిక దాడులు, జాతి ఘర్షణలు, అవమానాలయితే లెక్కే లేదు. ప్రధాన తమిళ ప్రాంతమయిన 'వన్ని'కి ముఖ్య పట్టణం జాఫ్నా కాగా, 'వన్ని'కి ముఖద్వారం వావున్నియా పట్టణం. కొలంబో నుంచి జాఫ్నాకు వెళ్ళే రైలెక్కిన తమిళులు రైలు వావున్నియా స్టేషన్ చేరిన తరువాతే స్థిమితంగా ఊపిరి పీల్చుకునేవారని అంటారు. ఇది నిన్న మొన్నటి పరిస్థితి కాదు, దాదాపు 1948 నుంచి ఉన్నది.

బౌద్ధాన్ని బుద్ధుని ప్రవచనాల నుంచి అర్థం చేసుకొనే వారికి శ్రీలంకలో ఈ జాత్యహంకారానికి ప్రధాన దన్నుగా నిలిచింది బౌద్ధమత అధిపతులేనని చెప్తే ఆశ్చర్యం కలగవచ్చు. ఆ దేశ పాలకులెప్పుడయినా మైనారిటీ పట్ల కొంచెం ఉదారంగా ఉండడానికి ప్రయత్నిస్తే చాలు బౌద్ధమత పెద్దల ఆగ్రహాన్ని ఎదుర్కోవలసి వస్తుంది. బుద్ధుడు చెప్పిన శాంతి, సహనం, స్నేహ భావాలకు ఇది వ్యతిరేకం కాదా అని బౌద్ధ భిక్షువులను ఒక పాశ్చాత్య పరిశీలకుడు ప్రశ్నించగా బుద్ధుడు చెప్పిన శాంతి, సహనం లాంటివి బౌద్ధుల పట్లనే తప్ప అన్యుల పట్ల ప్రదర్శించనక్కరలేదని వారు జవాబు చెప్పారుట! అధికార దాహానికి బలికాని సిద్ధాంతం ప్రపంచంలో లేదు కాబోలు.

కాగా, శ్రీలంక ప్రభుత్వం నెరపుతున్న 'తుదిపోరు'లో భారత పాత్రేమిటన్నది మనం వేసుకోవలసిన ప్రశ్న. తమిళ పౌరులకు హాని కలిగించవద్దని శ్రీలంక ప్రభుత్వానికి ప్రణబ్ ముఖర్జీ హితవు చెప్పి వచ్చినట్లు పత్రికలలో చదివాము. కాని ఈ 'తుదిపోరు' వెనుక భారత్ సహాయం, అండ ఉన్నాయని ఆ దేశానికి చెందిన ప్రజాతంత్రవాదులు అంటున్నారు. 'మాకు మహింద రాజపక్షె గురించి తెలుసు. ఎవరో ఒకరి అండ లేకుండ అతనింత బరువు మీద వేసుకోడు. అది అమెరికా అయినా కావాలి, భారత్ అయినా కావాలి. అమెరికా దృష్టి ఇప్పుడు శ్రీలంక మీద లేదు కాబట్టి ఇండియాయే అయివుండాలి' అంటున్నారు. ఇది నిజమైతే శ్రీలంక తమిళులు అనుభవిస్తున్న నరకానికి భారత పౌరులమైన మనమూ పరోక్షంగా బాధ్యులమే.

ఈ చీకటి కథలో ఒకే ఒక వెలుగు రేఖ ఏమిటంటే ఈ మేరకయినా వాస్తవాలు బయటకు వస్తున్నాయంటే అది శ్రీలంకకు చెందిన పాత్రికేయులు, మానవహక్కుల ఉద్యమకారుల వల్లనే. వారిలో అధికులు సింహళీయులే. అందులో బౌద్ధులున్నారు, క్రైస్తవులున్నారు, ఏ నమ్మకాలూ లేనివారున్నారు. వారి కృషి చాలా సాహసంతో కూడుకున్నదనడానికి రుజువు జనవరి 8వ తేదీన కొలంబోలో జరిగిన ప్రముఖ పాత్రికేయుడు లసంత విక్రమతుంగ హత్య. తనను శ్రీలంక ప్రభుత్వం ఏదో ఒకరోజు హతమారుస్తుందని తెలిసి ముందుగానే రాసిపెట్టిన ఆఖరి సంపాదకీయం బాగా ప్రచారమయింది. శ్రీలంకలో నెలకొన్న చీకటి రాజ్యాన్ని గురించి అందరూ మాట్లాడవలసిన ఆవశ్యకతను తెలిపింది.

*ఆంధ్రజ్యోతి దినపత్రిక*

*11 ఫిబ్రవరి 2009*

# మద్రాసు హైకోర్టు రగడ ముందూ వెనకా

**ఫి**బ్రవరి 19న మద్రాసు హైకోర్టులో జరిగిన రగడ ఒక రకంగా మనకు మేలు చేసింది. శ్రీలంకలోని పరిస్థితి గురించి మనకు ఉండవలసీ లేకుండాపోయిన ఆసక్తిని రగిల్చింది. నిజానికి శ్రీలంక పరిస్థితి గురించి అవగాహన లేకపోతే మద్రాసు హైకోర్టు గొడవ అర్థం కాదు. అది లేకనే, సుప్రీంకోర్టు విచారణ జరపమని నియమించిన జస్టిస్ బి.ఎన్. శ్రీకృష్ణ రెండే రెండు రోజులలో ఒక మధ్యంతర నివేదిక ఇచ్చేసి అందులో తప్పు ప్రధానంగా లాయర్లదే అనగలిగారు. ఆయన న్యాయబుద్ధిగలవాడు, పక్షపాత రహితుడు అంటూ ఆయన నియామకాన్ని స్వాగతించిన మద్రాసు న్యాయవాదులు కంగు తిన్నారు.

2006 తరువాత క్రమంగా తన దేశానికి చెందిన మీడియాను, మానవహక్కుల కార్యకర్తలను తమిళ ప్రాంతమైన వన్నికి పోనివ్వకుండ నిరోధించిన శ్రీలంక ప్రభుత్వం అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న హ్యూమన్ రైట్స్ వాచ్‌ను మాత్రం పోనివ్వక తప్పలేదు. వారిని కూడ పోనివ్వకపోతే అంతర్జాతీయంగా పరువు పోతుందని భయపడ్డారేమో తెలియదు. ఆ సంస్థ డిసెంబర్‌లో ఒకటి, ఫిబ్రవరిలో ఒకటి రెండు వివరమైన నివేదికలు విడుదల చేసింది. ఎల్‌టిటిఇతో ఉండిపోయి దేశ ఈశాన్య తీరంలో చిక్కుకుపోయిన రెండున్నర లేక మూడు లక్షల తమిళ ప్రజానీకానికి తిండి లేదు, నీళ్ళు లేవు, వైద్యం లేదు, ఆస్పత్రులలో సహితం భద్రత లేదు అనేది ఈ నివేదికల సారాంశం. కిలినొచ్చితో మొదలుపెట్టి ఎల్‌టిటిఇని వెనక్కి తరిమిన క్రమంలో శ్రీలంక సైన్యం నిరాయుధులైన పౌరులపైన గుండ్ల వర్షాలు అనేక పర్యాయాలు కురిపించిందని సోదాహరణగా ఈ నివేదికలు తెలుపుతాయి. ఫిబ్రవరి నెల మధ్య భాగం నాటికి 5150 మంది పౌరులు తీవ్రంగా గాయపడ్డారనీ, అందులో 1123 మంది చనిపోయారనీ తెలుపుతాయి. ప్రస్తుతం ఈ సంఖ్యలు 7000, 2000 కు చేరుకున్నాయని ఒక అంచనా.

ఆస్పత్రుల మీద గుండ్ల వర్షం కురిపించిన సంఘటనలను తేదీలతో సహా ఈ నివేదికలలో ఇచ్చారు. ముల్లైత్తివు జనరల్ ఆస్పత్రిపైన డిసెంబర్ 15, 19, 20 తారీఖులలో, వద్దకచ్చి ఆస్పత్రిపైన డిసెంబర్ 17 తారీఖునాడు, కిలినోచ్చి జనరల్ ఆస్పత్రిపైన డిసెంబర్ 22, 30 తేదీలలో, వల్లిపురం ఆస్పత్రిపైన ఈ సంవత్సరం జనవరి 18, 21, 22 తారీఖులలో, పుతుక్కుదియురిప్పు ఆస్పత్రిపైన అత్యధికంగా జనవరి 10, 13, 31, ఫిబ్రవరి 2, 3, 5, 10 తారీఖులలో మందుగుండ్లు కురిపించింది శ్రీలంక సైన్యం.

ఎల్‌టిటిఇ అదుపులో ఉన్న 'యుద్ధప్రాంతం' నుంచి తమిళులను బయటకు రమ్మని శ్రీలంక ప్రభుత్వం ఆహ్వానిస్తున్నది. కొన్ని సురక్షిత ప్రాంతాలను గుర్తించి అక్కడ ఎటువంటి ప్రాణాపాయమూ ఉండదని హామీ ఇస్తున్నది. కానీ అక్కడ కూడ ప్రజలకు సైన్యం దాడులు తప్పడం లేదు. ఉదాహరణకు ఎ 35 జాతీయ రహదారి పక్కన ఉన్న 35 చదరపు కిలోమీటర్ల వైశాల్యం గల ప్రాంతాన్ని జనవరి 21న శ్రీలంక సైన్యం సురక్షిత ప్రాంతంగా ప్రకటించి కరపత్రాలు అచ్చువేసి పంచగా చాలామంది తమిళులు అక్కడ చేరారు. అక్కడున్న ఒక స్కూలు ఆటస్థలంలో ఎక్కువ మంది గుమిగూడారు. అదే భోజన పొట్లాల సరఫరా కేంద్రం కూడ. జనవరి 22, 23, 24 తేదీలలో ఈ ఆటస్థలం మీద, దాని చుట్టుపక్కలా శ్రీలంక సైన్యం విచ్చలవిడిగా తూటాలు కురిపించగా 30 మంది పౌరులు చనిపోయారు. పక్కనే ఉన్న ఐక్యరాజ్య సమితి సిబ్బంది కార్యాలయం మీద 24, 25 తేదీలలో శ్రీలంక సైన్యం కురిపించిన గుండ్ల వర్షంలో మరొక 9 మంది చనిపోయారు.

మరోవైపు ఎల్‌టిటిఇ ప్రాంతం నుంచి తప్పించుకుపోవడానికి ప్రయత్నించే వారి పట్ల ఆ తమిళ పోరాటకారులు చాలా క్రూరంగా, నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించిన సంగతి కూడ హ్యూమన్ రైట్స్ వాచ్ నివేదిక దృష్టాంతాలతో సహా వివరించింది. ఫిబ్రవరి 9 నాడు సుదంతిరపురం వద్ద శ్రీలంక సైన్యం దాడి నుంచి తమను తాము కాపాడుకుంటూ వెనక్కిపోతున్న ఎల్‌టిటిఇ బలగాలు ఎప్పటిలాగే ప్రజలను కూడ తమతోబాటే వెనక్కు రమ్మని ఒత్తిడి పెట్టాయి. ఆ ఆదేశాన్ని తిరస్కరించి అక్కడే ఉండిపోవాలని చూసిన వారిపైన ఎల్‌టిటిఇ బలగాలు కాల్పులు జరిపి 17 మందిని చంపాయి. గతంలో కూడ వన్ని ప్రాంతాన్ని వదిలి బయటికి పోవాలంటే ఎల్‌టిటిఇ

అనుమతి తీసుకోవలసి ఉండింది. 2008 నుంచి ఆ అనుమతి పొందడం కష్టతరం అయింది. ఇప్పుడు అనుమతి ప్రసక్తి లేదు. నేరుగా కాల్చి చంపడమే జవాబు. ఫిబ్రవరి నెలలోనే ఒకరోజు యుద్ధ ప్రాంతానికీ, సురక్షిత ప్రాంతానికీ అంచున ఉన్న మురసముద్దై అనే చోట ఇరుపక్షాలూ కాల్పులు జరుపుకుంటుండగా ఇటువైపు నుంచి అటువైపు పారిపోవాలని చూసిన వారిపైన వెనుక నుంచి ఎల్‌టిటిఇ, ముందు నుంచి శ్రీలంక సైన్యం కాల్పులు జరిపాయి. ఎంతమంది చనిపోయిందీ తెలీదు.

పోనీ ధైర్యం చేసి ఎల్‌టిటిఇ ప్రాంతం నుంచి తప్పించుకున్న తమిళులు తర్వాతయినా సురక్షితంగా ఉంటారా అంటే అదేం లేదు. వారిని యుద్ధ ప్రాంతం సరిహద్దు నుంచి చివరి మజిలీ అయిన వావున్నియా పట్టణం చేరే లోపల అయిదుసార్లు సోదా చేస్తారు. అతి ముఖ్యమైన సోదా ఒమంతై చెక్‌పోస్ట్ దగ్గర జరుగుతుంది. అక్కడ 18-35 సంవత్సరాల మధ్య వయస్సున్న మగవాళ్ళను వేరుచేసి మిగిలిన వాళ్ళను వావున్నియా పంపిస్తారు. ఒమంతైలో నిలిపేసిన వారు మళ్ళీ కనిపించకపోవచ్చు. వావున్నియా చేరిన వారు కూడ ముళ్ళకంచెల మధ్య సైన్యం పహారాలోనే బతకాలి.

తమిళనాడు ప్రజల ఆగ్రహాన్ని ఈ నేపథ్యంలో చూడాలి. కోపగించుకునే వారంతా ఎల్‌టిటిఇ మద్దతుదారులు కారు. నిజానికి ఎల్‌టిటిఇ ఒక ఫాసిస్టు సంస్థ అనేదే అత్యధికుల అభిప్రాయం. ఈ తేడా తెలియని జస్టిస్ శ్రీకృష్ణ తొందరపడి తయారుచేసిన తన మధ్యంతర నివేదికలో ఆందోళన చేస్తున్న న్యాయవాదులందరినీ 'ఎల్‌టిటిఇ అనుకూలురు' అని మొదటి పేరాలోనే వర్ణించారు. అక్కడి నుంచే ఆ నివేదిక నిష్పాక్షికత కోల్పోయింది. తమిళనాడులో జనవరి నెలాఖరు నుంచీ శ్రీలంక తమిళుల పట్ల సానుభూతితో రకరకాల రూపాలలో ఆందోళన నడుస్తున్నది. దానిలో లాయర్లు ముఖ్యపాత్ర నిర్వహిస్తున్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ, నిన్న మొన్న పాకిస్తాన్‌లో జరిగిన ప్రజాస్వామ్య పునరుద్ధరణ పోరాటంలోనూ లాయర్లు ముఖ్యపాత్ర నిర్వహించడాన్ని అందరూ గొప్ప విషయంగా భావించేటప్పుడు ఈ సంఘీభావ ఉద్యమంలో లాయర్ల పాత్రను జస్టిస్ శ్రీకృష్ణ, 'ది హిందూ', 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' దినపత్రికల సంపాదకులూ ఈసడించుకోవడం ఎందుకు? ఈ లాయర్లు సామాజికంగా అట్టడుగు వర్గాలకు చెందిన యువ న్యాయవాదులు కావడమే అందుకు కారణం అన్న విమర్శకు జవాబుందా?

ఆందోళన చేస్తున్న లాయర్లకు ఫిబ్రవరి 17న హైకోర్టుకు వచ్చిన సుబ్రమణ్య స్వామి కనిపించాడు. వాళ్ళు నినాదాలిచ్చుకుంటూ అతను కూర్చున్న కోర్టులోకి పోయి అతని పైన కోడిగుడ్లు విసిరారు. కోడిగుడ్ల సంగతి అటుంచి కోర్టు హాల్‌లో నినాదాలివ్వడం నిస్సందేహంగా తప్పే. అయినా సుబ్రమణ్య స్వామి కోర్టులోనైనా బయటైనా కొట్టదగ్గ వ్యక్తి కాడు. భారత ప్రజా జీవితంలో ఏ అర్హతా లేకుండా కేవలం మీడియా ప్రాపకం పుణ్యాన ప్రజాజీవితంలో బతికి వున్న నికృష్ట జీవులెవరయినా ఉంటే వారిలో ఇతను ప్రథముడు. అయినా లాయర్లు నినాదాలిచ్చుకుంటూ వెళ్ళి అతనిపైన కోడిగుడ్లు విసరడం సెక్షన్ 147 ఐ.పి.సి కింద మాత్రమే నేరం. అది బెయిలబుల్ నేరం. వారిని అరెస్టు చేయడానికి పోలీసులు యుద్ధం చేయవలసిన అవసరమేం ఉండలేదు. అయితే వారి నేరాన్ని నాన్ బెయిలబుల్ చేయడానికి కాబోలు సుబ్రమణ్య స్వామిని వారు 'బ్రాహ్మణ శునకం' అని తిట్టారని చెప్పి సెక్షన్ 153-ఎ చేర్చారు. అతను ఎల్‌టిటిఇని ఉద్దేశించి 'ఇంటర్నేషనల్ పరయ్యా' అన్న తిట్టు వాడాడని 'ది హిందూ' సైతం రాసింది. తమిళం నుంచి ఇంగ్లీష్‌లోకి పోయిన పరయ్యా అన్న మాటకు ఇంగ్లీష్‌లో వెలివేయబడిన వారు అన్న అర్థం మాత్రమే ఉండవచ్చు. ఎల్‌టిటిఇని అంతర్జాతీయంగా అందరూ వెలివేశారన్న అర్థంలో తాను ఆ మాట ప్రయోగించానని సుబ్రమణ్య స్వామి సమర్థించుకోవచ్చు. కాని తమిళంలో పరయ్యా అనేది అంటరానితనాన్ని సూచించే మాట, ఒక తిట్టు కూడ. కాబట్టి అధికంగా దళితులయిన లాయర్లు అతనిపైన ఎస్.సి ఎస్.టి కేసు పెట్టాలనడంలో తప్పేముంది?

18వ తేదీన లాయర్ల నాయకుడు ఇమాన్యువెల్‌ను పోలీసులు అరెస్టు చేసినప్పుడు గొడవేమీ కాలేదు. 19వ తేదీన తక్కిన లాయర్లు హైకోర్టు ఆవరణలో ఉన్న పోలీస్ స్టేషన్‌లోకి పోయి సుబ్రమణ్య స్వామి పైన కేసుపెట్టి అరెస్టు చేస్తే తామూ అరెస్టవుతామనడంతో ఘర్షణ మొదలయింది. వాళ్ళను పోలీసులు బలవంతంగా వ్యాన్ ఎక్కించే ప్రయత్నం చేసేసరికి ఆందోళన చేస్తున్న లాయర్లు తిరగబడ్డారు. పోలీసుల పైన రాళ్ళు వేశారు. పోలీస్ స్టేషన్‌కు నిప్పుపెట్టారు. పోలీసులు హైకోర్టు గేట్లు వేసి ఎదురుదాడికి దిగారు. సాయంత్రం 5.15కు నగర పోలీస్ కమిషనర్ వచ్చాడు. ఆ తరువాతే లాఠీచార్జికి అధికారికంగా ఆదేశం లభించిందని జస్టిస్ శ్రీకృష్ణ సహితం ఒప్పుకుంటున్నారు. ఆ ఆదేశం లభించగానే పోలీసులు విపరీతమైన బీభత్సానికి

పాల్పడ్డారు. కోర్టు లోపల, కోర్టు కార్యాలయాల లోపల, లైబ్రరీలో, చుట్టుపక్కల వీధులలో ఉండే లాయర్ల ఆఫీసులలో, జెరాక్స్ షాపులలో, హోటళ్ళలో కనిపించిన ప్రతి లాయర్‌నూ కొట్టారు, కంప్యూటర్లను విరగ్గొట్టారు, కాగితాలు విసిరేశారు. భయపడిన జడ్జీలు చాలామంది టాయిలెట్లలోకి వెళ్ళి తలుపులు వేసుకున్నారంట. ఇరు పక్షాలను శాంతింపజేయడానికి వచ్చిన జడ్జి ఆర్ముగం పెరుమాళ్‌కు కూడ తల మీద లాఠీదెబ్బ తగిలింది. పోలీస్ కమిషనర్ సమక్షంలోనే ఇవన్నీ జరిగినా అతని తప్పేమీ లేదని జస్టిస్ శ్రీకృష్ణ తన మధ్యంతర నివేదికలో అనేశారు. వారి తుది నివేదిక ఇంకొంచమైనా నిష్పాక్షికంగా ఉండాలంటే తమిళులు ఎందుకు ఆందోళన చెందుతున్నారో అర్థం చేసుకోవలసి ఉంటుంది. చేసుకుంటాడని ఆశిద్దాం.

*ఆంధ్రజ్యోతి దినపత్రిక*

*11 మార్చి 2009*

# శ్రీలంక తమిళుల భవిష్యత్తేమిటి?

గడచిన ఆరు నెలలలో శ్రీలంకలో జరిగిన ఘటనలకు భారతదేశ పౌర సమాజం స్పందించలేదన్న ఫిర్యాదు బాధిత తమిళుల నుంచే కాదు, శ్రీలంకకు చెందిన మానవ హక్కుల ఉద్యమకారుల నుంచి కూడ వచ్చింది. మనం తప్పు ఒప్పుకోవలసిందే. అయితే రాబోయే దినాలలో ఈ స్పందన అవసరం ఇంకా ఎక్కువగా ఉండబోతుంది కాబట్టి తప్పొప్పుకోవడమే కాదు, సవరించుకునే అవకాశమూ ఉంది.

ఎల్‌టిటిఇని అణచివేయడం అయిపోయింది కాబట్టి ఇంక శ్రీలంక ప్రభుత్వం తమిళుల ఆకాంక్షలను తీర్చడానికి పూనుకుంటుందన్న అభిప్రాయం ఆ ప్రభుత్వమే కాక మీడియా కూడ మనకు కల్గిస్తున్నది. ఏ మాత్రం ఇంగితం ఉన్నా ఆ దేశ పాలకులు అందుకు పూనుకోవడం సహజం కాబట్టి మనం కూడ సులభంగా నమ్ముతున్నాం. అయితే ఇది అత్యంత సందేహాస్పదమైన విషయం. ఎందుకంటే శ్రీలంక భూభాగం బౌద్ధ సింహళీయులకే చెందుతుంది అన్నది ఆ దేశ అధికార రాజకీయాల భావజాలం. అదొక రాజకీయ వైపరీత్యం కాదు, అన్ని రాజకీయ పార్టీల సామాన్య దృక్పథం. ఎల్‌టిటిఇ యుద్ధ సామర్థ్యం కారణంగా 1987లో ఒకసారి, 1995లో ఒకసారి, 2002లో ఒకసారి శ్రీలంక ప్రభుత్వం అధికార వికేంద్రీకరణ ప్రతిపాదనలు చేయడానికి లేదా చర్చించడానికి సిద్ధపడిన మాట వాస్తవమే గానీ నిజంగా దానిని అమలుచేసి సమస్యను న్యాయబద్ధంగా పరిష్కరించుకునే ఉద్దేశ్యం వారికి ఉండిందా, లేక వేర్పాటుకు తప్ప వేరే పరిష్కారానికి ఎల్‌టిటిఇ ఒప్పుకోదు కాబట్టి నెపం ప్రభాకరన్ మొండితనంపై నెట్టేసే ఎత్తుగడగా ఆ ప్రతిపాదనలు చేశారా అంటే రెండవ సమాధానం వైపే వాస్తవికమయిన పరిశీలన మొగ్గు చూపవలసి ఉంటుంది.

ఇది ఆయా సందర్భాలలో ఆ ప్రతిపాదనలు చేసిన దేశాధ్యక్షుల నిజాయితీకి సంబంధించిన విషయం కాదు. పాలనా బాధ్యతలు చేపట్టిన వారు అప్పుడప్పుడు

కొంత సంయమనం పాటించక తప్పదు. అయితే తమిళులకు శ్రీలంక భూభాగంలో సమాన హక్కులు కల్పించే ఏ చర్యనయినా అమలు చేసే ప్రయత్నం చేసినట్టయితే దానికి శ్రీలంక సమాజంలో – ప్రత్యేకించి బౌద్ధమత పెద్దల నుంచి – రాగల జాత్యంహకార వ్యతిరేకతను ఎదుర్కొని నిలబెట్టే సంసిద్ధత ప్రధాన పార్టీలయిన ఎస్ఎల్ఎఫ్పిలో గానీ, యుఎన్పిలో గానీ ఉందని నమ్మడానికి దాఖలాలు లేవు. భారత రాజకీయాలలో గనక అన్ని పార్టీలూ విశ్వహిందూ పరిషత్ స్వాములకు భయపడి పరిపాలిస్తున్నట్టయితే మైనారిటీల మనుగడ గురించి వారు చేసే విధాన ప్రవచనాలు మనం ఏ మేరకు నమ్మగలుగుదుమో అన్న పోలిక చెప్పుకుంటే విషయం అర్థం కావచ్చు.

ప్రభాకరన్‌లో రాజకీయ చాతుర్యం లోపించడం శ్రీలంక తమిళులకు నష్టం చేసిందన్న అభిప్రాయం చాలామంది పరిశీలకులు వ్యక్తం చేశారు. రాజకీయ పరిష్కారం గురించి ఒత్తిడి వచ్చిన సందర్భంలో, నిజంగా న్యాయమైన రాజకీయ పరిష్కారాన్ని రూపొందించి అమలు చేసే సంసిద్ధత శ్రీలంక పాలకులలో లేదన్న విషయాన్ని బయటపెట్టే పద్ధతిలో స్పందించే బదులు, రాజకీయ పరిష్కారానికి ఎల్‌టిటిఇ సిద్ధం కాదని శ్రీలంక పాలకులు ప్రచారం చేయడానికి అనుకూలించే పద్ధతిలో వ్యవహరించాడు. అదే ఎక్కువగా ప్రచారం అయింది. శ్రీలంక ప్రభుత్వం నిజమైన వికేంద్రీకరణనూ స్వయం పాలననూ తమిళులకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రభాకరన్ యుద్ధతంత్రం ద్వారా తమిళుల విముక్తిని సాధించాలన్న మొండి పట్టుదలతో ఆ ప్రయత్నాలను తిరస్కరించాడన్న అభిప్రాయం విస్తృతంగా ప్రచారం అయింది. ప్రభాకరన్ మొండితనం నిజమే గానీ వీళ్ళ సంసిద్ధత అబద్ధం. ఇప్పుడు ఎల్‌టిటిఇ లేదు కాబట్టి అది పరీక్షకు నిలబడుతుంది. 1987లో అప్పటి భారత ప్రభుత్వం ఒత్తిడి మేరకు జరిగిన ఒప్పందాన్ని అమలు చేస్తామని అంటున్నారట! భారత పాలకులు కూడ దానినే పరిష్కారంగా సూచిస్తున్నట్టున్నారు. ఆనాడు ఆ ఒప్పందం ఫలితంగా శ్రీలంక రాజ్యాంగానికి 13వ సవరణ జరిగింది. అది జరిగి రెండు దశాబ్దాలు దాటింది. దానిని అమలు చేయకుండ శ్రీలంక పాలకులను తమిళులు ఆపలేదు. కానీ దానిని అమలు చేయలేదు. శ్రీలంక రాజ్యాంగం ఆ దేశ ప్రభుత్వానికి, ప్రత్యేకించి నేరుగా ఎన్నుకోబడే అధ్యక్షునికి ఇచ్చిన విస్తృత అధికారాలను సడలించకుండ 13వ రాజ్యాంగ సవరణ ద్వారా తమిళ ప్రాంతాలకు అధికార వికేంద్రీకరణ చేశారు కాబట్టి అదిచ్చే స్వయం ప్రతిపత్తి చాలా పాక్షికంగా ఉండబోతుంది. కానీ అదయినా చేస్తారా అంటే అనుమానమే.

శ్రీలంక సమాజంలో ప్రజాతంత్ర శక్తులేవయినా బలంగా ఉండి ఉంటే అటువైపు నుంచి తమిళులకు న్యాయం చేయమన్న ఒత్తిడి లేదా కనీసం జాత్యహంకారులకు లొంగకూడదన్న ఒత్తిడి ఉండేదేమో. కానీ ఆ సమాజంలో ప్రజాతంత్ర శక్తుల బలం చాలా పరిమితం. 1970–71 సంవత్సరాలలో పేదవర్గాల యువతను పునాది చేసుకున్న జనతా విముక్తి పెరుమన (జెవిపి) అనే కమ్యూనిస్టు భావాలు గల సంస్థ ఒక పెద్ద తిరుగుబాటు లేవదీసింది. దాన్ని శ్రీలంక ప్రభుత్వం చాలా క్రూరంగా అణచివేసింది. 10 వేలమంది దాకా చనిపోయారని అంచనా. 1980ల చివరి భాగంలో వారు మరొక్కసారి తిరుగుబాటు చేయగా అంతకు రెండు మూడు రెట్లు ఎక్కువ ప్రాణనష్టం జరిగింది. అయితే జెవిపి శ్రీలంక దక్షిణ ప్రాంతంలో ఒక బలమైన రాజకీయ శక్తిగా ఇవ్వాళ్టికీ ఉంది. ఒక పార్టీగా ఎన్నికల రాజకీయాలలో ఉంది. ఆ పార్టీ కమ్యూనిస్టు పార్టీగానే కొనసాగి వుంటే, లెనిన్ కాలం నుంచి జాతుల ఆకాంక్షలకు కమ్యూనిస్టు సిద్ధాంతంలో ఉన్న గుర్తింపు సింహళ ప్రజానీకం ఆలోచనా రీతులలో విస్తృతంగా భాగం అయి వుండేది. తమిళుల ఆకాంక్షల న్యాయమైన పరిష్కారానికి సింహళీయులలోనూ ఆ మేరకు మద్దతు దొరికేది. దురదృష్టవశాత్తు, జెవిపి ఇతర విషయాలలో కమ్యూనిస్టు పరిభాష నింకా విడిచిపెట్టలేదు గాని సింహళీయ జాత్యహంకారాన్ని ఒంటబట్టించుకుంది. శ్రీలంక రాజకీయాలలో మెజారిటీ దురహంకారానికి బౌద్ధ భిక్షువులతో పాటు జెవిపి అత్యంత మిలిటెంట్ ప్రతినిధిగా మారింది. ఇక చిన్నాచితకా వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజాతంత్ర భావాలుగల బుద్ధిజీవులు సింహళీయులలో లేకపోలేదు గానీ వారి ప్రభావం చాలా బలహీనమైనది. శ్రీలంకలో బుద్ధిజీవులు వివిధ విషయాల గురించి జరుపుకునే సంవాదాలలో లోతయిన సిద్ధాంత వివేచన ఉంటుందనీ, మన దేశంతో పోలిస్తే ఆ సమాజపు మేధో ప్రమాణాలు ఉన్నతమైనవనీ తెలిసినవారు అంటారు. అదే నిజమయితే సంతోషించదగ్గ విషయమే గానీ ప్రస్తుత అవసరానికి దాని నుంచి రాగల ఆసరా స్వల్పమే. శ్రీలంక పాలకుల ఉద్దేశ్యాల విషయానికొస్తే, 2004 సునామీలో భారీగా దెబ్బతిన్న దేశ ఉత్తర, ఈశాన్య ప్రాంతపు భూములను అమెరికా, భారత్‌ల సహాయంతో పునరావాసయోగ్యం చేసిన తరువాత కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ప్రయోగమేదయితే నడుస్తున్నదో, ఎల్‌టిటిఇని తుదముట్టించడానికి ఖాళీ చేసిన అదే ప్రాంతపు భూములనూ గ్రామాలనూ ఆ ప్రయోగంలో భాగం చేస్తారనీ, అక్కడి నుంచి ప్రభుత్వ క్యాంపులకు తరలించిన తమిళు లకు వేరేచోట పునరావాసం కల్పిస్తారనీ, లేదా సింహళీయులను ఖాళీ అయిన

ప్రాంతానికి తరలించి ఇజ్రాయెల్ నమూనాలో మెజారిటీ వర్గం సెటిల్‌మెంట్లు సృష్టిస్తారనీ అనుమానం. స్వయం ప్రతిపత్తి పేరిట కిందిస్థాయిలో కొంత అధికార వికేంద్రీకరణ చేపట్టి, పైన మాత్రం దేశాధ్యక్షుని పాలనాధికారాన్ని కొనసాగించడం ద్వారా దానికి పరిమితులు విధించి చేతులు దులిపేసుకోవచ్చు.

దీనిని ఎదుర్కోగల బలమైన రాజకీయ శక్తి ఏదీ శ్రీలంక తమిళులలో ఈరోజు లేకపోవడానికి ఎల్‌టిటిఇ బాధ్యత చాలా ఉంది. శ్రీలంక జాత్యహంకార పాలకులకు వ్యతిరేకంగా ఎల్‌టిటిఇ వీరోచితమైన పోరాటం చేసిన మాట వాస్తవమే. మానవ బాంబు వంటి అత్యంత సందేహాస్పదమైన 'పోరాట రూపాన్ని' మానవాళికి ఇచ్చిన ఘనతనూ, ఆ మానవ బాంబును బజార్లో ప్రయోగించి నిరాయుధులయిన పౌరులను హతమార్చిన ఘనతనూ కూడ మూటగట్టుకున్నప్పటికీ, క్రూరమైన శ్రీలంక రాజ్యానికి వ్యతిరేకంగా క్రూరమైన పోరాట రూపాలను అనుసరించక తప్పలేదని వాదించడానికి ఎల్‌టిటిఇకి అవకాశం లేకపోలేదు. అయితే తమిళ ప్రజానీకానికి తానే ఏకైక ప్రతినిధిననీ, తాను చెప్పినట్టు తమిళ ప్రజలు నడుచుకోవాలనీ, తనకు ప్రత్యర్థులు కాదు సరికదా ప్రత్యామ్నాయం సహితం తమిళ సమాజంలో ఉండడానికి వీలులేదనీ శాసించడంలో ఎల్‌టిటిఇ అంతే క్రూరంగా వ్యవహరించింది. ఎల్‌టిటిఇ అనుమతి లేకుండ తమిళులు దక్షిణాదికి పోవడానికి వీలు లేదు. ఎంతమంది పిల్లలను 'పోరాటానికి' ఇమ్మంటే అంతమందినీ ఈయవలసిందే, ముక్కుపచ్చలారని పిల్లలను సహితం ఈయవలసిందే. తన కార్యకర్తలకు కవచంగా ఉండమంటే ఉండవలసిందే. ప్రత్యామ్నాయ రాజకీయ ఉద్యమాలన్నిటినీ ఎల్‌టిటిఇ భౌతికంగా అణచివేసింది. నాయకులను చంపింది. తమిళ జాతికి నిన్ను నియంతగా ఎవరు నియమించారు అని ప్రశ్నించిన జాఫ్నా విశ్వవిద్యాలయం అధ్యాపకురాలు, మానవహక్కుల కార్యకర్త అయిన రజని తిరనగమను సహితం చంపింది. తమిళం మాట్లాడే ముస్లింలను ఉత్తర ప్రాతం నుంచి పెద్ద సంఖ్యలో తరిమివేసింది. చివరికి తాను పోయిన తరువాత ఎవరూ లేకుండ చేసింది. అందుకే ఈ సమయంలో శ్రీలంక ప్రభుత్వంపైన బలమైన ఒత్తిడి ప్రపంచ దేశాల నుంచి రావాలి. ప్రపంచ దేశాలకు – భారత్‌తో సహా – అవకాశవాదం తప్ప వేరే ఏ రాజనీతీ లేదు కాబట్టి ఇది జరగాలంటే పౌర సమాజాల నుంచి గట్టి కృషి అవసరం.

*ఆంధ్రజ్యోతి దినపత్రిక*
*5 జూన్ 2009*

# చివరికి తమిళులకు ఏమీ దక్కదా?

శ్రీలంక తమిళులకు స్వయం పాలన పోనీండి కనీసం అధికార వికేంద్రీకరణ కూడ ఇచ్చేది లేదని ఆ దేశ అధ్యక్షుడైన రాజపక్షె స్పష్టం చేస్తున్నాడు. 'మా దృష్టిలో రాజకీయ పరిష్కారానికి తొందరేమీ లేదు. ముందు తమిళుల పునరావాసం, తరువాత ఆర్థిక అభివృద్ధి. అధికార వికేంద్రీకరణ సంగతి ఆపైన చూద్దాం' అన్నవి అతని మాటలు. ఆ వికేంద్రీకరణ ఏ మేరకు ఉండబోతుందన్న దానికి కూడ సంకేతం ఇచ్చేశాడు. 'తమిళులను ఫెడరలిజం గురించి మరిచిపొమ్మనండి' అని 'ది హిందూ' దినపత్రిక సంపాదకుడికి ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నాడు. నిజానికి ఆ ఇంటర్వ్యూలో, అడుగుతున్న వ్యక్తి సానుభూతిగా అడగడం వల్ల కాబోలు మామూలుగా పాటించే జాగ్రత్తలు కూడ రాజపక్షె పాటించే ప్రయత్నం చేయలేదు. ప్రజాస్వామ్య వ్యవస్థలోని దేశాధ్యక్షుడిలాగ కాక తన ఎస్టేట్ గురించి మాట్లాడుతున్న జమీందారు లాగ జవాబులిచ్చాడు.

రాజకీయ పరిష్కారాన్ని వాయిదా వేయడానికి ఒక అతి తెలివి వాదన చేశాడు. ఘర్షణల కారణంగా తన పడవ పోగొట్టుకున్న తమిళ మత్స్యకారుడిని నీకు పడవ కావాలా లేక అధికార వికేంద్రీకరణ కావాలా అంటే పడవే కావాలంటాడు కాబట్టి ముందు పునరావాసం, తరువాత ఆర్థిక అభివృద్ధి, ఆపైన రాజకీయ పరిష్కారం అని చెప్పాడు. అలా అయితే ఎల్‌టిటిఇ మీద యుద్ధం చేస్తున్న కాలంలో సైన్యంలో సిపాయిగా ఉన్న సింహళీయుడి అమ్మ నాయనలను మీకు మీ కొడుకు ప్రాణం కావాలా లేక దేశ సమగ్రత కావాలా అని అడిగి ఉంటే వారు కొడుకు ప్రాణం కావాలనే అని ఉందురు కదా! అప్పుడైనా రాజపక్షె యుద్ధం ఆపి ఉండేవాడా? అసలు వారిని అడిగి ఉండేవాడే కాదు.

ఇక అతను ప్రథమ కర్తవ్యంగా భావించే పునరావాసం ఏ విధంగా ఉండబోతుందో చూద్దాం. 'ది హిందూ'కు ఇచ్చిన ఇంటర్వ్యూలోనే కాక ఇతర సందర్భాలలో కూడ 'తమిళులను తిరిగి జంగిల్‌కి పంపించడం నాకు ఇష్టం లేదు' అన్నాడు. అవి వాళ్ల

ఊర్లు. అక్కడ వాళ్ళ ఇళ్ళు ఉండేవి (కొన్ని చోట్ల ఇప్పటికీ ఉన్నాయి). వాళ్ళ భూములున్నాయి. ఆ ఊర్లను పునర్నిర్మించి వారిని తిరిగి అక్కడికి పంపడం 'జంగిల్‌కు పంపడం' ఎందుకయింది? అక్కడ ఎల్‌టిటిఇ మందు పాతరలు పెట్టిందని అంటున్నారు. ఎల్‌టిటిఇ పేల్చితే పేలే మందుపాతరలు పెట్టిందిగానీ ఒత్తిడికి పేలేవి పెట్టిందా? పెట్టి ఉంటే 3 లక్షల మంది తమిళులు వాటి బారిన పడకుండ ఉత్తర ప్రాంతం నుంచి బయటికెట్లా వచ్చారు? తప్పించుకుని పారిపోతున్న తమిళ ప్రజలను ఎల్‌టిటిఇ వెనక నుంచి కాల్చగా చనిపోయిన వారు చాలామంది ఉన్నారు కానీ మందుపాతరలు తొక్కడం వల్ల చనిపోయిన వారి గురించి వినలేదు. రాజపక్షె తటపటాయింపుకు వేరే కారణాలున్నాయి. 2004లో సునామీ వచ్చినప్పుడు ఆ ప్రాంతాన్ని (ఇండియా తదితర దేశాల సహాయంతో) బాగు చేసిన తరువాత అక్కడి నుంచి పారిపోయి వచ్చిన తమిళులను వెనక్కి పంపించకుండ, వారి కోసం ఇచ్చిన తాత్కాలిక కాలనీలను శాశ్వతం చేసేసి ఆ భూమిని కంపెనీలకు లీజుకిచ్చారు. ఇప్పుడూ అదే ఆలోచన శ్రీలంక ప్రభుత్వం చేస్తున్నట్టుంది. ఎల్‌టిటిఇ పైన యుద్ధానికి సహకరించిన దేశాలన్నీ ప్రతిఫలం కోసం ఎదురుచూస్తున్నాయి. ఇప్పటికే రైల్వే వ్యవస్థ పునరుద్ధరణను జాఫ్నా దాకా పొడిగించే కాంట్రాక్టు ఒక పాకిస్తానీ సంస్థకు ఇవ్వబడిందట. మన అంబానీలకూ జిందాల్‌కూ 'అవకాశాలు' కావాలి. చైనా కంపెనీలకూ కావాలి. తమిళులు తిరిగి పోరాని 'జంగిల్' వీరందరికీ భోజ్యం కానుంది. తమిళులు మాత్రం శాశ్వత కాలనీలుగా మారిన క్యాంపుల్లో స్థిరపడవలసి ఉంటుంది.

రాజపక్షె వాయిదా వేస్తున్న 'వికేంద్రీకరణ' నిజానికి కొత్త విషయం కాదు. 1987లో శ్రీలంక రాజ్యాంగానికి చేసిన 13వ సవరణ అమలును వాయిదా వేస్తున్నాడంతే. అది తమిళులు కోరుకున్నది కూడ కాదు. రాజీవ్‌గాంధీ ప్రభుత్వంలోని భారత ప్రభుత్వ అధికారులు శ్రీలంక ప్రభుత్వాన్నీ ప్రభాకరన్‌నూ బలవంతపెట్టి ఒప్పించిన సవరణ అది. దానిని అమలు చేసినా శ్రీలంక తమిళుల స్వయంపాలనా కాంక్షకు అది జవాబు కాదు. ఆ రాజ్యాంగ సవరణ ద్వారా జరిగిందేమిటంటే భారత రాజ్యాంగంలోని కేంద్ర రాష్ట్ర సంబంధాలను కొన్ని కీలక అంశాలలో (శ్రీలంక ప్రభుత్వాన్ని ఒప్పించడం కోసం) కుదించి శ్రీలంకకు ఎగుమతి చేయడం. దానిని ఉన్నదున్నట్టు ఎగుమతి చేసి ఉన్నా శ్రీలంకలోని జాతుల సమస్యకు అది మన దేశంలో చేసిన పాటి న్యాయం కూడ చేయదు. కుదించడం వల్ల దానిని మరింత బలహీనం చేశారు. భారతదేశాన్ని కూడ జాతుల సముదాయంగా వర్ణించడం జరుగుతున్నది

గానీ ఇక్కడ జాతుల మధ్య భాష, ప్రాంతీయ సంస్కృతులు తీసుకొచ్చిన తేడాల కంటే ఆయా జాతుల ఆధిపత్య వర్గాల మధ్య బ్రాహ్మణీయ హిందూత్వ సంస్కృతి, గుర్తింపు తీసుకొచ్చిన ఐక్యతే ఇప్పటిదాకా బలంగా ఉంది. ఆ వర్గాలు భారతదేశాన్ని 'తమది'గా ఉమ్మడిగా భావిస్తాయి. ఆర్యావర్తం అన్న వైదిక భావన దీనికొక భావజాలంగా పనిచేస్తున్నది. ఒబిసిలు ఆయా ప్రాంతాలలో రాజకీయాలలో పైకి వచ్చిన క్రమంలో కూడ ఏ కారణంగానైతేనేం ప్రాంతీయంగా విడిపోకుండ తమను తాము ఒక అఖిల భారత వర్గంగానే భావించుకొని ప్రాంతాలకు అతీతంగా పెరియార్, పూలే, అంబేద్కర్, లోహియా వంటి వారిని తమ దార్శనికులుగా గుర్తిస్తున్నారు.

దీనికి పూర్తిగా వెలుపల ఉన్న కశ్మీర్, నాగా ప్రజలు మాత్రమే తమకు భారతదేశంతో ఏ సంబంధం లేదనీ, వేర్పాటు కావాలనీ అలసట లేకుండ పోరాడుతున్నారు. వారు భారత పాలకులను ఎంతగా ఇబ్బంది పెట్టినప్పటికీ అవి పరిమాణంలో చాలా చిన్న జాతులు కావడం వల్ల ఫెడరలిజం అంటేనే భయపడే పరిస్థితి భారత పాలకులకు లేదు. అందువల్ల భారత రాజ్యాంగంలోని పాక్షికమైన ఫెడరల్ సూత్రాలను (అప్పుడప్పుడు అతిక్రమిస్తున్నప్పటికీ) మొత్తంమీద గౌరవించడం జరుగుతున్నది. సుప్రీంకోర్టు ప్రత్యేకించి కేంద్రం నియమించే గవర్నర్ అధికారాలను చాలా పరిమితమైనవిగా వ్యాఖ్యానించి రాష్ట్ర ప్రజలు ఎన్నుకునే ప్రభుత్వానిదే పైచేయి అని (కొన్ని ప్రత్యేక సందర్భాలలో తప్ప) రాజ్యాంగానికి అర్థం చెప్పింది. శ్రీలంక పరిస్థితి వేరు. అక్కడ ఒకే ఒక బలమైన పాలకజాతి ఉంది. ఆ దేశం తనదేనని ఆ జాతి (బౌద్ధ సింహళీయులు) భావిస్తుంది. కాని పాలిత జాతి కూడ పెద్ద సంఖ్యలో ఉంది. రెండింటిలోని ఆధిపత్య వర్గాల మధ్య సహితం బలమైన సాంస్కృతిక బంధం లేదు. కాబట్టి ఇవే సూత్రాలు అక్కడ వేరే అర్థం పొందగలవు. శ్రీలంక సుప్రీంకోర్టులో 13వ రాజ్యాంగ సవరణపై వచ్చిన కేసులలో శ్రీలంక ప్రభుత్వం ఈ విషయాన్ని స్పష్టంగానే చెప్తున్నది. 'భారత న్యాయస్థానాల వ్యాఖ్యానాలు ఇక్కడ వర్తించవు. వారిది ఫెడరల్ రాజ్యాంగం, మనది యూనిటరీ రాజ్యాంగం' అని ప్రభుత్వ న్యాయవాదులు వాదిస్తున్నారు. మనది ఏపాటి ఫెడరల్ రాజ్యాంగం అనేది ఇక్కడ ప్రశ్న కాదు. ఈ రాజ్యాంగ పరిభాష వెనక ఉన్నది పైన వివరించిన సామాజిక వాస్తవికత.

ఆ రాజ్యాంగ సూత్రాలను కొన్ని ముఖ్య విషయాలలో ఎలా కుదించారో చూద్దాం. కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఉండే విషయాల జాబితాను, రాష్ట్ర ప్రభుత్వానికి

అధికారం ఉండే విషయాల జాబితాను వేరు వేరుగా ప్రకటిస్తూ, అయితే ఏ జాబితాలోని విషయం పైనయినా విధాన సూత్రాలు (పాలసీ) రూపొందించే అధికారం మాత్రం కేంద్రానిదేనన్నారు. అంటే రాష్ట్రాలు తమకు అధికారం ఉన్న విషయాలపైన సహితం కేంద్ర ప్రభుత్వం రూపొందించే విధాన సూత్రాలకు లోబడి చట్టాలు చేయాలి. భారత రాజ్యాంగంలోని కేంద్ర రాష్ట్ర సంబంధాలలో ఆ పరిమితి లేదు. భూమి యాజమాన్యం మరొక కీలక అంశం. శ్రీలంక రాజ్యాంగపు 13వ సవరణ దేశంలోని భూమిపైన అధికారం యావత్తూ కేంద్రానికి అప్పగించింది. తమ ప్రాంతంలోని ప్రభుత్వ భూములను సింహళీయులకు అప్పగించి అక్కడ సింహళీయుల ఆవాసాలనూ జనాభానూ క్రమంగా పనిగట్టుకొని పెంచుతున్నారన్నది తమిళులు మొదటి నుంచి చేస్తున్న అభియోగం. ఆ అవకాశం 13వ రాజ్యాంగ సవరణ తరువాత కూడ శ్రీలంక ప్రభుత్వం చేతిలో కొనసాగుతుంది. భారత రాజ్యాంగంలో అడవి భూములు తప్ప తక్కిన భూములపైన అధికారం రాష్ట్రాలదే. పోలీసు వ్యవస్థ విషయంలోనూ శ్రీలంకలో కేవలం దైనందిన నేరాల నిరోధం, పరిశోధన మాత్రమే రాష్ట్ర జాబితాలోని విషయం. 'పబ్లిక్ ఆర్డర్' కేంద్రానికి అప్పగించ బడింది. అంటే జాతి ఆకాంక్ష పేరిట తమిళ ప్రాంతాలలో ఏ కొంచెం అలజడి జరిగినా కేంద్రం నేరుగా రంగంలోకి దిగవచ్చు. రాష్ట్రం తన ఆర్థిక అవసరాల కోసం వసూలు చేసే పన్నుల మోతాదు కూడ కేంద్రం నిర్ణయించే పరిమితికి లోబడి ఉంటుంది.

అంతంత మాత్రంగా ఉన్న భారత ఫెడరలిజాన్ని ఈ విధంగా కుదించి తయారుచేసిన 13వ రాజ్యాంగ సవరణను అమలుచేస్తే చాలని ఇండియా, ఆమెరికా శ్రీలంక ప్రభుత్వానికి హితవు చెప్తున్నాయి. 'చూద్దాం, తొందరేముంది' అని రాజపక్షె అంటున్నాడు. అతని మీద ఏ రకమైన ఒత్తిడిపెట్టే స్థితిలో శ్రీలంక తమిళులు లేకపోవడం అన్నిటికంటే విచారకరం. వారి రాజకీయ సంకల్పాన్నీ, చొరవనూ అటు ఎల్‌టిటిఇ, ఇటు శ్రీలంక ప్రభుత్వం మూల్గులు పీల్చినట్టు పీల్చేశాయి. వారి భవిష్యత్తు గురించి ఏ రకమైన ఆశాభావం వ్యక్తంచేసే స్థితి ఇవాళ లేదు.

*ఆంధ్రజ్యోతి దినపత్రిక*

*15 జూలై 2009*

## పాకిస్తాన్




# పాకిస్తాన్-భారత్‌ల మైత్రి: పీపుల్స్ ఫోరం కృషి

ప్రభుత్వాలు యుద్ధం చేస్తుంటే ప్రజలు స్నేహం చేయగలరు.

ఇది ఒట్టి నమ్మకంగా ఉండిపోతే గుడ్డి నమ్మకం అనిపించుకుంటుంది. నిజానికి ప్రజలలో అంతో ఇంతో ద్వేషభావం లేకుండా – లేనట్టయితే కల్పించకుండా – ప్రభుత్వాలు యుద్ధాలు చేయలేవు. కాని దీనిని ప్రయత్నపూర్వకంగా అధిగమించి స్నేహ హస్తం అందియ్యడం సాధ్యమన్న నమ్మకం గుడ్డి నమ్మకం కాదు. అదొక ఆచరణాత్మకమైన కార్యక్రమం. ఎంత ఫలితమిస్తే అంత మేలు చేసే ప్రయత్నం.

భారత్ – పాకిస్తాన్‌ల విషయంలో ఈ ప్రయత్నం ఒక అయిదారు సంవత్సరాలుగా సాగుతున్నది. 'పాకిస్తాన్ – ఇండియా పీపుల్స్ ఫోరం ఫర్ పీస్ అండ్ డెమోక్రసీ' అనే ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో ఈ ప్రయత్నం జరుగుతున్నది. ఈ మధ్య పెషావర్‌లో జరిగిన నాల్గవ వార్షిక సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను, రూపొందించుకున్న కార్యక్రమాలను బట్టి చూస్తే ఇది నాలుగు కాలాల పాటు నిలబడే ప్రయత్నంగానే కనిపిస్తున్నది. మొదలుపెట్టినప్పుడు ఎవరూ అలా అనుకోలేదు.

కశ్మీర్ విషయంలో ఇరు దేశాలూ మొండి వైఖరి అనుసరించి కశ్మీరీలకు చాలా నష్టం చేయడమే కాక, తమ మధ్య ఉండగల ఆర్థిక సంబంధాలకూ సాంఘిక

సంబంధాలకూ చాలా నష్టం చేసుకుంటున్నాయన్న ఆవేదనతో భారతదేశానికి చెందిన పిడికెడు మంది మానవహక్కుల కార్యకర్తలూ వారి పాకిస్తానీ సహచరులూ 'ఏదో ఒకటి చేస్తే బాగుంటుంది' అంటూ ఈ ప్రయత్నం మొదలుపెట్టారు.

'ఈ రెండు దేశాలూ యుద్ధం చేసుకోవలసిన అగత్యమేమీ లేదు' అనే సంక్లిష్టమయిన నినాదంతో ఈ ప్రయత్నం ప్రారంభమయింది. ఆర్థికంగా, సాంస్కృతికంగా భారత – పాకిస్తాన్‌ల మధ్య సామాన్య లక్షణాలు, అవసరాలు చాలా ఉన్నాయి. నిజానికి సాంస్కృతికంగా ఎంత సారూప్యత ఉందనేది దక్షిణ భారతదేశంలో ఉండే మనకు సులభంగా అర్థం కాదు. ఆర్థికంగా కూడ దేశ విభజన కృత్రిమమైన ఎల్లలు సృష్టించకుండా ఉండి ఉంటే మన గుజరాత్, పంజాబ్, జమ్మూకశ్మీర్ రాష్ట్రాలతో పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ సన్నిహితంగా ముడిపడి ఉండేది. శాంతి ఉంటే ఈ ఆర్థిక సాంఘిక సంబంధాలను పునరుద్ధరించుకొని ఇరు దేశాలూ చాలా ప్రయోజనం పొందవచ్చు.

అంతే కాకుండా యుద్ధ ప్రమాదం పేరు మీద ఈ రెండు దేశాలూ విపరీతంగా ఖర్చు పెడుతున్నాయి. భారతదేశం తన జాతీయ ఆదాయంలో మూడు శాతం రక్షణ కోసం ఖర్చు పెడుతున్నది. పాకిస్తాన్ అదే మొత్తంలో ఖర్చుపెడితే అది ఆ దేశ జాతీయ ఆదాయంలో మరింత ఎక్కువ శాతం అవుతుంది. ఈ రెండు దేశాలూ విద్య మీదగానీ, వైద్యం మీదగానీ, సాంఘిక సంక్షేమం మీదగానీ అందులో పావువంతు కూడ ఖర్చు పెట్టలేకపోతున్నాయి. ఈ రకంగా చూసినా శాంతి కోసం కృషి చేయడం ఇద్దరికీ మంచిదే.

అయితే ఈ రెండు దేశాల పాలకులకే ఈ కృషిని వదిలేస్తే అది ఎప్పటికీ జరగదు. యుద్ధ వాతావరణాన్ని కొనసాగించడంలో వాళ్ళ ప్రయోజనాలు వాళ్ళకున్నాయి. అందువల్ల ప్రజల వైపు నుండి చొరవ అవసరం అన్న అవగాహనతో ఈ ప్రయత్నం మొదలయింది.

'శాంతి'తో పాటు 'ప్రజాస్వామ్యం' అనే అంశాన్ని కూడ చేర్చాలని ఇరు దేశాల ప్రతినిధులూ మొదట్లోనే అంగీకరించారు. దేశం లోపల ప్రజాస్వామ్యం పదిలంగా ఉంటేనే శాంతి కోసం ప్రభుత్వంపైన ఒత్తిడి పెట్టే అవకాశం ప్రజలకు ఉంటుంది. ఆ విధంగా ఈ వేదిక 'ఫోరం ఫర్ పీస్ అండ్ డెమోక్రసీ' అనే పేరుతో ఆవిర్భవించింది.

పేరుకు 'పీపుల్స్ ఫోరం' అని ఉన్నా ప్రస్తుతానికి ఇందులో ఎక్కువగా పాల్గొంటున్నది పట్టణ ప్రాంత మధ్యతరగతి బుద్ధిజీవులే. ఒక చెప్పుకోదగ్గ తేడా ఏమిటంటే భారతదేశంలో ఈ వేదిక సభ్యులు ఎక్కువగా మానవహక్కుల కార్యకర్తలు, సర్వోదయవాదులు, ఇతర రాజకీయ కార్యకర్తలు కాగా, పాకిస్తాన్‌లోని సభ్యులలో మానవహక్కుల కార్యకర్తలతో పాటు వ్యాపారస్తులు కూడ చాలామంది ఉన్నారు. ఈ రెండు దేశాల మధ్య శాంతి స్థాపన ఆర్థికంగా మన కంటే పాకిస్తాన్‌కు మరింత అవసరం అని ఇది బహుశా సూచిస్తుందేమో.

ఈ రెండు దేశాల మధ్య శత్రుత్వానికి ప్రాతిపదికగా ఇప్పటికే చాలా ప్రచారం జరిగి ఉంది కాబట్టి అది అసత్యం అని ప్రజలకు నచ్చజెప్పడం వేదిక తన మీద వేసుకున్న ఒక ముఖ్య భారం. స్నేహంగా ఉంటే ఇద్దరమూ ఎంత పొందగలమో, లేకపోవడం వల్ల ఇద్దరమూ ఎంత కోల్పోతున్నామో ప్రజలకు వివరించి చెప్పడం మరొక ముఖ్య కర్తవ్యం. ఇవేవీ సులభమైన పనులు కావు. ఎందుకంటే భారతదేశ చరిత్ర గురించి, జాతీయోద్యమం గురించి, దేశ విభజన గురించి, హిందూ ముస్లిం విభేదాల గురించి, అన్నిటికీ మించి కశ్మీర్ గురించి ఇరు దేశాలలోనూ బలంగా ప్రచారమై ఉన్న విద్వేషపూరితమైన అభిప్రాయాలతో ఈ అసత్యాలు ముడిపడి ఉన్నాయి. ఈ అభిప్రాయాలను ప్రచారం చేయడం తన రాజకీయ కర్తవ్యంగా పెట్టుకున్న ముస్లింలీగ్, జమాతె ఇస్లామీలు పాకిస్తాన్ రాజకీయ సామాజిక జీవితంలో తొలినాటి నుండి బలమైన శక్తిగా ఉండగా, ఇక్కడ అదే కర్తవ్యం పెట్టుకున్న హిందూత్వవాదులు గడచిన దశాబ్ద కాలంలో చాలా బలపడ్డారు. వీరి ప్రతిఘటనను అధిగమించి ఈ రెండు దేశాల మధ్య శాంతి సుహృద్భావాల వాతావరణాన్ని నిలబెట్టడానికి కృషి చేయడం పెద్ద పనే. కానీ అది జరగనిదే ప్రభుత్వాల మీద తమ విధానాలు మార్చుకోవాలన్న ఒత్తిడి ఉండదు.

ఇప్పటికే 'పీపుల్స్ ఫోరం' నిర్వహించిన నాలుగు వార్షిక సభలలో – తొలుత ఢిల్లీలో, తరువాత లాహోర్‌లో, తరువాత కలకత్తాలో, తరువాత పెషావర్‌లో – రెండు దేశాల నుండి దాదాపు 400 మంది సభ్యులు హాజరయ్యారు. రెండు దేశాల మధ్య పారిశ్రామిక, ఆర్థిక, సాంస్కృతిక సామాజిక సంబంధాల గురించి, యుద్ధ ప్రమాదం గురించి, అంతర్గత ప్రజాస్వామ్యం గురించి, కశ్మీర్ గురించి ఒక్కొక్క సెషన్‌లోనూ వివరంగా చర్చలు జరిపారు. శాంతి సుహృద్భావాలను పెంపొందించడానికి ఒక్కొక్క రంగంలోనూ ఏమి చేయవచ్చునో గుర్తించి తదనుగుణంగా తీర్మానాలు చేసారు.

ప్రభుత్వ విధానాలను బహిరంగంగా విమర్శించే అవకాశం మన దేశంలో ఇప్పటికింకా ఉంది. (హిందూత్వవాదులు ఇంకొన్నాళ్ళు అధికారంలో కొనసాగితే అది కూడ ఉండకపోవచ్చుననడానికి ముంబాయి నగరంలో బాల్‌థాకరే నెలకొల్పిన రాజ్యం సూచిస్తుంది.) పాకిస్తాన్‌లో అదంత సులభం కాదు. ముఖ్యంగా కశ్మీర్ విషయంలో పాకిస్తాన్ పాలక విధానాలను అక్కడ బహిరంగంగా విమర్శించడం కష్టం. అయినప్పటికీ పాకిస్తాన్ ప్రజాతంత్రవాదులు ఈ వేదికలో పెద్ద సంఖ్యలో పాల్గొనడం ఉత్సాహం గొలిపే విషయం. అయితే ప్రస్తుతానికి రెండు దేశాలలోనూ వేదిక ప్రచారం రాష్ట్రాల రాజధాని నగరాలను దాటి కిందికి దిగలేదు. దానిని కిందికి తీసుకుపోవలసిన కర్తవ్యం శాంతి కాముకులందరి మీదా ఉంది.

అణుబాంబు ప్రయోగం 'పీపుల్స్ ఫోరం'కు ఒక పరీక్షగా నిలిచింది. భారతదేశం అణు పరీక్ష నిర్వహించడం, పాకిస్తాన్ దానికి జవాబుగా తాను కూడ నిర్వహించడం రెండు దేశాలలోని ప్రజాతంత్రవాదులకు ఒక సవాలు విసిరింది. పీపుల్స్ ఫోరం ఈ సవాలును విజయవంతంగా ఎదుర్కొందనే చెప్పాలి. రెండు దేశాలలోనూ 'పీపుల్స్ ఫోరం' బాధ్యులు వెంటనే స్పందించి ఈ పోటాపోటీ అణు విస్ఫోటనాలు అనవసరమైన ప్రయోగాలని అభిశంసించారు. గుజ్రాల్ భారత ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు నెమ్మదిగా ప్రారంభించిన చర్చల ప్రక్రియను ఈ ప్రయోగాలు వెనక్కి తీసుకుపోయాయనీ, ఇరు దేశాల మధ్య శాంతి సుహృద్భావాలు నెలకొనే సుదినాన్ని కనీసం ఒక దశాబ్దం వెనక్కి నెట్టాయనీ విమర్శించారు.

పీపుల్స్ ఫోరంలో రెండు దేశాలలోనూ ప్రభుత్వంలో ఒకప్పుడు ముఖ్య పదవులు నిర్వహించిన పెద్దలు కొంతమంది ఉండడం వల్లనేమో ఇప్పటి దాకా వీసా పాస్‌పోర్ట్‌ల విషయంలో రెండు ప్రభుత్వాలూ వేదికను ఇబ్బంది పెట్టడం లేదు. కానీ అంతకుమించి వేదిక తీర్మానాలకూ డిమాండ్లకూ స్పందించడం లేదు. ప్రజలలో ఈ అభిప్రాయాలు బలంగా నెలకొనేదాకా స్పందిస్తారని ఆశించడానికి ఆస్కారం కూడ లేదు.

*ప్రజాతంత్ర వారపత్రిక*

*10 జనవరి 1999*

# 'కార్గిల్ యుద్ధాన్ని' వ్యతిరేకిద్దాం

**యు**ద్ధం ప్రభుత్వ సమస్య కాదు. మనందరి సమస్య.

యుద్ధాన్ని గురించిన ఆలోచన, నిర్ణయాలు ప్రభుత్వానికి వదిలేసి మనం దేశభక్తితో చప్పట్లు కొట్టే పాత్రకు పరిమితం కాకూడదు. ఇది ఎప్పుడయినా సత్యమే. కానీ అణుయుద్ధ ప్రమాదం పెరిగిన తరువాత మరీ సత్యం. మామూలు యుద్ధంలో ప్రత్యక్ష ప్రమాదం ఎదుర్కొనేది ఇరుదేశాల సైనికులే కాబట్టి (సరిహద్దు ప్రజలను మినహాయిస్తే) యుద్ధ నిర్ణయాలను సైన్యానికీ, ప్రభుత్వానికీ వదిలేయడం తగునని మాటవరసకైనా అనవచ్చు. అది కూడ మాటవరసకే తగును. కానీ అణుయుద్ధమంటూ వస్తే ప్రమాదం ఎదుర్కొనేది సైన్యాలు మాత్రమే కాదు. సరిహద్దుకు చాలా దూరంలో మారుమూల గ్రామాల ప్రాంతాలలో నివసించే ప్రజలు సహితం ఎదుర్కొంటారు. ఈ స్థితి రెండు దేశాల ప్రజలకూ తెచ్చిపెట్టిన భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం ఇప్పుడు దేశభక్తితో చప్పట్లు కొట్టే పాత్రకు మనల్ని పరిమితం కమ్మంటే మనం ఎంత మాత్రమూ కానక్కరలేదు.

'కార్గిల్ యుద్ధం' అని ఇప్పటికే కొన్ని పత్రికలు పేరు పెట్టిన ప్రస్తుత యుద్ధ వాతావరణాన్ని గురించి రెండు విషయాలు మాత్రం ప్రభుత్వం, పత్రికలు పదేపదే చెప్తున్నాయి. ఒకటి పాకిస్తాన్ దుర్బుద్ధి, రెండు మన వాళ్ళు దానిని సకాలంలో గ్రహించలేకపోవడం.

ఇవి కాక తెలుసుకోవలసిన విషయాలు ఇంకేమీ లేవా? కశ్మీర్‌లో ఉన్న అసంతృప్తిని వాడుకొని 'చొరబాటుదారులు' అని మనమూ, 'విముక్తి పోరాటకారులు' అని వాళ్ళూ పిలుచుకునే సుశిక్షితులయిన సాయుధ మిలిటెంట్లను కశ్మీర్‌లోకి పంపించాలని పాకిస్తాన్ ఈ రోజే కాదు, ఎప్పటి నుండో ప్రయత్నిస్తున్నది. 1947లో మొదటి భారత్ – పాక్ యుద్ధం అట్లాగే మొదలయింది. 1965లో రెండవ యుద్ధం

కూడ అట్లాగే మొదలయింది. 1989లో కశ్మీర్‌లో మిలిటెన్సీ మొదలయిన తరువాత కొన్ని వందలమంది చొరబాటుదార్లను పాకిస్తాన్ పంపించింది, లేదా వాళ్ళు పోతుంటే అన్ని విధాలా సహకరించింది. ఇప్పుడు కార్గిల్‌లో పాకిస్తాన్ చేపట్టిన పని దీనికి కొనసాగింపే. కొత్త విషయమేమిటంటే మొట్టమొదటిసారి పాకిస్తాన్ కార్గిల్ సరిహద్దును ఎంచుకుంది. ఇంతకుముందు బారాముల్లా, కుప్వారా, రాజోరి, పూంచ్ సరిహద్దుల మీదుగా పంపించింది. అంతే కాకుండా ఒక్కసారిగా ఇంత ఎక్కువ సంఖ్యలో మిలిటెంట్లను పాకిస్తాన్ గతంలో ఎప్పుడూ పంపించినట్టు లేదు.

ఈ తేడాలను మినహాయిస్తే, 1947 నుండి భారత్ – పాకిస్తాన్‌ల వైరంలో ఒక సామాన్య విషయంగా ఉంటున్న ఈ సమస్య గురించి అదుపు తప్పిన ఈ ఆవేశం ఎందుకు? కశ్మీర్‌లో భారత ప్రభుత్వం పట్ల తీవ్రమైన అసంతృప్తి ఉన్న మాట సత్యం. భారతదేశం నుండి బయటకు వెళ్ళిపోవాలన్న ఒక బలమైన కాంక్ష కశ్మీర్ ప్రజానీకంలో ఉన్న మాట కూడ సత్యం. దానిని పాకిస్తాన్ వాడుకోవడం, ఆయుధ శిక్షణ కోరుకునే కశ్మీరీలకు శిక్షణ ఇవ్వడం, కశ్మీర్‌లోకి ప్రవేశించడానికి సిద్ధంగా ఉన్న పాకిస్తానీ, ఆఫ్ఘానీ 'ముజాహిద్'లకు సహకరించడం, పనిలో పనిగా వారితోబాటు పాకిస్తానీ సైనికులను కూడ సరిహద్దు దాటించటం జరుగుతున్నది.

దీనిని దుర్బుద్ధి అనేట్టయితే 'తూర్పు పాకిస్తాన్‌లోని బెంగాలీల అసంతృప్తిని భారత్ ఇదే విధంగా వాడుకుంద'ని పాకిస్తాన్ అనగలదు. 'జాఫ్నాలోని తమిళుల అసంతృప్తిని ఒక దశ వరకు భారత్ ఇదే విధంగా వాడుకుంద'ని శ్రీలంక కూడ అనగలదు. దుర్బుద్ధో, సద్బుద్ధో గానీ ఇది అంతర్జాతీయ రాజకీయాలలో సార్వత్రికంగా ఉన్న విషయం. ఒక దేశంలోని సమస్యలను పొరుగుదేశం వాడుకొని దానిని బలహీనపరచాలని ప్రయత్నం చేస్తుంటుంది. 'మా అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకొని మా సార్వభౌమత్వాన్ని అతిక్రమిస్తున్నారు' అని వీరు చట్టం మాట్లాడితే, 'మీ చేత అణచివేతకు గురవుతున్న నిస్సహాయులయిన మీ దేశ ప్రజలకు మేము అండగా నిలుస్తున్నాం' అని వారు నీతి మాట్లాడతారు. పాకిస్తాన్ వాస్తవాధీన రేఖను దాటి మిలిటెంట్లను పంపిస్తున్నదన్న విషయం ఎంత సత్యమో, ఆ మిలిటెంట్లను కశ్మీర్ లోయవాసులు ఆదరిస్తున్నారనేది కూడ అంతే సత్యం. వారిలోని వైమనస్యానికీ అసంతృప్తికీ మన దగ్గర సమాధానం లేనంత కాలం దానిని పాకిస్తాన్ వాడుకోకుండ ఆపడం సాధ్యం కాదు.

పాకిస్తాన్ కపటత్వం మన దేశంలో అందరికీ ఆగ్రహం కలిగించడాన్ని అర్థం చేసుకోవచ్చు. మిలిటెంట్లనూ, అందులో భాగంగా పాకిస్తానీ సైనికులనూ వాస్తవాధీన రేఖ దాటిస్తూ, అదేమంటే 'కశ్మీర్ విముక్తి కోసం పోరాడే మిలిటెంట్లు మీ దేశంలోకి ప్రవేశించి మిమ్మల్ని ఇబ్బంది పెడితే పాకిస్తాన్ మీద పడి ఏడుస్తారెందుకు?' అని సర్తాజ్ అజీజ్ అంటున్నాడు. భారత్ ఇరకాటానికి పాకిస్తాన్ ఆనందిస్తూ, అందులో తన పాత్ర ఏమీ లేదని బుకాయించడం మనకు కోపం కలిగించగల విషయమే.

కానీ పాకిస్తాన్ బంగ్లాదేశ్ వేర్పాటుకు ప్రతీకారం తీర్చుకుంటున్నదని మనలో చాలామందికి అర్థం కావడం లేదు. "తూర్పు పాకిస్తానీల అసంతృప్తి నుండి పుట్టిన సమస్యను తాము ఏదో ఒక విధంగా పరిష్కరించుకునేవాళ్ళమనీ, భారత్ జోక్యం చేసుకొని 'ముక్తి బాహిని'కి తర్ఫీదు ఇచ్చి ఆ పరిష్కారం సాధ్యం కాకుండా చేసింద"నీ పాకిస్తాన్ అభియోగం. అప్పుడు మనం ఈ మాటే అన్నాం. 'మీ దేశంలో సగభాగం మీ రాజ్యం మీద తిరగబడితే వారినేమీ చేయలేక మా మీద పడి ఏడుస్తారెందుకు?' అన్నాం.

ఇవన్నీ చెప్పడం ఎందుకంటే, ఇది ఉద్రేకానికి లోనయి యుద్ధం దాకా తెచ్చుకోవలసిన విషయం కాదు. 'కార్గిల్'కు పరిష్కారం కశ్మీర్‌లో ఉంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో జమ్మూకశ్మీర్‌లో పౌర ప్రభుత్వం ఏర్పడిన తరువాత, కశ్మీరీల మనసులను గెలుచుకోవడానికి ప్రయత్నం చేస్తామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హామీ ఇచ్చాయి. 1952 ఢిల్లీ ఒడంబడికను పునరుద్ధరించి ఆ పిదప జరిగిన అన్ని శాసన సవరణలనూ వెనక్కి తీసుకోవడం మొదటి మెట్టుగా ఉంటుందని ఫరూఖ్ అబ్దుల్లా అన్నాడు. దాని కోసం ఒక కమిటీ కూడ వేసారు. ఆ ప్రయత్నం ఎక్కడి దాకా వచ్చిందో తెలీదుగానీ ఆ దిశగా ముందుకుపోయి కశ్మీరీల మనస్సులను గెలుసుకోగలిగితేనే 'చొరబాటుదార్ల' సమస్య తీరే అవకాశం ఉంది.

అంతవరకు ఉద్రేకం విడిచిపెట్టి చొరబాటుదారులను వెనక్కి పంపించి వాస్తవాధీనరేఖ దగ్గర శాంతి నెలకొల్పే కర్తవ్యాన్ని ఎంత మెలకువగా నిర్వహిస్తే అంత మంచిది. సమస్య లోతుపాతులను అర్థం చేసుకోకుండా మితిమీరిన జాతీయవాద ఉద్రేకంతో దేశమంతా రెచ్చిపోతే ఇరు దేశాలకు ప్రమాదకరమయిన యుద్ధమే మిగులుతుంది. గతంలో జరిగిన యుద్ధాలలో భారత్ గెలిచి ఉండవచ్చు. ఈసారి కూడ సాంకేతికంగా చూసుకుంటే భారతే గెలవచ్చు. కానీ అణుబాంబులొచ్చిన తరువాత గెలుపు ఓటములు అర్థంలేని మాటలు. అణు యుద్ధానికి అర్థం సార్వత్రిక విధ్వంసమే.

ఇదంతా కాదన్నా, రాగల యుద్ధాన్ని జమ్ముకశ్మీర్‌వాసుల కళ్ళతో మనం చూడగలిగినా యుద్ధంలో పరాక్రమం, వీరత్వం ఏమీ లేవనీ, అది భయానికీ బాధకూ విధ్వంసానికీ సంకేతమనీ అర్థమవుతుంది. ఒక నెల పైగా సాగుతున్న 'కార్గిల్ యుద్ధం' ధాటికి ద్రాస్ పట్టణవాసులు ఊరు ఖాళీచేసి పరిసర గ్రామాలలో తిండీ తిప్పలు లేకుండా శరణార్థులుగా బతుకుతున్నారు. కార్గిల్ పట్టణవాసులయితే రెండు సంవత్సరాలకు పైగా పాకిస్తాన్ తుపాకీ గుండ్లను ఎదుర్కుంటున్నారు. ఒక్కొక్కరుగా ఆ ఊరిని ఖాళీచేసి పోతున్నారు. అదే మోతాదులో కాకున్నా కశ్మీర్ లోయలోని కుప్వారా, ఉడి పట్టణవాసులూ, జమ్మూ ప్రాంతంలోని రాజోరి, పూంచ్ పట్టణవాసులూ ఎప్పుడు అవతలి వైపు నుండి తుపాకిగుండు వచ్చి పడుతుందోనని భయపడుతూ బతుకుతున్నారు. పొలానికో స్కూలుకో పోయిన పిల్లలు క్షేమంగా తిరిగొస్తారా లేక సరిహద్దు గుళ్ళవర్షంలో ఏదో ఒక తుపాకీగుండుకు బలి అవుతారా అని ప్రతి సాయంత్రం ఆదుర్దాగా ఎదురుచూస్తూ ఏళ్ళ తరబడి బతుకులీడుస్తున్న సరిహద్దు జనావాసాల తల్లిదండ్రుల కళ్ళతో చూడగలిగితే (వారిలో హిందువులున్నారు, ముస్లింలున్నారు, కశ్మీర్ భారతదేశంలోనే ఉండాలనుకునే వారున్నారు, వేరయి పోవాలనుకునే వారున్నారు) యుద్ధమంటే మన దినపత్రికలు అతిశయించిన దేశభక్తితో వర్ణిస్తున్నట్లు పరాక్రమం, త్యాగం, ఆత్మార్పణం కాదనీ, యుద్ధమంటే హింస, భయం, విధ్వంసం అనీ అర్థం చేసుకోగలుగుతాం. మన నాయకులూ పత్రికలూ నూరిపోస్తున్న వీరావేశం గురించి కార్గిల్‌వాసులు ఏమనుకుంటున్నారో ఒకసారి ఆలోచించినా ఈ ఆవేశం ఎంత అసంబద్ధమైనదో అర్థమవుతుంది.

అందువల్ల ఆవేశం తగ్గించుకొని కొంచెం సంయమనం పాటిద్దాం, పాటించమని ప్రభుత్వానికి చెబుదాం. లోతయిన చారిత్రక మూలాలున్న ఈ సమస్యను ఉద్రేకంతో పరిష్కరించే ప్రయత్నం చేయొద్దనీ, విధ్వంసాన్ని ఆహ్వానించవద్దనీ చెబుదాం. ఈ రెండు దేశాలలోనూ ఉన్న మూర్ఖుల పట్టు నుండి రెండు దేశాల భవితవ్యాన్ని విముక్తి చేయడానికి ప్రయత్నం చేద్దాం.

*మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది*

*19 జూన్ 1999*

# సమరఘోషలో శాంతిని విస్మరిస్తున్నామా?

యుద్ధమంటే మనుషులకింత ఆవేశం ఎందుకొస్తుంది? మామూలుగా సాదాసీదాగా బతికే వాళ్ళు సైతం ఇంత ఉత్సాహం ఎందుకు చూపిస్తారు? ఇది 'దేశభక్తి' అని చెప్పుకుని గర్విస్తున్నాం కానీ ఇది దేశభక్తా లేక ఒక శత్రువును భావించుకుని మనస్సు నిండా నింపుకున్న ద్వేషభావంలో ఒకరితో ఒకరు మమేకం అయ్యే గుణమా? ఒక పరాయి దేశం మీద, జాతి మీద, ఏదయినా పరాయి సమూహం మీద ద్వేషం మనుషులను చాలా వేగంగా ఏకం చేస్తుంది. అందరూ ఒకటయి వాళ్ళను ఉమ్మడిగా ద్వేషించడంలో ఒక సంతృప్తితో కూడిన భద్రత ఉంటుంది. ఇది నైతికంగా ఏమంత గొప్ప గుణం కాదు గానీ దీనికి దేశభక్తి అని పేరు పెట్టుకొని మనం చాలా నీతిమంతులుగా అనుభూతి చెందుతున్నాం.

జూలై మూడవ తేదీన హైదరాబాద్‌లో చంద్రబాబు నాయుడు స్వయంగా నిర్వహించిన ప్రదర్శనను, అందులో పాల్గొన్నవాళ్ళు ఇచ్చిన నినాదాలను, చేసిన వ్యాఖ్యలను చూసిన వాళ్ళకు, విన్నవాళ్ళకు ఈ ప్రశ్నలు, సందేహాలు తోచకుండా ఉండవు. మన రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే అన్ని కార్యక్రమాలలాగ ఈ కార్యక్రమం కూడ విద్యార్థులకూ, అధ్యాపకులకూ కంపల్సరీ అయింది. నగరంలోని వివిధ కళాశాలల నుంచి, పాఠశాలల నుంచి వేల సంఖ్యలో హాజరయ్యారు. వీరితోపాటు తెలుగుదేశం నాయకులు సమీకరించగల ఇతర జనం కూడ ఆనాటి 'కార్గిల్ ప్రదర్శన'లో పాల్గొన్నారు.

ఈ ప్రదర్శకులకయినా, వారిని ఉద్దేశించి ప్రసంగించిన ముఖ్యమంత్రికయినా యుద్ధం అవాంఛనీయం అన్న ఆలోచన తట్టలేదు. ఈ రెండు పేద దేశాలూ యుద్ధం చేసుకుని ఆర్థికంగా నాశనం కావడం ఎవరికీ మంచిది కాదన్న ఆలోచన తోచలేదు. చనిపోయిన జవాన్లకు జోహార్లు చెప్పడం కంటే ఈ నిరర్థకమైన చావులను ఆపే

మార్గం అన్వేషించడం ముఖ్యమని వారికి అనిపించలేదు. పాకిస్తాన్‌ను వెనక్కి తరుముతాం, చొరబాటుదార్లను తరిమికొడతాం, భారత్ ప్రతాపాన్ని చూపిస్తాం అంటూ ఆవేశంగా నినాదాలు ఇచ్చారే కానీ ఇప్పటికే దాదాపు 40 శాతం జనాభా శరణార్థులుగా మారిన కార్గిల్ జిల్లా ప్రజానీకం దుర్గతి గురించి ఒక్క మాట మాట్లాడిన వారు లేరు. ఆనాటి ప్రదర్శకులకు కార్గిల్ ఒక భూభాగం మాత్రమే. ఆ భూభాగం మీద మమకారమే మన దేశభక్తి.

పెద్దగా లోతుల్లోకి పోకుండా కూడ కనీస విజ్ఞత ఉన్న వారెవరైనా కార్గిల్ సరిహద్దు సంఘర్షణను వీలయినంత తక్కువ ప్రాణనష్టంతో పరిష్కరించే ప్రయత్నం చేయమని భారత ప్రభుత్వానికి హితవు చెప్పడం దేశ పౌరుల ప్రధాన కర్తవ్యమని గ్రహించగలిగి ఉండాలి. చాలా చదువుకున్న వాళ్ళు చాలామంది పాల్గొన్న ఆ ప్రదర్శనలో ఈ ఆలోచన ఎవ్వరికీ తోచకపోవడాన్ని – తోచినా వ్యక్తం కాకపోవడాన్ని – ఏ విధంగా అర్థం చేసుకోవాలి? ఒక ఉమ్మడి శత్రువును ఉమ్మడిగా ద్వేషించడంలో పొందే ఆనందంలో విజ్ఞత నశించిందనుకోవాలా? వారి వారి జీవితాలలోని అన్ని వైఫల్యాలకూ, అన్ని రకాల చేతకానితనానికీ కార్గిల్‌లోని 'వీర జవాన్ల' విజయాలు, మనమందరం కలిసి తరిమితే తోకముడిచి పారిపోతున్న పాకిస్తానీ సైనికుల ఊహాచిత్రం ఉపశమనంగా పనిచేస్తాయనుకోవాలా? వ్యక్తిగత వైఫల్యాలకే కాక, ఒక దేశంగా అన్ని రంగాలలోనూ మనం పొందిన వైఫల్యాలకు మన తరఫున ఎవరో కొందరు సైనికులు మన కంటే చాలా చిన్న దేశం పురమాయించిన అర్ధసైనికులపైన సాధిస్తున్న విజయం ఒక జాతీయ ఉపశమనంగా పనిచేసినట్టుంది.

జూలై 3 నాటి ప్రదర్శనలో స్కూలు పిల్లలు, కాలేజీ పిల్లలు చాలామంది ఉన్నారు. వాళ్ళవి ఇంకా ద్వేషం నిండని మనసులు. ఈ రెండు దేశాలలోనూ పెద్దతరాన్ని బాగుచేయడం ఎవరి తరమూ కాదు. కానీ పిల్లలనయినా ద్వేషం నుంచి కాపాడగలిగితే వచ్చే తరంలోనయినా ఈ రెండు దేశాలూ సఖ్యంగా ఉండగలవేమో. కానీ చంద్రబాబు నిర్వహించిన ప్రదర్శనలో పాల్గొన్న పిల్లల మీద ఆనాటి ప్రదర్శన ఏం ముద్ర వేసి ఉంటుంది? పాకిస్తాన్ అంటే శత్రువు. పాకిస్తాన్ అంటే ద్రోహం. పాకిస్తాన్ అంటే చౌర్యం. ద్వేషానికి బీజాలు బలంగానే నాటుకొని ఉంటాయి.

ఇటువంటి ప్రదర్శనలే పాకిస్తాన్‌లోనూ జరుగుతుంటాయి. చంద్రబాబు వంటి నాయకులు జరిపిస్తూ ఉంటారు. ఇండియా అంటే శత్రువు, ఇండియా అంటే కపటం

అని ఇటువంటి పసిపిల్లలకే నేర్పిస్తూ ఉంటారు. ఇదే దేశభక్తి అయినట్లయితే ఈ రకమైన దేశభక్తికి అక్కడా ఏం కరువు లేదు. ఒక తరం ఈ విధంగా మలితరానికి ద్వేషాన్ని అందిస్తూ పోతుంటే ఇంక సఖ్యత ఎప్పుడు సాధ్యం అవుతుంది? మన రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా నిర్వహించిన ఈ ప్రదర్శనలో 'పాకిస్తాన్ కుక్కలను వెనక్కి తరమండి' అన్న మాటలతో ఒక బ్యానర్ కట్టారు. ఇదంతా అయిపోయిన తరువాత చాలా కాలం దాకా పాకిస్తానీలంటే కుక్కలు అన్న అభిప్రాయం మాత్రం ఆనాటి ప్రదర్శనలో పాల్గొన్న స్కూలు, కాలేజీ పిల్లల మెదళ్ళలో నిలిచిపోతుంది. మన ముఖ్యమంత్రి చాలా గొప్ప వారసత్వాన్ని రాబోయే తరాలకు అందిస్తున్నారు.

రాజకీయ లబ్ధి కోసం ఏమైనా చేసే నాయకులను అనుకోవడం ఎందుకు? పత్రికలు, ప్రసార సాధనాలు చేస్తున్న నిర్వాకం ఏమిటి? వీర జవాన్లు, ఆత్మ బలిదానం, అమరత్వం – ఈ మాటలు అందించే భావన ఏమిటి? యుద్ధం ఇంకా ఇంకా జరగాలి, పాకిస్తాన్ పైన ఇంకా ఇంకా విజయాలు సాధించాలి అనే కదా? ఇంగ్లండ్‌లో వరల్డ్ కప్ పోటీలలో భాగంగా భారత – పాకిస్తాన్ టీమ్‌లు తలపడినప్పుడు 'ఇక్కడ కార్గిల్ సరిహద్దులో సంఘర్షణ జరుగుతుండగా అక్కడ మ్యాచ్ జరుగుతున్నది' అని వ్యాఖ్యానించని పత్రిక ఉందా? క్రికెట్‌లో యుద్ధం, టెన్నిస్‌లో యుద్ధం, అన్నిటిలోనూ యుద్ధాన్ని చూసేది దేశం మీద ప్రేమా, లేక ద్వేషం మీద ప్రేమా? విద్వేషం మీద బతికే రాజకీయాలు ఈ రెండు దేశాలలోనూ కొంతకాలంగా బలపడుతున్నాయి. ఈ యుద్ధం ముగిసే నాటికి అవి రెండు రెట్లు బలపడినట్టయితే దానికి పత్రికలు, ప్రసార సాధనాల బాధ్యత కూడ ఉండబోతుంది.

కార్గిల్ సమస్యలకు నాంది పాకిస్తాన్ చర్యలేననుకుందాం. మనకు దుర్మార్గంగా, దౌర్జన్యంగా కనిపించే ఆ చర్యలకు చాలా అమాయకంగా కనిపించే వివరణ పాకిస్తాన్ ఇవ్వగలదు. భారత సైన్యం చేతిలో క్రూరమైన అణచివేత అనుభవిస్తున్న కశ్మీరీలకూ, వారి పోరాటానికీ తాను సహాయం చేయడంలో నైతికంగా తప్పేమీ లేదని పాకిస్తాన్ అనగలదు. పాకిస్తాన్ ప్రభుత్వం ఈ మాట పైకి అనకపోయినా పాకిస్తానీ పత్రికలు అనగలవు, అంటున్నాయి. మన పత్రికలు ఎంతటి ఉద్విగ్నతతో పాకిస్తాన్‌ను దుయ్యబడుతున్నాయో అంతటి ఉద్విగ్నతతోనూ పాకిస్తానీ పత్రికలూ, ప్రసార సాధనాలూ ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ఆ అభిప్రాయాన్ని ఆమోదించే వాళ్ళు ప్రపంచంలో ఎవరూ లేరని మనమనుకుంటే పొరబాటే.

అయినప్పటికీ పాకిస్తాన్‌దే తప్పని కొంచెం సేపు అనుకుందాం. అప్పుడు భారత పౌరులుగా మన కర్తవ్యం ఏమిటి? పాకిస్తాన్ చేసిన తప్పు వల్ల ఈ రెండు దేశాల మధ్య అనవసరంగా నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని శాంతివైపు మళ్ళించే ఆలోచన చేయడమా? లేకపోతే పాకిస్తాన్‌కు బుద్ధి చెపుతాం అని ఆవేశపడి యుద్ధ వాతావరణాన్ని మరింత తీవ్రతరం చేయడమా? నిజమే. వాస్తవాధీనరేఖ దాటి వచ్చిన చొరబాటుదార్లను వెనక్కి పంపించడం కూడ శాంతి నెలకొల్పే ప్రక్రియలో భాగమే. దాని కోసం మన సైనికులు వారితో యుద్ధం చేయక తప్పదు. విధి నిర్వహణలో సైనికులు ఎదుర్కొనే ప్రాణాపాయానికి సానుభూతి చూపించగలం. చనిపోతే ఆ చావును గౌరవించగలం. కానీ ఆ గౌరవం నిజమైన గౌరవమయినట్టయితే నిరర్థకమైన ఆ చావులను ఆపే మార్గం మీద దృష్టి పెట్టాలి. ఆ చావులను నిరర్థకమైన, అవాంఛనీయమైన ప్రాణనష్టంగా కాక ఆత్మ బలిదానంగానూ, వీర మరణంగానూ చూడడం వల్ల అందుకు భిన్నమైన అభిప్రాయం – అంటే యుద్ధం మరింతగా జరగాలనీ, మరిన్ని 'విజయాలు' సాధించి పాకిస్తాన్‌ను చిత్తు చిత్తు చేసేయాలనీ మనకు చెప్తుంది. ఈసారి పాకిస్తాన్‌కు శాశ్వతంగా బుద్ధి చెప్పాలనీ, పనిలో పనిగా సరిహద్దు రేఖను దాటి పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి ఆక్రమించుకోవాలనీ చాలామంది అదుపుతప్పి మాట్లాడుతున్న మాటలకు బలం ప్రసార సాధనాలు యుద్ధాన్ని వర్ణించడానికి ఉపయోగిస్తున్న మాటల నుంచి, చేస్తున్న వ్యాఖ్యల నుంచి లభిస్తున్నది.

చాలామందికి అర్థంకాని విషయం ఏమిటంటే, వాస్తవాధీనరేఖను దాటి చొరబాటుదార్లను పంపిస్తున్న పాకిస్తాన్‌ను ప్రపంచంలోని అనేక దేశాలు విమర్శిస్తున్నది కేవలం ఆ మేరకు మాత్రమే. వాళ్ళు భారత్‌తో ఏకీభవిస్తున్నది కూడ కేవలం ఆ మేరకు మాత్రమే. కశ్మీర్ సమస్య పట్ల భారత్ అనుసరిస్తున్న వైఖరి పట్ల ప్రపంచ దేశాలలో సానుభూతి ఎంతమాత్రం లేదు కాబట్టి 'ఇదే అదను' అని మనం పాకిస్తాన్ భూభాగంలోకి ప్రవేశించి 'కశ్మీర్ సమస్య'ను బలప్రయోగంతో పరిష్కరించేసు కుందామంటే ప్రపంచ దేశాలలో చాలా వ్యతిరేకత వస్తుంది.

అదట్లా ఉంచి యుద్ధం పట్ల మనవాళ్ళు చాలామంది ప్రదర్శిస్తున్న ఉత్సాహం ఇతరత్రా కూడ చాలా నష్టకరమైనది. 1971 తరువాత వాస్తవాధీనరేఖను దాటడానికి పెద్దఎత్తున ప్రయత్నమెన్నడూ చేయని పాకిస్తాన్ ఇప్పుడు చేయడానికి కారణం

అణుబాంబు. సంప్రదాయక యుద్ధంలో భారత్‌కు తాను సరితూగనని పాకిస్తాన్‌కు చాలా కాలంగా తెలుసు. కానీ అణుబాంబు చేతిలోకి వచ్చిన తరువాత ఈ తూకాలకు అర్థం మారిపోతుంది. చిన్న దేశం కూడ పెద్ద విధ్వంసాన్ని సృష్టించగలదు కాబట్టి సంప్రదాయిక యుద్ధ సామర్థ్యంలో తనకంటే బలమైన దేశాన్ని సైతం భయపెట్టగలదు. ఈ పరిస్థితి ఇవ్వాళ రావడానికి కారణం మన పాలకులు చేపట్టిన అణ్వాయుధ పరీక్షలే.

కానీ ఈ పరిస్థితిలో యుద్ధంవైపు దేశాన్ని నెడితే అది చాలా నష్టానికి దారితీయగలదు. అణుబాంబు ప్రయోగించాలనే నిర్ణయం తీసుకోగల ఉన్మాదులు ఈ రెండు దేశాలలోనూ ఉన్నారు. పిచ్చాసుపత్రిలో కాదు, పదవులలో ఉన్నారు. వాళ్ళను కారణంగా చూపించి తన సైన్యంతో రంగంలోకి దిగి తన ప్రత్యక్ష పర్యవేక్షణలో 'శాంతి' నెలకొల్పడానికి అమెరికా రెడీగా ఉంది. ఇరాక్‌లోనూ, యుగోస్లావియాలోనూ ఈ 'శాంతి'యుతమైన పెత్తనాన్ని అమెరికా ఈ మధ్యనే రుచి చూసి ఉంది. యుద్ధం పట్ల మనవాళ్ళందరూ ప్రదర్శిస్తున్న ఉత్సాహం దానికి మార్గం సుగమం చేయగలదు.

కనీసం అందువల్లనైనా కొంచెం శాంతిద్దామా?

*ఆంధ్రప్రభ దినపత్రిక*

*8 జూలై 1999*

# యుద్ధం-శాంతి-ప్రజాస్వామ్యం

పాకిస్తాన్ కంటే భారతదేశంలో ప్రజాస్వామ్యం కొంచెం ఎక్కువే ఉందని మనం సంతోషిస్తే అర్థం ఉంది. కానీ 'కార్గిల్ యుద్ధం' సందర్భంగా ఈ రెండు దేశాల గురించి మన దగ్గర జరిగిన చర్చలో కొన్ని విచిత్రమైన వైరుధ్యాలు కనిపిస్తాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ వలన మన దేశం కొంత మెరుగ్గా ఉండడానికి లోతయిన రాజకీయ – చారిత్రక కారణాలున్నాయని గుర్తించకుండ, "మనం గొప్పవాళ్ళము కాబట్టి" మెరుగ్గా ఉన్నామన్న అభిప్రాయమొకటి మన దేశంలో విస్తృతంగా ప్రచారంలో ఉంది. ఇక్కడ 'మనం' అంటే హిందువులు. 'మనం' కాని వాళ్ళు ముస్లింలు అని వేరే చెప్పనవసరం లేదు.

వైరుధ్యమెక్కడుందంటే ఈ అభిప్రాయాన్ని బలంగా నమ్మేవాళ్ళకు అసలు ప్రజాస్వామ్యమంటే గౌరవం లేదు. వేరొక సందర్భంలో వాళ్ళే ప్రజాస్వామ్యాన్ని ఒక బలహీనతగా ఈసడించుకుంటారు. బలాన్ని ఆరాధించే 'దమ్ములు' లేనివాళ్ళే ప్రజాస్వామ్యాన్ని ప్రేమిస్తారని హేళనగా మాట్లాడతారు. కాని భారత – పాకిస్తాన్‌ల చర్చ వచ్చినప్పుడు హిందువుల గొప్పతనం వల్లనే భారత్‌లో ప్రజాస్వామ్యం ఈ మాత్రమైనా ఉందనీ, 'ముస్లిం' దేశమైన పాకిస్తాన్‌లో అది సాధ్యమయ్యేది కాదనీ అంటుంటారు.

లౌకికవాదం గురించి కూడ వీరికి ఇదే రకమైన అభిప్రాయం ఉంది. హిందువులు స్వతహాగా లౌకికవాదులు కాబట్టే భారత రాజ్యం లౌకికం కాగలిగిందని వీరు తరచుగా అంటుంటారు. అదే సమయంలో లౌకికవాదం విదేశీ భావన అనీ, విదేశీ మానసపుత్రులయిన ఉదారవాదులూ, వామపక్షవాదులూ దానిని దిగుమతి చేసుకొని ఈ దేశం మీద రుద్దుతున్నారనీ కూడ అంటుంటారు. తమకే గౌరవం లేని ప్రజాస్వామ్యమూ లౌకిక వాదమూ హిందువులకు సహజమని 'గర్వించడం'లో ఉన్న వైరుధ్యం బహుశా వీళ్ళకెప్పుడూ తోచదు. ఆధునిక కాలంలో లౌకిక ప్రజాస్వామ్య

రాజకీయ విలువలను నిలబెట్టడానికి ప్రయత్నించిన తొలి ఆసియా దేశం ముస్లింలు మెజారిటీగా ఉన్న టర్కీ అనే చారిత్రక వాస్తవం కూడ వీరికి అక్కరలేదు. 'ముస్లిం దేశం' అనే భావనకు సౌదీ అరేబియానూ పాకిస్తాన్‌నూ ఆఫ్ఘనిస్తాన్‌నూ మాత్రమే ఉదాహరణలుగా చూపించి టర్కీ, ఈజిప్ట్, అల్జీరియా, సిరియా, ఇండోనేషియా వంటి దేశాలు కనబరిచే వైవిధ్యాన్ని ఆ భావన నుండి వెలివేయడం వీరి వాదనకు అవసరం.

ఇదంతా ఇప్పుడెందుకు అవసరమంటే యుద్ధం 'విజయవంతం'గా ముగిసింది, ఇక శాంతిని కూడ విజయవంతంగా నిలబెట్టవలసి ఉంది. కానీ తమ మనసులలో ప్రజాస్వామ్యమంటే గౌరవం లేకపోవడమే కాక ఎదుటివారు ప్రజాస్వామ్యమంటే ఏమిటో తెలియని అనాగరికులన్న అహంభావం నిండిన వారు ఈ దేశంలో పెత్తనం చేస్తున్న తరుణంలో అది సాధ్యమా అన్న సహేతుకమైన సందేహం వస్తుంది.

యుద్ధం గురించి కూడ ప్రజాస్వామిక కోణమొకటి ఉంటుందనేది చర్చనీయాంశమయితే కావచ్చునుగానీ శాంతి ప్రజాస్వామికంగా మాత్రమే నెలకొనగలదు, నిలువగలదు అనే విషయంలో సందేహానికి పెద్దగా ఆస్కారం ఉంటుందనుకోను. కానీ ప్రజాస్వామ్యమంటే ప్రాథమికంగా గౌరవం లేనివాళ్ళు, అదే సమయంలో తమకు గౌరవం లేని ప్రజాస్వామ్యం పాకిస్తాన్‌కు సాధ్యం కాదన్న చులకన భావం గల వాళ్ళు అధికారంలో ఉన్నా లేకున్నా 'ప్రజాభిప్రాయం' అని పిలవబడే దాన్ని శాసించే స్థితిలో ఉన్న వాళ్ళు శాంతికోసం ప్రజాస్వామికంగా కృషి చేయగలరా? దానికి ఎదుటి వాళ్ళంటే గౌరవం ఉండాలి. ప్రజాస్వామ్యమంటే గౌరవం ఉండాలి. కాని రెండూ లేని వాళ్ళు ఈ దేశాన్ని భౌతికంగానే కాక మానసికంగా, తాత్వికంగా కూడ ఏలుతున్నారు.

ఎంతో ప్రజాస్వామికంగా వ్యవహరిస్తే తప్ప మనం తట్టుకోలేని సమస్య ఒకటి మనకు త్వరలోనే రావచ్చు. యుద్ధంలో గెలిచేసామని మనవాళ్ళు కేరింతలు కొడుతున్నారు గానీ చివరి విజయహాసం (ది లాస్ట్ లాఫ్ అని ఇంగ్లీషులో అంటారు) పాకిస్తాన్‌దే కావచ్చు. మనం పదే పదే పాకిస్తాన్‌కు గుర్తు చేస్తున్న సిమ్లా ఒప్పందానికి విరుద్ధంగా మనం 1980లలో సియాచిన్ పైకి ఎక్కి స్థావరం ఏర్పరచుకున్నామని పాకిస్తాన్ 15 సంవత్సరాలుగా ఫిర్యాదు చేస్తున్నా ప్రపంచంలో ఎవరూ పట్టించుకోలేదు. సిమ్లా ఒప్పందలో భాగంగా ఇరుదేశాల ప్రతినిధులూ సంతకం చేసిన చిత్రపటాలలో బటాలిక్ దాకా వాస్తవాధీన రేఖ ఉందన్న విషయం స్పష్టంగా ఉందని మనవాళ్ళు వాదిస్తున్నారు. ఇప్పుడు ద్రాస్ నుండి బటాలిక్ దాకా పాకిస్తాన్ దానిని అతిక్రమించిందని

ఆరోపిస్తున్నారు. కానీ అవే చిత్రపటాలు సియాచిన్ ప్రాంతంలో ఆనాడు ఎవరి సైన్యమూ లేదని చూపుతాయి. ఎవరికీ చెందని ఆ శూన్య భూభాగంలోకి పాకిస్తాన్ ప్రవేశిస్తుందేమోనని భయపడి మనం 1984లో ప్రవేశించాము. విపరీతమైన ధన ప్రాణ నష్టంతో ప్రపంచంలోనే అతి ఎత్తయిన యుద్ధ స్థావరాన్ని నెలకొల్పి నిర్వహిస్తున్నాము.

ఇప్పుడు మన మాట మన్నించి ప్రపంచ దేశాలు పాకిస్తాన్‌ను వాస్తవాధీన రేఖ నుండి వెనక్కి పొమ్మన్నాయి. కాబట్టి తన మాట అదే విధంగా మన్నించి మనల్ని సియాచిన్ నుండి దిగిపొమ్మని ఒత్తిడి పెట్టాలని పాకిస్తాన్ ఆశిస్తున్నది. రాబోయే రోజులలో దీని కోసం ప్రయత్నం చేస్తుంది. ఈ ప్రయత్నంలో ఒకవేళ పాకిస్తాన్ విజయం సాధిస్తే అంతా ముగిసిన తరువాత పాకిస్తాన్ ఎక్కడ ఉన్నది అక్కడే ఉంటుంది. కాని మనం మాత్రం సియాచిన్ నుండి కిందికి దిగి ఉంటాము.

ఈ పరిస్థితి ఒకవేళ వస్తే విపరీతమైన ఉద్రేకంతో ప్రజలను రెచ్చగొట్టడానికి ఇక్కడ చాలామంది సిద్ధంగా ఉన్నారు. ఇంతటి ఉన్మాదులు పాకిస్తాన్‌లోనూ ఉన్నారు. అంటే రెండు దేశాలూ మరొక్కసారి యుద్ధం అంచుకు రాగలవు. అది జరగకుండా ఉండాలంటే రెండు దేశాలూ పరస్పర గౌరవంతో కూర్చొని, లాహోర్ స్ఫూర్తితో అనండి, సిమ్లా స్ఫూర్తితో అనండి ఏదో ఒక ద్వైపాక్షిక స్ఫూర్తితో వాస్తవాధీన రేఖ ఎక్కడుందో చర్చించుకొని ఒక స్థిరమైన నిర్ణయానికి వచ్చి భవిష్యత్తులో కశ్మీర్ భవిష్యత్తు కశ్మీరీలే నిర్ణయించుకునే రోజు వచ్చేంత వరకు – దానికి కట్టుబడి ఉంటామన్న అంగీకారానికి రావడం అవసరం. ఇటువంటి ఏ చర్చలోనయినా కొంత ఇచ్చిపుచ్చుకోవడం అవసరం అవుతుంది. బహుశా పాకిస్తాన్ కార్గిల్ ప్రాంతంలో వాస్తవాధీన రేఖను గౌరవించడానికి మనం సియాచిన్ నుండి  కిందికి దిగి రావలసి ఉంటుందేమో. దానివల్ల ఇద్దరూ గౌరవించే వాస్తవాధీన రేఖ స్థిరపడేటట్టయితే అది మంచిదేననుకునే వాళ్ళు ఈ దేశంలో ఎంతమంది ఉన్నారు? విపరీతమైన చలిలో సియాచిన్ స్థావరాన్ని నిర్వహించడానికి డబ్బూ, సైనికుల ప్రాణాలూ అర్పిస్తూ పోవటం కంటే దానిని ఇరు దేశాలకు ప్రవేశం లేని శూన్య భూమిగా గుర్తించటం హేతుబద్ధమైన పరిష్కారమని ఒప్పుకోవడానికి ఎంతమంది సిద్ధంగా ఉన్నారు? ఈ రకమైన ఒప్పందం ఒకవేళ ఏ ప్రభుత్వమైనా చేసుకుంటే "సియాచిన్‌ను పాకిస్తాన్‌కు అప్పగించేసారు" అంటూ కృత్రిమ దేశభక్తిని రెచ్చగొట్టి సమాజం మీద తమ పెత్తనాన్ని మరింత బలపరచుకోవడానికి దానిని వాడుకోగల కాషాయ సేనలూ ఖాకీ నిక్కర్ల సేనలూ ఇక్కడ వీధి వీధికీ ఉన్నాయి.

పాకిస్తాన్‌కు ప్రజాస్వామ్యం చాలా దూరం అనే అహంభావపూరితమైన వైఖరి మనలో ఉండడం వలన ఆ దేశంతో మన పాలకులు ఎంత అప్రజాస్వామికంగా వ్యవహరించినా పట్టించుకునే వారెవరూ ఈ దేశంలో లేరు. మొన్నటి యుద్ధ సమయంలో మన దేశ టీవీ చానెల్స్‌ను గానీ పత్రికలను గానీ పాకిస్తాన్ నిషేధించలేదు గానీ మనం మాత్రం పాకిస్తాన్ అధికార టీవీ చానెల్ అయిన పీటీవీ పైననే కాక, 'డాన్' అనే పాకిస్తానీ దినపత్రికపైన కూడ నిషేధం పెట్టాము. పీటీవీ పూర్తిగా పాకిస్తాన్ ప్రభుత్వ బాకా అంటారేమో. ఆ మాట మన దూరదర్శన్ గురించి కూడ అనొచ్చు. అయితే సమస్య అది కాదు. దాని ప్రసారాన్ని భారతదేశంలో నిషేధించడం ఎందుకు? యుద్ధ సమయంలో ఎదుటివారు ఏమంటున్నారో తెలుసుకునే స్వేచ్ఛ భారత పౌరులకు ఎందుకుండకూడదు? (హైదరాబాద్ నగరంలోనయితే పీటీవీ ప్రసారంపైన నిషేధం యుద్ధంతో నిమిత్తం లేకుండా చాలాకాలంగా ఉంది.)

'డాన్'పైన నిషేధం ఇంకా ఆశ్చర్యం కలిగిస్తుంది. పాకిస్తాన్‌లోని రెండు ప్రధాన ఆంగ్ల దినపత్రికలలో 'ది నేషన్' నవాజ్ షరీఫ్‌కూ అతని పార్టీకీ చాలా సన్నిహితం. కాని 'డాన్' కొంత స్వతంత్ర దృక్పథంతో పాకిస్తాన్ పాలకులనూ మతతత్వవాదులనూ విమర్శించే పత్రిక. పాకిస్తాన్ ఒక ఆధునిక ప్రజాస్వామ్య దేశంగా ఎదగాలన్న దృక్కోణం ఆ పత్రికలో తరచుగా వ్యక్తం అవుతుంది. అందువల్ల 'ది నేషన్'కు లేని విశ్వసనీయత 'డాన్'కు ఉంది. అందువల్లేనా మనవాళ్ళు 'డాన్'పైన నిషేధం పెట్టింది? లేకపోతే పాకిస్తాన్ పాలకుల వైఖరిని వ్యక్తం చేసే పీటీవీ ప్రసారాలతో పాటు కొంత విశ్వసనీయతతో విమర్శనాత్మక వైఖరిని వ్యక్తం చేసే ఈ పత్రిక అమ్మకంపైన కూడ నిషేధం పెట్టడంలో గల భావం ఏమిటి? పాకిస్తానీ గొంతులేవీ ఇక్కడ వినపడొద్దనే కదా? భారత పౌరులు యుద్ధాన్ని గురించి మన పాలకుల అధికార సత్యాన్ని మాత్రమే వినాలనే కదా? యుద్ధ సమయంలో ఎదుటివారి గొంతును ఇంత సంపూర్ణంగా నొక్కేయాలని చూసినవారు శాంతి సమయంలో మాత్రం ఏ పాటి ప్రజాస్వామికంగా వ్యవహరిస్తారు?

*ప్రజాతంత్ర వారపత్రిక*

*5 జూలై 1999*

# మరో 'సైనిక' ముప్పు

అయూబ్‌ఖాన్, యాహ్యాఖాన్, జియా ఉల్ హక్, ఇప్పుడు పర్వేజ్ ముషార్రఫ్. మొన్నటి 17వ తేదీన పాకిస్తాన్‌లో జరిగిన ఘటన గతంలోనూ జరిగింది. ప్రతిసారీ, విచిత్రంగా, సైనికాధికారులు ప్రజాస్వామ్యాన్నీ ప్రజా ప్రయోజనాలనూ రాజకీయ నాయకుల నుండి కాపాడడం కోసమే తాము అధికారాన్ని హస్తగతం చేసుకున్నామని ప్రకటించారు.

నవాజ్ షరీఫ్ ప్రజాస్వామ్య సంస్థలతో ఆటలాడుకున్నాడనీ, వాటిని ధ్వంసం చేసాడనీ, పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ పతనం అంచున ఉందనీ పర్వేజ్ ముషార్రఫ్ అన్నాడు. రాజకీయ విభేదాలూ, వర్గ విభేదాలూ విడిచిపెట్టి పాకిస్తాన్ ప్రజలు 'సైనిక ఉన్నతాధికారిగా నువ్వు జోక్యం చేసుకోవాలి' అని తనపైన ఒత్తిడి పెడుతున్నారనీ, తాను ఈ విషయాన్ని నవాజ్ షరీఫ్ దృష్టికి తీసుకుపోయి జాగ్రత్తగా మసలుకొమ్మని హితవు చెప్పాననీ, అయినా అతనికి జ్ఞానోదయం కలగకపోవడంతో ఇంక జోక్యం చేసుకోక తప్పలేదని ముషార్రఫ్ అన్నాడు.

ఇది అబద్ధమని కొట్టిపారేయవలసిన అవసరం లేదు. ఎంత దిగజారిన ప్రజాస్వామ్యమయినా అత్యుత్తముడయిన నియంత పాలన కంటే కాంక్షనీయమనడంలో సందేహం అక్కరలేదు. ఎందుకంటే ప్రజాస్వామ్యాన్ని చక్కదిద్దే అవకాశం ఎంతో కొంత మేరకు ప్రజలకుంటుంది. నియంత తొలినాడు ఉత్తముడయినా అతను దిగజారితే ప్రజలేమీ చేయలేరు.

అయినప్పటికీ ప్రజాస్వామ్యాన్ని దిగజార్చిన నాయకుల నుండి పాకిస్తాన్ సమాజాన్ని కాపాడే రక్షకులుగా సైనికాధికారులు దశాబ్దానికొకసారి ముందుకు రావడం, ప్రజలు వారిని ఏదో ఒక మేరకు ఆదరించడం పాకిస్తాన్‌లో జరుగుతూనే ఉంది. భ్రష్టుపట్టిన పాకిస్తానీ సమాజాన్ని తమ 'క్రమశిక్షణాయుతమైన' పరిపాలనతో క్షాళన చేసి తిరిగి ప్రజాస్వామ్యానికి అప్పగించే సామాజిక వైద్యులుగా ఆ దేశ

సైనికాధికారులు తమను తాము భావించుకుంటారు. ప్రజలలోనూ ఆ భావనకు కొంత ఆమోదం ఉంది.

వాస్తవం ఇంత సుందరంగా ఉండదు. దిగజారుడుతనం రాజకీయ నాయకులలోనే కాదు, సైనికాధికారులలోనూ ఉండగలదు. పైగా రాజకీయ పార్టీలపైన, నాయకులపైన ప్రజల అదుపు ఏదో ఒక మేరకు ఉంటుంది. సైనిక పాలనపైన ఎటువంటి అదుపూ సాధ్యం కాదు. ఇది తెలిసినప్పటికీ రాజకీయ పార్టీల అవినీతినీ అధికార దుర్వినియోగాన్నీ చూసి విసిగిపోయిన ప్రజలు సైనిక పాలనలో దానికి విరుగుడు చూసుకోవడం కద్దు. మన దగ్గర కూడ ఆ కోరిక తరచు వినపడుతూ ఉంటుంది. అదృష్టవశాత్తు అది వాస్తవ రూపం తీసుకునే పరిస్థితులు భారతదేశంలో లేవు (ఇప్పటిదాకా).

సైనిక నియంతల పాలన ఎంత హానికరంగా ఉండగలదనడానికి పాకిస్తాన్‌ను గతంలో పరిపాలించిన యాహ్యాఖాన్, జియాఉల్‌హక్‌లను ఉదాహరణగా చూపించ వచ్చును. తూర్పు బెంగాల్ ప్రజల జాతీయ ఆకాంక్షలను యాహ్యాఖాన్ అర్థం చేసుకోలేక మూర్ఖ బలప్రయోగంతో ఆ సమస్యను పరిష్కరించాలని ప్రయత్నించడమే బంగ్లాదేశ్ ఆవిర్భావానికి దారితీసింది. పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్య సంప్రదాయాలు బలంగా అభివృద్ధి చెంది ఉంటే అది జరిగేది కాదు.

జియాఉల్‌హక్ అందరికంటే ఎక్కువకాలం పరిపాలించిన సైనిక నియంత. ప్రజల అభీష్టంతో నిమిత్తం లేకుండా అతను పాకిస్తాన్ రాజ్యాన్ని మత రాజ్యంగా మార్చే ప్రయత్నం చేసాడు. పాకిస్తాన్ ప్రజలెవ్వరికీ ఇది ఇష్టం లేదని కాదు. మతరాజ్యాన్ని ఆదరించినవారూ, కోరుకున్నవారూ అక్కడ చాలామందే ఉన్నారు. కానీ అది పాకిస్తాన్ సామాజిక జీవితంలో అత్యంత ప్రబలమైన రాజకీయ కాంక్ష అనడానికి ఆధారమేమీ లేదు. రకరకాల మతశక్తులు పాకిస్తానీ రాజకీయాలలో మొదటి నుండి చురుగ్గా పాల్గొంటున్నప్పటికీ ప్రజలు ఎక్కువ ఉత్సాహంగా స్పందించింది భుట్టో అందించిన 'రోటీ, కపడా ఔర్ మకాన్' (కూడు, గుడ్డ, నీడ) అన్న నినాదానికే. మన దేశ రాజకీయాలలో ఇందిరాగాంధీ 'గరీబీ హటావో' నినాదం లాంటిది పాకిస్తాన్ రాజకీయాలలో భుట్టో ఇచ్చిన ఈ నినాదం.

జియాఉల్‌హక్ ప్రవేశపెట్టిన మతరాజ్య భావన కాలక్రమంలో బలపడింది. దానిని గట్టిగా వ్యతిరేకించే ప్రయత్నం జరిగినప్పటికీ దానిని తిప్పికొట్టడానికి వారి బలం చాలలేదు.

ఇప్పుడు సైనిక పాలన స్థిరపడితే ఈ మతరాజ్య పోకడలు మరింత బలపడే ప్రమాదం ఉంది. ప్రమాదం అంటే మనకు ప్రమాదం అని కాదు. పాకిస్తాన్‌లో ఏం జరిగినా దాని ప్రభావం మన దేశం మీద ఏ విధంగా ఉంటుందో అని మాత్రమే ఆలోచించడం మనకు అలవాటయిపోయింది. అది న్యాయం కాదు. మనకు ప్రపంచంలోని వేరే ఏ దేశంకన్నా పాకిస్తానీలు అత్యంత సన్నిహితులు. మనం ఆ దేశంలో వచ్చే ఏ మార్పు గురించయినా ఆందోళన చెందవలసింది ఆ దేశం ప్రజలపైన అది ఏ రకమైన ప్రభావం వేస్తుందని.

ఇప్పుడు పాకిస్తాన్‌లో మతరాజకీయాలంటే అర్థం కేవలం ఎన్నికలలో ముస్లింలీగ్ ప్రభావం, జమాతె ఇస్లామీ ప్రభావం అని కాదు. పాకిస్తాన్ పరిస్థితి అంతకంటే కూడ బాగా దిగజారింది. సాయుధ మతరాజకీయ మిలిటెంట్లు ఆ దేశంలో ప్రతి గల్లీలో ఉన్నారు. సెక్యులర్ ఆలోచనలకు కేవలం రాజకీయ గండం కాదు, భౌతిక గండం కూడ తీవ్రంగా ఉంది.

ఇస్లాం పేరు మీద పనిచేసే మిలిటెంట్లే కాక ఇస్లాంలోని మత శాఖలయిన సున్నీ మిలిటెంట్లు, షియా మిలిటెంట్లు ప్రతి ఊరిలోనూ ఉన్నారు. వీరి పరస్పర సంహారం తీవ్రస్థాయిలో ఉంది. పాకిస్తాన్‌కున్న ముఖ్యమైన శాంతి భద్రతల సమస్యలలో ఇదొకటి.

పాకిస్తాన్ ఇస్లామిక్ తీవ్రవాదాన్ని ప్రోత్సహించడం పట్ల అమెరికా ఈ మధ్యకాలంలో కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నది గానీ పాకిస్తానీ సమాజం ఈ దిశలో పోవడానికి అమెరికాదే ప్రధాన బాధ్యత. ఆఫ్ఘనిస్తాన్‌ను సోవియట్ ప్రభావం నుండి బయటపడేయడానికి అమెరికా పనిగట్టుకొని ఆ దేశంలో ఇస్లామిక్ మిలిటెన్సీని ప్రోత్సహించింది. కమ్యూనిస్టు పార్టీ పాలనకు విరుగుడుగా మతతత్వాన్ని ఉపయోగించింది. ఆఫ్ఘనిస్తాన్‌లో సోవియట్ అనుకూల రాజ్యాన్ని కూలదోసిన ఇస్లామిక్ పోరాటకారులు ప్రధానంగా తర్ఫీదు పొందింది పాకిస్తాన్‌లో. అమెరికాకు తెలిసే ఇది జరిగింది, అమెరికా ప్రోత్సాహంతోనే ఇది జరిగింది. కాలక్రమంలో పాకిస్తాన్ 'ముజాహిదీన్'లను (ఇస్లామిక్ విముక్తి పోరాటకారులను) ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీ అయింది.

దీని వల్ల అమెరికా ప్రయోజనం నెరవేరింది గానీ పాకిస్తాన్ నాశనం అయింది. ఆ దేశంలో ఇప్పుడు రకరకాల సాయుధ బలగాలు ప్రజాజీవితాన్ని శాసిస్తున్నాయి.

అనేక మదరసాలు మిలిటెంట్ల తయారీకి కేంద్రాలయ్యాయి. ఆఫ్ఘనిస్తాన్‌లో ప్రస్తుతం రాజ్యమేలుతున్న తాలిబన్ సైతం ఇక్కడే తయారయింది. ఇప్పుడేమో తాలిబన్ ప్రభావం పాకిస్తాన్ సామాజిక జీవితంపైన మరీ ఎక్కువైపోయిందని ఆ దేశంలోని ప్రజాతంత్రవాదులు, లౌకికవాదులు మాత్రమే కాదు, మరీ తీవ్రవాదులు కాని సాధారణ మతవాదులు సహితం ఆందోళన చెందుతున్నారు.

కార్గిల్‌లో పాకిస్తాన్ చేసిన సాహసం – పెరిగిన ఈ మతవాదపు ఒత్తిడి ఫలితమేనని అందరికీ తెలుసును. ఆ సాహసానికి వ్యూహకర్త పర్వేజ్ ముషార్రఫ్. సాధారణ పౌరపాలనా బాధ్యతలు నిర్వహిస్తున్న వారికి ఈ సాహసం పెద్దగా రుచించి ఉండదు. ఎందుకంటే వాళ్ళు ఆ సాహసాన్ని పాశ్చాత్య దేశాలు ఏ విధంగా అర్థం చేసుకుంటాయో, దాని ఫలితం పాకిస్తానీ ఆర్థిక వ్యవస్థ పైన ఏ విధంగా ఉంటుందో, పాకిస్తానీ అంతర్జాతీయ 'డిప్లోమసీ' పైన ఏ విధంగా ఉంటుందో ఇత్యాది విషయాలన్నీ ఆలోచించక తప్పదు.

ఆ బరువు బాధ్యతలు లేని సైనిక అధినేత మాత్రమే ముజాహిదీన్‌లకు తుపాకులు ఇచ్చి కార్గిల్ సరిహద్దు దాటించి భారత్‌ను ఇబ్బంది పెట్టాలన్న ఆలోచన చేయగలుగుతాడు. ఆ విధంగా కశ్మీర్‌ను గెలుచుకోవడం సాధ్యపడుతుందని ముషార్రఫ్ సైతం భావించి ఉంటాడనుకోలేము. కానీ బాగా ఒత్తిడి పెట్టి ఇండియాను చర్చలకు లాగితే సియాచిన్ పై నుండి ఇండియా దిగిపోయేలాగ చేయవచ్చునని ఆశించాడు.

ఆ లోపలే అమెరికా ఆదేశాలకు తల ఒగ్గి నవాజ్ షరీఫ్ 'కార్గిల్ యుద్ధాన్ని' ముగించేయడం ముషార్రఫ్‌కు కోపం తెప్పించింది. అతనొక్కడికే కాదు, కార్గిల్ వ్యూహకర్తలయిన పాకిస్తానీ సైనికాధికారులందరికీ కోపం తెప్పించింది. పౌరప్రభుత్వం పనితీరు తమకు నచ్చనప్పుడు జోక్యం చేసుకొని కొన్నాళ్ళు పగ్గాలు తమ చేతిలోకి తీసుకొని పౌరపాలనను 'దారిలోకి' తెచ్చే సంప్రదాయమేదైతే యాభై ఏళ్ళుగా పాకిస్తాన్ సైన్యం పాటిస్తోందో దానిని అనుసరించి పర్వేజ్ ముషార్రఫ్, అతని తోటి సైనికాధికారులు రంగంలోకి దిగారు.

ముషార్రఫ్‌ను నవాజ్‌షరీఫ్ బర్తరఫ్ చేసినందుకు ప్రతీకారంగా ముషార్రఫ్ అతనిని తొలగించాడన్న అభిప్రాయం 12వ తేదీనాటి సంఘటనలను బట్టి కలుగుతుంది. కానీ అది విషయాన్ని తలకిందులుగా చూడడమేనని కొంచెం ఆలోచిస్తే అర్థం

అవుతుంది. పాకిస్తాన్‌లో పౌరప్రభుత్వాన్ని తొలగించి సైనిక పాలన నెలకొల్పే అవకాశం ఉందనీ, అది అవాంఛనీయమనీ అమెరికా ప్రభుత్వ ప్రతినిధి ఒకరు కొన్ని వారాల క్రితం అన్నారు. అది కేవలం గాలిమాట కాదని తరువాతి పరిణామాలను బట్టి అర్థం అవుతుంది. పాకిస్తానీ సైనిక నేతలు అటువంటి ఆలోచనలతో ఉండడం గమనించి దానిని నివారించడానికి నవాజ్ షరీఫ్ పర్వేజ్ ముషార్రఫ్ దేశంలో లేని సమయంలో అతనిని బర్తరఫ్ చేసి తనకు సన్నిహితంగా ఉన్న వ్యక్తిని ఆ స్థానంలో కూర్చోబెట్టాడు. ముషార్రఫ్ ఎక్కి వస్తున్న విమానాన్ని కరాచీలో దిగనీయకుండా దేశం బయట (బహుశా ఇండియాలో) దిగే ఏర్పాటు చేసాడు. ముషార్రఫ్‌ను అరెస్టుచేసి బంధించమని సింధ్ రాష్ట్ర ఐ.జిని ఆదేశించాడు.

అప్పటికే నవాజ్ షరీఫ్ నుండి పాకిస్తాన్‌ను కాపాడడానికి సమాయత్తమయి ఉన్న సైన్యం ఇంక ఆలస్యం చేయకుండా షరీఫ్ ఆటకట్టేసింది. తమ చర్యలకు కారణాలుగా చూపించడానికి వారికి ఒకటేమిటి అనేకం ఉన్నాయి. 'నవాజ్ షరీఫ్ సుప్రీంకోర్టు నుండి పత్రికా వ్యవస్థ దాకా అన్నిటితోనూ ఇష్టం వచ్చినట్టు ఆటలాడుకున్నాడు. తనకు నచ్చని న్యాయమూర్తులతో ఘర్షణకు దిగాడు. తన మనిషిని దేశ ప్రధాన న్యాయమూర్తిగా నియమించాడు. తనను విమర్శించే పత్రికలను మూసేయించాడు. సంపాదకులను అరెస్టు చేయించాడు. అలాంటి వ్యక్తి నుండి ప్రజాస్వామ్యాన్ని 'కాపాడడం' అవసరమే మరి! ఎటొచ్చీ కాపాడే వారెవరు, కాపాడే పద్ధతి ఏమిటి అన్నది ప్రశ్న.

సైనిక పాలన ఎక్కువకాలం ఉండబోదని, త్వరలోనే పౌరప్రభుత్వానికి అధికారం అప్పగిస్తామనీ పర్వేజ్ ముషార్రఫ్ అన్నాడు. పౌరప్రభుత్వాలను తొలగించి అధికారం హస్తగతం చేసుకున్న సైనిక అధికారులందరూ ఈ మాటే అంటారు. గతంలో అయూబ్‌ఖాన్ అన్నాడు. యాహ్యాఖాన్ అన్నాడు. జియాఉల్‌హక్ అన్నాడు. కాబట్టి అప్పగించేంతవరకు చెప్పలేం.

ఒకవేళ 'అంతర్జాతీయ ఒత్తిడి' అని పిలవబడే అమెరికా ఒత్తిడికి లొంగి పౌరప్రభుత్వానికి అధికారం అప్పగించినా అది ఎన్నికయిన ప్రభుత్వమే కావాలనేమీ లేదు, తాను ఏరి ఎంపిక చేసిన పౌరప్రభుత్వానికి అప్పగించవచ్చును. పర్వేజ్ ముషార్రఫ్ కనికరిస్తే అధికారం అందుకోడానికి పాకిస్తాన్ రాజకీయ ప్రముఖులు సిద్ధంగా ఉన్నారు. లండన్‌లో ఉన్న బెనజిర్ భుట్టో ఇప్పటికే సంకేతాలు పంపిస్తున్నారు.

వెనక్కిపోయి తన మీద, తన భర్త మీద ఉన్న కేసులన్నీ కొట్టేయించుకోవడానికి ఆమెకు ఇంతకంటే మంచి అవకాశం దొరకదు. ఇతర పాకిస్తానీ నాయకులు కూడ ముషార్రఫ్ కరుణ కోసం లైన్ కట్టారు.

నియంతలు, వారు ఎంపిక చేసిన వారు నీతిమంతులన్న నమ్మకమేమీ లేదు కాబట్టి ఎంత అవినీతిపరులయినా ప్రజలకు ఏదో ఒక మేరకు జవాబుదారులయిన ఎన్నుకోబడ్డ ప్రజాప్రతినిధుల పాలనే మేలు. వీళ్ళు కనీసం శాశ్వతంగా కుర్చీలు ఆక్రమించుకొని కూర్చోలేరు. అయిదేళ్ళ కొకసారి కుర్చీ దిగి రావాల్సి ఉంటుంది.

కానీ పాకిస్తాన్ ఇవాళ ఉన్న పరిస్థితిలో దండం చేతపట్టుకున్న వాడే తగిన పాలకుడన్న అభిప్రాయం ప్రజలలో గట్టిగా ఉండే అవకాశం ఉంది. మతం పేరిట ఏర్పడిన పాకిస్తాన్‌ను మతం సమైక్యంగా ఉంచలేకపోయింది. మతాన్ని దాటి వేరే భూమికను ఆవిష్కరించుకోనూ లేకపోయింది. పంజాబీ పెత్తనం పట్ల సర్వత్రా నిరసన, ప్రస్తుత భారత భూభాగం నుండి వలస వచ్చిన మొహజిర్‌లకు, స్థానికులకు మధ్య ఘర్షణ, బలూచీ పుష్తూ వేర్పాటువాదం, సున్నీ షియా ఘర్షణలు, కశ్మీరీల అసంతృప్తి – ఇవి వేరే ఏ దేశంలోనూ లేని కొత్త సమస్యలు కాకపోవచ్చును గానీ ఆఫ్ఘనిస్తాన్ అంతర్యుద్ధంలో పాకిస్తాన్ తలదూర్చి తాలిబాన్ మిలిటెంట్లను తయారుచేసిన చారిత్రక ఘట్టం ఫలితంగా ఈ ఘర్షణలన్నీ సాయుధ రూపం తీసుకున్నాయి. పాకిస్తాన్‌లోని ప్రతి ఇంట్లోనూ కాకున్నా, ప్రతి రెండవ ఇంట్లోనూ ఆయుధాలుంటాయి. ఈ పరిస్థితి మొదటి నుండీ ఉన్నది కాదు. గడచిన దశాబ్దకాలంలో పెరిగింది. ఈ ఆయుధాలు రకరకాల అతివాదానికీ, పిడివాదానికీ ఆలంబనమయ్యాయి. దీని ఫలితంగా నెలకొన్న భయాందోళనలు సైనిక పాలనే తగునన్న అభిప్రాయానికి సులభంగా తావియ్యగలవు.

ఇది చాలా దురదృష్టకరం. సమస్యలు తీవ్రస్థాయిలో ఉన్నాయి కాబట్టి స్వేచ్ఛకు కొన్నాళ్ళు సెలవు ఇద్దామన్నది తరచుగా వినిపించే అభిప్రాయమయినప్పటికీ చాలా తప్పుడు అభిప్రాయం. సమస్యలు తీవ్రస్థాయిలో ఉన్నప్పుడే స్వేచ్ఛ మరింత అవశ్యం. సమస్యల పరిష్కారానికి అవసరం. సమస్యల, సంక్షోభాల తీవ్రత పేరు చెప్పి అధికారం చేజిక్కించుకున్న సైనిక నియంతలు పరిష్కరించిన సమస్య ఒక్కటి కూడ సమకాలీన చరిత్రలో కనిపించదు. చాలా ఏళ్ళుగా బర్మా (మయన్మార్)ను ఏలుతున్న సైనిక పాలకులను ఇందుకు ఉదాహరణగా తీసుకోవచ్చు. రాజకీయ కార్యాచరణకూ,

సంవాదానికీ స్వేచ్ఛ ఇచ్చే ప్రజాస్వామ్యమే ఏ మేరకైనా పరిష్కరించగలుగుతుంది. అప్పటికీ పరిష్కారం కాకపోతే దానికి వేరే కారణాలు ఉండవచ్చు.

ఇవ్వాళ చాలామంది పాకిస్తానీలు ఆందోళన చెందుతున్నది ఆ దేశ ఆర్థిక పరిస్థితి గురించి. పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ దివాలా తీయడానికి సిద్ధంగా ఉందని ఆ దేశ నాయకులు బాహాటంగానే అంటున్నారు. పాకిస్తాన్‌ది మొదటినుండి కూడ మన కంటే పరాధీనమైన వ్యవస్థ. ప్రస్తుత 'గ్లోబలైజేషన్' వాతావరణంలో ఇది మరింత పెరిగింది.

పేదరికం విషయంలో పాకిస్తాన్ మన కంటే రవ్వంత మెరుగే. బ్రిటిష్ వాళ్ళు అప్పటి అవిభక్త పంజాబు రాష్ట్రంలో సింధు ఉపనదులపైన తవ్విన నీటిపారుదల కాలవలు ఎక్కువగా పాకిస్తాన్‌కే పోయాయి. అయితే భూసంస్కరణల వంటి సంక్షేమ చర్యలు మన దగ్గర అమలయిన మేరకు కూడ పాకిస్తాన్‌లో అమలు కాలేదు. అందువల్ల ఆర్థిక అసమానతలు బహుశా మన కంటే ఎక్కువే. స్త్రీల హక్కుల విషయంలో ఛాందస ప్రభావం అనేక ముస్లిం దేశాల కంటే కూడ పాకిస్తాన్‌లో ఎక్కువ. పాకిస్తానీ సమాజంలో తుపాకులు విరివిగా దొరుకుతుండడంతో ఈ ఛాందసవాదాన్ని కాదని తమ కనీస స్వేచ్ఛను నిలబెట్టుకోవడానికి ప్రయత్నించిన స్త్రీలు తుపాకి తూటాలకు బలయిన సంఘటనలు అనేకం జరుగుతున్నాయి.

అసలే అంతంత మాత్రంగా ఉన్న ఆర్థిక వ్యవస్థకు రక్షణ వ్యయం ఒక పెద్ద భారం. పాకిస్తాన్‌కు భారతదేశంతో తప్ప వేరే ఏ దేశంతోనూ యుద్ధ ప్రమాదం లేదు. అయితే భారతదేశం రక్షణ మీద ఎంత ఖర్చుపెడితే అంత తాను కూడ ఖర్చు పెట్టాలంటే అది పాకిస్తాన్‌కు పెద్ద భారం. మన పాలకులు అణుబాంబు పేల్చినప్పుడు ఒక అమెరికా విలేఖరి ఇదే పర్వేజ్ ముషార్రఫ్‌ను 'ఇక మీరు కూడ బాంబు పేలుస్తారా?' అని అడిగితే 'పేల్చి ఏం చేయమంటారు? గడ్డి తిని బతకమంటారా?' అన్నాడు. భారత్‌తో వైరం పాకిస్తాన్‌ను ఆ స్థితికి నెడుతున్నది.

అయినప్పటికీ దాని నుండి బయటపడడం మన రాజకీయ పార్టీలకు సాధ్యం కానట్టే పాకిస్తానీలకూ కాదు. కశ్మీర్‌లో ఒక్క అంగుళం కూడ పాకిస్తాన్‌కు ఇవ్వం అని ప్రకటించడం భారత రాజకీయాలలో తప్పనిసరి ప్రతిజ్ఞ అయినట్టు, 'ఎప్పటికైనా కశ్మీర్‌ను భారత్ నుండి విముక్తం చేస్తాం' అని పదే పదే ప్రకటించడం పాకిస్తాన్

రాజకీయాలలో తప్పనిసరి. మన దేశంలో కశ్మీర్‌కు చాలా దూరం ఉన్న ప్రాంతాలున్నాయి కాబట్టి కశ్మీర్ ప్రాముఖ్యం మన దగ్గర కొంత తక్కువ ఉంటుంది కాని పాకిస్తాన్‌లో అట్లా కాదు.

కశ్మీర్‌ను ఒకరి బారి నుండి ఒకరు 'రక్షించడం', 'విముక్తి చేయడం' అనేవి అర్థంలేని మాటలనీ, తమకు ఏం కావాలో కశ్మీరీలు నిర్ణయించుకుంటారనీ ఈ రెండు దేశాలూ ఒప్పుకోగలిగిన నాడు నిరర్థకమైన ఈ కొట్లాట నిలిచిపోతుంది. అది ఈ రెండు దేశాలకూ – ముఖ్యంగా చిన్న దేశమైన పాకిస్తాన్‌కు చాలా మేలు చేస్తుంది. కానీ ఆ రోజు దగ్గర్లో లేదు. ఈ లోపల మన దేశ రాజకీయాలలో హిందూత్వవాదుల ప్రాబల్యం పెరగడం, పాకిస్తాన్‌లో సైనిక పాలన నెలకొనడం ఆ సుదినాన్ని మరింత దూరం చేయగలదు.

మన దేశంలో చాలామంది పాకిస్తాన్‌లో నెలకొన్న సైనిక పెత్తనాన్ని మన (అంటే భారతరాజ్యం) ప్రయోజనాలకు అనుకూలంగా ఏ విధంగా మలచుకోవచ్చును అన్న కోణం నుండి చూడబోతారు. మనం ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టుకోగలిగిన విజ్ఞులుగానూ, పాకిస్తానీలు ఆది చేతకానివారుగానూ కనిపించడం అంతర్జాతీయ రంగంలో మన ప్రతిష్ఠను పెంచుతుందని సంతోషిస్తారు. దీని వల్ల కశ్మీర్ విషయంలో మన వాదన బలపడుతుందని ఆశిస్తారు. సైనిక పాలన కారణంగా ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ మొదలయిన ఆర్థిక, ద్రవ్య సంస్థలు పాకిస్తాన్‌పైన ఒత్తిడి పెంచబోతాయనీ, ఆ ఒత్తిడికి తట్టుకోలేక, ప్రజాస్వామ్య ప్రక్రియను పునరుద్ధరించనూ లేక పాకిస్తాన్ బలహీనపడుతుందనీ ఆనందిస్తారు. ఇప్పటికే పత్రికల సంపాదకీయాల లోనూ, వార్తా వ్యాఖ్యలలోనూ ఈ ధ్వని వినవస్తున్నది.

కాని మనం తరచుగా ప్రకటించుకునే సంస్కృతి, నాగరికత మనలో నిజంగా ఉంటే మనం బాధపడవలసింది పాకిస్తానీల గురించి; హింస, సంక్షోభం, అణచివేతలకు నిలయమయిపోయిన పాకిస్తానీ సమాజాన్ని గురించి. ప్రజాస్వామ్య సంప్రదాయాలు కొంతమేరకయినా పాకిస్తాన్‌లో స్థిరపడి ఉంటే వీటికి కాలక్రమంలోనయినా పరిష్కారం దొరికేదేమో! కానీ పాకిస్తానీ రాజకీయాలు ప్రజాస్వామ్య రూపంలో ఉన్నప్పుడు సహితం ఆ ప్రజాస్వామ్యం అస్థిరంగానే ఉంటున్నది. పాలకపార్టీనీ, వ్యక్తులనూ వ్యతిరేకించే వారిపైన అణచివేత, ప్రజాస్వామ్య సంస్థలలో నిరంతర జోక్యం, ప్రజలకు రాజకీయ హక్కుల నిరాకరణ అక్కడ నిత్యజీవిత వాస్తవాలుగా ఉన్నాయి.

ఇప్పుడు ఆ మాత్రం ప్రజాస్వామ్య రూపం కూడ లేకుండా సైనిక పాలన నెలకొనింది. పాశ్చాత్య దేశాల ఒత్తిడి వల్ల గానీ వేరే ఏ కారణంగా గానీ సైన్యం తాను చేజిక్కించుకున్న అధికారాన్ని పౌరప్రభుత్వానికి ఒకవేళ రేపోమాపో అప్పగించినా అది సైన్యం ఎంపిక చేసిన పౌరప్రభుత్వం మాత్రమే అవుతుంది. ప్రజలు ఎన్నుకున్నది కాదు.

ఈ పరిస్థితి వల్ల మనకేమైనా యుద్ధ ప్రమాదం పెరుగుతుందా అని ఆందోళన చెందేవారున్నారు. నిజానికి భారత్‌లో ఎక్కువ మంది మెదళ్ళలో ఉన్నది ఈ ప్రశ్నే. దీనికి స్పష్టంగా జవాబు చెప్పడం కష్టం. కార్గిల్ ఓటమి వల్ల పాకిస్తానీ సైన్యం అవమానంతో రగిలిపోతున్నదనీ, ప్రతీకారం తీర్చుకునే ప్రయత్నం చేస్తుందనీ మన వాళ్ళు చాలామంది అంటున్నారు. అది నిజమే అనుకున్నా భారత సైన్యం, ప్రభుత్వం మొన్నటి వేసవి కంటే ఇప్పుడు చాలా అప్రమత్తంగా ఉన్నాయని వారికి తెలియకపోదు. అంతేకాక అవినీతిపరులు, అసమర్థులు అయిన రాజకీయ నాయకుల నుండి పాకిస్తాన్‌ను కాపాడి క్షాళన చేసే కర్తవ్యమేదయితే పర్వేజ్ ముషార్రఫ్ తన బాధ్యతగా ప్రకటించుకున్నాడో దానికే అతను ప్రాముఖ్యం ఇయ్యవచ్చు. ఒకవేళ యుద్ధం చేయాలన్న ఉబలాటం పెరిగినా దానికి కారణం వారి దుస్సాహసం అనే కంటే మన హిందూత్వవాద పాలకుల అణుబాంబు ప్రయోగం అనవలసి ఉంటుంది. మనం అణ్వస్త్ర ప్రయోగాన్ని చేపట్టి, వారికి కూడ దానిని తప్పనిసరి చేసి సైనిక సాహసాలు చేసే అవకాశాన్ని పెంచాము. దానికిప్పుడు వగచి ప్రయోజనం లేదు.

పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్య ప్రక్రియ బలపడడానికి ఏ మేరకు తోడ్పడగలిగితే ఆ మేరకు తోడ్పడడమే ఇప్పుడు మనం చేయగలిగింది, చేయవలసింది. మన స్వార్థం కోసం కాదు; మనకు సామాజికంగా, సాంస్కృతికంగా అతి సన్నిహితులైన ఆ పొరుగు ప్రజల శ్రేయస్సు కోసం. కాని పాకిస్తాన్ ఏ కష్టంలో ఇరుక్కొన్నా అది మనకు మేలని సంతోషించే శత్రు వాతావరణం బాగా పెరిగిన మన దేశంలో ఈ కోణం నుండి చూసే వారెందరు?

*సుప్రభాతం ప్రత్యేక సంచిక*
*23 అక్టోబర్ 1999*

# పాకిస్తాన్ మీద వేయడానికి ఏ రాయి అయితేనేం!

డర్బన్‌లో జరిగిన కామన్‌వెల్త్ సమావేశంలో భారత ప్రధానమంత్రి వ్యవహరించిన తీరు భారతీయ జనతాపార్టీని ప్రగాఢంగా అభిమానించే వారిని మినహాయించి తక్కిన వారందరికీ ఎంతో కొంత ఎబ్బెట్టుగా తోచక తప్పదు.

నేనంటున్నది పాకిస్తాన్ బహిష్కరణ విషయాన్ని గురించి. నిజమే. సైనిక పాలనలోకి పోయిన సభ్యదేశాలపైన ప్రజాస్వామ్య పునరుద్ధరణ గురించి ఒత్తిడి పెట్టడానికి బహిష్కరణ చర్యలు చేపట్టవచ్చునని కామన్‌వెల్త్ నియమాలలో ఉంది. కానీ దానిని ప్రయోగించే విషయంలో భారత ప్రభుత్వం ప్రదర్శించిన ఉత్సాహమే అభ్యంతరకరంగా ఉంది. ఈ ఉత్సాహానికి కారణం పాకిస్తానీల మీద ప్రేమ కాదు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరగడం వారికి మేలన్న సానుభూతి కూడ కాదు. అసలు మన పాలకులు పాకిస్తానీ రాజ్యాన్ని గురించి తప్ప ప్రజల గురించి ఆలోచించిన దాఖలాలేవీ లేవు కాబట్టి పాకిస్తానీ ప్రజల మీద ప్రేమతో కామన్వెల్త్ సమావేశంలో ఆ దేశ ప్రభుత్వాన్ని అల్లరి పెట్టారని నమ్మలేము.

పాకిస్తాన్‌ను రాజకీయంగా ఇబ్బంది పెట్టడానికి ఏ సాధనమైనా సరేననేది మన పాలకుల అభిప్రాయం. ఇదే 'భారతీయ సంస్కృతి' అయినట్టయితే దాని గొప్పదనాన్ని ఎవరైనా ప్రచారం చేసుకోవడం ఎందుకు? 1975లో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ పాలన విధించినప్పుడు ఏ అంతర్జాతీయ వేదిక నుండయినా భారత్‌ను బహిష్కరించాలని ఏ దేశమైనా ఒత్తిడి పెడితే మనం ఏమని అని ఉందుము? ప్రభుత్వం చేసిన తప్పిదానికి ప్రజలందరికీ నష్టం కలిగించే శిక్ష విధించవద్దని, ఒక క్లిష్ట సమయంలో దేశాన్ని వెలివేయడం సరైనది కాదని అని ఉందుము. కామన్‌వెల్త్‌లో

ఉండడం వల్ల ఏమొస్తుందనేది ఇక్కడ ప్రశ్న కాదు. అదొక అలంకారప్రాయమైన వేదికే కావచ్చు. కాని దాని నుండి పాకిస్తాన్‌ను వెలివేసి ఎవరిని ఉద్ధరించాలనుకుంటున్నా మనేది ప్రశ్న.

పాకిస్తానీ ప్రజలను ఆ దేశ ప్రభుత్వం నుంచి, రాజ్యం నుంచి వేరుచేసి చూసే అలవాటు మనలో ఎవ్వరికీ లేదు గాని ఉండి ఉంటే ఈ చర్యను పర్వేజ్ ముషార్రఫ్ మాత్రమే కాదు, పాకిస్తానీలందరూ తమను అవమానపరిచే చర్యగా భావిస్తారని గ్రహించి ఉందురు. 'మా కష్టాలేవో మేము పడతాము, వీళ్ళెవ్వరు మమ్మల్ని శాసించడానికి?' అనుకుంటారు.

కశ్మీర్ విషయంలో పాకిస్తాన్ మనపైన పెడుతున్న అభియోగంలో నైతికబలం ఉంది కాబట్టి, ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ పాకిస్తాన్ నైతిక అర్హతను కించపరచడం మన విదేశీ విధానంలో ఒక ముఖ్య అంశంగా ఉంది. ప్రత్యేకించి, మనది ప్రజాస్వామిక దేశమనీ, పాకిస్తాన్ ఇప్పటికింకా ప్రజాస్వామ్యాన్ని స్థిరంగా నిలబెట్టుకోలేకపోతున్న మతరాజ్యమనీ పాశ్చాత్యుల ఎదుట వాదించి మన 'ఇమేజ్'ను సాపేక్షంగా పెంచుకోవడం మన పాలకులకొక ముఖ్య కార్యక్రమంగా ఉంది. నవాజ్ షరీఫ్ ప్రభుత్వాన్ని పర్వేజ్ ముషార్రఫ్ బర్తరఫ్ చేసి సైనిక పాలన నెలకొల్పడం ఈ ప్రచారానికి పనికొచ్చింది. మన వాళ్ళు నిర్లజ్జగా దానిని వాడుకుంటున్నారు. డర్బన్‌లో వాజ్‌పేయి వ్యక్తపరచిన ఉత్సాహానికి అర్థం ఇదే తప్ప పాకిస్తానీలకు ప్రజాస్వామ్యం లేకపోవడం వల్ల ఏదో నష్టం జరిగిపోయిందన్న ఆవేదన కాదు. పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఒక తేదీ నిర్ణయించాలని మన వాళ్ళు చేసిన వాదనకు అర్థం అక్కడ ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరిగి ప్రజలు స్వేచ్ఛావాయువులు త్వరగా పీల్చుకోవాలని ఆరాటపడుతున్నారని కాదు. పాకిస్తానీ ప్రజల మీద మన పాలకులకు, మన దేశ ప్రజల మీద పాకిస్తానీ పాలకులకు అంత ప్రేమ ఉండి ఉంటే ఈ రెండు దేశాల మధ్య సంబంధాలు ఈ స్థితికి వచ్చి ఉండేవే కావు. కామన్‌వెల్త్ నిర్ణయించిన గడువు లోపల పాకిస్తాన్ సైనిక పాలకులు ఎన్నికలు జరపలేక మరొక్కసారి ప్రపంచ దేశాల ముందు అనాగరికులుగానూ, కశ్మీర్ ప్రజలకు భారత్ చేతిలో అన్యాయం జరిగిందని మాట్లాడే అర్హతలేని వారిగానూ కనిపించాలి. లేదా ఆ గడువును గౌరవించాలనే ఒత్తిడిలో మరిన్ని సమస్యలు కొనితెచ్చుకొని ప్రపంచదేశాల ముందు నవ్వులపాలు కావాలి. వాజ్‌పేయి ప్రభుత్వానికి

కావలసిందిదే. ఈ వాస్తవం డర్బన్‌లో సమావేశమయిన కామన్‌వెల్త్ దేశాల పాలకులకు అర్థం అయి ఉండదనుకోవడం పొరబాటు. బాగానే అర్థం అయి ఉంటుంది. వాళ్ళ కళ్ళలో మన నైతిక స్థాయి అందుకనుగుణంగా దిగజారి ఉంటుంది కూడ.

మనకున్నపాటి ప్రజాస్వామ్యమైనా పాకిస్తాన్‌లో స్థిరపడకపోవడం దురదృష్టకరమే. ఎంత చెడ్డా సైనిక పాలన కంటే ప్రజాస్వామ్యం మేలని ఇప్పుడందరూ అంటున్న మాటలతో విభేదమేమీ లేదు. పర్వేజ్ ముషార్రఫ్ ఎటువంటివాడో ఇప్పటికింకా మనకు తెలియదుగానీ నవాజ్ షరీఫ్ గురించి బాగానే తెలిసింది. అతని వ్యక్తిత్వంలోనూ నడవడికలోనూ ప్రజాతంత్రవాదులు మెచ్చుకోదగ్గ లక్షణాలేవీ లేవు. అతను సగటు భారతదేశ రాజకీయ నాయకుడి వంటి వాడని ఒక్క వాక్యంలో చెప్పుకుంటే సరిపోతుంది. అతను సుప్రీంకోర్టు నుండి పత్రికా రంగం దాకా అన్ని ప్రజాస్వామ్య వ్యవస్థలతోనూ చెలగాటమాడిన వైనం అందరికీ ఆందోళన కలిగించింది. అయినప్పటికీ అతని పాలన అంతం కావలసింది ఎన్నికల ద్వారానే తప్ప సైనిక పెత్తనం ద్వారా కాదు. ఎందుకంటే ఈ సైనిక పాలన ఆ మాత్రం కూడ ప్రజాస్వామ్య వ్యవస్థలనూ ప్రజల హక్కులనూ గౌరవించదు. దానిని తొలగించే మార్గమేదీ ప్రజల దగ్గర లేదు.

పాకిస్తానీ ప్రజల నిజమైన దురదృష్టమేమిటంటే ఎన్నికైన ప్రభుత్వాలు భరించ లేనంతగా దిగజారినప్పుడు పరిస్థితిని చక్కదిద్దే ఒక పెద్దమనిషిగా సైన్యానికి ఒక పాత్ర ఉందన్న అభిప్రాయానికి పాకిస్తానీ రాజ్యాంగంలో చోటు ఉండడమే కాక, సమాజంలోను చాలా ప్రాచుర్యం ఉండడం. మన దగ్గర కూడ ఈ రకమైన అభిప్రాయం తరచు వినబడుతూనే ఉంటుంది. 'ఈ దేశానికి మిలటరీ ప్రభుత్వమే సరయింది' అన్న అభిప్రాయం రాజకీయ చర్చలలో వ్యక్తమవుతుంటుంది. అదృష్టవశాత్తు అది వాస్తవరూపం తీసుకునే పరిస్థితులు ఇప్పటిదాకా దేశంలో లేవు. మన దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం తిరుగులేనంత బలంగా నిలబడిపోయిందని అనలేము గానీ, దిగజారిన రాజకీయాలకు ప్రత్యామ్నాయాన్ని ప్రజాస్వామ్యంలోనే వెతుక్కునే ఆలోచనారీతే బలంగా ఉందని చెప్పుకోవచ్చు.

పాకిస్తాన్‌లో ఈ మేరకు ప్రజాస్వామ్యం ఒక అలవాటుగా మారకపోవడం విచారకరమే. ఆ దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారం దొరకాలంటే ప్రజాస్వామ్యం బలపడడం అవసరం. ఆ లేమిని భారత రాజ్యం తన ప్రయోజనాల

కోసం పాకిస్తాన్ 'ఇమేజ్'ను దెబ్బతీయడానికి వాడుకునే వైఖరి విడిచిపెట్టి, దానిని మన తోటి వారయిన పాకిస్తానీల సమస్యగా అర్థం చేసుకుని ఆ దేశంలో ప్రజాస్వామ్యం మెరుగుపడడానికి మనమేదైనా కృషి చేయగలిగితే చేద్దాం.

ఇదే మన లక్ష్యం అయి ఉంటే కామన్‌వెల్త్ నుండి పాకిస్తాన్‌ను సస్పెండ్ చేయాలనిగానీ, పాకిస్తానీ సైనిక పాలకులను ఇబ్బందిపెట్టే రీతిలో ఎన్నికలకు కామన్‌వెల్త్ గడువు పెట్టాలనిగానీ డర్బన్‌లో పట్టుబట్టి ఉండము. దీనిని పాకిస్తానీ ప్రజలు తమ మేలు కోసం చేసిన అల్లరిగా భావించరు. ముషార్రఫ్‌ను వ్యతిరేకించే వారు సైతం దానిని తమ ఆత్మగౌరవంమీద దెబ్బగానే భావిస్తారు. ఆత్మగౌరవం దెబ్బతిన్న ప్రజలు సైనిక నియంతలనే మరింత ఆదరిస్తారు. వారు యుద్ధప్రతిభను ప్రదర్శించి దేశం కోల్పోయిన గౌరవాన్ని తిరిగి సంపాదిస్తారని ఆశిస్తారు.

యుగొస్లావియా నియంత మిలోసెవిచ్ విషయంలో ఇదే జరిగింది. అతనంటే ఇష్టంలేని వారు ఆ దేశంలో చాలామంది ఉన్నారు. అయితే అతనిని ఈ ప్రపంచంలోని ఏకైక దుర్మార్గుడిగా ప్రకటించి (అతను చాలా దుర్మార్గుడనడంలో సందేహమేమీ లేదు) పాశ్చాత్య దేశాలు అమెరికా నాయకత్వంలో ఒక్కటై అన్ని అంతర్జాతీయ నియమాలకూ విరుద్ధంగా యుగొస్లావియాపైన యుద్ధం ప్రకటించినప్పుడు మిలోసెవిచ్‌ను వ్యతిరేకించే యుగొస్లావియా ప్రజలు దానిని తమకు సహాయం చేసే చర్యగా భావించలేదు. యుగొస్లావియా పైన దాడిగానే భావించారు. మిలోసెవిచ్‌తో తమకున్న విభేదాలు మరిచిపోయి అతని వెనుక సమీకృతమయ్యారు. యుగొస్లావియాలో మిలోసెవిచ్ నియంతృత్వం పోయి ప్రజాస్వామ్యం నెలకొనే రోజు దగ్గర పడలేదు సరికదా, మరికొంత దూరమయింది.

ఇది పాశ్చాత్య పాలకులకు పెద్దగా బాధ కలిగించలేదు. ఎందుకంటే యుగొస్లావియాలో ప్రజాస్వామ్యాన్ని ఉద్ధరించడం వారి లక్ష్యం కాదు. వారు యుగొస్లావియా వంటి 'స్లావ్' దేశాలను పాశ్చాత్య దేశాలుగా కాక ప్రాచ్యదేశాలుగా చూస్తారు. ప్రాచ్యదేశాలు ప్రజాస్వామ్యానికీ, ఆధునిక నాగరికతకూ పనికి రావన్నది వారి అభిప్రాయం. వాళ్ళు యుగొస్లావియా పట్ల తమ ఎత్తుగడలు రూపొందించుకున్నది ఆ దేశంలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలన్న లక్ష్యంతో కాదు. ప్రజాస్వామ్యానికి కావలసిన అర్హతలు లేని అనాగరికులన్న తిరస్కారం యుగొస్లావియావాసుల పట్ల

వారికుందన్న విషయం మొన్నటి దాడులలో స్పష్టమయింది. ఇది యుగొస్లావియా లోపల మిలోసెవిచ్‌ను వ్యతిరేకించే వారికీ, ప్రజాస్వామ్యాన్ని కోరుకునే వారికీ బలం కల్పించే వైఖరి కాదు. వాళ్ళను మరింత బలహీనులను చేసే వైఖరి. అయినప్పటికీ యుగొస్లావియా పైన దాడులు ప్రజాస్వామ్య రక్షణ కోసం జరిగాయని చాలామంది అనగలగుతున్నారు, నమ్మగలుగుతున్నారంటే ప్రపంచ ప్రసార సాధనాలన్నీ ఒక్క గొంతుతో చేసే ప్రచారానికి ఎంత బలముంటుందో అర్థమవుతుంది.

పాకిస్తాన్ పట్ల మన పాలకుల వైఖరి కూడ అదే. ముషార్రఫ్ పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశాడని కాదు. పాకిస్తానీయులకు ప్రజాస్వామ్యం సాధ్యం కాదని మన వాళ్ళ అభిప్రాయం. ఆ విషయాన్ని మరొక్కసారి 'రుజువు' చేయడం మాత్రమే ముషార్రఫ్ చేసింది. ఆ సంగతి ప్రపంచం గ్రహించిందో లేదోనని దాని గురించి లేనిపోని అల్లరిచేసి ప్రపంచం దృష్టికి పాకిస్తానీ పరిణామాలను తీసుకువచ్చేట్టు చేయడం కోసమే వాజ్‌పేయి దర్బన్‌లో అంత గొడవ చేశాడు. 'పాకిస్తానీ ప్రజలారా మీకు ప్రజాస్వామ్యం సాధ్యం కాదు' అని వారిని చెంపదెబ్బ కొట్టడమే మన పాలకుల లక్ష్యం. అంతే తప్ప వారికి నిజంగా బలం కల్పించి ప్రజాస్వామ్య పునరుద్ధరణకు సహాయం చేయడం కాదు.

పాకిస్తాన్‌కు ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టుకోవడం చేతకాదనీ, మనకు మాత్రమే సాధ్యమనీ వారిని హీనంగా చూసే మన పాలకులకు నిజానికి ప్రజాస్వామ్యమంటే ఏమంత గౌరవం ఉన్న దాఖలాలు లేవు. అవకాశం లేక గానీ గడచిన ఏడెనిమిది సంవత్సరాల అస్థిరతలో తాము ముషార్రఫ్‌లు కావాలని వీళ్ళలో ఉవ్విళ్ళూరిన వారెందరో!

*ఆంధ్రప్రభ దినపత్రిక*

*26 నవంబరు 1999*

# కశ్మీర్ గురించి మనమైనా సత్యం మాట్లాడుదాం...

ఆగ్రా చర్చలు విఫలం కాగానే, వీళ్ళిప్పుడు తప్పు ఎవరి మీద పెడతారా అని కొంచెం ఉత్కంఠతో ఎదురు చూశామనే చెప్పాలి.

ఏవేవో ఊహించాము గానీ ముషార్రఫ్ ఉపాహార ప్రెస్ మీట్‌ను టీవీ తెరమీదికి అప్పటికప్పుడు (లైవ్) ఎక్కించడమే అనర్థానికి దారి తీసిందని తేల్చబోతారని మాత్రం ఊహించలేదు.

దాని బదులు రాహుకాలంలో కూర్చున్నామని అని వుంటే ఇంత ఆశ్చర్యం కలిగి ఉండేది కాదు.

శిఖరాగ్ర చర్చలకు కూర్చునే ముందు ఆ చర్చలలో ప్రస్తావనకు రాగల విషయాల గురించి బయట మాట్లాడొద్దన్న నియమాన్ని మనమైనా, వారైనా ఒక్క రోజయినా పాటించడం జరిగిందా? మే 23న వాజ్‌పేయి ముషార్రఫ్‌కు ఆహ్వానం పంపిన నాటి నుండి ఇరుదేశాల ప్రముఖులూ ప్రతి నిత్యం ప్రపంచానికంతా వినిపించేటట్టు నోరు పారేసుకుంటూనే ఉన్నారు.

'కశ్మీర్ గురించి మాట్లాడడానికి పోతున్నాను తప్ప నాకు ఇండియాలో వేరే పనేముంది?' అని ముషార్రఫ్ ప్రకటించాడు. 'ఆజాద్ కశ్మీర్ మాకెప్పుడిచ్చేస్తావని అడగడం తప్ప కశ్మీర్ గురించి వేరే మాట్లాడేదేమీ లేదు' అని జస్వంత్‌సింగ్ అన్నాడు. 'అమెరికా ఒత్తిడి వల్ల ఇండియా నన్ను పిలిచింది' అని ముషార్రఫ్ అనగా అతని వ్యాఖ్య బాధ్యతారహితమని మన వాళ్ళు అన్నారు. 'కశ్మీర్‌ను ఒక వివాదంగా భారత్ ఒప్పుకున్నట్టే'నని ముషార్రఫ్ అనగా 'సీమాంతర ఉగ్రవాదం గురించి నీతో మాట్లాడాలని రమ్మన్నామే తప్ప మేము ఏ వివాదాన్నీ అంగీకరించనిదే!' అని మన వాళ్ళన్నారు.

హోంమంత్రి అద్వానీ మధ్యలోఈ వూరు ఆ వూరు తిరుగుతూ 'ఆగ్రా చర్చల నుండి మరీ ఎక్కువ ఆశించవద్దు' అని ఎవరినో హెచ్చరిస్తూ ఉన్నాడు.

ఇదంతా చిన్న తెర మీదికి నిత్యం ఎక్కింది. చిన్న తెరపైన దర్శనమిచ్చే విశ్లేషకులూ వ్యాఖ్యాతలూ ఈ ప్రవచనాలను ఒకటికి నాలుగుసార్లు ముందుకూ వెనక్కీ తిప్పి చూసి వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యానాల వెనక లోతయిన అర్థాలను, 'హిడెన్ అజెండా'లను చూశారు.

ఇంత జరిగిన తరువాత ఆగ్రాలో ముషార్రఫ్ మాట్లాడిన నాలుగు మాటలే నష్టం చేశాయా? చర్చలకు ముందు మాట్లాడి మాట్లాడి చర్చలు సాధ్యం కాకుండా చేసుకున్నారు. ఇప్పుడు మళ్ళీ మాట్లాడి మాట్లాడి ఈసారి చర్చలకు కూర్చోవడమే అసాధ్యం చేసుకుంటున్నారు. మధ్యలో ముషార్రఫ్ పత్రికా సంపాదకులతో చెప్పిన నాలుగు విషయాలు చర్చలకు ముందు ప్రసారం కావడమే నష్టం చేసిందా?

ముషార్రఫ్ మాట్లాడాడని కాదు, అతని మాటలకు మన వాళ్ల దగ్గర జవాబు లేదని ఉక్రోషం. యాభై ఏళ్ళుగా భారత పాకిస్తాన్‌లది కశ్మీర్ విషయంలో తప్పుడు వైఖరే. అయితే తన తప్పుడు వైఖరిని సహేతుకమైన వ్యాఖ్యల ద్వారా వ్యక్తం చేయగల స్థితిలో పాకిస్తాన్ అధినేత ఉన్నాడు. మన వాళ్ళు ఆ స్థితిలో లేరని కడుపుమంట.

ముషార్రఫ్ మూడేమూడు విషయాలు చెప్తున్నాడు. భారతదేశంలో జమ్ముకశ్మీర్ విలీనం వివాదాంశం. ఆ వివాదం కశ్మీరీల మనోభీష్టం ప్రకారం పరిష్కారం కావాలి. ఇది పరిష్కారమైతే ఇక భారత్ పాకిస్తాన్‌ల మధ్య వేరే పెద్ద సమస్యలేవీ లేవు కాబట్టి దీని మీదనే చర్చలు ప్రధానంగా దృష్టి పెట్టాలి.

వీటికి మన వాళ్ళ దగ్గరున్న జవాబేమిటి? కశ్మీర్ విషయంలో వివాదమేదీ లేదనేది మొదటిది. వివాదం ఉంది మొర్రో అంటూ కశ్మీరీలే అంటున్నా, ఊరికే అనడమే కాక 45 లక్షల కశ్మీరీలలో 40 వేలమంది (అధికార లెక్కల ప్రకారమే) ఆ వివాదం పరిష్కారం కోసం గడచిన దశాబ్ద కాలంలో ప్రాణాలు అర్పించినా ఇప్పటికీ వివాదమేదీ లేదంటే ఎవరు నమ్మాలి?

వివాదమే లేదు కాబట్టి ఇంక కశ్మీరీల మనోభీష్టమెక్కడిది? కశ్మీరీలు 1956లోనే జమ్ముకశ్మీర్ శాశ్వతంగా భారత్‌లో భాగమని తమ రాష్ట్ర రాజ్యాంగంలోనే రాసేసుకోలేదా? ఆ తరువాత ప్రతి ఎన్నికలోనూ పాల్గొని తమ అభీష్టాన్ని భారత్ వైపు వ్యక్తం చేయడం

లేదా అనేది రెండవ విషయానికి మన పాలకుల జవాబు. జమ్ముకశ్మీర్ రాష్ట్ర రాజ్యాంగం భారత్‌కు అనుకూలంగా తయారు కావడం కోసమే షేక్ అబ్దుల్లాను 1953లో అరెస్ట్ చేసి ఏ నేర అభియోగమూ లేకుండా 15 సంవత్సరాలకు పైగా జైలులో పెట్టారనీ, ఆ తరువాత ఏ ఒక్క ఎన్నికా కశ్మీర్‌లో ప్రజాస్వామికంగా జరగలేదనీ జ్ఞాపకం చేసుకుంటే ఈ జవాబు విలువేమిటో అర్థమవుతుంది. అయినా వారి భూభాగం భవిష్యత్తు గురించి జరిగే చర్చకు ఆ ప్రజల మనోభీష్టమే ప్రమాణమనేది కనీస ప్రజాస్వామిక స్పృహ ఉన్న వారెవరయినా ఒప్పుకోక తప్పని విషయం.

ఇక మూడవ అభిప్రాయానికైతే మన దగ్గర ఏ జవాబూ లేదు. వర్తక వ్యాపారాల విషయంలో గానీ, నదీ జలాల విషయంలో గానీ రెండు దేశాల మధ్య తీవ్రమైన వివాదాలేవీ లేవు. కశ్మీర్ ఒక్కటే తీవ్రమైనది. మిగిలిన చిన్న చిన్న విషయాలలో ఒప్పందం కుదరక పోవడానికి కశ్మీర్ కారణంగా నెలకొన్న ద్వేషభావమే కారణం. కాబట్టి దాని గురించి మాట్లాడుకోవడమే సబబు.

భారత ప్రజలకు ఈ సంగతి తెలియకుండా భారత ప్రభుత్వమూ, ప్రసార సాధనాలూ జాగ్రత్తపడి ఉండవచ్చు గానీ మన పాలకులకు మాత్రం ఈ విషయాలు బాగానే తెలుసు. ముషార్రఫ్ అడిగిన ప్రశ్నలకు తమ దగ్గర జవాబులు లేవనీ తెలుసు. ఆ సంగతి అతని సంభాషణ టీవీలో చూసిన వారందరూ గ్రహించి ఉంటారని కూడ తెలుసు. అందుకే అంత ఉక్రోషం. వాజ్‌పేయి కూడ ముషార్రఫ్‌లాగ భారత్ వైఖరిని ప్రపంచం ముందు ఉంచకపోవడం 'మీడియా మేనేజ్‌మెంట్'లో మన వాళ్ళ వైఫల్యం అని అంటున్నారు. వైఫల్యం లేదు వల్లకాడూ లేదు. మన వాళ్ళ వైఖరి సహేతుకంగా వివరించగలిగినది కాదు కాబట్టే దానిని దాచిపెట్టుకున్నారు తప్ప వేరే కారణమేదీ లేదు.

దీని వల్ల జరుగుతున్న ఒక నష్టమేమిటంటే పైన చెప్పిన మేరకు పాకిస్తాన్ వైఖరి సహేతుకమే అయినప్పటికీ కొంచెం లోతుగా పోయి చూస్తే వారి వైఖరిలోనూ ప్రశ్నించవలసినవి చాలా ఉన్నాయని మనం అనలేకపోవడం. 'కశ్మీర్ వివాదం' స్వభావం ఏమిటి? ఆ రాష్ట్రం భారత్‌లో విలీనం కావడాన్ని పాకిస్తాన్ అంగీకరించకపోవడం వల్ల వివాదం వచ్చిందా, లేక కశ్మీరీ ప్రజల సమ్మతి పొందకపోవడం వల్ల వచ్చిందా? ఈ విషయాన్ని పాకిస్తాన్ స్పష్టం చేయదు.

కశ్మీరీ ప్రజల మనోభీష్టం ప్రకారం సమస్య పరిష్కారం కావాలన్నది పూర్తిగా సబబే కానీ ఆ మనోభీష్టానికి పాకిస్తాన్ అనుమతించే స్వేచ్ఛ ఏమిటి? ఇండియాలో చేరాలా లేక పాకిస్తాన్‌లో చేరాలా అని నిర్ణయించుకునే స్వేచ్ఛా, లేక ఈ రెండు దేశాలనూ కాదని స్వతంత్ర దేశంగా ఉండాలని కోరుకునే స్వేచ్ఛా? ఈ 'మూడవ ప్రత్యామ్నాయాన్ని' పాకిస్తాన్ ఎప్పుడూ ఒప్పుకోలేదు. మనం రెండవ ప్రత్యామ్నాయాన్ని సహితం ఒప్పుకోము. కాబట్టి కశ్మీరీలలో మెజారిటీ మూడవ ప్రత్యామ్నాయాన్నే కోరుకుంటున్నారని చెప్పడానికి మనకు నోరు లేదు. కశ్మీరీల ప్రతినిధులెవ్వరినీ చర్చలలో పాల్గొననివ్వమని మన వాళ్ళు మూర్ఖంగా పట్టుబట్టడం వల్ల పాకిస్తాన్ రెండవ ప్రత్యామ్నాయాన్ని కోరుకునే హురియత్ నేతలనే కశ్మీరీ ప్రజల ఏకైక ప్రతినిధులుగా చూస్తుంది తప్ప మూడవ ప్రత్యామ్నాయాన్ని కోరుకునే వారి ప్రాతినిధ్యాన్ని గురించి మాట్లాడదన్న విషయాన్ని ఎత్తి చూపడానికి కూడ మన వాళ్ళకు నోరు లేదు.

ఒకనాడు బంగ్లాదేశ్‌లో భారత్ 'ముక్తి బాహిని'కి సహాయం అందిచ్చినట్టే కశ్మీర్ పోరాటకారులకు తాము అందిస్తున్నామని పాకిస్తాన్ అనడం సబబేనని మన వాళ్ళు ఒప్పుకోరు కాబట్టి, ఆ పోరాటకారులు అదుపుతప్పి సాధారణ పౌరులనూ యాత్రికులనూ చంపినప్పుడు పాకిస్తాన్ ఏం చేస్తున్నదని నిలదీయలేరు. అంతా 'సీమాంతర ఉగ్రవాదమే' అయినప్పుడు సాధారణ పౌరులను చంపడానికీ, భారత సైనికులను చంపడానికీ మధ్య తేడా ఏముంటుంది? భారత ప్రభుత్వం ఎటూ వాస్తవిక ధోరణి అవలంబించలేదు. కానీ పౌరులమయిన మనమైనా అవలంబించలేమా? 'కశ్మీర్ వివాదాన్ని' భారత్ పాకిస్తాన్‌ల గట్టు తగాదాగా కాక కశ్మీరీల జాతి ఆకాంక్షగా చూడలేమా? దానిని భారత్ గుడ్డిగా చూడ నిరాకరిస్తున్న వైనాన్ని, పాకిస్తాన్ పాక్షికంగా వ్యాఖ్యానిస్తున్న వైనాన్ని విమర్శించలేమా?

*ప్రజాతంత్ర వారపత్రిక*

*5 ఆగస్టు 2001*

# యుద్ధమంటే మనకెంత ఇష్టం!

**చ**చ్చేది మనం కాకుంటే యుద్ధంమంటే మనకెంత ఇష్టమో!

వేరేవాళ్ళ చావులు టీవీ స్క్రీన్‌పైన చూసి దేశభక్తితో ఊగిపోయే అవకాశం కూడ టెక్నాలజీ పుణ్యాన ఇప్పుడొచ్చింది కాబట్టి యుద్ధమంటే మనకు మరింత ఇష్టం.

పాకిస్తాన్ మీద యుద్ధం ప్రకటించమని ఒకడంటే, పరోక్ష యుద్ధం చేయమని సలహా ఇచ్చేవాడు ఇంకొకడు. పరోక్ష యుద్ధం చేయాలంటే మన పురమాయింపు మీద పాకిస్తాన్ రాజ్యం పైన యుద్ధం చేసే పాకిస్తానీలు మనకు దొరకాలి. అటువంటి వాళ్ళెవరైనా వున్నారా అన్న సందేహం కూడ ఎవరికీ రావడం లేదు. పరోక్ష యుద్ధం చేసేద్దాం అంటున్నారు.

షబనా అజ్మీ మాజీ ఇమాం బుఖారీతో అన్నట్టు 'అంత ఇష్టంగా వుంటే నువ్వే పోయి యుద్ధం చేయరాదా' అని ఈ యుద్ధోత్సాహులతో అనవలసి వుంటుంది.

ప్రజలు ఇట్లాగుంటే అద్వానీ ముఖం సంతోషంతో ఎందుకు వెలిగిపోదు? ఆ ఖాకీ యోధుని ముఖం గత మూడు నెలలుగా చిరునవ్వు చిందని క్షణం లేదు. సెప్టెంబర్ 11 నుండి ఆయన భలే ఆనందంగా వున్నాడు. 'ప్రతీకారం' అంతర్జాతీయ చట్టంలో ఆమోదనీయమేనని అమెరికా రుజువు చేసింది అని ఆయన ఆనాడే ప్రకటించాడు. ముస్లింలను ద్వేషించడం అనాగరికం కాదని కూడ అమెరికా, ఇంగ్లండ్‌లు రుజువు చేసాయి. దేశ విభజనకు ముస్లింల పైన ప్రతీకారం తీర్చుకోవాలని ఖాకీ నిక్కరు తొడుక్కున్న నాటి నుండి ఉవ్విళ్ళూరుతున్న ఆ యోధుడికి అంతకంటే ఆనందం కలిగించే విషయం ఏముంటుంది?

స్వతంత్ర భారతదేశపు మొదటి యుద్ధ మంత్రి జార్జి ఫెర్నాండెజ్ ఆయనకు తోడయ్యాడు. ఫెర్నాండెజ్ ఒకప్పుడు వామపక్షవాది. ఇప్పుడీయనలో వామపక్ష భావాలేవీ మిగిలినట్టు లేవు గానీ, వామపక్షవాదులకు సహజమైన అధికార మోహం ఆయనలో

మెండుగా వుంది. లెఫ్టిస్టులు ప్రతిపక్షంలో వుంటే ఎంత మంచివాళ్ళో అధికారంలోకి వస్తే అంత ప్రమాదకారులు. వాళ్ళకు బల ప్రయోగంపైన వున్నంత నమ్మకం వేరే దేని మీదా వుండదు. అందుకే స్వతంత్ర భారతదేశపు మొదటి సోషలిస్టు రక్షణ మంత్రి మొదటి యుద్ధ మంత్రి అయ్యారు.

ఇద్దరూ కలిసి ఇప్పుడు యుద్ధం ఏ క్షణాన మొదలు పెడదామా అని ఆత్రుతతో వున్నారు. మోకాళ్ళే కాకుండా కళ్ళు కూడ సరిగ్గా పనిచేస్తున్నట్టు లేని ప్రధాన మంత్రి ఏ క్షణం గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఆ క్షణం యుద్ధం మొదలుపెట్టడానికి సిద్ధంగా వున్నారు. తెల్లబట్టల ఇండియా వాళ్ళకు వెన్నుదన్నుగా వుంది. వేరే వాళ్ళు మూల్యం చెల్లించే దేశభక్తి కంటే పసందయినది ఏముంటుంది?

అయితే "ఎంత కాలం చూస్తూ ఊరుకోవాలి?" అని ఆవేశపడబోతారు. పాకిస్తాన్ పనిగట్టుకొని ఇండియాను బలహీనపర్చడం కోసం విధ్వంసానికి పాల్పడుతున్నదనీ, ఇప్పటికే చాలా సహించామనీ, ఇంక సహించకూడదనీ మన దేశంలో చాలామంది అభిప్రాయం.

పాకిస్తాన్‌కు అటువంటి దురుద్దేశం లేనే లేదని సర్టిఫికెట్ ఇయ్యనవసరం లేదు గానీ ఇక్కడ కొన్ని విషయాలు చెప్పుకోవడం అవసరం. పాకిస్తాన్ దురుద్దేశం గురించి మనకున్న అభిప్రాయానికి మూలం మన పోలీసులూ, ఇంటెలిజెన్స్ యంత్రాంగమూ ఐఎస్‌ఐ గురించి తరచూ విడుదల చేస్తున్న ప్రకటనలు. అవి అన్నీ అబద్ధాలు కాకపోవచ్చు. అయితే మనం గాని పాకిస్తాన్ దినపత్రికలు చదివినట్టయితే ఆ దేశ 'ఇంటెలిజెన్స్ వర్గాలు' కూడ అంతే తరచుగా మన రీసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్ ('రా' అంటారు) మీద అభాండాలు వేస్తుంటాయని తెలుస్తుంది. కరాచీలో మొహజిర్‌ల సాయుధ చర్యల వెనుక, పాకిస్తాన్‌లోని భిన్న జాతులు, మతశాఖల మధ్య జరుగుతున్న హింసాత్మక పోరు వెనక 'రా' హస్తం వుందనే అభిప్రాయం పాకిస్తానీ పత్రికలలో నిత్యం వ్యక్తం అవుతుంటుంది. మనం ఐఎస్‌ఐ దుర్మార్గాన్ని విశ్వసించినంత ప్రగాఢంగా పాకిస్తానీలు 'రా' దుర్మార్గాన్ని విశ్వసిస్తారు. పాకిస్తాన్‌ను ఒకసారి సగానికి తెగనరికిన భారత్, ఇప్పుడు దానిని పూర్తిగా విచ్ఛిన్నం చేసే లక్ష్యం పెట్టుకుందని నమ్ముతారు. ఐఎస్‌ఐ మీద మనకున్న అనుమానంలాగే 'రా' మీద వాళ్ళకున్న అనుమానం కూడ పూర్తిగా అవాస్తవం కాకపోవచ్చు. అయితే అటువంటి అనుమానం ఆధారంగా వాళ్ళు మన మీద యుద్ధానికొస్తామంటే మనం ఏమనుకుంటాం?

పాకిస్తాన్ ప్రభుత్వం స్వయంగా డిసెంబర్ 13 నాటి దాడికి పాల్పడి వుండక పోవచ్చును గాని జైష్–ఇ–మహ్మద్ పాల్పడింది కదా, ఆ సంస్థకు కేంద్రం పాకిస్తానే కదా, ఆ సంస్థను అదుపు చేయలేని పాకిస్తాన్‌ను మనమెందుకు క్షమించాలి అనబోతారు.

ఇజ్రాయిల్ ఈ మధ్య అరాఫత్ విషయంలో అనుసరిస్తున్న వైఖరికీ, దీనికీ చాలా పోలిక వుందని గమనించాలి. హమస్‌ను అరాఫత్ అదుపు చేయలేకపోతున్నాడు కాబట్టి, హమస్ పాలస్తీనా భూభాగాన్ని స్థావరం చేసుకొని ఇజ్రాయిల్‌పైన దాడులకు పాల్పడుతున్నది కాబట్టి అరాఫత్‌కు 'బుద్ధి' చెప్పాలని ఇజ్రాయిల్ నిర్ణయించుకొని అతని నివాసం మీద దాడులు చేస్తున్నది. ఇజ్రాయిల్ చేసిన ఈ దాడులు అందరికీ మితిమీరిన అహంభావ ప్రదర్శనగానే కనిపించాయి.

జైష్–ఇ–మహ్మద్‌ను అదుపు చేయలేకపోయినందుకు మనం పాకిస్తాన్‌పైన యుద్ధానికి పోవడం అంతకంటే భిన్నమైన చర్య కాదు. ముషార్రఫ్‌లో వేరే ఎన్ని లోపాలయినా వుండవచ్చును గాక, అతను లష్కర్–ఇ–తోయిబా, జైష్–ఇ–మహ్మద్ వంటి సాయుధ మతవాద సంస్థలను అదుపు చేయడానికి కొంత ప్రయత్నం చేస్తున్న మాట వాస్తవం. ఇండియా కోసం కాదు, పాకిస్తాన్ కోసం చేస్తున్నాడు. (ఇండియా కోసమే అయితే చేసేవాడు కాదేమో!) అయితే పాకిస్తాన్‌లోని సాయుధ గుంపులపైన పాకిస్తాన్ ప్రభుత్వం అదుపు కోల్పోయి చాలా కాలం అయింది. అందులో కశ్మీర్ పోరాటంలో పాల్గొనే లష్కర్, జైష్ వంటి సంస్థలే కాక పాకిస్తాన్ సమాజాన్ని అల్లకల్లోలం చేస్తున్న సున్నీ, షియా మత శాఖల సాయుధ బృందాలున్నాయి. సింధీ, మొహజిర్, బలూచీ, పఖ్తూన్ జాతులను ప్రాతిపదిక చేసుకున్న సాయుధ సంస్థలున్నాయి. ఏ రాజకీయాలూ లేని వట్టి మాఫియా మూకలు వున్నాయి. ఇవన్నీ ఎక్కడికక్కడ సమాంతర రాజ్యాలు ఏర్పాటు చేసుకొని పాకిస్తాన్‌ను ఏలుతున్నాయనడంలో అతిశయోక్తి లేదు. తాను ఆ దేశానికి అధ్యక్షుడయిన తర్వాత వీరిని అదుపు చేయడానికి ముషార్రఫ్ కొన్ని ప్రయత్నాలు చేసాడు గానీ అవేవీ సాగలేదు. పైకి నియంతృత్వ రాజ్యంగా కనబడే పాకిస్తాన్ పాలనా వ్యవస్థకు నిజానికి ఆ దేశంలోని సాయుధ 'పౌరసమాజాల'ను పూర్తిగా అదుపు చేసే సత్తా లేదు. డిసెంబర్13 నాటి ఘటన మనల్ని ఎంతగా నిశ్చేష్టులను చేసిందో అంతగా ముషార్రఫ్‌ను కూడ గాభరా పెట్టి వుంటుంది.

పాకిస్తాన్‌లో పౌర సమాజం ఈ స్థితికి దిగజారడానికి ప్రధాన కారణం అమెరికా 1980లలో ఆఫ్ఘనిస్తాన్‌లో అనుసరించిన వ్యూహం అని వేరే చెప్పనవసరం లేదు.

రష్యాను ఎదుర్కొనడానికి అమెరికా ఆఫ్ఘనిస్తాన్‌లో 'జిహాదీ' గుంపుల చేత మత యుద్ధం నడిపించింది. వారి తర్ఫీదుకు క్షేత్రంగా పాకిస్తాన్‌ను వాడుకుంది. తాత్కాలిక ప్రయోజనాల కోసం పాకిస్తాన్ పాలకులు ఆనాడు అమెరికాకు సహకరించారు. ఫలితంగా తమకూ తమ పొరుగు దేశాలకూ హానికరంగా తయారయిన ఈ భస్మాసురులను ఇప్పుడు భరించక తప్పడం లేదు. దానికి వాళ్ళను యుద్ధంతోనో, పరోక్ష యుద్ధంతోనో శిక్షించడం న్యాయం కాదు. దానివల్ల ఒరిగేదేమీ లేదు. నిజానికి 'ప్రాక్టికల్'గా ఆలోచించినట్టయితే, ఇప్పుడు ఇండియా పాకిస్తాన్ మీద యుద్ధానికి పోతే అక్కడి సాయుధ మతోన్మాద శక్తులే బలపడతాయి. పాకిస్తాన్ ఉనికిని వారు మాత్రమే కాపాడగలరని సగటు పాకిస్తానీలు సహితం భావించే ప్రమాదం వుంది. అప్పుడు ప్రస్తుతం ఇరుదేశాల సమాజాలకూ బెడదగా వున్న జైష్, లష్కర్ వంటి సంస్థలు ముషార్రఫ్ స్థానంలో అందలం ఎక్కవచ్చు. అది మనకూ మంచిది కాదు, పాకిస్తాన్‌కూ మంచిది కాదు.

జైష్-ఇ-మహ్మద్ గానీ లష్కర్-ఇ-తోయిబా గానీ పార్లమెంట్ మీద దాడి చేయగల సంస్థలే గానీ నిజంగా చేసింది వారేననడానికి మన ప్రభుత్వం దగ్గర ఏపాటి ఆధారం వుందో తెలీదు. డిసెంబర్ 13 సందర్భంగా అరెస్టయిన వారిలో ఒక్కరూ పాకిస్తానీ కాదు. అందరూ భారత్‌లోని కశ్మీర్‌కు చెందినవారే. వాళ్ళొకవేళ జైష్-ఇ-మహ్మద్ సభ్యులయినా దానికి పాకిస్తాన్‌ను తప్పుపట్టలేము. చనిపోయిన వాళ్ళు ఎవరైనదీ ఇది రాసేనాటికి స్పష్టంగా తెలీదు. అన్ని వివరాలూ తెలిసిన తర్వాత వారి చర్యకు ప్రత్యక్షంగానో పరోక్షంగానో పాకిస్తాన్ సహాయం వుందని తెలిసినట్టయితే ఆ సమాచారం ఆధారంగా ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేయడమొక్కటే అంతర్జాతీయ చట్టంలో ఇండియా చేయదగ్గ పని. ఉడుకు రక్తపు మనుషులకు అది సంతృప్తినివ్వక పోవచ్చు. కాని మన దేశం లోపలున్న ఏదో ఒక గుంపు ఈ పని చేసి వుంటే ఏం చేద్దుము? ప్రభుత్వం వారి మీద ప్రతీకారం తీర్చుకోవాలని ఎవరూ అని వుండరు కదా? చట్టం ప్రకారం విచారించి శిక్షించాలనే అందురు కదా? అది ఫలితాన్ని ఇచ్చినా ఇయ్యకున్నా అదే సరైన మార్గమని అందరూ ఒప్పుకుందురు కదా? మరి పాకిస్తాన్ దగ్గరి కొచ్చేసరికి అంతర్జాతీయ చట్టం పనికి రానిదిగానో, ప్రతీకారమే సరయిన జవాబుగానో ఎందుకనిపిస్తుంది?

*ప్రజాతంత్ర వారపత్రిక*
*23 డిసెంబర్ 2001*

# మనకేం కావాలి?

ఇంతకూ మనకు పాకిస్తాన్ నుంచి ఏం కావాలి? ఇంకా సరిగ్గా ప్రశ్నించుకోవాలంటే, మనం డిసెంబర్ 13 నుండి ఏం పొందాలని కోరుకుంటున్నాం?

భారత భూభాగం మీద టెర్రరిజం శాశ్వతంగా అంతం కావాలని కోరుకుంటున్నామా?

అద్వానీ, ఫెర్నాండెజ్, వాజ్‌పేయిలు ఆ మాటే అంటున్నారు.

బుష్ కూడ సెప్టెంబర్ 11 తర్వాత అదే అన్నాడు. టెర్రరిజాన్ని అంతర్జాతీయంగా మట్టుబెట్టడానికే ఆఫ్ఘనిస్తాన్ పైన యుద్ధం చేస్తున్నానని చెప్పి మూడువేల మంది సాధారణ ఆఫ్ఘను పౌరులను చంపాడు. (ఇది నిజాయితీ గల పాశ్చాత్య జర్నలిస్టుల అంచనా.) చివరికి అంతర్జాతీయ టెర్రరిజాన్ని అంతం చేయడం సంగతి అటుంచి, దాని ప్రధాన ప్రతినిధి అని పిలువబడ్డ ఒసామా బిన్ లాడెన్‌ను గాని, అతని సంరక్షకుడైన ముల్లా ఒమర్‌ను గాని పట్టుకోకుండానే ఆఫ్ఘనిస్తాన్ నుండి వెళ్ళిపోవడానికి సిద్ధమవుతున్నాడు. వాళ్ళను పట్టుకోకపోయినా ఒకటి మాత్రం సాధించాడు. కాబుల్‌లో తనకు వ్యతిరేకమైన ప్రభుత్వాన్ని తొలగించి తనకు అనుకూలమైన ప్రభుత్వాన్ని కూర్చోబెట్టి పోతున్నాడు. రెండు ప్రభుత్వాలూ ప్రజలకు భయంకరమైనవే. కాని అమెరికాకు వ్యతిరేక టెర్రరిస్టులు పోయి అమెరికాకు అనుకూలమైన టెర్రరిస్టులు వచ్చారు.

మన వాళ్ళ కోరికలలోనూ అటువంటి 'హిడెన్ అజెండా' వుందా?

ఉందని స్పష్టమవుతూనే వుంది. అదేమిటంటే కశ్మీర్ సమస్యను పరిష్కరించేసుకోవటం. ఒక సమస్యను పరిష్కరించుకోవడానికీ, పరిష్కరించేసుకోడానికీ తేడా వుందని విజ్ఞులు గమనించగలరు. కశ్మీర్ సమస్యను పరిష్కరించుకోవడం మనకెప్పుడూ

ఇష్టం లేదు. పరిష్కరించేసుకునే అవకాశం మాత్రం ఎప్పుడు లభిస్తుందా అని చాలా కాలంగా ఎదురు చూస్తున్నాం. డిసెంబర్ 13 ఆ అవకాశం ఇచ్చింది.

పార్లమెంటు పైన దాడిని నేను తక్కువ చేయడం లేదు. మన పార్లమెంట్ ప్రజలకు ఏపాటి ప్రతినిధి అనేది ఇక్కడ ముఖ్యం కాదు. అది దేశ రాజకీయ వ్యవస్థకు చిహ్నం. దానిపైన దాడి మన దేశ రాజకీయ ఆత్మగౌరవంపైన దాడి. అది దేశ పాలకులకే కాదు, ప్రజలకు కూడ – భారత ప్రజాస్వామ్యం పనితీరు పట్ల చాలా విమర్శ వున్న వారికి కూడ – ఆగ్రహం తెప్పించడం సహజం.

అది సహజమనీ, దానిని ప్రపంచం గౌరవిస్తుందనీ మన పాలకులు గుర్తించి దాని నుంచి వీలైనంత ఎక్కువ ప్రయోజనం పొందాలని లెక్కలు వేయడమే అసహ్యం కలిగించే విషయం.

పాకిస్తాన్ పదేళ్ళుగా కశ్మీర్ పోరాటకారులకు తుపాకులు సరఫరా చేయడం చాలా ప్రాణాలు తీసి ఉండవచ్చు గానీ అది కశ్మీర్ సమస్యను రాజకీయంగా సజీవంగా వుంచింది. 'కశ్మీర్ సమస్య' అనేదొకటి వుందని ఒప్పుకొనడానికే ఇష్టపడని సంఘ్ పరివార్ పాలకులు సహితం దానికి గుర్తింపు ఇవ్వక తప్పలేదు. ముషార్రఫ్‌ను ఆగ్రాకు పిలవక తప్పలేదు. తాము బస్సెక్కి లాహోర్‌కు పోక తప్పలేదు.

అయితే పాకిస్తాన్ తమకు ఎప్పటికీ తుపాకులు ఇస్తుండాలనీ, పాకిస్తాన్‌లో తర్ఫీదు పొందిన సకల దేశాల జిహాదీలు వచ్చి తమ గడ్డ మీద చస్తుండాలనీ కశ్మీరీలు కోరుకోవడం లేదు. కోరుకోరు కూడ. వారి బలగాలలో తమ యువకులు చేరి చస్తూ వుండాలనైతే అసలే కోరుకోరు. కశ్మీరీలు స్వతహాగా హింసాభిలాషులు కారు. వారి చేతులలో కలష్నికోవ్ (ఎకె 47) కంటే కవితా సంపుటి సహజమైన వస్తువు. తుపాకుల మోత మధ్య జీలం నది ఒడ్డున చెట్టపట్టాలేసుకుని తిరిగే ప్రేమికుల జంటలను చూస్తే కశ్మీరీల నైజం బాగా అర్థం అవుతుంది.

అయినప్పటికీ తమ రాజకీయ అస్తిత్వాన్ని సజీవంగా వుంచుకోవడానికి నలభై ఏళ్ళుగా చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైన చేదు జ్ఞాపకాలు వాళ్ళను వదలవు, వదలలేవు. ఆ తర్వాత పాకిస్తాన్ ఇచ్చిన ఆయుధాల వల్లనే, పాకిస్తాన్ నుంచి వచ్చిన జిహాదీల వల్లనే ఆ అస్తిత్వానికి గుర్తింపు వచ్చిందని వారికి తెలుసు. పాకిస్తాన్ అంటే వారికి పెద్దగా ప్రేమ లేకపోయినా ఇందువల్ల గౌరవం వుంది. అయితే తమ స్వయం నిర్ణయ కాంక్షను భారత్ గౌరవిస్తుందన్న స్థిరమైన సూచన లభించిన క్షణం తుపాకులకూ

తూటాలకూ గుడ్‌బై చెప్పి సగౌరవమైన రాజకీయ పరిష్కారం వెతుక్కోవడానికి వారు సిద్ధంగా వున్నారు.

కాగా, వాళ్ళకు బయటి నుండి అందుతున్న సహాయం ఏ క్షణం ఆగిపోతే ఆ క్షణం తాను వారి రాజకీయ ఆకాంక్షలకు బలవంతంగా ఇస్తున్న గుర్తింపుకు గుడ్‌బై చెప్పి 1989కి ముందు కశ్మీర్ రాజకీయాలతో ఆటలాడుకున్నట్టు ఆడుకుంటూ కాలక్షేపం చేయాలని భారత ప్రభుత్వం ఎదురు చూస్తున్నది.

సెప్టెంబర్ 11, ఆ తర్వాత డిసెంబర్ 13తో ఈ మహదవకాశం లభించిందని భారత పాలకులు గుర్తించారు. ఈ సంగతి తొలినాడే గుర్తించినవాడు అద్వానీ. సెప్టెంబర్ 11 తర్వాత చరిత్ర ఏ మలుపులు తిరిగినా అది తన వ్యూహానికి అనుకూలంగానే వుంటుందని ఆ ఖాకీనిక్కరు యోధుడు ఆనాడే గ్రహించాడు. ఇంత గొప్ప అవకాశం చేతికందిన క్షణంలో తానే భారత హోంమంత్రిగా ఉండడం తన చిన్ననాటి ఖాకీ కలల పంటగా ఆ పెరటి యోధుడు భావించే వుంటాడు.

డిసెంబర్ 13 అటువంటి ఒక మలుపు. దానిని పూర్తి అవకాశంగా తీసుకుని అమెరికాను కొంచెం బెదిరించి, కొంచెం కాకా పట్టి, అంతర్జాతీయం చేయొద్దు చేయొద్దు అంటున్న విషయాన్ని పనిగట్టుకొని అమెరికా కాళ్ళ దగ్గర పడేసి, ఆ ప్రపంచ భాగ్య విధాత చేత పాకిస్తాన్ పైన ఒత్తిడి పెట్టించి, అది చాలనప్పుడు సైడ్ హీరో బ్లెయిర్ సహాయం అర్థించి – మొత్తానికి పాకిస్తాన్‌ను కశ్మీర్ వ్యవహారాల నుండి దూరం చేస్తే ఇంక చర్చలెందుకు, సంభాషణలెందుకు, ఒప్పందాలెందుకు?

ఇదీ ఇప్పుడు నడుస్తున్న రాజకీయం. ఏ దేవుడూ సృష్టించని ఈ ప్రపంచంలో న్యాయమే గెలిచి తీరుతుందన్న భరోసా ఏమీ లేదు కాబట్టి ఈ సిగ్గూ లజ్జా లేని రాజకీయ నీతి ఫలించగలదు. కశ్మీరీలు మరొక్కసారి ఓడిపోగలరు. కాని వారి మనసులలో ఇండియా అంటే ద్వేషం మాత్రం పెరుగుతుంది. ఇంకొక రోజు ఇంకొక రూపంలో ఈ పుండు బద్దలు కాదన్న గ్యారంటీ ఎవ్వరూ ఇవ్వలేరు. చరిత్రను బలవంతంగా తిరగరాయగలరు గానీ భవిష్యత్తునట్లా రాయలేరు కదా!

*ప్రజాతంత్ర వారపత్రిక*

*20 జనవరి 2002*

# భారత-పాకిస్తాన్ మైత్రి: స్పష్టత లేని వైఖరి

రాజకీయాలలో అబద్ధాలు మామూలే గానీ అంతర్జాతీయ రాజకీయాలు ఈ విషయంలో ఆంతరంగిక రాజకీయాల కన్నా మరీ అధ్వాన్నం. ఎందుకంటే పదవి కోసమో పార్టీ శ్రేయస్సు కోసమో అబద్ధం చెప్పటం తప్పనుకునే వారు సహితం దేశం కోసం అబద్ధం చెప్పటంలో తప్పేమీ లేదని భావిస్తారు. దానిని అబద్ధంగా గుర్తించడానికి సహితం చాలామంది సిద్ధపడరు. తెలుగుదేశం – కాంగ్రెస్ పార్టీల సంవాదాన్ని అబద్ధాల పంచాంగం అనినంత సులభంగా భారత్ – పాకిస్తాన్‌ల సంవాదం గురించి అనగలమా?

అనలేము గానీ వాస్తవానికది అబద్ధాల పంచాంగమే. మన పాలకులు ఒకేసారి పాకిస్తాన్ గురించి ఎన్ని నోళ్ళతో మాట్లాడుతున్నారో గమనించండి. అద్వానీ మన దేశం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు – ఒక్క కరువు సమస్యను మినహాయించి – పాకిస్తాన్ మీద నింద వేసి తిడుతుంటాడు. ఆయన అభిప్రాయాన్ని భారత ప్రభుత్వం అభిప్రాయమని భావించినట్లయితే భారత్ దృష్టిలో పాకిస్తాన్ ఒక భయంకరమైన కుట్రదారు, రాక్షసి అని భావించవలసి ఉంటుంది. నిన్నటికి నిన్న నకిలీ స్టాంపుల కుంభకోణంలో కూడ పాకిస్తాన్ హస్తం చూసేదాకా పోయాడాయన.

ఇక దేశ ప్రధాని మాటకొస్తే అన్ని విషయాల లాగే ఈ విషయంలోనూ ఆయనకు ఒక నిలకడయిన వైఖరి లేదు. 'సీమాంతర ఉగ్రవాదాన్ని' రెచ్చగొడుతున్న టెర్రరిస్టు దేశంగా ప్రపంచం చేత పాకిస్తాన్‌ను గుర్తింపచేయాలన్న ఆరాటం ఒక చివర, స్నేహ హస్తం మరొక చివర, మధ్యలో అప్పటి శ్రోతలను బట్టి రకరకాల అభిప్రాయాలు ఆయన నోటి నుండి వింటుంటాం. పాకిస్తాన్‌తో కశ్మీర్ సమస్యతో

సహా అన్నీ చర్చించడానికి సిద్ధమేనని ఇవ్వాళ అనగలడు, ఆ సంగతి మనం రేపు పత్రికలలో చదివి హర్షించే లోపల పాక్ ఆక్రమిత కశ్మీరును మనకు వెనక్కి ఇచ్చే విషయం తప్ప పాకిస్తాన్‌తో కశ్మీర్ గురించి మాట్లాడేది ఏమీ లేదని అనగలడు.

రక్షణ మంత్రి జార్జి ఫెర్నాండెజ్‌కు భారత పాకిస్తాన్‌లు రెండు దేశాలుగా, రెండు సమాజాలుగా కాక రెండు సైన్యాలుగా కనిపిస్తున్నాయి. ఆయన దానికి ఉచితమైన భాషే మాట్లాడతాడు. విదేశాంగ మంత్రి యశ్వంత్ సిన్హా కొంచెం అద్వానీలాగా, కొంచెం జార్జి ఫెర్నాండెజ్‌లాగా మాట్లాడుతుంటాడు.

వీటిలో దేనిని పాకిస్తాన్ పట్ల భారత్ వైఖరిగా భావించాలి? అసలు భారత్‌కు పాకిస్తాన్ పట్ల ఒక నిర్దిష్టమైన వైఖరి ఉందని భావించాలా?

నిజం చెప్పాలంటే మన దేశ నాయకులెవ్వరికీ పాకిస్తాన్‌తో సంబంధాలు మెరుగుపరచుకోవడం పట్ల చిత్తశుద్ధి లేదు. కశ్మీర్ విషయంలో పాకిస్తాన్ మనల్ని ఇబ్బంది పెట్టకుండా చూసుకోవడమొక్కటే మన నాయకులకు కావలసింది. అమెరికాను మంచి చేసుకొని కశ్మీర్ విషయంలో పాకిస్తాన్ చేతులూ, నోరు కట్టేస్తే ఇక ఆ పైన పాకిస్తాన్ అనే దేశమొకటి ఉందనే మరచిపోయి బతకొచ్చని వారి అభిప్రాయం. 'సెప్టెంబర్ 11' తరువాత ఈ అవకాశం పెరిగిందని గట్టిగా నమ్ముతున్న వారిలో అద్వానీ ముఖ్యుడు. ఆ గాలి ఇటు మళ్ళించి పాకిస్తాన్ బెడదను ఒక్కసారిగా వదిలించేసుకుందామని అతని ఉబలాటం. అద్వానీ ఒక్కడే బయటపడి మాట్లాడుతున్నాడు గానీ వారి ఖాకీ నిక్కరు వ్యాయామశాలల లోపలే కాక దానికి వెలుపల కూడ చాలామంది భారతీయుల వైఖరి ఇదే. పాకిస్తాన్‌తో స్నేహ సంబంధాలు వాటంతటవి విలువయినవంటే ఈ వైఖరి ఒప్పుకోదు. పోనీ శాంతి కోసం స్నేహ సంబంధాలు అవసరమంటే, బెదిరించి శాంతి నెలకొల్పడం అంతకంటే సులభమైన మార్గం కాదా అంటుంది. అణుబాంబు అందుకోసమే తయారు చేసుకున్నారు. దానిని చూసి పాకిస్తాన్ కూడ భయపడి కశ్మీర్ సంగతి మరిచిపోయి మనతో రాజీకొస్తుందని. మన అణు విస్ఫోటనానికి ప్రతిగా పాకిస్తాన్ కూడ అణు విస్ఫోటనం చేపట్టేసరికి ఈ ఆశ కుప్పకూలి పోయింది. ఇప్పుడు అణుబాంబు బదులు అమెరికాను చేతిలో పెట్టుకొని పాకిస్తాన్‌ను భయపెట్టాలని చూస్తున్నారు. అంతే తప్ప పాకిస్తాన్‌తో స్నేహ సంబంధాలు

నెలకొనాలన్న చిత్తశుద్ధి ఎవరిలోనూ లేదు. నిన్న మొన్న మన వాళ్ళు అమలు చేయడానికి ఒప్పుకున్న కాల్పుల విరమణ కూడ అమెరికాను మెప్పించే ఎత్తుగడలో భాగమే తప్ప వేరే ఏమీ కాదు.

వాజ్‌పేయి లాహోర్‌కు పోలేదా, ముషార్రఫ్‌ను ఆగ్రాకు పిలవలేదా అంటారేమో. పోయాడు, పిలిచాడు. అది వాజ్‌పేయి పాకిస్తాన్ పట్ల అనుసరిస్తున్న రెండు నాల్కల వైఖరిలో భాగం. తన పదవి ముగిసేలోగా పాకిస్తాన్‌తో సంబంధాలు మెరుగుపరచి 'చరిత్రలో నిలిచిపోవాలన్న' కాంక్ష వాజ్‌పేయిలో బలంగా ఉందన్న అభిప్రాయమొకటి విశ్లేషకులలో ఉంది. అందులో భాగంగా ఆ ప్రయత్నాన్ని అర్థం చేసుకున్నా తప్పు లేదు. అయితే దానిని అద్వానీ పనిగట్టుకొని చెడగొట్టాడనేది ఇప్పుడు బహిరంగ రహస్యం. కొంత సామరస్య పూరితమైన ఉమ్మడి ప్రకటన ఆగ్రాలో తయారయ్యే స్థితి వచ్చింది గానీ అద్వానీ అడ్డుపడడం వల్ల అది సాధ్యం కాలేదు. వాజ్‌పేయికి చరిత్రలో ఒక రకంగా 'నిలిచిపోవాలని' ఉన్నట్లే అద్వానీకి ఇంకొక రకంగా 'నిలిచిపోవాలని' ఉంది మరి!

అయితే లాహోర్, ఆగ్రా ప్రయత్నాలను పాకిస్తాన్ విశ్లేషకులు చూసిన తీరును పరిశీలిస్తే ఇది కూడ నిజానికి భారత్ పాకిస్తాన్ పట్ల ఎప్పుడూ అనుసరిస్తున్న వైఖరికి భిన్నం కాదని అర్థం అవుతుంది. మన వాళ్ళు అప్పట్లో పాకిస్తాన్ నుండి రాబట్టాలని చూసిన ప్రకటన ఏమిటి? కశ్మీర్‌ను పక్కనపెట్టి ఇతర సమస్యలు పరిష్కరించుకొనడానికి పాకిస్తాన్ సిద్ధమనే ప్రకటన రాబట్టాలని చూశారు. అయితే ముషార్రఫ్ పదే పదే అంటున్నట్లు కశ్మీర్ కాక వేరే ఏ సమస్యలున్నాయి భారత్-పాకిస్తాన్‌ల మధ్య? నదీజలాలు, వర్తక వాణిజ్యాలు మొదలైనవి ఎప్పుడైనా ఉండే సమస్యలే తప్ప అంత ఆర్భాటంగా శిఖరాగ్ర సమావేశం నిర్వహించుకోనిదే పరిష్కారం కానివేవీ కావు.

ఒకవేళ ఉన్నాయనే అనుకున్నా కశ్మీర్‌ను పక్కనపెట్టి వాటి గురించి మాట్లాడుకుందామన్న ప్రతిపాదన వెనుక కశ్మీర్ విషయంలో పాకిస్తాన్ బెడద వదిలించుకుందామన్న ఆరాటమే తప్ప వేరే సదుద్దేశమేమీ లేదన్న పాకిస్తాన్ విశ్లేషకుల వ్యాఖ్యను కొట్టిపారేయలేము. సులభంగా పరిష్కారం కాగల సమస్యలతో మొదలుపెట్టి చర్చలు ప్రారంభిస్తే, కష్టతరమైన కశ్మీర్ సమస్య పరిష్కారానికి కావలసిన స్నేహ వాతావరణం ఏర్పడుతుందని మన వాళ్ళు చాలా తెలివిగా సూచిస్తున్నారు గానీ అవన్నీ

పరిష్కారం అయిపోయిన తరువాత భారత్ కశ్మీర్ విషయం మరిచిపోయి ఇంటికి వెళ్ళిపోదన్న నమ్మకం ఏమిటని వారి వాదన.

కశ్మీర్ విషయం పాకిస్తాన్‌తో మాట్లాడడానికి భారత్ సిద్ధంగా లేదంటున్నారు సరే, మరి పాకిస్తాన్ మాత్రం సిద్ధంగా ఉందా అంటారేమో! చాలా కాలంపాటు పాకిస్తాన్ పాలకుల వైఖరీ ఇదే. అమెరికా చేయూతనిస్తే యుద్ధంచేసి కశ్మీర్ వివాదాన్ని పరిష్కరించుకోవాలని పాకిస్తాన్ చూసింది. అయితే 1971 'బంగ్లాదేశ్ యుద్ధం' తరవాత, బంగ్లాదేశ్ ఏర్పాటు తరవాత ఆ ఆలోచన బలహీనపడింది. 1989లో కశ్మీర్‌లో స్వయం నిర్ణయాధికార పోరాటం మొదలైన తరవాత పాకిస్తాన్‌కు మరొకసారి కశ్మీర్ వివాదాన్ని తనకు అనుకూలంగా పరిష్కరించుకునే అవకాశం లభించింది. ఒక పాకిస్తానీ మానవహక్కుల ఉద్యమకారుడు వ్యాఖ్యానించినట్టు, కశ్మీరీల స్వయం నిర్ణయాధికారం విషయంలో పాకిస్తాన్‌ది విచిత్రమైన వైఖరి. కశ్మీరీలకు పాకిస్తాన్‌ను కోరుకునే మేరకు మాత్రమే స్వయం నిర్ణయాధికారం ఉంటుంది. స్వతంత్రంగా బతకాలని కోరుకునే అధికారాన్ని పాకిస్తాన్ ఒప్పుకోదు.

ఏమయితేనేం కశ్మీరీల స్వయం నిర్ణయాధికార పోరాటానికి పాకిస్తాన్ చాలా సహాయం చేసింది. చేస్తున్నది. ఆ సహాయం లేకపోతే కశ్మీరీలు ఇప్పటిదాకా పోరాటం చేయగలిగేవారు కాదు. పాకిస్తాన్ ఉద్దేశాలు ఏవయినా కశ్మీరీల ఆరాటం న్యాయమైనది కాబట్టి ఈ విషయంలో పాకిస్తాన్ ఒక చారిత్రక కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నదని ప్రపంచంలోని అత్యధిక దేశాల అభిప్రాయం. (మన పత్రికలు మనకు వినపడకుండా దాచిపెడుతున్న ప్రపంచ సత్యాలలో ఇదొకటి.)

అయితే ఈ సహాయాన్ని కశ్మీరీలకు చేసే సహాయంగా చూసినా, పాకిస్తాన్ తన తొలినాటి ఆకాంక్షను పరిపూర్తి చేసుకోవడానికి జరుపుతున్న కృషిగా చూసినా, ఈ బరువు, ఈ ఖర్చు పాకిస్తాన్ సమాజం ఇంకెంత మోయాలన్న ప్రశ్న ఒకటి పాకిస్తాన్‌లో మొలకెత్తింది. తమ దేశం ఒక ఆధునిక పారిశ్రామిక దేశంగా అభివృద్ధి చెందాలని కాంక్షించే మధ్యతరగతి ఆ దేశంలో కొంత బలపడింది. వారు ఈ ప్రశ్న బలంగా లేవదీస్తున్నారు. ఇది పాకిస్తానీ పాలకులను ప్రభావితం చేస్తున్నదని భావించడానికి ఈ మధ్యనే ఇండియాలో పర్యటించిన పాకిస్తానీ జమాతే ఇస్లామీ నాయకుడి ప్రకటన ఒక నిదర్శనం.

దీనికి ఒక నేపథ్యం ఉంది. అది అమెరికా సామ్రాజ్య విస్తరణ వ్యూహంలోని దుర్మార్గపు ఎత్తుగడల పర్యవసానం. ఆఫ్ఘనిస్తాన్ నుండి రష్యాను తరిమివేయడానికి అమెరికా 'ఇస్లామిక్ ముజాహిద్దీన్'ల సైన్యాన్ని తయారుచేసిన సంగతి తెలిసిందే. ఇస్లాంను వ్యాపింపచేయడానికీ, ముస్లింలు ఎక్కడున్నా అక్కడ సనాతన ఇస్లామిక్ రాజ్యాలు స్థాపించడానికీ ఆయుధాలు పట్టుకొని బయలుదేరడానికి తయారుగా ఉన్న సాయుధ జిహాదీలు అప్పటిదాకా ఒకటి రెండు పశ్చిమాసియా దేశాలలో చిన్న చిన్న గుంపులుగా ఉండేవారు. వారంతటవారు అంతకంటే ఎప్పటికీ ఎదగకపోదురేమో. కాని అమెరికా తన ఆఫ్ఘనిస్తాన్ ప్రతి వ్యూహం కోసం వారందరినీ ఒకచోట చేర్చి మిలిటెంట్ల ఫ్యాక్టరీ నెలకొల్పింది.

ఆ 'చోటు' పాకిస్తాన్. అప్పటి నుంచి పాకిస్తాన్‌లో వీధివీధికీ ముజాహిద్దీన్‌లు తయారయ్యారు. అమెరికా వ్యూహం ఫలించింది. రష్యా ఆఫ్ఘనిస్తాన్ నుండి వెళ్ళిపోయింది. కానీ ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ చాలా నష్టపోయాయి. మతహింసకు స్థావరాలయ్యాయి. దాని నుండి ఆఫ్ఘనిస్తాన్‌ను 'కాపాడడానికి' అమెరికాయే ఆ దేశం మీద మరొకసారి యుద్ధం చేయడం వేరే కథ.

పాకిస్తాన్‌లో అమెరికా విత్తనం నాటిపోయిన పాన్ ఇస్లామిక్ మిలిటెన్సీ పట్ల ఆ దేశంలోని ఆలోచనాపరులలో వ్యతిరేకత బాగా పెరిగింది. వారంతా హేతువాదులు, నాస్తికులు, కమ్యూనిస్టులు ఏమీ కాదు. పాకిస్తాన్ ఒక ఆధునిక దేశంగా ఎదగాలని కోరుకుంటున్న వారందరూ ఈ సాయుధ జిహాదీలు అందుకు పెద్ద ఆటంకం అని గుర్తిస్తున్నారు. ఎందుకంటే వాళ్ళు కశ్మీర్ నుండి చెచెన్యా దాకా పోరాటాలు చేయడమే కాక పాకిస్తానీ సమాజాన్ని సాయుధంగా శాసించే ప్రయత్నం కూడ చేస్తున్నారు.

ఇండియాతో కశ్మీర్ వివాదాన్ని ఏదో ఒక రకంగా తెంపుకోనంతకాలం ఈ మిలిటెంట్ల బెడద పాకిస్తాన్‌కు పోదని పాకిస్తాన్‌లో చాలామంది ఈ రోజు భావిస్తున్నారు. ఆ ఒత్తిడి పాకిస్తాన్ పాలకుల మీద ఉంది. అందుకు భిన్నమైన దిశగా ఒత్తిడి పెట్టే ప్రభావాలు లేవా అంటే ఉన్నాయి. అయితే ఈ కారణంగా పాకిస్తాన్ పాలకులు ఇండియాతో చర్చలు జరిపే విషయంలో మన వాళ్ళ కంటే కొంచెం సిన్సియర్‌గానే ఉన్నారు.

మన సమస్య ఏమిటంటే పాకిస్తాన్‌ను ఒక ఇస్లామిక్ భూతంగానే తప్ప ఇంకొక రకంగా మనం చూడలేం. ఆ దేశంలోనూ భిన్న ఆరాటాలూ, ఆకాంక్షలూ ఉన్నాయన్న ప్రాథమిక సత్యాన్ని సహితం మనం గుర్తించం. మన రాజకీయాలు, మన పత్రికలు, ఈ మధ్య కాలంలో సినిమాలు పాకిస్తాన్ గురించి ఒక మూస అభిప్రాయాన్నే కలిగిస్తున్నాయి, పెంచి పోషిస్తున్నాయి.

మనం మారనిదే మన పాలకులు ఎందుకు మారతారు? మార్చుకోవాలన్న ఒత్తిడి మన నుండి రానిదే వారి వైఖరి ఎందుకు మారుతుంది? కాని దీనికి కావలసిన కృషి చేయడానికి ఎవరు సిద్ధంగా ఉన్నారు? జాతీయవాద ఆవేశంలో ఉన్న సుఖం హేతుబద్ధమైన వివేచనలో ఉండదు. దానిని బలంగా చేపట్టకపోతే మాత్రం భారత్ – పాకిస్తాన్ చర్చల పేరుతో ఈ అబద్ధపు ప్రహసనం సాగుతూనే ఉంటుంది. మొన్న ప్రకటించినట్టుగా కాల్పుల విరమణ అప్పుడప్పుడు ప్రకటించడమూ జరుగుతుంటుంది, మరొకపక్క ఆయుధాల తయారీ, కొనుగోలు, దిగుమతి, సైన్యాల మోహరింపు సాగుతూనే ఉంటాయి.

*వీక్షణం మాసపత్రిక*
*16 నవంబర్ 2003*

# భారత పాకిస్తాన్ చర్చలు : గతి-గమ్యం

**భా**రత పాకిస్తాన్ చర్చలకొక ప్రత్యేక లక్షణం ఉంది. మామూలుగా ఏవయినా రాజకీయ సంభాషణలు లేక సమస్యలపైన చర్చలు జరుగుతుంటే అందరి దృష్టి వాటి ఫలితంపైన ఉంటుంది. ఫలితం కోసం, సమస్యల పరిష్కారం కోసం చర్చలు అనేది సాధారణ వైఖరి.

కానీ భారత పాకిస్తాన్ చర్చలు చర్చల కోసమేనంటే అతిశయోక్తి కాదు. ఈ రెండు దేశాల సరిహద్దు వెంబడి బతికే ప్రజలకు చర్చలు అంటే శాంతి అని అర్థం. వాళ్ళ ప్రాణాలు, బతుకులు భద్రంగా ఉంటాయని అర్థం. ఈ సరిహద్దు 900 కిలోమీటర్ల పొడవు ఉంది కాబట్టి, దాని వెంబడి రెండు వైపులా లక్షలమంది జనం బతుకుతున్నారు కాబట్టి ఇది చిన్న విషయం కాదు. ఈ రెండు దేశాలు చర్చించి చర్చించి చివరికి ఏ పరిష్కారమూ సాధించకున్నా, ఆ చివరి ఘడియను రానియ్యకుండా సాగనిస్తుంటే చాలు జనం బతికిపోతారు.

అంతేకాదు, చర్చలు అంటే అణుయుద్ధ ప్రమాదం తాత్కాలికంగా వాయిదా పడ్డట్టే. ఇది భారత పాకిస్తాన్ చర్చలకు ఉండే రెండవ సత్ఫలితం. ఇది చిన్న మేలు కాదు. అణుబాంబులున్నంత మాత్రాన ప్రయోగిస్తారని భయపడనక్కరలేదని వేరే ఏదయినా సందర్భంలో అనుకోవచ్చునేమో గానీ ఈ రెండు దేశాల విషయంలో మట్టుకు కాదు. ఇరువైపులా పిచ్చివాళ్ళకు కొదవ లేదు. యుద్ధం చేసి 'పాకిస్తాన్‌ను కలిపేసుకోవాలని' లేదా కనీసం 'పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్'ను కలిపేసుకోవాలని ఉబలాటపడే వాళ్ళు ఇక్కడ, భారత్ వల్ల రాగల ప్రమాదాన్ని శాశ్వతంగా తొలగించేసుకోవాలని లేదా కనీసం 'భారత్ ఆక్రమిత కశ్మీర్'ను కలిపేసుకోవాలని ఆరాటపడేవాళ్ళు అక్కడ చాలామందే ఉన్నారు. పిచ్చాసుపత్రులలో కాదు, బయటే ఉన్నారు. నిర్ణయాత్మకమైన పదవులలోనూ ఉన్నారు. ప్రజాభిప్రాయాన్ని బలంగా ప్రభావితం చేయగల స్థానాలలోనూ దండిగా ఉన్నారు.

మూడవది యుద్ధానికి నిత్యం తయారుగా ఉండడానికయ్యే ఖర్చు తగ్గడం. భారత్ ఈ తయారీ మీద రోజుకు 6 కోట్ల రూపాయలు (సంవత్సరానికి కాదు, నెలకు కాదు, వారానికి కాదు, రోజుకు) ఖర్చు పెడుతున్నదన్నది చాలాకాలంగా ఉన్న అంచనా. చర్చల సందర్భంగా నెలకొనే యుద్ధ విరమణ కారణంగా ఇది మొత్తం మిగలకున్నా, ఇందులో సగం మిగిలినా సంవత్సరానికి వెయ్యికోట్ల రూపాయలు మిగిలినట్లే. అంతే మొత్తం పాకిస్తాన్‌కూ మిగులుతుంది. ఈ దారిద్ర్య స్థావరాలకు అది చిన్న మిగులు కాదు.

నాలుగవది నిరర్థకమైన చావులు ఆగడం. సరిహద్దు వెంబడి జరుపుకునే కాల్పులలో జవాన్లు నిత్యం చస్తుంటారు. సియాచిన్‌లోనయితే ఒక్క తూటా కాల్చకున్నా చలికే చస్తున్నారు. జంతువులు, పక్షులు, క్రిమికీటకాలు సహితం బతకజాలని చోట యుద్ధం చేసుకోవడమే కాక, ఆ మంచు ఎడారిని ప్రపంచంలోని అతి ఎత్తయిన యుద్ధక్షేత్రంగా మార్చుకుని ఈ రెండు దేశాలు అదేదో గర్వకారణమైనట్టు చెప్పుకొంటున్నాయంటే, చచ్చేది వేరే వారయితే ఎంత పిచ్చిగానయినా వ్యవహరించగలం అని అర్థం అవుతుంది. ఇప్పుడు దానినొక 'శాంతివనం'గా మార్చే ఆలోచన ఉందని అంటున్నారు. ఆ పనిచేశాక అక్కడికి టూరిస్టులు గుర్రాలో, గాడిదలో ఎక్కి బయలుదేరిపోయి దారిలో కొండచరియలు కూలడం వల్లనో, మంచు తుఫానులు కురవడం వల్లనో చావడం, ఆ వార్తలు మనం చదవడం ఎందుకు? మనుషులు రావద్దని ప్రకృతి భావించిన చోటికి పోయి యుద్ధం చేసుకోవడమెందుకు? ఆ తరువాత దానిని శాంతివనంగా మార్చడమెందుకు? రెండు సైన్యాలు సామాన్లు సర్దుకొని కిందికొచ్చేస్తే చాలు, ప్రకృతి లక్ష్యం నెరవేరుతుంది.

కాబట్టి కేవలం చర్చలు జరుగుతుండడం వల్ల ఇన్ని ప్రయోజనాలు ఉండగలవు. చర్చలు జరుపుతూ జరుపుతూ అదే అలవాటయిపోతే – యుద్ధం చేస్తూ, చేస్తూ అదే అలవాటయి పోయినట్టు ఈ ప్రయోజనాలు శాశ్వతం కాగలవు. అదీ పదివేలే.

ఎందుకంటే చర్చల అజెండాపై ప్రతిష్ఠంభన వీడడం లేదు. పాకిస్తాన్‌కు ఈ విషయంలో స్పష్టత ఉంది. (పాకిస్తాన్ పాలకులు మన వారి కంటే విజ్ఞులని కాదు గానీ వివేకం స్వప్రయోజనంతో ఏకీభవించినప్పుడు స్పష్టత కొరవడవలసిన అవసరం లేదు.) భారత పాకిస్తాన్‌ల మధ్య కశ్మీర్ సమస్యే ప్రధాన సమస్య కాబట్టి, అదే అజెండాలోని ప్రధాన అంశం కావాలని పాకిస్తాన్ అంటుంది. నిజానికి అది కాక ఈ

రెండు దేశాల మధ్య వేరే ఏ సమస్యలున్నాయి? సింధునది జలాలను న్యాయబద్ధంగా పంచుకోవడం, ఒకరికొకరు వర్తక వ్యాపారాలలో ప్రాధాన్యం ఇచ్చుకోవడం – ఇవేవీ తలలు పగలగొట్టుకోవలసిన సమస్యలు కాదు. అందువల్ల కశ్మీర్ సమస్యే అసలు సమస్య. అసలు సమస్యను మొదట పరిష్కరించుకుంటే మిగిలినవి వాటంతటవే పరిష్కారం అవుతాయి కాబట్టి కశ్మీర్‌తోనే మొదలుపెడదాం అని పాకిస్తాన్ అంటుంది.

భారత్‌కు ఈ విషయంలో ఒక స్పష్టమైన వైఖరే లేదు. అసలు సమస్య జటిలమైనది కాబట్టి దానిని వాయిదా వేసి పరిష్కారం కాగల సమస్యల గురించి మాట్లాడుకున్నట్టయితే అసలు సమస్య చర్చించడానికి కావలసిన సుహృద్భావ వాతావరణం ఏర్పడుతుందని ఒక్కొక్కసారి అంటుంది. అసలు కశ్మీర్ సమస్య లేనేలేదని మహారాజా హరిసింగ్ 1947 అక్టోబర్ 26న జమ్ముకశ్మీర్ రాష్ట్రాన్ని ఇండియాలో కలపడానికి అంగీకరించినప్పుడే అది పరిష్కారం అయిపోయిందనీ, పరిష్కారం అయిపోయిన సమస్యను తిరగతోడడం కోసం కశ్మీర్‌లోకి పాకిస్తాన్ చొరబాటుదార్లను పంపించడమే ప్రస్తుతమున్న 'కశ్మీర్ సమస్య' అనీ ఒక్కొక్కసారి అంటుంది.

ఇది నిజమని భారత్ నిజంగా నమ్మివుంటే చర్చలకు అసలు ఒప్పుకునేది కాదు. నిజాన్ని గుర్తించినప్పటికీ దానిని ముందుంచకుండా కల్పనను ముందుంచడం ఎత్తుగడ రీత్యా తెలివయిన పనిగా భారత్ భావిస్తున్నది కాబట్టే ఆ వైఖరి కొనసాగిస్తున్నది.

అయితే ఇప్పుడు రెండు దేశాలూ ఏ సమస్య ముందు చర్చిస్తామని చెప్పకుండా అన్ని విషయాలు చర్చిస్తాం అని అంటున్నాయి. పాకిస్తాన్ 'జమ్ముకశ్మీర్‌తో సహా' అనే వాక్యం మొదట చేరుస్తున్నది. భారత్ ఆ మాటలు చేర్చకున్నప్పటికీ పాకిస్తాన్ చేర్చడం పట్ల అభ్యంతరం చెప్పడం లేదు. దీని అర్థం కశ్మీర్‌ను ఒక సమస్యగా భారత్ గుర్తించినట్టేనని పాకిస్తాన్ పాలకులు తమ దేశీయ విమర్శకులకు నచ్చజెపుతుండగా, కశ్మీర్ భారత్‌లో విడదీయరాని భాగమని వేరే సందర్భాలలో ప్రకటించడం ద్వారా అటువంటిదేమీ లేదని భారత్ తన దేశీయ విమర్శకులకు సర్దిచెపుతున్నది.

భారత పాకిస్తాన్ చర్చలు ఎక్కడిదాకా వచ్చాయంటే ఇదిగో ఇక్కడి దాకా వచ్చాయి. 'అసలు విషయం' అనేది ఒకటి ఉందా లేదా, అది నిజమైన సమస్యా లేక జిహాదీలు కల్పించిన సమస్యా అన్న విషయంలో ఏకాభిప్రాయం కుదరకుండానే రెండు దేశాల అధికారులూ అప్పుడప్పుడూ కలుసుకుంటూ పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు. మనమంతా ఒకలాంటి మనుషులమే కదా అని మళ్ళీ మళ్ళీ కనుక్కుంటున్నారు.

రెండు దేశాల విదేశాంగ శాఖ మంత్రులూ వేరే ఏవో సందర్భాలలో ఎక్కడెక్కడో కలుసుకుంటూ ఒకరినొకరు కౌగలించుకుంటున్నారు.

ఈ ప్రక్రియ పూర్తిగా నిరర్థకమని భావించనక్కరలేదనడానికి కారణం పైన చెప్పాను. అది ఆగిపోకుండా కొనసాగాలంతే. అయితే నిర్దిష్టమైన ఫలితాలేవీ దీని నుండి రావని కూడ అనలేం. రెండు దేశాలకూ అవసరమయినవి కొన్ని ఉన్నాయి. ఇరాన్ నుండి భారత్‌కు గ్యాస్ పైప్‌లైన్ వేయాలన్నది ఒకటి. అది ఇరాన్‌కూ భారత్‌కూ అవసరం. రెవెన్యూరీత్యా పాకిస్తాన్‌కు కూడ ఇష్టమే. కాని పాకిస్తాన్ ప్రభుత్వం తమ దేశంలో సమాంతర పాలన సాగిస్తున్న ఇస్లామిక్ మిలిటెంట్ల నుండి ఆ పైప్‌లైన్‌కు భద్రత కల్పిస్తుందా అన్నది భారత్ భయం. కల్పించగలుగుతామని పాకిస్తాన్ హామీ ఇస్తున్నది. చర్చలు జరిగితే ఈ విషయం, ఆర్థిక సహాయ సహకారానికి సంబంధించిన ఇటువంటి ఇతర విషయాలు ఒక కొలిక్కిరాగలవు.

అయితే పాకిస్తాన్‌కు ఇక్కడ కొన్ని న్యాయమైన సందేహాలున్నాయి. అసలు విషయం చర్చించకుండా ఇవన్నీ మాట్లాడుకుంటూ పరిష్కరించుకుంటూ పోతే భారత్ అసలు విషయం ఎప్పటికైనా చర్చిస్తుందా? అని. తన అవసరాలన్నీ తీరిపోయిన తరువాత కశ్మీర్ గురించి మాట్లాడేది లేదు పొమ్మని భారత్ అంటే అప్పుడేం చేయాలి? అందువల్ల ఇరాన్ పైప్‌లైన్ చర్చను వాయిదా వేసి భారత్‌పైన ఒత్తిడి పెంచాలని వాదిస్తున్న పాకిస్తానీలు ఉన్నారు. చిన్న చిన్న విషయాలు పరిష్కరించుకుంటూ పోతే అసలు విషయం మాట్లాడుకోవడానికి కావలసిన స్నేహ వాతావరణం ఏర్పడుతుందని భారత్ చెప్పటం అతి తెలివి ఎత్తుగడ అని వారు అనుమానిస్తున్నారు.

కశ్మీర్ విషయంలో పాకిస్తాన్ దృష్టి భారత్ దృష్టి కంటే ఉన్నతమైనదేం కాదు కాబట్టి – ఇద్దరిదీ భూమి కబ్జాదారుల దృష్టే కాబట్టి – పాకిస్తాన్ పాలకుల భయాందోళనలను పెద్దగా పట్టించుకోనక్కరలేదు. కానీ భారత్ ఆడుతున్న ఆటకు బలయ్యేది కశ్మీరీలు, కశ్మీరీల స్వయం నిర్ణయాధికార ఆకాంక్ష. ఆ ఆకాంక్షను భారత్ గుర్తించ నిరాకరించడం, భారత పాకిస్తాన్‌లు రెండూ దానిని ఒక భూమి వివాదంగా మార్చడం అసలైన 'కశ్మీర్ సమస్య'. దీనికి పరిష్కారం కావలసింది ఇండియాకూ, పాకిస్తాన్‌కూ కాదు; కశ్మీరీలకు.

భారత్ పాకిస్తాన్‌ల మధ్య పెరుగుతున్న స్నేహాన్ని కశ్మీరీలు రెండు మనస్సులతో గమనిస్తున్నారు. స్వభావరీత్యా చాలా స్నేహశీలురు కావడం వల్ల ఈ స్నేహాన్ని వారు

ఆహ్వానించకుండా ఉండలేరు. తగిన వైద్య సదుపాయాలు దొరకని పాకిస్తానీ పిల్లలు బెంగుళూరుకొచ్చి ఆపరేషన్ చేయించుకోవడం, భారత్ క్రికెట్ జట్టును పాకిస్తాన్ ప్రజలు సాదరంగా ఆహ్వానించడం ఎవరికయినా సంతోషం కలిగించే విషయాలే.

కానీ ఇది చివరికి ఎటుపోతుంది? ఈ రెండు దేశాలూ దగ్గరయి, వైద్య సదుపాయాల నుండి గ్యాస్ పైప్‌లైన్ దాకా అన్నిటిలోనూ సహకరించుకోవడం మొదలుపెట్టిన తరువాత అదే ఒరవడిలో కశ్మీరును కూడ చెరి కొంచెం తీసేసుకొని వాస్తవాధీన రేఖ వద్ద పూలకుండీలు అమర్చేసుకుంటే తమ నేల భవితవ్యం ఏమవుతుంది? భారత్ కశ్మీర్ గురించి పాకిస్తాన్‌తో అసలు చర్చించకుండా మిగిలిన సమస్యలు పరిష్కరించుకుని కశ్మీర్ విషయంలో ప్రస్తుత మొండివైఖరినే కొనసాగిస్తుందన్న భయం పాకిస్తానీలలో ఎంత వుందో కశ్మీరీలలోనూ అంత వుంది. వాస్తవాధీన రేఖనో, వేరొక సరిహద్దునో శాశ్వత సరిహద్దు చేసేసుకుని కశ్మీర్ అధ్యాయానికి ముగింపు పలకాలని అమెరికా ఒత్తిడి పెడుతున్న విషయం అందరికీ తెలిసిందే. అమెరికాకు కావలసింది శాంతి, న్యాయబద్ధమైన పరిష్కారం కాదు. భారత పాకిస్తాన్‌ల మధ్య ఏదో ఒక ప్రాతిపదికన శాంతి నెలకొంటే పాకిస్తాన్‌లోని ఇస్లామిక్ మిలిటెంట్ల ఉనికి దెబ్బతింటుందని అమెరికా ఆశ. 'ఆఫ్ఘనిస్తాన్ సమస్య' పరిష్కారం కోసం అమెరికాయే వారిని ఉనికిలోకి తెచ్చింది. ఇప్పుడు వారిని తొలగించడానికి 'కశ్మీర్ సమస్య'ను పరిష్కరించాలని అనుకుంటున్నది. ఈ రెండు దేశాలలోనూ యుద్ధమంటే విసిగిపోయిన వారంతా అమెరికా ప్రతిపాదనను ఒక సులభమైన పరిష్కారంగా భావిస్తున్నారు. బహుశా చివరి పరిష్కారం ఆ రూపంలోనే ఉండవచ్చు. కానీ అన్యాయమైన ఆ పరిష్కారానికి సహితం ఇండియా తొందరపడదు. దశాబ్దాల తరబడి కశ్మీర్ మొత్తం మనదేనంటూ కృత్రిమంగా రెచ్చగొట్టిన జాతీయవాద ఆవేశాన్ని ఎదుర్కొనడానికి భారత పాలకులు సులభంగా సిద్ధపడరు. పాకిస్తాన్ పాలకులకూ ఆ సమస్య ఉందిగానీ కశ్మీర్‌ను చెరి కొంత అనే ప్రాతిపదికన పంచేసుకునేటప్పుడు కశ్మీర్ లోయ తమకు దక్కుతుందన్న ఆశ వారిలో లేకపోలేదు. అందుకే వారు 'కశ్మీర్ సమస్య' అజెండాలో ఉండాలని తొందరపడుతున్నారు. ఇవన్నీ తెలిసే కశ్మీరీలు ఈ మొత్తం 'చర్చల' వ్యవహారాన్ని అనుమానంగా చూస్తున్నారు. కానీ వారి భయాలను ఆలకించేవారెవరు?

ఉద్యమం మాసపత్రిక

*ఆగస్టు - సెప్టెంబరు 2004*

# ముషార్రఫ్ నోట అమెరికా మాట ఎందుకు వినపడుతున్నట్టు?

**ము**షార్రఫ్ ఈ మధ్య కశ్మీర్ విషయంలో చేసిన రెండు ప్రకటనలు మీడియాలో బాగా ప్రచారం అయ్యాయి. పాకిస్తాన్ కశ్మీర్‌ను కోరుకోవడం లేదనీ, కశ్మీర్ భవితవ్యాన్ని కశ్మీరీలే నిర్ణయించుకోవాలని మాత్రమే అంటున్నదనీ అన్నాడు. పాకిస్తాన్‌లో కొంతమందికి ఇది నచ్చలేదు. ముషార్రఫ్ అమెరికాను, భారత్‌ను మెప్పించడానికి కశ్మీర్ విషయంలో పాకిస్తాన్ ఇప్పటిదాకా అనుసరిస్తూ వస్తున్న అచంచలమైన వైఖరి నుండి వైదొలగాడని జమాతె ఇస్లామీ ప్రతినిధులు అతని మీద ఆరోపణ చేశారు.

నిజానికి ముషార్రఫ్ పాకిస్తాన్ రాజ్య ప్రయోజనాల దృష్ట్యా చాలా తెలివిగా వ్యవహరించారని చెప్పాలి. పాకిస్తాన్ పాలకుల అభిప్రాయంలో కశ్మీర్ వివాదాస్పద భూభాగం కావడానికి కారణం ఆ దేశాన్ని భారత్‌లో విలీనం చేసిన రాజు చర్యపైన ప్రజాభిప్రాయ సేకరణ ఇప్పటిదాకా జరపకపోవడం కాదు. అటువంటి ప్రజాభిప్రాయ సేకరణ జరిపి తీరుతామనీ, జరిపి ప్రజామోదం పొందినప్పుడే విలీనం పూర్తయినట్టు భావిస్తామనీ భారత పాలకులు కశ్మీర్ ప్రజలకే కాక ఐక్యరాజ్య సమితికి కూడ హామీ యిచ్చారు. ఆ హామీని తప్పించుకోవడానికి ఆడిన నాటకాల చరిత్రే కశ్మీర్‌కు సంబంధించినంతవరకు గత యాభై ఏళ్ళ భారత చరిత్ర.

దీనిని పాకిస్తాన్ సహజంగానే వేలెత్తి చూపుతుంది గానీ, పాకిస్తాన్ అధికారిక దృష్టిలో 'కశ్మీర్ సమస్య' ఇది కాదు. దేశ విభజన జరిగినప్పుడు ముస్లింలు మెజారిటీగా ఉన్న రాష్ట్రాలన్నీ పాకిస్తాన్‌లో చేరాయనీ, ఒక్క జమ్మకశ్మీర్ మాత్రమే హరిసింగ్ – నెహ్రూల కుయుక్తుల వల్ల, షేక్ అబ్దుల్లా నమ్మకద్రోహం వల్ల ఇండియాలోకి పోయిందనీ, ఇది అన్యాయమనీ వారి అభిప్రాయం. అధికారిక పాకిస్తానీ దృక్పథంలో ఇదే 'కశ్మీర్ సమస్య'. ద్విజాతి సిద్ధాంతపు మిగిలిపోయిన కర్తవ్యం అయిన కశ్మీర్

విముక్తిని కశ్మీరీల స్వయం నిర్ణయాధికార సమస్యగా ముషార్రఫ్ చెప్పడం సంప్రదాయవాదులకు నచ్చలేదు.

కాని ముషార్రఫ్‌కు కొన్ని చారిత్రక వాస్తవాలు తెలియకుండాపోయే అవకాశం లేదు. హరిసింగ్ పరిపాలించిన జమ్ముకశ్మీర్ రాజ్యంలో ముస్లింలు మెజారిటీ అన్నది వాస్తవమే. ఒక్క కశ్మీర్ లోయలోనే కాదు, అప్పటి జమ్ము ప్రాంతంలోనూ ముస్లింలే మెజారిటీ. ఒక్క లడఖ్‌లో మాత్రమే ముస్లింలూ బౌద్ధులూ దాదాపు చెరి సగం ఉంటారు. లాహోర్ రాజు రంజిత్‌సింగ్‌ను ఓడించిన బ్రిటిష్ వాళ్ళు ఆ రాజ్యమంతటినీ బ్రిటిష్ ఇండియాలో కలుపుకొని వుంటే, అందులో భాగమైన జమ్ముకశ్మీర్ కూడ బ్రిటిష్ ఇండియాలో చేరి ఉండేది. దేశ విభజనప్పుడు పడమటి పంజాబ్‌లాగ, తూర్పు బెంగాల్ లాగ, సింధ్‌లాగ ఆ రాజ్యమంతా పాకిస్తాన్‌లో భాగమయిపోయి ఉండేది (బహుశా జమ్ము, కటువా జిల్లాలు మాత్రం ఇండియాలోకి వచ్చి ఉండేవి). ఈ మేరకు పాకిస్తానీ సంప్రదాయవాదుల ఫిర్యాదులను అర్థం చేసుకోవచ్చు.

బ్రిటిష్‌వాళ్ళు రంజిత్‌సింగ్ రాజ్యంలో తక్కిన భాగాన్ని బ్రిటిష్ ఇండియాలో కలుపుకున్నారు గానీ, జమ్ముకశ్మీర్‌ను మాత్రం రంజిత్‌సింగ్‌కు ద్రోహం చేసి బ్రిటిష్ వాళ్ళ విజయానికి సహాయపడిన డోగ్రా జమీందారు గులాబ్‌సింగ్‌కు అప్పగించారు. ఆ రాజ్యంలో చాలా భిన్నత్వం ఉన్నప్పటికీ రెండు మూడు వందల సంవత్సరాలు ఒకే పాలన కింద ఉండడం వల్ల ప్రజలలో తామంతా ఒకటన్న భావన ఏర్పడి ఉండవచ్చు. మెజారిటీ ముస్లింలు కాబట్టి ఆ రాజ్యం యావత్తూ పాకిస్తాన్‌లో కలవాలని అన్నా, భారత్‌లో గానీ పాకిస్తాన్‌లో గానీ చేరకుండ స్వతంత్రంగా ఉండాలన్న ఆకాంక్ష బలంగా ఉండింది కాబట్టి ఆ నిర్ణయమే చేసినా, లేదా ప్రజాభిప్రాయ సేకరణ జరిపి మెజారిటీ నిర్ణయం ప్రకారం ఆ రాజ్యం భవిష్యత్తు నిర్ణయించినా అర్థం ఉండేది.

కాని 50 ఏళ్ళ తరువాత పరిస్థితి చాలా మారింది. వాస్తవాధీన రేఖ అనేది సరిహద్దు కాదని రాజకీయాల కోసం ఎంత చెప్పుకున్నా, మనుషుల మధ్య అది సరిహద్దే అయింది. పాత జమ్ముకశ్మీర్ రాజ్యం ప్రాతిపదికన చేసే ఏ ఆలోచనకూ ఇప్పుడు అర్థం లేదు. మీర్‌పూర్ వాసులు, కొంతమేరకు ముజఫరాబాద్ వాసులు తమకు తాము పాకిస్తాన్‌లో భాగంగానే భావించుకుంటారు. భారత్‌లోని జమ్మువాసులు మానసికంగా భారతీయులే. లదాఖ్‌వాసులు జమ్ముతోగానీ కశ్మీర్‌తోగానీ మమేకం

చెందరు. వాళ్ళకు సాంస్కృతికంగా, జాతిపరంగా సాన్నిహిత్యం ఉండేది టిబెటన్లతో. టిబెట్ చైనాదేశపు వలస కాకపోతే టిబెట్‌తో కలవడానికి ఇష్టపడతారేమో. వారిలో సగభాగం (కార్గిల్‌లో మెజారిటీ) ముస్లింలయినప్పటికీ షియాలు కావడం వల్ల పాకిస్తాన్‌లో కలవడానికి ఇష్టపడకపోవచ్చు. మొత్తానికి ఇష్టంగానో అయిష్టంగానో భారతీయులుగానే బతకడానికి లదాఖీలు సిద్ధపడి పోయినట్టున్నారు.

ఇక మిగిలింది కశ్మీర్ లోయ, జమ్ములో కశ్మీరీలు నివసించే దోడా జిల్లా. ఇప్పటికీ బలమైన స్వాతంత్ర్య కాంక్ష ఉన్నది ఇక్కడే. పాకిస్తాన్‌లో ఈ ఆకాంక్ష ముజఫరాబాద్‌లో మాత్రం కొంత ఉంటుంది. కశ్మీర్ లోయలో 95 శాతం పైగా ముస్లింలు కాబట్టి ద్విజాతి సిద్ధాంతం ఆధారంగా ఆ లోయను పాకిస్తాన్‌లో కలిపివేయాలని డిమాండ్ చేసే బదులు, వారికి స్వయం నిర్ణయాధికారం ఇమ్మనడం ప్రజాస్వామికంగానూ ఉంటుంది, పైగా తాము కోరుకునే ఫలితాన్నీ ఇస్తుంది అనే నిర్ణయానికి ముషార్రఫ్ వచ్చాడు. ఇక్కడ గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే కశ్మీర్ విషయంలో పాకిస్తాన్ స్వయం నిర్ణయాధికారం అన్న పదాన్ని ఎప్పుడు ప్రయోగించినా అందులో ఇండియా కావాలా పాకిస్తాన్ కావాలా అన్న రెండు ప్రత్యామ్నాయాలే తప్ప స్వాతంత్ర్యం అన్న మూడవ ప్రత్యామ్నాయం లేదు. అవి రెండే ఉంటే మెజారిటీ పాకిస్తాన్‌కే వోటు వేస్తారన్న ధీమా ముషార్రఫ్‌కు ఉన్నట్టయితే అది వాస్తవికమైన అభిప్రాయమే. (మూడవ ప్రత్యామ్నాయం ఉన్నట్టయితే మెజారిటీ ప్రజలు స్వాతంత్ర్యానికే వోటు వేస్తారనేది కశ్మీర్ గురించి తెలిసిన వాళ్ళందరి అభిప్రాయం.) చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే రెండు ప్రత్యామ్నాయాలే ఇచ్చినప్పటికీ 1960 దాకా అయితే మెజారిటీ వోట్లు ఇండియాకే పడి ఉండేవని కూడ చరిత్రకారులలో ఏకాభిప్రాయం ఉంది. పరిస్థితిని అక్కడి నుంచి ఇక్కడికి తీసుకొచ్చింది మన పాలకులే కాబట్టి ఎవరినీ ఆడిపోసుకొని ప్రయోజనం లేదు.

అయితే ముషార్రఫ్ అక్కడితో ఆగిపోలేదు. పాకిస్తాన్ మద్దతు ఇస్తున్నది కశ్మీరీల స్వయం నిర్ణయాధికారానికేనని ఒక పక్క అంటూ, వారి నిర్ణయంతో నిమిత్తంలేని 'పరిష్కారాన్ని' ప్రతిపాదించాడు. ఈ పరిష్కారం కొంత కాలంగా అమెరికా నోట వినపడుతున్నదీ, ఢిల్లీలోని భారత ప్రభుత్వ విధానకర్తలు అవునంటున్నదీ కావడం కొంత ఆశ్చర్యం, ఎక్కువ ఆందోళన కలిగించే విషయం. భారత్, అమెరికా, పాకిస్తాన్‌లు

ఇంత అకస్మాత్తుగా 'కశ్మీర్ సమస్య' పరిష్కారాన్ని గురించి ఏకాభిప్రాయానికి ఎందుకు వచ్చేస్తున్నట్టు?

ఈ పరిష్కారం సారాంశమేమిటంటే ఇటో అటో 'అడ్జస్ట్' అయిపోయిన ప్రాంతాలు శాశ్వతంగా భారత్‌లోనూ పాకిస్తాన్‌లోనూ భాగం అయిపోతాయి. ఉదాహరణకు జమ్ము, మీర్‌పూర్‌లు. ఇంకా స్వయం నిర్ణయాధికారం, స్వాతంత్ర్యం అంటూ ఆందోళన చేస్తున్న ప్రాంతాలు (కశ్మీర్ లోయ, దోడా జిల్లా, బహుశా పాకిస్తాన్‌లోని ముజఫరాబాద్ ప్రాంతం) ఒక స్వయంప్రతిపత్తి గల రాజ్యశకలంగా ఏర్పడతాయి. ఈ ప్రాంతవాసులకు ఇండియాతోనూ, పాకిస్తాన్‌తోనూ రాకపోకల స్వేచ్ఛ కొంత ఇవ్వబడుతుంది. వారి స్వయం ప్రతిపత్తిపైన భారత పాకిస్తాన్‌ల ఉమ్మడి పర్యవేక్షణ, ఆ స్వయం ప్రతిపత్తికి అమెరికా భరోసా ఉంటాయి. చిన్నాచితకా సవరణలతో ఈ ప్రతిపాదన బిల్‌క్లింటన్ కాలం నుండి వినబడుతున్నది. ఢిల్లీలోని బ్యూరోక్రాట్లలో 'ప్రాక్టికల్' అని పేరున్న వారు దీనికి మద్దతుగా మాట్లాడుతున్నారు. ఇప్పుడు మొట్టమొదటిసారిగా పాకిస్తాన్ నోటి నుండి కూడ ఇదే మాట వినపడుతున్నది.

ఈ 'పరిష్కారం' భారత పాకిస్తాన్ జాతీయవాదుల అహాన్ని సంతృప్తిపరచడానికీ, అమెరికా పెత్తనాన్ని ఉపఖండంలో పెంచడానికీ తప్ప వేరే దేనికయినా పనికొస్తుందా? స్వాతంత్ర్యం కోరుకున్న పాపానికి కశ్మీరీలు ఒకటి కాదు, మూడు పెత్తనాల కింద బతకాలా? 'కశ్మీర్ సమస్య' కశ్మీరీల స్వయం నిర్ణయాధికార సమస్య అని ఎన్నిసార్లు చెప్పినా ఎక్కువ కాదు. అది కశ్మీరీల సమస్యే తప్ప మన దేశంలో చాలామంది భావిస్తున్నట్టు 'మన' సమస్య కాదు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే కశ్మీరీల వల్ల భారత్‌కు సమస్య రాలేదు. భారత్ వల్ల, పాకిస్తాన్ వల్ల కశ్మీరీలకు సమస్య వచ్చింది. దానికి ఏకైక పరిష్కారం కశ్మీరీలకు మూడు ప్రత్యామ్నాయాలు ఇచ్చి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం, దాని ఫలితం ఏమైనప్పటికీ భారత పాకిస్తాన్‌లు దానిని మన్నించడం.

ముషార్రఫ్ నోట అమెరికా మాట వినపడడం పాకిస్తానీల సంగతేమో గానీ కశ్మీరీలకు చాలా కోపం తెప్పించి ఉంటుంది. పూర్తిగా సెక్యులర్ భావాలు గల కశ్మీరీలు సహితం తమ స్వాతంత్ర్య కాంక్షలకు పాకిస్తాన్ అండ లభిస్తుందని నమ్మారు. ఇప్పుడు పాకిస్తాన్ భారత్‌తోనూ అమెరికాతోనూ గొంతు కలిపి తమ స్వాతంత్ర్య కాంక్షను తృణీకరించడం వారికి చాలా బాధ కలిగిస్తుంది.

కానీ కాలం వారి పక్షాన లేదు. ముస్లింలు నివసించే ఏ ప్రాంతంలోనయినా అలజడి ఉంటే ఇస్లామిక్ మతవాద సంస్థలు ఎదగడానికది అవకాశం కల్పిస్తుంది కాబట్టి అటువంటి అలజడులన్నిటినీ 'పరిష్కరించే'యాలనేది అమెరికా దృష్టి. న్యాయంగానే పరిష్కరించనక్కరలేదు, ఏదో ఒక రకంగా పరిష్కరింపచేసి చల్లారిస్తే అమెరికా అవసరం తీరిపోతుంది. భారత పాకిస్తాన్‌లు కశ్మీర్ భూభాగం గురించి ఘర్షించుకుంటున్నాయా? అయితే ఇద్దరికీ కశ్మీర్‌లో హక్కులు కల్పించేద్దాం. అది స్థిరంగా ఉండకపోవచ్చునా? అయితే వారిపైన అమెరికా అజమాయిషీ నెలకొల్పుదాం. అమెరికా కొంతకాలంగా సూచిస్తూ, ఇప్పుడు ముషార్రఫ్ వంత పాడుతున్న 'పరిష్కారానికి' ఇంతకంటే తర్కం లేదు. ఇదే అమలు అయితే కశ్మీరీలకు నిస్సందేహంగా చాలా అన్యాయం జరుగుతుంది. కాని వారి గోడు ఎవరికి పట్టింది?

*'మరో స్వతంత్ర ఉద్యమం' మాసపత్రిక*
*జనవరి – ఫిబ్రవరి 2007*

# బెనజీర్ హత్య, ప్రజాస్వామ్యం, బలిదానం

బెనజీర్ భుట్టో జీవితంలో కంటే మరణంలో చాలా గొప్ప వ్యక్తిగా కనిపించిన విషయం అందరూ గమనించే ఉంటారు.

ఆమె హత్య ఘోరమైన ఘటన కావడమొక్కటే ఇందుకు కారణం అనుకోవడం పొరబాటు అవుతుంది.

నిజమే, ఒక రాజకీయవేత్తగా ఆమెను గానీ, ఆమె తండ్రిని గానీ సగటు రాజకీయ జీవుల నుండి వేరు చేసి చూపడానికేమీ లేదు. మన పత్రికల్లోని వ్యాఖ్యాతలు పాకిస్తానీ నాయకులను మన ప్రయోజనాలను ప్రమాణంగా పెట్టుకొని బేరీజు వేస్తుంటారు. ఈ కోణం నుండి చూసినప్పుడు ఆమె తండ్రి 1965లో భారత్ మీద కాలు దువ్విన దుర్మార్గుడిగానూ, ఆమె (ఈ మధ్య కాలంలో) భారత్‌తో స్నేహం గురించి మాట్లాడుతున్న మంచిదానిగానూ కనిపిస్తారు. కాని ఆ ప్రమాణమే అన్యాయం. వారిని అర్థం చేసుకోవలసిందీ, అంచనా వేయవలసిందీ పాకిస్తానీ ప్రజల ప్రయోజనాలను ప్రమాణంగా పెట్టుకొని.

పాకిస్తాన్ మత ప్రాతిపదికన ఏర్పడిన రాజ్యమేగానీ ఆ దేశ రాజకీయాలలో ఈ మధ్యకాలం దాకా (బహుశా ఇప్పుడు కూడ) లౌకిక భావాలకే ప్రజాదరణ ఎక్కువ. ప్రత్యేకించి, అన్ని పేద దేశాలలో లాగానే సామాజిక న్యాయం గురించి, సమానత గురించి మాట్లాడిన వారికే ఆదరణ ఎక్కువ. పాకిస్తాన్‌లో దీనికి చాలా కాలం ప్రధాన ప్రతినిధిగా ఉన్నది బెనజీర్ భుట్టో తండ్రి జుల్ఫికర్ అలీ భుట్టో, అతని పార్టీ అయిన పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ. 'రోటీ, కప్డా ఔర్ మకాన్' అనే హిందీ సినిమా గురించి మనలో అందరూ వినే ఉంటారు గానీ అది భుట్టో రాజకీయ నినాదం అని చాలామందికి తెలియదు. ఇందిరా గాంధీకి 'గరీబీ హఠావో' అన్న నినాదం తెచ్చిపెట్టిన

ఆదరణ  ఈ నినాదం భుట్టోకు తెచ్చిపెట్టింది. రెండింటి అర్థమూ ఒకటే. రెండింటికీ లభించిన ఆదరణ చెప్పేది ఒకటే – పేద దేశాలలో పేదరిక నిర్మూలనకున్న ఆకర్షణ వేరే దేనికీ ఉండదని. ఇందిరా గాంధీ అయినా, జుల్ఫికర్ అలీ భుట్టో అయినా ఎంత నిజాయితీగా ఈ నినాదాన్ని ఆచరించారనేది వేరే విషయం.

దానితోబాటు భుట్టోలో తీవ్రమైన దేశభక్తి కూడ ఉండింది. బహుశా అది కూడ రాజకీయంగా ఆకర్షణీయమైన నినాదమే కాబట్టి అది సహితం తెచ్చిపెట్టుకున్న దేనేమో! దీని వల్ల భారత్‌కు కలిగిన కష్టాల కారణంగా అతనిని నిందించడంలో అర్థం లేదు. నిజానికి ఒక్క భుట్టోలోనే కాదు, పశ్చిమ పాకిస్తాన్‌కు చెందిన రాజకీయ వేత్తలందరిలోనూ ఈ రకమైన దేశభక్తి ఉండడం, దానిని సరిహద్దు భద్రతతో సమానం చేసి చూడడం పాకిస్తాన్‌కే చాలా నష్టం చేసింది.

ఆయన కుమార్తె బెనజీర్ ఇందిరా గాంధీ కుమారుడు రాజీవ్‌లాగే పాశ్చాత్య సంస్కృతిని ఒంటబట్టించుకొని ఉదారవాద పరిభాషనూ, ఆధునిక రాజకీయ విలువలనూ ప్రవచించడం నేర్చుకుంది. అయితే వారసురాలిగా ప్రధానమంత్రి పదవి చేపట్టిన తరువాత (రాజీవ్ గాంధీలాగానే) మన తోటి దేశాల రాజకీయాల నుడికారం అయిన అవినీతినీ ఆశ్రిత పక్షపాతాన్నీ అవకాశవాదాన్నీ ఒంటబట్టించుకుంది. చివరికి ఆధునికతా విలువలకు పూర్తి విరుద్ధంగా ఆఫ్ఘనిస్తాన్‌లో సోవియట్ అనుకూల ప్రభుత్వాన్ని కూలదోయడానికి మత సైన్యంగా పని చేసిన తాలిబన్‌లకు ఆమె పాలనలోనే పాకిస్తాన్ భూభాగంలో తర్ఫీదు ఇచ్చి  తయారు చేయడం జరిగిందని కూడ ఆమెను నిందిస్తున్నారు గానీ, ఆమెకు ఆ పని పురమాయించింది 'ఆధునికతా విలువలకు' పట్టుగొమ్మగా భావించే అమెరికాయే అయినప్పుడు ఆమెనెందుకనాలి? నిజానికి ఈ రోజు ప్రపంచంలో చాలామంది (ముఖ్యంగా మన భారతీయులం) పాకిస్తాన్‌ను నిందించే రుగ్మతలన్నిటికీ మూలం ఆఫ్ఘనిస్తాన్‌పైన ఆధిపత్యం నెలకొల్పడానికి అమెరికా వేసిన ఈ ఎత్తుగడలోనే ఉంది.

ఇవన్నీ వాస్తవాలే. మరయితే ఆమెది వీరోచితమైన మరణంగా ఎందుకు ప్రస్తుతిస్తున్నారు? చస్తానని తెలిసి కూడ పాకిస్తాన్‌కు వెళ్ళింది కాబట్టి. మంచి పని కోసం వెళ్ళిందా అంటే కొన్ని రాజకీయ వాస్తవాలను వివరించకుండా జవాబు చెప్పడం

కష్టం. మొదటి వాస్తవమేమిటంటే కొంత కాలంగా పాకిస్తాన్ రాజకీయాలను నడుపుతున్నది అమెరికా ప్రయోజనాలే తప్ప పాకిస్తాన్ ప్రయోజనాలు కావు. ఆ ప్రయోజనాలను ముషార్రఫ్ బాగానే నెరవేరుస్తున్నాడు. అయితే ప్రజాస్వామ్యం అనేది అమెరికా వల్లించక తప్పని మంత్రం కాబట్టి ముషార్రఫ్ పాత్రను పదిలంగా కాపాడుతూనే ఎన్నికయిన పౌర ప్రభుత్వం పాకిస్తాన్‌ను ఏలడం బాగుంటుందని అమెరికా భావించింది. దీనికి జరగవలసిన ఏర్పాటుకు సహకరించడానికి బెనజీర్ భుట్టో ఒప్పుకుంది.

ఆ ఏర్పాటు ఏమిటంటే – ముషార్రఫ్ ఆమె ప్రత్యర్థి అయిన నవాజ్ షరీఫ్‌ను తరిమేస్తాడు గానీ ఆమెను మాత్రం పాకిస్తాన్‌కు రానిస్తాడు. ఎన్నికలలో గెలవనిస్తాడు. (ఆమె తండ్రి కాలం నుండి పాకిస్తాన్‌లో అత్యధిక ప్రజాదరణ గలది ఆమె పార్టీయే కాబట్టి ఆమెకు ప్రత్యేక సహాయం అవసరం లేకుండవచ్చు.) ఆపైన అమెరికా కనుసన్నలలో ప్రజాస్వామ్య పాకిస్తాన్‌ను ఇద్దరూ కలిసి నడుపుతారు.

ఈ మేరకు ఒప్పందం చేసుకోవడంలో బెనజీర్‌ను మెచ్చుకోడానికేమీ లేదు. అధికార దాహం, అవకాశవాదం మెచ్చుకోగల లక్షణాలు కావు.

అయితే బెనజీర్ ఈ పాత్ర పోషించడం పాకిస్తాన్‌లో చాలామందికి ఇష్టం ఉండదు. సైన్యానికి అసలు ఇష్టం ఉండదు. అమెరికా ఒత్తిడి మేరకు పౌర ప్రభుత్వంతో అధికారం పంచుకోవడం తప్పనిసరయితే, పెద్దగా ప్రజాబలం లేని పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే పాకిస్తాన్ సైన్యం అభిలషిస్తుంది. పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ వంటి ప్రజాదరణ గల పార్టీ, అందునా వ్యక్తిగత ఆదరణ గల నాయకురాలి సారథ్యంలో అధికారానికి రావడం వారికి రుచించదు. అదే కారణంగా పాకిస్తాన్ పౌర జీవితంలో ప్రముఖ పాత్ర వహించే గూఢచారి సంస్థ ఐఎస్ఐకి కూడ ఇష్టం ఉండదు. జనం బలం ఉన్న ప్రభుత్వాన్ని వెనక నుండి నడపడం కష్టం. మంచికైనా చెడుకైనా స్వంత తెలివితేటలున్న నాయకురాలు ప్రధానమంత్రి అయితే మరీ కష్టం.

ఇస్లాం పేరు మీద 'ధర్మయుద్ధం' నడుపుతున్న సాయుధ బృందాలకు కూడ ఇది ఇష్టం ఉండదు. వారిని అదుపు చేయడం అమెరికా తన ప్రయోజనాల నిమిత్తం ముషార్రఫ్‌కు అప్పగించిన ప్రధాన బాధ్యత. ముషార్రఫ్ ఒక పరిధిలో ఆ కర్తవ్యాన్ని

నిర్వర్తిస్తున్నాడు. అతని పాలనకున్న ప్రజామోదం బాగా క్షీణించిన క్రమంలో ఆ పరిధి కుంచించుకుపోతూ వుంది. ఈ స్థితిలో అతని స్థానాన్ని పాక్షికంగానైనా బెనజీర్ ఆక్రమించుకోవడం వారికి సవాలుగా కనిపిస్తుంది. జిహాదీ బృందాలను అణచివేయడం తన కర్తవ్యం అని ఆమె లండన్‌లో ఉండగానే ప్రకటించింది. పాకిస్తాన్‌లో ప్రధాన రాజకీయ పక్షమైన పాకిస్తాన్ పీపుల్స్ పార్టీది లౌకికవాద ప్రాపంచిక దృక్పథం. ఆ పార్టీ అధికారంలోకి రావడం జిహాదీ భావజాలానికి దెబ్బే.

వీళ్ళంతా తమకు ఇష్టం లేనిది జరుగుతుంటే చూస్తూ ఊరుకునే బాపతు కాదనేది మూడవ వాస్తవం. ఒక ప్రాణం తీయడం వారికొక లెక్కే కాదు, ఒకటి కాదు, వంద ప్రాణాలు తీయడమూ ఒక లెక్క కాదు. బెనజీర్ పాకిస్తాన్ గడ్డపైన కాలు మోపితే చంపుతాం అని కొందరు ప్రకటనలు సహితం ఇచ్చారు. ఆమె కాలు మోపిననాడే పెద్దెత్తున బీభత్సం సృష్టించారు, చాలామందిని నిజంగానే చంపారు.

ఇదంతా జరుగుతుందని తెలిసీ ఆమె పాకిస్తాన్‌కు తిరిగి వచ్చింది. మూడవసారి ప్రధానమంత్రి అవుదామన్న కోరిక ఆ భయాన్ని జయించిందని వ్యాఖ్యానించినా, లక్షలాది అనుచరుల ఆరాధన మత్తుమందులాగ పనిచేసిందని భావించినా, చావు దాదాపు తథ్యమని తెలిసీ పాకిస్తాన్‌కు వెనక్కి రావడం గౌరవించదగ్గ నిర్ణయమే. పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్యం, పౌర పాలనల పునరుద్ధరణ కోసం తనను తాను బలి ఇచ్చుకుందన్న వ్యాఖ్యలో కొంత అతిశయోక్తి ఉందనుకున్నా ఆవగింజంత సత్యం కూడ లేకపోలేదు. ఆ దేశ ప్రజాతంత్రవాదులు ఆమె అవలక్షణాలన్నీ ఎరిగి కూడ ఆమె చావుతో పౌరపాలన పునరుద్ధరణ నాలుగడుగులు వెనక్కి వేసిందని ఊరికే ఆవేదన చెందడం లేదు. ఆమె చనిపోయిన రోజు నుండి ముషార్రఫ్ ముఖంలో 'దొంగ కోళ్ళోడి' చూపు ఉండిపోయింది.

*ప్రజాతంత్ర వారపత్రిక*
*6 జనవరి 2008*

# ఉద్వేగాల మాటున వాస్తవాలు

దేశం చాలా ఆవేశంగా ఉంది. చాలా అసహనంగానూ ఉంది. 'ఇక ఓర్చుకోలేం' అంటున్నారు. 'ఇప్పటికి జరిగిన నష్టం చాలు' అంటున్నారు. 'ఇంక ఉదాసీనంగా ఉండడానికి వీలు లేదు' అంటున్నారు. 'కఠినచర్యలకు సమయం ఆసన్నం అయింది' అంటున్నారు. ఎప్పుడూ ఏ సామాజిక సమస్యల గురించీ మాట్లాడని వర్గాల వారు సహితం ఈ మాటలు అంటున్నారు.

ప్రభుత్వం ఏం చేయాలని? చేసి ఉండాలని? ఏం చేసి ఉంటే కిందటి వారం ముంబయిలో జరిగిన దాడి ఆగి ఉండేదని? అనుమానం మీద ఎవరినయినా కాల్చిపారేయొచ్చునన్న చట్టం పోలీసుల చేతిలో ఉంటే ఆగేదా? (అటువంటి చట్టం ఉండాలని ఇప్పుడు చాలామంది మనస్సులలో ఉందనుకుంటాను.) ముంబయి పోలీసులకు ఎవరి మీదా అనుమానం రాలేదు మరి. అటువంటప్పుడు అట్లాంటి చట్టం ఉన్నా కూడ ఆగేది కాదు కదా? పర్యవేక్షణ వ్యవస్థ వైఫల్యం అనీ, పోలీసు నిఘా వ్యవస్థ వైఫల్యం అనీ అంటున్నారు. జరగకూడనిది జరిగినట్టయితే అది జరగకుండ చూసే బాధ్యతగలవారు విఫలమయినట్టేననే తర్కం ప్రకారం ఇది సత్యమే గానీ, ఆ దాడి ఏ విధంగా జరిగిందో తెలిస్తే తప్ప పోలీసు సమాచార వ్యవస్థ దానిని పసిగట్టవలసి ఉండిందా, పసిగట్టలేకపోవడంలో నిర్లక్ష్యం వహించిందా అనేది తేల్చలేం. తేల్చకుండ పోలీసు పర్యవేక్షణ, నిఘా పెంచాలన్న డిమాండుకు పెద్దగా అర్థం లేకపోగా అది కొత్త సమస్యలు తెచ్చిపెట్టగలదు.

దాడి ఏ విధంగా జరిగిందో మీడియా మనకు చెప్పేసిందని చాలామంది అనుకుంటుండవచ్చు. కానీ మీడియా ఎన్ని కథలు చెప్పిందో! దాడిచేసిన వారు అప్పటికప్పుడు తీరం వద్ద పడవ దిగి నేరుగా వచ్చి దాడికి పాల్పడ్డారని అన్నారు.

లేదు, కొన్ని రోజులుగా ఇక్కడే ఉంటూ క్షుణ్ణంగా ఆ ప్రదేశాన్నంతా అధ్యయనం చేశారని కూడ అన్నారు. నాలుగు రోజుల ముందు తాజ్ హోటల్‌లో విద్యార్థుల పేరు మీద బస చేశారనీ, స్థానిక మిత్రులు వచ్చి కలిసి వెళ్ళారనీ అన్నారు. అసలు స్థానికులెవ్వరినీ కలవలేదని, గతంలో స్థానిక మద్దతుదార్లకు సమాచారం ఇవ్వడం వల్ల నష్టం జరిగిన ఉదంతాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి పూర్తిగా గోప్యంగా ఉంచారని కూడ అన్నారు. తాజ్ హోటల్ సిబ్బందిలో ఎవరో వారికి సహకరించారని అన్నారు. అటువంటిదేమీ లేదని ఆ హోటల్ యాజమాన్యం స్వయంగా ప్రకటించింది. హోటల్‌ను మొత్తం పేల్చేయడానికి పథకం వేసుకున్నారని అన్నారు. అది నిజమయి ఉండే అవకాశం లేదని, వారి దగ్గర అంత మందుగుండు లభ్యం కాలేదని ఎన్ఎస్‌జి కమాండరే అన్నారు.

వాస్తవమేమిటంటే దాడి మొదలయిన అరగంట నుంచి దృశ్య మీడియా దాని గురించి కథనాలు ప్రసారం చేస్తూనే ఉంది. ఎవరూ వెనుకబడిపోకూడదన్న ఆదుర్దాలో ప్రతి ఒక్కరూ తమ ఊహలను, తమకు అందుబాట్లో ఉన్న పోలీసు అధికారుల ఊహలనూ కలగలిపి కథనాలు కల్పించి మన ముందు ఉంచారు. ఈ కథనాలలో అధిక భాగం ‘అదిగో తోక అంటే ఇదిగో పులి’ అనే కోవకు చెందినవే. కొంతకాలం గడిస్తే తప్ప నిజంగా ఏం జరిగిందో తెలిసే అవకాశం లేదు. అప్పుడు తప్ప దాడిని నిలువరించడంలో వైఫల్యం నిజంగా ఎంత మేరకుందో తెలిసే అవకాశం లేదు. ఏడేళ్ళ కింద జరిగిన పార్లమెంటు దాడి కేసును ఈ సందర్భంలో జ్ఞాపకం చేసుకోవడం ఉచితంగా ఉంటుంది. దాడి జరిగిన వెంటనే ఎవరు చేశారు, ఏ విధంగా చేశారు అంటూ అనేక కథనాలు ప్రసారం అయ్యాయిగానీ చివరికి నేరపరిశోధన పూర్తిచేసి కోర్టులో నివేదిక దాఖలు చేసే నాటికి, దాడిచేసిన అయిదుగురి పేర్లతో సహా ఏమీ తెలియలేదని తేలింది. మొదట్లో ప్రసారమైన కథనాల ననుసరించి నిఘాను, పర్యవేక్షణను తీర్చిదిద్ది ఉంటే ఏమైనా ప్రయోజనం ఉండేదా?

పోలీసు బలగాల సంఖ్యనూ పర్యవేక్షణ బాధ్యతనూ పెంచడం ఎప్పుడయినా మంచిదే కదా అంటారేమో. పోలీసు పహారా పౌర స్వేచ్ఛలకు భంగం కలిగించకుండ కేవలం దుండగులను మాత్రం అరికట్టగలుగుతుందనుకోవడం భ్రమ. ఫైవ్ స్టార్ హోటల్ బయట నిలబడి మనం దేనికైనా సిద్ధపడాలని ఆవేశపడే వారికి, అస్పష్టమైన లక్ష్యంతో పెరిగే పోలీసు పహారా పొట్ట కూటి కోసం సకల వేళలలో, సకల ప్రాంతాలలో

సంచరించక తప్పని వారికి ఎంత కష్టం కలిగిస్తుందో అర్థం కాకపోవచ్చు. పోలీసు పహారాకు ఎప్పుడయినా స్పష్టమైన కర్తవ్య నిర్దేశనం ఉండాలి, ఆ పరిధిలోనే జరగాలి. లేకపోతే సాధారణ పౌర జీవితం దుర్భరంగా తయారవుతుంది.

అంటే కోపం వస్తుందేమోగానీ, గడచిన అయిదారు రోజులుగా వింటున్న ఆగ్రహం వెనుక దెబ్బతిన్న అహం ఉందన్న అభిప్రాయం కలగక మానదు. మనది ఇప్పుడెంత మాత్రం చిన్న దేశం కాదన్న అభిప్రాయం కొద్ది సంవత్సరాలుగా మనలో బలపడింది. పెద్ద దేశాలతో భుజం భుజం కలిపి సంచరించే దేశంగా మనల్ని మనం భావించుకుంటున్నాం. అటువంటి మన మీద, మూతిమీద ఇప్పుడిప్పుడే మీసాలు మొలుస్తున్న పది మంది పొరుగుదేశపు యువకులు దాడి చేయడం, అందునా మన ఆర్థిక వ్యవస్థకు కేంద్ర బిందువయిన, కార్పొరేట్ పెట్టుబడికి సంకేతాలయిన తాజ్, ఒబెరాయ్ వంటి హోటళ్ళపైన దాడిచేసి ఖరీదయిన మనుషులను సహితం హతమార్చడం మధ్యతరగతి భారతీయుల అభిజాత్యాన్ని దెబ్బతీసినట్టుంది. ఏ సందర్భంలోనయినా అన్నీ తెలిసిన ముఖాలతో అందరినీ తక్కువ చేసి మాట్లాడే ఇంగ్లీష్ టీవీ యాంకర్లు సహితం ఆవేశానికీ దుఃఖానికీ లోనుకావడం వెనుక ఉన్న మానవీయత ఎంత, దెబ్బతిన్న అభిజాత్యం ఎంత అంటే చెప్పడం కష్టమే. అదే దాడి, అదే ముంబయిలోని ధారవిలోనో, మరొక మురికివాడలోనో జరిగి ఉంటే ఎప్పటిలాగే అంటీ ముట్టని సానుభూతికి పరిమితం కాకపోదురా? ఊహలెందుకు – కొద్దికాలం క్రితమే అస్సోంలో భీకర మారణకాండ జరిగింది. బంగ్లాదేశీ ముస్లింలకూ, బోడో ఆదివాసులకూ మధ్య జరిగిన ఆ ప్రాణాంతక ఘర్షణకు దేశం స్పందించిన తీరును ముంబయి దాడికి స్పందించిన తీరుతో పోలిస్తే ఈ తేడా అర్థం అవుతుంది. దేశ హోంమంత్రి కాదు కదా, కనీసం అస్సోం రాష్ట్ర హోంమంత్రి సహితం రాజీనామా చేయలేదు. రాజీనామా చేయాలన్న ఒత్తిడీ లేదు.

పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పాలన్న ఆరాటం మనలో చాలా ఉంది. ఏమని చెప్పాలి? ఆ దేశం ఈ రకమైన దాడుల నుంచి తనను తానే కాపాడుకోలేకపోతున్నది. ముంబయిలో దాడి చేసినట్టు భావిస్తున్న బాపతు వారే పాకిస్తాన్‌లోనూ దాడులకు పాల్పడుతున్నారు. సాక్షాత్తూ తమ దేశ రాజధానిలోని లాల్ మసీదును స్థావరంగా ఏర్పరచుకొని దాడులకు పాల్పడుతున్న వారిని అక్కడి నుంచి బయటకు తరమడానికి

మొన్న ముంబయిలో భారత బలగాలు చేసిన దాని కంటే తీవ్రమైన పోరాటం పాకిస్తాన్ బలగాలు చేయవలసి వచ్చింది. అంతెందుకు, పాకిస్తాన్‌లో అత్యంత ప్రజాదరణ గల నాయకురాలయిన బెనజీర్ భుట్టోను ఈ మిలిటెంట్లే చంపుతామని చెప్పి మరీ బహిరంగంగా హతమార్చారు. తన మాజీ ప్రధానినే కాపాడుకోలేకపోయిన దేశాన్ని మన దేశంలోని హోటళ్లను కాపాడలేకపోయినందుకు శిక్షించాలా?

అటువంటి మిలిటెంట్ గ్రూపులు దేశంలో స్థావరం ఏర్పరచుకొని హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నందుకు పాకిస్తాన్ నైతిక బాధ్యత వహించనక్కరలేదా అంటారేమో! నైతిక బాధ్యత ప్రస్తావన వచ్చినట్టయితే ప్రధానంగా అమెరికా వైపు వేలు చూపించవలసివస్తుంది. ఆఫ్ఘనిస్తాన్‌లో తన ప్రయోజనాలు నెరవేర్చుకోవడం కోసం అమెరికా పాకిస్తాన్‌కు ఈ జాడ్యాన్ని అంటించింది. ఇప్పుడు చేతులు దులిపేసుకొని న్యాయనిర్దేశనం చేస్తున్నది. న్యాయంగా ఆలోచించినట్టయితే పాకిస్తాన్‌కు మనం ఇయ్యవలసింది సానుభూతి; ద్వేషం కాదు. అమెరికా సృష్టి అయిన ఈ సాయుధ మిలిటెంట్లు ఒకప్పుడు ఐఎస్ఐ అదుపులో ఉండేవారేమో గానీ ఇప్పుడు ఆ అదుపు కూడ వారిపైన అంతగా లేదు.

'పోటా' లాంటి చట్టాలు కావాలి. కఠినమైన చర్యలు కావాలి, ఇంక అణచివేత, మానవహక్కుల వంటి సున్నితమైన మాటలు మాట్లాడొద్దు అంటున్నారు. 'పోటా' పోలీసుల 'ఇంటెలిజెన్స్'ను పెంచదు. పెంచుకునే పరికరాలనూ ఇవ్వదు. సందేహాస్పదమైన సాక్ష్యంతో శిక్షవేసే అవకాశం మాత్రమే నేర విచారణ వ్యవస్థకు ఇస్తుంది. ఏ హింసకూ పాల్పడకున్నా కేవలం భావ సారూప్యత ఉన్నందున వ్యక్తులను శిక్షించే అవకాశం ఇస్తుంది. దీనితో సమస్య పరిష్కారం కాదు. దాడులను ఆపే శక్తి ఆవగింజంత పెరగదు. కానీ చాలామందిని జైలులో పెట్టిన సంతృప్తి ఇస్తుంది. ఇదా కావలసింది? ఇక అణచివేత, మానవహక్కులు మొదలయిన విషయాల మాటకొస్తే, ఈ మధ్యనే మనం శ్రీలంకకు చెప్పిన హితవును జ్ఞాపకం చేసుకుందాం. ఎల్‌టిటిఇపైన శ్రీలంక ప్రభుత్వం చేస్తున్న పోరులో సామాన్య తమిళ ప్రజలు హింసకు గురి అవుతున్నారని తమిళనాడుకు చెందిన సకల రాజకీయపార్టీలూ ఆందోళన వ్యక్తం చేశాయి. వెంటనే శ్రీలంక ప్రభుత్వంపైన భారత ప్రభుత్వం ఒత్తిడి పెట్టాలనీ, లేకపోతే బాగుండదనీ అల్టిమేటం జారీ చేశాయి. భారత ప్రభుత్వం సహితం అది వారి ఆంతరంగిక

విషయమని గానీ, ఎల్‌టిటిఇ వంటి దయలేని ప్రత్యర్థిని ఎదుర్కొనేటప్పుడు ఇటువంటి సున్నితమైన ప్రశ్నలు లేవదీయకూడదని గానీ అభ్యంతరం చెప్పలేదు. శ్రీలంక ప్రభుత్వానికి జాతి, మతం, భాషలతో నిమిత్తం లేకుండ ప్రజల హక్కులు కాపాడడంలో ప్రభుత్వానికి ఉండే బాధ్యత గురించి లెక్చర్ ఇచ్చింది. భారత ప్రజలందరూ హర్షించారు. ఆ విషయం అప్పుడే మరిచిపోతే ఎట్లా?

*ఆంధ్రజ్యోతి దినపత్రిక*
*3 డిసెంబర్ 2008*

# నిజాలపై అభ్యంతరమా?

ఇంతకూ బలూచిస్తాన్ విషయంలో మన విశ్లేషకుల, ప్రతిపక్ష పార్టీల అభ్యంతరం ఏమిటి? అబద్ధపు నిందకు మన్మోహన్ సింగ్ పొరబాటుగా నిజమన్న ముద్ర వేసాడనా, ఒప్పుకోకూడని నిజాన్ని అనవసరంగా ఒప్పుకున్నాడనా? 'పాకిస్తాన్ కశ్మీర్‌లో చేస్తున్న పనే ఇండియా బలూచిస్తాన్‌లో చేస్తున్నది. తప్పనుకుంటే రెండూ తప్పే. మాట్లాడుకో దలచుకుంటే రెండిటి గురించీ మాట్లాడుకోవాలి' అన్న అభిప్రాయాన్ని ప్రచారంలో పెట్టాలన్న పాకిస్తాన్ ప్రయత్నానికి షారమ్ ఉల్ షేఖ్ (ఈజిప్టులో ఒక పట్టణం) లో రెండు దేశాల ప్రధానులు విడుదల చేసిన ప్రకటన బలాన్ని చేకూర్చిందని మన్మోహన్ సింగ్ విమర్శకుల అభ్యంతరం. ఇది తప్పుడు అభిప్రాయం అన్న కారణంగా అభ్యంతరం తెలుపుతున్నారా, నిజమైనా సమానంగా నిజాలు కాని వాటిని ఒక సరసన చేర్చినందుకు అభ్యంతరమా, లేక నిజమైతే మాత్రం ఎందుకు ఒప్పుకోవాలి అని అభ్యంతరమా?

పార్లమెంటులోనూ మీడియాలోనూ జరుగుతున్న చర్చను చూస్తే ఈ సందేహాలకు జవాబు దొరకదు. మన్మోహన్ సింగ్ ఏదో చేయరాని పని చేసాడన్న అభిప్రాయం మాత్రమే కలుగుతుంది. భారత పౌరులుగా మనం మొదట గ్రహించవలసింది పాకిస్తాన్ వేస్తున్న నింద పూర్తిగా అవాస్తవం కాదని. మన ప్రభుత్వం దేశం లోపల తప్పుడు పనులు చేస్తుందని మనం సులభంగానే నమ్ముతాంగానీ దేశం బయట తప్పుడు పనులు చేస్తుందని ఒప్పుకోవడానికెందుకో మనసొప్పదు. దేశం బయట మన ప్రభుత్వం అనేది మన దేశంతో సమానార్థకం అయిపోతుంది. ప్రభుత్వం తప్పు చేసిందనడం దేశమే తప్పు చేసిందడంతో సమానమయిపోతుంది. ఇది ఎంతమాత్రం సహేతుకమయిన వైఖరి కాదు.

ఇతర దేశాల ఆంతరంగిక వ్యవహారాలలో తలదూర్చి ఆ దేశం మీద తమ పెత్తనాన్ని లేక ఆధిపత్యాన్ని బలోపేతం చేసుకోవాలని చూడడం, లేదా ఆ దేశ పాలనను

బలహీనం చేయడం ద్వారా ద్వైపాక్షిక సంబంధాలలో తమ స్థితికి బలం చేకూర్చుకోవాలని చూడడం అన్ని దేశాలూ చేసే పనే. దీని కోసం ప్రత్యేకమైన గూఢచారి సంస్థలు అన్ని దేశాలలోనూ ఉంటాయి. అమెరికాకు సిఐఎ ఉంది, పాకిస్తాన్‌కు ఐఎస్ఐ ఉంది, మనకు ఆర్ఏడబ్ల్యు లేక 'రా' ఉంది. అన్నిటి బలం, స్వతంత్రత ఒకటే కాకపోవచ్చును గానీ అన్నిటి స్వభావమూ ఒకటే. పాకిస్తాన్ విదేశాంగ నీతిని రూపొందించే విషయంలో ఐఎస్ఐకి స్వతంత్రత ఎక్కువే వుంది. అసలు పాకిస్తాన్ సైన్యానికే ఈ విషయంలో పాత్ర చాలా వుంది. కాని భారత్‌లో సైన్యం (ఇప్పటి దాకా) ప్రభుత్వానికి లోబడి పని చేస్తుంది. 'రా' కూడ అంతే. పాకిస్తాన్‌లో సైన్యం, అందులో భాగంగా ఐఎస్ఐ సమాంతర ప్రభుత్వ పాత్ర పోషిస్తాయి.

ఈ తేడాలు నిజమే అయినప్పటికీ మన పొరుగు దేశాల ఆంతరంగిక వ్యవహారాలలో 'రా' జోక్యం తక్కువేమీ కాదు, దాని విధ్వంసకర పర్యవసానాలూ తక్కువేమీ కాదు. పాకిస్తాన్ విషయంలో మన పాలకుల గురించి చెడు వినడానికి మనం సిద్ధపడము కాబట్టి శ్రీలంకకు సంబంధించిన వాస్తవాలు చెప్పుకోవడం ఉచితంగా ఉంటుంది. శ్రీలంకలోని తమిళ పోరాట సంస్థలతో 'రా'కు చాలా సన్నిహిత సంబంధం ఉండేది. ఒక్కొక్క దశలో కొన్నిటిని చేరదీసి, శిక్షణ సలహాలే కాక భౌతిక సహాయమూ అందజేసేది. మొదట ఎల్‌టిటిఇ 'రా'కు అత్యంత సన్నిహితం కాగా, తరువాత వేరే తమిళ సంస్థలనూ అది చేరదీసింది. ప్రభాకరన్ దాడి చేసి అంతమొందించిన ఇతర తమిళ పోరాట సంస్థలపైన అతను వేసిన ముఖ్యమైన నింద వారు 'రా' ఏజెంట్లు అనేది.

1950 నుండి శ్రీలంకలో సాధారణ తమిళ పౌరులపైన సింహళ జాత్యహంకారుల హింసాత్మక దాడులు జరుగుతున్నప్పటికీ 1983 దాకా తమిళ పోరాట సంస్థలు నిరాయుధులయిన సింహళ ప్రజలకు హాని కలిగించలేదు. వారి దాడులు సైన్యంపైన, ద్రోహులుగా ప్రకటించిన వారిపైన, పోలీసులపైన మాత్రమే ఉండేవి. ఆ దాడులకు ప్రతీకారంగా శ్రీలంక సైన్యమే నిరాయుధ తమిళ పౌరులపైన హింసాకాండకు పాల్పడేది. తమిళ పోరాట సంస్థలు నిస్సహాయంగా చూస్తూ ఉండేవి. దీనికి విరుగుడుగా తమిళ పోరాట సంస్థలు కూడ సాధారణ సింహళీయుల పైన ప్రతీకార దాడులకు పాల్పడాలన్న సలహా ఎల్‌టిటిఇకి ఇచ్చింది 'రా' అన్న

విషయం మనం తెలుసుకోవలసిన సత్యం. ఈ మాట అంటున్నది భారత్‌ను ద్వేషించే సింహళ అతివాదులు కాదు. చాలా బాధ్యతగా ఆధునిక శ్రీలంక చరిత్ర గురించి రాస్తున్నవారే అంటున్నారు. 'రా' ఇచ్చిన సలహాను ప్రభాకరన్ ఒంటబట్టించుకున్న తరువాతే ఎల్‌టిటిఇ జరుపుతున్న పోరులో అమాయక సింహళీయులపైన దాడులు, క్రూరమైన హింసాకాండ మొదలయింది. అప్పటిదాకా శ్రీలంక ఉత్తర భాగంలో సింహళీయులు తమిళుల మధ్య సురక్షితంగానే బతికేవారు.

ఇండియాకు మొదటి నుండి ఇరాన్‌తోనూ ఆఫ్ఘనిస్తాన్‌తోనూ సత్సంబంధాలు వున్నాయి. ఆ రెండు దేశాలకూ పాకిస్తాన్‌తో సరిహద్దు ఉంది. బలూచ్ జాతీయులు పాకిస్తాన్‌లోనూ ఇరాన్‌లోనూ కూడ ఉండగా, పష్తూన్ జాతీయులు పాకిస్తాన్‌లోనూ ఆఫ్ఘనిస్తాన్‌లోనూ ఉన్నారు. ఈ పరిస్థితిని వాడుకుని 'రా' ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్‌లలోని భారత రాయబార కార్యాలయాలను కేంద్రం చేసుకొని పాకిస్తాన్ ఆంతరంగిక సంక్షోభాలలో జోక్యం చేసుకోవడం తొలి నుండి జరుగుతున్నది. తిరుగుబాటుదార్లకు ఆశ్రయం కల్పించడం, ఆర్థిక సహాయం ఇవ్వడం, వ్యూహ సంబంధమైన సలహాలు ఇవ్వడం జరుగుతున్నది. అంతకంటే ఎక్కువ చేస్తున్నారో లేదో తెలీదు కాని మనకు కశ్మీర్ విషయంలోనూ, ముస్లిం సమాజం విషయంలోనూ ఐఎస్ఐ గురించి ఫిర్యాదు ఉన్నట్టే పాకిస్తాన్‌కూ 'రా' నిర్వహిస్తున్న ఈ పాత్ర గురించి అభ్యంతరం ఉండవచ్చును.

పాకిస్తాన్ ఇండియాలో చేసినా, ఇండియా పాకిస్తాన్‌లోను, శ్రీలంకలోను, అవకాశం ఉంటే చైనాలోనూ చేసినా ఆ దేశాలలో వివక్షకో అణచివేతకో గురి అవుతున్న ప్రజా వర్గాలకు సహాయమే కదా అనుకుంటే అది అందరికీ సమానంగా వర్తిస్తుంది. కాగా, ఇటువంటి సహాయం ఏదైనా బహిరంగంగా, పారదర్శకంగా ఉండకపోతే అందులో అనాగరికమైన, అమానవీయమైన లక్షణాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. కాని ఎవరూ బహిరంగంగా, పారదర్శకంగా చేయజాలరు. ఎందుకంటే ఎవరెన్ని కుట్రలు చేసినా అన్ని దేశాలూ అన్ని రాజ్యాలూ పరస్పర సార్వభౌమత్వాన్ని గౌరవిస్తున్నట్టు చెప్పుకోక తప్పదు. ప్రపంచాన్ని సర్వసత్తాక సార్వభౌమ రాజ్యాల సమాహారంగానే తప్ప ఇంకొక రకంగా చూడడానికి, నిర్వచించడానికి ఏ రాజ్యమూ సిద్ధంగా లేదు. ఆ పని చేస్తే పెద్ద విప్లవమే అవుతుంది. అది సాధ్యం కాకపోవడం వల్ల ఒక దేశ వ్యవహారాలలో మరొక దేశం జోక్యం కుట్రలూ కుహకాల రూపంలో

ఉంటున్నది. ఎవరికి వారు తమ దేశ పౌరుల నుండి మాత్రం తమ నిర్వాకాన్ని దాచి పెట్టుకొని దాని గురించి ఎవరైనా ప్రశ్నిస్తే దేశద్రోహం అని దబాయిస్తున్నారు. ఈ విషయంలో మన కంటే పాకిస్తాన్ పౌర సమాజం నయం. ఆ దేశంలో ఐఎస్ఐ గురించి, దాని జాతీయ అంతర్జాతీయ పాత్ర గురించి చర్చ బహిరంగంగానే జరుగుతుంటుంది. కనీసం ఆ మాత్రం పారదర్శకతయినా మనమెప్పుడు నేర్చుకుంటామో!

*ప్రజాతంత్ర వారపత్రిక*

*9 ఆగస్టు 2009*

## ఆఫ్ఘనిస్తాన్




# ముల్లా మహమ్మద్ ఒమర్‌కు సలాములు

మితిమీరిన మూర్ఖత్వం వల్ల ఒక్కొక్కసారి కొన్ని ప్రయోజనాలుంటాయి. దానిని అందరూ ఖండిస్తారు కాబట్టి అప్పటివరకు ఒక సామాన్య ప్రాతిపదిక లేని కారణంగా దూషణగా సాగిన సంభాషణ సంవాదంగా మారే అవకాశం ఏర్పడుతుంది. 'మీ ప్రమాణాలు మేము ఒప్పుకోము కాబట్టి మీకు మేము జవాబు చెప్పనక్కర్లేదు' అనేవాళ్ళు తమకే తెలియకుండా ఒక సామాన్య ప్రమాణాన్ని ఒప్పేసుకుంటారు కాబట్టి రేపు ఆ మాట మళ్ళీ అనలేరు.

బాబ్రీ మసీదును కూల్చివేసినప్పుడు, క్రైస్తవ పూజా స్థలాలను తగలబెట్టినప్పుడు, బైబిల్ గ్రంథాలను కాల్చేసినప్పుడు 'ఇది అనాగరికం' అని అభిశంసిస్తే అది హిందువుల సెంటిమెంట్లకు సంబంధించిన విషయమనీ, జాతి ఆకాంక్ష అనీ, విదేశీయులూ లౌకికవాదులూ నిర్దేశించే ప్రమాణాలను తాము ఆమోదించమనీ మన హిందూత్వవాద పార్టీలన్నీ అన్నాయి. 'సార్వజనీన ప్రమాణాలను మేము అంగీకరించము' అని ప్రకటించడం సంవాదాన్ని తప్పించుకోవడానికీ, మన ప్రవర్తనకు ఎవరికీ జవాబు చెప్పకుండా ఉండటానికీ సులభమైన మార్గం. సార్వజనీనమని ప్రకటించుకునే ప్రమాణాలన్నీ నిజానికి సార్వజనీనం కాకపోవచ్చును కాబట్టి అన్ని ప్రమాణాలను విమర్శనాత్మకంగా చూడాలన్న న్యాయమైన అభ్యంతరాన్ని ఈ తప్పుడు ప్రయోజనం

కోసం అన్ని రకాల 'పునాది వాదులు' వక్రీకరించి వాడుకుంటూ ఉంటారు. మన సంఘ్ పరివార్ గుంపు అందులో ప్రథములు. ఈ వైఖరి అహేతుకం అని వారి చేతనే చెప్పించడానికి తాలిబన్ల అతి మూర్ఖత్వం పనికొచ్చింది. ఆఫ్ఘనిస్తాన్‌లో బౌద్ధ విగ్రహాల విధ్వంసాన్ని గురించి వార్తలు రావడం మొదలయినప్పటి నుండి మన దగ్గర అందరి కంటే ఎక్కువగా హిందూత్వవాదులు దానిని ఖండిస్తున్నారు. ఖండించే క్రమంలో తమకే తెలియకుండా సార్వజనీన ప్రమాణాలను ఉటంకించే 'ట్రాప్'లో పడిపోతున్నారు. 'ఈ చర్య ఆఫ్ఘనిస్తాన్ ప్రజల సెంటిమెంట్లకు వ్యతిరేకం' అనడం లేదు వాళ్ళు. 'ఇది అనాగరికం' అంటున్నారు. 'ఇది ఆఫ్ఘన్ జాతి ఆకాంక్షలకు విరుద్ధమైన చర్య' అనడం లేదు, 'ఇది మానవ సాంస్కృతిక వారసత్వాన్ని విధ్వంసం చేసే చర్య' అంటున్నారు.

వాళ్ళ భాషలోనే ముల్లా మహమ్మద్ ఒమర్ జవాబు చెప్తే ఏమంటారు? అతను ఆఫ్ఘన్ సంస్కృతి ఇస్లామిక్ సంస్కృతేనంటాడు. ప్రవక్త మహమ్మద్ పుట్టకముందే ఆఫ్ఘనిస్తాన్‌లో ఒక అభివృద్ధి చెందిన నాగరికత ఉందని ఒప్పుకోడు. ఆ సంస్కృతి చిహ్నాలు ఆఫ్ఘనీ జాతీయతలో భాగమేనంటే ఒప్పుకోడు. ఆ సంస్కృతి, ఆ చిహ్నాలు ఇస్లామీకరణ చెందితేనే వాటిని ఆఫ్ఘనీ సంస్కృతిలో భాగంగా చూస్తానంటాడు. ఇస్లామీకరణ చెందలేని వాటిని దేశం నుండి తరిమేస్తానంటాడు. విగ్రహాలు ఎట్టి పరిస్థితిలోనూ ఇస్లామీకరణ చెందజాలవు కాబట్టి వాటిని ధ్వంసం చేస్తానంటాడు.

ఇదంతా ఎక్కడో విన్నట్టు లేదూ? ఏమంటారు సుదర్శన్‌జీ! ఎప్పుడో మీ నోట పలికినట్టు లేదూ?

తాలిబన్‌ల ఘాతుకాన్ని గంభీరంగా ఖండించిన దేశాలలో చైనా కూడ ఒకటి. చైనా టిబెట్‌లో యాభై ఏళ్ళుగా బౌద్ధమత చిహ్నాలనూ, సంస్థలనూ తొక్కిపెట్టడానికి చేస్తున్న ప్రయత్నం స్వల్పం కాదు. టిబెటన్ జాతీయవాదం తలెత్తకుండా ఉండాలంటే ఆ జాతీయతా భావనలో విడదీయరాని భాగమైన బౌద్ధమత చిహ్నాలనూ, సంస్థలనూ తొక్కిపెట్టడం అవసరమని చైనా గుర్తించింది. కొంత బలప్రయోగంతో, కొంత నక్కజిత్తులతో ఆ పని చేస్తున్నది. 'మానవ జాతి వారసత్వం' అని ఆఫ్ఘనిస్తాన్‌లోని బౌద్ధ విగ్రహాలను అభివర్ణించడానికి ఏ మాటయితే అందరూ ప్రయోగిస్తున్నారో ఆ మాట వర్తించే కట్టడాలనేకం టిబెట్‌లో నిరాదరణకు గురయి నాశనం అయ్యాయి. 'సాంస్కృతిక విప్లవ' కాలంలోనయితే ప్రత్యక్ష దాడులతోనే నాశనం అయ్యాయి.

బౌద్ధానికి ప్రతినిధులుగా తాలిబన్‌ను గట్టిగా తిట్టిన వారిలో శ్రీలంక పాలకులూ ఉన్నారు. కాని తమ దేశంలో మాత్రం సింహళ భాష, బౌద్ధమతం తప్ప వేరే ఏ సంప్రదాయమూ తమ జాతీయతలో భాగం కాదని, వేరే ఏ సాంస్కృతిక వారసత్వాన్నీ తమ సంస్కృతిలో భాగంగా గుర్తించమనీ గొడవ పెడుతున్న సింహళీయ అతివాదులను కాదనడం వారికి సాధ్యం కావడం లేదు. తమిళ భాషకు గానీ, హైందవ మతానికి గానీ సింహళంతో, బౌద్ధంతో సమాన ప్రతిపత్తి కల్పించి బతకగల రాజకీయ పార్టీ శ్రీలంకలో లేదు. వీటిని తాలిబన్‌ల దుశ్చర్యలతో సమానం చేసి చూడడం న్యాయం కాదంటారు. కాదని నేను కూడ ఒప్పుకుంటాను. అమానవీయమైన, అనాగరికమైన చర్యలలోనూ హెచ్చు తగ్గులుంటాయని, ఆ తేడాలను తృణీకరించకూడదని అంటేనూ ఒప్పుకుంటాను.

కానీ ఇక్కడుండేది కేవలం హెచ్చుతగ్గుల తేడా కాదు. ఇతరులు తమ అనాగరికతకొక ఆకర్షణీయైన పేరు పెట్టుకుంటున్నారు. తాలిబన్లకు చేతకాకనో, ఏమీ దొరకకనో, అవసరమనుకోకనో గానీ తమ మూర్ఖత్వానికి వాళ్ళు రాజకీయంగా ఆమోదనీయమైన పేరేదీ పెట్టుకోవడం లేదు. చైనా టిబెట్‌లో ప్రజల విశ్వాసాలపైన చేసిన దౌర్జన్యానికి భూస్వామ్య వ్యతిరేకపోరాటం అని పేరు పెట్టుకుంది. శ్రీలంక తన సమాజంలోని తమిళులకు సమాన హక్కులు నిరాకరించడాన్ని భారత విస్తరణవాదంపైన పోరాటంగా అభివర్ణించుకునింది. ఆ పని చేయని తాలిబన్‌ల అతి మూర్ఖత్వం వీరందరూ చూపించే సుందరమైన కారణాల వెనక దాగి ఉన్న అనాగరికమైన వైఖరుల గురించి మాట్లాడుకోవడానికి మనకు అవకాశం కల్పించింది. అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాలలోకి యూరప్ నుండి వలసపోయి స్థిరపడిన తెల్లవాళ్ళు స్థానికులయిన ఆదివాసులను తీవ్రమైన బలప్రయోగంతో అణచివేశారు. భౌతికంగా వారిని మట్టుబెట్టడమే కాక వారి నాగరికతా చిహ్నాలను నామరూపాలు లేకుండా ధ్వంసం చేశారు. అవి కూడ ఆఫ్ఘనిస్తాన్‌లోని బౌద్ధ విగ్రహాల లాగా మానవ సాంస్కృతిక వారసత్వానికి చెందినవే.

ఈ రోజు అమెరికాలోనూ ఆస్ట్రేలియాలోను ఉన్న తెల్లవాళ్ళు తమ తాత ముత్తాతలు చేసిన దౌర్జన్యాన్ని గురించి చర్చించుకుంటున్న మాట వాస్తవమే. అందరూ కాకున్నా కొందరు దానిని దౌర్జన్యంగా గుర్తిస్తున్న మాట కూడ వాస్తవమే. ఇప్పుడొప్పుకుంటే వారికి పోయిందేమీ లేదని సినికల్‌గా అనొచ్చునేమో గానీ ఒప్పుకునే సంస్కారం కొంతమందయినా ప్రదర్శిస్తున్నారని గుర్తించక తప్పదు. కానీ తమ తాత

ముత్తాతలు తాలిబన్‌ల వంటి వారేనని ఆ దేశాల తెల్లజాతీయులు – ఇవాళ తాలిబన్‌లను పురుగుల లాగా చూస్తున్నవారు – ఒప్పుకునే రోజు వస్తుందా? తాలిబన్‌ల అనాగరిక చర్య ఈ ప్రశ్నను వారి ముందు నిక్కచ్చిగా నిలబెట్టింది కదా!

అందుకే ముల్లా మహమ్మద్ ఒమర్‌కు నా సలాములు. వారికి శాంతి అగుకాక.

*ప్రజాతంత్ర వారపత్రిక*

*17 మార్చి 2001*

# ఆఫ్ఘనిస్తాన్ భవితవ్యం

ఆఫ్ఘనిస్తాన్‌పైన అమెరికా చేస్తున్న యుద్ధం లక్ష్యాలు మనం చూస్తుండగానే మారుతున్నాయి.

టెర్రరిజంను శాశ్వతంగా మట్టుబెట్టే యుద్ధంగా మొదలయింది అది. అయితే టెర్రరిజం అని పిలవబడే దాని సామాజిక రాజకీయ పార్శ్వాలను వారు చూడదలచుకో లేదు. అందువల్ల తాము వేటాడుతున్న దాని నైజాన్ని అర్థంచేసుకో నిరాకరించారు. అంతేకాక టెర్రరిజం అంటే వట్టి బీభత్సమేననుకున్నా ఆ పదాన్ని అమెరికా ప్రయోగించే తీరులో చాలా సమస్యలు లేకపోలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే, ఆ అగ్రరాజ్యం తన ప్రయోజనాలకు ఉపయోగపడే బీభత్సానికి ఆ పేరు ఎప్పుడూ పెట్టలేదు. కాని తన ప్రయోజనాలకు వ్యతిరేకమైన రాజకీయ కార్యకలాపాలను మాత్రం – అనేక జాతి విముక్తి ఉద్యమాలనూ, సామాజిక ఉద్యమాలనూ కూడ – బీభత్సకాండ అని నిందించింది. అంతే కాదు తాను, తన మిత్రదేశాలు ప్రత్యక్షంగా చేసిన బీభత్సాన్ని సైతం టెర్రరిజం అనకపోగా ప్రజాస్వామ్యమూ, మానవహక్కులూ మొదలయిన గొప్ప విషయాలను రక్షించే కార్యక్రమాలుగా వాటిని అభివర్ణించింది.

ఇదంతా నిజమే అయినప్పటికీ, మొదట్లో ప్రకటించుకున్న లక్ష్యం కనీసం చెప్పుకోవడానికి గంభీరంగా ఉండింది. ఇప్పుడది మారి అగ్రరాజ్యాలకు సుపరిచితమైన లక్ష్యం రూపం తీసుకునింది. ఆఫ్ఘనిస్తాన్‌ను అదుపు చేయడం ఇప్పుడా యుద్ధం లక్ష్యం. ఆఫ్ఘనిస్తాన్‌ను విడిచిపోయే లోపల ఆమెరికా, దాని మిత్రదేశాలు తమ ప్రయోజనాలకు తగిన రాజ్యాన్ని ఆ దౌర్భాగ్యపు దేశంలో కూచోబెడతారు. 'టెర్రరిజం అంతానికి కంకణం కట్టిన ఆ అంతర్జాతీయ కూటమి'లో ఒక్కొక్కరికి ఆఫ్ఘనిస్తాన్ భవిష్యత్తు గురించి ఒక అభిప్రాయం ఉంది, ఒక నమూనా ఉంది.

అమెరికాకు కావాల్సింది తన శత్రువులకు ఆశ్రయం ఇవ్వని రాజ్యం. దానితోబాటు మధ్యఆసియాలోని నూనె, సహజవాయు నిక్షేపాలు కరాచీ రేవుకు తీసుకుపోవడానికి సహకరించే ప్రభుత్వం. పాకిస్తాన్‌కు తన మిత్రుడిగా ఉండే రాజ్యం కావాలి. ఇండియాకు పాకిస్తాన్ మిత్రునిగా ఉండని రాజ్యం కావాలి. ఉజ్బెకిస్తాన్‌కూ తజకిస్తాన్‌కూ ఇస్లామిక్ మతవాదాన్ని ఎగుమతి చేయని రాజ్యం కావాలి. రష్యాకూ అదే కావాలి, కానీ ఇంకా నిర్దిష్టంగా చెచెన్యాకు మిలిటెంట్లను పంపించని రాజ్యం కావాలి.

ఇది 'అంతర్జాతీయ కూటమే' కాని టెర్రరిజాన్ని అంతం చేసే కూటమి కాదు. వారి వారి ప్రయోజనాల కనీస సామాన్య లక్షణాలకు అనుగుణంగా ఆఫ్ఘనిస్తాన్ రూపురేఖలను తిరగరాయడానికి పూనుకున్న కూటమి. చరిత్ర నిండా ఇటువంటి బహుళ రాజ్య కూటములు కనిపిస్తాయి. ఎటొచ్చీ గతంలో అవి అనంతమైన న్యాయం అనీ, అఖండమైన స్వేచ్ఛ అనీ పేర్లు తగిలించుకోలేదు.

టెర్రరిజాన్ని అంతం చేయడం ప్రకటిత లక్ష్యమైన దశలో ప్రజాస్వామ్యం అందుకు ప్రేరణ అన్నారు. ఇప్పుడు నడుస్తున్న ప్రయత్నాలకు ప్రేరణ ఏదయినా కావచ్చును గానీ ప్రజాస్వామ్యం మాత్రం కాదు. ఆధునిక కాలంలో తమ దేశీయ వ్యవహారాలపైన తమకు ఏ రకమైన ఆజమాయిషీ ఏ రోజూ ఉండని ఆఫ్ఘన్ ప్రజల పీడకలను ఇంకొంతకాలం కొనసాగించడమే రేపు జరగబోయేది. ఆ దేశ నైసర్గిక రాజకీయ పరిస్థితి కారణంగా ఒక శతాబ్దం పైగా అది అప్పటి అగ్రరాజ్యాల నిరంతర జోక్యం కింద నలిగిపోయింది. గడచిన రెండు నెలలుగా ప్రజాస్వామ్యాన్ని గురించి, నాగరికత గురించి మనం వింటున్న పెద్ద పెద్ద మాటలన్నీ ఆ దుర్భరమైన ఇతిహాసంలో మరొక అధ్యాయం రాయబోతున్నారన్న వాస్తవానికి అందమైన ఆచ్ఛాదన మాత్రమే. ఈ కొత్త అధ్యాయంలో కనీసం ఒక పాద సూచిక లభించే అవకాశం తనకివ్వాలన్నది భారత్ తాపత్రయం.

19వ శతాబ్దంలో ఆఫ్ఘనిస్తాన్‌కు ఉత్తరాన జార్ చక్రవర్తుల రష్యా సామ్రాజ్యం, దక్షిణ ఆగ్నేయ సరిహద్దుల ఆవల బ్రిటిష్ సామ్రాజ్యం ఉండేవి. ఆ రెండు పెత్తందారీ రాజ్యాలూ విరామం లేకుండా ఆఫ్ఘన్ వ్యవహారాలలో జోక్యం చేసుకున్నాయి. ఆ తరువాత బోల్షెవిక్ విప్లవం వచ్చింది. దానిని అణచడానికి అమెరికా తయారుచేసిన

కూటమి పుట్టింది. సోవియట్ రష్యా త్వరలోనే అగ్ర రాజ్యాల చిల్లర లక్షణాలన్నీ అలవరచుకుంది. త్వరలోనే ఆఫ్ఘనిస్తాన్ అమెరికా – రష్యాల 'ప్రచ్ఛన్న యుద్ధం'లో భాగమయింది. రష్యా బలవంతంగా కూచోబెట్టిన ప్రభుత్వాన్ని ఆఫ్ఘనిస్తాన్ భరించవలసి వచ్చింది. ఆ తరువాత ఆ ప్రభుత్వాన్ని కూలదోయడానికి అమెరికా ఎగదోసిన అంతర్యుద్ధాన్నీ భరించవలసి వచ్చింది. వెనుకబడిన దేశాన్ని ఆక్రమించుకున్న ఒక ఆధునిక సైన్యం మీద పోరాటం చేయడానికి మత మౌఢ్యమే సరయిన ఆయుధం అని అమెరికా సంకుచితంగా లెక్కలు వేసింది. ప్రపంచంలో ఎక్కడెక్కడో ఉన్న 'జిహాదీ'లందరినీ ఒకచోట చేర్చి రష్యా నెలకొల్పిన ప్రభుత్వం పైకి ఎగదోసింది. రష్యా వాళ్ళు వెళ్ళిపోయారు గానీ మత తీవ్రవాదులు ఉండిపోయి ఆఫ్ఘన్ పాలకులయ్యారు. వారు ఆఫ్ఘనిస్తాన్‌ను సాయుధ మత మౌఢ్య కేంద్రం చేశారు. పోను పోను ఒకనాటి ఆ అమెరికా మిత్రులే అమెరికాకు శత్రువులయ్యారు. ఆ కారణంగా మానవ నాగరికతకూ శత్రువులయ్యారు. ఇప్పుడు వాళ్ళను గద్దె దించే కేళి మొదలయింది.

ప్రపంచంలోని అన్ని దేశాలూ చిన్నవీ పెద్దవీ – ఇండియాతో సహా – ఈ కేళిలో భాగమయ్యాయి. వారి వారి భిన్నమయిన (ఇక్కడే సమస్య ఉంది) అవసరాలకు అనుగుణమైన ప్రభుత్వాన్ని ఆఫ్ఘనిస్తాన్‌లో నెలకొల్పే విషయమై బేరసారాలు చేస్తున్నారు, లెక్కలు వేస్తున్నారు. ఎంతమంది పఖ్తూన్లు, ఎంతమంది పఖ్తూనేతరులు ఆ ప్రభుత్వంలో ఉండాలి, ఏ పఖ్తూన్లు మంచి పఖ్తూన్లు అనే చర్చలో అంతా తలమునిగి ఉన్నారు. ఈ వైఖరి ఎంత హేయమైనదో అర్థం చేసుకోవాలంటే దీనికి ఒకే ఒక మినహాయింపుగా ఉన్న ఇరాన్‌ను ఉదాహరణగా తీసుకోవచ్చు. ఇరాన్ 'ప్రయోజనాలు' కూడ ఇండియా పాకిస్తాన్‌ల 'ప్రయోజనాల'తో సమానంగా ఆఫ్ఘనిస్తాన్‌తో ముడిపడి వున్నాయి. అయినప్పటికీ ఇరాన్ అధ్యక్షుడు మహమ్మద్ ఖటామీ 'అమెరికా, తాలిబన్‌లు ఒకే నాణానికి బొమ్మా బొరుసుల'ని ప్రకటించే నైతిక ధైర్యాన్ని ప్రదర్శించాడు. తన దేశాన్ని ఈ కేళికి దూరంగా ఉంచాడు.

అందరి కోరికలూ తీరతాయేమో గానీ ఆఫ్ఘన్ ప్రజలకు దీని నుండి ఏమొస్తుంది? తమ కోరికలకు తగిన రాజ్యం గానీ ప్రభుత్వం గానీ రాదని ఖచ్చితంగా చెప్పొచ్చు. రాబోయే ఆఫ్ఘన్ ప్రభుత్వం అమెరికా ప్రయోజనాలకు 70 శాతం అనుకూలంగా ఉండవచ్చు. పాకిస్తాన్ ప్రయోజనాలకు 10 శాతం, మధ్యఆసియా

ప్రభుత్వ ప్రయోజనాలకు 10 శాతం, రష్యా ప్రయోజనాలకు 5 శాతం, దేబిరిస్తున్న ఇండియా ప్రయోజనాలకు కూడ ఒక్క శాతం అనుకూలంగా ఉండవచ్చును గానీ అది ఆఫ్ఘనిస్తాన్ ప్రజల అవసరాలనూ, ఇష్టాయిష్టాలనూ వ్యక్తం చేసే ప్రభుత్వం మాత్రం కాబోదు.

ఆపైన 'అంతర్జాతీయ కూటమి' సంతృప్తి చెంది ఆఫ్ఘనిస్తాన్‌ను వదిలి వెళ్ళిపోతుంది కాని అది ఆఫ్ఘనిస్తాన్‌లో అంతర్యుద్ధం బీజాలు వదలి వెళ్తుంది. ఆ కూటమి ప్రయోజనాల నిమిత్తం చేసిన ఏర్పాటు వల్ల అసంతృప్తులయిన వారు ఉంటారు. వారు ఊరుకోరు. అధికారం కోసం మరొక రౌండు యుద్ధం మొదలవుతుంది. ఆ అంతర్యుద్ధాన్నీ, దాని పర్యవసానమైన సామాజిక, ఆర్థిక, పారిశ్రామిక విధ్వంసాన్నీ రాజకీయ స్వాతంత్రమంటే ఏమిటో ఎరుగని ఆ ప్రజలు భరించాలి.

అసహ్యకరమైన ఈ కేళిలో ఇండియా కూడ భాగం కావాలని మనం కోరుకుంటున్నామా?

*'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో 25-10-2001 వచ్చిన వ్యాసానికి*
*రచయితే చేసిన తెలుగు అనువాదం*
*మానవహక్కుల బులెటిన్-4, నవంబర్ 2001*

# యుద్ధసత్యాలు-మన కర్తవ్యం

అధికారం చేతిలో ఉన్నవాళ్ళ అభిప్రాయాలే సత్యంగా చలామణి అవుతాయన్న విషయం ఆఫ్ఘనిస్తాన్ యుద్ధం సందర్భంగా చాలా బలంగా రుజువయింది.

అయినప్పటికీ దానిని ప్రశ్నించే గొంతులు లేకపోలేదు. వాటికి కూడ ప్రసార సాధనాలు చోటు కల్పించకపోలేదు. ముఖ్యంగా ఇప్పటివరకు ప్రపంచ పాలకుల అజమాయిషీకి అతీతంగా ఉంటున్న ఇంటర్‌నెట్‌లో విమర్శనాత్మక స్వరాలు బలంగానే వినపడ్డాయి.

తెలుగు పాఠకులకు సులభంగా అందుబాటులో లేని ఈ వ్యాసాలను, ఉపన్యాసాలను, ఇంటర్వ్యూలను అనువదించి మా నాలుగవ బులెటిన్‌గా మీ ముందు ఉంచుతున్నాం. తెలుగులోనే రాసిన ఒకటి రెండు వ్యాసాలను వాటితోబాటు చేర్చాము.

అప్పటికి చర్చలో ఉన్న ముఖ్యమైన హక్కులకు సంబంధించిన విషయాలపైన వివరణాత్మకమైన వ్యాసాలు ప్రచురించడం మా బులెటిన్లు తీసుకురావడంలో మేము ఇప్పటివరకు అనుసరించిన పాలసీ. ప్రస్తుతం ఆఫ్ఘనిస్తాన్ యుద్ధం, దాని పూర్వాపరాలు అన్నిటినీ తలదన్నే ప్రాముఖ్యాన్ని సంపాదించాయి కాబట్టి ఈ నాలుగవ బులెటిన్ పూర్తిగా దానికే అంకితమయింది.

ఇవి ఎక్కువగా విదేశీయులు రాసిన వ్యాసాలు కావడం వల్ల వీటిలో ఇండియా వైఖరి గురించి ఎక్కువ లేదు. దాని గురించి నాలుగు మాటలు ఇక్కడ చెప్పుకోవడం ఉచితంగా ఉంటుంది. భారత ప్రభుత్వం సెప్టెంబర్ 11 నుండి ఇవాల్టి దాకా ఈ మొత్తం వ్యవహారంలో అమానవీయమైన అవకాశవాదాన్నీ, సిగ్గుమాలిన లేకితనాన్నీ ప్రదర్శించిందనడంలో అతిశయోక్తి లేదు. అయితే భారతీయ సమాజం కూడ అంతకంటే మెరుగుగా స్పందించకపోవడం మరీ బాధాకరం.

ఆఫ్ఘనిస్తాన్ ప్రజలు మనకు నైసర్గికంగానే కాక సాంస్కృతికంగానూ, రాజకీయం గానూ కూడ సన్నిహితులు. ఆ దేశంతో అమెరికాకు ఘర్షణ వచ్చినప్పుడు మన సానుభూతి సహజంగా వాళ్ళ పక్షాన ఉండవలసింది – అక్కడ అధికారంలో వున్న వారి తప్పొప్పుల సంగతి పక్కనపెట్టి. ఎటొచ్చీ 'ముస్లిం' అనే తెర ఒకటి అడ్డమొచ్చి ఆ సహానుభూతిని లేకుండా చేసింది.

మన స్కూలు పిల్లలు చదువుకునే జాతీయోద్యమ చరిత్రలో మెచ్చుకోలుగా ప్రస్తావించే 'సరిహద్దు గాంధీ' ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ ప్రస్తుత పాకిస్తాన్ ప్రాంతానికి చెందినవాడే గానీ పష్తూన్ (లేక పఖ్తూన్) జాతీయుడు. ఆఫ్ఘనిస్తాన్ ప్రజలలో మెజారిటీ పష్తూన్‌లే. పగ, పంతం, ప్రతీకారం ముఖ్య విలువలుగా చలామణి అయ్యే పష్తూన్‌లలో గాంధేయవాదాన్ని బలంగా నిలబెట్టిన ఘనత, మత ఘర్షణలను గట్టిగా ఎదుర్కొని పష్తూన్‌ల ప్రాంతంలో శాంతి సామరస్యాలను కాపాడిన ఘనచరిత్ర గఫార్‌ఖాన్‌కు, ఆయన అనుచరులకు ఉంది. వారిలో చాలామంది మతం ప్రాతిపదికన ఏర్పడిన పాకిస్తాన్ ఆవిర్భావాన్ని వ్యతిరేకించినందుకు ఆ కొత్త రాజ్యంలో చాలాకాలం జైలులో కూడ ఉన్నారు. 'పష్తూన్' అనగానే తాలిబన్‌లు, ముజాహిదీన్‌లు తప్ప వేరే ఏదీ ప్రస్తావనకు రాని ఈ రోజులలో ఈ వాస్తవాన్ని ఒకసారి జ్ఞాపకం చేసుకోవడం అవసరం.

నైసర్గికంగానూ ఆఫ్ఘనిస్తాన్‌కు మన దేశంలోని కరువు ప్రాంతాలతో చాలా పోలిక ఉంది. ఇసుక నేలలలో పచ్చదనానికి తావు ఉన్నచోట సేద్యం చేస్తూ పశువులను పోషిస్తూ బతికే ఆఫ్ఘన్ ప్రజల జీవితం జార్జి బుష్‌కూ, టోనీ బ్లెయిర్‌కూ అర్థం కాకపోవచ్చునేమో గానీ మనకు సులభంగానే అర్థం అయివుండాలి. ఆ బతుకును బుగ్గిచేసే అధికార అహంభావాన్ని మనం స్పాంటేనియస్‌గా ద్వేషించి ఉండాలి.

ఋగ్వేదానికి రూపకల్పన చేసింది ఆఫ్ఘనిస్తాన్‌లోనే నంటే అద్వానీకి ఒళ్ళు మండుతుందేమోగాని అది ఒక చారిత్రక సత్యమే. ఆ తరువాత బౌద్ధానికి ఆ దేశం ఒక ముఖ్య కేంద్రంగా ఉండింది. భారతీయ సంస్కృతికి అనేక రంగాలలో ఔన్నత్యాన్ని చేకూర్చిన మొగలులు ఆఫ్ఘనిస్తాన్ నుండి ఇక్కడికి వచ్చినవారే.

ఇంతగా మనకు సన్నిహితులయిన ప్రజలు 'ముస్లిం' అన్న తెర అడ్డం వచ్చేసరికి పరాయివారయిపోయారు. మనకు ఏ రకంగానూ సన్నిహితులు గాని బుష్‌లూ బ్లెయిర్‌లూ

మన వాళ్ళయ్యారు. ఫలితంగా ఈ యుద్ధానికి ప్రజలలో అత్యధికంగా మద్దతు లభించిన దేశాలలో అమెరికా, ఇజ్రాయిల్‌ల సరసన ఇండియా నిలబడింది. మన సమాజంలో విపరీతంగా పాకిపోయిన ముస్లిం ద్వేషం తప్ప దీనికి వేరే కారణం లేదు.

ప్రపంచంలో ముస్లింలు అత్యధికంగా నివసించే దేశం ఇండోనేషియా కాగా రెండవ స్థానంలో ఇండియా ఉంది. పాకిస్తానయినా వేరే ఏ దేశమైనా మన తరువాతనే. ఇటువంటి దేశంలో సెప్టెంబర్ 11, దాని పర్యవసానాల ఫలితంగా ముస్లింలు – ముస్లిమేతరులు అన్న విభజన, వారి మధ్య అగాధం పెరగకుండా చూసుకోవడం మన ప్రభుత్వం ముఖ్య కర్తవ్యం అయి వుండవలసింది. దాని బదులు ఆ విభజననూ అగాధాన్నీ ద్వేషాన్నీ ఇదే అదనని పెంచడం మన పాలకులు ఒక పనిగా పెట్టుకున్నారు. ఎప్పటినుండో వున్న 'సిమి'ని నిషేధించారు. అయోధ్యలో గుడి కడతామన్న శపథాన్ని పునరుద్ఘాటించారు. తాజ్‌మహల్‌ను ఖరాబు చేశారు. 'ముస్లిం' తీవ్రవాదులు కోసమేనని స్పష్టం చేస్తూ పోటో ఆర్డినెన్స్‌ను జారీచేశారు.

దీని దుష్ఫలితాలు సామాజిక ఘర్షణల రూపంలోనూ, హింసాకాండ రూపంలోనూ చాలా చూడబోతాం.

విదేశాంగ విధానంలోనూ భారత్‌కు ఒకప్పుడు గౌరవించదగ్గ నీతి ఉండేది. అగ్రరాజ్యాల మధ్య అలీనంగా ఉండాలనీ, ప్రపంచ రాజకీయాలలో బడుగు దేశాలను ఒకటి చేయాలనీ, ఐక్యరాజ్యసమితిని బలోపేతం చేయాలనీ, నిరాయుధీకరణ వంటి లక్ష్యాల కోసం పనిచేయాలనీ – ఇటువంటి విలువలకు మన విదేశాంగ నీతిలో స్థానం ఉండేది. ఆచరణలో ఈ నీతి సోవియట్ కూటమి ప్రయోజనాలకు అనేక సందర్భాలలో  తాకట్టు పడినప్పటికీ సూత్రప్రాయంగా అది గౌరవించదగ్గది.

ఇప్పుడు మనకు ఏ నీతీ లేదన్న విషయం ఈ రెండు నెలలలో స్పష్టంగా రుజువయింది. పాకిస్తాన్‌ను భ్రష్టు పట్టించడం తప్ప మన విదేశాంగ విధానానికి వేరే లక్ష్యమేదీ ఇప్పుడు లేదు. అమెరికా పాకిస్తాన్‌కు ఎక్కడ దగ్గరయిపోతుందో అన్న భయం మన ప్రభుత్వ చర్యలన్నిటినీ శాసిస్తోంది.

పాకిస్తాన్ కంటే ముందు మనమే మన భూభాగాన్ని అమెరికా తన యుద్ధ అవసరాల కోసం వాడుకోవచ్చునని ప్రకటించాం. పాకిస్తాన్‌ను నమ్మొద్దని అమెరికాను

హెచ్చరించాం. ఆఫ్ఘనిస్తాన్ యుద్ధం ముగిసే లోపల 'కశ్మీర్ సమస్య'ను కూడ మనకు అనుకూలంగా 'పరిష్కరించేసు'కోవాలని ఆరాటపడ్డాం. అందుకు విరుద్ధంగా జరుగుతుందేమోనని భయపడ్డాం.

తాలిబన్లు దెబ్బతినగానే అమెరికా, దాని 'అంతర్జాతీయ కూటమి'లోని దేశాలు తమ ప్రయోజనాలకు తగిన ప్రభుత్వాన్ని ఆఫ్ఘనిస్తాన్‌పైన రుద్దాలని ప్రయత్నం మొదలుపెట్టగా ఆ దౌర్జన్యంలో మనకు కూడ కొంచెం వాటా కావాలని కోరాము. ఇవ్వలేదని అలిగాము. ఎవ్వరూ అడగకుండానే ఆఫ్ఘనిస్తాన్‌లో నూతన ప్రభుత్వం ఏ విధంగా వుంటే మంచిదని మనం అనుకుంటున్నామో ప్రకటించాం.

ఆఫ్ఘనిస్తాన్ భవితవ్యాన్ని ఆ దేశ ప్రజల ఇష్టానికి వదిలేద్దాం అనలేకపోయాము. సెప్టెంబర్ 11 నాటి దౌర్జన్యానికి జవాబు ఐక్యరాజ్యసమితి ద్వారా అన్వేషించాలని అనలేకపోయాము. కనీసం, యాభై ఏళ్ళుగా అమెరికా అంతర్జాతీయంగా అనుసరిస్తున్న దౌర్జన్యపూరితమైన విధానాలు సెప్టెంబర్ 11కు దారితీశాయని, ఇకనైనా ఆ దౌర్జన్యాన్ని అమెరికా వదిలిపెట్టాలని, ఐక్యరాజ్యసమితికి స్ఫూర్తినిచ్చిన శాంతి, ప్రజాస్వామ్యాల కాంక్షను పూర్తిస్థాయిలో పునరుద్ధరించడానికి అందరమూ పూనుకుందామని అనలేకపోయాము.

'ఉగ్రవాదాన్ని మట్టుబెట్టడం' అనే కర్తవ్యాన్ని ప్రపంచ దేశాల ప్రభుత్వాలన్నీ అమెరికా నాయకత్వం కింద ఒకటై ప్రపంచ ప్రజల ముందు ఉంచాయి. వారు లేవదీస్తున్న సమస్య సమస్యే కాదని అనలేము గానీ, అంతకంటే ముఖ్యమైన సమస్య ఈ ప్రభుత్వాల విచ్చలవిడితనాన్ని ఎవరు నియంత్రించాలి, ఏ విధంగా నియంత్రించాలి అనేది. ప్రభుత్వాల విచ్చలవిడి అణచివేతే 'ఉగ్రవాదం' అని పిలువబడే సాయుధ రాజకీయాలకు మూలం అనేది అన్ని సందర్భాలలోనూ సత్యం కాకపోవచ్చును గానీ దీనిని అదుపు చేస్తే దానిని నియంత్రించవచ్చుననేది చాలావరకు సత్యం.

ప్రభుత్వాల నడవడికను నియంత్రించడానికే ఒకనాడు లీగ్ ఆఫ్ నేషన్స్, ఆ తరువాత ఐక్యరాజ్యసమితి ఏర్పడ్డాయి. ఆ రెండింటి నిర్మాణంలోనూ అప్రజాస్వామిక లక్షణాలు మెండుగా ఉండడం వల్ల, ఇతర కారణాల వల్ల అవి తమ లక్ష్యాన్ని పెద్దగా సాధించలేకపోయాయి. అయినప్పటికీ వాటికి స్ఫూర్తినిచ్చిన ఆకాంక్షకు తిరిగి ప్రాణం పోయడం తప్ప ప్రస్తుత పరిస్థితిని చక్కదిద్దడానికి వేరే మార్గం లేదు.

దానితోబాటు మనబోటి దేశాలలో ముస్లింల పట్ల పెరుగుతున్న ద్వేషాన్నీ, ముస్లింలకూ ఇతరులకూ మధ్య పెరుగుతున్న అగాధాన్నీ ఎదుర్కొనడం చాలా అవసరం. లేనట్లయితే అమెరికా తన ప్రయోజనాలన్నిటినీ పదిలం చేసుకుని దక్షిణాసియా నుండి బయటపడే నాటికి మన సమాజాలు మరింత క్రూరంగా, వికారంగా తయారయి వుంటాయి.

*మానవహక్కుల వేదిక 4వ బులెటిన్‌లో సంపాదకీయం*

*20 నవంబర్ 2001*

ఇరాన్




# ఇరాన్ అణుశక్తి హక్కులు

## భారత వైఖరి న్యాయమైనదా? తెలివయినదా?

ఇరాన్ అణుబాంబు తయారు చేసుకునే సామర్థ్యాన్ని రహస్యంగా పెంపొందించుకుంటోందనే అమెరికా ఆరోపణను భద్రతా మండలికి నివేదించాలన్న ప్రతిపాదనకు మద్దతుగా భారత్ ఓటు వేయడం అనుకూల, వ్యతిరేక ప్రకటనలకూ, వాదనలకూ దారితీసిన విషయం తెలిసిందే. మన దేశ పాలకులు దేశం లోపలయినా, బయటయినా అన్యాయంగా నడుచుకున్నట్టయితే తెలుసుకోవడం, విమర్శించడం దేశ పౌరులుగా మన కర్తవ్యం కాబట్టి ఈ ఉదంతం పూర్వాపరాలు, భారత్ తీసుకున్న నిర్ణయంలోని న్యాయాన్యాయాలు మనం చర్చించుకోవాలి.

అగ్రరాజ్యాలు తమ వద్ద మాత్రమే అణుబాంబులు ఉండాలని, వేరే ఎవ్వరి వద్దా ఉండడానికి వీలులేదని మొదటి నుండీ అంటూ వచ్చాయి. కొత్తగా ఎవరూ బాంబులు తయారు చేసుకోకుండా చూడడానికి అణువ్యాప్తి నిరోధక ఒడంబడికను (ఎన్‌పిటి) రూపొందించి, దానిపైన సంతకం చేయవలసిందేనని బాంబులు లేని దేశాలపై ఒత్తిడి పెట్టాయి.

ఎన్‌పిటి పైన సంతకం చేసిన దేశాలలో ఇరాన్ ఒకటి. ఎన్‌పిటి అన్యాయమైన ఒడంబడిక అని నిరసించిన దేశాలలో ఇండియా ఒకటి. మనం అణుబాంబు తయారు

చేసుకున్న తరువాత మన పాలకులకు సహితం ఈ విషయంలో అగ్రరాజ్యాల బుద్ధి సోకింది గానీ అంతకుముందు మనం అన్నదేమిటంటే అణుబాంబులు ఎవరి వద్దా ఉండకూడదంటే సరేగానీ, కొందరు అణ్వస్త్రాలు ఉంచుకొని మిగిలిన వాళ్ళకు ఆ హక్కు లేదనడం అన్యాయం అని. ఆ తర్వాత మన పాలకులు అగ్రరాజ్యాలను ధిక్కరించి బాహాటంగానే అణుబాంబులు తయారు చేసుకున్నారు. అదే పని ఇవ్వాళ ఇరాన్ ఒకవేళ రహస్యంగా చేసుకుంటే మనకు కోపం ఎందుకు?

ఇరాన్ విషయంలో 'మన భద్రతకు మనం ప్రాధాన్యం ఇచ్చాం' అని ప్రధాని వివరణ ఇచ్చారు. ఆ మాట ఇరాన్ కూడ అనవచ్చునా? ఒకసారి ఆసియా చిత్రపటం చూడండి. ఇరాన్‌కు ఒకవైపు సరిహద్దు ఉన్న పాకిస్తాన్‌కు అణుబాంబు సామర్థ్యం ఉంది. రెండవ వైపు సరిహద్దు ఉన్న ఇరాక్ అమెరికా అదుపులో ఉంది. అమెరికా అణ్వస్త్ర సామర్థ్యం గురించి చెప్పనవసరం లేదు. సరిహద్దు దాటి ఇంకొంచెం దూరం దృష్టి సారించినట్టయితే ఇరాన్ చుట్టూ అర్ధవలయాకారంలో ఇజ్రాయిల్, రష్యా, చైనా, ఇండియా పరుచుకుని ఉన్నాయి. ఇవన్నీ అణుబాంబు గల దేశాలే. వీటిలో ఇజ్రాయిల్ 1979 నుండి ఇరాన్‌ను తన శత్రువుగా ప్రకటించి ఉంది. ఒకసారి ఇరాన్‌పైన దాడి కూడ చేసి ఉంది. నిజానికి, తన పరిసరాలలో ఇన్ని అణుబాంబులు కలిగి ఉన్న దేశాలు ఉండీ, తాను మాత్రం త్యజించిన దేశం ఇరాన్ తప్ప ప్రపంచలో వేరే ఏదీ లేదేమో!

ఇరాన్ ఎన్‌పిటి మీద సంతకం చేయడమే కాక, అనుమానం వస్తే వెతుక్కునే అధికారం కూడ అంతర్జాతీయ సంస్థ (ఐఏఇఏ) కి ఇచ్చింది. అక్కడితో ఆగిపోకుండా, యుద్ధేతర అవసరాల కోసం యురేనియం 'ఎన్‌రిచ్‌మెంట్' చేపడితే దానిని లోపాయికారీగా అణ్వాయుధాల తయారీకి వాడుకోవచ్చునన్న అగ్రరాజ్యాల కుశంకను సహితం గౌరవించి 3 సంవత్సరాల పాటు దానిపైన కూడ తనకు తానే నిషేధం విధించుకుంది. అయితే అగ్రరాజ్యాలను ఒకటి మాత్రం కోరింది. తన సాంకేతిక అవసరాలకూ, భద్రతావసరాలకూ న్యాయం చేకూర్చే బాధ్యత వారిదేననింది. వారు సై అన్నారుగానీ ఏమీ చేయలేదు.

ఏమీ చేయకపోగా, నువ్వు రహస్యంగా అణుబాంబులు తయారు చేసుకుంటున్నావని మాకు అనుమానంగా ఉంది కాబట్టి మా పరిశీలకులను పంపుతున్నాం అన్నారు. ఇరాన్ సహకరించింది. వాళ్ళు వెతికారు, వెతికారు, రెండేళ్ళు వెతికారు గానీ ఏం దొరకలేదు. 'అయినప్పటికీ మా అనుమానం నివృత్తి కాలేదు' అన్నారు ఐఏఇఏ వారు. ఆపైన ఇరాన్ విషయాన్ని భద్రతా మండలికి నివేదించారు.

ఇదేమయినా న్యాయమా? భారత్ దీనికి సహకరించడం సబబా? అన్నది మన ముందున్న ప్రశ్న. దేశంలో నాలుగవ వంతు జనాభాకు అన్నం పెట్టలేకపోయినా, ఒక అగ్రరాజ్యంగా గుర్తింపు పొందాలని మన వాళ్ళకు ఈ మధ్య కోరిక పట్టుకుని గతాన్ని మరిచిపోయారు గానీ దశాబ్దాల తరబడి అణుశక్తి వ్యాప్తి నిరోధక ప్రయత్నాల పట్ల భారత పాలకులు అనుసరించిన వైఖరికీ, ఇవ్వాళ ఇరాన్ అంటున్నదానికీ తేడా ఏమీ లేదు. 'మాకు అణుబాంబు తయారు చేసుకోవాలన్న కోరిక లేదు. అయితే మాతో శత్రుత్వం ఉన్నవారు తయారు చేసుకుంటే చేతులు ముడుచుకొని కూర్చోము. అంతేకాక, శాంతియుత అవసరాల కోసం మేము అణుశక్తిని వినియోగించుకున్నట్టయితే అదే క్రమంలో బాంబులు తయారు చేస్తామేమోనని ఏ అమెరికాకో అనుమానం వచ్చినంత మాత్రాన మా సాంకేతిక అవసరాలను మేము వదులుకోము.' ఇదే కదా భారత్ నోట జవహర్‌లాల్ నెహ్రూ కాలం నుండి విన్న మాట? ఇప్పుడు ఇరాన్ ఆ మాటే అంటే మన పాలకులకెందుకు అభ్యంతరమనిపిస్తున్నది?

భద్రతా మండలిలో మనం సహితం శాశ్వత సభ్యత్వం పొంది, వీలయితే వీటో హక్కు కూడ పొంది, అణ్వస్త్ర దేశంగా గుర్తింపు పొంది, ఊరిలో కాకపోతే గల్లీలోనయినా దాదాగా బతకాలన్న పెడబుద్ధి మన పాలకుల కళ్ళకు పొరలు కప్పిందనుకోకూడదా? ఈ కోరికలు తీరాలంటే అమెరికా పంచన చేరడమొక్కటే మార్గం అన్న అతి తెలివి వారి నైతిక స్పృహను మసకబార్చిందనుకోకూడదా?

రాజకీయాలలో – ముఖ్యంగా అంతర్జాతీయ రాజకీయాలలో – ప్రయోజనాలకే తప్ప విలువలకు చోటులేదని నమ్మేవారికి ఈ ప్రశ్నలు రుచించక పోవచ్చు. అయితే ప్రయోజనాలనే ప్రమాణంగా పెట్టుకున్నా అమెరికా బంటుగా ముద్రపడడం ఇండియాకు రాజకీయంగా ప్రయోజనకరమా? ఆర్థికంగా అసలే ప్రయోజనకరం కాదని చెప్పవచ్చు. సహజవనరులు అత్యధికంగా ఉన్నది ఆసియాలో. దశాబ్దాలుగా ఆసియా దేశాలు పరాధీనులుగా ఉండి పరస్పర సంబంధాలు పెంపొందించుకోలేదు. మతాన్నీ, అగ్రరాజ్యాల ప్రయోజనాలనూ ప్రాతిపదిక చేసుకొని పరస్పర ద్వేషం పెంచుకున్నాయి కూడ. ఆ రోజులు పోయే పరిస్థితులు ఇప్పుడు కనిపిస్తున్నాయి. పాకిస్తాన్‌తోనూ, చైనాతోనూ భారత్ తన సంబంధాలను క్రమంగా మెరుగుపరచుకుంటున్నది. ఇరాన్‌తో నిజానికి మొదటి నుండి భారత్‌కు మంచి సంబంధాలున్నాయి. దీనిని మరింత పెంపొందించుకొని బలమైన 'దక్షిణార్థాన్ని' రూపొందించగల తరుణంలో ఇక్కడి సంబంధాలు పాడు చేసుకొని అమెరికాను నమ్ముకోవడం తెలివితక్కువతనం కాదా?

*మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది*

*21 ఫిబ్రవరి 2007*

**ఇరాక్**




# ఇరాక్‌పై అమెరికా దాడిని వ్యతిరేకిద్దాం

**గూ**డెం బయట తచ్చాడుతున్న క్రూర మృగాన్ని చూసిన అడవివాసుల లాగ బుష్ ఇరాక్‌ను ఏ అపరాత్రి వేళ తినడం మొదలుపెడతాడో అని ప్రపంచమంతా కొన్ని నెలల పాటు భయం భయంగా ఎదురు చూసింది. నిన్న రాత్రి ఆ ఘడియ వచ్చేసింది.

అప్పుడెప్పుడో మంగోలులను చూసి యూరోపియన్లు ఇదే విధంగా హడలి చచ్చారంట. అప్పటి నుంచి మంగోలులు అతి క్రూరులని యూరోపియన్ల నుండి మనకు సంక్రమించిన ప్రపంచ చరిత్ర చెపుతున్నది. అది నిజమా లేక పాశ్చాత్యుల పాక్షిక దృష్టి కల్పించిన అర్ధసత్యమా (అసలు పూర్తిగా అసత్యమా) అన్న ప్రశ్న ఈ మధ్య చరిత్రకారులలోనే తలెత్తింది.

దాని సంగతేమో గానీ ప్రస్తుత అమెరికా పాలకులు అతి క్రూరులన్న అభిప్రాయం పాక్షికం అనడానికి వీలులేనిది.

'మనం చెప్తున్నాం కాబట్టా?' అంటారేమో. కాదు, ప్రపంచమంతా చెప్తున్నది కాబట్టి. పశ్చిమం కాదు, పూర్వం కాదు, ఉత్తరం కాదు, దక్షిణం కాదు; తెలుపు కాదు, నలుపు కాదు, ఎరుపు కాదు, పసుపు కాదు, ఇది ఏ ఒక్క ప్రాంతం అభిప్రాయమో, ఏ ఒక్క జాతి అభిప్రాయమో కాదు. నిజమే, అన్ని ప్రాంతాలలో

అన్ని జాతులలో బుష్ ప్రభుత్వంతో లాలూచీపడి వారు తేబోయే వేటలో ఒక వాటా పొందాలని చూస్తున్న వారున్నారు. అయితే వీరు అన్నిటా ఉన్నారు. క్రూరత్వాన్ని క్రూరత్వం అనే వారు కూడ అన్నిటా ఉన్నారు.

కాబట్టి చరిత్రలో సార్వజనీన సత్యాలు ఉన్నా లేకున్నా సమకాలీన అమెరికా పాలకులు అతి క్రూరులు అనేది మాత్రం ఒక సార్వజనీనమైన వర్తమాన సత్యం. వారు క్రూరులు మాత్రమే కారు, వారి నోట్లో ఉన్నది ఒక నాలుక కాదు, వారి మాటలకున్నది ఒక భావం కాదు, వారి చర్యలకున్నది ఒక నీతి కాదు.

ప్రపంచంలో ఎక్కడయినా ఏ మూలనయినా తన ప్రయోజనాలకు హాని కలిగించగల రాజకీయ వ్యవస్థగానీ ప్రభుత్వంగానీ ఉద్యమంగానీ ఉన్నట్టయితే ఏ నీతీ పాటించకుండ, ఏ నియమాన్నీ గౌరవించకుండ స్థానిక ప్రజల ఇష్టాయిష్టాలతో కష్టనష్టాలతో నిమిత్తం లేకుండ దానిని తొలగించివేయడం, అణచివేయడం, తన అదుపులోకి తెచ్చుకోవడం అమెరికా రాజకీయ నీతి.

రెండవ ప్రపంచ యుద్ధం తరువాత 150 యుద్ధాలు – చిన్నవీ పెద్దవీ – జరిగాయనీ, వాటిలో దాదాపు ఎనిమిదిన్నర కోట్ల మంది చనిపోయారనీ, ఈ యుద్ధాలన్నిటితోనూ అమెరికాకు ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రమేయం ఉందనీ ఒక యుద్ధ పరిశీలకుని అంచనా. వీటిలో ఏ ఒక్క యుద్ధమూ అమెరికా భూభాగం గురించి జరిగినది కాదు. ఏ ఒక్కటీ అమెరికా మీద మరొక దేశం యుద్ధం ప్రకటించగా మొదలయినది కాదు. అయితే ప్రతి యుద్ధంలోనూ అమెరికా తన ప్రయోజనాలను కాపాడుకోవడానికి ఒక పక్షమో మరొక పక్షమో ప్రత్యక్షంగానో పరోక్షంగానో తీసుకుంది. చాలా సందర్భాలలో యుద్ధాన్ని తానే ఒక పక్షం చేత మొదలు పెట్టించింది. అన్ని సందర్భాలలోనూ 'స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, పౌరహక్కులు, మానవ నాగరికత' మొదలైన ఉదాత్తమైన విషయాలను రక్షించడానికి తాను ప్రపంచానికి సేవ చేయబూనుకున్నానే తప్ప యుద్ధం చేయడం లేదని బుకాయించింది.

1964 నుండి 1972 దాకా అమెరికా వియత్నాంపైన అతి క్రూరమైన యుద్ధం చేసింది. వియత్నాంతో మొదలయిన ఆ యుద్ధం లావోస్, కంబోడియాల భూభాగానికి వ్యాపించింది. ఈ దేశాలేవీ అమెరికాపైన యుద్ధం ప్రకటించలేదు. అమెరికాయే తన ప్రపంచ ఆధిపత్య వ్యూహంలో భాగంగా వాటిపైన యుద్ధం చేసింది. యుద్ధం

అయిపోయేటప్పటికి అమెరికా 70 లక్షల టన్నుల బాంబులు వేసింది. మొత్తం రెండవ ప్రపంచ యుద్ధంలో యూరప్‌లోనూ ఆసియాలోనూ పడిన బాంబులకు ఇది రెండు రెట్ల కంటే ఎక్కువ. ఈ యుద్ధంలో మొత్తం 10 లక్షల మందిని అమెరికా చంపింది. పంట పొలాలనూ మనుషుల ఆరోగ్యాన్నీ నాశనం చేసే రసాయన పదార్థాలను బాంబులుగా ప్రయోగించింది.

అమెరికా ప్రత్యక్షంగా చేసిన క్రూరమైన యుద్ధానికి వియత్నాం ప్రముఖ నిదర్శనం కాగా, తన మిత్ర రాజ్యానికి అన్నిరకాల సహాయ సహకారాలు అందిచ్చి అతి ఘోరమైన యుద్ధం చేయించిన వైనానికి ప్రముఖమైన ఉదాహరణ పాలస్తీనా ప్రజలపైన ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం. యాభై ఏళ్ళు గడిచినా ఎడతెగని ఈ యుద్ధంలో పాలస్తీనా ప్రజలు ఎంత కోల్పోయారన్న అంచనా వేసినవారు లేరు.

ఇజ్రాయిల్‌కు అమెరికా ఆయుధాలు విరివిగా సరఫరా చేసింది. అంతకు మించి అంతర్జాతీయ రాజకీయ వేదిక మీద అచంచలమైన భరోసా ఇచ్చింది. 1967 యుద్ధంలో ఇజ్రాయిల్ కొత్తగా ఆక్రమించుకున్న అరబ్బు ప్రాంతాలను వదిలిపెట్టి వెనక్కి పోవాలన్న భద్రతా మండలి తీర్మానం నెంబర్ 242ను అమలు చేయడానికి ఐక్యరాజ్యసమితి ఎప్పుడు పూనుకున్నా అమెరికా అడ్డం పడుతున్నది. లెబనాన్‌లో పాలస్తీనా పోరాటకారుల స్థావరాలున్నాయన్న నెపంతో 1982లో లెబనాన్‌పైన చేసిన దాడిలో ఇజ్రాయిల్ 17 వేల మంది సాధారణ పౌరులను హతమార్చింది. ఈ దాడికి ఇజ్రాయిల్ ఉపయోగించిన ఆయుధ సామగ్రి అమెరికా సరఫరా చేసినదే. తాను ఒక దేశానికి సరఫరా చేసిన ఆయుధాలను ఆ దేశం రక్షణ కోసమే తప్ప దాడి కోసం వాడుకోకూడదన్న నియమమొకటి తన ఆయుధ వ్యాపార నీతిలో భాగమని అమెరికా అంటుంటుంది. కాని ఇజ్రాయిల్ విషయంలో ఆ నియమాన్ని అమలుచేసే ప్రయత్నం అమెరికా ఏ రోజూ చేయలేదు.

లెబనాన్‌లో ఇజ్రాయిల్ ఆక్రమించుకున్న భూభాగాన్ని వదిలి వెళ్ళిపోవాలని ఐక్యరాజ్యసమితి భద్రతామండలి మూడుసార్లు తీర్మానించే ప్రయత్నం చేసింది. మూడు ప్రయత్నాలనూ అమెరికా వీటో చేసింది. 2002లో రమల్లా ప్రాంతంలో ఇజ్రాయిల్ చేసిన బీభత్సకాండను ఆపడానికి ఐక్యరాజ్యసమితి చేసిన కొన ఊపిరి ప్రయత్నాలను కూడ అమెరికా సాగనివ్వలేదు.

పాలస్తీనా ప్రజలు అమెరికాకు ఏ హానీ తలపెట్టలేదని, అమెరికా మీద ఎన్నడూ యుద్ధం ప్రకటించలేదనీ వేరే చెప్పనవసరం లేదు. అమెరికాయే తన ప్రపంచ ఆధిపత్య ప్రయోజనాలలో భాగంగా పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడులను సమర్థిస్తున్నది.

ఇక దేశాల అంతర్గత రాజకీయాలలో తలదూర్చి తనకు ప్రతికూలమైన ప్రభుత్వాలనూ వ్యక్తులనూ అమెరికా అంతమొందించిన ఉదంతాలు కోకొల్లలు. ఇక్కడ ఇరాక్ గురించి మాత్రమే మాట్లాడుకుందాం.

★ 1958లో ఇరాక్‌లో అబ్దుల్ కరీం కాసిం నాయకత్వంలోని సైనిక బృందం బ్రిటన్ ఏజెంటుగా వ్యవహరిస్తున్న రాజును తొలగించింది. ఇరాక్‌లోని చమురు బావుల మీద హక్కులు నెలకొల్పుకొని ఉన్న ఇరాక్ పెట్రోలియం కంపెనీ అనే బహుళజాతి సంస్థ మీద కాసిం ప్రభుత్వం కొన్ని ఆంక్షలు విధించింది. ఆ సంస్థకు పోటీగా ఒక ప్రభుత్వరంగ చమురు సంస్థను నెలకొల్పింది. వెంటనే కాసిం ప్రభుత్వాన్ని కూలదోయడానికి అమెరికా సిఐఏని రంగంలోకి దింపింది. సిఐఏ సహాయంతో 'బాత్' పార్టీ 1963లో అధికారంలోకి వచ్చింది. ఈ 'ఆపరేషన్'కు ఇన్‌ఛార్జిగా ఉండిన సిఐఏ అధికారి 'ఇది నా కెరీర్‌లోని అతి గొప్ప విజయం' అని గర్వంగా చెప్పుకున్నాడు. ఆ విధంగా అధికారంలోకి వచ్చిన 'బాత్' పార్టీ ప్రస్తుత నాయకుడే సద్దాం హుసేన్. (1968లో రెండవసారి అధికారంలోకి వచ్చిన బాత్ పార్టీ అమెరికాను కాదని ఇరాక్ పెట్రోలియం కంపెనీని 1972లో జాతీయం చేయడం వేరే కథ.)

★ 1980 నుండి 1988 వరకు సద్దాం హుస్సేన్ నాయకత్వంలోని ఇరాక్ అమెరికా, బ్రిటన్‌ల సంపూర్ణ సహాయ సహకారాలతో ఇరాన్‌పైన భీకరమైన యుద్ధం చేసింది. అప్పటికి ఇరాన్‌లో అమెరికా మద్దతు ఉన్న పహ్లవి రాజవంశాన్ని కూలదోసి ఇస్లామిక్ తిరుగుబాటుదార్లు రాజ్యం చేస్తున్నారు. ఇరాక్ ఏ ఆయుధాలు కావాలంటే ఆ ఆయుధాలు అమెరికా, బ్రిటన్‌లు వారికి అమ్మాయి. మార్గరెట్ థాచర్ ప్రభుత్వం సద్దాం హుసేన్‌కు ఆయుధాల కొనుగోలు కోసం 34 కోట్ల పౌండ్ల అరువు సదుపాయం కూడ కల్పించింది. బుష్ – బ్లెయిర్‌లు సద్దాం హుసేన్ దగ్గర ఉన్నాయి ఉన్నాయంటూ ఈరోజు గావుకేకలు పెడుతున్న రసాయనిక ఆయుధాలను అతనికి తొలుత అందిచ్చింది, అలవాటు చేసింది బ్రిటనే. ఇరాన్‌పైన ఈ రెండు అగ్రరాజ్యాల ప్రోత్సాహంతో ఎనిమిదేళ్ళ పాటు ఇరాక్ నడిపిన యుద్ధంలో ఇరువైపులా 10 లక్షల

మంది చనిపోగా, అమెరికా, బ్రిటన్‌లకు చెందిన ఆయుధ కంపెనీలకు అన్ని లక్షల డాలర్ల లాభాలు వచ్చాయి.

★ సద్దాం హుస్సేన్ తన దేశంలోని మైనారిటీ జాతి అయిన కుర్దుల మీద అత్యాచారాలకు పాల్పడుతున్నాడనేది 1990 తరువాత అతనిపై అమెరికా, బ్రిటన్‌లు వేస్తున్న ఆరోపణలలో ఒకటి. అప్పటికి అతను ఆ రెండు అగ్రరాజ్యాలకు కంటగింపయాడు. కానీ ఇరాక్ ప్రభుత్వం కుర్దు మైనారిటీలపైన పెద్దఎత్తున హింసాకాండకు పాల్పడిన మొదటి ఘటన 1988లోనే జరిగింది. కుర్దుల గ్రామమైన హలాబ్జాలో 1988లో ఇరాక్ ప్రభుత్వం బ్రిటన్ నుంచి, అమెరికా నుంచి తెచ్చుకున్న విషవాయువును ప్రయోగించి క్రూరమైన హత్యాకాండకు పాల్పడింది. ఈ విషవాయువు దాడిలో 5,000 మంది కుర్దులు చనిపోయారు. అప్పటికింకా ఇరాన్‌తో ఇరాక్ యుద్ధం అయిపోలేదు కాబట్టి ఆ ఘోరకాండను కప్పిపెట్టడానికి అమెరికా, బ్రిటన్‌లు శతవిధాల ప్రయత్నం చేశాయి. ఆ హత్యాకాండ ఇరాన్ పాపమేనని అమెరికా ఒక వదంతిని ప్రచారం చేసింది కూడ.

★ 1990 తరువాత, కుర్దులను సద్దాం హుస్సేన్ నుండి కాపాడే కర్తవ్యాన్ని తన మీద వేసుకున్నట్టు అమెరికా ప్రకటించుకుంది. సద్దాం హుస్సేన్ పాలనపై అజమాయిషీ చేసే కర్తవ్యంలో భాగంగా అమెరికా యుద్ధ విమానాలు తరచుగా ఇరాక్ గగనతలం పైన పహారా కాస్తుండేవి. ఆ విమానాల స్థావరాలు పొరుగు దేశమైన టర్కీలో ఉన్నాయి. టర్కీలోనూ కుర్దులు ఉన్నారు. అక్కడ కూడ కుర్దులపైన క్రూరమైన అణచివేత సాగుతున్నది. అయితే అమెరికా దాని గురించి మాట్లాడదు. పైగా ఇరాక్ గగనతలంలో విహరించడానికి బయలుదేరే అమెరికా యుద్ధ విమానాలు, అదే సమయంలో టర్కీ – ఇరాక్ సరిహద్దులోని కుర్దు గ్రామాలపైన దాడి చేయడానికి టర్కీ దేశపు యుద్ధ విమానాలు పోతున్నట్టు గమనించినట్టయితే కొంచెం సేపు ఆగాలనీ, టర్కీ విమానాలు వెనక్కి తిరిగి వచ్చిన తరువాతే తాము బయలుదేరాలనీ ఆదేశాలు కూడ అమెరికా సైనిక అధికారులు ఇచ్చారు. టర్కీ పాలకులు అమెరికాకు ప్రీతిపాత్రులయిన నియంతలు.

ఇటువంటి ఘనచరిత్ర గల అమెరికా, దానికి తోడుగా బ్రిటన్ ఇవ్వాళ సద్దాం హుస్సేన్ దగ్గర మానవాళికి అత్యంత ప్రమాదకరమయిన ఆయుధాలు ఉన్నాయనీ,

వాటినతను పూర్తిగా ధ్వంసం చేయాలనీ, చేయని పక్షంలో యుద్ధం తప్పదనీ అంటున్నాయి.

ఇది విని ఎవరయినా అమెరికా నిరాయుధీకరణ ఉద్యమంలో ముందు నిలబడిందనుకుంటే పొరబాటు. ఏ నిరాయుధీకరణ డిమాండ్‌నూ అమెరికా ఏ రోజూ గౌరవించలేదు. తనకు వ్యతిరేకమయిన వారు ఆయుధాలు వదులుకోవాలన్నది మాత్రమే అమెరికా డిమాండు. తన అనుకూలురు దగ్గర ఎన్ని ఆయుధాలున్నా పర్వాలేదు.

1980-88 మధ్య కాలంలో ఇరాక్‌కు సంప్రదాయక ఆయుధాలే కాక రసాయన ఆయుధాలు (కెమికల్ వెపన్స్), రోగాలను వ్యాపింపచేసే క్రిములను ఉత్పత్తి చేసే ఆయుధాలు అమెరికా, బ్రిటన్‌లే అమ్మాయి. ఇరాన్‌పైన ఇరాక్ 1985-86లలో విషవాయువులు ప్రయోగించగా ఐక్యరాజ్యసమితి ఖండించబోతే అమెరికాయే అడ్డం పడింది. ఇరాక్ యుద్ధ ప్రయోజనాల కోసం విషవాయువులు ప్రయోగించడం 'వ్యూహాత్మకంగా పెద్దగా ఆందోళన కలిగించే విషయం కాదు' అని అప్పటి అమెరికా అధికారి ఒకరు అన్నారు. ఇరాక్ దగ్గర ఈనాడు ఉన్న 'బయొలాజికల్' ఆయుధాలకు మూలమైన క్రిములను దానికి అమెరికాయే ఇచ్చిందని 1995లో అమెరికా సెనేట్ నిర్వహించిన ఒక విచారణలో బయటపడింది. ఈ సత్యాన్ని దాచడానికి అమెరికా, బ్రిటన్‌లు చేస్తున్న ప్రయత్నం అంతా యింతా కాదు.

'నీ దగ్గరున్న ఆయుధాల వివరాలు ప్రకటించమని' ఐక్యరాజ్యసమితి ఒత్తిడి పెట్టగా సద్దాం హుసేన్ గత సంవత్సరం పెద్ద నివేదిక ఒకటి సమర్పించాడు. 11,800 పేజీల ఆ నివేదికలో 1200 పేజీలను అమెరికా స్వాధీనం చేసేసుకుంది. ఎందుకని అని అడిగితే అందులో కొంత 'సున్నితమయిన సమాచారం' ఉందనీ, దానిని 'ఎడిట్' చేయవలసిన అవసరం ఉందనీ అనింది. ఏమిటా 'సున్నితమయిన' సమాచారమంటే, ఇరాక్‌కు అణుధార్మిక, రసాయనిక, క్షిపణి సాంకేతిక ప్రక్రియలను అమ్మిన 150 అమెరికన్ కంపెనీల పేర్లు, ఆ అమ్మకాల వివరాలు అందులో ఉన్నాయి.

ఇరాన్ మీద యుద్ధం చేయడానికి ఇరాక్‌కు అమెరికా, బ్రిటన్‌లు అందించిన ప్రమాదకరమైన ఆయుధాలను ఆ యుద్ధం అయిపోయిన తరువాత సద్దాం హుస్సేన్ తన సొంత ఆధిపత్య ప్రయోజనాల కోసం వాడుకోవాలని చూడడం తప్పయిపోయింది.

1988 దాకా అమెరికాకు సన్నిహిత మిత్రుడయిన అతను 1991 నాటికి ప్రపంచానికే ప్రమాదకారి అయిపోయాడు. 1988 దాకా అమెరికా, బ్రిటన్‌లే అతనికి అమ్మిన ఆయుధాలు 1991 తరువాత మానవాళి మనుగడకే ప్రమాదకరమైన మారణాయుధాలు అయిపోయాయి. 1988 దాకా అతను ప్రయోగించిన రసాయన యుద్ధ ప్రక్రియ 'వ్యూహాత్మకంగా పెద్ద ఆందోళన కలిగించే విషయం' కాకపోగా, 1991 తరువాత అది భీకరమైన ఆంక్షలు పెట్టడానికి యోగ్యమైన తప్పిదం అయిపోయింది.

చమురు ధరలు తనకు అనుకూలమైన స్థాయిలో ఉంచడానికి సహకరించడం లేదన్న నెపంతో సద్దాం హుస్సేన్ కువైట్ పైన 1990లో దాడిచేశాడు. ఆ దాడిని అమెరికా గట్టిగా వ్యతిరేకించింది. కువైట్‌పైన ఇరాక్ చేసిన దాడిని నిలుపుదల చేయడానికి 'ఎటువంటి చర్యలయినా తీసుకోవచ్చునన్న' తీర్మానం అమెరికా ఒత్తిడి మేరకు ఐక్యరాజ్యసమితి చేసింది. ఆ తీర్మానాన్ని అడ్డం పెట్టుకుని 1991లో అమెరికా (బ్రిటన్ సహకారంతో) ఇరాక్‌పైన 43 రోజులు భీకర యుద్ధం చేసింది. ఈ యుద్ధం ప్రధానంగా 'వాయు యుద్ధం', పూర్తిగా ఏకపక్షమైన యుద్ధం. అమెరికా వాయుసేనకు చెందిన బాంబర్లు ఆ 43 రోజులలో 1,09,876 సార్లు ఇరాక్ గగనతలంపైకి దూసుకుపోయి బాంబుల వర్షం కురిపించాయి. మొత్తం 84 వేల టన్నుల బాంబులు వేశాయి. ఇరాక్ సైనికులు లక్ష నుంచి 2 లక్షల మంది చనిపోవడమే కాక, 35 వేలమంది నిరాయుధులయిన పౌరులు కూడ ఆ 'యుద్ధం'లో చనిపోయారని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. అంతేకాక ఇరాక్ పారిశ్రామిక వ్యవస్థ, విద్యుత్ వ్యవస్థ, మంచినీటి వ్యవస్థ, పౌర జీవనానికి అవసరమయిన వ్యవస్థలన్నీ నాశనం అయ్యాయి. అవతలివైపు ఇరాక్ సైన్యం చేతిలో కేవలం 76 మంది అమెరికా సైనికులు చనిపోయారంటే ఇది ఎంత ఏకపక్షమైన 'యుద్ధమో' అర్థమవుతుంది.

యుద్ధం ముగియడంతో ఇరాక్ వెతలు తీరలేదు. ఆ దేశం మీద ఆమెరికా ఐక్యరాజ్యసమితి చేత అతి తీవ్రమైన ఆంక్షలు విధింపజేసింది. ఇరాక్ తన ప్రమాదకరమైన ఆయుధాల తయారీ కార్యక్రమాన్ని మొత్తంగా వదులుకునే దాకా ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు.

ఒకప్పుడు ప్రపంచ స్థాయిలో నిరాయుధీకరణ కోసం ఒప్పందాలూ, ఒడంబడికలూ రూపొందించే ప్రయత్నం చేసిన ఐక్యరాజ్యసమితి ఇప్పుడు అమెరికాకు

కంటగింపయిన ఒకానొక మూడవ ప్రపంచ దేశాన్ని పూర్తిగా నిరాయుధీకరించే బృహత్కార్యానికి ఆమోదముద్ర వేసింది. అందుకోసం ఇరాక్‌పై పెట్టిన ఆంక్షల అమలు ఐక్యరాజ్యసమితి బాధ్యత అయింది. ఐక్యరాజ్యసమితి సంపూర్ణంగా ఆమెరికా సైనిక వ్యూహంలో ఒక సాధనంగా మారిపోయింది.

చమురు అమ్ముకొని ఇతర జీవిత అవసరాలనూ, సాంకేతిక ప్రక్రియలనూ, యంత్రాలనూ దిగుమతి చేసుకొని బతికే దేశం ఇరాక్. దానిపైన ఘోరమైన ఎగుమతి, దిగుమతి ఆంక్షలు పెట్టడం, వాటిని ఒక దశాబ్దం పైగా అమలు చేయడం ఇరాక్ ప్రజల ప్రాణం మీదికి వచ్చింది. వైద్య సదుపాయం లేక ఇరాక్‌లో 7.5 లక్షల మంది పిల్లలు చనిపోయారనేది ఇప్పుడందరూ అంగీకరిస్తున్న వాస్తవం. పారిశుధ్య వ్యవస్థ, మంచినీటి వ్యవస్థ దెబ్బతినడం వల్ల, మందుల దిగుమతిపైన ఆంక్షలు పెట్టడం వల్ల మొత్తం 12 లక్షల మంది ఇరాకీలు చనిపోయారని 1997లో ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. ఇరాక్ అధికంగా ఎడారి దేశం కావడం వల్ల అక్కడ శుభ్రమైన మంచినీరు సులభంగా దొరకదు. దొరికిన నీటిని శుభ్రం చేసుకునే సాంకేతిక వ్యవస్థను వారు నిర్మించుకున్నారు. దానిని అమెరికా తన బాంబుదాడులతో నాశనం చేయడం 'అంటువ్యాధుల వ్యాప్తికి అనుకూలమైన పరిస్థితిని కల్పించింది' అని అమెరికా సైనిక ఇంటెలిజెన్స్ నివేదిక 1991లో యుద్ధం మొదలయిన తొలి దినాలలోనే ప్రకటించింది. అదే ఆ తరువాత జరిగింది.

నిజమే, 'మానవతా అవసరాలు' అనే పేరు మీద ఆంక్షల నుంచి కొన్నిటికి మినహాయింపు ఇచ్చారు. కానీ ఆ మినహాయింపు పరిమితమైన ఆహార వైద్య అవసరాలను దాటకపోవడం వల్ల వేరే అవసరాలే కాదు, ఆహార వైద్య అవసరాలు కూడ సరిగ్గా అందలేదు. పైగా ఐక్యరాజ్యసమితి 'మానవతా అవసరాలు'గా గుర్తించినవి కూడ అమెరికా ఆమోదం లేకుండా ఇరాక్‌కు చేరలేదు. ఆ విధంగా 500 కోట్ల డాలర్ల 'మానవతా అవసరాలను' అమెరికా ఆపేసిందని కూడ అంచనా. 1997-98 సంవత్సరంలో ఇరాక్‌లో ఐక్యరాజ్యసమితి తరఫున సంధానకర్తగా పనిచేసిన డెనిస్ హాలిడే ఈ ఆంక్షలను 'మానవ హననం' (జెనోసైడ్) అని అభివర్ణిస్తూ తన పదవికి రాజీనామా చేశాడు. అతని స్థానంలో నియమితుడయిన హాన్స్ ఫాన్ స్పోనెక్ 2000 సంవత్సరంలో అదే కారణంగా రాజీనామా చేశాడు. ఆ కాలంలో ఇరాక్‌లో

ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆహార పథకం అమలుకు బాధ్యుడుగా ఉన్న జట్టా బుర్గ్‌హార్డ్ 'ఫాన్ స్పోనెక్ అభియోగం వాస్తవమే'నంటూ తాను కూడ పదవికి రాజీనామా చేశాడు.

యుద్ధం అయిపోయిన తరువాత కూడ ఇరాక్ సంపూర్ణ నిరాయుధీకరణపై ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానాన్ని పర్యవేక్షించే పేరిట అమెరికా, బ్రిటన్‌లు తమ సైనిక చర్యలు కొనసాగించాయి. ఇరాక్ గగనతలంపైన సర్వాధికారాలు తమకు తాము దత్తం చేసుకున్నాయి. ఇరాక్ విమానాలు తమ దేశ ఉత్తర, దక్షిణ సరిహద్దుల పైన ఎగరడానికి వీలులేదని ఆంక్షలు పెట్టాయి. వారు మాత్రం ఇరాక్ భూభాగం మీద పది సంవత్సరాలుగా ప్రతీరోజూ బాంబులు వేస్తున్నారు. ఇవన్నీ ఇరాక్ ఆయుధాల ఉత్పత్తిని నిరోధించడానికే అంటున్నారు గానీ ఆ పేరుతో ఇరాక్ పౌర జీవితానికి అవసరమైన ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను పెద్దఎత్తున ధ్వంసం చేశారు. అణు ధార్మిక స్వభావం గల యురేనియంను సైతం ప్రయోగించారు. దీని వల్ల ఇరాక్‌లో ఈ పది సంవత్సరాలలో ముఖ్యంగా పిల్లలలో కాన్సర్ వ్యాధి పెద్దఎత్తున వ్యాపించింది. 1991–94 మధ్య కాలంలో కాన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య ఇరాక్‌లో 700% పెరిగిందని ఐక్యరాజ్యసమితి అంచనా. సారాంశంలో ఇరాక్‌పైన అమెరికా, బ్రిటన్‌ల యుద్ధం మొదలై పదేళ్ళయింది. రేపు జరగబోయేది యుద్ధాన్ని ముగించడం మాత్రమే.

ఇరాక్‌పై ఆధిపత్యం నెలకొల్పడానికి ఇంత ఆరాటం ఎందుకు?

ఇరాక్‌లో విస్తారంగా చమురు నిక్షేపాలున్నాయి. ప్రపంచంలో రెండవ అతి పెద్ద చమురు నిక్షేపాలున్న దేశం ఇరాక్ అని అంచనా. చమురు వినియోగంలో అమెరికా ప్రపంచంలోనే ఫస్టు. ప్రపంచమంతా వినియోగించే చమురులో నాలుగవ వంతు ఒక్క అమెరికాయే వాడుతుందని అంచనా. అందువల్ల విస్తారంగా చమురు ఉన్న ఇరాక్ ప్రభుత్వం అమెరికాకు అనుకూలంగా ఉండాలి, అమెరికా చెప్పుచేతలలో బతకాలి. దానికి సద్దాం హుస్సేన్ సిద్ధంగా లేడు కాబట్టి అతనిని తొలగించాలి. అతను అమెరికాకు అనుకూలంగా నడుచుకున్ననాడు అతని ఆయుధ సంపద మానవజాతికి హానికరమని అమెరికా అనుకోలేదు. రేపు అతని స్థానంలో అమెరికా చెప్పినట్లు నడుచుకునే ప్రభుత్వం వచ్చినాక కూడ ఇదే ఆయుధ సంపద అమెరికాకు ఆందోళన కలిగించదు. మధ్యలో వచ్చిన తంటా ఆయుధ సంపదతో కాదు, సద్దాం హుస్సేన్‌తో. ఆయుధ సంపద మాటకొస్తే అమెరికాతో ఆ విషయంలో ఎవరు పోటీకి

రాగలరు? తెల్లవాళ్ళు బాధ్యత ఎరిగిన వారు కాబట్టి వారి దగ్గర ఎన్ని ఆయుధాలున్నా ఫరవాలేదు గానీ అరబ్బులను నమ్మలేం అని తెల్లవాళ్ళు అనుకుంటే అనుకోవచ్చును గానీ నల్లవాళ్ళయిన మనమంతా ఎందుకొప్పుకోవాలి? అమెరికాతో మొదలుపెట్టి అన్ని దేశాలూ నిరాయుధీకరణకు ఒప్పుకోవాలని ఉద్యమిద్దాం. అంతే తప్ప ఇరాక్ మాత్రమే తన ఆయుధాలు వదులుకోవాలని డిమాండ్ చేయడంలో అర్థం లేదు. సద్దాం హుస్సేన్ ప్రభుత్వం దుర్మార్గమైనదే. కాదనము గానీ అమెరికా కంటే దుర్మార్గమైనది కాదు. అమెరికా ఈరోజు ప్రపంచంలోనే ప్రధానమైన రౌడీ రాజ్యం (రోగ్ స్టేట్). టెర్రరిస్టు రాజ్యం. ఇరాక్ ప్రభుత్వం అమెరికా అనుచరులయిన ఇజ్రాయిల్, టర్కీ, కొలంబియా దేశాల ప్రభుత్వాల కంటే ఎక్కువ దుర్మార్గమైనది కాదు.

అమెరికా చేయనున్న ఈ యుద్ధం పట్ల పాశ్చాత్య దేశాలలో నిరసన బలంగా వ్యక్తం అవుతున్నది. ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రదర్శనలు చేస్తున్నారు. ఈ యుద్ధం అన్యాయం అని నినదిస్తున్నారు. పాశ్చాత్య దేశాల కంటే ప్రజాతంత్ర చైతన్యం మనకు ఎక్కువ అని మనం అనుకుంటాముగానీ నిరసన అక్కడే ఎక్కువ వ్యక్తమవుతున్నది. కారణమేమైనా ఇది దురదృష్టకరం.

కొన్ని పాశ్చాత్య దేశాలు, రాజకీయ పార్టీలు ఈ యుద్ధం అన్యాయం అనే బదులు ఐక్యరాజ్యసమితి అనుమతి లేకుండా యుద్ధం చేస్తే ఒప్పుకోం అంటున్నారు. తొలినాడు ఉద్దేశించినంత నిష్పాక్షికంగా ఐక్యరాజ్యసమితి ఈనాడు ఉండి ఉంటే అదొక రకం గానీ పదేళ్ళుగా ఐక్యరాజ్యసమితి అమెరికా జేబు సంస్థగా ఉంది. అయినప్పటికీ ఐక్యరాజ్యసమితిలో యుద్ధ నిర్ణయాన్ని వ్యతిరేకించడానికి ఒకటి రెండు దేశాలు సిద్ధంగా ఉన్న కారణంగా ఈ సాంకేతిక అభ్యంతరానికి కొంత ఉపయోగం లేకపోలేదని 'ప్రాక్టికల్' రాజకీయవేత్తలు భావిస్తుండవచ్చు. కానీ ఆ దేశాలు రేపు ప్లేటు ఫిరాయిస్తే ఏం గతి?

ఈ యుద్ధాన్ని సూత్రప్రాయంగానే వ్యతిరేకించాలి. దానితోబాటు ఐక్యరాజ్య సమితిని తిరిగి బతికించుకొని వీటో అధికారాలూ, శాశ్వత భద్రతా మండలి సభ్యత్వాలూ తొలగించి ఒక దేశానికి ఒక ఓటు ప్రాతిపదికన దాన్ని నిజమైన ప్రజాస్వామిక అంతర్జాతీయ వేదికగా రూపొందించుకోవాలి. అమెరికాతో మొదలుపెట్టి అన్ని రాజ్యాల శాశ్వత నిరాయుధీకరణ కోసం నిజాయతీగా కృషిచేయాలి.

మన దేశ పాలకులు ఇందుకు సిద్ధంగా లేరనేది స్పష్టమే. అసలు ఒక పెద్ద విపత్తు మన కళ్ళ ఎదుట ఉందన్న స్పృహ వారిలో ఏ కోశానా లేదు. లేకపోతే చచ్చేది ముస్లింలు కాబట్టి ఫరవాలేదనుకుంటున్నారో. మొదట్లో యుద్ధం వస్తే చమురు ధరలు పెరుగుతాయి కాబట్టి రాకుండ ఉంటే మంచిదని మన ప్రధానమంత్రి ఒక లారీ యజమాని స్థాయిలో ఆందోళన వ్యక్తం చేశాడు. తన తెలివితేటలు తనకే నచ్చాయో ఏమో, ఆ అభిప్రాయాన్ని ఒక వారం రోజులలో మూడుసార్లు ప్రకటించాడు. అయితే ప్రస్తుత పార్లమెంటు సమావేశంలో మాత్రం ప్రతిపక్షాలు మరీ ఒత్తిడి చేయగా, యుద్ధమొస్తే ఏ వైఖరి అవలంబిస్తారో స్పష్టం చేయలేదు గానీ ఐక్యరాజ్యసమితి అనుమతి లేకుండా యుద్ధం చేయడం అనుచితం అన్నాడు. ఈ మధ్య కాలంలో ఎప్పుడయినా ఐక్యరాజ్య సమితిని స్వతంత్ర వ్యవస్థగా నిలబెట్టడానికి కృషిచేసి ఉంటే ఈ అభిప్రాయాన్ని ఆమోదించకపోయినా కనీసం గౌరవించవచ్చు. కానీ ఐక్యరాజ్యసమితితో అమెరికా ఫుట్‌బాల్ ఆడుకుంటుంటే అందరిలాగా తాను కూడ మౌనంగా చూస్తూ పాకిస్తాన్‌కు ఒక దెబ్బ వేయడానికి అదేమయినా ఉపయోగపడుతుందేమోనని లెక్కలు వేస్తున్న అటల్ బిహారీ ప్రభుత్వం ఇప్పుడు ఐక్యరాజ్యసమితి మీద విశ్వాసం ప్రకటించడం వారి విజ్ఞత గురించే కాదు నిజాయతీ గురించి కూడ సందేహానికి తావు కల్పిస్తుంది.

*మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది*
*20 మార్చి 2003*

# జార్జి బుష్‌నూ, సద్దాం హుస్సేన్‌నూ ఒకే బోనులో నిలబెట్టలేమా?

**తె**లుపు, నలుపులే తప్ప వేరే రంగులు చూడబోమని తెలుగునాట ప్రజాతంత్రవాదులు ఎప్పుడో చరిత్రమీద ఒట్టు పెట్టి తీర్మానించినట్టున్నారు.

లేకపోతే సద్దాం హుస్సేన్ గురించి రాస్తున్న వ్యాసాలను, కవితలను, చేస్తున్న ఉపన్యాసాలను అర్థం చేసుకోవడం కష్టం.

అతని ఉరితీతనొక వికృతమైన చర్యగా ప్రపంచంలో అత్యధికులు భావించే ఉంటారు. దానికి న్యాయంతో, న్యాయ నిర్ణయంతో ఏమీ సంబంధం లేదని, అది అమెరికా పశ్చిమ ఆసియాలో నెరుపుతున్న అణచివేత రాజకీయాలలో ఒక ఘట్టం మాత్రమేనని గుర్తించే ఉంటారు. జడ్జిలను మార్చి, లాయర్లను చంపి ఇప్పించిన తీర్పులో విశ్వసనీయత శూన్యం అని అనుకునే ఉంటారు.

ఇదంతా సద్దాం హుస్సేన్‌ను గొప్పవాడి నెట్లా చేస్తుంది? అతని మీద మోపబడ్డ ఆరోపణ అబద్ధమని అతని అభిమానులు సైతం అనరు. తన మీద హత్యాయత్నం జరిగిందని అతను షియాలను ఊచకోత కోయించింది సత్యం. స్వాతంత్ర్యం కోసం ఆందోళన చేస్తున్న కుర్దులపైన అతను నిషిద్ధ రసాయనిక పదార్థాలను ప్రయోగించి పెద్దఎత్తున చంపించినదీ సత్యమే. దేశ రాజకీయ వ్యవస్థలో ప్రజాస్వామ్యం కావాలని అడుగుతున్న వారిని జైలులో పెట్టింది కూడ వాస్తవమే. ఈ ఘనకార్యాల కోసం మొదటినుండి కూడ సద్దాం అమెరికా వత్తాసును వాడుకున్నాడు. అతను కుర్దులపైన రసాయన యుద్ధం చేయడాన్ని నిరసిస్తూ ఐక్యరాజ్యసమితి తీర్మానం చేయకపోగా, అదేమంత ముఖ్యమైన విషయం కాదన్నది అమెరికా. తన మాట వినిందాకా అంటే కువైట్ పైన దాడి చేసే దాకా అమెరికాకు అతను చేసిన హత్యలు, అతను చేసిన

దాడులు ముద్దుగానే తోచాయి. ఆయతుల్లా ఖొమైనీ నాయకత్వంలో అమెరికా పెత్తనాన్ని విజయవంతంగా ఎదుర్కొన్న ఇరాన్‌పైన దాడి చేయడానికైతే సద్దాం అమెరికాకు సాధనంగా కూడ పనిచేశాడు. మరి అతను న్యాయం కోసం నిలిచిందెప్పుడు?

సద్దాం హుస్సేన్ అమెరికా గీచిన పరిధిని దాటి ఇరాక్ రాజ్య ప్రయోజనాలుగా తాను భావించిన వాటిని సాధించటానికి ఉపక్రమించినప్పుడే అతను అమెరికాకు కంటగింపయ్యాడు. అవి ఏ అర్థంలోనూ ప్రజాతంత్ర ప్రయోజనాలు కావు, ఇరాక్‌కు స్థానికంగా పెత్తనాన్ని సమకూర్చిపెట్టే ఆధిపత్య ప్రయోజనాలు. తనకు లోబడిన అధిపతులకే తప్ప, తనను కాదన్న ఆధిపత్యాలకు తావు లేదని నమ్మిన అమెరికా అతన్ని శిక్షించడం కోసం ఇరాక్ ప్రజానీకంపై అతి క్రూరమైన ఆంక్షలు విధించింది. అప్పుడు లొంగకుండా నిలబడ్డాడన్న దొక్కటే సద్దాంలో ఏదో ఒక మేరకు మెచ్చుకోదగ్గ గుణం. దానికతన్ని సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట చిహ్నంగా, ప్రతిఘటనా వీరుడిగా భావించడం సబబా? ఒకరిని తిట్టడానికి మరొకరిని పొగడవలసిందేనా? ఒక రంగును నలుపు అనడానికి మిగిలిన రంగులన్నీ తెలుపు అనవలసిందేనా?

'మానవత మీద నేరం' (క్రైం ఎగెయినెస్ట్ హ్యూమానిటీ) అనే దానికి ఎవరినైనా శిక్షించదలచుకుంటే ముందు అమెరికా పాలకులను శిక్షించాలనడంలో సందేహమేమీ లేదు. వేరే అన్ని నేరాలను విస్మరించినా ఇరాక్ మీద 1990 తరువాత ఆమెరికా చేసిన దాడులలోనూ, పెట్టిన ఆంక్షల వల్లనూ లక్షలాదిగా పోయిన ఇరాక్ సాధారణ పౌరుల ప్రాణాలకు సంబంధించి అమెరికా పాలకులకు ఏ శిక్ష వేసినా ఎక్కువ కాదనడంలో రెండు అభిప్రాయాలకు తావు లేదు. ఈ దాడికి లొంగకుండా నిలబడ్డ సద్దాం మొండితనాన్ని మూర్ఖత్వంగా చూసిన వారూ ఉన్నారు. ఆ అభిప్రాయాన్ని అనుసరించనవసరం లేదు. అది హర్షించదగ్గ గుణమనే అనుకుందాం. అంత మాత్రం చేత అతనిలోని నియంతృత్వ పోకడలూ, తన రాజ్యంలో తనను వ్యతిరేకిస్తున్నారనుకొన్న వారి పట్ల అతను ప్రదర్శించిన క్రూరత్వం చెరిగిపోతాయా? తమకు ప్రజాభిప్రాయమే ప్రమాణం అని ప్రజాతంత్రవాదులు భావిస్తారు కాబట్టి సద్దాంను హీరోను చేస్తున్న వారిని ఒక ప్రశ్న అడగాలి. సద్దాం హీరో అని ఇరాక్ జనాభాలో మెజారిటీ అయి ఉండి కూడ అధికారానికి ఎప్పుడూ దూరం ఉంచబడ్డ షియాలను ఒప్పించగలుగుతారా? ఒక్క ఇరాక్‌లోనే కాదు టర్కీలోనూ సిరియాలోనూ ఇరాన్‌లోనూ కూడ మైనార్టీగా

ఉండి తమ జాతి అస్తిత్వం కోసం పోరాడుతూ అన్ని దేశాల పాలకుల చేత క్రూరమైన అణచివేతకు గురవుతున్న కుర్దులకు వీరు తాము రాస్తున్న కవితలు చదివి వినిపించగలుగుతారా?

నిజమే, ఇరాక్ ప్రజలను (అనేక దేశాల ప్రజలతో బాటు) అతి క్రూరంగా అణచివేసిన ప్రపంచ నియంతలయిన అమెరికా పాలకులు న్యాయనిర్ణేతల వేషం ధరించి, తమతో పోలిస్తే చిల్లర రౌడీ అయిన సద్దాం హుస్సేన్‌పైన నేరవిచారణ ప్రహసనం నడిపించి, ఉరితీసి, ప్రజాస్వామ్యాన్ని కాపాడామంటూ తమ భుజాలు తాము చరుచుకోవడం చూస్తే ఎవరికైనా ఒళ్ళు మండిపోతుంది. అది చాలా సహజం. అయితే కడుపు మంటలాగే ఒళ్ళు మంట కూడ రాజకీయ విశ్లేషణ స్థానాన్ని ఆక్రమించ కూడదు.

దేశాల చట్టాలకు లొంగని నియంతలను నేరవిచారణకు లోబరిచే వ్యవస్థ ఒకటి ఈ మధ్యనే ఉనికిలోకి వచ్చింది. దానిని అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు అంటారు. ఏ దేశమైనా స్వచ్ఛందంగా ఈ క్రిమినల్ కోర్టు అధికారాన్ని ఆమోదించినట్టయితే ఆ దేశ పాలకులు పాల్పడే నేరాలను ముఖ్యంగా యుద్ధాల పేరిట ఇతర దేశస్తులపైన పాల్పడే నేరాలను ఈ న్యాయస్థానం విచారిస్తుంది. అమెరికా ఈ అంతర్జాతీయ న్యాయస్థానం ఏర్పాటును తొలి నుండి వ్యతిరేకించింది. చివరికి దానికి సంబంధించిన ఒప్పందంపైన సంతకం కూడ చేయలేదు. ఇండియా కూడ చేయలేదు. (చూడగా చూడగా అంతర్జాతీయ రాజకీయ నీతికి సంబంధించిన అనేక ఒడంబడికలు, ఒప్పందాల విషయంలో ఇండియా ఎప్పుడూ అమెరికానే అనుసరించిందని అర్థం అవుతోంది.) ఇరాక్ సంతకం చేసిందో లేదో నాకు తెలీదు. ఇంగ్లండ్ మాత్రం చేసింది.

ఈ విషయంలో ఇంగ్లండ్‌లో ఇప్పటికే ఆసక్తికరమైన చర్చ జరుగుతున్నది. టోనీ బ్లెయిర్ రేపు జరుగబోయే ఎన్నికల్లో ఓడిపోతాడని అందరికీ తెలుసును. ఆ తరువాత ఇరాకీలు ఎవరైనా యుద్ధ నేరాలు చేసాడని బ్లెయిర్‌పైన అంతర్జాతీయ క్రిమినల్ కోర్టులో కేసు వేస్తే, బ్లెయిర్ అక్కడికి వెళ్ళి ముద్దాయిగా నిలబడక తప్పదు. దాని మీద ఇప్పటికే ఇంగ్లండ్‌లో ఒక టెలి డ్రామా కాబోలు ప్రదర్శిస్తున్నారంట. అందులో బ్లెయిర్ సద్దాం హుస్సేన్ స్థానంలో కనిపిస్తాడు. ఇవ్వాళ అతనితో చెట్టపట్టాలు వేసుకొని తిరుగుతున్న వారంతా – అమెరికా పాలకులతో సహా – అతనిని అతని పాపాలకు వదిలేసి వెళ్ళిపోతారు.

అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు అధికారాన్ని అమెరికా ఆమోదించలేదు గానీ, ఆమోదించి ఉంటే జార్జి బుష్ కూడ బ్లెయిర్ సరసన నిలబడేవాడు. నిజంగా మనం న్యాయం కోరుకునేటట్లయితే ఇటువంటి అంతర్జాతీయ నేర విచారణ వ్యవస్థ అంతర్జాతీయ రూపం పొందేందుకు కృషిచేయాలి. ఆ కోర్టులో పశ్చిమాసియా యుద్ధ నేరాల కుట్ర కేసులో మొదటి ముద్దాయిగా జార్జి బుష్‌ను, రెండవ ముద్దాయిగా టోనీ బ్లెయిర్‌ను, మూడవ ముద్దాయిగా ఇజ్రాయిల్ పాలకులనూ... చివరి వరుసలో సద్దాం హుస్సేన్‌ను నిలబెట్టి, ప్రపంచ ప్రజలే వారిని విచారించి తమ విశాల హృదయంతో వారిని ఖైదు చేసే బదులు సహారా ఎడారిని సస్యశ్యామలం చేయడం కోసం పదేళ్ళు పలుగూ పారా పట్టుకొని పని చేయమని శిక్ష విధిస్తే బాగుంటుంది. కవులయిన వారు కనీసం అటువంటి ఊహ చేస్తే బాగుంటుంది. అంతే తప్ప జార్జి బుష్‌ను సైతాన్‌ను చేయడానికి సద్దాం హుస్సేన్‌ను షహీద్ చేయడం అనవసరం.

*ప్రజాతంత్ర వారపత్రిక*

*4 ఫిబ్రవరి 2007*

# శిశుహంతక అమెరికా పాలకులనెవరు శిక్షిస్తారు?

**క**లకత్తా నుండి ప్రచురితమయ్యే ఫ్రాంటియర్ వారపత్రిక ఈ మధ్య ఇరాక్ పైన అమెరికా 1991 నుండి వివిధ రూపాలలో చేస్తున్న ప్రత్యక్ష, పరోక్ష యుద్ధం వల్ల ఆ దేశంలో వ్యాపించిన కాన్సర్ కారకమైన యుద్ధ కాలుష్యాన్ని గురించి భయంగొలిపే సమాచారం ప్రచురించింది.

1990కి పూర్వం అమెరికా ప్రేమపాత్రుడిగా ఉండిన సద్దాం హుస్సేన్ కువైట్‌పైన యుద్ధం ప్రకటించి అమెరికాకు శత్రువయిన సంగతి తెలిసిందే. అతని పొగరణచడానికి అమెరికా 1991లో ఇరాక్‌పైన 43 రోజులపాటు జరిపిన యుద్ధాన్ని గల్ఫ్ యుద్ధం అని మొన్నటిదాకా పిలిచేవారు. ప్రస్తుతం నడుస్తున్న యుద్ధం మొదలయిన తరువాత దానిని మొదటి గల్ఫ్ యుద్ధం అనీ, దీనిని రెండవ గల్ఫ్ యుద్ధమనీ పిలుస్తున్నారు.

మొదటి గల్ఫ్ యుద్ధంలో ఇరాక్‌పైన భయంకరమైన హింసకు పాల్పడింది చాలక అమెరికా ఆ తరువాత ఐక్యరాజ్యసమితి చేత ఆ దేశంపైన తీవ్రమైన ఆంక్షలు పెట్టించింది. చమురు అమ్ముకొని ఇతర అవసరాల్లో అధిక భాగం దిగుమతి చేసుకొని బతికే ఎడారి దేశమైన ఇరాక్ చమురు ఎగుమతులపైన, నిత్యావసర సరుకుల దిగుమతులపైన ఈ ఆంక్షలు పనిచేసాయి. వాటి ఫలితంగా వైద్యసదుపాయం కొరవడి ఏడున్నర లక్షల మంది పిల్లలు ఇరాక్‌లో 1990లలో చనిపోయారన్నది తదుపరి కాలంలో పరిశోధకులు బయటపెట్టిన సత్యం.

ఇది శాంతికాలంలో జరిగిన హననం. యుద్ధకాలంలో జరిగినదీ, దాని ఫలితంగా తరువాత నెలకొన్న ఆంక్షల శాంతికాలంలో కొనసాగినదీ ఇంతకంటే తక్కువ భయంకరమైనది కాదు. ఇది అమెరికా మొదటి గల్ఫ్‌యుద్ధంలో ప్రయోగించిన

డిప్లీటెడ్ యురేనియం ఆయుధాల ప్రభావం. అక్కడ మొదట ప్రయోగించిన ఈ రకం ఆయుధాలను తరువాత అమెరికా ఆఫ్ఘనిస్తాన్ పైన జరిపిన యుద్ధంలో కూడ ప్రయోగించింది. ఇప్పుడు మళ్ళీ రెండవ గల్ఫ్‌యుద్ధం అని పిలవబడుతున్న ఇరాక్ యుద్ధంలో ప్రయోగిస్తున్నది. ఉత్తరకొరియా (ప్రస్తుతానికి) ఈ ఘోరాన్ని తప్పించుకుంది. ఇరాన్, సిరియాలు దానిని త్వరలోనే రుచి చూడగలవు.

డిప్లీటెడ్ యురేనియం ఒక అణుధార్మిక స్వభావం గల పదార్థం. దానిని ఆయుధాలలో ఉపయోగించడం అంటే అణుయుద్ధం చేయడమే. అమెరికా పశ్చిమాసియాలో ఆ పేరు పెట్టకుండా అణుయుద్ధమే చేస్తున్నది. 1945లో అమెరికా జపాన్‌లోని నాగసాకి నగరం పైన వేసిన బాంబుతో సమానమయిన దానిని ఒక 'నాగసాకి బాంబు' అనేటట్టయితే, మొదటి గల్ఫ్‌యుద్ధంలో అమెరికా ఇరాక్‌పైన 83 వేల నాగసాకి బాంబులకు సమానమైన అణుధార్మిక ఆయుధాలను ప్రయోగించింది. మొదటి గల్ఫ్‌యుద్ధాన్నీ రెండవ గల్ఫ్‌యుద్ధాన్నీ కలుపుకుంటే 4 లక్షల నాగసాకి బాంబులతో సమానమైన అణుధార్మిక ఆయుధాలను ప్రయోగించింది. ఇవి కేవలం సైనికులపైనా వారి స్థావరాలపైనా ప్రయోగించిన ఆయుధాలు కావు. అన్ని రకాల దాడులలోనూ డిప్లీటెడ్ యురేనియం గల ఈ ఆయుధాలను అమెరికా ప్రయోగించింది. అమెరికాకే చెందిన రేడియాలజీ, న్యూక్లియర్ మెడిసిన్ ప్రొఫెసర్ అసఫ్ డ్యురాకోవిచ్ 2003 సంవత్సరంలో చేసిన ఒక అధ్యయనం ప్రకారం బాగ్దాద్, బస్రా, నజాఫ్ మొదలయిన 10 ప్రధాన ఇరాకీ నగరాల వాతావరణంలో ఆణుధార్మికత ఉండదగ్గ దానికంటే 'వందల, వేల రెట్లు ఎక్కువ ఉంది. (వాషింగ్టన్‌లోని జార్జి టవున్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా ఉన్న ఈయనను ఈ నివేదిక ప్రకటించిన తరువాత ఉద్యోగం నుండి తీసేసారు, ఆయన ఇంటిపైన దాడులు చేసారు, చంపుతానని బెదిరించారు.) 2007లో ఆఫ్ఘనిస్తాన్‌లో జరిగిన పరిశోధనలో కూడ ఆ దేశంలోని ప్రధాన నగరాలైన కాబుల్, జలాలాబాద్‌ల వాతావరణంలో అణుధార్మికత ఉండదగ్గదాని కంటే 400 నుండి 2000 శాతం ఎక్కువ ఉందని తేలింది.

అణుధార్మికత వాతావరణంలో అంతటి అసాధారణ పరిమాణంలో ఉన్నట్లయితే ఏం జరగగలదో వివరించి చెప్పనవసరం లేదు. అది జీవరాశుల శరీరకణాలను మెల్లమెల్లగా తొలిచి వేయగలదు. కాన్సర్ వంటి రోగాలు విస్తృతంగా రాగలవు. తల్లి

గర్భంలోని పిల్లలు అంగవైకల్యంతో పుట్టగలరు. ఇవ్వాల్టి అణుకాలుష్యం రాబోయే చాలాకాలం పాటు కోలుకోలేని రోగాలకూ అంగ వైకల్యానికీ కారణం కాగలదు. ఇరాక్‌లో ఇప్పటికి ఆరేడు లక్షల మంది పౌరులు ప్రత్యక్ష దాడులలో చనిపోయారన్నది అంచనా కాగా, ఈ అణుకాలుష్యం వల్ల రాబోయే రోజులలో 30 లక్షల మరణాలు సంభవించగలవని బ్రిటన్‌కు చెందిన అటామిక్ ఎనర్జీ అథారిటీ అంచనా వేసింది.

మొదటి గల్ఫ్ యుద్ధం అనంతరం విధించిన ఆంక్షలలాగే ఈ అణుధార్మిక దాడి కూడ చిన్నపిల్లల మీద ఎక్కువ దుష్ప్రభావాన్ని వేస్తున్నది. 12 సంవత్సరాల వయసులోపు ఉన్న పిల్లలలో సాధారణంగా కనిపించని కాన్సర్ రోగ లక్షణాలు ఇప్పుడు చూస్తున్నాం అని బస్రాలోని అతి పెద్ద ప్రభుత్వ ఆస్పత్రి కాన్సర్ విభాగం అధిపతి జపాన్‌లో జరిగిన ఒక కాన్ఫరెన్స్‌లో ప్రకటించాడు. పుడుతున్న పిల్లలు మెదడు, వెన్నెముక, ఇతర కీలక అవయవాలు లేకుండా పుట్టడం, శరీరం లోపల ఉండవలసిన భాగాలు బయట ఉండడం, ఒకే కన్ను ఉండడం, కన్నో ముక్కో ఉండవలసిన చోట పెద్ద గడ్డతో పుట్టడం, ఇటువంటి వికృత జననాలకు సాక్ష్యంగా అనేక  ఫోటోలు ఇరాక్ నుండి వెలువడుతున్నాయి. ఇరాక్ దక్షిణ భాగంలోని ఒక ఆస్పత్రిని అధ్యయనం చేసిన జపాన్‌కు చెందిన నిపుణుల బృందం ప్రకారం ప్రతీరోజు ఆ ఆస్పత్రికి 600 మంది పిల్లలు వైద్యానికి వస్తారు. అందులో అత్యధిక శాతం అణుధార్మిక రుగ్మతలతో బాధపడుతున్నవారే. మామూలు భాషలో చెప్పాలంటే ఏ రోజయినా కాన్సర్ రోగం బారిన పడగలవారే. అమెరికా ప్రభుత్వాన్ని యుద్ధనేరస్తుడిగానే కాదు, శిశు హంతకుడిగా ఎందుకు ప్రకటించకూడదు?

ఇతరులకు అన్యాయం చేస్తే అది మనకు అంటకుండా పోదని సాధారణ మానవ నైతికత నమ్ముతుంది. ఈ ఘోరానికి పాల్పడుతున్న అమెరికా సైనిక సిబ్బంది కూడ ఈ అణుధార్మికత నుండీ, అది కల్గించే రోగాల నుండీ తప్పించుకోలేక పోతున్నారు. మొదటి గల్ఫ్ యుద్ధం గురించి తరచుగా చేసే ఒక వ్యాఖ్య ఏమిటంటే అమెరికా చేసిన విధ్వంసానికీ అమెరికా సైన్యం పొందిన నష్టానికీ పొంతన లేదని. నేల మీద జరిగే యుద్ధమయితే ఎంతటి బలహీనమైన సైన్యమయినా విజేతకు కొంతయినా నష్టం కలిగించగలుగుతుంది. కానీ 1991 గల్ఫ్‌యుద్ధం వాయు యుద్ధం. అమెరికా సైన్యానికి చెందిన బాంబర్ జెట్ విమానాలు ఇరాక్ పౌర ఆవాసాలపైనా,

సైనిక స్థావరాలపైనా మీది నుండి బాంబుల వర్షం కురిపించగా, వాటిని ఎదుర్కొనే వైమానిక శక్తి గానీ మిస్సైల్స్ గానీ లేని ఇరాక్ మౌనంగా ఆ దాడులను భరించింది. అమెరికా సైనికులు కేవలం 467 మంది చనిపోయారు ఆ యుద్ధంలో.

తక్షణ మరణాల లెక్క తీస్తే ఇది సత్యమే. అయితే తాము కురిపించిన డిప్లీటెడ్ యురేనియం బాంబుల వర్షం నుండి చెలరేగిన అణు ధూళిని వారు కూడ తప్పించుకోలేక పోయారు. ఆనాడు యుద్ధంలో పాల్గొన్న 5,80,400 మంది సైనిక సిబ్బందిలో 11 వేల మంది తరువాత అణుధార్మిక సంబంధమైన రోగాలతో చనిపోయారు. 2000 సంవత్సరం నాటికి 3,25,000 మంది అనారోగ్య కారణాల వల్ల సైన్యం కొలువు నుండి తొలగించబడ్డారు. వారి వీర్య కణాలలోకి అణుధార్మికత ప్రవేశించిన కారణంగా, గల్ఫ్‌యుద్ధం తరువాత వారికి పుట్టిన పిల్లలలో 67 శాతానికి చిన్నదో, పెద్దదో జనన వైకల్యం ఉందని ఒక పరిశోధన తేల్చింది. అంటే అమెరికా ప్రభుత్వం అరబ్బు శిశువులనూ, పుష్తూన్ శిశువులనే కాక తన పిల్లలను సహితం చంపుకుంటున్నది. నిజానికి 'చేసిన పాపం మనకు కూడ అంటకపోదు' అన్న ఈ సత్యమే అమెరికా పౌరులలో పెరుగుతున్న యుద్ధ వ్యతిరేకతకు మూలం. ఇరాకీలను, ఆఫ్ఘన్‌లను  ఎందుకు చంపాలి అన్న వాళ్ళు అమెరికాలో లేకపోలేదు గానీ వాళ్ళొక చిన్న మైనారిటీయే. మన యువకులు అక్కడెక్కడో టెర్రిజాన్ని అంతం చేయడానికో, ప్రజాస్వామ్యాన్ని ఉద్ధరించడానికో ఎందుకు చావాలి అన్నదే ఆ దేశంలో యుద్ధ వ్యతిరేకతకు – అది ఉన్న మేరకు – ప్రధాన కారణం. తమ ప్రభుత్వం 'హీనజాతుల' హననానికి చేస్తున్న యుద్ధం తమ సైనికుల ఆరోగ్యాలపైనే కాక వాళ్ళకు పుట్టబోయే పిల్లలపైన కూడ తీవ్ర దుష్ప్రభావం వేయగలదని అమెరికా పౌరులు గ్రహించడమూ దీనికి ఉపయోగపడవచ్చు.

అన్నిటికంటే ఆగ్రహం కలిగించేది ప్రపంచం నిస్సహాయత. డిప్లీటెడ్ యురేనియం గానీ, వేరే ఏదయినా అణుధార్మిక స్వభావం గల ఆయుధం గానీ ప్రయోగించడం ఏయే అంతర్జాతీయ నియమాలకు విరుద్ధం అని ఏకరువు పెట్టడం అనవసరం. యుద్ధనియమాల నుండి అణువ్యాప్తి నిరోధక నియమాల దాకా చాలానే ఉన్నాయి కాని వాటిని అమలు చేయవలసిన ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ అణుశక్తి సంస్థ మొదలయినవన్నీ అమెరికా ప్రభుత్వం జేబులో ఉన్నప్పుడు ఎన్ని నియమాలను

ఏకరువు పెట్టి ఏం ప్రయోజనం? చివరికి, ఎంతో కొంత స్వతంత్రంగా వ్యవహరించే సంప్రదాయం ఉన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ సహితం పైన పేర్కొన్న సమాచారాన్ని బయటపెట్టిన వైద్య నిపుణుల పరిశోధనలు విశ్వసనీయమైనవి కావంటూ ప్రచారం చేస్తుండగా ఇక 'అంతర్జాతీయం' అంటూ ఏం మిగిలింది? ప్రపంచ దేశాల మధ్య న్యాయాన్ని నిలబెట్టడానికి అవకాశం ఎక్కడుంది? శిశు హంతక అమెరికాను నేటి శిశువులే రేపు శిక్షిస్తారని కవితాత్మకంగా ఆశ వ్యక్తం చేయడం తప్ప చేయగలిగింది ఏముంది?

*ప్రజాతంత్ర వారపత్రిక*

*18 ఫిబ్రవరి 2007*




పాలస్తీనా

# పాలస్తీనా ప్రజాపోరాటం

ఇజ్రాయిల్ ఏర్పడి ఇప్పటికి 34 సంవత్సరాలు గడిచాయి. ఈ 34 ఏండ్లలో ఇజ్రాయిల్ పేరు దినపత్రికల శీర్షికల్లో కనబడని రోజు లేదంటే అతిశయోక్తే గాని, మరీ అన్యాయమయిన అతిశయోక్తి కాదు. ఒక రోజు ఇజ్రాయిల్ దౌర్జన్యం, రెండవ రోజు పాలస్తీనా ప్రజల ప్రతిఘటన, మూడవ రోజు ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఖండన, నాలుగవ రోజు సెక్యూరిటీ కౌన్సిల్‌లో అమెరికా వీటో, అయిదవ రోజు ఏ కొలంబోలోనో కొత్త ఢిల్లీలోనో సమావేశమయిన అలీన దేశాల అధినేతల కృత్రిమ సంతాపం. మళ్ళీ ఆరవ రోజు కథ పునఃప్రారంభం – ఇదీ వరస. ఈ ఇతిహాసపు నూతన ఘట్టం గత కొద్దివారాలుగా లెబనాన్‌లో సాగుతోంది. బహుశా కొద్ది రోజులలో ఎప్పటిలాగే మరింతమంది పాలస్తీనా అరబ్బుల దారుణ మరణంతో ముగుస్తుంది. మళ్ళీ తెర లేచేదాకా పాలస్తీనా ప్రజలకు శవాలను లెక్కబెట్టుకోవడానికి విరామం.

## చరిత్ర

ఎప్పుడో 4 వేల ఏండ్ల క్రితం, ఇజ్రాయిల్ అన్నది ఒక దేశంగాని జాతిగాని కాకుండా కొన్ని పశ్చిమాసియా తెగలకు సామాన్య వ్యవహారంగా వున్న రోజులలో, యెహోవా అబ్రహాంకు కలలోనో పగటిపూటనో కనిపించి పాలస్తీనాను తాను

యూదులకు (Jews) దత్తం చేసాననీ, తన వాక్కును ప్రచారం చేసేందుకు తాను యూదులనే ఎంచుకున్నాననీ అన్నాడట. ఇన్ని శతాబ్దాలు గడిచినా యెహోవా తన వాగ్దానాన్ని నిలుపుకునేలాగ లేడు కాబట్టి దాన్ని తామే సాధించుకోవాలని నిర్ణయించుకున్నారట. అప్పటికే పాలస్తీనాలో వేల సంవత్సరాలుగా వుంటూ వస్తున్న అరబ్బులకు ఎంత కష్టం కలిగినా ఆ నిర్ణయాన్ని వారు ఉపసంహరించుకోదలచుకోలేదట. నిజానికి అక్కడున్న అరబ్బుల ఉనికినే వారు గుర్తించదల్చుకోలేదు. యూరప్ నలుమూలల నుండి 1882 లో మొదలుపెట్టి లక్షల సంఖ్యలో పాలస్తీనాకు వలస వెళ్ళిన యూదులు తమ ప్రయత్నాన్ని 'ప్రజలు లేని దేశాన్ని దేశం లేని ప్రజలకు ఒప్పజెప్పడం'గా వర్ణించుకున్నారు (To give a land without a people to a people without a land). తాము దేశం లేని ప్రజలనీ, పాలస్తీనా ప్రజలు లేని దేశమనీ వాళ్ళ అభిప్రాయం. అయితే ఒక సోవియట్ రచయిత అన్నట్టు, అప్పటికి యూదులు దేశం లేని ప్రజలూ కారు, పాలస్తీనా ప్రజలు లేని దేశమూ కాదు. 1919లో పాలస్తీనా జనాభా 5,90,000. అందులో 5,33,000 మంది అరబ్బులు. యూదులు కూడ 'దేశం లేని ప్రజలు' కాక, యూరప్‌లోని వివిధ దేశాలలో ఇమిడిపోయి వున్నారు. పశ్చిమ యూరప్‌లోని యూదులు ఆయా దేశాల భాషలే తప్ప (ఇంగ్లీష్, ఫ్రెంచి ఇత్యాది) తమ పవిత్రభాషగా పరిగణించబడే హీబ్రూ మాట్లాడడం కూడ మరచిపోయారు. తూర్పు యూరప్‌లోని యూదులు కూడ యిద్దిష్ (Yiddish) అనే భాష మాట్లాడేవారు, హీబ్రూ కాదు.

ఈ వాస్తవాలన్నింటినీ పక్కకు పెట్టి, పాలస్తీనాలో నివసించడం తమ పవిత్ర హక్కుగా ప్రకటించుకొని, 19వ శతాబ్దం చివరి భాగం నుండి పాలస్తీనాకు వలసవెళ్ళడం మొదలుపెట్టి, క్రమంగా అక్కడి అరబ్బులను సంఖ్యలో మించిపోయి, అంతర్జాతీయ అభిప్రాయాన్నీ, ఐక్యరాజ్యసమితి నిర్ణయాన్నీ ఉల్లంఘించి బలప్రయోగంతోను, యుక్తి ప్రయోగంతోను, సామ్రాజ్యవాద సహకారంతోను 1948లో ఇజ్రాయిల్‌ను ప్రకటించుకున్నారు. ఈ యూదుల దాడికి తట్టుకోలేక పాలస్తీనా అరబ్బులలో చాలామంది పక్క దేశాలయిన జోర్డాన్, లెబనాన్, సిరియా, ఈజిప్టు తదితర దేశాలకు శరణార్థులుగా పోయి ఈ 34 సంవత్సరాలుగా శరణార్థుల క్యాంపులలో జీవిస్తున్నారు. అయినా తమ మాతృభూమికి తిరిగి వెళ్ళాలన్న పట్టుదలను విడిచిపెట్టకుండా ఎన్ని దెబ్బలకయినా తట్టుకొని పోరాటం చేస్తున్నారు. శత్రువుది సామ్రాజ్యవాద బలం అయితే వారిది పరాధీనుల బలహీనత. పక్క దేశంలో తలదాచుకుని పోరాటం చేయడం అన్నది చరిత్రలోకి పాలస్తీనా ప్రజలతోనే వచ్చింది.

కాళ్ళ కింద నేల ఉంటే నిలదొక్కుకుని పోరాటం చేయవచ్చునని చైనా, వియత్నాం ప్రజలు చూపించారు. కాని కాళ్ళ కింద నేల కోసమే పోరాటమయితే దిక్కేది?

★ ★ ★

యూదులు అనేది ఒక మానవ సమూహం (human community). దాన్ని నిర్వచించేది జుడాయిజం (Judaism) అనే మతం, ఆ మత సంస్కృతి; క్రైస్తవ యూరప్‌లో అల్పసంఖ్యాక జాతిగాను, ఫ్యూడల్ పట్టణ ప్రాంత వ్యాపారస్తుల వర్గంగాను కొన్ని శతాబ్దాల మనుగడ తాలూకు చరిత్ర. హీబ్రూ వాళ్ళ పవిత్ర భాషేగాని వ్యావహారిక భాష కాదు. హిందువులకు సంస్కృతం లాంటిది యూదులకు హీబ్రూ. 'జాతి'ని నిర్వచించే లక్షణాలలో ప్రాదేశికత్వం ప్రధానం కాదనుకుంటే యూదులను ఒక జాతి అనవచ్చు.

అరబ్బులను ఒక 'జాతి' అనడంలో ఇంకా ఎక్కువ ఇబ్బందులున్నాయి. వాళ్ళకు ఒకే మతం కూడ లేదు. ముఖ్యంగా, ఇవ్వాళ వార్తల్లో వున్న పాలస్తీనా, లెబనాన్‌లోని అరబ్బులలో ముస్లింలతో సమానంగా కాకున్నా గణనీయమైన సంఖ్యలో క్రైస్తవులు వున్నారు. అయితే అరబిక్ భాష, ఎడారి సంచార జీవుల నాగరికత ఇద్దరికీ సామాన్య లక్షణాలు. ఆ భాష కూడ పశ్చిమాన మొరాకోతో మొదలుపెట్టి అల్జీరియా, ట్యునీషియా, లిబియా, సౌదీ అరేబియా, పాలస్తీనా, జోర్డాన్, లెబనాన్, సిరియాల గుండా తూర్పున ఇరాక్‌కు వచ్చేసరికి గుర్తుతెలియనంతగా మారిపోయింది.

అరబ్బులూ యూదులూ దగ్గరి చుట్టాలు. ఇద్దరూ సెమిటిక్ జాతికి చెందుతారు. ప్రాచీన కాలంలో ఇద్దరూ కూడ పశ్చిమాసియా ఎడార్లలోని సంచారజీవులే. పశుపోషణ, వాణిజ్యం, ఒయాసిస్‌లలో కొద్దిపాటి వ్యవసాయం వాళ్ళ జీవనాధారాలు. అప్పటికి అరబ్బులకు ఒక మతం లేదు, యూదుల జుడాయిజం మాత్రం చాలా ప్రాచీనమయినది. వాళ్ళ మూలపురుషుడిగా పరిగణించబడే అబ్రహాం క్రీ.పూ. 2000 కాలానికి చెందినవాడని చరిత్రకారుల అంచనా.

## క్రైస్తవం పుట్టుక తర్వాత

క్రైస్తవం పుట్టుక వల్ల జుడాయిజం వెంటనే బలహీనపడలేదు గాని క్రీ.శ. 135 సంవత్సరంలో రోమన్ చక్రవర్తికి వ్యతిరేకంగా జరిగిన ఒకానొక తిరుగుబాటులో కొందరు యూదులు పాల్గొన్నందుకు వాళ్ళమీద కోపంతో రోమన్ చక్రవర్తి యూదుల

పవిత్ర నగరమయిన జెరూసలెంలోని వాళ్ళ దేవాలయాన్ని నాశనం చేశాడు. దానితో యూదులు చెల్లాచెదురయిపోయారు. అధిక సంఖ్యాకులు క్రమంగా యూరప్ ఖండమంతా వ్యాపించిపోయారు. రోమన్ సామ్రాజ్యపతనం తరువాత యూరప్‌లో ఆవిర్భవించిన ఫ్యూడల్ సమాజంలో యూదులకు వ్యాపారస్తులుగా అనువయిన స్థలం దొరికింది.

దానికొక కారణం వుంది. సంచారజీవులయిన యూదులకు (అరబ్బులకు కూడ) వాణిజ్యం కొత్త కాదు. ఎడారి ఒక చివర సరుకులు కొని కారవాన్లపై (caravans) రెండవ చివరికి తరలించి అక్కడ విక్రయించి తమ జీవనాన్ని సంపాదించుకునే అలవాటు వాళ్ళకు ప్రాచీనకాలం నుండి వుంది. వాణిజ్యాన్నీ వాణిజ్య లాభాన్నీ జుడాయిజంగాని, ఇస్లాంగాని చిన్నచూపు చూడవు. ఫ్యూడల్ మతమయిన క్రైస్తవం అట్లా కాదు. క్రైస్తవం ఈ ప్రపంచాన్ని పాపపంకిలమయినదిగాను, ఈ ప్రపంచంలోని సకల పాపపు వ్యాపకాలలోనికీ వ్యాపారం మరీ అధమమయినదిగాను పరిగణిస్తుంది. ఈ కారణం చేత క్రైస్తవులెవ్వరూ వ్యాపారం చేపట్టలేదంటే అసత్యమవుతుంది గాని, క్రైస్తవుల కంటే యూదులకు అది సులభమయింది. ముఖ్యంగా వడ్డీవ్యాపారం క్రైస్తవులకు పూర్తిగా నిషిద్ధం కాబట్టి అది యూదులకు గుత్త అయింది.

ఈ రకంగా మధ్యయుగాల నాటికి యూదులు యూరప్ దేశాలలో పట్టణ ప్రాంత వ్యాపారవర్గంలోను, దిగువ మధ్యతరగతిలోను స్థిరపడిపోయారు. గ్రామీణ ప్రాంతాలలో యూదులు చాలా తక్కువ. వాళ్ళకు వ్యవసాయిక పూర్వరంగం లేకపోవడం దీనికి కారణం.

మధ్యయుగాల చివరి భాగంలో బూర్జువా విప్లవాలు రావడంతో పట్టణ ప్రాంతాలలోని యూదులు మొట్టమొదట ప్రభావితులయ్యారు. వాళ్ళలోని వ్యాపారస్తులు మరింత బాగుపడి ఆధునిక పెట్టుబడిదార్లయితే, దిగువ మధ్యతరగతికి చెందినవారు మరింత దిగజారి కార్మికులో లంపెన్ కార్మికులో అయ్యారు. ఏదేమయినా ఆధునిక భావాలు, జీవన విధానం యూదులకు త్వరలోనే తాకాయి. పాశ్చాత్య దేశాల బూర్జువా సంస్కృతి నుండి పుట్టిన మహామేధావులయిన యూదుల జాబితా చాలా పెద్దదిగాని, అందులో అందరికీ తెలిసిన పేర్లు మార్క్స్, ఫ్రాయిడ్, ఐన్‌స్టీన్. 19వ శతాబ్దపు బూర్జువా ఉదారవాదం చేత ప్రభావితులయిన పశ్చిమ యూరప్ యూదులు ఆయా దేశాల ఆధునిక సమాజంలో భాగమయిపోయారు. కాని బూర్జువా విప్లవాలు ఆలస్యంగా

జరిగిన తూర్పు దేశాలలో అట్లా జరగలేదు. తూర్పు యూరప్ దేశాలు రష్యా సామ్రాజ్యం చేత అణచబడటం చేత, చాలా వెనుకబడి ఉండడం చేత అక్కడి ప్రజలు విపరీతమయిన పీడనకు గురయ్యారు. వ్యవస్థ పట్ల తమకున్న అసంతృప్తిని వారు యూదుల మీద చూపారు. దీనికి యూదులలో చాలామంది వ్యాపారస్తులు, ముఖ్యంగా వడ్డీ వ్యాపారస్తులు కావడం ఒక కారణం. క్రీస్తును శిలువ వేసి చంపింది యూదులేనన్న మతపరయిన ఆరోపణ మరొక కారణం. ఈ కారణాలన్నిటి వల్లా యూదు వ్యతిరేకత (anti-semitism) బలపడి యూదులను సామూహిక మారణకాండకు గురిచేయడం తరచూ జరిగేది.

ఈ పరిస్థితులలో తూర్పు యూరప్‌లోను, రష్యాలోను యూదు జాతీయ తత్వానికి అనుకూలమయిన వాతావరణం ఏర్పడింది. అక్కడి యూదులు అలనాడు అబ్రహాంకు యెహోవా ఇచ్చిన వాగ్దానాన్ని మరచిపోలేదు. ఎప్పటికయినా తాము పాలస్తీనాకు పోతామని వాళ్ళ నమ్మకం. అయితే తమను తీసుకు వెళ్ళడానికి యెహోవా స్వయంగా ఒక ప్రవక్తను పంపుతాడని ఛాందసులు నమ్మితే, అంతటి ఛాందసులు కానివారు వలసకు మార్గాలను అన్వేషించడం మొదలుపెట్టారు.

1882లో రెండవ అలెగ్జాండరు చనిపోయిన తరువాత రష్యాలోను, రష్యన్ సామ్రాజ్యంలోని తూర్పు యూరప్ దేశాలలోను ఏర్పడ్డ అస్తవ్యస్త పరిస్థితులలో యూదులపై అత్యాచారాలు చాలా జరిగాయి. దానితో తూర్పు యూరప్‌కు చెందిన యూదులు చాలామంది పశ్చిమ యూరప్‌కు, అమెరికాకు వలసవెళ్ళారు. కొద్దిమంది తమ 'పవిత్రభూమి' అయిన పాలస్తీనాకు వెళ్ళారు. దానితో మొదలయింది పాలస్తీనాకు యూదుల వలస.

ఈ వలస మొదలయిన కొద్ది సంవత్సరాలకు దీనికొక సిద్ధాంతం కూడ పుట్టింది. ఆ సిద్ధాంతాన్ని జియొనిజం (Zionism) అంటారు. Zion అనేది యూదుల పవిత్ర నగరమయిన జెరూసలెంను సూచించే మాట. జెరూసలెం పాలస్తీనాలో వుంది. ఆ పాలస్తీనాకు తిరిగివెళ్ళడం యూదుల పవిత్ర ధర్మమనీ, హక్కనీ నమ్మే సిద్ధాంతం జియొనిజం. ప్రథమ జియొనిస్టు సిద్ధాంతకర్త థియొడర్ హెర్జెల్ (Theodore Herzl). యూదు వ్యతిరేకత చాలా బలంగా వున్న ఆస్ట్రియాకు చెందిన యూదుడు ఈయన. అయితే ఆశ్చర్యమేమిటంటే ఇవ్వాల్టి ఇజ్రాయిల్ నాయకులతో పోలిస్తే హెర్జెల్ చాలా ఉదారవాది. అతను కోరింది పాలస్తీనా అరబ్బులను పాలస్తీనా నుండి వెళ్ళగొట్టి యూదుల రాజ్యం ఏర్పాటు చేయడం కాదు, 'పాలస్తీనా ప్రజలతో కలిసి ఒక ఉమ్మడి

స్వస్థలాన్ని ఏర్పరచుకొని, వారి సోదరభావాన్నీ, సన్నిహిత సహకారాన్నీ సాధించడం'. అప్పటికి యూదులింకా ఒక పీడిత ప్రజలుగానే వున్నారు. వారిలో చాలామంది బడా పెట్టుబడిదార్లు, ఆధునిక బూర్జువా సమాజం ఇచ్చిన అవకాశాలను వినియోగించుకున్న మేధావులు, సాంకేతిక నిపుణులు ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ వాళ్ళు మౌలికంగా ఇంకా ఒక పీడిత జాతే. తరువాతి కాలంలోనే వాళ్ళు సామ్రాజ్యవాదానికి సాధనాలుగా మారారు. మారిన తరువాతే జియోనిజంలో ఇవ్వాళ కనబడే జాతి దురహంకారం ప్రవేశించింది.

## టర్కీ పాలనలో ఎక్కువ కాలం

ఈ యూదుల వలస, దానితోపాటు జియోనిస్టు సిద్ధాంతాల ప్రభావం పెరిగే నాటికి పాలస్తీనా టర్కీ సామ్రాజ్యంలో భాగంగా వుంది. ప్రాచీన కాలంలో ఈజిప్టు, బాబిలోనియా, పర్షియా, రోమ్, ఆ తరువాత అరబ్ సామ్రాజ్యాలలో వుండిన పాలస్తీనా 16వ శతాబ్దం మొదటి భాగంలో టర్కీ పాలన క్రిందికి వచ్చింది. అప్పటి నుండి, 1919లో మొదటి ప్రపంచ యుద్ధంలో టర్కీ ఓడిపోయేవరకు టర్కీ చేతనే పరిపాలించ బడింది. ఫ్యూడల్ సామ్రాజ్యమయిన టర్కీలో సాంకేతిక అభివృద్ధికి ఆస్కారం తక్కువ కాబట్టి బొత్తిగా అబ్రహాం కాలంలోలాగా లేకున్నా, బాగ్దాద్ ఖలీఫాల కాలంలో ఎలాగుండేదో అలాగే వుంది 20వ శతాబ్దంలో పాలస్తీనా. ఇటువంటి పాలస్తీనాకు వలస వచ్చారు యూదులు.

అందుకే మొదట్లో పాలస్తీనా అరబ్బులు యూదుల రాకను వ్యతిరేకించలేదు. యూదులు పాలస్తీనాకు బికార్లుగా రాలేదు. పెట్టుబడితో వచ్చారు. సాంకేతిక నిపుణతతో వచ్చారు. ఆధునిక బూర్జువా సమాజపు భావాలనూ సౌకర్యాలనూ మోసుకొచ్చారు. వాళ్ళ రాక వల్ల వాణిజ్యం పెరిగింది. వ్యవసాయం పెరిగింది. ఆధునిక భావాల వ్యాప్తి కూడ పెరిగింది. 1935 వరకు కూడ పాలస్తీనా అరబ్బులు యూదులు తమ దేశానికి రానేకూడదనలేదు. వాళ్ళ ప్రవాహం మీద కొన్ని పరిమితులుండాలని మాత్రమే కోరారు.

జియోనిస్టులు మాత్రం ముందునుంచీ వేరే దృక్పథాన్ని కనబరిచారు. వాళ్ళు కేవలం ఆయుధాలతో పాలస్తీనా అరబ్బులను తమ నేల నుండి తరమలేదు. ఎక్కడ దెబ్బతీయాలో అక్కడే తీసారు – భూమిని చేజిక్కించుకున్నారు. వారి వెనుక

సంపన్నులయిన జియొనిస్టు పెట్టుబడిదార్లు (ఫ్రాన్సులోను, ఇంగ్లండులోను, అమెరికాలోను) ఉన్నారు గనుక వారికి పుష్కలంగా డబ్బు దొరికింది. దానితో అరబ్బు భూస్వాముల భూములు కొన్నారు. కొని ఊరుకోక ఆ భూమిపైన పనిచేస్తున్న అరబ్బు రైతులను తొలగించి యూదులనే నియమించుకున్నారు. కూలీలను సహితం అరబ్బులను నియమించకూడదనీ, యూదులనే నియమించాలనీ జియొనిస్టు సంస్థలు నిర్ణయించుకున్నాయి. ఈ భూ ఆక్రమణ గురించి వివరాలు తెలుసుకోవలసిన అవసరం వుంది.

## యూదుల పెట్టుబడి సమీకరణ

భూములు కొనుక్కోవడానికి కావలసిన పెట్టుబడిని సమకూర్చుకోవడానికి వారు 1901లో Jewish National Fund ను (యూదుల జాతీయ నిధి), 1920లో Palestine Foundation Fund ను (పాలస్తీనా ఏర్పాటు నిధి) నెలకొల్పుకున్నారు. ఈ నిధులకు డబ్బులిచ్చింది Rothschild, Oppenheimer, Philips తదితర పేరుపొందిన పెట్టుబడిదారీ కుటుంబాలేగాక అసంఖ్యాకులయిన చిన్న చిన్న జియొనిస్టు పెట్టుబడిదార్లూను. ఈ నిధుల నుండి భూ కొనుగోలు కోసం పెట్టుబడి తీసుకున్న యూదులు పాటించవలసిన నియమాలలో ఒకటి: 'రుణగ్రహీత ఈ పెట్టుబడితో కొన్న భూమి మీద తానూ తన కుటుంబమూ మాత్రమే పనిచేయాలి. కూలీలను తీసుకోవలసిన అవసరం ఎప్పుడయినా ఏర్పడితే యూదులనే తీసుకోవాలి'.

1952లో ప్రకటించిన Jewish Agency ప్రణాళికలోని రెండు అంశాలు:

1. భూమిని యూదుల ఆస్తిగానే కొనాలి, యూదుల జాతీయనిధి పేరిటే కొనాలి.
2. Jewish Agency నిర్వహించే, లేక ప్రోత్సహించే కార్యక్రమాలన్నింటిలోనూ యూదులనే నియమించాలన్నది నియమంగా పెట్టుకోవాలి.

ఇటువంటి సంస్థలే కాకుండా కొందరు జియొనిస్టు బడా పెట్టుబడిదార్లు వ్యక్తులుగా కూడ భూమి కొనుగోలుకు డబ్బు ఇచ్చేవారు. 1914 వరకు ఏర్పడ్డ 43 వ్యవసాయిక స్థిరావాసాలు (agricultural settlements) అన్నింటికి కూడ పెట్టుబడి Rothschild అనే ఒక ఫ్రెంచి జియొనిస్టు కుటుంబం ఇచ్చింది. ఇంతటి పెట్టుబడి ఆసరా ఉండబట్టే యూదులు అరబ్బులను పాలస్తీనా నుండి తరిమేసి ఇజ్రాయిల్‌ను

ఏర్పరచుకోగలిగారు. 1948 తరువాత వాళ్ళు అవలంబించిన భూ ఆక్రమణల పద్ధతుల గురించి తరువాత చూద్దాం.

ఈ 'ఆచరణాత్మక జియోనిజం' (practical zionism) ఒక పక్క పనిచేస్తోంటే వేరొక పక్క 'రాజకీయ జియోనిజం' (political zionism) తన ప్రయత్నాలు తాను చేయసాగింది. అంటే, ఒక పక్క నిధులు సేకరించి భూములు కొనుక్కొని ఆ భూముల నుండి అరబ్బు రైతులనూ కూలీలనూ తరిమేసి తాము స్థిరావాసాలు ఏర్పరచుకోవడం కొనసాగిస్తూ, వేరొక పక్క యూదుల కోసం ప్రపంచంలో ఎక్కడయినా భూమి చూసిపెట్టమని సామ్రాజ్యవాద ప్రభుత్వాలతో మంతనాలు జరిపారు. తమ దేశాలలో యూదులకు క్రైస్తవ మతోన్మాదం నుండి, యూదు వ్యతిరేకుల నుండి రక్షణకు గ్యారంటీ ఇవ్వలేని సామ్రాజ్యవాద ప్రభుత్వాలు తమ వలసల భూభాగాన్ని మాత్రం చాలా ఉదారంగా యూదులకు ఇవ్వడానికి సిద్ధమయ్యాయి. బ్రిటన్ తన వలస అయిన ఉగాండాలో 6000 చదరపు మైళ్ళ భూభాగాన్ని ఇజ్రాయిల్ ఏర్పాటు కోసం ఇవ్వడానికి ఒప్పుకుంది. (ఇవ్వాల్టి ఇజ్రాయిల్ భూవైశాల్యం 7900 చదరపు మైళ్ళు. అందులో చాలా భాగం ఎడారి. అంటే ఆనాటి బ్రిటన్ ఔదార్యం తక్కువది కాదు.) అయితే జియోనిస్టులకు 4 వేల ఏళ్ళ క్రితం యెహోవా అబ్రహాంకు వాగ్దానం చేసిన భూమే కావాలి కాబట్టి ఉగాండా ప్రజలు బ్రతికిపోయారు. లేకపోతే ఇవాళ్టి పాలస్తీనా కథ ఉగాండా కథ అయి ఉండేది.

వాళ్ళయితే తిరస్కరించారుగాని బ్రిటన్ తన ఔదార్యాన్ని వదులుకోలేదు. 1919లో మొదటి ప్రపంచ యుద్ధం ముగిసి టర్కీ ఓడిపోయింది. టర్కీ సామ్రాజ్యం – గెలుపొందిన బ్రిటన్, ఫ్రాన్స్ తదితర దేశాలపాలయింది. గెలిచిన దేశాలు ముక్కలు ముక్కలు చేసి పంచుకోవడం ఆనవాయితీయే గాని, 20వ శతాబ్దంలో అది అంత సులభం కాలేదు. కాబట్టే ఇప్పుడు టర్కీ సామ్రాజ్యంలోని వివిధ దేశాలను వలసలుగా కాక Mandated territories గా పంచుకున్నారు. Mandate అన్నది నానాజాతి సమితి (League of Nations) ఇస్తుందనీ, mandate తీసుకున్న సామ్రాజ్యవాద ప్రభుత్వం ఆ ప్రాంతం అభివృద్ధికి బాధ్యత వహిస్తుందనీ కథనం. పాలస్తీనాపై mandate బ్రిటన్‌కు లభించింది. కథనం ఏదయినా వాస్తవం మాత్రం అది బ్రిటన్‌కు వలసగా మారిందన్నది.

తనకు పాలస్తీనాపై mandate లభించగానే బ్రిటన్ చేసిన మొట్టమొదటి పని యూదులకు అక్కడ ఒక నివాసస్థానం ఏర్పాటు చేయడం పట్ల తన సుముఖతను ప్రకటించడం. దీనిని బాల్ఫోర్ ప్రకటన (Balfour declaration) అంటారు. దీనికి కారణం కేవలం యూదుల పట్ల ప్రేమ కాదు. మధ్యధరా సముద్రం తూర్పు తీరాన వున్న పాలస్తీనాలో తమకు అనుకూలమయిన ప్రభుత్వం ఉంటే సూయజ్ కాలవ ముఖాన్ని సంరక్షించుకోవడం వారికి సులభం.

## బాల్ఫోర్ ప్రకటన

బాల్ఫోర్ ప్రకటనలో నిజానికి బ్రిటన్ చాలా మెలకువతో వ్యవహరించింది. యూదులకు పాలస్తీనాలో నివాస స్థానం ఏర్పరచాలని అంటూ కూడ అక్కడ యూదుల రాజ్యం స్థాపించాల్సిన అవసరం లేదనింది. ఈ నీళ్ళు నములుడుతో జియొనిస్టులే కాదు, శాంతిని గురించి, నీతిని గురించి, ధర్మాన్ని గురించి ఎడతెరిపి లేకుండ ఉపన్యాసాలు ఇచ్చే అమెరికా అధ్యక్షుడు వుడ్రో విల్సన్ కూడ విభేదించాడు. బ్రిటన్ బాల్ఫోర్ ప్రకటనను ఉపసంహరించుకునేదాక సహాయ నిరాకరణ ప్రకటించారు అరబ్బులు. పాలస్తీనాలో ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని వారు 1921లో తొలిసారి డిమాండు చేసారు. దీనికి సమాధానంగా బ్రిటన్ 1922లో పాలస్తీనాకు ఒక శాసనసభను ఏర్పరిచింది గాని అందులోని 12 మంది సభ్యులలో ఇద్దరు యూదులుండాలని నిర్బంధించడమే కాక, ఆ శాసనసభ నిర్ణయాలపై వీటో అధికారం బ్రిటిష్ హైకమీషనర్‌కు ఇచ్చింది. దానితో అరబ్బులు ఆ శాసనసభకు జరిగిన ఎన్నికలను బహిష్కరించారు. మరొకసారి 1928లో పాలస్తీనాకు స్వాతంత్ర్యాన్నీ ప్రజాస్వామిక ప్రభుత్వాన్నీ ఇవ్వాలని డిమాండు చేసారు. 1929లో జెరూసలెంలో యూదులకు, ముస్లిం అరబ్బులకూ ఒక పవిత్ర స్థలం గురించి కలహం వచ్చింది. బ్రిటిష్ ప్రభుత్వం విచారణార్థం నియమించిన ఒక కమిషన్ – యూదుల వలసే అరబ్బుల అసంతృప్తికి కారణమనీ, వాళ్ళ వలసలపై పరిమితులుండాలనీ, అరబ్బు కౌలుదార్లకు రక్షణ ఇవ్వాలనీ సూచించింది. బ్రిటిష్ ప్రభుత్వం ఆ సూచనలను అంగీకరించిందని విని జియొనిస్టులు గొడవచేసి బ్రిటిష్ ప్రధాని రాంసే మెక్‌డొనాల్డ్ నుండి ఆ సూచనలను 'ఉదారంగా' అమలు చేస్తామన్న వాగ్దానాన్ని తెచ్చుకున్నారు.

1933 తరువాత యూరప్‌లో నాజీజం, ఫాసిజం బలపడి యూదు వ్యతిరేకత భయంకరమయిన రూపం తీసుకోవడంతో పాలస్తీనా వైపు యూదుల ప్రవాహం

వేగం పుంజుకుంది. నాజీజం యూరప్‌లోని 95 లక్షల మంది యూదులలో 57.5 లక్షల మందిని హతమార్చింది.

దీని వల్ల ఒక పక్క యూదుల ప్రవాహం పెరిగితే, వేరొక పక్క పరిసరాల ప్రభావం వల్ల పాలస్తీనా అరబ్బుల ప్రతిఘటన కూడ పెరిగింది. చుట్టూ వున్న అరబ్బు దేశాలు ఆ కాలంలోనే స్వతంత్రమయ్యాయి. జోర్డాన్ 1936లో, ఇరాక్ 1932లో, సిరియా, ఈజిప్టులు 1936లో స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్నాయి. స్వతంత్రమైన నాటి నుండి కూడ ఈ దేశాలన్నీ పాలస్తీనా అరబ్బులకు తమ మద్దతు ప్రకటించాయి. 1934లో బ్రిటన్ పాలస్తీనాను పరిపాలించే వలస ప్రభుత్వానికి ఒక సలహాదారుల సభ (Advisory Council) ను ఏర్పరిచింది. ఆ సభ సభ్యత్వ పంపకం అరబ్బులకూ యూదులకూ కూడ రుచించలేదు. అయినా అరబ్బులు సర్దుకుపోదల్చుకున్నారు గాని యూదులు మాత్రం అప్పటికే బాగా బలపడ్డ తమ సంకల్పానికి చిహ్నంగా దాన్ని తిరస్కరించడమే గాక పార్లమెంటులో తమకున్న ప్రభావాన్ని వాడుకుని ఆ సభ ఏర్పాటే జరగకుండ చూసారు. అలాంటి ప్రభావమేదీ లేని అరబ్బులు మాత్రం బ్రిటన్ ఏం చేసినా సహించాల్సి వచ్చింది. 1935లో వాళ్ళు మళ్ళీ పాలస్తీనాలో ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పరచాలనీ, అరబ్బుల భూములను యూదులు కొనడాన్ని నిషేధించాలనీ, దేశం ఎంతటి జనాభాను భరించగలదో నిర్ణయించుకునే దాకా యూదుల వలసను ఆపాలనీ డిమాండు చేసారు. 1935లో కూడ అరబ్బులు యూదుల వలసను ఆపాలని గానీ, వలసవచ్చిన యూదులు తిరిగి యూరప్‌కు వెళ్ళిపోవాలని గానీ కోరకపోవడం గమనార్హం. అంతటి ఔదార్యం జియోనిస్టులు ఎన్నడూ ప్రదర్శించలేదు. అయినా ఆనాటి డిమాండును కూడ బ్రిటన్ తిరస్కరించింది. 1919లో 10 శాతం కూడ లేని యూదులు 1933 నాటికి 20 శాతం, 1938 నాటికి 30 శాతం, 1945 నాటికి 35 శాతానికి పెరిగారు. ఫలితంగా 1937-39 మధ్య కాలంలో అరబ్బులు తీవ్రమయిన తిరుగుబాటు చేశారు. బ్రిటన్ దాన్ని పాశవికంగా అణిచివేసింది.

## రెండవ ప్రపంచయుద్ధం తర్వాత

ఇంతలో రెండవ ప్రపంచయుద్ధం వచ్చింది. వ్యూహాత్మకంగా చాలా కీలక ప్రాంతమైన పాలస్తీనాలో అల్లరెందుకని బ్రిటన్ తన ఎత్తుగడ మార్చుకుంది. అంతకు ముందు 1937లో పాలస్తీనాను రెండుగా విభజించి ఒక అరబ్బురాజ్యం, ఒక యూదు రాజ్యం ఏర్పరచడం సబబని ప్రతిపాదించిన బ్రిటన్, ఇప్పుడు అటువంటి విభజన

అక్కర్లేదనీ, అరబ్బులూ యూదులూ కలిసిమెలిసి సుఖంగా (కనీసం తాను యుద్ధం గెలిచేదాకా) ఉంటే బాగుంటుందనీ ప్రకటించింది. అరబ్బులను మంచి చేసుకోవడం కోసం యూదుల సంఖ్య పాలస్తీనా జనాభాలో 3వ వంతు మించకూడదని కూడ సూచించింది. ఇంత జరిగిన తరువాత కలిసి ఒకే రాజ్యంలో వుండడం సాధ్యంకాదని ఇద్దరూ ఆ ప్రతిపాదనను తిరస్కరించారు.

యుద్ధకాలంలో పాలస్తీనాలోని యూదులు మరింత బలపడ్డారు. మొదట్లో చెప్పినట్లు యూదులు చారిత్రకంగా పట్టణవాసులు, ఎక్కువగా వ్యాపారస్తులు. పాలస్తీనాకు వచ్చినవారిలో కూడ అల్పసంఖ్యాకులు మాత్రమే వ్యవసాయిక స్థిరావాసాలు ఏర్పరచుకొని నారింజ (citrus) తోటల వంటివి పెంచారు. ఎక్కువగా పరిశ్రమలు, వ్యాపారాలే చేపట్టారు. ఉదాహరణకు 1914లో పాలస్తీనాలోని 90,000 మంది యూదులలో 13,000 మంది మాత్రమే అప్పటికి ఏర్పడ్డ 43 వ్యవసాయిక స్థిరావాసాలలో ఉన్నారు, మిగిలిన వాళ్ళంతా పట్టణాల్లోనే వున్నారు. వీళ్ళు 1925లో హీబ్రూ విశ్వవిద్యాలయాన్నీ, అటు తరువాత దేశ పారిశ్రామీకరణను దృష్టిలో వుంచుకుని పాలస్తీనా విద్యుత్ కార్పొరేషన్‌ను, దేశానికి తూర్పున వున్న Dead Sea అనబడే విశాలమయిన చెరువు గర్భాన వున్న ఖనిజసంపదను అన్వేషించడానికి పాలస్తీనా పొటాష్ కంపెనీని స్థాపించారు.

ఈ పెట్టుబడిదారులు, వ్యాపారస్తులు యుద్ధం వల్ల మరింత బలపడ్డారు. యుద్ధ కాంట్రాక్టులు వాళ్ళ విస్తరణకు దోహదం చేసాయి. ఆ విస్తరణతో పాటు జియోనిజం కూడ మరింత మొండిగా తయారయింది. 1947లో బ్రిటన్ తానింక mandate ను కొనసాగించలేనని చెప్పి ఐక్యరాజ్యసమితికి (UNO) అప్పజెప్పింది. ఐక్యరాజ్యసమితి పాలస్తీనాలో ఒక యూదుల రాజ్యం, ఒక అరబ్బుల రాజ్యం నెలకొల్పాలని నిర్ణయించింది. కొంత దొరికితే చాలు అంతా కబళించవచ్చుననే దృష్టితో జియోనిస్టులు అంగీకరించారు గాని తమ దేశాన్ని రెండుగా చీల్చడాన్ని అరబ్బులు వ్యతిరేకించారు.

## బ్రిటన్ నిష్క్రమణ

1948 మే 15న బ్రిటన్ పాలస్తీనా నుండి వెళ్ళిపోయింది. ఆ రోజే జియోనిస్టులు 'ఇజ్రాయిల్' రాజ్యాన్ని ప్రకటించుకున్నారు. దాదాపు ఆ తరువాతి రోజు నుండి మొదటి

అరబ్ – ఇజ్రాయిలీ యుద్ధం ప్రారంభమయింది. సాంకేతికంగా చాలా వెనకబడివున్న అరబ్బులు ఇజ్రాయిల్ శక్తికి తట్టుకోలేక ఓడిపోయారు. యూదులు పాలస్తీనాలో ఆక్రమించుకోగలిగినదంతా ఆక్రమించుకుని అదంతా ఇజ్రాయిలేనన్నారు. ఆ ప్రాంతాల పాలస్తీనియన్లలో చాలామంది పక్కనున్న సిరియా, లెబనాన్, జోర్డాన్, ఈజిప్టులకు పారిపోయారు. అప్పటినుండి అక్కడి శరణార్థుల క్యాంపుల నుండే పోరాటం చేస్తున్నారు. శరణార్థులుగా వెళ్ళిపోయిన అరబ్బులు తిరిగి రాకుండ చేయడం కోసం అవసరమయిన చట్టాలను పకడ్బందీగా తయారు చేసుకుంది ఇజ్రాయిల్. 1948లో మొదట రెండు చట్టాలను జారీ చేసింది. ఒకదాని ప్రకారం భూమిని ఎవరయినా ఒక సంవత్సరకాలం బీడుపెడితే ఆ భూమి ప్రభుత్వానిదవుతుంది. దీన్ని వాడుకొని శరణార్థులుగా వెళ్ళిన అరబ్బు రైతుల భూముల్ని కాజేసి యూదులకిచ్చింది ఇజ్రాయిలీ ప్రభుత్వం. అయితే కొన్ని సందర్భాలలో భూస్వాములు పారిపోయి భూమిని దున్నే రైతు ఉండిపోవడం జరిగింది. ఈ భూముల్ని స్వంతం చేసుకోవడం కోసం రెండవ చట్టం పనికొచ్చింది. పారిపోయిన భూస్వాములను absentee landlords గా ప్రకటించి ఆ భూములను కూడ ప్రభుత్వం తీసేసుకుంది. తీసుకుని, దాన్ని దున్నుతున్న అరబ్బు రైతులను తొలగించి యూదులకు ఇచ్చింది. ఫలితంగా తాత్కాలికంగా పాలస్తీనా వదలివెళ్ళి ఒక సంవత్సరం తరువాత తిరిగి వచ్చిన అరబ్బులు కూడ తమ సర్వస్వం కోల్పోయారు.

ఇది చాలదన్నట్టు, 'దేశ రక్షణార్థం, కొత్తగా వలస వచ్చిన యూదుల కోసం' ఎవరి భూమినయినా ప్రభుత్వం తీసేసుకోవచ్చుననే చట్టాన్ని 1953లో జారీ చేసారు. దాన్ని అరబ్బుల మీద ప్రయోగించారని వేరే చెప్పనక్కరలేదు. ఈ చర్యలన్నిటి ఫలితాన్నీ స్వయంగా ఇజ్రాయిల్ ప్రభుత్వ వ్యవసాయిక శాఖే (Ministry of Agriculture) ప్రకటించింది. వాళ్ళ లెక్కల ప్రకారమే 1948 నుండి 1963 నాటికి ఇజ్రాయిల్‌లోని సగటు అరబ్ కుటుంబం భూమి 3.75 ఎకరాల నుండి 1.1 ఎకరాలకు పడిపోయింది. ఆ తరువాతి కాలంలో పరిస్థితి మరీ అధ్వాన్నమయింది. ఒక సోవియట్ రచయిత ప్రకారం (పై వివరాలన్నీ ఆ రచయిత నుండి తీసుకున్నవే) ఇజ్రాయిల్‌లోని అతిపెద్ద అరబ్బు గ్రామం అయిన ఉమ్మల్–ఫాహెంలో అరబ్బు రైతులూ భూస్వాములూ కలిసి ఒకప్పుడు 35,000 ఎకరాలు కలిగి వుండేవారట. 1976 నాటికి అది 3,000 ఎకరాలకు దిగింది. ఇజ్రాయిలీ సైన్యం ఎన్ని రకాల తుపాకులు వాడిందీ, ఎన్ని

టన్నుల బాంబులు ప్రయోగించిందీ, ఎన్ని రకాల వ్యూహాలు పన్నిందీ వివరంగా చెప్పే బూర్జువా పత్రికలు ఈ మౌలికమయిన భూఆక్రమణను గురించి మనకు ఎన్నడూ చెప్పవు. ఆస్తి సంబంధాల గురించి 'పబ్లిగ్గా' మాట్లాడుకోవడం బూర్జువా సంస్కృతికే అపచారం.

## అరబ్ – ఇజ్రాయిలీ యుద్ధాలు

యుద్ధాల గురించి చెప్పుకోవాలంటే రెండు మాటలలో చెప్పుకోవచ్చు. 1948లోని మొదటి యుద్ధం తరువాత 1956లో ఒకసారి, 1973లో ఒకసారి, ఇప్పుడు మళ్ళీ 1982లో మరొకసారి అరబ్ – ఇజ్రాయిలీ యుద్ధాలు జరిగాయి. 1956లో ఈజిప్టు సూయజ్ కాలవ కంపెనీని జాతీయం చేసి పాశ్చాత్యదేశాల నోట్లో మన్నుకొట్టినప్పుడు బ్రిటన్, ఫ్రాన్సులు ఈజిప్టు మీద స్వయంగా దాడి ప్రారంభించడానికి నైతిక ధైర్యం చాలక ఇజ్రాయిల్‌ను ముందు పెట్టుకుని వెనక తాము యుద్ధానికి దిగాయి. అరబ్బు దేశాలు ఉన్నంతకాలం పాలస్తీనా శరణార్థులకు నిలువనీడ, పోరాటానికి స్థావరం ఉంటాయన్న భయంతో ఇజ్రాయిల్ దొరికిన అవకాశాన్నల్లా ఉపయోగించుకొని అరబ్ దేశాల మీద దాడి చేస్తోంది. 1967లో సిరియా మీద, సిరియాకు సాయం వచ్చినందుకు ఈజిప్టు, జోర్డాన్‌ల మీద దాడిచేసింది, చేసి చాలా భూభాగాన్ని ఆక్రమించుకుంది. (ముఖ్యంగా, ఈజిప్టుకు చెందిన సినాయి ద్వీపకల్పం, జోర్డాన్‌కు చెందిన జోర్డాన్ నదీ పశ్చిమతీరం.) తాను కోల్పోయిన భూమిని తిరిగి పొందడానికి ఈజిప్టు 1973లో ఇజ్రాయిల్ మీద దాడి చేసింది కాని పూర్తిగా సఫలీకృతం కాలేదు.

1956 సూయజ్ సంఘటన తరువాత ఇజ్రాయిల్‌ను అంతర్జాతీయంగా వెనకేసుకొచ్చే బాధ్యత బ్రిటన్ నుండి అమెరికాకు సంక్రమించింది. రెండవ ప్రపంచ యుద్ధంతో అస్తమించిన బ్రిటిష్ సామ్రాజ్యవాదం స్థానంలో ముందుకొచ్చిన అమెరికా సామ్రాజ్యవాదానికి బ్రిటన్‌కు ఏ వ్యూహాత్మక అవసరాలుండేవో అవే ఉన్నాయి. అదే కాకుండా, అమెరికాలోని కోటీశ్వరులలో 20 శాతం యూదులు కావడంతో జియోనిజాన్ని సమర్థించడం అమెరికాకు తప్పనిసరి కూడ అయింది.

## అరబ్ రాజ్యాలూ నష్టమే చేశాయి

అయితే పాలస్తీనియన్లకు ఇజ్రాయిల్, అమెరికాలు ప్రత్యక్ష శత్రువులయితే, ఇతర అరబ్బు రాజ్యాలు మిత్రరూపంలోని శత్రువులేమోనన్న అనుమానం వస్తుంది.

ఆయా దేశాల ప్రభుత్వాలకు ఇజ్రాయిల్ వ్యతిరేకత తమ దేశ ప్రజల దృష్టిలో 'లెజిటిమెసీ' సంపాదించుకోవడానికి పనికొచ్చినంతగా పాలస్తీనా పోరాటానికి పనికి రాలేదు. పైగా పాలస్తీనా ప్రజల ప్రతిఘటనకు నాయకత్వం వహిస్తున్న పాలస్తీనా విమోచన సంస్థ (PLO) దృక్పథంలో వున్న ఆధునికత, ప్రజాస్వామిక తత్వం వాళ్ళకు చుక్కెదురు. యూదు వ్యతిరేక మతతత్వానికి, ముస్లిం మతోన్మాదానికి ఎంతో ఆస్కారం వున్న పరిస్థితులలో కూడ PLO మతతత్వానికి లోబడకపోవడం ప్రజాస్వామికవాదుల దృష్టిలో ఎంత ప్రశంసనీయమో, ఆ వైఖరిలోని ఆధునికతకు భయపడే అరబ్ రాజ్యాల ప్రభువులకు అంత ఇబ్బందికరం.

కాబట్టే పాలస్తీనా అరబ్బులకు జోర్డాన్, సిరియా, ఈజిప్టులు చేసిన చేతల సహాయం మాటల సహాయాన్ని మించడం అటుంచి దాని దరిదాపులకు కూడ రాలేదు. ఈ వాస్తవాన్ని ఒక్కొక్క అరబ్బు రాజ్యం బయటపెట్టుకుంది. తమ దేశాన్ని PLO స్థావరంగా వాడుకోవడం ఇష్టంలేక జోర్డాన్ ప్రభుత్వం 1970లో PLOను హింసాత్మకంగా తన భూభాగం నుండి బయటకు తరిమింది. ఆనాడు ఎవ్వరూ కిక్కురుమనలేదు. ఈజిప్టయితే ఈ లంపటం తనకు వద్దని నిర్ణయించుకుని 1978లోనే ఇజ్రాయిల్‌తో ద్వైపాక్షిక సంధి చేసుకొని (Camp David accord) సినాయి ద్వీపకల్పాన్ని తిరిగి చేజిక్కించుకొని జియోనిస్టు వ్యతిరేకపోరాటం నుండి విరమించుకుంది. సిరియా ఎంత చేయగలదో ఈనాటి లెబనాన్ యుద్ధంలో బయటపడుతోంది. ఇజ్రాయిల్ దాడి నుండి లెబనాన్‌లో వున్న తన సేనలను రక్షించుకోవడానికి తప్ప PLOకు గాని, వాళ్ళ లెబనీస్ మిత్రులకు గాని ఎటువంటి రక్షణ ఇచ్చే ప్రయత్నమూ చేయడం లేదు సిరియా.

సౌదీ అరేబియా వంటి అనాగరిక రాజ్యాన్ని, ఇరాన్‌తో అనవసరమయిన యుద్ధంచేసి ఓడిపోయి బలహీనంగా పడున్న ఇరాక్‌ను, ఎక్కడో దూరానవున్న లిబియా అల్జీరియాలను లెక్కబెట్టకుంటే ఇక పాలస్తీనియన్లకు మిగిలిన మిత్రులు లెబనాన్‌లోని ముస్లిం అరబ్బులు మాత్రమే. అక్కడి క్రైస్తవులు ఎప్పుడూ ఇజ్రాయిల్ పక్షమే. ద్రవ్య పెట్టుబడికి (banking capital) ఒకనాడు కేంద్రంగా వుండిన లెబనాన్‌లో ధనికులు ఎక్కువగా క్రైస్తవులైతే పేదలు ఎక్కువగా ముస్లింలు. అయితే ఈ ముస్లిం అరబ్బులలో వామపక్షభావాలు బలంగా వున్నాయి. అయినా వాళ్ళ శక్తి, PLO సైన్యం శక్తీ కలిసి 20,000 సైనికులు మాత్రమే కాగా దాడిచేస్తున్న ఇజ్రాయిల్ సేనల సంఖ్య ఒక లక్ష వరకు వుంది. సోవియట్ రష్యా దూరం నుండి డాంబికాలు పలుకుతుంది గాని సాయం మాత్రం చేయదు. రష్యా సిరియాతో 1980లో చేసుకున్న ఒప్పందం ఒకటుంది

(భారత – రష్యా ఒప్పందం వంటిది). ఆ ఒప్పందం ప్రకారం సిరియాపై ఎవరయినా దాడిచేస్తే రష్యా సాయం చేయాలి. కాని సిరియా ఇజ్రాయిలీ సేనల చేతిలో ఇన్ని దెబ్బలు తింటున్నా సోవియట్ ప్రభువులు మాత్రం దిగిరాలేదు.

ఇవ్వాళ్టి ఇజ్రాయిల్ ఆశయం స్పష్టమే. లెబనాన్‌లో కూడ PLO కు ఆశ్రయం లేకుండ చేస్తే ఇక పాలస్తీనా విమోచన ఉద్యమం నశించిపోతుందని వాళ్ళ నమ్మకం. పనిలో పనిగా ఒక పరిశీలకుడు అన్నట్టు – లెబనాన్ దక్షిణ ప్రాంతాన్ని లిటానీ నది వరకు ఆక్రమించేస్తే ఎడారిమయమయిన ఇజ్రాయిల్‌కు లిటానీ నది నీరు దొరికినా దొరికినట్టే. ప్రస్తుతానికి ఇజ్రాయిల్ PLO ను లెబనాన్ నుండి తరిమేస్తుందన్నది ఖాయమే. కాని జియొనిజం తాలూకు దీర్ఘకాలిక లక్ష్యమయిన పాలస్తీనా విమోచన ఉద్యమ అస్తమయం ఆసన్నమయిందనుకుంటే పొరబాటే. కావాలంటే వారు అనుభవజ్ఞులయిన తమ అమెరికా ప్రభువులనడిగి ఆ విషయం తెలుసుకోవచ్చు.

*సృజన మాసపత్రిక*

*ఆగస్టు 1982*

## పాలస్తీనా ప్రజా పోరాటం – కొన్ని సమస్యలు

అయ్యా... శ్రీ బాలగోపాల్ పాలస్తీనా ప్రజాపోరాటంపై రాసిన వ్యాసం అనేక వివరాలతో పాఠకుడ్ని ముంచెత్తుతుంది. అలాగే పాలస్తీనా ప్రజల కడగళ్ళను, ఇజ్రాయిల్ దురాక్రమణతత్వాన్ని చక్కగా చిత్రించి పాఠకుల్లో పాలస్తీనా ప్రవాసుల పట్ల సానుభూతి రేకెత్తిస్తుంది. అయితే అందులో కొన్ని ముఖ్యమైన లోపాలు వున్నాయి. బహుశా అవి బాలగోపాల్‌గారు ఉద్దేశ్యపూర్వకంగా చేసినవే అనిపిస్తుంది కూడ.

మొదటిది : ఇజ్రాయిల్ రాజ్యం ఏర్పడేంతవరకు సాగిన చరిత్రను చిత్రీకరించడంలో అరబ్బులదే అంతా కరెక్టు, యూదులది అంతా తప్పేనన్నట్లు వర్ణించారు. ఇది సమంజసం కాదు. తమ సంఖ్యాబలం చూసుకుని విర్రవీగుతూ ప్రపంచ ప్రజల అభిమతాన్ని (యూదులకు ఒక నివాస భూమి కల్పించాలనే) కాలరాసి, అప్పుడే ఏర్పడిన ఇజ్రాయిల్‌పై యుద్ధం ప్రకటించడం ద్వారా అరబ్బులే తమ వినాశాన్ని తామే కొనితెచ్చుకున్నారు.

రెండు : ఐక్యరాజ్యసమితిలో ఇజ్రాయిల్‌ను ఏర్పరచాలని, అందుకు పాలస్తీనాను విభజించాలనే తీర్మానాన్ని అమెరికాయేగాక అప్పటి స్టాలిన్ నాయకత్వంలోని రష్యా

కూడ బలపరచింది. ఆ తర్వాత స్టాలిన్ నాయకత్వంలోను, స్టాలిన్ అనంతర కాలంలోను కూడ రష్యా ఇజ్రాయిల్‌తో బహుకాలం దౌత్యసంబంధాలు పెట్టుకున్నది. అంటే ఇజ్రాయిల్ అస్తిత్వాన్ని గుర్తించిందన్నమాట. తన దృష్టిలో స్టాలిన్‌కు ఎలాంటి మచ్చ రాకూడదనుకున్నాడేమో బాలగోపాల్ ఈ అంశాన్ని దాటవేసారు.

మూడు : 1948 తర్వాత పాలస్తీనాలోని అనేక ప్రాంతాలు అరబ్బు రాజ్యాల (జోర్డాన్, సిరియా, ఈజిప్టు) చేతుల్లో వున్నా అవి ఎన్నడూ ఆ ప్రాంతాల్లోనైనా పాలస్తీనా ప్రజలకు ఒక రాజ్యం ఏర్పరచాలని ప్రయత్నించలేదు.

నాలుగు : ఇజ్రాయిల్ తరఫున యూదు మతోన్మాదం ఎలా వున్నదో, అరబ్బుల తరఫున (పాలస్తీనా ప్రగతివాదుల్ని మినహాయిస్తే) ముస్లిం మతోన్మాదం కూడ అంతకు తక్కువేమీ లేదు.

ఐదు : పాలస్తీనాలో వివిధ గెరిల్లా సంస్థల పుట్టుక, చరిత్రల గురించి వివరంగా చర్చించనేలేదు. (అయితే ఇది బాలగోపాల్ గారి ఉద్దేశ్యపూర్వక లోపం కాదు.)

ఆరు : అరబ్బు ప్రజలకు, పాలస్తీనా ప్రజలకు సోవియట్ యూనియన్ చేసిన, చేస్తున్న సహాయం నాటికీ, నేటికీ ఎంతో ఘనమైనదే. అందులో రష్యా భౌగోళిక ప్రయోజనాలు ఇమిడివుండవచ్చుగాక. (ఏ దేశం పూర్తిగా నిస్వార్థసహాయం చేస్తున్నది?) అయినా – నిజమైన సానుభూతి, సంవేదనలు కూడ యిమిడివున్నాయి. ఇప్పటి సంక్షోభంలో 'రష్యా డాంబికాలు పలుకుతున్నదేగాని ఏమీ చేయడం లేదు' అని వ్యాఖ్యానించడం రాజకీయ, భౌగోళిక వాస్తవాలతో నిమిత్తం లేకుండా కేవలం పెటీ బూర్జువా ఆవేశంతో నోరుజారడమే. సోవియట్ – సిరియాలకు సంధి వున్నది నిజమే. కాని సిరియావాళ్ళు అర్థించకుండా సోవియట్ ఎలా ప్రత్యక్ష సహాయం చేయగలదు? పైగా సిరియావాళ్ళు లోలోన (పాలస్తీనా గెరిల్లాలు నాశనమవుతుంటే) సంతోషిస్తున్నారాయె! వాళ్ళెందుకు ఇజ్రాయిల్‌తో యుద్ధం చేయబూనుకుంటారు? లెబనాన్‌లో సిరియా సేనలు యుద్ధం చేసాయంటే కేవలం ఆత్మరక్షణ పరిధి వరకే, అదీ మెలకువగా సురక్షిత స్థానాలకు జారుకున్నారు కూడ. మన ఇండియావాళ్ళు PLO కు వైద్యసహాయం మందులూగట్రా పంపితే అవన్నీ బీరుట్‌కు పంపకుండా సిరియా ప్రభుత్వం ద్వేషంతో ఆపివేసిందని మీకు తెలుసా? అలాగే రష్యా సహాయానికి, బ్రెజ్నెవ్ సంఘీభావానికి ధన్యవాదాలు తెలుపుతూ అరాఫత్ చేసిన ప్రకటన గమనించారా?

ఏడు : ప్రపంచ విప్లవ కేంద్రం చైనా మాటేమిటి? ఎక్కడా ఎవరినీ పల్లెత్తు మాట అన్నట్లు కనిపించదేం? రష్యాపై విరుచుకుపడ్డ ఆగ్రహం, చైనా విషయంలో జావకారిపోయిందేం?

ఎనిమిది : అమెరికా హేయమైన పాత్ర గురించి, అరబ్బు దేశాలు అమెరికాతో కుమ్మక్కైన తీరు గురించి ఇంకా బాగా వివరించాల్సింది.

సరే ఇక పరిష్కారం సంగతి ఆలోచిద్దాం. ఇజ్రాయిల్ తన 'భద్రమైన సరిహద్దులకు' వెనక్కు మళ్ళాలని, ఆ 'భద్రమైన సరిహద్దు' లేవో స్పష్టంగా నిర్వచించాలనేది ఒకవైపు ఉంటే, మరోవైపున పాలస్తీనా అరబ్బులు కూడ ఇజ్రాయిల్ అస్తిత్వాన్ని గుర్తించాలి. తమకు ముఖ్య శత్రువు ఇంటిలోనే (అరబ్బు అభివృద్ధి నిరోధకుల్లో) వున్నాడని పాలస్తీనా ప్రజలు గ్రహించాలి (బహుశా ఈపాటికి గ్రహించే వుంటారు). యూదు దురహంకారుల పట్ల ధర్మయుద్ధం కొనసాగిస్తూనే, వివిధ అరబ్బు దేశాల్లో నియంతృత్వాలను, రాచరికాలను కూలద్రోయడానికి వారూ, అరబ్బు సామాన్య ప్రజలూ ప్రయత్నించాలి. ఆ ప్రయత్నాలకు ప్రపంచవ్యాప్తంగా ప్రగతివాదులంతా మద్దతునివ్వాలి. మనం (ఇండియా) కూడ ఇజ్రాయిల్‌తో దౌత్యసంబంధాలు నెలకొల్పుకొని ఒకవైపున పాలస్తీనా ప్రజాపోరాటాన్ని సమర్థిస్తూనే, మరోవైపున ఇజ్రాయిల్‌పై దౌత్యపరంగా ప్రభావం కలగజేసేందుకు ప్రయత్నించాలి. లేదా కనీసం దౌత్యపరంగా తొలి సంబంధాలైనా ప్రారంభించాలి. పాలస్తీనా ప్రజలకు ఒక రాజ్యం ఏర్పడాలనేది మాత్రం నిర్వివాదమే. అయితే ఇది ఇజ్రాయిల్ అస్తిత్వాన్ని నిరాకరించడం ద్వారా మాత్రం సాధ్యం కాదు; సవ్యమూ కాదు.

**– మల్లిక్ బాబు**

**జవాబు :**

మల్లిక్ బాబు ప్రస్తావించిన ఎనిమిది పాయింట్లలో నాకు సమాధానం చెప్పవలసిన అవసరమున్నట్టు తోచిన వాటికి సమాధానం చెప్తాను.

1. ఇది చాలా అన్యాయమయిన ఆరోపణ. తమ కంటే ధనవంతులు, బలవంతులు తమ దేశాన్ని దౌర్జన్యంగా ఆక్రమించుకొని, తమ భూముల్ని కొనుక్కొని, తమ భూముల నుండి తమను గెంటేసి, జాతి దురహంకారాన్ని ప్రాతిపదికగా గల

పరాయి రాజ్యాన్ని తమ దేశంలో ఏర్పరుచుకుంటే తాము తిరగబడడం 'విద్రవీగుడు' అయితే ఈ ప్రపంచ చరిత్రలో న్యాయమయిన పోరాటాలు ఏవయినా ఉన్నాయా?

2. ఇజ్రాయిల్ ఏర్పాటును స్టాలిన్ సమర్థించిన మాట వాస్తవమే. ఒక్క స్టాలినే కాదు, యూరప్‌లోని అభ్యుదయశక్తులన్నీ గూడ సమర్థించాయి. దీని వెనకున్న వాస్తవాన్ని గుర్తుంచుకుంటే ఆ సమర్థన ఆశ్చర్యం కలిగించదు. యూరప్‌లో చాలా బలంగావున్న యూదు వ్యతిరేకతను ఎదుర్కొని దాని మీద పోరాటం జరిపినది అక్కడి కమ్యూనిస్టులు, ఇతర సోషలిస్టులు. యూదు వ్యతిరేకతను సిద్ధాంతంగా గల నాజీజాన్ని చివరికంటూ రాజీలేకుండా వ్యతిరేకించి పోరాడిందీ వీళ్ళే. ఇవ్వాళ ఫ్రాన్సులోను, ఇటలీలోను కమ్యూనిస్టు పార్టీలకు పార్లమెంటరీ రంగంలో కొంత బలముందంటే దానికి కారణం ఆనాడు నాజీజానికి, ఫాసిజానికి (వాటితోబాటు యూదువ్యతిరేకతకూ) వ్యతిరేకంగా ఆయా దేశాల్లో జరిగిన ప్రతిఘటన (resistance) పోరాటాలలో కమ్యూనిస్టులు ముందుండడమే. కాబట్టే, యూదువ్యతిరేక నాజీ ఉన్మాదానికి తట్టుకోలేక యూదులు యూరప్ వదలి పాలస్తీనా పారిపోవడాన్ని ఈ అభ్యుదయ శక్తులన్నీ సమర్థించాయి. ఆనాడు స్పష్టంగా వీళ్ళకు అర్థంగాని విషయమేమిటంటే, యూదులకు అన్యాయం జరిగింది యూరప్‌లో కాగా దానికి పాలస్తీనా అరబ్బులు పరిహారం చెల్లించాల్సి రావడం. రెండవది, జియొనిజం ఆనాటికే సామ్రాజ్యవాదపు ఏజెంటు కావడం. ఈ విషయాలను స్పష్టంగా గుర్తించిన నాటి నుండి అభ్యుదయశక్తులన్నీ జియొనిజాన్ని వ్యతిరేకిస్తూ వచ్చాయి.

3. సిరియా, ఈజిప్టుల చేతిలో పాలస్తీనాలోని ముఖ్య ప్రాంతాలు ఎన్నడూ లేవు. (అసలు ఏ ప్రాంతాలయినా వున్నాయా అని నాకు అనుమానం.) జోర్డాన్ చేతిలో మాత్రం కొంతకాలం జోర్డాన్ నదీ పశ్చిమతీరం (పత్రికలలో West Bank అనే పేరుతో వ్యవహరించబడేది) వుండేది. దాన్ని గూడ కొద్ది కొద్దిగా ఇజ్రాయిల్ ఆక్రమిస్తూ వస్తోంది. ఆ ఆక్రమణల పెరుగుదల ఇప్పటి యుద్ధపు ముఖ్య పర్యవసానాలలో ఒకటి. అయినా West Bank లో పాలస్తీనా ప్రజలకు నివాసం ఏర్పరచడాన్ని జోర్డాన్ కంటే పాలస్తీనా ప్రజలే ఎక్కువగా తిరస్కరిస్తున్నారు. ఈ మధ్యకాలంలో ఆ వైఖరి మారే సూచనలు కనిపిస్తున్నాయి. వాళ్ళు ఒప్పుకుంటే జోర్డాన్ చేత అమెరికా బలవంతంగా ఒప్పిస్తుందనడంలో సందేహం లేదు. ఎందుకంటే ఆ పరిష్కారం ఇజ్రాయిల్‌కు కావలసిన 'భద్రత'నిస్తుంది.

6. సోవియట్ రష్యా పాలస్తీనా ప్రజలకు చేసిన సాయం ఎంత ఘనమయినదో మల్లిక్ బాబు వివరించి వుంటే బాగుండేది. ఘనమయినది కాదనడం 'రాజకీయ, భౌగోళిక వాస్తవాలతో' నిమిత్తం లేకుండ అవేశపడడం అన్నారు. బూర్జువా పత్రికా పరిభాషలో 'రాజకీయ భౌగోళిక వాస్తవాలు' అన్నది జాతీయ స్వార్థానికి పర్యాయ పదం. ఆ అర్థమే మల్లిక్ బాబు ఉద్దేశ్యమయితే నాకు అభ్యంతరం లేదు. నేను చెప్పదలచుకున్నదీ అదే. సోవియట్ – సిరియా ఒప్పందం ఉన్నది నిజమేగాని 'సిరియా అర్థించకుండా సోవియట్ రష్యా ఎట్లా ప్రత్యక్ష సహాయం చేయగలదు?' అని ప్రశ్నించడానికి అపారమయిన అమాయకత్వం కావాలి. జకొస్లోవేకియా (1968) నుండి ఆఫ్ఘనిస్తాన్ (1980) వరకు ఒకళ్ళు అర్థిస్తేనే 'ప్రత్యక్ష సహాయం' చేసిందా సోవియట్ రష్యా?

7. చైనా 'ప్రపంచ విప్లవ కేంద్రం' అవునా కాదా అన్న చర్చ ఇక్కడ అప్రస్తుతం. అయినా కాకున్నా చైనా ఒకళ్ళకు చేయగల సాయం తక్కువ. చైనా, రష్యాలాగా ప్రపంచ అగ్రరాజ్యాలలో ఒకటి కాదు. పేద దేశాలలో ఒకటి. ఐక్యరాజ్యసమితిలో చేయగల మాట సహాయం చేస్తూనే వుంది.

మిగిలింది పరిష్కారం. అందులో ఒక అవగాహన, రెండు సలహాలు వున్నాయి. పాలస్తీనా ప్రజల ప్రధాన శత్రువు ఇంటనే వున్నాడని నేననుకోవడం లేదు. వాళ్ళ ప్రధాన శత్రువు జియోనిజమే అనుకుంటున్నాను. రెండు సలహాలలో ఒకటి పాలస్తీనా ప్రజలకు, రెండవది భారత్ సర్కార్‌కు ఇచ్చారు. ఐక్యరాజ్యసమితి కాగితపు పరిష్కారాలనే ఎవ్వరూ గౌరవించడం లేదు. ఇక నేనూ, మల్లిక్ బాబూ ఒప్పుకున్నా ఈ పరిష్కారానికి అంతకంటే విలువ ఉంటుందని నేననుకోవడం లేదు. ఆ గొడవేదో పాలస్తీనా ప్రజలకే వదిలేయవచ్చుననుకుంటాను.

**–కె. బాలగోపాల్**

*సృజన మాసపత్రిక*

*నవంబరు–డిసెంబరు 1982*




ఇజ్రాయిల్

# ఇజ్రాయిల్‌తో మన పాలకుల స్నేహ రహస్యం

**మ**న సంఘ్‌పరివార్ పాలకులు మనం సిగ్గుపడే పనులు చాలా చేసారుగానీ ఇజ్రాయిల్ ప్రధానమంత్రిని దేశానికి సాదరంగా ఆహ్వానించడం, ఆ దేశంతో కలిసి టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడుతామని తీర్మానించడం వాటన్నిట్లోకి అత్యంత జుగుప్సాకరమైన చర్యలు.

'ముస్లిం తీవ్రవాదుల' వల్ల సమస్యలు ఎదుర్కుంటున్న దేశాలన్నీ ఒకటి కావాలన్న ప్రతిపాదన సంఘ్‌పరివార్ ప్రచురణలలో చాలా కాలంగా కనిపిస్తూనే ఉంది. అదిప్పుడు దేశ విధానం అయినట్టుంది.

టెర్రరిజం అనే మాటను నిర్వచించడం కష్టమని ఇప్పుడందరూ గుర్తిస్తున్నారు. అయితే ఒకటి మాత్రం సత్యం. దానికి ఏ నిర్వచనం ఇచ్చినా, ఇజ్రాయిల్ పాలకులు మాత్రం టెర్రరిస్టుల మొదటి వరుసలో ఉంటారు. వారితో కలిసి భారత్ ఏ 'టెర్రరిజం' మీద పోరాటం చేస్తుంది?

అందులోనూ ప్రస్తుత ఇజ్రాయిల్ ప్రధాని షారన్‌ది మరీ హేయమైన చరిత్ర. వేరే చోట్ల 'టెర్రరిజం' ఎవరు మొదలుపెట్టారన్న విషయంలో అభిప్రాయ భేదాలకు తావు ఉండవచ్చు గాని ఇజ్రాయిల్ – పాలస్తీనా ఘర్షణలో నిరాయుధులయిన ప్రజలపైన

సాయుధ దాడులు మొదలుపెట్టింది ఇజ్రాయిలేననేది నిర్వివాదమయిన సత్యం. ఆ 'దేశం' పుట్టీపుట్టక ముందే 1946 జూలై 22న జెరూసలెంలోని కింగ్ డేవిడ్ హోటల్‌ను ఇజ్రాయిలీలు బాంబు పెట్టి పేల్చివేసి 91 మందిని చంపారు. ఆ తరువాత కొద్ది నెలలకే దీయర్ యాసిన్ అనే చోట 245 మంది సాధారణ అరబ్బు పౌరులను చంపారు. 'అదే జరగకపోతే అసలు ఇజ్రాయిల్ నెలకొనేదే కాదు' అని ఆ మారణకాండకు బాధ్యుడయిన మెనాచిం బెగిన్ దానిని సమర్థించుకున్నాడు. ఈయన తరువాత కాలంలో ఆ దేశానికి ప్రధాని అయ్యాడు.

షారన్ కూడ ఆ రూట్‌లో ప్రధాని అయిన వాడే. 1970కి కొంచెం ఇటో అటో ఒక దుర్దినాన షారన్ స్వయంగా నాయకత్వం వహించిన కమాండోలు కిబ్లియా అనే పాలస్తీనా అరబ్బు గ్రామంపై దాడిచేసి 69 మంది నిరాయుధులను హతమార్చారు. ఆ తరువాత కాలంలో గాజా నుండి పాలస్తీనా శరణార్థుల ఆవాసాల దాకా ఎక్కడెక్కడి నుండి పాలస్తీనా అరబ్బులను తరమి వేయడం ఇజ్రాయిల్‌కు అవసరం అయ్యిందో అక్కడంతా క్రూరమైన బలప్రయోగానికి పాల్పడిన ఘనచరిత్ర షారన్‌కు ఉంది. ఆ క్రమంలో అతను కూడ ఇజ్రాయిల్ ప్రభుత్వాధినేత అయ్యాడు. అన్ని సమాజాల లాగ ఇజ్రాయిల్‌లోనూ న్యాయాన్యాయ విచక్షణ గలవారు లేకపోలేదు గానీ ఉన్మత్త జాతీయవాదులు మాత్రమే ఆ దేశంలో అధికారానికి రాగలుగుతున్నారు, వచ్చి మనగలుగుతున్నారు.

అరాఫత్ పాపం తప్పనిసరయి వారితోనే సంధి ప్రయత్నాలకు పూనుకున్నాడు. నిత్య సాయుధ పోరాటాన్ని కవులు మాత్రమే హర్షిస్తారు. అది ఎటూ తేలనప్పుడు తమ కోరికలు కొంచెం తగ్గించుకునయినా సరే రాజకీయ ఒప్పందానికి సిద్ధపడడం ప్రజలకే మేలని వచనంలో ఆలోచించే వాళ్ళెవరయినా గుర్తిస్తారు. ఆ నిర్ణయం తీసుకున్నందుకు అరాఫత్‌ను పాలస్తీనాలోని మిలిటెంట్ సంస్థలు ద్రోహి అని నిందించగా, అతను ఆ మిలిటెంట్ సంస్థల ముసుగు మాత్రమేనని అతనిపైన నిందమోపి అతనికి ఉనికే లేకుండా చేయడం, రాజకీయ పరిష్కారాన్ని అసాధ్యం చేయడం ఇజ్రాయిల్ వంతయింది. తీవ్రవాదులెప్పుడూ వారి వైరి వర్గంలో తీవ్రవాదులు మాత్రమే మిగలాలని కోరుకుంటారు. లేకపోతే తమ తీవ్రవాదాన్ని సమర్థించుకోవడం కష్టం.

రెండు సంవత్సరాలుగా ఇజ్రాయిల్ అరాఫత్‌పైన భౌతిక దాడులకు పూనుకుంది. అరాఫత్‌కు నామమాత్రపు పాలనాధికారం ఉన్న రమల్లా ప్రాంతంలోనే అతనికి గృహ నిర్బంధం విధించింది. పాలస్తీనాలోని మిలిటెంట్ గ్రూపుల ఉనికికి అతనే కారణమనీ, వారి చర్యలకు అతనినే బాధ్యుడిని చేస్తాననీ ప్రకటించింది. ఇండియా నుండి షారన్ వెనక్కి పోగానే అరాఫత్‌ను చంపడం కూడ అజెండాలో భాగమేనని షారన్ ప్రభుత్వం ప్రకటించింది. అరాఫత్‌ను చంపినా హమస్ గానీ, హిజ్బుల్లా గానీ, ఇతర పాలస్తీనా మిలిటెంట్ సంస్థలు గానీ ఎక్కడికీ పోవని, వాటి ఉనికికేమీ కాదని ఇజ్రాయిల్‌కు తెలుసు. అయితే అతనిని తొలగించి వేస్తే ఏం జరుగుతుందంటే రాజకీయ పరిష్కారానికి సిద్ధమయిన వ్యక్తి, పాలస్తీనా పోరాటపు సెక్యులర్ స్వభావానికి ప్రతీక అయిన వ్యక్తి పోతాడు. రాజకీయ పరిష్కారానికి సిద్ధంగా లేని మతవాదులు మాత్రమే మిగులుతారు. అంటే పాలస్తీనా పోరాటంలో ఇజ్రాయిల్ తన ముఖాన్నే చూసుకోగలుగు తుంది. అప్పుడిక ప్రపంచానికి ఏ సంజాయిషీ ఇచ్చుకోనక్కర లేకుండ అరబ్బుల జాతి హననాన్ని కొనసాగించవచ్చు.

షారన్ సంఘ్‌పరివార్‌కు పశ్చిమాసియా నరేంద్రమోడిగా కనిపించి ఉండడంలో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. అతనిని ఈ పుణ్యభూమికి పిలిచి కావలించుకోవాలని వాజ్‌పేయిలు, అద్వానీలు ఉవ్విళ్ళూరడంలోనూ ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. ఆ పనిని ఆర్‌ఎస్‌ఎస్ పేరు మీదనో విశ్వహిందూ పరిషత్ పేరు మీదనో చేసుకుంటే 'ఒక గూటి పక్షులు' అనుకుని ఉందుము. కాని భారత ప్రభుత్వ కార్యక్రమంగా చేపట్టడం ఏమిటి?

ఇస్లాం పేరు మీద మతిలేని హింసకు పాల్పడుతున్న వారిప్పుడు చాలామంది ఉన్నారు. వారు పాలస్తీనాలోనూ కశ్మీర్‌లోనూ చెచెన్యాలోనూ కూడ కనిపిస్తారు. అందువల్ల 'ముస్లిం తీవ్రవాదానికి' గురవుతున్న బాధిత అమాయక రాజ్యాలుగా నటించే అవకాశం ఆవగింజంత ఇండియాకూ ఇజ్రాయిల్‌కూ అమెరికాకూ రష్యాకూ కూడ దొరికిందిప్పుడు.

కానీ తుపాకి చేతబట్టిన వారిలో మతవాదుల సంఖ్య సుమారుగా ఉండవచ్చునేమో గానీ ఈ సమస్యలేవీ మతవాదం నుండి పుట్టిన సమస్యలు కావు. పాలస్తీనా పోరాటం రేపు హిజ్బుల్లా చేతిలోకి పోతే పోవచ్చునేమో గానీ దాని ఊపిరి అరాఫత్ ప్రాతినిధ్యం

వహించిన సెక్యులర్ అరబ్బు జాతీయవాదమే. కశ్మీర్ కూడ అంతే. ఈ రోజు తుపాకుల హోరు మధ్య షేక్ అబ్దుల్లా గురించి తేలికగా మాట్లాడడం కశ్మీర్‌లో పరిపాటి అయింది గానీ సగటు కశ్మీరీల రాజకీయ ఆకాంక్షలు ఘాజీ బాబా కంటే షేక్ అబ్దుల్లాకు వెయ్యి రెట్లు దగ్గర. అబ్దుల్లా అరాఫత్‌లాగే లౌకిక జాతీయవాది. చెచెన్యా గురించి మనకు ఎక్కువ విషయాలు తెలియవుగానీ చెచెన్యా ఉద్యమకారులు చేస్తున్న మిలిటెంట్ చర్యలలో స్త్రీలు పెద్ద సంఖ్యలో పాల్గొంటుండడం ఒక కచ్చితమైన సూచిక. మతవాదులు ఆచరించే సనాతన ఇస్లాం స్త్రీలకు ఆ చొరవ ఇవ్వదు. చివరికి ఇరాక్ మాజీ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ కూడ నియంత అయి ఉండవచ్చును గానీ పూర్తిగా సెక్యులర్ నియంత. ఇప్పుడతని ప్రభుత్వాన్ని అమెరికా దుర్మార్గంగా తొలగించినందుకు నిరసనగా ఆ దేశంలో తలెత్తుతున్న తిరుగుబాటులో మతవాదులచే పైచేయి అయితే కావచ్చును గాక.

ఒక్క మాటలో చెప్పాలంటే 'ముస్లిం తీవ్రవాదానికి' గురి అవుతున్న ఈ దేశాలన్నిటిదీ స్వయంకృతాపరాధం. ఈ దేశాలు తమ మూర్ఖత్వం వల్ల మతప్రమేయం లేని సమస్యలను మత సమస్యలుగా, మతవాద సమస్యలుగా వ్యక్తీకరించే పరిస్థితిని కల్పించాయి. ఆ మార్పు తమ ప్రయోజనాలకు కూడ అనుగుణ్యమైనదే కాబట్టి దానిని ఆ దేశాలు సంతోషంగా ఆహ్వానిస్తున్నాయి. దానినొక సాకు చేసుకొని మరింత దౌర్జన్యం చేస్తున్నాయి. షారన్‌కు మన సంఘ్‌పరివార్ పాలకులిచ్చిన ఆహ్వానం భావం ఇదే తప్ప వేరే ఏమీ లేదు.

*ప్రజాతంత్ర వారపత్రిక*

*6 అక్టోబర్ 2003*

# ఎవరి పాపానికి పరిహారం ఎవరు చెల్లిస్తున్నారు?

లెబనాన్‌పైన ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని యావత్ ప్రపంచం ఖండిస్తున్నది గాని అంతకంటే ఏం చేయలేకున్నది. ప్రపంచం ఇంత నిస్సహాయంగా తయారవుతుందని ఇరవైయేళ్ళ కింద సహితం ఎవ్వరూ ఊహించి ఉండరు. నిజానికి ఇరవయ్యవ శతాబ్దపు రాజకీయ విశ్లేషకులందరూ ప్రపంచ గమనాన్ని వేరేరకంగా ఊహించారు. ఎన్ని ఒడిదుడుకులున్నా మొత్తం మీద దేశీయ, అంతర్జాతీయ రంగాలలో చట్టబద్ధత, జవాబుదారీతనం, ప్రజాస్వామ్యం పెరుగుతున్న దిశగా ప్రపంచం పురోగమిస్తున్నదనీ, ఇది తిరుగులేని గమనమనీ దాదాపు అందరూ భావించారు. సోవియట్ రష్యా పతనమయిన నాడు కమ్యూనిస్టు వ్యతిరేకులు కానివారు సహితం ఒకందుకు సంతోషించారు. ఆఖరి కరుడుగట్టిన నియంతృత్వాలు సహితం ప్రజాస్వామ్యానికి వేదికను అప్పగించి నిష్క్రమిస్తున్నాయని భావించారు.

అయితే అంతర్జాతీయ వేదిక మీద అది ఏకపక్ష నియంతృత్వానికి దారి తీస్తుందని ఆనాడు ఎవ్వరూ ఊహించలేదు. అటువంటి రోజులు గతించి పోయాయనీ మానవ నాగరికత కొన్ని అనుల్లంఘనీయమైన ప్రమాణాలను సాధించిందనీ నమ్మారు. అది వట్టి భ్రమ అని తేలడానికి పది సంవత్సరాలు పట్టలేదు.

సోవియట్ సమాజం ఎంత అనాకర్షణీయమైన వ్యవస్థ అయినా అది ఉండబట్టే అంతర్జాతీయ రాజకీయాలలో అమెరికా సామ్రాజ్యదాహం కొంత మేరకు అదుపులో ఉండిందని ఇప్పుడు స్పష్టంగా అర్థం అవుతున్నది. అమెరికా, రష్యా కూటముల మధ్య 50 ఏళ్ళపాటు ఉండిన సమతుల్యం అసమతుల్యమే అయినా, అణు యుద్ధం అంచున ఉన్న శాంతే అయినా, చిన్నాచితక దేశాలను పెద్దవారి ప్రయోజనాల కోసం కొట్లాడించిన ప్రచ్ఛన్న యుద్ధమే అయినా ఐక్యరాజ్యసమితి రూపంలో మానవ నాగరికత

సాధించినట్లు కనిపించిన ప్రౌఢత్వానికి మూలం అదేనని ఇప్పుడు అర్థం అవుతున్నది. ఎప్పటికప్పుడు మనం 'అధికుల'మని పిలుచుకునే లక్షణాలను అధిగమించేస్తున్నామని నమ్మాలన్న అహంభావపూరితమైన ఆరాటం చాలా విజ్ఞులుగా కనిపించే విశ్లేషకుల కళ్ళకు సహితం పొరలు కప్పకుండా ఉంటే ఈ సత్యాన్ని అంతకు ముందే గ్రహించి ఉండుమేమో. మానవులు ఏవో ప్రత్యేకమైన పరిస్థితులలో తప్ప 'అమానవీయం' అని పిలుచుకునే గుణాలను అధిగమించి బతకలేదనేది గత చరిత్రకు మాత్రమే సంబంధించిన వాస్తవం కాదనీ, వర్తమాన సత్యం కూడాననీ, బహుశ మనిషికి సంబంధించిన సార్వజనీన సత్యమనీ గ్రహించి ఉండుమేమో కూడ. పైగా ఆ 'ప్రత్యేక పరిస్థితులు' ఏమంత అందమైనవి కూడ కానక్కరలేదు. ప్రచ్ఛన్న యుద్ధం ఎంత సుందరమైనదని?

ఇజ్రాయిల్ విషయానికొస్తే జార్జి బుష్ ఇరాక్ సందర్భంలో ప్రకటించిన 'ముందస్తు దాడి' సిద్ధాంతాన్ని ఎప్పటి నుండో ఆచరిస్తున్న రాజ్యం అది. ఒకరు మన మీద దాడి చేయడానికి సిద్ధమయ్యేదాకా ఆగనక్కరలేదు, ముందే దాడి చేసి సిద్ధం కాకుండా చేసేయడమూ ఆత్మరక్షణ కిందికే వస్తుందన్నది జార్జి బుష్ ప్రేలాపన. వారు పరిపాలిస్తున్న అమెరికా సమాజానికి వర్తించే నేరస్మృతి ఆత్మరక్షణకు ఈ నిర్వచనాన్ని అంగీకరించదు. ఏ నాగరిక నేరస్మృతీ అంగీకరించదు. అయితే శాసించే వారెవరూ లేని అంతర్జాతీయ సమాజానికి దీనిని జార్జి బుష్ వర్తింపజేయగలిగాడంటే అతని సైన్యానికి ప్రస్తుతం ఎదురు లేకపోడం తప్ప వేరే కారణమేదీ లేదు.

ఇజ్రాయిల్ ఈ విషయంలో రెండాకులు ఎక్కువే చదివింది. తన సరిహద్దు భద్రత కోసం పొరుగు దేశాలలోని కొంత భూభాగాన్ని ఆక్రమించుకొని తన అదుపులో పెట్టుకునే హక్కు తనకుందని 1967 యుద్ధమప్పుడే ఇజ్రాయిల్ ప్రకటించింది. ఆక్రమించుకున్న పాలస్తీనా భూభాగం నుండి వైదొలగమని ఆదేశించిన ఐక్యరాజ్య సమితి తీర్మానాన్ని ఆనాడే చెత్త కాగితంగా భావించింది. ఇప్పుడు లెబనాన్‌లో అదే సూత్రాన్ని అమలు చేస్తున్నది. ఈ విషయంలో రహస్యంగానీ దాపరికంగానీ ఏమీ లేదు. లెబనాన్ భూభాగాన్ని తన సరిహద్దు నుండి 18 కి.మీల వరకు తన అదుపులోకి తెచ్చుకోవడం తన లక్ష్యం అని ప్రకటించి బాంబుల వర్షం కురిపిస్తున్నది ఇజ్రాయిల్. ఆ లక్ష్యం ఒనగూడేదాక చిన్నపిల్లలు చచ్చినా, నివాసాలు నేలమట్టమయినా తొందరపడి కాల్పుల విరమణ ప్రస్తావన తేవద్దని అమెరికా ప్రతినిధి మేడం రైస్ గమ్యమెరిగి హెచ్చరిస్తున్నది.

ఇజ్రాయిల్, అమెరికాలు ముస్లిం మతవాదం మీద పోరాటం చేస్తున్నామని ప్రకటించుకోవడాన్ని ప్రపంచం చాలా సులభంగా దిగమింగింది గానీ, కొంచెం తరచి చూస్తే నిజం అందుకు విరుద్ధంగా కనిపిస్తుంది. సద్దాం హుస్సేన్ ఎంత క్రూరుడైనా మతవాది ఎన్నడూ కాదు. అతను లౌకికవాది, ఆధునిక వాది (ఇవి రెండూ క్రూరంగానూ ఉండగలవు కాబట్టి ఇందులో అసంబద్ధత ఏమీ లేదు). ఇరాన్‌ను పరిపాలిస్తున్నది మతవాదులే అయినప్పటికీ ఇరానీ సమాజంలో లౌకిక విలువలు బలంగా ఉన్నాయి. ఈ విషయంలో ఇరాన్‌కు ఆఫ్ఘనిస్తాన్, సౌదీ అరేబియాల కంటే బంగ్లాదేశ్, ఇండోనేషియాలతోనే పోలిక. ఇక లెబనాన్ మాటకొస్తే అది ముస్లింలూ క్రైస్తవులూ శాంతియుతంగా సహజీవనం చేస్తున్న లౌకికరాజ్యం, లౌకిక సమాజం. అటువైపు ఇజ్రాయిల్ నిస్సందేహంగా యూదు మత రాజ్యం. అమెరికా రాజ్యాంగం లౌకికమే అయినా దాని ప్రస్తుత పాలకులు క్రైస్తవ పునాదివాదులు. ఇది కేవలం బయటివారి నింద కాదు, అమెరికాలోనే వారిని ఆ విధంగా గుర్తిస్తున్నారు. ఆ పేరు పెట్టి పిలుస్తున్నారు.

యూదు మతవాదులూ  క్రైస్తవ పునాదివాదులూ కలిసి ముస్లిం మతవాదం నుండి ప్రపంచాన్ని కాపాడుతాం అని బయలుదేరడం చరిత్ర తెలిసిన వాళ్ళకు వింతగా తోచక మానదు. 50 ఏళ్ళ కిందటి వరకు యూదులను హింసించింది క్రైస్తవులే. హిట్లర్ పాలనలో నాజీలు యూదులను ఊచకోత కోసిన సంగతి చాలామందికి తెలుసు. అయితే అది అకస్మాత్తుగా జరిగింది కాదు. శతాబ్దాలుగా యూదులు క్రైస్తవ యూరప్‌లో అనుభవించిన హింసకూ వివక్షకూ అతి క్రూరమైన పరాకాష్ఠ. నాజీవాదం క్రూరత్వాన్ని యూరప్‌లోని నాగరిక వర్గాలన్నీ తీవ్రంగా నిరసించాయిగానీ అప్పటిదాకా అత్యంత నాగరికులయిన యూరోపియన్లలో సహితం యూదులంటే చులకన, వేళాకోళం, ఎంతో కొంత వ్యతిరేకత సర్వసాధారణంగా ఉండేవి. మధ్యయుగాలలోనయితే అన్ని యూరోపియన్ పట్టణాలలోనూ యూదులు తమ వాడలలో విడిగా నివసించేవారు. ఆ  వాడలు దాటి బయట ఉండడానికి వీలు లేదన్న ఆంక్షలుండేవి. పెట్టుబడిదారీ వ్యవస్థ, ప్రజాతంత్ర నియమాలు యూరప్‌లో పైచేయి సాధించిన క్రమంలో యూదుల వ్యాపార దక్షత వల్ల, ప్రజాతంత్ర విలువల వల్ల క్రమంగా ఈ వెలి నుండి వారు కొద్ది కొద్దిగా బయటపడగలిగారు కానీ సంపూర్ణంగా కాదు. ఎక్కడయినా ఎప్పుడయినా వారు గౌరవంగా బతికారంటే అది పశ్చిమాసియాలోని అరబ్బుల మధ్యనే. 15వ శతాబ్దపు చివరి సంవత్సరాలలో స్పెయిన్ దేశపు రాజు ఆ దేశంలోని యూదులకు

క్రైస్తవమైనా పుచ్చుకోండి, లేదా దేశం నుండి వెళ్ళిపోండి అని అల్టిమేటం జారీ చేసినప్పుడు మతం మార్చుకోవడానికి ఇష్టపడక దేశం విడిచి వెళ్ళిపోయిన లక్షా ముప్ఫై వేల మంది యూదులకు ఆశ్రయం దొరికింది. అప్పటికింకా ముస్లింలు ('మూర్'లు) పెద్ద సంఖ్యలో ఉన్న పోర్చుగల్‌లోను, పశ్చిమాసియాలోని బాగ్దాద్‌లోను.

యూదుల సంప్రదాయక విశ్వాసం ప్రకారం వారి ప్రవక్త రెండవసారి పశ్చిమాసియాలో అవతరించి యూదుల పవిత్ర భూమిలో వారి రాజ్యాన్ని పునఃస్థాపన చేస్తాడు. ఆ ఘటన జరిగినప్పుడు పక్కనే ఉండి చూడాలన్న కోరికతో శతాబ్దాలుగా యూదులు చిన్న చిన్న గుంపులుగా పాలస్తీనాకు వలసపోతూనే ఉన్నారు. స్థానిక అరబ్బులు వారినెప్పుడూ వ్యతిరేకించలేదు. వారి మతాన్ని స్వేచ్ఛగా ఆచరించుకోనిచ్చారు. 20వ శతాబ్దంలో, ముఖ్యంగా నాజీవాదుల ఘోరకాండ తరువాత, ఈ వలస ఒక వరద అయింది. పవిత్ర భూమికి తరలండి అంటూ వేలాదిగా యూదులు పాలస్తీనాకు వచ్చారు. సంప్రదాయక 'యూదు రాజ్యం' ఎట్లా ఉండేదో గానీ ఇక్కడ ఆధునిక సాయుధ రాజ్యాన్ని ప్రకటించుకున్నారు. అరబ్బులను వారి భూభాగంలోనే పరాయి వారిని చేశారు. అప్పటి నుంచి ఆ రాజ్యం తన భద్రత పేరిట చుట్టూ ఉన్న అరబ్బు ప్రాంతాల పైన దాడులు చేయడం, అరబ్బులు తమ భూభాగాన్ని తిరిగి పొందడం కోసం ఎదురు పోరాటం చేయడం పశ్చిమాసియాను రక్తసిక్తం చేసింది.

శతాబ్దాలుగా యూదులను హింసించి, కించపరచి, రెండవ శ్రేణి పౌరులుగా చూసి, పవిత్ర భూమికి తరలిపోవాలన్న కోరికకు ఆజ్యం పోసిన క్రైస్తవ సమాజాలన్నీ ఇప్పుడు ఆ పవిత్ర భూమిలో యూదు మతవాదం నెలకొల్పిన సాయుధ మత రాజ్యాన్ని నిస్సిగ్గుగా సమర్థిస్తూ, తమ జన్మభూమిలోనే పరాయివారయి పోయిన అరబ్బులను తీవ్రవాదులుగా చిత్రించసాగాయి. చరిత్రలో దీనితో పోల్చదగ్గ రెండు నాల్కల ధోరణి వేరే లేదేమో!

*ప్రజాతంత్ర వారపత్రిక*

*6 ఆగస్టు 2006*

## అమెరికా




# ఈ ప్రాకులాట అవమానకరం

**బి**ల్ క్లింటన్ రాక సందర్భంగా ఢిల్లీ నుంచి వెలువడే ఒక ఆంగ్ల దినపత్రిక ఒక కార్టూన్ ప్రచురించింది. అందులో అమెరికా అధ్యక్షుడి భారత పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు చూడడానికి ముందుగా అతని అధికార బృందం వచ్చి ఉంటుంది. అతను ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను దర్శించబోతున్నాడు కాబట్టి ఆ అధికారులు ఆగ్రా నగర పాలక అధికారులను వెంటబెట్టుకొని తాజ్‌మహల్ దగ్గరకు పోతారు. వివిధ కోణాల నుంచి ఆ కట్టడాన్ని చూసినాక, 'తాజ్‌ను కొంచెం పక్కకు జరపడం సాధ్యమవుతుందా? బిల్‌కు ఇంకొంచెం బాగా కనబడుతుంది' అని వాళ్ళు తమతో ఉన్న ఆగ్రా నగరపాలక అధికారులను అడుగుతారు.

'ఇది మరీ అతిశయోక్తి' అనగల పరిస్థితి సహితం ఇప్పుడు లేదు. క్లింటన్‌ను ఎట్లాగయినా హైదరాబాద్ రప్పించి హైటెక్ సిటీ చూపించి భారతదేశంలో 'ఐటీ'కి హైదరాబాదే కేంద్రమని రుజువు చేసుకోవడానికి చంద్రబాబు పడ్డ ప్రయాస తెలిసిందే. అది 'ఐటీ' పెట్టుబడులను రాష్ట్రంలోకి రప్పించుకోవడానికి మాత్రమే కాదు, తన పాలనా దక్షతను, ఆధునీకరణ కాముకతను అమెరికా అధ్యక్షుడి ముందు ప్రదర్శించుకోవడానికి కూడ. ఆ పాలనా దక్షతలో భాగంగానే క్లింటన్ నగరంలో ఉండబోయే ఒకటి రెండు గంటల మహాభాగ్యానికి నగరంలో భిక్షగాళ్ళెవరూ ఆ రోజు కనిపించడానికి

వీలులేదని కూడ రాష్ట్ర ప్రభుత్వం తాఖీదు జారీ చేసింది. ఆ ఒక్క పూట భిక్ష అడిగే హక్కు చంద్రబాబుకు మాత్రమే ఉండాలని జోక్ చేసుకున్నప్పటికీ, ఒక విదేశీ పాలకుడిని మురిపించడానికి ఈ స్థాయికి మన పాలకులు దిగజారడం నిజంగా చాలా బాధాకరం.

వ్యక్తిగా క్లింటన్ ఏ మాత్రం గౌరవించదగ్గవాడన్నది అప్రస్తుతమే కావచ్చు. అమెరికా దేశస్తులకు మన ముఖ్యమంత్రి పాట్లు చెప్తే నవ్వుతారేమో కూడ. అయితే అమెరికా ప్రభుత్వాన్ని మెప్పించడం ఇవ్వాళ అంతర్జాతీయ రాజకీయాల ఏకైక మూల సూత్రం అయింది. రెండవ ప్రపంచ యుద్ధమప్పటి నుండి అమెరికా ఒక ముఖ్య అగ్రరాజ్యంగా ఉంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలను నిర్ణయించడంలో అమెరికాకు ఈ యాభై ఏళ్ళుగా ప్రముఖ పాత్ర ఉంది.

ఆర్థిక వ్యవస్థ మాత్రమే కాక విభిన్న దేశాల మధ్య తగాదాలను శాంతియుతంగా పరిష్కరించడం కోసం ఏర్పాటు చేసుకున్న ఐక్యరాజ్యసమితి మీద కూడ అమెరికా ప్రభావం బలంగా ఉంది. సామరస్య పరిష్కారం సాధ్యం కానప్పుడు ప్రపంచ దేశాల ప్రతినిధిగా బలప్రయోగానికి పాల్పడే అధికారం అంతర్జాతీయ చట్టంలో (దానినెవరూ గౌరవించారని కాదు గానీ) ఐక్యరాజ్యసమితికి మాత్రమే ఉంది కాబట్టి ఈ ప్రభావం వల్ల అధికారికంగా బలప్రయోగానికి పాల్పడడం అమెరికాకు సులభం అయింది.

అయినప్పటికీ 1990ల దాకా అమెరికాది ఏకఛత్రాధిపత్యం కాదు. అంతర్జాతీయ రాజకీయాలలో సోవియట్ పోటీ ఉండింది. బహుశా అంతకంటే ముఖ్యంగా, ప్రపంచంలో ఏ దేశానికైనా ఎప్పుడయినా వర్తించే ఏకైక ఆర్థిక అభివృద్ధి నమూనా ఒకటి ఉందన్న అభిప్రాయం ఆనాడు లేదు. స్థానిక ప్రత్యేకతలుంటాయనీ, అభివృద్ధికి భిన్న నమూనాలంటాయనీ నమ్మిన రోజులవి.

1990ల తరువాత ఈ రెండు విషయాలలోనూ మార్పు వచ్చింది. అమెరికా పాలకుల మెప్పు కోసం ప్రాకులాడడం మరింతగా పెరిగింది. సోవియట్ రష్యా కూలిపోవడంతో ఐక్యరాజ్యసమితిలోనే కాక బయట కూడ అమెరికాకు తిరుగులేకుండా పోయింది. క్రమంగా ఐక్యరాజ్యసమితి అమెరికా చేతిలోని పనిముట్టుగా మారింది. ప్రపంచ దేశాల మధ్య తగాదాలను సామరస్యంగా పరిష్కరించుకునే వేదికగాను, అది సాధ్యం కాని పక్షంలో శాంతికి విఘాతం కలిగిస్తున్న దేశం మీద ప్రపంచ

దేశాల తరఫున పరిమితంగా బలప్రయోగం చేసే ఉమ్మడి వ్యవస్థగానూ ఉద్దేశించిన ఐక్యరాజ్యసమితి అమెరికా పనిముట్టుగా మారి, ఆ దేశ పాలకులు తమ స్వంత నిర్ణయం ప్రకారం చేసే దాడులకు 'అంతర్జాతీయ చట్టం' అనే ముసుగు తగిలించుకునే అవకాశం లభించింది.

ఆర్థిక అభివృద్ధి విషయంలో 'అమెరికా నమూనా' తప్ప వేరే ఏదీ లేదనే అభిప్రాయం కూడ బలపడింది. సోషలిజం సంగతి దేవుడెరుగు సంక్షేమ పెట్టుబడిదారీ వ్యవస్థ కూడ ఆచరణ సాధ్యంకాని తెలివితక్కువ ఆదర్శం అన్న అభిప్రాయం ఒక వైపు, పెట్టుబడిదారీ అభివృద్ధిలో సహితం స్థానిక అవసరాలు, ప్రయోజనాలు అనే వాటికి చోటేమీ ఉండదని మరొకవైపు అభిప్రాయాలు బలపడ్డాయి. అందుకే మన ముఖ్యమంత్రి ఈ రాష్ట్ర అభివృద్ధి కోసం ఉద్దేశించిన 'విజన్ 2020' పత్రాన్ని ఆస్ట్రేలియాకు చెందిన కన్సల్టెంట్‌తో రాయించగలిగాడు. ఈ రెండు కారణాల వల్ల ఇవాళ అమెరికా పాలకుల మెప్పు కోసం ప్రాకులాట పెరిగింది. దాని వల్ల రాగల భౌతిక ప్రయోజనాల కోసమే కాక, 'మేము కూడ ఈనాటి జ్ఞానం ఎరిగిన వారమే'నని ఆ జ్ఞానానికి ఆద్యులయిన అమెరికా వారికి చూపించుకోవాలనే చాపల్యం వల్ల కూడ మూడవ ప్రపంచ దేశాల ప్రముఖులు వారి వెంటపడుతున్నారు. ఈ పోటీలో మన ముఖ్యమంత్రి మిగిలిన వారి కంటే ఒక్కడుగు ముందుండడం మనం సిగ్గుపడవలసిన విషయం అనడంలో సందేహమక్కరలేదు.

*ప్రజాతంత్ర వారపత్రిక*

*19 మార్చి 2000*

# ఇప్పుడు జరగవలసింది ప్రతీకారం కాదు

ప్రభుత్వాన్ని లొంగదీసుకోవాలంటే ప్రజలను హింసించు అనే సూత్రాన్ని కనిపెట్టిందీ, మొదట ప్రయోగించిందీ ఒసామా బిన్ లాడెన్ కాదు. పాత చరిత్రలోకి పోనక్కరలేదు. ఆధునిక చరిత్రలో కూడ బిన్ లాడెన్ ఈ అమానుషత్వానికి – అది అమానుషత్వం అనడంలో ఎటువంటి సందేహం లేదు – ఆద్యుడు కాదు.

అమెరికా వాళ్ళే ఆద్యులా అంటే ఏమోగానీ ఈ సూత్రాన్ని పెద్దఎత్తున ప్రయోగించిందీ, మళ్ళీ మళ్ళీ ప్రయోగిస్తున్నదీ మాత్రం అమెరికాయే.

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన వైనం అందరూ మరచిపోలేదు. హిట్లర్ ఓటమి అంగీకరించి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటలీ ప్రభుత్వం కూడ ఓడిపోయానని ఒప్పేసుకుంది. ఇంక మిగిలింది జపాన్ ఒక్కటే. ఒంటరిగా అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్‌లను ఎదుర్కునే స్థితిలో జపాన్ లేదు కాబట్టి ఒక రోజు కాకపోతే ఒక రోజు జపాన్ రాజు కూడ లొంగిపోయేవాడే. కానీ అమెరికా అప్పటిదాకా ఆగదలచుకోలేదు. 'ఇంకా ఎన్నాళ్ళు మా యువకులను మృత్యువుకు అప్పగించమంటారు?' అని ప్రశ్నించిన వాళ్ళకు జవాబు చెప్పారు. పైగా, కొత్తగా తయారు చేసుకున్న అణు బాంబును పరీక్షించడానికి 'ఇదే అదను' కాబట్టి జపాన్ ప్రజల మీద ఒకటో రెండో అణు బాంబులు వేసేస్తే అవి పనికొచ్చే బాంబులో కాదో తేలిపోతుంది. జపాన్ రాజూ లొంగివస్తాడని అమెరికా అనుకొనింది.

హిరోషిమా నాగసాకీల మీద రెండు అణుబాంబులు వేసి 3 లక్షల యాభైవేల మందిని చంపి అది పనికొచ్చే బాంబని రుజువు చేసుకోవడమే కాక జపాన్ రాజు చేత ఒక్క రోజులో యుద్ధ విరమణ ప్రకటన చేయించింది కూడ.

మొన్నటి 11వ తేదీన న్యూయార్క్‌లోనూ వాషింగ్టన్‌లోనూ చనిపోయింది ఎంత మంది? పది వేల మందా? ఇరవై వేల మందా? ముప్పై వేల మందా?

సంఖ్యను బట్టి దుర్మార్గమెంత అని నిర్ణయించటం న్యాయం కాదంటారేమో, ఒప్పుకోవడానికి అభ్యంతరమేమీ లేదు. నిరాయుధులయిన సాధారణ ప్రజలను ఒకరిని చంపినా, మూడున్నర లక్షల మందిని చంపినా అది ఒకే రకమైన దుర్మార్గమని ఒప్పుకుందాం. కానీ తాము ఎన్నడూ ఇటువంటి పనులేవీ చేయనట్టు 'ఇది మంచికీ చెడుకూ మధ్య యుద్ధం' అని ప్రకటించడం ఎందుకు?

ఎప్పటిదో పాతకాలపు కథ ఇప్పుడు తవ్వితీయడమెందుకు అని అభ్యంతర పెట్టేవాళ్ళు కూడ ఉంటారు. కానీ అమెరికా ఆనాటి తర్కాన్ని ఇప్పటికీ వదులుకోలేదు.

సద్దాం హుస్సేన్‌కు బుద్ధి చెప్పడానికి ఇరాక్ ప్రజలపై దాడి చేసింది. ఇరాక్ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసింది. అత్యవసర వస్తువులు కూడ ఆ దేశపు ప్రజలకు అందకుండా ఆంక్షలు విధించి తన ఆధిపత్యాన్నంతా వినియోగించి అమలు పరచింది. మందులు లేక ఇరాక్‌లో పసిపిల్లలు చచ్చిపోతున్నారనీ, ఇది అన్యాయమనీ అందరూ విమర్శించినా పట్టించుకోలేదు. ప్రజలను హింసిస్తేనే ప్రభుత్వం దిగివస్తుందన్న సూత్రాన్ని అమెరికా ఇరాక్ విషయంలో తు.చ. తప్పకుండా అమలు చేసింది.

ఇరాక్ తరువాత యుగొస్లావియా వంతు వచ్చింది. మిలోసెవిచ్ దుర్మార్గాన్ని అణచడానికి యుగొస్లావియా భూభాగంపైన, పరిశ్రమలపైన బాంబులతో దాడులు చేసింది. సెర్బియన్ ప్రజలను హింసిస్తేనే మిలోసెవిచ్ లొంగుతాడని భావించి ఆ ప్రజలను విపరీతమైన హింసకు గురి చేసింది. రేపు ఒసామా బిన్ లాడెన్‌కు రక్షణ కల్పిస్తున్న తాలిబన్‌లకు 'బుద్ధి చెప్పడానికి' ఆఫ్ఘనిస్తాన్ పౌర జీవితాన్ని బాంబు దాడులతోను ఆంక్షలతోనూ అమెరికా ఛిన్నాభిన్నం చేసినా ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు.

మనకొక్కరికే సాధ్యమవుతుందనుకున్నంత కాలం దౌర్జన్యంలో తప్పు కనిపించదు. కానీ ఎదుటివారు కూడ ఆ సామర్థ్యాన్ని అలవరచుకున్న నాడు అది దౌర్జన్యంగా కనిపిస్తుంది. 'అనాగరికం', 'మానవతకు మచ్చ', మంచికీ చెడుకూ మధ్య ఘర్షణ' మొదలైన మాటలు వినిపిస్తాయి. ఇప్పుడు మూడు రోజులుగా అమెరికా నోట ఆ మాటలే వింటున్నాం.

అమెరికా చేసిన దుర్మార్గాల పేరు చెప్పి మొన్నటి 11వ తేదీన జరిగిన దాడిని సమర్థించడం నా ఉద్దేశ్యం కాదు. నిరాయుధులూ నిస్సహాయులూ అయిన వ్యక్తులను

చంపడం ఎట్టి పరిస్థితిలోనూ సమర్థనీయం కాదు. అయితే ప్రపంచమంతటికీ ఈ దారి చూపింది అమెరికాయేనని గుర్తిస్తే, ఆ భస్మాసుర హస్తం వాళ్ళ నెత్తిమీదే వచ్చి నిలిచిందని గ్రహించగలుగుతాం. తప్పుదారి చూపినవారే సరయిన దారి చూపించడానికి చొరవ తీసుకోవడం ఉచితంగా ఉంటుంది కాబట్టి ఇకనైనా అమెరికా పాలకులు తమ ఆచరణను మార్చుకొని దేశాల మధ్య సమస్యలను నాగరికంగా పరిష్కరించుకునే ప్రయత్నానికి పునర్జీవనం కల్పించాలని డిమాండ్ చేయగలుగుతాం. అందుకు భిన్నంగా ఆ దేశ అధ్యక్షుడు 'దీన్ని అమెరికా మీద యుద్ధంగా పరిగణిస్తున్నాం' అని, 'వాడు ఎక్కడున్నా సరే పట్టుకొని బుద్ధి చెపుతాం' అని ప్రకటించడాన్ని న్యాయమైన ఆగ్రహంగా కాక తప్పుడు ధోరణులను కొనసాగించే గుడ్డితనంగా గుర్తించగలుగుతాం.

'పునర్జీవనం' అనడానికొక కారణం ఉంది. 20వ శతాబ్దంలో జరిగిన రెండు ప్రపంచ యుద్ధాల అనంతరం, ప్రపంచదేశాల మధ్య సమస్యలను బలప్రయోగం ద్వారా కాకుండా శాంతియుతంగా పరిష్కరించే అంతర్జాతీయ యంత్రాంగాన్ని నెలకొల్పాలనే ఆలోచన బలంగా ముందుకొచ్చింది. యుద్ధం ముగిసిన తరువాత శ్మశాన వైరాగ్యాన్ని పోలిన యుద్ధ వైరాగ్య మొకటి అంకురించడం సహజమే కావచ్చును గానీ ఈ ఆరాటానికి అంతకంటే బలమైన నైతిక భూమిక కూడ ఉంది. మానవ నాగరికత వయసు అయిదువేల సంవత్సరాలనుకున్నట్టయితే ఈ కాలంలో మనుషులు మరింత బలప్రయోగ సామర్థ్యాన్ని కల్పించే సాంకేతిక ఆవిష్కరణలే కాక, మానవ సహజీవనానికి తోడ్పడే నైతిక విలువల ఆవిష్కరణ కూడ చేశారు. బుద్ధుడి ఆలోచనల నొక మైలురాయిగా తీసుకుంటే ఆ తరువాత గడచిన రెండున్నర సహస్రాబ్దాల చరిత్రలో మానవతా విలువలు విస్తృతమైన – నైతిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ – పరిధిని సంతరించుకున్నాయి. అవన్నీ కేవలం ప్రవచనాల దగ్గరే ఎందుకు ఆగిపోవాలి? సమస్యల పరష్కారం దగ్గర కొచ్చేసరికి బలప్రయోగమే ఎందుకు ఏకైక మార్గం కావాలి? మానవ మేధస్సు చేసిన అన్ని వైజ్ఞానిక ఆవిష్కరణలు వాడుకొని మరింత క్రూరమైన హింసా రూపాలను తయారుచేస్తున్న మనం అదే మేధస్సు (లేక మనస్సు అనాలో) చేసిన తాత్విక ఆలోచనలకు ఆచరణలో స్థానమెందుకు ఇయ్యలేకపోతున్నాం? సమస్యల హింసాత్మక పరిష్కారానికి చాలా 'నాగరికమైన' ఆయుధాలు వాడుతున్నాము గానీ నాగరికమైన పరిష్కార మార్గాలెందుకు వెతకలేక పోతున్నాం?

ఈ ఆలోచన నుండి అంతర్జాతీయ సమస్యల శాంతియుత పరిష్కారం కోసం మొదటి ప్రపంచ యుద్ధం తరువాత లీగ్ ఆఫ్ నేషన్స్, రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఐక్యరాజ్యసమితి ఏర్పడ్డాయి. అవి బతికినన్నాళ్ళు అగ్రరాజ్యాల కొట్లాటలకు వేదికలుగా వాడుకోబడ్డాయన్నది ఒకెత్తు కాగా, సోవియట్ రష్యా పతనం తరువాత రెండవ అగ్రరాజ్యం లేని పరిస్థితిని వాడుకొని అమెరికా ఐక్యరాజ్యసమితిని తన జేబులో వేసుకొని తానే ప్రపంచ పోలీసుగా క్రూరమైన భౌతిక బలప్రయోగంతోనూ అంతే క్రూరమైన ఆంక్షలతోనూ అన్ని ప్రపంచ సమస్యలనూ 'చక్కబెడు'తున్నది. దీనికి అంతే అనాగరికమైన జవాబు రాకుండ ఎన్నాళ్ళో ఉండదు. ఆ జవాబు మొన్నటి 11వ తేదీన వచ్చింది.

అమెరికాకు ఈ కష్టకాలంలో వత్తాసు పలుకుతున్న దేశాలన్నీ ఇప్పటికైనా మేల్కొంటాయా? ఇరాక్‌తోనూ యుగొస్లావియాతోనూ వ్యవహరించినట్టే ఇప్పుడు బిన్ లాడెన్ మనుషులు ఏయే దేశాలలో ఉంటే ఆ దేశాలన్నిటితోనూ వ్యవహరించబోతానన్న బుష్ ప్రకటనను బహిరంగంగా వ్యతిరేకించి, ఏ నాగరికమైన తాత్విక ఆలోచన ఒకనాడు ఐక్యరాజ్యసమితి ఆవిర్భావం వెనక ఉండిందో దానిని సమగ్రంగా, నిజాయితీగా అమలు చేయడానికి కృషి చేస్తాయా? చేయకుంటే ఇటూ అటూ ఇంకొన్ని వేల మందో లక్షల మందో అమాయకులు చావడం తప్ప ఈ బుష్ – బిన్ లాడెన్‌ల చంపుడు పందెం సాధించబోయేది ఏమీ లేదు.

*ప్రజాతంత్ర వారపత్రిక*

*17 సెప్టెంబరు 2001*

# అమెరికా యుద్ధ ప్రయత్నాలలో భారత్ భాగం కాకూడదు

సెప్టెంబరు 11వ తేదీన అమెరికాపై జరిగిన దుర్మార్గమైన దాడి నుండి ప్రపంచం తేరుకోకముందే దాని పర్యవసానాలు ఇంకెంత భయంకరంగా ఉండబోతాయో అన్న భయం పట్టుకుంది.

దీనికి కారణం అమెరికా సెప్టెంబరు 11 నాటి దాడికి స్పందిస్తున్న పద్ధతి. అమెరికా ప్రభుత్వం మీద కోపంతో అమెరికా ప్రజలను చంపడం ఆనాటి దాడిలోని దుర్మార్గం కాగా, అమెరికా అదే పద్ధతిలో ఒసామా బిన్ లాడెన్ మీద కక్షతో ఆఫ్ఘనిస్తాన్‌ను మొత్తంగా నాశనం చేయడానికి సిద్ధపడడం ప్రస్తుతం ప్రపంచాన్ని కలచివేస్తున్న ఆందోళనకు కారణం. కాందహార్ పట్టణాన్నీ, పరిసర గ్రామాలనూ ఖాళీచేసి పాకిస్తాన్‌కో ఇరాక్‌కో దొరికిన వాహనం ఎక్కి తరలిపోతున్న ఆఫ్ఘనిస్తాన్ ప్రజల ఫోటోలు వరల్డ్ ట్రేడ్ సెంటర్ కుప్పకూలిపోతున్న దృశ్యం కంటే తక్కువ దయనీయమైనవి కావు.

నిజానికి న్యూయార్క్‌పైన, వాషింగ్టన్‌పైన జరిగిన దాడి అమెరికా కళ్ళు తెరిపించి ఉంటే ఆ దుర్మార్గమైన దాడి కూడ ఒక ప్రయోజనం సాధించి ఉండేది. అయితే అటువంటిదేమీ జరగలేదని అమెరికా అధ్యక్షుడు వాడుతున్న భాషను బట్టి తెలుస్తున్నది. 'వాడు ఎక్కడున్నా సరే పట్టుకొని కడతేరుస్తాం', 'దాడి చేసిన వాడినే కాదు వాడికి సహాయం చేసిన వారెవ్వరినీ కూడ వదిలిపెట్టం', 'పొగబెట్టి వాడ్ని బయటికి రప్పిస్తాం', 'దీనిని అమెరికా మీద యుద్ధంగా భావిస్తున్నాం', 'ఇది 21వ శతాబ్దపు మొదటి యుద్ధం', 'మాకు లాడెన్ అయినా కావాలి, వాడి శవమైనా కావాలి' – ఇత్యాది.

ఇందులో కొన్ని ప్రకటనలు ముంబాయి వంటి నగరాల మాఫియా ప్రకటనలను పోలి ఉన్నాయి. ఛోటా షకీల్, అరుణ్ గావ్లీ వంటి వారు ఇటువంటి సవాళ్ళు

విసురుకుంటారు. ప్రపంచంలోని అత్యంత నాగరికమైన దేశంగా తనను తాను భావించుకునే దేశం ప్రయోగించవలసిన భాష కాదు ఇది.

మిగిలిన ప్రకటనలు విడ్డూరమైనవి. మొన్న జరిగిన దాడి 21వ శతాబ్దపు మొదటి యుద్ధమైతే అమెరికా ఇరాక్‌పైన చేసిన దాడి 20వ శతాబ్దపు ఆఖరి యుద్ధమా? సద్దాం హుస్సేన్‌ను లొంగదీసుకోవడానికి ఆ దేశ ప్రజా జీవితాన్ని అమెరికా సంపూర్ణంగా ధ్వంసం చేసింది. ఆర్థికంగా, పారిశ్రామికంగా నాశనం చేయడమే కాక వర్తకంపైన ఆంక్షలు విధించడం ద్వారా అత్యవసరమైన మందులు సహితం ఇరాక్ ప్రజలకు లేకుండ చేసింది. ఈ కారణంగా కనీసం 5 లక్షల మంది చనిపోయారని – అందులో అత్యధికులు పసిపిల్లలని – అంచనా. ఇది అన్యాయం అని రెడ్‌క్రాస్ వంటి తటస్థ సంస్థలు సహితం అభ్యంతరం లేవదీయగా, 'ఆ మూల్యం చెల్లించదగినదే' నని క్లింటన్ హయాంలో విదేశాంగ కార్యదర్శిగా ఉన్న మేదలీన్ ఆల్‌బ్రైట్ అన్నారు. ఎవరు చెల్లించదగిన మూల్యం అది? ఎందుకోసం?

మొన్న న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను కుప్పకూల్చిన వారు కూడ 'ఆ మూల్యం చెల్లించదగినదే' అనవచ్చునా? ఇద్దరి వైఖరీ ఒకటే అయినప్పుడు 'ఇది మంచికీ చెడుకూ మధ్య సంఘర్షణ' అనీ, 'నాగరికతకూ అనాగరికతకూ మధ్య ఘర్షణ' అనీ అనడం ఎందుకు?

'శత్రువును లొంగదీసుకోవాలంటే ఆ శత్రుదేశ ప్రజలను చంపు' అనేది కనీసం యాభై ఏళ్ళుగా అమెరికా అనుసరిస్తున్న విధానమే. జపాన్ చక్రవర్తిని లొంగదీసుకోవడానికి హిరోషిమా నాగసాకీల పైన అణుబాంబులు వేసి మూడున్నర లక్షలమంది సాధారణ ప్రజలను చంపింది. 1970లలో వియత్నాంలో కమ్యూనిస్టు గెరిల్లాలను కాళ్ళబేరానికి రప్పించడం కోసం పంట పొలాలపై రసాయన యుద్ధం ప్రకటించి వియత్నాం రైతాంగానికి జీవనాధారం లేకుండ చేసింది. గడచిన దశాబ్ద కాలంలో గడాఫీకి 'బుద్ధి చెప్పడానికి' లిబియా ప్రజాజీవితాన్నీ, సద్దాం హుస్సేన్‌కు 'బుద్ధి చెప్పడానికి' ఇరాక్ ప్రజా జీవితాన్ని, మిలోసెవిచ్‌కు 'బుద్ధి చెప్పడానికి' యుగొస్లావియా ప్రజా జీవితాన్ని నాశనం చేసింది. అంతేకాదు తన ఆధిపత్య స్థానాన్ని నిలుపుకోవడానికి అది ప్రపంచవ్యాప్తంగా టెర్రరిస్టులను, మాఫియాలను, అక్రమ ఆయుధ వ్యాపారులను పెంచి పోషిస్తూ వస్తోంది. లాడెన్‌ను తయారు చేసింది ఎవరు? ఆనాడు సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా వారికి సిఐఎ చేత శిక్షణ ఇప్పించింది ఎవరు?

వారి సూత్రాన్ని వారి మీదే ఎవరో ఒకరు ప్రయోగించబోతారని అమెరికా అనుకోలేదు. తన సాంకేతిక సామర్థ్యం అంతటిదనుకుంది. ముఖ్యంగా సోవియట్ రష్యా కూలిపోయి పోటీ అగ్రరాజ్యమేదీ లేకుండ పోయిన తరువాత అమెరికా అహంకారానికి పట్టపగ్గాలు లేకుండా పోయాయి. తన పాఠం తనకి చెప్పేవాళ్ళు ఈ నేలమీద పుట్టలేదనుకుంది. అదే అమెరికా చేసిన పొరపాటు. దౌర్జన్యంలో గుత్తాధిపత్యం ఎక్కువ రోజులు నిలవదు. ఆ విషయాన్ని విషాదకరమైన పరిస్థితులలో గ్రహించవలసి రావడం అమెరికాకు ఉక్రోషం తెప్పించవచ్చును గాక – కానీ ఆ ఆగ్రహాన్ని న్యాయమైన ప్రతిస్పందనగా మనబోటి దేశాలు ఎందుకు భావించాలి? 'మేము రుజువు చేయము. మమ్మల్ని సాక్ష్యాలు అడగొద్దు. వాడెవడో తెలుసు. ఇది చర్చలకు సమయం కాదు. మేమెవ్వరితోనూ మాట్లాడబోము' అనే వీధి రౌడీ వైఖరిని ఎందుకు వెనకేసుకు రావాలి? ఇప్పటిదాకా ప్రపంచ పోలీసుగా వ్యవహరించిన అమెరికా ఇప్పుడు ప్రపంచ న్యాయస్థానమయింది. ఇంక తనను తాను సృష్టికర్తగా ప్రకటించుకోవడమొక్కటే తరువాయి.

బుద్ధి రావలసిన సమయంలో బుద్ధి మరీ వికటించడం చాలా విచారకరం. అయితే మన దేశ పాలకులూ దేశంలోని రాజకీయ విశ్లేషకులూ ముస్లింల పట్ల ద్వేషంతో ఇదే అదనని అమెరికా యుద్ధ ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు. పనిలో పనిగా పాకిస్తాన్‌ను ఇరకాటంలో పెట్టి కశ్మీర్ సమస్యను శాశ్వతంగా 'పరిష్కారం' చేసుకోవచ్చని కూడ ఆశిస్తున్నారు. ముస్లిం మతోన్మాదాన్ని ఎదుర్కొనే పేరు మీద ముస్లిం ప్రజానీకంపైన యుద్ధం ప్రకటించడానికి సిద్ధపడుతున్న అమెరికా రాజకీయ నీతికి వంత పాడుతున్నారు. సెప్టెంబరు 11 నాటి దాడికి కారకులెవరన్న ఆధారాలేవీ ప్రకటించకుండా ఆఫ్ఘనిస్తాన్ పైన యుద్ధానికి కాలుదువ్వుతున్న అమెరికాకు స్థావరాలు కల్పించడానికి తయారవుతున్నారు.

దీనిని మనం నిర్ద్వంద్వంగా వ్యతిరేకించాలి. ముస్లిం మతోన్మాద బృందాలు ప్రపంచానికి ఎంత సమస్యో అమెరికా వంటి దేశాల సైనిక పెత్తనమూ అంతే సమస్య. నిజానికి ఇరాక్‌లోనూ ఆఫ్ఘనిస్తాన్‌లోనూ కూడ ఈ రోజు రాక్షసులుగా చూపిస్తున్న వారి ఆవిర్భావానికి ఒకనాటి అమెరికా సైనిక వ్యూహాలే కారణం. ప్రపంచానికి కావలసింది అనంతంగా సాగే ఈ హింసాత్మక వ్యూహ–ప్రతివ్యూహాల సంఘర్షణ

కాదు. అలాంటప్పుడు అందులో ఏదో ఒకదాన్ని ఎంచుకొని దాని గొడుగు కింద మన ప్రయోజనాలు కాపాడుకుందామనుకునే ఆలోచన ఎంత గుడ్డిది, అనైతికమైనది, అమానవీయమైనది.

న్యూయార్క్, వాషింగ్టన్‌లలోని కొన్ని భవనాల మీద జరిగిన దాడిని నిర్ద్వంద్వంగా ఖండించవలసిందే. కాని ఆ దాడికి ఒక మతం వారిని లేదా ఒక దేశం వారిని బాధ్యుల్ని చేసి 'శిక్షించ'బూనడం మాత్రం అన్యాయం, దుర్మార్గం.

ప్రపంచానికి కావలసింది ప్రపంచ సమస్యల న్యాయబద్ధమైన పరిష్కారానికి అనువయిన అంతర్జాతీయ వ్యవస్థ. ఐక్యరాజ్యసమితి ఒకనాడు ఆ లక్ష్యంలోనే ఏర్పడింది. దానిని ఎందుకూ కొరగాకుండ చేసిన ఘనత అన్ని అగ్రరాజ్యాల కంటే ఎక్కువగా అమెరికాకు చెందుతుంది. ఇప్పుడు ఆ సంకుచితమైన ద్వేషాలనూ ప్రయోజనాలనూ పక్కనపెట్టి భారత్ వంటి దేశాలు ఆ ప్రయత్నానికి తిరిగి ప్రాణం పోయాలే తప్ప ఎట్టి పరిస్థితిలోనూ అమెరికా యుద్ధ వ్యూహంలో భాగం కూకూడదు.

*మానవహక్కుల వేదిక, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ*
*సంయుక్త కరపత్రంగా వచ్చింది, 24 సెప్టెంబరు 2001*

# అమెరికా దురహంకారానికి తాజా బలిపశువులు ఆఫ్ఘన్లు

ఆఫ్ఘనిస్తాన్ పైన అమెరికా యుద్ధం మొదలయి నెలరోజులు దాటింది. 'వేగంగా, క్లుప్తంగా' ముగిస్తామని తొలినాడు ఇచ్చిన హామీని అమెరికాయే మరిచిపోయినట్టుంది. సాధారణ పౌరులకు హాని కలిగించమన్న హామీ మాటకొస్తే, ప్రపంచం ఆ హామీ కోరిందిగానీ అమెరికా ఇవ్వనే లేదు.

ఎందుకివ్వలేదో ఇప్పుడు అర్థమవుతూనే వుంది. ఈ నెలరోజుల్లో యుద్ధంలో ప్రాణాలు కోల్పోయినవారూ, నిలువ నీడ కోల్పోయిన వారూ అందరూ సాధారణ పౌరులే. ఏ 'దుర్మార్గు'ల వేట కోసమయితే అమెరికా బయలుదేరిందో వారిలో ఒకరు కూడ – బుష్ భాషలో చెప్పాలంటే వారి శవాలైనా అమెరికాకు దొరకలేదు.

యుద్ధం ఇప్పట్లో ముగిసే సూచనలు కూడ లేవు. రంజాన్ పండుగ రోజులలో యుద్ధ విరమణ పాటించమని పాకిస్తాన్ అధ్యక్షుడు ముషార్రఫ్ అమెరికా అధ్యక్షుడిని అడిగిన సంగతి పత్రికలలో చదివాం. దానికి ఆయన ఏం జవాబు చెప్పాడు? ఒసామా బిన్ లాడెన్‌ను పట్టుకుని యుద్ధాన్ని క్లుప్తంగా ముగిస్తానని మొదట్లో చెప్పిన పెద్దమనిషి 'రంజాన్ దాకా యుద్ధమెందుకు కొనసాగిస్తాను? ఆ లోపలే ముగిస్తాను' అని చెప్పలేదు. రంజాన్ నెలలో కూడ కొనసాగిస్తాననే అన్నాడు.

మొదట్లో ఈ యుద్ధానికి అనుకూలంగా వున్నవారు సహితం ఇప్పుడు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఎవరో చేసిన తప్పుకు వేరెవరో ఎందుకు చావాలి? ఎంతమంది చావాలి? అసలీ యుద్ధం బిన్ లాడెన్‌ను పట్టుకోవడం కోసమేనా? లేకపోతే ఆ పేరు చెప్పి అమెరికా వేరే ప్రయోజనాలు సాధించుకునే ప్రయత్నంలో నిమగ్నం అయిందా? తాలిబన్ల యుద్ధ సామర్థ్యాన్ని ధ్వంసం చేసే పేరు మీద ఆఫ్ఘనిస్తాన్‌కు ఉన్న కొద్దిపాటి పారిశ్రామిక సామర్థ్యాన్ని, సాంకేతిక సామర్థ్యాన్ని కూడ

ధ్వంసం చేయడం సబబా? దాని వల్ల సాధారణ ఆఫ్ఘన్ ప్రజల భవిష్యత్తు దెబ్బతినదా? ఇత్యాది సందేహాలు ఇప్పుడందరికీ వస్తున్నాయి.

ఎట్లాగో సందేహాలు వస్తున్నాయి కాబట్టి కొంచెం వెనక్కిపోయి అసలు ఈ యుద్ధం తలపెట్టడం న్యాయమేనా? సెప్టెంబరు 11 నాటి సంఘటనకు అమెరికా తీర్చుకుంటున్న పగ, ప్రతీకార పద్ధతి సరయినదేనా అన్న ప్రశ్నలు మనమందరం వేసుకుందాం.

నిజమే, ఆ దౌర్జన్యం అమెరికాకు న్యాయంగానే ఆగ్రహం కలిగించింది. తన దేశ ప్రజలను కాపాడలేకపోయిన తన అశక్తతకు బుష్ దుఃఖించి కన్నీళ్ళు పెట్టుకున్నాడు. గతంలో అమెరికా జపాన్ మీద అణుబాంబులు వేసి మూడున్నర లక్షల మందిని చంపినప్పుడు జపాన్ రాజు కన్నీళ్ళు పెట్టినట్టు, అమెరికా కురిపించిన 'నాపామ్' బాంబుల దాడి నుండి వియత్నాం రైతాంగాన్ని కాపాడలేక వియాట్‌కాంగ్ గెరిల్లాలు కన్నీళ్ళు పెట్టినట్టు, అమెరికా క్షిపణుల దాడికి ధ్వంసమైన తన దేశాన్ని చూసి ఇరాక్ పాలకుడు సద్దాం హుస్సేన్ కన్నీళ్ళు పెట్టినట్టు, అమెరికా విధించిన ఆంక్షల వల్ల మందులు కరువయి తమ కళ్ళముందే చనిపోతున్న పసిపిల్లలను చూసి ఇరాక్‌లో వైద్యులు నిస్సహాయంగా కన్నీళ్ళు పెట్టినట్టు, చిలీ అధ్యక్షుడు సాల్వడార్ అలెండీని అమెరికా గూఢచార సంస్థ హతమార్చినప్పుడు తమ ప్రియతమ నాయకుడిని కాపాడుకోలేకపోయామని చిలీ దేశ ప్రజలు కన్నీళ్ళు పెట్టినట్టు, అమెరికా ప్రేరణతో ఇజ్రాయిల్ సైన్యం అకస్మాత్తుగా దాడిచేసి 17 వేల మంది తమ పౌరులను తమ కళ్ళముందే హతమారుస్తుంటే ఏమీ చేయలేని లెబనాన్ దేశ పాలకులు నిస్సహాయంగా కన్నీళ్ళు పెట్టినట్టు...

వీళ్ళందరిలాగే బుష్ కూడ కన్నీళ్ళు పెట్టుకున్నాడు. ఆ మాత్రం మానవత్వం వున్నందుకు అతనిని గౌరవిద్దాం. కానీ తమకు అన్యాయం జరిగిందని భావించే వాళ్ళు, 'ఆ అన్యాయం చేసిందెవరు?' అన్నదానితో పాటు ఎందుకు చేశారు? అన్న ప్రశ్నను కూడ వేసుకోవాలి.

అమెరికాకు మొదటి ప్రశ్నకు జవాబు తెలీదు. రెండవ ప్రశ్న వేసుకోదు. సెప్టెంబర్ 11 నాటి దాడికి ఒసామా బిన్ లాడెన్ బాధ్యుడనడానికి తన దగ్గర వున్న ఆధారాలుగా అమెరికా చూపిస్తున్న సాక్ష్యాలు 'ఏ కోర్టులోనూ నిలబడవు' అని బ్రిటన్‌కు చెందిన లాయర్లే అన్నారు.

ఇంక ఎందుకు చేశారన్న ప్రశ్న దగ్గరికి వస్తే, చేసినవారెవరయినా అది అమెరికా కొన్ని దశాబ్దాలుగా అనుసరిస్తున్న దౌర్జన్యనీతికి ప్రతీకారంగా జరిగిందనేది స్పష్టమే. తన ప్రయోజనాలకు ఎవరు అడ్డం వచ్చినా, వాళ్ళను మళ్ళీ లేవకుండ చితకగొట్టడం అమెరికా విదేశాంగ నీతి. అదొక ప్రభుత్వమైతే ఆ దేశాన్ని ధ్వంసం చేస్తుంది. అదొక ఉద్యమమైతే దానికి మద్దతుగా వున్న ప్రజల జీవితాలను నాశనం చేస్తుంది. అమానవీయమైన ఈ నీతినే సెప్టెంబర్ 11న దాడిచేసిన వారు అమెరికా మీదే తిరిగి ప్రయోగించారు.

అందువల్ల అది సమర్థనీయమని మేము ఏమీ అనడం లేదు. కానీ ఈ వాస్తవాన్ని గుర్తించినట్లయితే ఆ దౌర్జన్యానికి పాత పద్ధతిలోనే – "వాడినీ, వాడికి మద్దతు ఇచ్చిన వారినీ సర్వనాశనం చేస్తాం" అనే పద్ధతిలోనే స్పందించడం చాలా తప్పని గుర్తించగలుగుతాం.

కానీ అమెరికా అదే తప్పు తిరిగి చేస్తూ వుంది. యాభై ఏళ్ళకు పైగా అమెరికా అనుసరిస్తున్న దౌర్జన్యపూరితమైన విదేశాంగ నీతి ఏదైతే పరిస్థితిని ఇక్కడిదాకా తీసుకొచ్చిందో అదే నీతిని ఆఫ్ఘనిస్తాన్‌లోనూ కొనసాగిస్తున్నది. దానికి ఇప్పటికే కొన్ని వందల మంది ఆఫ్ఘన్ పౌరులను బలి చేసింది. ఇంకా వందలాది మందిని బలి చేయబోతోంది. దీనిని ఖండించడం అవసరం.

అమెరికా అనుసరిస్తున్న యుద్ధం, ప్రచార వైఖరి ఆఫ్ఘనిస్తాన్ ప్రజలకు చాలా అన్యాయం చేయడమే కాక ప్రపంచవ్యాప్తంగా ముస్లింల పట్ల వ్యతిరేకతను, ద్వేషాన్ని పెంచుతున్నది. కాదు కాదంటూనే పాశ్చాత్య దేశాలు దీనిని 'అనాగరికమైన ఇస్లాంకు, నాగరికమైన ఇతర సమాజానికి మధ్య యుద్ధం'గా చూపిస్తున్నాయి. ఇదే అదనని మన పరివార్ పాలకులు తమ అసలు అజెండాను మొత్తంగా అమలు చేయడానికి తయారవుతున్నారు.

చాలా నష్టకరమైన, ప్రమాదకరమైన, అన్యాయమైన ఈ వైఖరులనూ, విధానాలనూ వ్యతిరేకించి, అన్నిరకాల దౌర్జన్యాలనూ అంతమొందించే ప్రజాస్వామిక ప్రయత్నంలో భాగం కావలసిందని ఆహ్వానం పలుకుతూ...

*మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది*

*18 నవంబరు 2001*

# స్పష్టమవుతున్న అమెరికా ఎజెండా

అమెరికా ఇరాన్ మీద యుద్ధం మొదలుపెడుతుందా? లేదా? అని ఇప్పుడు ఎవ్వరూ అడగడం లేదు. ఎప్పుడు మొదలు పెడుతుందని మాత్రమే అడుగుతున్నారు. ఫిబ్రవరి ఆఖరు వారంలోనని మొన్నటిదాకా అనుకున్నారు గానీ మొదటివారంలోనే జరగవచ్చునని ఇప్పుడందరూ అనుకుంటున్నారు.

సద్దాం హుస్సేన్ దగ్గర ఏవో భయంకరమైన ఆయుధాలున్నాయనీ, వాటినతను ధ్వంసం చేయమంటే చేయడం లేదనీ, కనీసం ఎన్ని ఉన్నాయో చూస్తామంటే చూపించడం లేదనీ, అందుకే అమెరికాకు అతని మీద అంత కోపమనీ ఎంతమంది నమ్ముతున్నారో తెలీదు.

సద్దాం హుస్సేన్ నిస్సందేహంగా శాంతి కాముకుడు కాదు. కానీ శాంతి కాముకుడు కానిది అతనొక్కడేనా? భయంకరమైన ఆయుధాలు అతనొక్కడి దగ్గరే ఉన్నాయా? ఇక చూపించడం మాటకొస్తే, మీ దగ్గరున్న ఆయుధాలు మాకు చూపించమని వేరే దేశాలేవయినా ఇన్స్పెక్టర్ల బృందాలను తయారుచేసి పంపిస్తే అమెరికా చూపిస్తుందా?

సద్దాం హుస్సేన్ దగ్గర రసాయనిక ఆయుధాలు, బయలాజికల్ ఆయుధాలు ఉన్నాయని అమెరికా అంటున్నది. రసాయనిక యుద్ధాన్ని మొట్టమొదట పెద్దఎత్తున నడిపింది అమెరికాయేనని, వియత్నాం ఆ ఘోరం నుండి ఇంకా కోలుకోలేదని ఇప్పుడు చాలామందికి తెలుసు కానీ బయలాజికల్ యుద్ధం – అంటురోగాలను వ్యాపింపచేసే పరికరాలను పనిగట్టుకొని శత్రు దేశ ప్రజలపైన ప్రయోగించడం – కూడ అమెరికాయే మొదట చేసిందని చాలామందికి తెలీదు. వియత్నాంలో కాదు, నికరాగ్వాలో కాదు, ఆఫ్ఘనిస్తాన్‌లో కాదు, అమెరికా గడ్డమీదనే.

ఇప్పుడు కాదు, ఈ మధ్య కాదు. రెండు వందల యాభై ఏళ్ళ క్రితం అమెరికాకు యూరప్ నుండి వలస వెళ్ళిన తెల్లజాతీయులు స్థానిక రెడ్ ఇండియన్లను అత్యంత క్రూరంగా అణచివేసి వారి భూములను ఆక్రమించుకున్నారన్నది తెలిసిన సంగతే. రెడ్ ఇండియన్లు యుద్ధం చేతకాని వారు కాదు. కొన్ని సందర్భాలలో గట్టిగానే ప్రతిఘటించారు. అటువంటి ఒక ప్రతిఘటనను ఎదుర్కొనడానికి అమెరికాలోని తెల్లజాతీయులు అతిక్రూరమైన ఎత్తుగడ వేసారు. సంధి కోసమని రెడ్ ఇండియన్లను రమ్మన్నారు. వారు వచ్చారు. సంధి చర్చలకు కూర్చునేటప్పుడు ఏవైనా బహుమతులు ఇచ్చి పుచ్చుకోవడం పాతకాలంలో పరిపాటే కదా! మశూచి రోగులు ఆస్పత్రిలో వాడిన దుప్పట్లను తెల్లవాళ్ళు రెడ్ ఇండియన్లకు ఇచ్చి 'చలిని బాగా ఆపుతాయి, మీ కోసం తెచ్చాం' అని చెప్పారు. వారం రోజులలో రెడ్ ఇండియన్‌లలో మశూచి రోగం వ్యాపించింది. మందేమిటో తెలియని ఆ రోగానికి తట్టుకోలేక వందల మంది రెడ్ ఇండియన్లు చనిపోయారు.

సద్దాం హుస్సేన్‌కు ఏం తెలుసు బయలాజికల్ యుద్ధమంటే...

అయినా అల్‌ఖైదాను అంతం చేసేదాకా ఆగేది లేదనీ, ఒసామా బిన్ లాడెన్‌ను పట్టుకునే దాకా నిద్రపోయేది లేదనీ అమెరికా పాలకులు ప్రకటించి ఎన్నో రోజులు కాలేదు. అవేవీ జరగకుండానే సద్దాం హుస్సేన్ మీదికి దృష్టి మరల్చారేమిటో అని ఎవరైనా ఆశ్చర్యపోగలరు. అవేవీ జరగలేదు కానీ ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికన్ల అసలు లక్ష్యం నెరవేరింది. తమకు వ్యతిరేకమైన ప్రభుత్వం పతనమయి, అనుకూలమైన ప్రభుత్వం గద్దెనెక్కింది. ఇక ఆ తరువాత ఒసామాబిన్ లాడెన్‌లు, అల్‌ఖైదాలు ఎందరుంటేనేమి, ఎన్ని ఉంటేనేమి?

సద్దాం హుస్సేన్‌లోని దోషం అదే. అతను శాంతికాముకుడు కాదని పైన ఒప్పేసుకున్నాము కదా. అంతేకాదు, అతను చాలా దుర్మార్గుడైనవాడు కూడ. జోక్‌గా అనడం లేదు. అతను నిజంగా దుర్మార్గుడే. కానీ సమస్య అది కాదు. అతను అమెరికాకు అనుకూలుడయిన దుర్మార్గుడు కాదు, అమెరికాకు వ్యతిరేకమైన దుర్మార్గుడు. కాబట్టి ఇప్పుడతను దిగిపోవాలి. అమెరికాకు అనుకూలమైన ప్రభుత్వం నెలకొనాలి. ఆపైన ఇరాక్‌లో ఎన్నిరకాల ఆయుధాలు ఎన్ని ఉన్నా ఫర్వాలేదు.

తాలిబన్‌లు మతవాదులు కాబట్టి వారి వల్ల నాగరికతకు ప్రమాదం అన్నారు. ఇస్లామిక్ మతవాదం మీద యుద్ధం ప్రకటించడం అందరి ధర్మం అన్నారు. సరేనని

ప్రపంచం అనుకునే వ్యవధి కూడ ఇవ్వకుండా సద్దాం హుస్సేన్ మీద పడ్డారు. అతను ఎంత దుర్మార్గుడయినా కావచ్చుగాని ఎంతమాత్రం మతవాది కాదు. పశ్చిమ ఆసియాలోని అత్యంత సెక్యులర్ నియంత సద్దాం హుస్సేన్. రవ్వంత సోషలిస్టు కూడ. అతని మీద ప్రపంచమంతా ఎందుకు పోరాటం చేయాలి?

తెలీదు.

'నెక్ట్స్ నేను' అని పాకిస్తాన్ అధ్యక్షుడు అంటున్నాడు గానీ నెక్ట్స్ అతను కాదు, ఇరాన్ కావచ్చు. అప్పుడు బుష్ ఏం కారణం చెప్తాడో చూడాలని నాకైతే చాలా ఆసక్తిగా ఉంది. ఎందుకంటే ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వ అధినేత ముల్లా మహమ్మద్ ఒమర్ మతోన్మాది; ఇరాక్ అధినేత సద్దాం హుస్సేన్ సెక్యులర్ నియంత, అధికారోన్మాది; కాని ఖతామీ రెండూ కాదు. మెజారిటీ వోట్లతో ఎన్నికయి, ఇరాన్‌ను ఖోమైనీ అనుచరులయిన మతవాదుల చేతి నుండి నెమ్మదిగా ప్రజాస్వామ్యం దిశగా నడిపించే ప్రయత్నం చేస్తున్న అత్యంత సంస్కారవంతుడయిన మూడవ ప్రపంచ సంస్కర్త. అయినప్పటికీ అమెరికాకు అనుకూలుడు కాడు కాబట్టి అతని దేశాన్ని దెయ్యాల పుట్టింటిగా బుష్ అభివర్ణించాడు. సద్దాం హుస్సేన్ సంగతి చూసిన తరువాత బుష్ దృష్టి ఇరాన్ మీదికి మళ్ళవచ్చు.

ప్రపంచమంతటా – ముఖ్యంగా పెట్రోలియం తదితర వనరులున్న చోట – తనకు అనుకూలమైన ప్రభుత్వాలను నెలకొల్పడం అమెరికా ఇప్పుడు నిర్దాక్షిణ్యంగా అనుసరిస్తున్న అజెండా. దీనికి అప్పటికప్పుడు ఏదో ఒక పేరు పెట్టుకోవచ్చును గాక – కానీ అమెరికా విదేశాంగ నీతి ఇప్పుడిదే. ఒకప్పుడు అగ్రరాజ్యాల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా బడుగు దేశాలను ఐక్యంచేసే కర్తవ్యాన్ని గుర్తించిన భారత్ (ఆచరణలో దానిని ఎంత అసమగ్రంగా అమలు చేసినప్పటికీ) ఇప్పుడు తెలిసీ ఈ అజెండాలో భాగమవుతుండడం, పైగా అదేదో చాలా తెలివయిన రాజనీతి అని మురిసిపోవడం చాలా బాధాకరం.

*ప్రజాతంత్ర వారపత్రిక*

*27 జనవరి 2003*

# బుష్ గడ్డ మీదనే నిరసనలు

ఇరాక్ మీద అమెరికా చేయించుతున్న యుద్ధానికి వ్యతిరేకంగా పాశ్చాత్య దేశాలలోనే చెప్పుకోదగ్గ స్థాయిలో ఆందోళనలు చెలరేగుతున్నాయి. యూరప్‌లోనే కాక బుష్‌గారి స్వంత గడ్డ మీద కూడ.

చాలా స్వేచ్ఛగా, స్వతంత్రంగా బతుకుతున్నట్టు కనిపించే అమెరికావాసులు ప్రపంచ రాజకీయాలలో తమ దేశం పాత్ర గురించి వారి పాలకులు ఏం చెబితే అది గుడ్డిగా విశ్వసించడం చాలామందికి ఆశ్చర్యం కలిగించే విషయం. మళ్ళీ దేశీయ వ్యవహారాలలో ఆ దేశ ప్రభుత్వానికి అంతటి ప్రజామోదం లభించదు.

దీనికి కారణం ఏమిటనే విషయంలో భిన్న అభిప్రాయాలు ఉన్నాయి. బహుశా అన్నిటికంటే ప్రసిద్ధమైనది నోమ్ చోమ్‌స్కీ విశ్లేషణ. అమెరికాలోని ప్రధాన ప్రసార సాధనాలు పాలనా విధానాలకు ప్రజల సమ్మతిని సాధించిపెట్టే ప్రచార యంత్రాంగాలే తప్ప స్వతంత్రమైన ప్రసార మాధ్యమాలు కావని ఆయన వాదిస్తారు. దేశీయం, అంతర్జాతీయం అన్న తేడా లేకుండా మొత్తంగానే పాలక వ్యవస్థ ప్రచార యంత్రాంగంగా ఆ దేశంలోని మీడియా పని చేస్తుందని చోమ్‌స్కీ అంటారు గానీ ఆయన ఇచ్చే ఉదాహరణలన్నీ విదేశాంగ వ్యవహారాలకు, ముఖ్యంగా అమెరికా ఇతర దేశాలను అదుపు చేయడంలో నిర్వహిస్తున్న దుష్టపాత్రకు సంబంధించినవే. అదంతా 'ప్రజాస్వామ్యాన్నీ' 'ప్రజాస్వామ్య నాగరికతనూ' 'మానవ హక్కులనూ' కాపాడడానికి చేస్తున్న నిస్వార్థ కృషేనని ప్రజల చేత నమ్మింప చేయడానికి అమెరికాలోని పత్రికలు, టీవీ చానెల్స్ ప్రభుత్వానికీ, పాలకవర్గానికీ అనుకూలంగా కృషి చేస్తాయని ఆయన వాదన. ప్రజలు ఆ విధానాలకు సమ్మతి తెలపడానికి అది బలమైన కారణం కాగలదు.

అమెరికన్లందరిలోనూ సామాన్య లక్షణమైన జాత్యహంకారం దీనికి కారణం అన్న వాదన చేసేవారూ ఉన్నారు. అమెరికన్ ప్రభుత్వం 'ప్రజాస్వామ్యం' పేరు మీద

ప్రజల హక్కులనూ, సంక్షేమాన్నీ, రాజకీయ స్వేచ్ఛనూ ఖూనీ చేసిన దేశాలలో ఒక్కటీ తెల్లవాళ్ళ దేశాలు కావు. మధ్య అమెరికా, దక్షిణ అమెరికా దేశాలు, 'మంగోలాయడ్' అని పిలవబడే జాతులు నివసించే తూర్పు ఆసియాదేశాలు, ఇప్పుడు సాంస్కృతికంగానూ మతపరంగానూ తెల్లవారికి పరాయివారయిన పశ్చిమాసియా ముస్లిం దేశాలు – అమెరికా దౌర్జన్యానికి గురయిన, గురి అవుతున్న దేశాలు.

ఇందులో కూడ కొంచెం నిజం ఉండవచ్చు. 'పెట్రోలియం వనరులు చాలా ప్రాముఖ్యత గలిగినవి. వాటిని అరబ్బులకు వదలిపెట్టడానికి వీలు లేదు' అని కిస్సింజర్ అప్పుడెప్పుడో అన్నాడట. 'అరబ్బులు' బాధ్యత తెలియని అనాగరికులు అన్న తృణీకారం ఇక్కడ స్పష్టంగా ఉంది. అమెరికన్లలో ఈ అభిప్రాయం ఒక సామాన్య భావన అయిన మేరకు అది అమెరికా విదేశాంగ నీతికి సాధారణ ప్రజల సమ్మతిని సులభంగా సంపాదించి పెట్టగలదు.

అయితే ఒక జాతిలోనయినా, ఒక దేశ సంస్కృతిలోనయినా దుర్మార్గం ఇంత సంపూర్ణంగా ఉంటుందని నమ్మడం కష్టం. నమ్మగలిగినట్టయితే మానవ జాతి భవితవ్యాన్ని గురించి మనకు నమ్మకం సన్నగిల్లక తప్పదు. ఇక మనుషుల ఆలోచనలను ఒకరు కుట్రపూరితంగా ఒక మూసలో రూపొందించగలరనే చోమ్‌స్కీ నమూనా వాదన కూడ ఎంత ఆకర్షణీయంగా కనిపించినప్పటికీ ఒక మోతాదు దాటిన తరువాత దానిని స్వీకరించడం కష్టం. మానవ సమాజాల సంస్కృతులలో దుర్మార్గమూ ఉంటుంది; మనుషుల చైతన్యాన్నీ, ఆలోచనలనూ తమకు అనుకూలంగా మలచుకోవాలని చూసే కుట్రలూ ఉంటాయి. కాని దానితోపాటు మరొక రెండు విషయాలు కూడ గుర్తు పెట్టుకోవాలి. ఒకటి – మనుషులు (ఎప్పుడో తప్ప) దుర్మార్గాన్ని దుర్మార్గంగానే ప్రేమించరు. తరచుగా దాని వెనుక తమకు న్యాయమని తోచే కారణం ఏదో ఉంటుంది. రెండు – మనుషుల ఆలోచనలు ఒకరు 'కీ' తిప్పితే తిరిగే యంత్ర ఉత్పత్తులు కావు. చైతన్యం, సంకల్పం కలిగినవి.

మంచికీ, చెడుకూ కూడ పాశ్చాత్య దేశాల ప్రజా చైతన్యంలో – ముఖ్యంగా అమెరికాలో – కొన్ని ప్రగాఢమైన అభిప్రాయాలు ఉన్నాయి. తమది అత్యంత పురోగామి నాగరికత అనీ, దానిని స్వీకరించడానికి వెనుకబడినవారు మొరాయించడం తెలివి తక్కువతనమనీ వారు నమ్ముతారు. ఇందులో అహంకారమూ ఉంది, ఆధునికతా విలువల నుండి పుట్టిన విశ్వాసమూ ఉంది. ఆ విశ్వాసం అహంకారానికి ముసుగు

మాత్రమేననే అతివాదపు వ్యాఖ్యను నమ్మగల వాళ్ళకు తప్ప, ఇతరులకు ఈ రెండు అంశాలనూ విడివిడిగా చూడడంలో ఇబ్బంది ఉండవలసిన అవసరం లేదు.

తమ దగ్గర ఎవరి దగ్గరా లేని మంచి ఉందని నమ్మేవారు, దానిని ఇతరులకు బలప్రయోగంతో పంచడం తప్పు కాదని నమ్మడం అభ్యంతరకరం కావచ్చునుగానీ, అరుదయిన విషయమేం కాదు. పాశ్చాత్య దేశాల ప్రభుత్వాలకు ఇది చాలా ఉపయోగపడుతున్నది. తమ అంతర్జాతీయ రౌడీయిజాన్ని తమ ఉన్నత నాగరికత వ్యాప్తిగా చూపించగలిగినంత కాలం దానికి ప్రజామోదం పొందడం వారికి కష్టం కాదు. అదంతా పత్రికలు, ప్రసార సాధనాలు తెచ్చిపెడుతున్న సమ్మతి కాదు. వాటికొక పాత్ర లేకపోలేదు కానీ, ఆ దేశాల ప్రజా చైతన్యంలోనే దానికి పునాది ఉంది. వారి రౌడీయిజం 'మంచిని బలప్రయోగంతో వ్యాపింపజేయడం' అనే మూసలో కనిపించినంత కాలం ఆ రకమైన బలప్రయోగం తప్పుకాదన్న అభిప్రాయం – అవాంఛనీయమయినదే అయినా – జాత్యహంకారంతో సమానం చేయలేం. కానీ అదే సాంస్కృతిక సంప్రదాయానికి వేరే పార్శ్వం కూడ ఉంది. వ్యక్తి హక్కులు, వ్యక్తి అభిమతానికి స్వేచ్ఛ, స్వయం నిర్ణయాధికారం మొదలయిన విలువలు ఆ దేశాల వారు ఉన్నతంగా భావించే నాగరికతలో భాగమే. ఏదో ఒకరోజు అదే నాగరికత పాలక రౌడీయిజానికి కల్పించే సమ్మతి ఈ విలువలతో తలపడక తప్పదు. వియత్నాం యుద్ధ కాలం నుండి ఇది కొద్ది కొద్దిగా జరుగుతున్నది. ఇప్పుడు అపూర్వ స్థాయిలో ఈ నిరసన వినపడుతుందని నోమ్ చోమ్‌స్కీ వంటి వారు సహితం మెచ్చుకుంటున్నారు.

మనం పాశ్చాత్య దేశాల వారి సంస్కృతిని అనేక కారణాలుగా తిట్టుకుంటుంటాం. అది న్యాయమే. అయితే మనం న్యాయంగా ఆలోచించేటట్టయితే ఈ నిరసన ప్రదర్శనలు వారి సంస్కృతిలోని మెచ్చుకోదగ్గ లక్షణం. భారత పాకిస్తాన్ ప్రభుత్వాల కశ్మీర్ విధానానికి నిరసనగా ఈ దేశంలోనయినా, ఆ దేశంలోనయినా ప్రజలు పెద్దఎత్తున నిరసన ప్రదర్శనలు చేయడం ఊహించగలమా?

'అయితేనేం, ఇవేవీ జార్జి బుష్‌ను ఆపవు కదా' అని సినికల్‌గా అనేవారు ఉంటారు. ఆపకపోవచ్చు. అయితే అదేం విశేషం? చరిత్రలో మంచి చెడును ఎన్నిసార్లు ఆపగలిగింది? ఎన్ని సందర్భాలలో ఆపగలిగింది? అంతమాత్రం చేత దానిని మంచి అనడం మానేస్తామా?

*ప్రజాతంత్ర వారపత్రిక*

*10 ఫిబ్రవరి 2003*

# భారత్–అమెరికా ఒప్పందం: ఈ చర్చతో మనకేం పని?

**కొ**త్తగా భారత్ అమెరికాతో చేసుకున్న అణు ఒప్పందం మనకు ప్రయోజనకరమా, నష్టకరమా అన్న చర్చ వేడిగా జరుగుతున్నది. కొందరు ఇటూ, కొందరు అటూ మాట్లాడుతున్నారు. చాలామందికి ఆ ఒప్పందం ఏమిటో అర్థం కావడం సహితం కష్టం కాబట్టి సగటు భారతీయులు అయోమయ స్థితిలో ఉండవచ్చు. ఇది నిజంగా భారతదేశానికి మంచిదా? కాదా? అని ఎట్లా తేల్చుకోవాలో అర్థంకాక దిగులుపడుతూ కూడ ఉండవచ్చు.

అణు సాంకేతిక ప్రక్రియల గురించి కొంత తెలుసుకోనిదే ఈ ఒప్పందంలోని రాజకీయాలు అర్థం కావడం కష్టం. అయితే నేనిప్పుడు ఆ పాఠం చెప్పబోవడం లేదు. ఈ ఒప్పందం భారతదేశానికి ఏమిస్తుంది, ఏమియ్యదు అనేది దాని ప్రధాన ప్రాముఖ్యం కాదని చెప్పదలచుకున్నాను. 'భారతదేశం' అన్నమాటకు కొన్నేళ్ళుగా మారుతూ వస్తున్న అర్థాన్ని వ్యవస్థీకృతం చేయనున్న మొదటి ఉదంతం ఈ ఒప్పందం. అదీ దాని నిజమైన ప్రాముఖ్యం.

భారతదేశం అనేది పచ్చగా, చల్లగా, నీతిగా, న్యాయంగా ఉండాలనేది ఈ దేశంలోని సగటు రాజకీయ జీవి ఆకాంక్షగా ఉంటూ వస్తున్నది. భారతదేశం అన్న భావనకు అది నిర్వచనంగా ఉంటూ కూడ వచ్చింది. మనలో ప్రజాదరణ పొందిన దేశభక్తి గేయాలు – సినిమా పాటలతో సహా – ఆ చిత్రాన్నే కళ్ళముందు ఉంచుతాయి.

దీనితో విభేదించిన ఒకే ఒక సంస్థ ఆర్ఎస్ఎస్. భారతదేశం ప్రపంచాన్ని ఏలే అగ్రరాజ్యం కావాలన్నది గోల్వాల్కర్ కల. అప్పట్లో ఆయనతో వేరే ఎవ్వరూ – కాంగ్రెస్ వారు, కమ్యూనిస్టులు, సోషలిస్టులు, పెరియారిస్టులు, అంబేద్కర్‌వాదులు అంగీకరించలేదు.

ఇప్పుడు 'భారతదేశం' అనే భావనలో, దాని రూపకల్పనలో గోల్వాల్కర్ యుగం వచ్చింది. బిజెపి – కాంగ్రెస్ ప్రభుత్వాల వరుస పాలనలో అది అవిచ్ఛిన్నంగా ఎదుగుతున్నది. (ఆర్ఎస్ఎస్ నిన్న గాక మొన్న కాంగ్రెస్ అనుకూల సంకేతాలు ఊరికే పంపలేదు.) అణుబాంబు తయారు చేసుకున్నాం. ఇంకా ఇంకా తయారు చేసుకునే దాకా అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒడంబడిక (ఎన్.పి.టి.) మీద సంతకం చేయకూడదని నిర్ణయించుకున్నాం. వేరే అన్ని ప్రమాణాలూ పక్కన పెట్టి 8 లేక 10 శాతం పెరుగుదల రేటులోనే అభివృద్ధి స్వర్గం ఉందని నిర్ణయించుకున్నాం. 100 కోట్ల జనాభాలో 70 కోట్లు పోనిచ్చి మిగిలిన 30 కోట్లు అన్ని రకాల అత్యాధునిక వస్తు, సేవా రంగాలలో పెట్టుబడులు పెట్టుకోవడానికి గొప్ప అవకాశం కల్పించే మార్కెట్ అని ప్రచారం చేసుకుంటున్నాం. భద్రతా మండలి సభ్యత్వానికి ఎవరూ అప్లికేషన్ పంపమని అడగకముందే పంపించేసాం. అలవాటు ప్రకారం పైరవీ చేసుకుంటున్నాం.

ఈ కొత్త భారతదేశంతో అందరం మమేకం కాలేము. దాని మంచిని 'మన' మంచి అనీ, దాని చెడును 'మన' చెడు అనీ అనుకోలేము. అది తాను ఒక్కరోజులో అగ్రరాజ్యం కాలేదని ఎరుగును. అగ్రరాజ్యాలను ధిక్కరించి అగ్రరాజ్యం కాలేదని తెలుసును. అప్పుడప్పుడు బెట్టు చేస్తూ, అప్పుడప్పుడు వారి సరసన చేరుతూ మెట్టు మెట్టుగా ఉట్టినెక్కాలని దాని ఆలోచన.

అది అణుబాంబు తయారు చేసుకుంటుంది. అణ్వస్త్ర దేశంగా గుర్తింపు కావాలని కోరుకుంటుంది. కానీ 'బాధ్యత గల' (మెండుగా బాంబులు గల) అణ్వస్త్ర రాజ్యాల లాగా అణు వ్యాప్తి నిరోధక ఒప్పందంపైన తొందరపడి సంతకం చేసేయదు. చేసేస్తే రెండవ శ్రేణి అగ్రరాజ్యంగా ఉండిపోవలసి వస్తుంది. అది తన ఐటి మేధావుల అవుట్ సోర్సింగ్ మార్కెట్నూ, సొంతదేశపు పూలు పండ్ల మార్కెట్నూ ఆసరా చేసుకొని ప్రపంచ వాణిజ్య సంస్థ చూపించే ఎగుమతి దిగుమతుల ఆర్థిక స్వర్గం చేరుకోగలనని భావిస్తుంది. అయితే ఆ బాట పట్టగల భారత్ 30 కోట్ల జనాభా గల దేశం మాత్రమేనని గుర్తొచ్చినప్పుడు బీద ఏడుపులు ఏడుస్తుంది.

ఈ కొత్త భారతదేశంతో ఏ విధంగా వ్యవహరించాలో అగ్రరాజ్యాలకు సహితం పాలుపోవడం లేదు. మింగ మెతుకు లేదు, మీసాలకు సంపెంగ నూనె కావాలా అని

వారు వెక్కిరించగలరు. వెక్కిరిస్తుంటారు కూడ. అయితే 8 శాతం పెరుగుదల రేటు మీద దృష్టి నిలిపి దేశంలో మూడవ వంతు జనాభాను ఆకర్షణీయమైన మార్కెట్‌గా రూపొందించడానికి సిద్ధంగా ఉన్న ఆర్థిక విధానాలు వాళ్ళను ఊరిస్తున్నాయి. 1980 నుండి కొనసాగుతున్న ఆర్థిక సంక్షోభానికి శాశ్వత పరిష్కారం కాకపోయినా తాత్కాలిక జవాబు ఎక్కువ జనాభా కలిగి 'అభివృద్ధి' బాట పట్టిన మూడవ ప్రపంచ దేశాలలో ఉందని వారికి తెలుసు. కాబట్టి కొత్త రంగులు పులుముకున్న భారత్ గురించి వారు గౌరవంగా మాట్లాడడం అలవరుచుకున్నారు. లేని బలాన్ని ప్రదర్శించ జూస్తున్న భారత్ గురించి లోలోపల నవ్వుకుంటున్నారేమో గానీ పైకి గంభీర వదనాలు ప్రదర్శిస్తున్నారు. తృణీకరించి దూరం చేసుకోవడం కంటే తమ పంచన చేర్చుకొని తమ నీడలో అగ్రరాజ్య కాంక్షను తీర్చుకోనివ్వడం ఉత్తమం అని భావిస్తున్నారు. అది గ్రహించిన భారత్ అగ్రరాజ్యపు హంగులు ఒక్కొక్కటీ డిమాండ్ చేస్తున్నది. కొన్ని సాధించుకుంటున్నది, కొన్ని చేయిజారి పోయాయని బాధ పడుతున్నది.

ఈ కేళిలో భాగంగా చూసినప్పుడే మన్మోహన్ – బుష్‌ల ఒప్పందం అర్థం అవుతుంది. ఒక ఆర్థిక శక్తిగా భారత్ అమెరికాకు ఏక సమయంలో ఆకర్షణ, జుగుప్స కలిగిస్తున్నది. భారత సంతతికి చెందిన ఐటి రంగ నిపుణులు అమెరికా ఆర్థిక పురోగతిలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. అయితే అదంతా బెంగుళూరుకు వచ్చేస్తే తమ గతి ఏం కావాలన్న బెంగ అమెరికాకు పట్టుకుంది. ఇక 8 శాతం అభివృద్ధి రేటు అనే ఇంజన్ తగిలించుకున్న 30 కోట్ల జనాభా మార్కెట్ అమెరికాకు ఎంత ఆకర్షణీయంగా కనిపిస్తుందో చెప్పలేం. అటువంటి భారత్‌ను దూరం ఉంచడం కంటే చేరదీసి అదుపుచేయడం మేలని అమెరికా అనుకుంటున్నది. ఆ భారత్‌కు అణ్వస్త్ర దేశంగా గుర్తింపు కావాలా, అణు వ్యాప్తి నిరోధక ఒప్పందంపైన సంతకం చేయకున్నప్పటికీ అణు సాంకేతిక ప్రక్రియల దిగుమతులూ, వాటి ముడి పదార్థమైన యురేనియం దిగుమతులూ కావాలా? ఇచ్చేద్దాం. బహుళ దేశ ఒడంబడికలంటే అమెరికాకు పెద్దగా  గౌరవం లేదు. తనతో ఒప్పందం చేసుకొని తన కనుసన్నలలో మెలుగుతుంటే చాలు. దాదాపు 60 సంవత్సరాలు కమ్యూనిజం అనే బూచిని ప్రధాన శత్రువును చేసుకొని దానిని వ్యతిరేకించే వారితో గుంపులు కట్టిన అమెరికా ఇప్పుడు కమ్యూనిజం స్థానంలో ఇస్లాంను నిలబెట్టి అదే పనిచేస్తున్నది. ఈ ముఠా

రాజకీయాలకు కూడ పెద్ద ముస్లిమేతర దేశమైన ఇండియా ఆకర్షణీయంగా కనిపిస్తున్నది.

'ముస్లిమేతర' గుర్తింపు భారత పాలకులకు ఒకప్పుడు నచ్చేది కాదు. ఇండోనేషియా తర్వాత అత్యధికంగా ముస్లింలు ఉన్న దేశం ఇండియాయే అని గతంలో చెప్పుకునేవారు. అయితే ఈ కొత్త భారతదేశానికి 'ముస్లిమేతర' గుర్తింపు పట్ల అభ్యంతరం లేదు. అమెరికాకు చేరువ కావడానికి, అమెరికా తోక పట్టుకుని ఎగబాకడానికి అది పనికొచ్చేటట్టయితే సంతోషం కూడ. అణు ఒప్పందం పేరిట ఇండియా అణ్వస్త్ర హోదాకు సాధికారత కల్పిస్తూ, అణు సాంకేతిక సహాయం చేస్తూ అదే సమయంలో తన పర్యవేక్షణలో ఉంచుకోవాలని అమెరికా ప్రయత్నిస్తుండగా, అమెరికా పర్యవేక్షణలో ఉన్నట్టే ఉంటూ వీలయినంత దాచిపెట్టాలనీ, అన్యమార్గాలకు తలుపులు తీసి ఉంచాలనీ ఇండియా పాలకులు ప్రయత్నిస్తున్నారు. ఈ కేళి మొదటి రౌండ్‌లో ఇండియాదే విజయం అని పాశ్చాత్య పరిశీలకులు – ముఖ్యంగా అణ్వస్త్ర వ్యాప్తి పట్ల నిజంగా వ్యతిరేకత ఉన్నవారు భావిస్తున్నట్టున్నారు. ప్రస్తుతం జరుగుతున్న చర్చ పరిభాషలోకి దీనిని అనువదించుకుంటే ఈ ఒప్పందం వల్ల భారత్‌కే ఎక్కువ లాభం అనేది కనీసం పాశ్చాత్యుల అభిప్రాయం అనిపిస్తుంది.

అయినా ఈ భారత్‌తో నాకూ మీకూ ఎందుకు? దాని ప్రమాణాలతో చరిత్రనూ, రాజకీయాలనూ కొలవడం ఎందుకు? భారత్ అనేది పచ్చగా, చల్లగా, నీతిగా, న్యాయంగా ఉండాలని నమ్మేవారికి ఈ చర్చలో కాదు, దాని వెలుపలే స్థానం.

*ప్రజాతంత్ర వారపత్రిక*

*మార్చి 11, 2006*

# భారత్–అమెరికా అణు ఒప్పందంలో మనం సంతోషించడానికి ఏముంది?

**భా**రత్ – అమెరికా అణు ఒప్పందానికి అమెరికా చట్టరూపం చేసినట్టు వార్త.

భారతదేశపు అణు సాంకేతిక రంగానికి చెందిన ప్రముఖులు చాలామంది ఆ ఒప్పందం 'మనకు' నిజంగా మేలు చేస్తుందా అని ఆందోళన చెందినట్టు కూడ వార్త.

ఈ ప్రముఖులే అణుశక్తి వినియోగం పట్ల పర్యావరణవాదులు లేవదీస్తున్న ప్రశ్నలను, సందేహాలను చాలాకాలంగా తొక్కిపెట్టి అణుశక్తిని దేశభక్తికి సమానంచేసి దబాయిస్తున్నవారు కాబట్టి వీరు 'మనకు' అన్నది ఎవరినుద్దేశించి అన్న ప్రశ్న వేసుకోకుండా 'మన'వైపు నుండి విషయాన్ని చూడలేం.

1974లో ఇందిరాగాంధీ మొదటిసారి అణువిస్ఫోటన ప్రయోగం చేసినప్పుడు బంద్ చేసిన అణుపరిజ్ఞాన సంబంధాలను, రెండవసారి మళ్ళీ అణువిస్ఫోటన ప్రయోగం చేసి నేను సైతం అణ్వస్త్ర దేశాన్నే అని భారత్ విర్రవీగటం మొదలుపెట్టిన తరువాత అమెరికా సడలించడం విచిత్రమే కాబట్టి వారి ఉద్దేశ్యం ఏమిటో కూడ చూడకుండా విషయాన్ని అర్థం చేసుకోలేము.

బాంబులు తయారు చేయకుండా ఉన్న వాళ్ళంతా మంచివాళ్ళు, వాళ్ళతో అమెరికాకు పేచీ లేదు. వాళ్ళు తనతో స్నేహంగా ఉంటే వాళ్ళకవసరమయినప్పుడు వాళ్ళ తరఫున తాను బాంబులు వేయడానికి, లేదా వేస్తానని బెదిరించడానికి అమెరికా రెడీ. అంతే తప్ప అందరూ స్వతంత్రించి అణు బాంబులు తయారు చేసుకోవడం పద్ధతి కాదు.

ఒకవేళ అణు బాంబు ప్రయోగం చేసినట్లైతే వెంటనే అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒడంబడిక పైన సంతకం చేసేయాలి. ఆపైన ఏ మేరకు అణ్వస్త్ర రాజ్యంగా ఎదగగలుగుతుందనేది ఆ ఒడంబడికకు లోబడి ఉంటుంది. ఇండియా అణ్వస్త్ర విస్ఫోటనం జరిపి, నేను సైతం అణ్వస్త్ర దేశాన్నేనని ప్రకటించి కూడ ఆ ఒడంబడికపైన సంతకం చేయలేదు. 'నువ్వు అన్ని రకాల బాంబులు తయారు చేసి పెట్టుకొని, నేనొక్కటి తయారుచేయగానే ఇక అక్కడితో ఆపేయాలని ఒత్తిడి పెట్టడం అన్యాయం' అని పది హత్యలు చేసిన రౌడీతో తొలి హత్య చేసిన చిన్న రౌడీలాగ భారత్ అభ్యంతరం చెప్పింది. రౌడీల ప్రపంచంలో ఇది న్యాయమైన తర్కమే.

అణుబాంబు సామర్థ్యాన్ని ప్రదర్శించిన తరువాత అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒడంబడికపైన సంతకం చేయకపోవడం అంటే బరితెగించడం అని అమెరికా అభిప్రాయం. అటువంటి దేశాలను అది అణు సాంకేతిక ప్రపంచం నుండి వెలివేస్తుంది. ఇండియాను అలాగే వెలివేసింది. ఇండియా కాళ్ళబేరానికి పోకపోగా, చూసిచూసి కాషాయాంబరధారుల పాలన రాగానే ఇంకొక్కసారి అణ్వస్త్ర పరీక్ష నిర్వహించి అణ్వస్త్ర వ్యాప్తి ఒడంబడికను వెక్కిరించింది.

అటువంటి భారత్‌పైన ఆంక్షలు (పాక్షికంగానే అయినా) ఎత్తేయడానికి అమెరికా ఎందుకు సిద్ధపడింది? అవేమయినా మనకు మేలు చేసే కారణాలా? అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒడంబడిక అసమానమైన ఒప్పందమే అయినప్పటికీ అది బహుళపక్ష ఒడంబడిక. దానికి కట్టుబడి ఉండడం అంటే ఒక రకంగా అంతర్జాతీయ చట్టానికి కట్టుబడి ఉండడం అని అర్థం. అయితే సోవియట్ రష్యా పతనమైన నాటి నుండి అంతర్జాతీయ వ్యవహారాలు, దేశాలు అంతర్జాతీయ వేదికపైన అనుసరించే విధానాలు అంతర్జాతీయ చట్టానికి లోబడి ఉండాలన్న పట్టింపును అమెరికా పూర్తిగా వదిలిపెట్టింది. అంతకుముందు దానికి కనీసం నామమాత్ర గౌరవమైనా ఇచ్చేది. అన్ని దేశాలు తనతో ద్వైపాక్షిక ఒడంబడికలు చేసుకొని వాటికి కట్టుబడి ఉంటే చాలుననేది అమెరికా ప్రభుత్వ వైఖరి. అందుకే భారత్ అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒడంబడికపైన సంతకం చేయకున్నా, తనతో ద్వైపాక్షిక ఒప్పందం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్న కారణంగా అణుపరిజ్ఞాన సహకారం మీద ఆంక్షలు ఎత్తివేయడానికి అమెరికా సిద్ధపడింది. దీనికి ఇండియా సహకరించడం ద్వారా, అంతర్జాతీయ చట్టాన్ని ధ్వంసం చేసి దాని స్థానంలో

తన ఏకపక్ష అధిపత్యాన్నే అంతర్జాతీయ నీతిగా నిలబెట్టడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలకు ఉపకరించినట్టయింది. ఇది మొదటి తప్పిదం. కాని ఈ ఒప్పందాన్ని అనుమానంగా చూస్తున్న భారత్ అణు సాంకేతిక నిపుణులెవరికీ ఈ తప్పు కనిపించలేదు. భారత పాలకులకు అసలే కనిపించలేదు. అందుకేనేమో, నిన్న మొన్నటిదాకా అణ్వస్త్ర వ్యాప్తినిరోధక ఒడంబడికపైన సంతకం చేయడమే ఈ రంగంలో 'బాధ్యతాయుతమైన ప్రవర్తన'గా భావించిన అమెరికా దాని మీద సంతకం చేయడానికి ససేమిరా అంటూ అమెరికాతో ద్వైపాక్షిక ఒప్పందం మీద సంతకం చేయడానికి సిద్ధపడిన ఇండియాను 'అత్యంత బాధ్యతాయుత ప్రవర్తన కనబరుస్తున్న దేశం'గా గుర్తించింది, పదేపదే ప్రశంసిస్తున్నది.

పోతే, ఒప్పందంలోని వివరాల విషయంలో రెండు దేశాలూ ఎత్తులూ పైఎత్తులూ వేస్తూ చివరికి ఇద్దరికీ సంతోషం కలిగించే సమతుల్యం సాధించినట్టున్నారు. ఇండియాకు ఏం కావాలి? అణ్వస్త్ర దేశంగా గుర్తింపు కావాలి. అది అంతర్జాతీయ రాజకీయాలలో మగతనంతో సమానం. అది లభించింది. అమెరికా సాధించిన అణు సాంకేతిక ప్రగతి తనకు అందుబాట్లోకి రావాలి. అదీ లభించింది. అయితే అణ్వస్త్ర సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడే సాంకేతిక ప్రక్రియలను మాత్రం అమెరికా దీని నుండి మినహాయించింది. మనవాళ్ళు ఒప్పుకోలేదు. బుష్ ఈ విషయంలో మన పాలకులకు హామీ ఇచ్చినట్టున్నాడు గానీ అమెరికా చట్ట సభలు ఒప్పుకోలేదు.

మరి అమెరికాకు ఏం కావాలి? సాధించుకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దాచుకోవడం వ్యాపారనీతికి విరుద్ధం. అణుశక్తి ఇతోధికంగా వాడుకోవడానికి సిద్ధపడుతున్న ఇండియా ఈ విషయంలో పెద్ద మార్కెట్ కాగలదు. అది ఇప్పుడు అమెరికాకు అందుబాట్లోకి వస్తుంది. అన్ని రకాలుగా ఇండియాతో ఆర్థిక లావాదేవీలు పెంచుకోవడం అమెరికాను ఏలుతున్న కార్పొరేట్ కంపెనీలకు ఆకర్షణీయంగా కనిపించే విషయం కాబట్టి భారత పాలకులను ఈ విధంగా మంచి చేసుకోవడం అమెరికా ఆర్థిక నీతి దృష్ట్యా తెలివయిన ఎత్తుగడ. కాని భారత్ ఈ సాంకేతిక విజ్ఞానాన్ని అణ్వస్త్రాల తయారీ కోసం వాడుకొని చేయిదాటిపోతే? అప్పుడు అమెరికా ఈ ఒప్పందాన్ని తెంపేసుకోవడమే కాక, ప్రపంచంలో వేరే ఏ దేశమూ

భారత్‌కు అణు ఎగుమతులు చేయకుండ నిరోధించే అధికారం కూడ తన వద్ద ఉంచుకుంది.

అయితే అమెరికాకు ఆర్థిక ప్రయోజనాలను మించిన భద్రతా ప్రయోజనం ఉంది. అమెరికా 'ఇస్లామిక్ తీవ్రవాదం'గా తాను గుర్తించే దానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ కూటమిని తయారు చేసే ప్రయత్నంలో ఉంది. భారత్‌ను అందుకు అనువయిన దేశంగా చూస్తున్నది. 'ఇస్లామిక్ తీవ్రవాదాన్ని' ఎదుర్కొంటున్న హిందూ దేశంగా అమెరికా భారత్‌ను చూస్తున్నదని ఇంకా స్పష్టంగా చెప్పవచ్చు. అది మన సెక్యులర్ పాలకులకు అభ్యంతరకరంగా తోచడం లేదు. అమెరికా – ఇండియా అణు సహకార ఒప్పందాన్ని ఆ దేశ చట్ట సభల ముందు పెట్టేటప్పుడు, ఇరాన్ విషయంలో భారత్ అమెరికాకు పూర్తి సహకారాన్ని అందిస్తుంది అన్న వాక్యాలు కూడ అందులో చేర్చారుగానీ అది మన పాలకులను ఇరకాటంలో పెడుతుందని మేడమ్ రైస్ చేసిన సూచన మేరకు దానిని తొలగించారు. అయితే ఇరాన్ విషయంలో భారత్ వైఖరి ఏమిటి అనేది అమెరికా అధ్యక్షుడు ఆ దేశ చట్టసభలకు ఎప్పటికప్పుడు తెలియజేస్తుండాలి అన్న షరతు పెట్టారు.

కాబట్టి 'మనకు' ఏం వచ్చినట్టు ఈ ఒప్పందం నుండి? అణుశక్తి వాడకం మరింత పెరగబోతుంది – విద్యుత్ ఉత్పత్తి కోసం, వేరే పారిశ్రామిక అవసరాల కోసం. ఇది ఏమంత మంచిది కాదు. అమెరికా కళ్ళుగప్పి భారత్ ఈ అవకాశాన్ని అణ్వస్త్ర అభివృద్ధికి కూడ వాడుకునే పక్షంలో భారత పాలకుల చేతిలో అణ్వాయుధాలు పెరుగుతాయి. అదీ ఏమంత మంచిది కాదు. అంతర్జాతీయ రాజకీయాలలో అమెరికా భద్రతా ప్రయోజనాలను పరిరక్షించే ఎత్తుగడలకు భారత్ అనుకూలంగా వ్యవహరించడం జరుగుతుంది. ఇది అస్సలే మంచిది కాదు. మరి మనం – అంటే అణు సాంకేతిక రంగ నిపుణులూ, అధికారులూ కాని భారతీయులం ఎందుకు సంతోషించాలి?

*ప్రజాతంత్ర వారపత్రిక*

*10 డిసెంబర్ 2006*




# పోలండ్ కార్మికోద్యమం

పోలండ్ కార్మికోద్యమం 1956లో ప్రారంభమై ఇప్పటికి మూడు నాలుగు వెల్లువలను చూసింది. 1956లో ఒకసారి, 1970లో రెండవసారి, మూడవసారి 1976 నుండి నిరంతరమయిన అలజడి, మళ్ళీ 1980 ఆగస్టు నుండి సాలిడారిటీ సంస్థ నాయకత్వాన దాదాపు సంవత్సరన్నర పోరాటం నడిచాయి. చివరి దశ 1981 డిసెంబరు 13న ప్రధానమంత్రి జరుజెల్స్కి విధించిన సైనికపాలనతో ఒక కొలిక్కి వచ్చింది. ఇక ముందు ఏం జరగబోతుందని ఊహాగానాలు చేయడం కంటే ఆ ఉద్యమాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం.

ఇక్కడ రెండు పొరపాట్లకు అవకాశం ఉంది. ఒకటి ఉద్యమాన్ని రివిజనిస్టు దృక్పథంతో అర్థం చేసుకోవడం, రెండు ఉదారవాద దృక్పథంతో అర్థం చేసుకోవడం. ఉద్యమం గురించి అందే సమాచారం అంతా కూడ సోవియట్ అనుకూల పత్రికల నుండో లేక పాశ్చాత్య పత్రికల నుండో రావడం వల్ల, ఈ రెండు పొరపాట్లలో ఏదో ఒకటి చేయక తప్పడం లేదు చాలామందికి. సోవియట్ అనుకూల పత్రికలది రివిజనిస్టు దృక్పథం అయితే, పాశ్చాత్య పత్రికలది స్వతహాగా ఉదారవాద దృక్పథం కాకపోయినా ఉదారవాదులను ఆకట్టుకునే పదజాలం, సిద్ధాంతాలను అవి చాలా తెలివిగా ప్రయోగిస్తాయి.

ఈ రెండు పొరపాట్లూ చేయకుండ స్పష్టమయిన మార్క్సిస్టు దృక్పథంతో ఆ ఉద్యమాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం.

పాశ్చాత్య పత్రికలు, వాటిని అనుసరించే మన దళారీ బూర్జువా పత్రికలు ప్రచారం చేస్తున్న అవగాహన ఈ విధంగా నడుస్తుంది :

1. పోలండ్‌కు, రష్యాకు తరతరాలుగా విరోధం ఉంది. ఆధునిక పోలండ్ చరిత్రలో అధికభాగం జారిస్టు రష్యా నుండి తన్ను తాను కాపాడుకునే ప్రయత్నంలో గడిచింది. అక్కడ సోషలిజం కూడ స్టాలిన్ సైన్యాలు నెలకొల్పినదే కాబట్టి, పోలండ్ ప్రజల దృష్టిలో సోషలిజం అంటే రష్యా ఆధిపత్యమే. ఇప్పటి కార్మికోద్యమం కూడ రష్యా వ్యతిరేక తిరుగుబాటే.

2. అసలు సోషలిజం పోలండ్ ప్రజలకు ఇష్టం లేదు. ఎందుకంటే సోషలిజం అసలు ఏ ప్రజలకూ (ప్రాచ్య మూర్ఖత్వంలో మునిగిపోయిన ఏ చైనా, వియత్నాం రైతులనో మినహాయిస్తే.) ఇష్టం వుండదు కాబట్టి. పైపెచ్చు పోలండ్ ప్రజలు క్రిస్టియన్ మతాన్ని అనుసరించే వాళ్ళు కాగా, సోషలిజం మనిషికి తిండి బట్ట ఇల్లు వుంటే చాలునని అతన్ని పశువు స్థాయికి దిగజారుస్తుంది కాబట్టి.

ఇందులో మొదటి పాయింటులో కొంత నిజం వుంది. భౌగోళికంగా రష్యా, ప్రష్యా, ఆస్ట్రియా రాజ్యాల మధ్య ఇరుక్కున్న పోలండ్ ఆ రాజ్యాల విస్తరణ కాంక్షకు బలి అయిన మాట వాస్తవమే. ముఖ్యంగా 18వ శతాబ్దంలో రష్యాను కేథరీన్ రాణి, ప్రష్యాను ఫ్రెడెరిక్ చక్రవర్తి పరిపాలించిన రోజులలో వాళ్ళు పోలండ్‌ను రొట్టెముక్క పంచుకున్నట్టు పంచుకున్నారు. ఈ శతాబ్దంలో హిట్లర్ తన ప్రపంచాధిపత్య వ్యూహంలో మొదటి మెట్టుగా పోలండ్‌ను ఎంచుకున్నాడు.

రెండవ ప్రపంచ యుద్ధంలో హిట్లర్ ఓడిపోవడంతో అన్ని తూర్పు యూరప్ దేశాలలో లాగే పోలండ్‌లో కూడ ఖాళీ ఏర్పడింది. ఈ ఖాళీని అక్కడి సోషలిస్టు పార్టీలు రెడ్ ఆర్మీ సాయంతో భర్తీ చేసాయి. సామ్రాజ్యవాద సైన్యాల జోక్యం వలన ఈ సాయం అవసరమయింది.

ఇంతవరకు నిజమేగాని, పోలండ్‌లో సోషలిజానికి ఆదరణ లేకపోలేదు. ఇతర తూర్పు యూరప్ దేశాలలోలాగే పోలండ్‌లో కూడ భూస్వామ్యవర్గం 20వ శతాబ్దం

వరకూ కూడ బలంగా నిలిచింది. సోషలిస్టు విప్లవానంతరం ఏర్పడ్డ పోలండ్ ఐక్యకార్మికపార్టీ ప్రభుత్వం భూసంస్కరణలు ప్రవేశపెట్టి రైతులకు భూములపై యాజమాన్యం కలుగజేయడంతో ఆ భూస్వామ్యవర్గం నశించింది. అదే సమయంలో కొత్త ప్రభుత్వం పారిశ్రామిక ఉత్పత్తి సాధనాలను తన చేతిలో కేంద్రీకరించుకుని దేశాన్ని ప్రణాళికాబద్ధంగాను, వేగంగాను పారిశ్రామీకరించింది. 1940లో దేశ శ్రామిక జనాభాలో పారిశ్రామిక కార్మికులు 40 శాతం మాత్రమే కాగా 1975 నాటికి ఇది 77కు పెరిగింది. (మన దేశంలో ఈ నిష్పత్తి ఈ శతాబ్దం మొదట్లో 10 శాతం లోపు. ఇవ్వాళ కూడ 10 శాతం లోపే.)

ఇదంతా పోలండ్ ప్రజలకు అక్కడి వ్యవస్థ పట్ల సద్భావం కలిగించలేదని అనుకోలేం. అందుకే వాళ్ళు సోషలిజాన్ని కేవలం సోవియట్ రష్యా ఆధిపత్యంగా చూసారని నమ్మడం కష్టం. సోవియట్ రష్యా 'పరస్పర ఆర్థిక సహకారం' (Mutual Economic Assistance) పేరిట తూర్పు యూరప్ దేశాలను ఆర్థికంగా లోబరచుకున్న మాట వాస్తవమే కాని ప్రణాళికాబద్ధమయిన ఆర్థికవ్యవస్థ సాధించగల ప్రగతి చాటున ఈ దోపిడీ ఫలితం పోలండ్ ప్రజలకు కనిపించలేదంటే ఆశ్చర్యం కాదు. అయితే ఈ దోపిడీ కంటే ప్రత్యక్షమయిన రాజకీయ ఆధిపత్యాన్ని పోలండ్ ప్రజలు ఎక్కువ నిరసిస్తూ వచ్చారు. సోషలిజం పట్ల సద్భావమూ, రష్యా ఆధిపత్యం పట్ల నిరసనా రెండూ కలిసే వున్నాయన్నది ఈనాటి పోలండ్‌కు సంబంధించిన అతి ముఖ్యమయిన విషయాల్లో ఒకటి.

పోతే, క్రిస్టియన్ మతాభిమానులయిన పోలండ్ ప్రజలకు భౌతికవాద మార్క్సిజం పట్ల ద్వేషం వున్నదన్న వాదన నిజానికి కొత్తది కాదు. 1917లో రష్యా విప్లవం జరిగిన నాటి నుండి పాశ్చాత్య 'పరిశీలకులు' కమ్యూనిస్టులు పాలిస్తోన్న దేశాలలో ప్రజలను మతం రక్షించి మళ్ళీ పెట్టుబడిదారీ కూటమిలోకి తెస్తుందని కలలు కంటూనే వున్నారు. ఈ మధ్య ఇరాన్‌లో ఇస్లాం మతం బ్యానర్ కింద సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం జరిగినప్పుడు ఇక సోవియట్ రష్యాలోని ముస్లింలు కూడ తిరగబడతారని, ముస్లిం మత పునరుద్ధరణవాదం కమ్యూనిజాన్ని దెబ్బతీస్తుందని అత్యుత్సాహంతో పాశ్చాత్యులు, కొందరు తిరోగామి ముస్లింలు సైతం ఊహాగానాలు చేసారు. అయితే అరవైఏళ్ళ ప్రణాళికాబద్ధ అభివృద్ధి సోవియట్ ముస్లింల జీవన

ప్రమాణాన్ని అత్యంతంగా పెంచిందని, ఆఫ్ఘనిస్తాన్‌ను అణచడానికి సోవియట్ సైన్యాలలో వెళ్ళిన సోవియట్ ముస్లింలు అక్కడి తమ తోటి ముస్లింల నికృష్టజీవితాన్ని చూసి ప్రపంచంలో ఇంత పేదరికం ఉందా అని ఆశ్చర్యపోయారని తెలిసిన తరువాత ఈ ఊహాగానాలు చల్లబడ్డాయి.

ఇక రివిజనిస్టుల విషయం. వీళ్ళ అవగాహన ఈ రకంగా నడుస్తుంది : పోలండ్ సోషలిస్టు దేశం. సోషలిస్టు దేశంలో కార్మిక నియంతృత్వం నడుస్తుంది. కార్మిక నియంతృత్వాన్ని వ్యతిరేకించే వాళ్ళెవరయినా కార్మిక వ్యతిరేకులే, సోషలిస్టు వ్యతిరేకులే. అంటే అమెరికా ఏజెంట్లే. కాబట్టి పోలండ్ కార్మిక ఉద్యమసంస్థ అయిన సాలిడారిటీ నాయకులంతా అమెరికా ఏజెంట్లే. పోలండ్ నాయకులు చాలా పొరపాట్లు చేసిన మాట నిజమే. ముఖ్యంగా, వాళ్ళు సోషలిస్టు ఆర్థిక సూత్రాలను విస్మరించారు. అయితే వాళ్ళు కార్మిక నాయకులు కాబట్టి కార్మికులు నోరుమూసుకుని వాళ్ళను అనుసరించాలిగాని తిరగబడడం సహించరాని విషయం.

ఈ వాదన చాలా లోతయిన ప్రశ్నలు లేవదీస్తుంది. వాటిని క్లుప్తంగానయినా సరే చర్చించాలి. ఆ క్రమంలోనే ఈ ఉద్యమం స్వభావం కూడ బోధపడుతుంది.

**కార్మిక నియంతృత్వం :** కార్మిక నియంతృత్వమంటే ఏమిటి? కార్మికపార్టీ అని పేరు పెట్టుకున్న పార్టీ నియంతృత్వమా? ఆ పార్టీ దిగజారితే అప్పుడేమవుతుంది? దిగజారిందీ లేనిదీ తెలుసుకోవడానికి ఏమయినా ప్రమాణాలున్నాయా?

పాలకవర్గం అంటే ఉత్పత్తి సాధనాలపైన ఆధిపత్యం ఉన్న వర్గం. వర్గ సమాజంలో ఉత్పత్తి సాధనాలు ఎవరి చేతిలో వుంటాయో రాజకీయాధికారం ఆ వర్గం చేతిలో వుంటుంది. అంటే ఆ వర్గనియంతృత్వం నడుస్తుంది. సోషలిజం కూడ వర్గ సమాజమే. అక్కడ కార్మిక నియంతృత్వం నడవాలంటే కార్మికులకు ఒక వర్గంగా ఉత్పత్తి సాధనాల మీద సమిష్టి యాజమాన్యం ఉండాలి. ఉత్పత్తి సాధనాల మీద నిజమైన యాజమాన్యం ఉండాలంటే యావత్ ఉత్పత్తి రంగం మీదా ఉండాలి. అంటే ఉత్పత్తి క్రమం మీద, పంపిణీ నిర్వహణ మీద, మారకం మీద, అన్నిటికంటే ముఖ్యంగా ప్రణాళికలను రూపొందించడంలోను, అమలు జరపడం లోను కార్మికవర్గానికి సమిష్టి నియంత్రణాధికారం వుండాలి.

ఇది సాధ్యమా? సాధ్యం కాదంటే కార్మిక నియంతృత్వం కూడ సాధ్యం కాదని, సోషలిజం కూడ సాధ్యం కాదని అంగీకరించాలి. అంటే మార్క్సిజాన్ని నిరాకరించాలి. కాని ఇది సాధ్యమే. అయితే ఒక్కరోజులో కాదు. భూస్వామ్యవర్గాన్ని మట్టుబెట్టి అధికారంలోకి వచ్చిన పెట్టుబడిదారీ వర్గానికీ, పెట్టుబడిదారీ వర్గాన్ని ఓడించి అధికారంలోకి వచ్చే కార్మిక వర్గానికీ ఒక ముఖ్యమయిన తేడా వుంది. పెట్టుబడిదారీ వర్గం భూస్వామ్య సమాజం మధ్యనే సాంస్కృతికంగాను, రాజకీయంగాను పరిణతి చెంది, అధికారం చెలాయించగల స్థాయికి ఎదిగిన తరువాతే అధికారానికి వస్తుంది. కాని కార్మిక వర్గం ఆ అభివృద్ధిని అధికారానికి వచ్చిన తరువాతే సాధించాలి. అయితే అది తప్పక సాధిస్తుందనడానికి మన దేశ కార్మికులను ఈనాటి పోలండ్ ఉద్యమకారులతో పోల్చిచూస్తే చాలు. పోలండ్ కార్మికులు తాము పనిచేసే ఫ్యాక్టరీల నిర్వహణలో తమకు అధికారం కావాలని – అంటే ఒక ఫ్యాక్టరీ ఎంత ఉత్పత్తి చేయాలి, ఏం ఉత్పత్తి చేయాలి, ఎంతకు అమ్మాలి, ఇత్యాది విషయాలు నిర్ణయించడంలో అక్కడ పనిచేసే కార్మికుల ప్రమేయం వుండాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఇదే సోషలిజమని ఎవ్వరూ భ్రమపడకూడదు. ఏ ఫ్యాక్టరీలోని కార్మికులకు ఆ ఫ్యాక్టరీని నడపడంలో అధికారం లభిస్తే – అప్పుడు వివిధ ఫ్యాక్టరీలలోని కార్మికులు సమిష్టి పెట్టుబడిదార్లు మాత్రమే అవుతారు. ఎందుకంటే వాళ్ళు ఒకరితో ఒకరు పోటీపడక తప్పదు. అధిక లాభాల కోసం సరుకుల ఉత్పత్తి కొనసాగించకా తప్పదు. (యుగొస్లావియాలో నడుస్తున్నది ఈ రకం 'సోషలిజమే', అందుకే అక్కడ ఏ సోషలిస్టు దేశంలోను ఉండకూడని నిరుద్యోగం, ద్రవ్యోల్బణం ఇత్యాది ఉండడం.) అయినప్పటికీ ఈ డిమాండు కార్మికుల సాంస్కృతిక పరిణతినీ, ఆత్మస్థైర్యాన్నీ చూపుతుంది. నిజమైన కార్మిక నియంతృత్వం వెర్రి ఊహ కాదని నిరూపిస్తుంది.

అయితే కార్మికులు ఆర్థికరంగాన్ని సమిష్టిగా నియంత్రించగల స్థాయికి ఎదగాలంటే చాలాకాలం పడుతుంది. అంతవరకు ఏం చేయాలి? అంతవరకు కార్మిక అగ్రగామి పార్టీ నియంతృత్వం నడుస్తుంది. అయితే ఈ నియంతృత్వపు ప్రధాన కర్తవ్యం కార్మికులను పార్టీ నియంతృత్వం స్థానాన వర్గ నియంతృత్వం నిర్వహించగలందుకు తర్ఫీదు చేయడం. అందులో ఒక ముఖ్యమయిన అంశం – ఆర్థికరంగంలో పార్టీ తేవాలని చూస్తున్న మార్పులను కార్మికులతో చర్చించడం, వాళ్ళను

విద్యావంతుల్ని చేయడం, వారి సలహాలను సమ్మతిని పొందడం. ఇది దాని కనీస కర్తవ్యం.

కాని ఈ కనీస కర్తవ్యాన్నే పోలండ్ పార్టీగాని, ఏ తూర్పు యూరప్ (రష్యాతో సహా) పార్టీగాని ఎన్నడూ నిర్వహించలేదు. వాళ్ళ రివిజనిస్టు దృష్టిలో సోషలిజం అంటే వాళ్ళ నియంతృత్వమే. ఆ నియంతృత్వం కొన్నాళ్ళు సాగిన తరువాత 'కమ్యూనిజం' అనబడేది ఆకాశం నుండి ఊడి ఒళ్ళోపడుతుందనుకుంటారు. సోవియట్ దొరలయితే ఆ కష్టం కూడ అవసరం లేకుండ అప్పుడే తమది 'ప్రజలందరి రాజ్యం' (State of the whole peole) అని ప్రకటించుకున్నారు. ఇక కమ్యూనిజం దేనికి?

ఈ దృక్పథంతో పోలండ్ పార్టీ నిర్వహించిన 'కార్మిక నియంతృత్వాన్ని' పరిశీలిద్దాం. మొదట రైతాంగానికి ఆమోదనీయమయిన భూసంస్కరణలు ప్రవేశపెట్టారు. అటు తరవాత సమిష్టి వ్యవసాయాన్ని ప్రవేశపెట్టేటప్పుడు ధనిక రైతాంగాన్నీ, పేద రైతాంగాన్నీ వేరు చేసి పేదరైతాంగానికి విషయాన్ని వివరించి వారి మద్దతుతో ప్రవేశపెట్టకుండ, మీది నుండి సమిష్టి వ్యవస్థను రైతాంగం పైకి రుద్దారు. రైతాంగం సహకరించకపోయేసరికి భయపడ్డారు. 1956లో గోముల్కా పార్టీ సెక్రటరీ అయిన తరువాత అసలు సమిష్టి వ్యవసాయాన్ని ఏర్పరచే ప్రయత్నాన్నే విరమించుకున్నారు. ఇవ్వాళ పోలండ్‌లో 83 శాతం వ్యావసాయిక భూభాగం ప్రైవేటురంగంలో వుంది. అటువంటప్పుడు ఎన్ని కంట్రోళ్ళు పెట్టినా ఆర్థిక సంక్షోభాన్ని నివారించడం కష్టం. ఎంతటి రాజకీయ చాకచక్యాన్ని ప్రదర్శించినా రైతాంగానికి, ఇతర ప్రజలకు వైరుధ్యాలు రాకుండ చూడడం కష్టం. సోషలిస్టు సమాజంలో వైరుధ్యాలుండవని ప్రకటిస్తే చాలదు. వాటికి వస్తుగత భూమిక (objective basis) లేకుండ చేయాలి.

తరువాత పారిశ్రామీకరణ, ఆధునీకరణ మొదలుపెట్టారు. ముఖ్యంగా గోముల్కా స్థానంలో 1970లో పార్టీపై పెత్తనం సంపాదించుకున్న గైరెక్ నాయకత్వాన 1970-76ల మధ్య ఇవి రెండూ అతి వేగంగా సాగాయి. పారిశ్రామీకరణయినా, ఆధునీకరణయినా వాటంతటవి ఆహ్వానించదగ్గవే. కాని వాటిని సాధించిన పద్ధతే అభ్యంతరకరమయినది. దాని వల్ల రాగల పర్యవసానాలను వారు గుర్తించలేదు. గుర్తించిన మేరకు కూడ కార్మికులతో చర్చించి, వారిని విద్యావంతుల్ని చేసి, వారి సలహా తీసుకోలేదు. ఆధునీకరణ కోసం పాశ్చాత్య దేశాల నుండి 25 బిలియను

డాలర్లు (దాదాపు 20 వేల కోట్ల రూపాయలు) అప్పు తెచ్చుకున్నారు. అస్థిరమయిన పెట్టుబడిదారీ మార్కెట్ నుండి ఇంత పెద్ద మొత్తం అప్పు తెచ్చుకుంటే ప్రమాదకరమని పోలండ్ 'మార్క్సిస్టు' మేధావులకు తోచలేదు. వీళ్ళకు పెట్టుబడిదారీ వ్యవస్థ స్థిరత్వం పట్ల చాలా గట్టి నమ్మకం ఉన్నట్లుందని చాలామంది పరిశీలకులు వ్యాఖ్యానించారు కూడ. రివిజనిస్టుల నోటిలో మార్క్సిజం చిలకపలుకులతో సమానం అనడానికి ఇంతకంటే మంచి నిదర్శనం లేదనుకుంటాను.

వీళ్ళ నమ్మకాలెట్లాగున్నా దాదాపు పదేళ్ళుగా ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో చాలా తీవ్రమయిన సంక్షోభం నడుస్తోంది. ఆ సంక్షోభమే పోలండ్‌లో కూడ సంక్షోభాన్ని తెచ్చిపెట్టింది. తీసుకున్న 20 వేల కోట్ల రూపాయల అప్పుకు వడ్డీ చెల్లించాలి. వడ్డీ చెల్లించాలంటే విదేశీమారకం సంపాదించాలి. విదేశీమారకం సంపాదించాలంటే సరుకులను పాశ్చాత్య మార్కెట్‌కు ఎగుమతి చేయాలి. అయితే సంక్షోభంలో ఇరుక్కున్న పాశ్చాత్య మార్కెట్‌లో కొనేవాళ్ళు తక్కువ కాబట్టి అక్కడి సంస్థలతో పోటీపడి పారిశ్రామిక ఉత్పత్తులను అమ్మడం కష్టం. అటువంటప్పుడు ఆహారపదార్థాలను ఎగుమతి చేయవలసి వస్తుంది. చేసారు. దేశంలో డిమాండును అదుపులో వుంచడం కోసం ఆహారపదార్థాల ధరలు పెంచారు. ఒక్క 1980 జూలై నెలలోనే మాంసం ధర 40 నుండి 80 శాతం వరకు పెరిగింది. (ఈ ధరల పెరుగుదలకు పోలండ్‌కు అప్పులిచ్చిన పాశ్చాత్యుల ఒత్తిడి కూడ ఒక కారణం. ఈ విషయాన్ని మాత్రం పోలండ్ ప్రజల కోసం మొసలికన్నీళ్ళు కారుస్తోన్న పాశ్చాత్య పత్రికలు ఎన్నడూ చెప్పవు.) ఇదంతా ఎందుకు జరిగిందో ప్రజలకు తెలియకపోవడం చేత, వాళ్ళతో ఎవ్వరూ చర్చించిన పాపాన పోకపోవడం చేత వాళ్ళు తిరగబడ్డారు. జనాభాలో అత్యధికులయిన కార్మికులు సహజంగానే ముందు నిలిచారు.

పెట్టుబడిదారీ అస్థిరత్వాన్ని తక్కువగా అంచనా వేయడం మాత్రమే కాకుండ తీసుకోబూనుకున్న చర్యలను కార్మికులతోనూ ప్రజాసామాన్యంతోను చర్చించడం, వారి సలహా తీసుకోవడం మొదలయిన కనీస సోషలిస్టు కర్తవ్యాలను విస్మరించడం వల్లనే ఇది జరిగింది.

ఇంతవరకూ బహుశా రివిజనిస్టులలో కొందరు (సి.పి.ఐ(ఎం) వంటివారు) అంగీకరించవచ్చు. కాని దీనికి కారణం కేవలం మతిమరుపా, అజ్ఞానమా లేక వేరే

ఏదయినా వుందా అని మాత్రం వాళ్ళు ఆలోచించరు. అసలు విషయం ఏమిటంటే, రష్యా మొదలుకొని అన్ని తూర్పు యూరప్ దేశాలలోను కార్మికుల పేరిట అధికారం కైవసం చేసుకున్న వారిలో (పార్టీలోను, ప్రభుత్వ అధికారులలోను, సాంకేతిక నిపుణుల లోను) ఒక కొత్త వర్గం ఏర్పడింది. ఈ వర్గం సోషలిజాన్ని తన అవసరాలకు లొంగదీసుకుంది. అది పాశ్చాత్య దేశాల జీవన విధానం పట్ల తనకు మోజు ఏర్పడ్డ నాడు ఆధునీకరణకు పూనుకుందేగాని ప్రజల అవసరాల దృష్ట్యా కాదు. అతివేగంగా నడిచే కార్లు, ఇంటింటా రెఫ్రిజిరేటర్లు వుంటే 'ఎంచక్కా' వుంటుందనిపించి ఆర్థిక రంగాన్ని ఆధునీకరించారు. నష్టం ప్రజలకే లెమ్మని వాటి కోసం 25 బిలియను డాలర్ల అప్పు తెచ్చుకున్నారు. ధనిక రైతాంగం సమిష్టి వ్యవసాయాన్ని ఎదిరిస్తే వీళ్ళతో గొడవలు ఎందుకులెమ్మని మీ యిష్టమే కానిమ్మన్నారు. వారిది బూర్జువా దృక్పథం కాబట్టే పెట్టుబడిదారీ వ్యవస్థ నిరంతరం సంక్షోభాలకు లోనై నడుస్తుందన్న ప్రాథమిక మార్క్సిస్టు సూత్రాన్ని విస్మరించి పాశ్చాత్య మార్కెట్‌తో పోలండ్ ఆర్థిక వ్యవస్థకు బలంగా లంకె వేసారు. (పోలండ్ విదేశీ వ్యాపారంలో 40 శాతం పాశ్చాత్య దేశాలతోటిదే.) వారిది స్వార్థపర వర్గదృక్పథం కాబట్టే కార్మికవర్గాన్ని కార్మిక నియంతృత్వ పాలన కోసం తర్ఫీదు చేయడంగాని, కనీసం దేశ ఆర్థికరంగానికి సంబంధించిన విషయాలు అగ్రగామి కార్మికులతో చర్చించడంగాని చేయలేదు. ఈ సంక్షోభాన్ని కొత్త బూర్జువావర్గ స్వార్థం దేశానికి తెచ్చిపెట్టిన సంక్షోభంగా అర్థం చేసుకుంటే తప్ప ఈ 'పొరపాట్లు' ఎందుకు జరుగుతున్నాయో, ఎంతకాలం జరుగుతాయో, ఎంతమంది అమాయకులయిన 'అమెరికా ఏజెంట్ల'ను ఈ 'పొరపాట్ల'కు బలిపెడతారో తెలీదు. (1970లో కార్మిక తిరుగుబాటు జరిగినప్పుడు కొన్ని వందల మందిని కాల్పులలో చంపారు.)

## సోషలిజం

రెండవ ప్రశ్న, అసలు సోషలిజం అంటే ఏమిటి అన్నది. కార్మిక నియంతృత్వం కింద, కార్మిక నియంతృత్వపు మొదటి దశ అయిన కార్మికపార్టీ పాలన కింద నడిచేది సోషలిజం. ఈ సోషలిజం పరిణామదశ. సమాజాన్ని వర్గసమాజం నుండి వర్గరహిత సమాజం వైపు కార్మిక నియంతృత్వం కింద నడిపించే దశ. ఈ పరిణామ దశను అంచనా వేసేటప్పుడు ఆ పరిణామాన్ని అది సాధిస్తోందా లేదా అన్నదే ప్రమాణం

అవుతుంది. అంటే 'పోలండ్ సోషలిస్టు దేశం కాబట్టి ఉద్యమకారులు సోషలిస్టు వ్యతిరేకులు' అని ప్రకటించేవారు అసలు పోలండ్ వర్గరహిత సమాజం వైపు నడుస్తోందా లేదా అని ముందు అంచనా వేయాలి. అంటే ఆ దేశంలో అసమానత, అస్థిరత, మూఢత్వం, అజ్ఞానం తగ్గుతున్నాయా, స్త్రీల పట్ల తరతరాలుగా వస్తోన్న చులకన భావం తగ్గుతోందా, అన్నిటికంటే ముఖ్యంగా ప్రజలు నిజమయిన స్వేచ్ఛ వైపు నడుస్తున్నారా అని చూడాలి. నిజమయిన స్వేచ్ఛ బూర్జువా స్వేచ్ఛా కాదు, రివిజనిస్టు స్వేచ్ఛా కాదు. మనిషికి వాక్‌స్వాతంత్ర్యం, సభాస్వాతంత్ర్యం వుంటే అదే స్వేచ్ఛ అంటుంది బూర్జువా దృక్పథం. కడుపుకు తిండి, జీవితానికి భద్రత లేనివాడు ఈ స్వాతంత్ర్యాలను వినియోగించుకోలేడు కాబట్టి అది బూటకపు స్వేచ్ఛ అన్న వాదన అందరికీ తెలిసిందే. అంతేకాదు, జీవితానికి భద్రత ఉన్నవాళ్ళకు కూడ బూర్జువా స్వేచ్ఛ స్వేచ్ఛ కాదు; తన జీవితాన్ని, తాను నివసిస్తున్న సమాజ జీవితాన్ని రూపొందించుకునే స్వేచ్ఛే నిజమయిన స్వేచ్ఛ. కాని బూర్జువా సమాజంలో తమ జీవితాల్ని రూపొందించుకునే స్వేచ్ఛ ప్రజలకు లేదు. పదిమంది పెట్టుబడిదార్ల స్వార్థం జనం జీవితాల్ని రూపొందిస్తుంది. ఇవ్వాళ మన దేశంలో యువతకు మానవత్వపు విలువలు నేర్పాలా, అమానుషత్వపు విలువలు నేర్పాలా అని నిర్ణయించేది వాళ్ళను పెంచిన తల్లిదండ్రులు కాదు, వాళ్ళకు చదువు చెప్పే పంతుళ్ళూ కాదు; తమ లాభాల కోసం లంపెన్ సంస్కృతిని ప్రచారం చేస్తున్న సినిమా పెట్టుబడిదారులు, వ్యాపార పత్రికల యజమానులు. రేపటి సామాజిక వాతావరణాన్ని నిర్ణయించేది వీళ్ళేగాని, వాక్ సభా స్వాతంత్ర్యాలున్న ప్రజాసామాన్యం కాదు. మనిషిని పెట్టుబడిదారీ ఆర్థిక సంబంధాలతో బంధించి, నీ యిష్టం వచ్చినంతగా కేకలు పెట్టే స్వేచ్ఛ నీకు ఉందంటుంది బూర్జువా సమాజం. అదే బూర్జువా స్వేచ్ఛ.

రివిజనిస్టు స్వేచ్ఛ మరొక రకం బూటకం. దీన్ని నిర్వచించడానికి మాస్కో తాత్వికులు ప్రయత్నించారో లేదో నేనెరుగనుగాని, వారి అనుచరులు కొందరు అంతటి సాహసమూ చేసారు. 'మానవుడికి కొన్ని అవసరాలున్నాయని గుర్తించి వాటిని తీర్చడమే స్వేచ్ఛ' అని తెలుగుదేశపు రివిజనిస్టు మేధావులలో అగ్రగణ్యుడయిన ఏటుకూరి బలరామమూర్తి గారు అన్నారు (భారతీయ తత్వశాస్త్రం పేజీ 226). అంటే పరిపాలించే పార్టీ అందరికీ తిండీ, బట్టా, ఇల్లూ, ఉద్యోగం ఇస్తుంది. చదువుకోవడానికి అబద్ధాలతో నిండిన పత్రికలు ప్రకటిస్తుంది, చూడడానికి చరిత్రను వక్రీకరించే సినిమాలు

ప్రదర్శిస్తుంది, వీటన్నిటినీ అనుభవిస్తూ గానుగెద్దుల్లా జీవించడమే రివిజనిస్టు స్వేచ్ఛ అని అర్థం.

నిజమయిన స్వేచ్ఛ సుప్రసిద్ధమయిన ఎంగెల్స్ సూక్తితో ప్రారంభమవుతుంది. 'ఆవశ్యకతను అంగీకరించడమే స్వేచ్ఛ' (freedom is the recognition of necessity). తాను నివసిస్తున్న ప్రపంచానికి ఒక వస్తుగత స్వభావం ఉందని మనిషికి తెలియాలి. ఆ వస్తుగత స్వభావాన్ని ('ఆవశ్యకత'ను) అధ్యయనం చేసి అర్థం చేసుకోవాలి. (అందరూ అధ్యయనం చేయాలి, అందరూ అర్థం చేసుకోవాలి, పార్టీ సైద్ధాంతికుడు కామ్రేడ్ సుస్లోవ్ చేసుకుంటే చాలదు.) అర్థం చేసుకుని, దానికి అనుగుణంగా తన ఆశయాలను మలచుకుని వాటిని సాధించే క్రమంలో సచేతనంగా పాల్గొనాలి. ప్రపంచపు వస్తుగత స్వభావాన్ని అనుసరించి దాన్ని నిరంతరం మార్చే క్రమంలో నలుగురితో కలిసి సచేతనంగా కృషి చేయగలగడమే నిజమైన స్వేచ్ఛ. ప్లాట్‌ఫారం మీద నుండి ఉపన్యాసాలు ఇవ్వడమూ కాదు, కడుపునిండా తిండి తిని గొంగళి పురుగులా పడి ఉండడమూ కాదు.

కాబట్టి ఇవ్వాళ పోలండ్ కార్మికోద్యమాన్ని సోషలిస్టు వ్యతిరేక ఉద్యమంగా చిత్రిస్తున్న వారు  వేసుకోవలసిన ప్రశ్న – అసలు పోలండ్ ఇవన్నీ సాధిస్తోందా అన్నది, అసమానత, అస్థిరత తగ్గాయా అన్నది. 85 శాతం వ్యావసాయిక భూభాగం ప్రైవేటు చేతుల్లో వున్నప్పుడు అసమానత మీద కంట్రోలు ప్రభుత్వానికి ఎట్లా వుంటుంది? పెట్టుబడిదారీ మార్కెట్‌తో అంత బలమయిన సంబంధం వున్న ఆర్థిక వ్యవస్థ అస్థిరత నుండి ఎట్లా తప్పించుకుంటుంది? పోనీ అక్కడేమైనా అజ్ఞానం, మౌఢ్యం తగ్గాయా? తగ్గివుంటే క్రిస్టియన్ మత ప్రాబల్యం రోజురోజుకూ ఎందుకు పెరుగుతుంది? అక్కడ స్త్రీల పట్ల వర్గ సమాజ దృక్పథం క్షీణిస్తోందా? క్షీణిస్తోంటే తూర్పు యూరప్ దేశాలన్నిటిలోను కేబరేలకు, నైట్ క్లబ్బులకూ అంత ఆదరం ఎందుకు? (ఒక రష్యా పార్టీ మహిళ ఒక తూర్పు యూరప్ దేశంలోని కేబరేలను చూసి 'దీన్ని మీరు సోషలిజం అంటారా?' అని ఆశ్చర్యం వెలిబుచ్చిందట. అయితే ఈ రకం 'సరదాలు' రష్యాకు కూడ పాకుతున్నట్టు తెలుస్తోంది.) చివరిగా, అక్కడ ప్రజలు నిజమయిన స్వేచ్ఛ వైపు పయనిస్తున్నారా? అసలు స్వేచ్ఛను గురించి బలరామమూర్తిగారి స్థాయిని దాటే అవగాహనే లేని పార్టీలు నిజమయిన స్వేచ్ఛ వైపు ప్రజలను ఏ రకంగా నడపగలుగుతాయి?

**ఉద్యమ స్వభావం :** సారాంశంలో ఈనాటి పోలండ్ కార్మికోద్యమం ఆ దేశంలో కొత్తగా ఏర్పడ్డ వర్గవ్యవస్థ సృష్టించిన సంక్షోభాల ఫలితమేగాని, సోషలిస్టు వ్యతిరేక ఉద్యమం కాదు. ఎందుకంటే పోలండ్‌లో సోషలిజమే (అంటే కమ్యూనిజం వైపు నడిచే పరిణామదశ) లేదు. అలాగని ఈ ఉద్యమం సోషలిజాన్ని స్థాపించడం కోసమూ జరగడం లేదు. అది కేవలం ఆర్థికవాదం (economism) మీద నడుస్తోంది. ఒక పత్రికా విలేఖరి ఒక పోలండ్ కార్మికుడితో 'మీరు నిజమయిన కార్మిక నియంతృత్వం కోసం పోరాడుతున్నారు' అంటే అతను సమాధానంగా 'కార్మిక నియంతృత్వం సంగతి దేవుడెరుగు, మాకు ధరలు తగ్గితే చాలు' అన్నాడట. ఉద్యమం మీద మతం ప్రభావం కూడ బలంగానే ఉంది. పోలండ్ కార్మికుల మీద చర్చికి ఉన్న ప్రభావాన్ని గురించి పాశ్చాత్య పత్రికలు విపరీతమయిన అతిశయోక్తులు ప్రచారం చేస్తోన్న మాట వాస్తవమే (వాటి నకిలీ ఉదారవాదానికి మధ్యయుగాల మతం ఎన్నడూ ఆటంకం కాలేదు) అయినప్పటికీ దాని ప్రభావం బలంగా ఉన్న మాట కాదనలేం. ఈ ప్రభావం అన్ని రకాలా చెడ్డది. అవాస్తవికమయిన సైద్ధాంతిక దృక్పథాన్ని ఏర్పరచడమే కాకుండ, పోరాటాన్ని నీరుగార్చి సర్దుబాటును ప్రోత్సహిస్తోంది. పోలండ్ కార్మికుల పోరాట చరిత్రలో ఆది నుండి కూడ చర్చి 'బాధ్యతాయుతమయిన మధ్యవర్తి' పాత్ర నిర్వహించి వ్యవస్థ దెబ్బతినకుండ చూస్తోంది. పార్టీ చర్చి మైత్రిని కోరడానికి కూడ ఈ సౌకర్యమే కారణం.

ఈ సైద్ధాంతిక దౌర్బల్యం వల్ల పోలండ్ కార్మిక ఉద్యమం ఇంతవరకు పాలక పార్టీ నాయకులను మార్చడం తప్ప మరేమీ సాధించలేకుండ వుంది. 1956లో పొజ్నాన్ పట్టణంలో 50 వేలమంది కార్మికులు జరిపిన తిరుగుబాటు గోముల్కాను పదవికి తెచ్చి, కొత్త సమస్యలను సృష్టించింది. 1970లో ఆహారపదార్థాల ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటు గోముల్కా స్థానంలో గైరెక్‌ను అధికారంలో తెచ్చి మళ్ళీ కొత్త సమస్యలను సృష్టించింది. మొన్న 1980 ఆగస్ట్‌లో వార్సా దగ్గరి ఒక ట్రాక్టరు ఫ్యాక్టరీలో ప్రారంభమైన సాలిడారిటీ సంస్థ నాయకత్వాన సంవత్సరన్నర నడిచిన ఉద్యమం గైరెక్ స్థానంలో కానియాను తెచ్చింది. కార్మికులకు, రైతులకు పార్టీ నుండి స్వతంత్రమయిన యూనియన్లను ఏర్పరచుకునే స్వేచ్ఛను ఇచ్చింది. అయితే ఈ కొద్దిపాటి సంస్కరణను కూడ సహించలేని రష్యా ప్రోద్బలంతో పార్టీ చివరికి సైనికపాలన విధించింది. అందుకు మెచ్చుకోలుగా రష్యా పాలకులు నెల

తిరగక ముందే పోలండ్‌కు 3 వేల కోట్ల రూపాయల అప్పు ఇవ్వడానికి ఒప్పుకున్నారు. (అదే రష్యా సైనికపాలన విధించక ముందు పోలండ్‌లోని అస్థిరపరిస్థితుల దృష్ట్యా ఆర్థిక సహాయం ఇవ్వడం సాధ్యం కాదంది. అంటే అర్థం, కార్మికులను అణచివేస్తేనే 'సోషలిస్టు సహాయం' అనబడే తాయిలం లభిస్తుందని.)

సరయిన సిద్ధాంతమే గనక వుంటే దేశంలో మూడువంతుల ప్రజల సభ్యత్వం వున్న సాలిడారిటీ సంస్థ వియత్నాం ప్రజలు అమెరికా సామ్రాజ్యవాదానికి ఇచ్చినంతటి పోరాటం సోషల్ సామ్రాజ్యవాదానికి ఇవ్వగలదు. (పోలండ్ జనాభా 3 కోట్ల చిల్లర. కార్మికుల సాలిడారిటీ, రైతుల సాలిడారిటీ కలిపి సభ్యత్వం ఒక కోటి పైచిలుకు. ఇది కేవలం సభ్యత్వం మాత్రమే. మద్దతుదార్లను కూడ కలిపితే జనాభాలో సగం కావచ్చు.) విప్లవకర సిద్ధాంతలేమి ఇన్నాళ్ళూ బయటపడలేదుగాని సైనిక పాలన విధించిన తరువాత బయటపడక తప్పదు. తమకు విముక్తిని ఇవ్వగలిగింది మార్క్సిజం మాత్రమేనని – రివిజనిస్టులు సొంతం చేసుకుని గుర్తుతెలియనంతగా వక్రీకరించిన మార్క్సిజం కాదని, విప్లవకర మార్క్సిజమని – పోలండ్ కార్మికులు గుర్తించిన నాడే వాళ్ళకు విముక్తి. అంతవరకు ఈ ముసుగులో గుద్దులాట తప్పదు.

*సృజన మాసపత్రిక*
*ఫిబ్రవరి 1982*

## రష్యా




# చైతన్యం లేని ప్రగతి సోషలిజానికి చేటు

**తూ**ర్పు యూరప్‌లోనూ సోవియట్ రష్యాలోనూ ఇటీవల వచ్చిన మార్పులను తేలికగా తీసిపారేయడం సులభమే; వాటిని అర్థం చేసుకుని గుణపాఠాలు తీసుకోవడమే కష్టం. సోషలిజం విఫలం అయిపోయిందని అంటున్న వాళ్ళకు ఆ అవసరం లేదు. వాళ్ళు సోషలిజం సాధ్యమని ఏనాడూ నమ్మలేదు. ఇప్పుడది విఫలం అయిందని వాళ్ళు ప్రకటిస్తే దానిని ఒక కొత్త అభిప్రాయంగా భావించనవసరమూ లేదు. అయినా, సోషలిజం విఫలం అయిందని బాధపడేవాళ్ళ విమర్శను మార్క్సిస్టులు పట్టించుకోవాలి గానీ సంతోషించే వాళ్ళ అభిప్రాయాలతో మార్క్సిస్టులకేం పని?

బాధపడవలసిన అవసరం ఏమిటంటే, సోషలిజం విఫలం అయితే ఇక ప్రపంచంలో మిగిలింది పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక్కటే. ఇవి రెండూ కాక వేరే వ్యవస్థలు గతంలో ఉన్నాయి గానీ వాటికి కాలం చెల్లిపోయింది. ఇప్పుడు ఈ రెండింటిలో ఒకటి తప్ప వేరే ఏదీ సాధ్యం కాదు కాబట్టి, సోషలిజం విఫలమయిందని అనేవాళ్ళు, ఇకపైన మనం ఎల్లకాలం పెట్టుబడిదారీ వ్యవస్థలో బతకడానికి సిద్ధంగా వున్నామా అన్న ప్రశ్నకు సమాధానం చెప్పాలి. మనుషుల శ్రమను వ్యాపార సరుకుగా మార్చి ఆ సరుకుకు గిరాకీ తక్కువయినప్పుడల్లా కోట్లాది జనాన్ని నిరుద్యోగంలో పడేసే

వ్యవస్థలో ఎల్లకాలం బతకడానికి సిద్ధంగా వున్నామా? మనుషుల శ్రమనే కాక, సకల జీవిత అవసరాలనూ వ్యాపార సరుకులుగా మార్చి డబ్బున్నవాళ్ళ అవసరాలను మాత్రం తీర్చే వ్యవస్థలో కలకాలం బతకడానికి సిద్ధంగా వున్నామా? తన లాభార్జన కోసం మనకు లేని అవసరాలనూ అక్కరలేని కోరికలనూ కల్పించి మనిషిలోని అల్పత్వాన్ని అంతా బజార్లో పెట్టి దానిని సంతృప్తిపరచడం కోసం ప్రకృతిని ధ్వంసం చేసి మనకు ఆరోగ్యమూ మనశ్శాంతీ లేకుండా చేసే వ్యవస్థలో శాశ్వతంగా బతకదల్చుకున్నామా? స్వార్థాన్నీ అవినీతినీ అబద్ధాన్నీ ప్రకృతిసహజమయిన విషయాలుగా భావించి 'ఇది మానవనైజం' అనే నైరాశ్య తత్వాన్ని బోధించే వ్యవస్థలో ఎల్లకాలం బతకడానికి సిద్ధంగా వున్నామా? చివరికి కళను సహితం వ్యాపార సరుకుగా మార్చి మనుషుల బలహీనతలను రెచ్చగొట్టి డబ్బులు చేసుకునే సంస్కృతిని కలకాలం భరించడానికి సిద్ధంగా వున్నామా? స్త్రీలకు పురుషులకూ, కూలివాళ్ళకూ మేధావులకూ, పట్టణాలకూ గ్రామాలకూ మధ్య తరతరాలుగా ఉంటున్న అసమానతలను పోగొట్టే బదులు తన లాభార్జన కోసం కొత్త రూపాలలో వాటిని పునరావృతం చేసే వ్యవస్థలో శాశ్వతంగా బతకదల్చుకున్నామా? అన్ని వస్తువులూ వ్యాపార సరుకులయిపోయిన వ్యవస్థలో మనుషులకు ఒంటరితనమూ, ఆ ఒంటరితనానికి మత్తుపదార్థాలూ మాదకద్రవ్యాలూ తప్ప వేరే పరిష్కారం చూపించలేని సమాజాన్ని ఎల్లకాలం భరించడానికి సిద్ధంగా వున్నామా?

ఈ ప్రశ్నలు ప్రతి ఒక్కరూ తమకు తాము వేసుకొని సమాధానం చెప్పుకోవాలి. ఇట్లా బ్రతకడానికి సిద్ధంగా లేమని సమాధానం చెప్పుకునేటట్టయితే సోషలిజం విఫలం అయిందని కేరింతలు కొట్టడం మానేసి, అది ఎందుకు విఫలం అయిందో ఆలోచించి, తిరిగి సోషలిజాన్ని నిర్మించే ప్రయత్నం విజయవంతంగా జరగాలంటే ఏం చేయాలో ఆలోచించాలి. బోల్షివిక్ విప్లవం జరిగి 70 ఏళ్ళు దాటింది. తూర్పుయూరప్‌లోనూ చైనాలోనూ సోషలిస్టు ప్రభుత్వాలు ఏర్పడి 40 ఏళ్ళు దాటింది. ఈ ప్రభుత్వాలేవీ సోషలిజానికి ద్రోహం చేయాలనే లక్ష్యంతో ఏర్పడలేదు. సోషలిజం సాధించాలనే లక్ష్యంతోనే ఏర్పడ్డాయి. అయినా చివరికి అన్నీ విఫలం అయి పెట్టుబడిదారీ మార్కెట్ ఆధిపత్యానికీ రాజకీయ ఆధిపత్యానికీ దాసోహం అనే స్థితికి దిగజారాయి. గోర్బచెవ్ ఈ పతనాన్ని సిద్ధాంతీకరిస్తున్నాడు. ఈ చరిత్రను సమీక్షించుకొని ఎక్కడ తప్పు జరిగిందో గుర్తించాలి.

సమగ్రమయిన సమీక్ష చేయడానికి ఒక్క వ్యాసం సరిపోదు గానీ, రెండు ముఖ్యమయిన విషయాలు చెప్పాలి. మొదటిది ఆర్థిక వ్యూహానికి సంబంధించినది. రెండవది రాజకీయ నిర్మాణానికి సంబంధించినది. బోల్షివిక్ విప్లవం జరిగిన నాటికి రష్యా పారిశ్రామికంగా చాలా వెనకబడ్డ దేశం. ఆ దేశంలో వేగంగా పారిశ్రామిక ప్రగతిని సాధించడం అవసరం అని సోవియట్ కమ్యూనిస్టులు భావించారు. ప్రజల భౌతిక జీవితాన్ని ఆధునిక సాంకేతిక ప్రక్రియల ప్రాతిపదిక మీద పునర్నిర్మించాలని భావించారు. జోగీ జోగీ రాసుకుంటే రాలేది బూడిదేననీ, గరీబుగాళ్ళ సమానత్వం నిజమయిన సోషలిజం కాదనీ, సుఖవంతమయిన జీవితం గడపడానికి అవసరమైన ఆర్థిక ప్రగతిని సాధించాలనీ అనుకున్నారు. ఈ ఆర్థిక ప్రగతిని సాధించడానికి దేశంలోని భారీ పారిశ్రామికరంగాన్ని చాలా వేగంగా అభివృద్ధి చేశారు. అసాధారణమైన టోకు ఉత్పత్తి పెరుగుదల రేటును సాధించారు. వాడకపు వస్తువుల ఉత్పత్తిని తగ్గించి (తిండి, బట్టలు, ఇళ్ళు, గృహ పరికరాలు, రవాణా సాధనాలు వగైరా), భారీ యంత్రాల ఉత్పత్తి మీద కేంద్రీకరించారు. తూర్పు యూరప్ దేశాలలోనూ సోషలిస్టు ప్రభుత్వాలు ఏర్పడిన తరువాత ఇదే జరిగింది. గనులు, ఇనుము, ఉక్కు కర్మాగారాలు, విద్యుదుత్పత్తి కేంద్రాలు, భారీ నీటిపారుదల ప్రాజెక్టులను పెద్దఎత్తున నిర్మించారు. తూర్పు యూరప్ దేశాలలో యంత్రసామగ్రి ఉత్పత్తి 1950–60 దశాబ్దంలో సగటున 500 శాతం పెరిగింది. జాతీయ ఆదాయంలో పారిశ్రామిక రంగం వాటా 1950 నాటికి 50 శాతం లోపు ఉండింది. 1980 నాటికి ఇది కొన్ని దేశాలలో 80 శాతానికి, జెకస్లోవేకియా, తూర్పు జర్మనీ, పోలండ్ దేశాలలోనయితే 90 శాతానికి పెరిగింది.

ఇదంతా అవసరమే, ఎవరూ కాదనలేరు. అయితే క్రమంగా ఈ అవసరమే సోషలిజం లక్ష్యం అయికూర్చుంది. నూతన సమాజాన్నీ, సామాజిక సమానత్వాన్నీ, ప్రజలు తమ జీవితాలను తామే శాసించుకునే సామాజిక వవ్యస్థనూ నిర్మించే ప్రయత్నం పక్కకు పోయి, ఇంకింత వేగంగా మరింత వేగంగా ఉత్పత్తి రంగాన్ని ముందుకు తీసుకుపోవడమనేది ప్రధాన లక్ష్యం అయింది. అట్లా అని సమానత్వ సాధన కోసం ఏమీ చేయలేదని కాదు. అందరికీ చదువు చెప్పారు. వైద్య సదుపాయాలు కల్పించారు. స్త్రీలకు ఇంటి బయట ఉద్యోగాలు చేసే అవకాశాలు కల్పించారు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించారు. సంస్కృతిలో మానవీయమయిన విలువలను ప్రోత్సహించారు.

అయినప్పటికీ, నూతన సమాజ నిర్మాణాన్ని ఆర్థిక పురోగమనంలో అంతర్భాగమయిన విషయంగా చూడకుండా, సుదూర భవిష్యత్తులో జరిగే ప్రయత్నం గానే భావిస్తూ, ప్రస్తుతానికి అమెరికా, జపాన్ వంటి అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలను ఆర్థిక సాంకేతిక ప్రగతిలో అందుకోవడమే ముఖ్య లక్ష్యంగా ప్రజల ముందు నిలబెట్టారు. ఇంక 15 ఏళ్ళలోనో, 20 ఏళ్ళలోనో అమెరికాను అందుకుంటాం అనేది ఈ ప్రభుత్వాలు ప్రజలకు ఇస్తూ వచ్చిన ముఖ్యమయిన వాగ్దానం. ఇప్పుడు పెరిస్త్రోయికా పేరుతో గోర్బచెవ్ ప్రవేశపెడుతున్న మార్పులలో ఈ తప్పుడు వైఖరి మరింత ప్రబలం అవుతోంది. అమెరికాలో తలసరి ఎన్ని కార్లు వున్నాయి, ఎన్ని కంప్యూటర్లు ఉన్నాయి, రోజుకు ఎన్ని లీటర్ల పెట్రోలు తగలేస్తారు, మనం ఆ స్థాయిని ఎప్పుడు అందుకుంటాం అనేదే ఈ దేశాలలో సోషలిజం విజయానికి గీటురాయి అయింది. సోషలిజం అంటే అన్ని వ్యవస్థల కంటే వేగంగా ఆర్థిక అభివృద్ధిని సాధించే వ్యవస్థ అనే తప్పుడు నిర్వచనం ఇస్తూ వచ్చారు ఈ దేశాల పాలకులు.

ఈ లక్ష్యాన్ని సాధించడానికి కేంద్రీకృతంగా ప్రణాళికలు రచించి మూఢంగా అమలు చేశారు. ఏవి ఉత్పత్తి చేయాలి, ఎంత ఉత్పత్తి చేయాలి, ఎక్కడ ఉత్పత్తి చేయాలి అనేది ప్రభుత్వం నిర్ణయిస్తుంది. కార్మికులూ రైతులూ కిమ్మనకుండా ఉత్పత్తి చేయాలి. సమ్మెలు చేయడానికి వీలు లేదు. ఆందోళనలు చేపట్టడానికి వీలు లేదు. నిరసన సహితం వ్యక్తం చేయడానికి వీలు లేదు. ఇదంతా మీ మంచి కోసమే కాబట్టి నిర్బంధాన్ని నోరుమూసుకుని సహించండి అన్నారు. ఈ స్వేచ్ఛ మాత్రమే కాదు, తగుమాత్రం తిండి, బట్ట, ఇతర జీవిత అవసరాలు కూడ సరిగ్గా ఇవ్వకుండా పెట్టుబడిని భారీ పరిశ్రమలలో విపరీతంగా కేంద్రీకరించారు.

ఈ వైఖరిని మొదటినుండి విమర్శించిన కమ్యూనిస్టు నాయకుడు మావో. ఉత్పత్తి సాధనాలనూ పరికరాలనూ మెరుగుపరుచుకుంటూ పోవడమే ఆర్థిక ప్రగతికి మార్గం అనేది తప్పుడు సిద్ధాంతం అని మావో విమర్శించాడు. దానిని ఆయన 'ఉత్పత్తిశక్తుల సిద్ధాంతం' అన్నాడు. కార్మికుల చైతన్యాన్ని పెంచడం, సమానత్వాన్నీ స్వావలంబననూ పెంపొందించడం, ఉత్పత్తి క్రమం మీదా పునరుత్పత్తి క్రమం మీదా శ్రామికుల ఆధిపత్యాన్ని నెలకొల్పే ప్రయత్నాన్ని చేపట్టడం – ఈ చర్యలను ఆర్థిక ప్రగతికి కీలకంగా తీసుకోవాలని మావో భావించాడు. కాని ఇవ్వాళ చైనాలోనే ఆ సిద్ధాంతాన్ని తిరస్కరించారు. తూర్పు యూరప్‌లో, సోవియట్ రష్యాలో అయితే ఆ

అవగాహన ఏ రోజూ లేదు. స్టాలిన్ కాలం నుండి ఈ రోజుదాకా ఆ దేశాలలో 'ఉత్పత్తి శక్తుల సిద్ధాంత'మే రాజ్యం చేస్తోంది.

ప్రజలలో చైతన్యాన్ని పెంచకుండా, సోషలిజం నిర్మిస్తున్నామనే భావన పెంపొందించకుండా ఆర్థిక ప్రగతిని వేగంగా సాధించాలని ప్రయత్నం చేయడం చాలా సమస్యలకు దారితీసింది. తమ జీవితాలను తామే శాసించుకునే వ్యవస్థలో ప్రజలు అందరి భవిష్యత్తు కోసం, సమాజం కోసం శ్రమ చేస్తారు. త్యాగాలూ చేస్తారు. అది లేనప్పుడు ఎవరికి వారు స్వలాభం కోసమయినా పనిచేయాలి, లేదా ఉద్యోగం పోతుందన్న భయంతోనయినా పనిచేయాలి. పెట్టుబడిదారీ దేశాలలో చిన్న ఉత్పత్తిదారులు స్వలాభం కోసం శ్రమ చేస్తారు. కూలివాళ్ళూ కార్మికులూ పనిలో నుండి తీసేస్తారన్న భయంతో పనిచేస్తారు. సోషలిస్టు దేశాలలో ఉద్యోగ భద్రత కల్పించారు కాబట్టి ఆ భయం లేదు. (కూలివాళ్ళకు భయం లేకుండా పోయింది కాబట్టి ఉద్యోగ భద్రత ఇంతగా ఉండడానికి వీలు లేదననేది 'పెరిస్త్రోయికా' ప్రతిపాదనలలో ఒకటి!) స్వంత ఆస్తి ఎక్కువగా వుండదు కాబట్టి స్వలాభానికి అవకాశం తక్కువ. అందువల్లే సోషలిజంలో ప్రజల చైతన్యాన్ని పెంచడానికి కృషి చాలా అవసరం. నూతన సమాజ నిర్మాణాన్ని భవిష్యత్తుకు వాయిదా వేయకుండా మొదటి నుంచీ చేపట్టడం అవసరం.

నూతన సమాజాన్ని నిర్మించే క్రమంలో విముక్తమయ్యే అపారమయిన చొరవ, ఉత్సాహం సోషలిస్టు ఉత్పత్తికి ప్రాతిపదిక కావాలి. అది జరగకపోతే ఉత్పత్తిలో అసమర్థత, వనరుల వ్యర్థ ప్రయోగం, నిపుణతలోనూ నాణ్యతలోనూ లోటు పెరిగిపోతాయి. తూర్పు యూరప్ దేశాలలోనూ, సోవియట్ రష్యాలోనూ ఇదే జరిగింది. ఒక వస్తువును ఉత్పత్తి చేయడానికి పాశ్చాత్య దేశాలలో ఖర్చు అయ్యే పెట్టుబడి కంటే 50 శాతం ఎక్కువ సోవియట్ రష్యాలో ఖర్చు అవుతుందని అంచనా. పెట్టుబడి ఈ విధంగా చాలా వృథా కాసాగింది. అందువల్లే గత 30 సంవత్సరాలుగా ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ ఆధారంగా చాలా వేగంగా పురోగమిస్తూ వున్న పాశ్చాత్య పెట్టుబడిదారీ పారిశ్రామిక రంగాన్ని అందుకోవడం సోవియట్ రష్యాకూ, తూర్పు యూరప్ దేశాలకూ చాలా కష్టం అయింది. ఈ సంక్షోభం నుండి బయటపడడానికి ఆ దేశాలు పెట్టుబడిదారీ పద్ధతులను అనుసరించడం మొదలుపెట్టాయి. స్వలాభాన్నీ ఆర్థిక ప్రోత్సాహాలనూ ఎరగా చూపించి కార్మికుల సామర్థ్యాన్నీ నిర్వహణా నైపుణ్యాన్నీ పెంచాలని చూశారు.

భూమిని రైతులకు 'లీజుకు' ఇవ్వడం మొదలుపెట్టారు. పెట్టుబడిదారీ దేశాలలో దొరికే రకరకాల విలాస వస్తువులను తమ దేశాలలోనూ తయారు చేయడమో లేక దిగుమతి చేసుకొని అమ్మడమో మొదలుపెట్టారు. ఇవన్నీ 1965 తరువాత బాగా పెరిగాయి. 1970 తర్వాత పాశ్చాత్య దేశాల నుండి 'ఆధునీకరణ' పేరిట పెద్దఎత్తున పెట్టుబడినీ సాంకేతిక ప్రక్రియలనూ దిగుమతి చేసుకోవడం మొదలుపెట్టారు. ఫలితంగా తీవ్రంగా అప్పులలో పడ్డారు.

అయినప్పటికీ ఈ ప్రభుత్వాలు రాజకీయంగా ప్రజలతో సత్సంబంధాలు పెట్టుకొనివుంటే సమస్యను గట్టెక్కించగలిగేవేమో. అయితే ఈ పరిస్థితి మొదటినుండీ లేదు. దాంతో క్రమంగా ప్రజా పునాదిని కోల్పోయారు. ఆర్థిక వ్యవస్థ వాస్తవ పరిస్థితి గురించి వారు ప్రజలకు ఎన్నడూ నిజం చెప్పలేదు. అప్పు ఎంతగా పెరిగిపోయిందీ చెప్పలేదు. సాంకేతిక పురోగతిని సాధించలేకపోతున్నాం అని ప్రజల ముందు ఒప్పుకోలేదు. శాస్త్రీయ సోషలిజాన్ని అమలు చేస్తున్నాం అని బింకంగా ఆత్మస్తుతి చేసుకోవడం మాత్రం మానలేదు. ప్రజలు చేతకానితనాన్నీ వైఫల్యాన్నీ క్షమిస్తారేమోగానీ అబద్ధాలనూ బూటకపు ప్రగల్భాలనూ క్షమించరు. దాంతో సోవియట్ రష్యా, తూర్పు యూరప్ ప్రభుత్వాలు తమ విశ్వసనీయతను పూర్తిగా పోగొట్టుకున్నాయి.

ప్రజల విశ్వాసాన్ని కోల్పోవడంతో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు రకరకాల తాయిలాలు ఇవ్వాలని చూశాయి. ఉన్నతమైన సోషలిస్టు చైతన్యం ద్వారా, నూతన సమాజాన్ని నిర్మించే క్రమంలో పెల్లుబికే ఉత్సాహం ద్వారా పరిష్కారం కావలసిన సమస్యలను ఆర్థిక ప్రోత్సాహకాలతో పరిష్కారం చేయాలని ప్రయత్నించారు. దీనివల్ల సోషలిస్టు చైతన్యం మరింత దెబ్బతిన్నది. మీ స్వార్థం కోసం తప్ప మీరు పనిచేయరు కాబట్టి మీకు డబ్బులిచ్చి పని చేయించుకుంటామని ఒకవైపు చెప్తూ, మళ్ళీ అంతలో సోషలిజం కోసం త్యాగం చెయ్యండి అని ప్రజలను అడగడంలో గల ఔచిత్యం ఏమిటో ఆ 'సోషలిస్టుల'కే తెలియాలి. ఒకనాడు సోవియట్ రష్యాలోనూ, చైనాలోనూ నూతన సమాజాన్ని నిర్మించే ఉత్సాహంలో జనం రోజుకు ఒక పూట తిండి తిని లక్షల ఎకరాల బంజర్లను సాగులోకి తెచ్చారు. వేలాది చిన్న పరిశ్రమలను నిర్మించి, ఇనుము, ఉక్కు తయారుచేసి చేతులు కాల్చుకున్నారు. రాత్రుళ్ళు స్కూళ్ళు నడిపి అందరినీ అక్షరాస్యుల్ని చేశారు. వైద్యులు మారుమూల గ్రామాలు తిరిగి వైద్య సౌకర్యాలు కల్పించారు. ఆ చైతన్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసి స్వార్థానికీ స్వప్రయోజనానికీ

పట్టంగట్టి 'అమెరికాను పదేళ్ళలో అందుకోవాలి' అనే మతిలేని ఆదర్శాన్ని సోషలిజం లక్ష్యంగా సిద్ధాంతీకరించి, ఇప్పుడు త్యాగం చేయండి అంటే జనం ఎందుకు సిద్ధపడతారు? విదేశీ అప్పులు తీర్చడం కోసం పోలండ్, రుమేనియా, హంగేరీ లాంటి దేశాలలో రొట్టె, మాంసం మొదలయిన నిత్యజీవిత అవసరాలను సహితం ఎగుమతి చేయడం మొదలుపెట్టారు. దానితో జనం తిరగబడ్డారు. ఆ త్యాగాన్ని పాలకులు కూడ పంచుకుంటే జనం కొంత ఊరట చెందేవారేమోగానీ ఈ దేశాల 'సోషలిస్టు' నేతలు చాలా సుఖాలకూ సౌకర్యాలకూ విలాసాలకూ అలవాటు పడ్డారు.

ఈ ప్రభుత్వాలన్నీ ప్రజలకు చాలా దూరం అయ్యాయన్నాము కదా. 'ప్రజాస్వామ్యాన్ని' గురించి జరుగుతున్న చర్చలో ఇది చాలా ముఖ్యమయిన అంశం. ఎందుకంటే పాశ్చాత్య దేశాలలో నడుస్తున్న రాజకీయ వ్యవస్థే ఏకైక ప్రజాస్వామ్య రూపం అనే తప్పుడు ప్రచారం విస్తృతంగా జరుగుతూ వుంది. గోర్బచెవ్ దీనికి చాలా దోహదం చేస్తున్నాడు. నిజానికి సోషలిస్టు నిర్మాణానికి అనుగుణ్యమైన ప్రజాస్వామ్య వ్యవస్థ ఏ విధంగా వుండాలనే చర్చ ఇంకా కొనసాగించవలసి వుంది. ఆ వ్యవస్థను ప్రజలు తమదిగా భావించగలగాలి. దానితో 'మమేకం' కావాలి. నూతన సమాజాన్ని నిర్మించే చైతన్యాన్నే కాక స్వేచ్ఛను కూడ ఆ వ్యవస్థ ప్రజలకు కల్పించాలి. ప్రజల అభీష్టాలకు స్పందించాలి. ఆ అభీష్టాన్ని వ్యక్తం చేసే స్వేచ్ఛ ప్రజలకు ఉండాలి. అదే సమయంలో ఆ వ్యవస్థ తిరోగామిశక్తుల మీద రాజీలేని పోరాటం చేయాలి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ఈ లక్షణాలున్నాయని ఎవరు భ్రమించినా భారతదేశంలో బ్రతుకుతూ వున్నవాళ్ళం భ్రమించలేము. అయితే ఈ సోషలిస్టు రాజకీయ వ్యవస్థను ఆవిష్కరించే ప్రయత్నం చేయకుండా కమ్యూనిస్టు పార్టీ ఆధిపత్యమే ప్రజారాజ్యం అని సిద్ధాంతీకరించడం అన్ని సోషలిస్టు దేశాలలోనూ జరిగిన పొరపాటు. దానికి స్టాలిన్ కూడ దోహదం చేశాడని ఒప్పుకోవాలి.

ఈ నియంతృత్వం ఫలితంగా ప్రజలలో విపరీతమయిన నిరసన పేరుకు పోయింది. దానిని ఆసరా చేసుకుని గోర్బచెవ్ లాంటివాళ్ళు 'ప్రజాస్వామ్యం' పేరిట జనాన్ని ఆకట్టుకుంటున్నారు. సోషలిస్టు రాజకీయ వ్యవస్థకు అనుగుణ్యమయిన ప్రజాస్వామ్య రూపం ఏదన్న చర్చను పక్కకుపెట్టి పార్లమెంటరీ ప్రజాస్వామ్యమే ఏకైక ప్రజాస్వామ్య రూపం అని ప్రచారం చేస్తున్నారు. ఆ ముసుగు కింద మౌలికమయిన సోషలిస్టు సిద్ధాంతాలనే కాదంటున్నారు.

సోషలిజాన్ని నిర్మించే ప్రయత్నం మరొక అక్టోబర్ విప్లవంతో తిరిగి ప్రారంభం కావాలి. అయితే ఈ లోపల గత 70 సంవత్సరాల చరిత్రను మార్క్సిస్టులు నిజాయితీగా పునఃపరిశీలించాలి. ఆత్మవిమర్శ చేసుకోవాలి. అపరిష్కృతంగా ఉండిపోయిన సిద్ధాంత సమస్యలనూ నిర్మాణ సమస్యలనూ పరిష్కరించుకొని ముందుకు సాగాలి. ఇన్నాళ్ళూ చెప్పిన అనేక అబద్ధాలు ఇకనైనా చెప్పడం మానేయాలి. నిజం చెప్తే శత్రువుకు ఉపయోగపడుతుందేమోనని భయపడడం మానేసి నిజం చెప్పలేని సోషలిజం శాస్త్రీయ సోషలిజం కాజాలదని గుర్తించాలి.

*ఉదయం దినపత్రిక*
*26, 27 జనవరి 1990*

## 'సంస్కృతి'కి బాలగోపాల్ జవాబు

**సం**స్కృతి* ఉత్తరం (జనవరి 30) చదివాను.

చైనా సాంస్కృతిక విప్లవాన్ని గురించి ప్రతిపాదించినప్పుడు తిరస్కరించిన విమర్శను తూర్పు యూరప్ పరిణామాలను విశ్లేషించేటప్పుడు నేనే ప్రతిపాదించడానికి కారణం ఆ రెండింటి మధ్య వున్న తేడాలోనే ఉంది. నిజానికి ఈ విమర్శలోని ముఖ్య అంశాలకు ఆచరణాత్మకంగా సమాధానం చెప్పే ప్రయత్నమే చైనా సాంస్కృతిక విప్లవం. అది పూర్తిగా (ఆ మాటకొస్తే సగం కూడ) విజయవంతం కాలేదన్నది వాస్తవమే. అంతమాత్రం చేత అన్నిటినీ ఒకే గాటన కట్టి విమర్శించడం న్యాయం కాదు. పాశ్చాత్య విమర్శకులు చేస్తున్న పని ఇదే – అన్ని కమ్యూనిస్టు పార్టీలనూ అన్ని సోషలిస్టు ప్రయోగాలనూ ఒకే గాటన కట్టి దూషించడం. కాని చైనా అనుభవానికీ తూర్పు యూరప్ అనుభవానికీ చాలా తేడా వుంది. 1920–30 దశాబ్ద కాలంలో సోవియట్ రష్యా ప్రపంచంలోని అభ్యుదయవాదులందరికీ ఎంతటి ఉత్తేజాన్ని ఇచ్చిందో తిరిగి అంతటి ఉత్తేజాన్ని 1960–75 కాలంలో చైనా కల్పించింది. తూర్పు యూరప్ దేశాలు ఎవరికీ ఎన్నడూ ఉత్తేజాన్ని ఇవ్వలేదు.

---

* సంస్కృతి పి.డి.ఎస్.యు. నాయకురాలు. ఆమె రాసిన ఉత్తరం దొరకలేదు.

తాము అధికారానికి వచ్చిన తరువాత ఇక ప్రజా ఉద్యమాలతో పని లేదని తూర్పు యూరప్ పాలకులు భావించారు. చైనాలో అందుకు భిన్నంగా విప్లవానంతరం అనేక ప్రజా ఉద్యమాలు జరిగాయి. లక్షల సంఖ్యలో జనం వాటిలో పాల్గొన్నారు. ఈ ఉద్యమాలలో ఏవి కమ్యూనిస్టు ప్రోత్సాహంతో జరిగాయో, ఏవి కమ్యూనిస్టు పార్టీతో నిమిత్తం లేకుండా జరిగాయో చెప్పడం కూడ కష్టం అని జి.పి. దేశ్‌పాండే ఈ మధ్య ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో రాస్తూ అన్నారు. అంతేగాక ప్రణాళికా రచన నుండి పరిపాలనా నిర్వహణ దాకా అన్నీ కూడ చైనాలో తూర్పు యూరప్ దేశాలతో పోలిస్తే చాలా వికేంద్రీకృతంగా సాగాయి.

ఆర్థిక, రాజకీయ రంగాలు సంక్షోభంలో పడ్డప్పుడు ప్రజలను విశ్వాసంలోకి తీసుకోకుండా, ఏ సమస్యా లేదని బుకాయించడం తూర్పు యూరప్ ప్రభుత్వాలు చేసిన తప్పులని విమర్శించాను. మావో అందుకు భిన్నంగా పార్టీలో బ్యూరోక్రాటిక్ ధోరణులూ, తిరోగామి శక్తులూ ప్రబలినప్పుడు ఆ విషయాన్ని దాచిపెట్టి పార్టీ లోపల ముఠా తగాదాలకు తావిచ్చే బదులు ప్రజల ముందు వాస్తవాన్ని పెట్టి పార్టీ మీదే తిరగబడమన్నాడు. స్టాలిన్ కాలం నుండి వస్తూన్న 'ఉత్పత్తిశక్తుల సిద్ధాంతాన్ని' తానే బహిరంగంగా విమర్శించి, నూతన సమాజ నిర్మాణాన్ని కమ్యూన్లలోనూ, ఫ్యాక్టరీలలోనూ చేపట్టమని పిలుపు ఇచ్చాడు.

అయితే ఈ పోరాటంలో పురోగామి శక్తులు పార్టీ లోపల చాలా బలహీనంగా ఉండడం వల్ల అది పటిష్టమైన నిర్మాణం లేకుండా సాగింది. ఆ లోపానికి పరిహారంగా 'వ్యక్తి పూజ' పుట్టుకొచ్చింది. వ్యక్తి పూజను నేను సమర్థించలేదు, సమర్థించడం లేదు. అయితే ఒక నాయకుడు తన వ్యక్తిగత బలాన్ని పెంపొందించుకోవడం కోసం ప్రోత్సహించే వ్యక్తి పూజకూ, పురోగామి శక్తుల నిర్మాణ బలహీనతకు పరిహారంగా, ఒక చారిత్రక అవసరంగా ముందుకొచ్చిన దానికీ తేడా చూడడం అవసరం అంటున్నాను. చరిత్రను నిర్దిష్టంగా విశ్లేషించకపోతే మనం తీసుకోగల గుణపాఠాలేవీ ఉండవు.

చైనాలో అన్నీ ప్రజాస్వామికంగా జరిగాయని కాదు. సాంస్కృతిక విప్లవం దాదాపు అంతర్యుద్ధం రూపం తీసుకున్న కారణంగా ఈ దశలో చాలామంది ప్రాణాలు పోయాయి. అయితే చైనా పార్టీ (మావో బ్రతికి వుండగా) ఎప్పుడూ ప్రజలనూ, ప్రజా

ఉద్యమాలనూ అణచివేయలేదు. ప్రత్యర్థులను సోవియట్ రష్యాలోనూ, తూర్పు యూరప్‌లోనూ చేసినట్టు బూటకపు విచారణ జరిపి హతమార్చలేదు. అదే జరిగి వుంటే డెంగ్ ఇన్నాళ్ళు ప్రాణాలతో వుండి తిరిగి అధికారంలోకి రాగలిగి ఉండేవాడు కాదు. (అందుకే లిన్ పియావోను మావో చంపించాడన్న వదంతి నమ్మశక్యం కాదు.)

కమ్యూనిస్టు పార్టీ పెత్తనం కింద ఆర్థికరంగాన్ని ఆధునీకరించుకుంటూ పోవడమే సోషలిజం కాదని గుర్తించి, నూతన సమాజ నిర్మాణానికి నూతన చైతన్యాన్ని ప్రాతిపదికగా తీసుకొంది చైనా కమ్యూనిస్టు పార్టీ. అయినప్పటికీ ఒక మౌలికమైన ప్రశ్న మిగిలిపోయింది. ఈ విధమైన పురోగమనానికి అనుగుణ్యమైన నిర్మాణం ఏమిటి? సమాజాన్ని పురోగమింపజేసే చైతన్యాన్నీ చొరవనూ వ్యక్తీకరించే రాజకీయార్థిక నిర్మాణ రూపాలు ఏ విధంగా ఉండాలి? ఇన్నాళ్ళు మార్క్సిస్టులు (చైనాలో కూడ) ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం చెప్పలేదు. నిజానికి ఈ ప్రశ్నను స్పష్టంగా వేసుకోలేదు కూడ. మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథం గల పార్టీ ఆధిపత్యం ఉంటే అంతా సజావుగానే ఉంటుందని భావించారు. అది తప్పని 30 సంవత్సరాల అనుభవం తెలుపుతూ వుంది. ఈ ప్రశ్నను ఇన్నాళ్ళూ సైద్ధాంతికంగా ఎదుర్కోకపోవడం వల్ల చాలా నష్టం జరిగింది. చాలామంది ప్రాణాలు, స్వేచ్ఛ పోగొట్టుకున్నారు. అందుకే మార్క్సిస్టులు ఆత్మవిమర్శ చేసుకోవడం అవసరం అన్నాను. ఈ ప్రశ్నను స్పష్టంగా గుర్తించి చర్చిస్తే, మామూలుగా పాశ్చాత్య విమర్శకులు లేవదీసే అనేక ఇతర విషయాలకు – పౌరహక్కులు, భావప్రకటనా స్వేచ్ఛ, మొదలయిన వాటికి – కూడ సమాధానం దొరుకుతుంది. అన్ని సోషలిస్టు దేశాలలోనికీ చైనా అనుభవం ఈ ప్రశ్నకు జవాబు చెప్పడానికి ఎక్కువగా ఉపయోగపడుతుంది. అయినా అది కూడ సరిపోదు.

ఉదయం దినపత్రిక
3 ఫిబ్రవరి 1990

చైనా




# బాండుంగ్ వెలుగు నీడలలో...

## 'చైనా – భారత మైత్రి సంక్షిప్త చరిత్ర'పై సమీక్ష ?

చరిత్రలు పలురకాలు. సామ్రాజ్యవాద చరిత్ర, జాతీయవాద చరిత్ర, మతోన్మాద చరిత్ర, వగైరా. ఎన్ని కావాలంటే అన్ని రకాలు. వలసలను నిరాటంకంగాను, నిరాక్షేపణీయంగాను పరిపాలించడానికి సామ్రాజ్యవాదులకు ఒక చారిత్రక వ్యాఖ్యానం అవసరమయింది. పరిపాలనా దక్షత తెల్లవాడి సొమ్ము కాబట్టి ప్రపంచపాలన కేవలం వాడి హక్కే కాదు, దైవదత్తమయిన బాధ్యత అనే సిద్ధాంతాన్ని నిరూపించడానికి వలస దేశాల చరిత్రను సామ్రాజ్యవాదపు కళ్ళతో పరిశీలించి రాశారు. ప్రాచ్యదేశాల వాళ్ళకు తత్వచింతన సమృద్ధిగా ఉంది గాని రాజ్యం నడపమంటే తన్నుకు చావడమో లేక సన్యసించడమో తప్ప వేరే చేతకాదు అని వారు నిరూపించదల్చుకున్నారు. అందుకే వాళ్ళ కళ్ళకు మన చరిత్ర నిండా కలహాలూ, కుహకాలూ, కాషాయాంబరాలూ తప్ప వేరే కనబడలేదు. దీనికి సమాధానంగా జాతీయవాద చరిత్ర పుట్టి చరిత్రలో పూడుకుపోయిన రాజ్యాలనూ రాజవంశాలనూ వెలికి తీసి, చూశారా మాకూ పరిపాలనా దక్షత ఉందని ఎదురు వాదన చేసింది. ఫలితంగా గుప్త రాజుల స్వర్ణయుగం, అక్బర్ పాదుషా నేర్పరితనం చరిత్రకెక్కాయి, అవే చరిత్ర అయ్యాయి. చివరికి వేరే సందర్భంలోనయితే నీతిహీనుడిగా గుర్తించబడి ఉండే కౌటిల్యుడు కూడ భారతజాతికి

తత్వచింతనే కాదు, అతి క్షుద్రమయిన రాజనీతి కూడ చేతనవునని నిరూపించి జాతి హీరో అయ్యాడు! ఇట్లా ఎన్నో రకాల చరిత్రలు.

మరయితే భారత–చైనా మిత్రమండలి వారు అనువదించి ప్రచురించిన ఈ చైనా పుస్తకం ఏ రకం చరిత్ర అంటే బాండుంగ్ చరిత్ర, లేక పంచశీల చరిత్ర అనొచ్చు. 1955 లో బాండుంగ్‌లో ఒక సమావేశం జరిగింది. అప్పుడప్పుడే సామ్రాజ్యవాదుల నుండి ఏదో ఒక మేరకు స్వాతంత్ర్యాన్ని సంపాదించుకుంటున్న వివిధ ఆఫ్రికా, ఆసియా దేశాల అధినేతలంతా అక్కడ సమావేశమయ్యారు. మునిసిపల్ పార్కులో ప్రేమికులలాగా జన్మాంతం తోడునీడగా ఉంటామని ప్రకటించుకున్నారు. ఫలితంగా ప్రపంచ రాజకీయ రంగంపైకి ముగ్గురు తాజా హీరోలు వచ్చారు – నెహ్రూ, నాజర్, సుకర్నో. రాజాతనంలోగాని, హీరోయిజంలోగాని ముగ్గురూ ముగ్గురే. వీళ్ళ వెనక నిలబడి వీళ్ళ వేడి వేడి రాడికల్ ప్రవచనాలకు కొంత స్థిరమయిన పునాదిని కల్పించాలని చౌ ఎన్ లై ప్రయత్నించాడు.

అది 1955లో. అంతకు ఒక సంవత్సరం పూర్వం చౌ ఎన్ లై భారత దేశానికి వచ్చాడు. అప్పుడు ఢిల్లీ నగరం హిందీ–చీనీ భాయిభాయి నినాదాలతో మారు మోగింది. భారత, చైనా దేశాలు స్నేహ ఒప్పందాన్ని రాసుకున్నాయి. పంచశీల అని పిలవబడే అయిదు సూత్రాల ప్రాతిపదికగా రెండు దేశాలూ స్నేహ సహకారాలతో సహజీవనం చేయాలని ప్రమాణం చేసుకున్నాయి. అవి

1. ఒండొరుల సర్వసత్తాక ప్రతిపత్తిని గౌరవించుకోవాలి.
2. ఒకరిపై ఒకరు దాడి జరపకూడదు.
3. ఒకరి అంతర్గత వ్యవహారాలలో ఒకరు జోక్యం చేసుకోకూడదు.
4. పరస్పర లాభోపేతంగాను, సమానంగాను వ్యవహరించాలి.
5. శాంతియుత సహజీవనం కొనసాగించాలి.

ఇదే 'పంచశీల'.

అది 1954 లో. ఈ పుస్తకం రాసింది 1958లో. అంటే సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అన్ని మాజీ వలసదేశాల ప్రభుత్వాలనూ ఐక్యంగా నిలబెట్టాలనే రాజనీతిని చైనా ప్రభుత్వం అనుసరిస్తున్న రోజులలో, ఆ రాజనీతిలో భాగంగా రాసిన పుస్తకం

ఇది. ఆ రాజనీతి ఆనాడుగాని, ఈనాడుగాని తప్పు కాదు. అన్ని రకాల సామ్రాజ్యవాదులకూ వ్యతిరేకంగా 'మూడవ ప్రపంచ' దేశాలను ఐక్యంగా నిలబెట్టే కృషి చాలా అవసరం. దాని కోసం ఆయా ప్రభుత్వాలతో చైనా సత్సంబంధాలు ఏర్పరచుకోవాలని ప్రయత్నించడం భావ్యమే. అది ప్రభుత్వాల మధ్య మైత్రే. 'ప్రజల మధ్య మైత్రి' అని బుకాయించాల్సిన అవసరం లేదు. ప్రజల మధ్య మైత్రి ఈ ప్రభుత్వాలు పోతేగాని సాధ్యం కాదు. అయితే ఈ మైత్రి చరిత్ర రచనను రాజనీతికి లోబరిస్తేనే కష్టం. అప్పుడు ఒక్కసారిగా భారతదేశం, చైనా అఖండమయిన 'జాతు'లయిపోతాయి. భారత పాలక వర్గాలకు అభిమాన పాత్రమయిన విషయాలు విమర్శకు అతీతమయిపోతాయి. భారతదేశం నుండి చైనాకు గాని, చైనా నుండి భారతదేశానికి గాని వ్యాపారానికో, బౌద్ధమత ప్రచారానికో, ఉబుసుపోకో ప్రయాణించిన వారంతా ఆయా దేశాల ప్రజల ప్రతినిధులవుతారు, వాళ్ళ ప్రయాణం అనాది అయిన భారత-చైనా మైత్రికి సంకేతం అవుతుంది. వాళ్ళ రాకపోకల వల్ల ప్రసారమయిన సంస్కృతి ఎటువంటిదయినప్పటికీ పూజనీయమవుతుంది. "చైనా వచ్చిన భారతీయ బౌద్ధమత ప్రచారకులు మన నాగరికతను సుసంపన్నం చేశారు... ఉభయ దేశాల మధ్య సాగిన భావాల బట్వాడాను ఒకసారి గతంలోకిపోయి చూసినప్పుడు, భారతదేశం నుంచి బహు ప్రయాసలు పడి చైనా వచ్చిన ఈ భారతీయ మిత్రుల్ని, శతాబ్దాల తరబడి వాళ్ళు శ్రమించి చేసిన బోధల్ని, అనువాదాల్ని జ్ఞాపకము తెచ్చుకొని తీరాలి, మన ఉభయదేశాల ప్రజల మధ్య అల్లుకున్న ఈ ప్రగాఢ మైత్రి ప్రపంచ చరిత్రలో అసాదృశ్యం" (పేజీ 76).

మరికొన్ని ఉదాహరణలు ఇస్తాను. బౌద్ధమత ప్రచారం కోసం ఉభయదేశాల మధ్య జరిగిన ప్రయాణాల గురించి చెప్తూ "3వ శతాబ్దం నుండి 12వ శతాబ్దందాకా సాగిన ఈ వెయ్యి సంవత్సరాల సుదీర్ఘకాలంలో ఎడతెగకుండ పారే ఏరులాగా యాత్రిక బృందాలు చైనానుండి భారతదేశానికి కష్టసాధ్యమయిన దీర్ఘ, నిష్ఠుర ప్రయాణానికి తెగించాయి. వాళ్ళ లక్ష్యం లాభాలు లాగుదామని కాదు. కీర్తి గడిద్దామని కాదు. దురాక్రమణ యుద్ధం అంతకన్నా కాదు. జ్ఞానతృష్ణ, బౌద్ధమత వ్యాప్తి వాళ్ళకు ప్రేరణలు. ఇటువంటి ఉదాహరణ యావత్ ప్రపంచ చరిత్రలో మరెక్కడా కనిపించదు. ఈ అసాధారణ చారిత్రక పరిస్థితులు భారత-చైనా ప్రజల మధ్య స్నేహ సంబంధానికీ,

మన పూర్వుల ఉన్నత గుణగణాలకూ విశిష్ట సాక్ష్యం" (పేజీ 41). ఈ ఉభయ జాతీయవాదం (mutual nationalism) మన ఇరువురి పూర్వీకులలోని ఉన్నత గుణగణాలను గుర్తించడంతో ఆగిపోలేదు. ముందుమాటగా భారత–చైనా మిత్రమండలి ఆంధ్ర రాష్ట్ర శాఖవారు రాసిన దానిలో "పూర్వం భారతదేశానికి పశ్చిమ దేశాలతో సంబంధం యుద్ధాల ద్వారా ఏర్పడగా చైనాతో భారతదేశానికి సంబంధం పరస్పర సహకార ప్రాతిపదికగా ఏర్పడింది" అన్నారు. ఇది చాలా అన్యాయమయిన వక్రీకరణ. చైనాతో భారతదేశానికుండిన మత ప్రచార, వ్యాపార సంబంధాలను 'పరస్పరం'గా గుర్తించేటట్లయితే అటువంటి సంబంధమే మనకు పశ్చిమదేశాలతో కూడ ఉండింది. నాదిర్‌షా, గజనీమహమ్మదుల దండయాత్రల కంటే ఈ సంబంధమే ఎంతో బలమయినది.

నిజానికి 'జ్ఞానతృష్ణ' చేత ప్రేరణ చెందిన బౌద్ధ భిక్షువులే కాదు, లాభార్జన కోసం వ్యాపారస్తులు కూడ చాలామంది ఉభయ దేశాల మధ్య ప్రయాణం చేశారు. భారత–చైనా దేశాల సంబంధాలలో అది కూడ ఒక భాగమే. అందులో సిగ్గుపడాల్సిందేమీ లేదు. ఇతర దేశాల వారికి లాభార్జన దృష్టి ఉండిందని, కేవలం భారత చైనా దేశాల పూర్వీకులకే అకళంక జ్ఞానతృష్ణ ఉండిందని, వాళ్ళ గుణగణాలు ఉన్నతమయినవని నమ్మడం చాలా అశాస్త్రీయం. అట్లా నమ్మాలని పంచశీలలో సహితం రాసుకోలేదు. కాగా ఈ వ్యాపారస్తులు, బౌద్ధ భిక్షువులూ మోసుకు పోయినవన్నీ మంచివి కావు. అలాగే మంచివన్నీ 'జ్ఞానతృష్ణ' మాత్రమే ఉన్న భిక్షువులు మోసుకుపోయినవీ కావు. సాంకేతిక పరిజ్ఞానం, గణితం, వైద్యం, ఖగోళశాస్త్రం – ఇవి మనం ఇచ్చి పుచ్చుకున్న వాటిలో మంచి అంశాలు. వీటి వల్ల రెండుదేశాల సంస్కృతులూ సంపన్నమయినాయి. వాటిలో వ్యాపారస్తులు మోసుకుపోయినవీ ఉన్నాయి. బౌద్ధ భిక్షువులు మోసుకుపోయినవీ ఉన్నాయి. భిక్షువులు మాత్రమే తీసుకుపోయినవి సంస్కృతభాష, సాహిత్యం, తత్వశాస్త్రం, బౌద్ధ మత పుక్కిటి పురాణాలు, వగైరా. సాహిత్యం మాట కాదుగానీ, తత్వశాస్త్రం, బౌద్ధమతం ఆనాటికి (క్రీ.శ. 3వ శతాబ్దం తరువాత కాలం) బాగా దిగజారి ఉన్నాయి. దురదృష్టవశాత్తు, భారత పాలక వర్గాలను దృష్టిలో ఉంచుకొని కాబోలు, ఈ రెండవ కోవకు చెందిన సరుకులనే భారతదేశం నుండి చైనా పొందిన గొప్ప ప్రయోజనంగా చెప్పారు.

కొన్ని ఉదాహరణలిస్తాను. ఫాహియాన్ భారతదేశానికి వచ్చింది బౌద్ధమఠాల నిర్మాణానికీ (organization), వ్యవహారాలకూ సంబంధించిన నియమావళిని తెలుసుకుపోవడానికి. దాని వల్ల చైనా ప్రజలకు ఒరిగిందేమిటో మనకు తెలీదు. కాని ఈ బాండుంగ్ చరిత్ర మాత్రం ఫాహియాన్ సాహసాన్ని ప్రశంసిస్తూ, "ఫాహియాన్ ఇటువంటి సుదీర్ఘ, సంక్లిష్ట ప్రయాణానికి సిద్ధపడింది తన కోసం కాదు, తన దేశస్తుల ప్రయోజనం కోసం" అంటుంది (పేజీ 45). హుయాన్‌సాంగ్ క్రీ.శ. 7వ శతాబ్దంలో భారతదేశానికి వచ్చాడు. ఇక్కడ వేరే బౌద్ధ శాఖకు చెందిన ప్రజ్ఞాదేవుడనే భిక్షువుతో ఏదో వాదనకు దిగుతాడు. ఆ వాదనలో పరుషంగా మాట్లాడినందుకు ప్రజ్ఞాదేవుడు క్షమాపణ వేడుకుంటూ ఉత్తరం పంపితే దానికి సమాధానంగా హుయాన్‌సాంగ్ ఇందులో క్షమాపణ కోరుకోవలసిందేమీ లేదని అంటాడు. క్రీ.శ. 7వ శతాబ్దం నాటికి భారతదేశంలో బౌద్ధానికి పట్టిన గతి ఏమిటో తెలిసిన వాళ్ళు ఆ పండితుల చర్చ ఎంత నిరర్థకమయి వుంటుందో ఊహించుకోగలరు. కాని ఈ పంచశీల చరిత్రకు మాత్రం అట్లా అనిపించలేదు. "ఆనాటి పండితులు వినయ సంపన్నులు, సహృదయులు, మానవజాతి ప్రగతిని మాత్రమే కాంక్షించిన వాళ్ళు. వ్యక్తిగత కక్షలు, సంకుచిత పక్షపాతాలూ బొత్తిగా ఎరుగని వాళ్ళు. ఈ విషయాల్లో వాళ్ళని మనం గొప్ప ఆదర్శంగా స్వీకరించాలి" అంటుంది (పేజీ 54). అదే సందర్భంలో, "హుయాన్‌సాంగ్ చైనా గురించి చెప్పిన విశేషాల యెడల హర్ష చక్రవర్తి మహా ఆసక్తి కనబరిచాడు. వారిద్దరూ మంచి స్నేహితులయ్యారు. భారత–చైనా దేశాల ప్రజల మధ్య ఆనాడు విలసిల్లుతున్న స్నేహానికిది అభివ్యక్తి" అంటుంది. హర్ష చక్రవర్తికీ ప్రజలకూ తేడా చూడలేని ఈ విచక్షణా శూన్యమయిన మైత్రీభావ అతిశయం అవసరమా? అది ప్రదర్శించకపోతే ఇవ్వాళ భారత–చైనా మైత్రి అసాధ్యమా ?

విచిత్రమేమిటంటే, భారత చైనా దేశాలు నిజంగానే చాలా ఉపయోగకర మయిన విషయాలు ఇచ్చిపుచ్చుకున్నాయి. ప్రాచీనకాలంలో విజ్ఞానశాస్త్రం (ముఖ్యంగా ఖగోళశాస్త్రం, గణితం, వైద్యం)లో రెండు దేశాలూ ఎంతో కొంత అభివృద్ధిని సాధించాయి. సాంకేతికరంగంలో ఆనాడే కాదు, పెట్టుబడిదారీ విప్లవం పాశ్చాత్య దేశాలలో వచ్చేదాకా ప్రపంచంలో బహుశా చైనాదే పైచేయి. ఈ విద్యలనూ విజ్ఞానాన్నీ భారత, చైనా దేశాలు పంచుకున్నాయి. వచ్చే పోయే యాత్రికులు (లాభార్జన లక్ష్యంగా

గల వ్యాపారస్తులు, 'జ్ఞానతృష్ణ'తో ప్రయాణం చేసిన భిక్షువులు) అందుకు ఉపయోగపడ్డారు. ప్రాచీన భారత–చైనా సంబంధాలలో ఇది ధనాంశ. మిగిలినదంతా చాలావరకు ఋణాంశే. బౌద్ధం చైనాలో స్థిరపడేనాటికి అది తాత్విక రంగంలో వేదాంతానికి ఏ మాత్రం తీసిపోని మహాయానంగాను, నిత్యజీవితంలో బుద్ధభగవానుని ఆరాధనగాను, మూఢనమ్మకాల మూటగాను మారిపోయింది. ధనాంశను మొదటి 15 పేజీలలో కొంత వివరించి, ఋణాంశనే మిగిలిన పేజీలలో గొప్పగా కీర్తించారు.

భారతదేశంలోనూ, చైనాలోనూ కూడ నాగరికత చాలా ప్రాచీనమైనది. రెండూ కూడ ఋతుపవన వాతావరణంలో జీవించే దేశాలే. వ్యవసాయానికయినా, నౌకాయానానికయినా ఒక క్రమం ప్రకారం వీచే ఋతుపవనాలే ఆధారం. దానికి సంవత్సర పంచాంగం (అంటే శకునాల పుస్తకం అని అర్థం కాదు, కేలండర్ అని.) తయారు చేసుకోవడం అవసరం. అది లేకపోతే వ్యవసాయం పనులు ఎప్పుడు ప్రారంభించాలో తెలీదు, సముద్రంలో ఓడలు ఎప్పుడు బయలుదేరవచ్చునో తెలియదు. దీనికోసం గ్రహాల, నక్షత్రాల పరిశీలన మొదలయింది. ఈ కారణంగా రెండు దేశాలలోనూ అతి ప్రాచీనకాలంలో అభివృద్ధి చెందిన విజ్ఞాన శాస్త్రాలు – ఖగోళశాస్త్రం, దానికి అనుబంధంగా గణితం. ఈ విజ్ఞానాన్ని పరస్పరం పంచుకున్నాయి. వాళ్ళు తీసుకెళ్ళిన శాస్త్ర గ్రంథాలలోనే కాదు, బౌద్ధమత గ్రంథాలలో కూడ ఖగోళశాస్త్రాల గురించి చాలా విషయాలు ఉండేవట. క్రీ.శ. 7–8 శతాబ్దాల కాలంలో టాంగ్ రాజవంశం పరిపాలిస్తున్న రోజులలో కేలండరు తయారుచేసే రంగంలో చాలామంది భారతీయ పండితులు పనిచేసే వారట. చాంద్రమాసాన్ని కృష్ణ పక్షం, శుక్ల పక్షం అని విభజించే అలవాటు కూడ చైనీయులకు మన నుండే అబ్బింది (పేజీ 11). వైద్యం మాటకొస్తే, సుమారు 100 భారతీయ వైద్య గ్రంథాలు అనువాదమయ్యాయట. అవిగాక, బౌద్ధ భిక్షువులు చాలామంది మంచి వైద్యులు కూడ అయిన కారణాన, వాళ్ళు చైనాకు పోవడం ద్వారా కూడ ఇక్కడి వైద్య విజ్ఞానం అక్కడికి వెళ్ళుంటుంది. బౌద్ధమత గ్రంథాలలో కూడ వైద్య సంబంధమయిన సమాచారం విస్తృతంగా ఉందట (పేజీ 13).

ఇదంతా చైనా భారతదేశం నుండి నేర్చుకున్నది. భారతదేశం కూడ చైనా నుండి ఈ రంగాలలో ఎంతో నేర్చుకొని ఉండాలి. అదనంగా, సాంకేతిక రంగంలో

చైనా నుండి చాలా స్వీకరించాం. పట్టు నుండి పింగాణి వరకు చాలా సరుకుల వాడకం చైనా నుండి నేర్చుకున్నవే. ఈ పుస్తకం రాసిన కాలానికి తెలీదుగాని భారతదేశానికి రాట్నం, కాగితం, సారాకాచే బట్టీలు, ఇటుకలు, బావి గిలకలకు ఉపయోగించే గేర్ వంటి పరికరం, సైనిక సంబంధమయిన సాంకేతిక విజ్ఞానం సుల్తాన్ల కాలంలో దిగుమతి అయ్యాయనీ, వాటిలో కొన్ని చైనానుండి పర్షియా ద్వారా ఇండియాకు వచ్చి ఉండవచ్చుననీ ఇటీవల ఇర్ఫాన్ హబీబ్ అన్నాడు.

సాంకేతిక, వైజ్ఞానిక రంగంలోని ఈ ఇచ్చిపుచ్చుకోలు నిజంగా ప్రాచీన కాలంలో భారత–చైనా మైత్రికి సంకేతం. ఇవ్వాళ్టి మైత్రికి ప్రస్తుత అంతర్జాతీయ రాజకీయ పరిస్థితి కంటే వేరే ప్రేరణ కావాలనుకుంటే ఈ ప్రాచీన సంబంధాన్ని మిగుల్చుకుంటే చాలు. విచక్షణా శూన్యంగా అభ్యుదయం అయినదేది, కానిదేది అన్న భావన చూడకుండ నాగార్జునుడి శూన్యవాదం చైనా భాషలోకి అనువాదమయినా, హర్షుడు హుయాన్‌సాంగ్‌తో స్నేహపూర్వకంగా ప్రవర్తించినా అవన్నీ కూడ భారత–చైనా ప్రజల మైత్రికి నిదర్శనాలేనని తీర్మానించడం శుష్క తాపత్రయం. చరిత్ర రచనకు రాజకీయం ఎప్పుడూ ఉంటుంది. కాని ఆ రాజకీయం దీర్ఘకాలిక మానవాభ్యుదయం కోసమైతేనే ఆ చరిత్ర రచన శాస్త్రీయం అవుతుంది. తాత్కాలిక బాండుంగ్ రాజనీతికి భారత–చైనా సంబంధాల చరిత్రను లోబరచి భారత పాలక వర్గాలను మెప్పించడానికి హిందీ–చీనీ భాయిభాయి నినాదాన్ని పల్లవిగా పెట్టి చరిత్ర రాయడం అనవసరం. దాన్ని ఉన్నదున్నట్లుగా తెలుగులోకి అనువదించి 'దేశభక్తి' పేరిట చెలామణి అవుతూన్న జాతీయ దురభిమానం ప్రభావం నుండి బయట పడని ప్రజలను మరింత గందరగోళపరచడం ప్రమాదకరం.

'సహవాసి' అనువాదం ఎప్పటిలాగే ధారాప్రవాహంగా వుంది. భాష మాత్రం ఉండగలిగినంత సరళంగా లేదు. 47వ పేజీలో 'వెస్టర్న్ కంట్రీస్' అన్నమాటను తూర్పు దేశాలు అని అనువదించారు. మరొకచోట (పేజీ 32) సర్వే అన్న ఇంగ్లీష్ మాటను సర్వేక్షణ అని అనువదించారు. ఇది సరికొత్త ప్రయోగం. పుస్తకం మొదటి నుండి చివరిదాకా 'మన', 'మనము' అని ఉండవలసింది 'మా', 'మేము' అని వుంది.

*అరుణతార మాసపత్రిక*

*ఏప్రిల్ – మే 1983*

# శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం

'చైనాలో ఏం జరుగుతోంది?' అన్న ప్రశ్న తన ప్రాముఖ్యతను చాలావరకు కోల్పోయింది. చైనాలో ఏం జరుగుతోందో అందరికీ తెలుసు. బెతెల్‌హాం ఈ వ్యాసం రాసేనాటికి ఇంకా సందేహానికి ఆస్కారం వుండిందేమో! ఎందుకంటే అప్పటికి చైనా కమ్యూనిస్టు పార్టీ సాంస్కృతిక విప్లవం ముగిసినట్టు ప్రకటించింది గాని, దానిని తిరస్కరించలేదు. అప్పటికి డెంగ్‌ను మళ్ళీ తెర ముందుకు తేవడం జరిగింది గాని, లీ షావ్ చీని విమర్శించడం ఇంకా మానలేదు. 'ఆధునీకరణ' కోసం ఉత్పత్తి ఎక్కువ చేయమన్నారు గాని అప్పటికింకా వర్గపోరాటాల కాలం ముగిసింది, ఇక ఉత్పత్తి చేయడమే తరువాయి  అని సిద్ధాంతీకరించలేదు. అప్పటికి 'డెంగ్ పంథా'కు వ్యతిరేకంగా మావో అభిమాన పాత్రుడినని తనకు తానే ప్రకటించుకున్న 'హువా పంథా' ఇంకా ఉన్నట్టే అనిపించింది. సాంస్కృతిక విప్లవంలో జరిగిన అరాచకాన్ని సంస్కరించి నిజమయిన మావో పంథాను హువా కువో ఫెంగ్ నిలబెడతాడేమోనని ఆశించిన వాళ్ళు కూడ లేకపోలేదు.

ఇప్పుడు అంతా తేటతెల్లమయింది. హువా లేడు, 'హువా పంథా' (అసలు అటువంటిది ఎన్నడయినా వుండి వుంటే) లేదు. సాంస్కృతిక విప్లవాన్ని గొప్ప విఘాతమని ప్రకటించారు. సోషలిస్టు సమాజంలో తీవ్రమయిన వర్గపోరాటాలకు స్థానమే లేదని సిద్ధాంతీకరించారు. లీ షావ్ చీ విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. మావోను కూడ మొదట 1966 దాకా (అంటే సాంస్కృతిక విప్లవం మొదలయ్యేదాకా) సరయిన మార్గంలో నాయకత్వం నిర్వహించాడని ప్రకటించి, క్రమంగా ఆ తేదీని 1956కు (అంటే సోషలిస్టు నిర్మాణానికి సంబంధించి మావో ఆలోచనా విధానం రూపొందక పూర్వం నాటికి) వెనక్కి నెట్టారు. 1956 తరువాత మావో చేసిన సిద్ధాంతాలన్నీ తప్పులన్నారు. అతి నూతనంగా, ఒకవైపు అమెరికా నుండి అణురియాక్టర్లు కొనడానికి

ఒప్పందం చేసుకుంటూ, మరొకవైపు ఆ సందర్భంలో చైనాకు వచ్చిన రీగన్ సోవియట్ రష్యాను విమర్శిస్తూ మాట్లాడిన మాటలను సెన్సార్ చేసారు. మా దుకాణంలో సరుకులు దించడానికి వచ్చినవాడివి పక్క దుకాణందారును తిడితే ఎలాగని బహుశ డెంగ్ రీగన్‌ను కోప్పడ్డాడేమో! 'సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదం' అనే మాటలను ప్రయోగించడమే మానేసారు. సామ్రాజ్యవాదులతో శాంతియుత వ్యాపార సహజీవనం కూడ ప్రారంభమయింది. అయితే కృశ్చేవ్ 1956లో ఒక్క అమెరికా సామ్రాజ్యవాదంతో మాత్రమే శాంతియుతంగా కాపురం చేస్తానంటే డెంగ్ ఇద్దరితోనూ చేయమన్నాడు.

మరయితే బెతెల్‌హేం రాసిన ఈ వ్యాసంగాని, దానికి రంగనాయకమ్మ గారు చేసిన టీకా వ్యాఖ్యాన సహిత అనువాదంగాని ఇవ్వాళ అనవసరమా అంటే కాదు. ఎందుకంటే, 'ఆధునిక రివిజనిజం'ను మనం కుట్రగా దూషించి ఊరుకోకుండ అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి. దోపిడీ వర్గాలు విప్లవాన్ని కుట్ర అన్నట్టు మనం ప్రతీఘాతుక విప్లవాన్ని కుట్ర అంటున్నాం. అదీ కుట్ర కాదు, ఇదీ కుట్ర కాదు. విప్లవానంతర సమాజంలో కొత్త బూర్జువా వర్గాలు పుట్టుకొస్తున్నాయనీ, ఆ వర్గాలు కార్మికవర్గం చేతికి అధికారం అందనివ్వకుండ తామే చేజిక్కించుకునే ప్రయత్నం తీవ్రంగా చేస్తున్నాయనీ ఇప్పుడిప్పుడే స్పష్టమవుతోంది. ఇది అనివార్య పరిణామం కాకపోవచ్చునుగాని, యాదృచ్ఛికం కూడ కాదు. సోషలిస్టు సమాజ నిర్మాణ పోరాటం లోంచి పుట్టుకొస్తున్న సహేతుకమయిన వాస్తవం. ఇది కుట్ర కాదు. వర్గ పోరాటమే. ఈ వర్గపోరాటం (ప్రతీఘాతుక విప్లవ పోరాటం) లోతుపాతుల్ని అర్థం చేసుకోవడానికి బెతెల్‌హేం వ్యాసం ఒక తొలి ప్రయత్నంగా ఉపయోగపడుతుంది. ఆ వ్యాసాన్ని రంగనాయకమ్మ గారు, ఆమె మిత్రులు చాలా సరళంగా అనువదించి వివరమయిన వ్యాఖ్యలతో తెలుగు పాఠకులకు అందించారు.

అయితే ఈ పుస్తకాన్ని సమీక్షించడంలో కొన్ని ఇబ్బందులున్నాయి. ఇందులో బెతెల్‌హేం రచన కంటే రంగనాయకమ్మగారి రచనే ఎక్కువ ఉంది. బెతెల్‌హేం వ్యాసం (రంగనాయకమ్మగారి ఫుట్‌నోట్లతో సహా) 154 పేజీలయితే, 43 పేజీల ముందుమాట, 110 పేజీల పెద్ద ఫుట్‌నోట్లు కలిపి సరిగ్గా మళ్ళీ అంత వుంది. మరొక 24 పేజీల చివరిమాట కూడ వుంది. వీటిలో రంగనాయకమ్మగారు బెతెల్‌హేం లేవదీసిన ప్రశ్నలనే గాక చాలా విషయాలను చర్చించారు. కొన్ని మాటలకూ ప్రయోగాలకూ అర్థం చెప్పారు.

తెలుగు పాఠకులకు అంత సులభంగా దొరకని కొంత సమాచారం అందజేసారు. (ఉదాహరణకు లిన్‌పియావో ఉదంతం.) అట్లాగే 'చివరిమాట'లో బెతెల్‌హాం ఈ వ్యాసం రాసిన కాలం నుండి ఇప్పటిదాకా చైనా కమ్యూనిస్టు పార్టీ తీసుకున్న తిరోగామి చర్యల పట్టిక ఇచ్చారు. ఆయన లేవదీసిన ప్రతీ ప్రశ్నకూ నిస్సంకోచంగా సమాధానం ఇచ్చారు. ఈ చర్చనంతటినీ ఎంతమేరకు ఈ సమీక్ష పరిధిలోకి తీసుకురావడం సాధ్యమో అనుమానమే. ఎందుకంటే రంగనాయకమ్మగారి విశ్లేషణా పద్ధతితోనే నాకు మౌలికమైన విభేదం ఉంది. ఆమె హేతువాదులతో పోట్లాడతారుగాని ఆమె విశ్లేషించే పద్ధతి హేతువాదులదే. ఒక విషయాన్ని అర్థం చేసుకోవాలంటే దాన్ని పదునయిన తర్కంతో నిర్దయగా తరుక్కుంటూ పోవడమే మార్గమని హేతువాదులు నమ్ముతారు. కాని గతితార్కిక భౌతికవాద జ్ఞానసిద్ధాంతానికి ఇది చాలా దూరం. ముఖ్యంగా మావో ఆలోచనా విధానానికి హేతువాదం పూర్తిగా వ్యతిరేకం. ఈ విషయం అర్థం చేసుకోవాలంటే ఈ పుస్తకంలోని 271-272 పేజీలు చూడండి. అక్కడ మావో 1960లో చియాంగ్ చింగ్‌కు రాసిన ఒక ఉత్తరం వుంది. ఆ ఉత్తరాన్ని, అందులోని 'అవకతవకలు', 'మార్మికత'లు రంగనాయకమ్మగారిలో కలిగించే నిస్పృహను చూస్తే పైన చెప్పిన విషయం అర్థం అవుతుంది.

## సాంస్కృతిక విప్లవం

సోషలిస్టు విప్లవం రాజ్యాధికారంలోనూ ఆర్థిక సంబంధాలలోనూ విప్లవాత్మక మయిన మార్పులు తెస్తుందని, వాటికి అనుగుణంగా ఇతర (సాంస్కృతిక) రంగాలలో విప్లవాత్మకమయిన మార్పులను సాధించాల్సి వుంటుందని, అందుకోసం పోరాటం చేయక తప్పదని లెనిన్ కాలం నుండి కమ్యూనిస్టులు అభిప్రాయపడ్డారు. ఆ పోరాటానికి 'సాంస్కృతిక విప్లవం' అన్న పేరు కూడ ఉపయోగించారు. చైనా కమ్యూనిస్టు పార్టీ సాంస్కృతిక విప్లవాన్ని ప్రారంభించినప్పుడు ఈ అభిప్రాయాన్నే ప్రకటించింది. 1966లో సాంస్కృతిక విప్లవాన్ని ఆవిష్కరిస్తూ పార్టీ కేంద్ర కమిటీ తీర్మానించిన 16 అంశాలలో మొదటిది ఈ విధంగా వుంది. 'విద్య, సంస్కృతి, కళలతోపాటు ఉపరితలానికి చెందిన అన్ని ఇతర భాగాలలో ఏవయితే సోషలిస్టు ఆర్థిక పునాదికి తగిన విధంగా లేవో వాటిని మార్చాలి.' ఉపరితలాన్ని పునాదికి అనుగుణంగా మార్చే సాంస్కృతిక పోరాటమే సాంస్కృతిక విప్లవం అనే అవగాహన ఇది. అయితే, రంగనాయకమ్మగారు గుర్తించినట్టు (ముందుమాట, పేజీ 37) 'సాంస్కృతిక విప్లవంలో

ఉపరితలాన్ని మార్చడానికి చేసిన ప్రయత్నాలు పునాదిదాకా దారితీసాయి'. ఈ విషయాన్ని చైనా కమ్యూనిస్టు పార్టీ ఊహించలేకపోవడం, ఉపరితలాన్ని ప్రక్షాళనం చేయడం మాత్రమే కాదు పునాదినే సోషలిస్టుగా మార్చాల్సి వుందని గుర్తించకపోవడం, వాళ్ళ 'సిద్ధాంత అవగాహనలో పొరబాటు'గా రంగనాయకమ్మగారు అభిప్రాయపడ్డారు. శుద్ధతర్కాన్ని వదిలిపెట్టి చారిత్రకంగా చూస్తే ఇది వేరే విధంగా కనిపిస్తుంది.

చైనా కమ్యూనిస్టు పార్టీ అవలంబించిన ప్రజాపంథాకు ముందు నుండి కూడ ఒక గతితార్కిక లక్షణం వుంది. పార్టీ ఎప్పుడూ కూడ ప్రజలకు కనీస అవగాహనను, కనీస కార్యక్రమాన్నే ఇచ్చింది. దాన్ని ప్రజలు అందుకొని ఆ అవగాహననూ కార్యక్రమాన్నీ దాటి ముందుకుపోతే అప్పుడు కేంద్ర కమిటీ సమావేశమై – ప్రజల మీద అవిశ్వాస తీర్మానం జారీ చేయకుండ – తమ కార్యక్రమాన్ని అభివృద్ధి చేసుకునేవారు. చైనాలో భూసంస్కరణలు అమలు మొత్తం (ప్రాథమిక సమిష్టీకరణ నుండి కమ్యూన్ల వరకు) ఈ విధంగానే సాగింది. 'తా–చాయి నుండి నేర్చుకోండి' మొదలయిన ఆదేశాలు ఈ క్రమానికి చెందినవే. ప్రజల సంసిద్ధతతో సంబంధం లేకుండ పార్టీ తన అవగాహనా పరిపక్వతను ప్రదర్శించుకోవడం ప్రజాపంథా అనిపించుకోదు. From the masses, To the masses అన్నప్పుడు ప్రజలకు ఇచ్చే అవగాహన, ప్రజాముఖంగా జరిపే చర్చలు ప్రజల సంసిద్ధత మీద ఆధారపడక తప్పదు. అయితే ప్రజల సంసిద్ధత పేరు చెప్పి ఎప్పటికీ వెనకబడి ఉండిపోకుండ ప్రజలకు తమ సంసిద్ధతను అభివృద్ధి చేసుకునే అవకాశాన్నీ ప్రోత్సాహాన్నీ ఇవ్వాలి. ఆ అభివృద్ధిని ఆధారం చేసుకుని పార్టీ తన కార్యక్రమాన్ని పరిపుష్టం చేసుకోవాలి. ఈ విషయంలో చైనా కమ్యూనిస్టు పార్టీని తప్పుపట్టడం కష్టం. ఇది నేను కేవలం చైనా పార్టీనీ మావోనూ 'కాపాడడం' కోసం అంటున్నది కాదు. సాంస్కృతిక విప్లవానికి కనీసం ఆరేడు సంవత్సరాల పూర్వమే (1959–60 కాలంలో) మావో ఒక రచనలో ('క్రిటిక్ ఆఫ్ సోవియట్ ఎకనామిక్స్' అనే పేరుతో ఇది ప్రచురించబడింది) సాంస్కృతిక విప్లవం లేవదీసిన ఎన్నో ప్రశ్నలను స్పష్టంగా గుర్తించాడు. పునాది ఆర్థిక సంబంధాలు ఇంకా ఎంతగానో మారితే తప్ప అవి సోషలిస్టు సంబంధాలు కావని గుర్తించాడు. మారవలసిన మార్గాన్ని సూచిస్తూ, సాంస్కృతిక విప్లవంలో ముందుకొచ్చిన 'కార్మిక మేనేజ్‌మెంట్', 'త్రీ–ఇన్–వన్ బృందాలు' వగైరా విషయాలను ఆనాడే చెప్పాడు (క్రిటిక్ ఆఫ్ సోవియట్ ఎకనామిక్స్' పేజీ 68 చూడండి). ఆ రచన పార్టీలో చర్చకై

ఉద్దేశించబడింది కాబట్టి ఈ అవగాహన ఒక్క మావోకే పరిమితమయి ఉండేదని అనుకోవడానికి వీలు లేదు. 'షాంగై రాడికల్స్' అనీ, 'గ్యాంగ్ ఆఫ్ ఫోర్' అనీ పిలవబడ్డవాళ్ళకూ, ఇంకా ఎంతో మందికీ ఉండే ఉండాలి. సాంస్కృతిక విప్లవాన్ని వ్యతిరేకించిన వాళ్ళకు కూడ అది అర్థం అయ్యే ఉండాలి, లేకపోతే వాళ్ళు దాన్ని అంత బలంగా వ్యతిరేకించేవారు కాదు.

సాంస్కృతిక విప్లవ కాలంలో చైనాలో నిజంగా ఏం జరిగిందో మనకు ఇప్పటి దాకా తెలియదు. ఆ విప్లవ దశలో ఆసాంతం పాల్గొన్న వాళ్ళెవరయినా పాక్షికంగా కాకుండ సమగ్రంగా ఆనాటి చరిత్రను చెప్పేదాకా మనకు తెలిసే అవకాశం లేదు. అయితే బెతెల్‌హేం అన్నట్టు సాంస్కృతిక విప్లవం ఎన్నో కొత్త ప్రశ్నల్ని లేవదీసింది. ఉబుసుపోకకు కాకుండ ఆచరణాత్మకంగా లేవదీసింది. ఈ ప్రశ్నలకు సమాధానంగా కొన్ని కొత్త విప్లవ సంప్రదాయాలను చూపింది. వాస్తవంలో అవి ఎంత త్వరలో ఎంత వక్రరూపం తీసుకున్నప్పటికీ వాటి ఆవిష్కరణ మాత్రం అబద్ధం కాదు. ఆ కాలంలో చైనాలో పర్యటించిన పాశ్చాత్యులు చాలామంది సాంస్కృతిక విప్లవం మీద పుస్తకాలు రాసారు. వాళ్ళలో ఎడ్గార్‌స్నో వంటి ఉదారవాదుల నుండి బెతెల్‌హేం వంటి మార్క్సిస్టులు దాకా చాలా రకాలు ఉన్నారు. అందరూ కూడ మనకు ఎంతో ఉత్తేజకరమయిన చిత్రాన్నే ఇచ్చారు. ఆ చిత్రం ఎంతవరకు వాస్తవమో, ఎంతవరకు ఆ నూతన సంప్రదాయాల మైకంలో తమ ఆశలకూ ఆశయాలకూ ఆయా రచయితలు ఇచ్చుకున్న కాల్పనిక వ్యక్తీకరణో మనకు తెలీదు. ఎందుకంటే సాంస్కృతిక విప్లవాన్ని వ్యతిరేకించే వాళ్ళు అంతకు సమానమైన వికారమయిన చిత్రాన్ని ఇస్తున్నారు కాబట్టి. అయితే ఆ చిత్రం ఇచ్చిన ఉత్తేజం నిష్ప్రయోజనం కానట్టే, అది లేవదీసిన ప్రశ్నలనూ ఆవిష్కరించిన సంప్రదాయాలనూ చర్చించడం కూడ నిష్ప్రయోజనం కాదు. సాంస్కృతిక విప్లవం ఎందులో విఫలమయినా ఒక్క విషయంలో మాత్రం విజయాన్ని సాధించింది. సోషలిస్టు దేశాలు చేసేది ఉత్పత్తిలో పెట్టుబడిదారీ దేశాలతో పోటీపడడం మాత్రమేనా అని ప్రశ్నిస్తున్న వాళ్ళకు ఒక కొత్తబాటను చూపింది, భవిష్యత్తు మీద ఒక కొత్త వెలుగును ప్రసరింపజేసింది.

ఆ ప్రశ్నలేమిటో చూద్దాం.

1. 'సోషలిస్టు విప్లవం' అనేది ఉపరితలాన్నే కాదు, పునాది ఆర్థిక సంబంధాలను కూడ ఒక్కసారిగా మార్చదు. పునాది ఆర్థిక సంబంధాలలో మూడు అంశాలు

ఉంటాయని మావో తన 'క్రిటిక్ ఆఫ్ సోవియట్ ఎనామిక్స్'లో అంటాడు (ఇక మీదట ఈ పుస్తకాన్ని 'క్రిటిక్' అంటాను). ఒకటి ఆస్తి సంబంధం, అంటే ఉత్పత్తి సాధనాల యాజమాన్య సంబంధం. దీన్ని సోషలిస్టు విప్లవం త్వరలో కాకపోయినా ఒక క్రమంలో పరిష్కరిస్తుంది. భారీ పరిశ్రమల్ని ఆస్తిగా మారుస్తుంది. క్రమంగా గ్రామస్థాయి నుండి కమ్యూన్ స్థాయి దాకా సమిష్టీకరణను పెంచుతుంది. కమ్యూన్ స్థాయి నుండి అది మొత్తం జాతి యొక్క సమిష్టి ఆస్తి అయిననాడే భూమి అనే ఆస్తి సంబంధం సోషలిస్టు సంబంధం అవుతుందని మావో పదే పదే అంటాడు.

అయితే ఆస్తి సంబంధం ఆర్థిక సంబంధాలలో ఒక అంశం మాత్రమే. రెండవది, ఒక ఫ్యాక్టరీలో లేక ఒక ఉత్పత్తి యూనిట్‌లో పనిచేసే వాళ్ళందరి మధ్య వుండే సంబంధాలు. ఒక ఫ్యాక్టరీలో కార్మికులు, మేనేజర్లు, సాంకేతిక నిపుణులు, గుమాస్తాలు, సైంటిస్టులు ఉంటారు. కార్మికులలోనే ఎన్నో రకాలు ఉంటారు. నిపుణులయినవాళ్ళు, కానివాళ్ళు ఉంటారు. వీళ్ళందరి మధ్య వున్న సంబంధాలు ఏమిటి? ఆ సంబంధాలు ఎట్లా వుంటే అవి సోషలిస్టు ఉత్పత్తి సంబంధాలు అవుతాయి? సాంస్కృతిక విప్లవానికి పూర్వం చైనా ఈ విషయంలో సోవియట్ నమూనాను అనుసరించింది. ఈ నమూనాలో సోషలిస్టు ఫ్యాక్టరీకి, బూర్జువా ఫ్యాక్టరీకి మధ్య పెద్దగా తేడా వుండదు. ఫ్యాక్టరీలోని వివిధ సెక్షన్ల మధ్య అవే సంబంధాలు ఉంటాయి. కార్మికులు చేయమన్న పని, చేయమన్నప్పుడు చేస్తారు. సూపర్‌వైజర్లు కార్మికులు పనిదొంగలు కాకుండ పర్యవేక్షణ చేస్తారు. సాంకేతిక సిబ్బంది (టెక్నీషియన్లు, సైంటిస్టులు) సాంకేతిక విషయాలు చూసుకుంటారు. మేనేజర్లు మొత్తం ఫ్యాక్టరీని నడుపుతారు. ఈ సిబ్బంది మధ్య బూర్జువా ఫ్యాక్టరీలో వుండే పని విభజన (division of labour), అధికార అంతస్తులు (power hierarchy) అట్లాగే కొనసాగుతాయి. వేతనాల అంతస్తులు మాత్రం కొద్దిమేరకు తగ్గుతాయి. అయితే ఒక్క తేడా వుంటుంది. బూర్జువా ఫ్యాక్టరీలో మేనేజ్‌మెంట్‌కు స్వయం ప్రతిపత్తి ఉంటుంది. సోవియట్ నమూనాలో మేనేజ్‌మెంట్‌కు చాలా పరిమితమయిన అధికారం ఉంటుంది. అసలు నిర్ణయాలు చాలావరకు పై స్థాయిలో జరుగుతాయి, వాటిని సమర్థవంతంగా అమలు చేయడం మాత్రమే మేనేజ్‌మెంట్ బాధ్యత. ఈ విషయంలో కూడ మేనేజ్‌మెంటును పర్యవేక్షించేందుకు ఫ్యాక్టరీలో ఒక పార్టీ కమిటీగాని, పార్టీ బాధ్యులుగాని వుంటారు.

ఈ కమిటీని పార్టీయే నియమిస్తుంది తప్ప ఫ్యాక్టరీలోని కార్మికులు ఎన్నుకోరు. (ఇది స్టాలిన్ కాలంనాటి సోవియట్ నమూనా. ప్రస్తుతం సోవియట్ రష్యాలో ఈ ఒక్క తేడాను కూడ తొలగించి ఫ్యాక్టరీ మేనేజ్‌మెంట్‌కు స్వయంప్రతిపత్తి ఇచ్చే క్రమం కొనసాగుతోంది. ఈ బూర్జువాకరణను ప్రజాస్వామీకరణ అని ప్రశంసిస్తున్నారు కూడ!)

సాంస్కృతిక విప్లవం ఈ రకమయిన సంబంధాలు బూర్జువా సంబంధాలే తప్ప సోషలిస్టు సంబంధాలు కావని ప్రకటించింది. అంటే ఉపరితలాన్ని విప్లవీకరించడానికి బయలుదేరిన విప్లవం పునాదిలోనే ఇంకా విప్లవం రావలసి వుందని గుర్తించింది. కొన్ని కొత్త సంప్రదాయాలను సృష్టించింది. పార్టీ చేత నియమింపబడే పార్టీ కమిటీలను తొలగించి కార్మికుల చేత ఎన్నుకోబడే విప్లవ కమిటీలను ఏర్పాటు చేసింది. మేనేజర్లయిన వాళ్ళు వారంలో ఒకటి రెండు రోజులు సాధారణ కార్మికులలాగ యంత్రాలతో పనిచేయాలని, సాధారణ కార్మికులు కూడ మేనేజ్‌మెంట్ బాధ్యతలు చేపట్టాలని నియమం పెట్టింది. అంటే 'కార్మిక' మేనేజ్‌మెంట్'ను ప్రవేశపెట్టింది. ఫ్యాక్టరీ యొక్క అభివృద్ధికి సంబంధించిన విషయాలు నిర్ణయించడానికి త్రీ-ఇన్-వన్ కమిటీలు ఏర్పడ్డాయి. ఇందులో కార్మికులు, సాంకేతిక నిపుణులు, పార్టీ కేడరు ఉంటారు. అంటే శ్రామిక అనుభవం, సాంకేతిక పరిజ్ఞానం, రాజకీయ పంథా మూడూ కలిసి ఉమ్మడిగా ఫ్యాక్టరీని నడుపుతాయి. (ఇక్కడ ఫ్యాక్టరీ అన్నది అన్ని రకాల ఉత్పత్తి యూనిట్లకూ వర్తిస్తుంది. వ్యవసాయక్షేత్రాలు, పశుపోషక కేంద్రాలు వగైరా.) అంతేకాక, పార్టీ కేడరు కూడ వారానికి కొన్ని రోజులు శ్రామికులతో పాటు శారీరక శ్రమ చేయాలి. ఇదంతా కూడ ఉత్పత్తి సంబంధాలలో గణనీయమయిన విప్లవం అని వేరే చెప్పనవసరం లేదు. దీనికి బెతెల్‌హాం అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్టు కనిపిస్తుంది. రంగనాయకమ్మ గారు కూడ అన్ని విషయాల కంటే 'కార్మిక మేనేజ్‌మెంట్'కే ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చారు.

ఈ కొత్త సంబంధాలు ఎంతకాలం ఎన్ని ప్రాంతాలలో అమలు చేసారో తెలీదు. కొన్ని చోట్ల తిరిగి వెనక్కిపోయారు. కొన్ని చోట్ల అసలు నిపుణులుగాని, మేనేజ్‌మెంట్‌గాని, పార్టీ నాయకత్వంగాని అవసరమే లేదనే అతివాదానికి పోయారు. 1976లో ప్రతీఘాతుక విప్లవం విజయవంతమయిన తరువాత ఈ ప్రయోగాన్నే అతివాదంగా ప్రకటించి మళ్ళీ పాత నమూనాను చేపట్టారు. అయితే నిత్య జీవిత ఆచరణలో

భాగమయిపోయిన ఏ సంప్రదాయమూ కేవలం ప్రకటనలతో నాశనం కాదు. కాబట్టి, ఈ కొత్త సంబంధాలు పూర్తిగా రూపుమాసిపోయాయని నమ్మడానికి వీలు లేదు (ముఖ్యంగా వ్యవసాయ కమ్యూన్లలో).

ఉత్పత్తి సంబంధాలలో మావో చెప్పిన మూడవ అంశం పంపిణీ విధానం (distribution). సమాజం ఉత్పత్తి చేసే వివిధ పదార్థాలను ప్రజలందరికీ ఏ ప్రాతిపదిక మీద పంపకం చేయాలో నిర్ణయించే విధానం ఇది. అసలు ఏయే పదార్థాలు ఉత్పత్తి అవుతాయో కూడ పంపిణీ విధానమే కొంతమేరకు నిర్ణయిస్తుంది. నిజానికి పంపిణీ విధానం సామాజిక సంబంధాలలో చాలా కీలకమయినది. గ్రామాలకూ పట్టణాలకూ మధ్య అసమానత, బుద్ధిజీవులకూ శ్రామికులకూ మధ్య అసమానత, స్త్రీలకూ పురుషులకూ మధ్య అసమానత – అన్నీ కూడ పంపిణీ విధానంతో సన్నిహితంగా ముడిపడి వుండే సామాజిక సంబంధాలు. ఈ పంపిణీ విధానాన్ని నిర్ణయించే విషయాలు చాలా వుంటాయి. వేతన విధానం వాటిలో ముఖ్యమయినది. ఒకప్పుడు వేతన విధానం పెట్టుబడిదారీ దేశాలలో లాగే ఉండేదని మావో చెప్పినట్టు బెతెల్‌హాం అంటాడు. పైగా, పనికాలాన్ని బట్టి వేతనం (time-rate) ఇచ్చే పద్ధతి కూడ ఉండేది. దీనివల్ల కార్మికులు సమిష్టిగా కాక ఒకరితో ఒకరు పోటీపడి ఎంత ఎక్కువ ఉత్పత్తి చేస్తే అంత ఆదాయం లభిస్తుందనే స్వార్థంతో పనిచేస్తారు. ఇది కుటుంబ సంబంధాల మీద కూడ ప్రభావం వేస్తుంది. కార్మికులు ఎక్కువ ఉత్పత్తి చేయడం కోసం తమ భార్యా పిల్లల చేత కూడ విపరీతంగా శ్రమ చేయిస్తారు. (మన దేశంలో కాంట్రాక్ట్ లేబర్ ఉన్నచోట – తునికాకు నుండి రాళ్ళుకొట్టేపని దాకా – ఈ విషయం కనిపిస్తుంది.) సాంస్కృతిక విప్లవంలో దీన్ని పూర్తిగా రద్దుచేసారు. వేతన గ్రేడ్లు కూడ తగ్గించారు. అయినప్పటికీ 1975 నాటికి 8 గ్రేడ్ల (అంతస్తుల) వేతన విధానం ఉండిందని బెతెల్‌హాం అంటాడు. అయినా, చైనాలో వున్నంత సమానత ఏ దేశంలోనూ లేదని బూర్జువా పరిశీలకులు సహితం ఒప్పుకుంటున్నారు.

ప్రస్తుతం ఈ సమానతలో వెనకడుగు వేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. నిపుణులకు వేతనాలూ, సౌకర్యాలూ పెంచారు. పని ఎక్కువ చేస్తే కూలి ఎక్కువ ఇచ్చే ఆర్థిక ప్రోత్సాహకాలను (material incentives) ప్రయోగిస్తున్నారు. దీన్ని సోవియట్ రష్యాలో ఎన్నడో సిద్ధాంతీకరించారు. ఆర్థిక ప్రోత్సాహకాల వల్ల కార్మికులు ఎక్కువ డబ్బు సంపాదించాలనే స్వార్థంతో సోషలిస్టు వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు కావలసిన

ఎక్కువ ఉత్పత్తిని సమకూరుస్తారనీ, ఈ విధంగా సోషలిస్టు వ్యవస్థ అవసరాలకూ, కార్మికుడి స్వార్థానికీ సమన్వయం కుదురుతుందనీ వాళ్ళు తీర్మానించారు. దీన్ని గురించి మావో తన 'క్రిటిక్'లో 'ఇలాగయితే పెట్టుబడిదారీ విధానాన్ని మించింది లేదు' అని వేళాకోళంగా అంటాడు. మరి ఆర్థికరంగాన్ని పటిష్ఠం చేసేందుకు కావలసిన ప్రోత్సాహం ఎక్కడి నుండి రావాలంటే రాజకీయ చైతన్యం నుండి అంటాడు. కార్మికుడు సోషలిస్టు వ్యవస్థను 'తన సమాజం'గా అనుకొని పటిష్ఠం చేయాలేగాని డబ్బు ఆశతో కాదు. ఆర్థికరంగంలో Politics in Command అంటే అర్థం ఇదే. సాంస్కృతిక విప్లవంలో దీన్ని అమలుచేసే ప్రయత్నం చేసారు. కొన్ని చోట్ల అన్ని రకాల ఆర్థిక ప్రోత్సాహకాలనూ రద్దుచేసారు. అయితే ఇప్పటి ప్రభుత్వం సోవియట్ నమూనాలో ఆర్థిక ప్రోత్సాహకాల స్వార్థం ప్రాతిపదికగా చైనా యొక్క 'నాలుగు విధాల ఆధునీకరణ'ను సాధించాలని చూస్తోంది.

సాంస్కృతిక విప్లవం ముట్టుకోని ముఖ్యమయిన ఆర్థిక సంబంధాలు రెండున్నాయి. ఒకటి సరుకుల ఉత్పత్తి (Commodity Production), రెండవది పునరుత్పత్తి క్రమం (Process of Reproduction). ఇవి రెండు కూడ ఒకంతట పరిష్కారమయ్యే సమస్యలు కావు. కాబట్టి వీటిని సాంస్కృతిక విప్లవం పట్టించుకోక పోవడంలో వింత లేదు. సాంస్కృతిక విప్లవం సిద్ధాంత చర్చ కాదు. ఆచరణాత్మకమయిన పోరాటం. సామాజిక ఆచరణలో మానవుడు తనకు అప్పటికి సాధ్యమయ్యే కర్తవ్యాలను మాత్రమే ఎంచుకుంటాడు. (Mankind always sets itself only such tasks as it can achieve అని మార్క్స్ అన్నాడు.) కాని, ఆధునిక రివిజనిజం అంటే ఏమిటో, సోషలిస్టు సంబంధాలు ఏ విధంగా ఉండాలో, ఆధునిక రివిజనిజం వర్గ పునాది ఏమిటో ఇత్యాది విషయాలను సిద్ధాంత చర్చ చేసే బెతెల్‌హాం కూడ వీటిని పట్టించుకోకపోవడం ఆశ్చర్యమే.

మొదట సరుకుల ఉత్పత్తిని తీసుకుందాం. ఉత్పత్తి అయ్యే పదార్థాలు 'మారకపు విలువల' కోసం ఉత్పత్తి కావడం, అంటే మార్కెట్‌లో అమ్మకం కోసమే ఉత్పత్తి కావడం సరుకుల ఉత్పత్తి. ఇది బూర్జువా సమాజపు ప్రధాన లక్షణాలలో ఒకటి. ఈ సరుకుల ఉత్పత్తి పోవాలంటే మొత్తం సమాజం యొక్క వివిధ అవసరాలను కనుక్కొని (నిర్ణయించి), వాటిని తీర్చడానికి అవసరమయిన ఉత్పత్తిని చేయించి, ఆ అవసరాలకు

అనుగుణంగా పంపిణీ విధానాన్ని రూపొందించి సమగ్రంగా అమలు చేయాలి. ఇది ఒక్కరోజులో గాని, 30 సంవత్సరాలలో గాని అయ్యే పని కాదు. ఈ సరుకుల ఉత్పత్తి ఉన్నంతకాలం బూర్జువా చైతన్యంగాని, బూర్జువా తరహా ఆర్థిక సంక్షోభాలుగాని పూర్తిగా మాసిపోవు. భూసారం, వనరులు, సాంకేతిక సంస్కృతి మొదలయిన విషయాలలో కొంత అభివృద్ధి చెందిన ప్రాంతాలు ఆ విషయాలలో వెనుకబడ్డ ప్రాంతాల కంటే ఎక్కువ ఉత్పత్తి, ఎక్కువ (తలసరి) ఆదాయం కలిగి వుండక తప్పదు. అంటే, ఫ్యాక్టరీ లోపల బెతెల్‌హేం గాని రంగనాయకమ్మగారు గాని కోరుకునే 'కార్మిక మేనేజ్‌మెంట్', 'త్రీ-ఇన్-వన్ వ్యవస్థ' వగైరా అన్నీ ఉండవచ్చు కాని ఆ ఫ్యాక్టరీ ఉత్పత్తి చేసేవి అమ్మకపు సరుకులయినంత కాలం అది సోషలిస్టు సంబంధం అనిపించుకోదు. యుగొస్లావియాలో ఈ విధంగానే 'కార్మిక మేనేజ్‌మెంట్' ఆధిపత్యంలో లాభం కోసం అమ్మకపు సరుకులను ఉత్పత్తి చేయిస్తున్నారు. అప్పుడు వివిధ ఫ్యాక్టరీలలోని కార్మిక మేనేజర్లు సమిష్టి పెట్టుబడిదార్లు మాత్రమే అవుతారు.

రెండవది పునరుత్పత్తి క్రమం. ఉత్పత్తి క్రమం, పునరుత్పత్తి క్రమం పెనవేసుకొని ఉంటాయి. ఉత్పత్తి క్రమం అంటే ముడిసరుకు ఫ్యాక్టరీలోకి ప్రవేశించిన దగ్గర నుండి ఒక వస్తువు ఉత్పత్తి అయేదాకా నడిచే క్రమం. ఇట్లా ఉత్పత్తి అయిన మొత్తం వస్తువులు వాడకానికి పంపిణీ కావు. కొంతభాగం పొదుపు చేయబడుతుంది. అంటే మూలధనం (మామూలు పరిభాషలో పెట్టుబడి, Capital) లో కలుస్తుంది. దీన్ని ఏం చేయాలి? అందులో ఎంత భాగం మళ్ళీ ఉత్పత్తికి వినియోగించాలి, ఎంత భాగం సాంఘిక సంక్షేమం కోసం వినియోగించాలి? మళ్ళీ ఉత్పత్తికి వినియోగించేటట్లయితే ఏ ఉత్పత్తిలో పెట్టాలి? ఆయుధాలా, ఔషధాలా, ధాన్యమా, కలర్ టెలివిజనా? సాంఘిక సంక్షేమం కోసం అంటే పట్టణంలో పార్కులా, పల్లెలో ఆస్పత్రులా? ఈ నిర్ణయాలను తీసుకునేది పునరుత్పత్తి క్రమం. ఈ నిర్ణయాలే పునరుత్పత్తి క్రమం. ఇవ్వాల్టి ఉత్పత్తిలోని మిగులును ఎట్లా వినియోగించాలో నిర్ణయించడం ద్వారా పునరుత్పత్తి క్రమం రేపటి ఉత్పత్తి క్రమం యొక్క రూపురేఖలనూ, దానితోబాటు సమాజం యొక్క పురోగమన మార్గాన్నీ నిర్ణయిస్తుంది. ఇంత కీలకమయిన విషయాన్ని బెతెల్‌హేం ఈ వ్యాసంలో ప్రస్తావవశంగా తప్ప ప్రత్యక్షంగా ఎక్కడా చర్చించడు. రంగనాయకమ్మ గారికి అసలు ఆ పట్టింపే లేదు. లేకపోబట్టి, బెతెల్‌హేం పునరుత్పత్తి క్రమాన్ని ప్రస్తావించిన ఒక్క సందర్భంలోనూ (పేజీలు 158-159) దాన్ని ఆమె తప్పుగా అర్థం

చేసుకోవడం వల్ల (పేజీలు 159-160లలోని ఫుట్‌నోట్ పూర్తిగా అసందర్భంగానూ, అయోమయంగానూ వుంది) అది తెలుగు పాఠకుడికి అందకుండ పోయే ప్రమాదం ఉంది. ఫ్యాక్టరీ లోపల 'కార్మిక మేనేజ్‌మెంట్' ఉండవచ్చు. మేనేజర్లూ, కేడరూ శ్రమ చేయడం, కార్మికులు నిర్ణయాలు తీసుకోవడం ఉండవచ్చు. ఇవన్నీ ప్రధానంగా ఉత్పత్తి క్రమానికి మాత్రమే సంబంధించిన విషయాలు. కాని పునరుత్పత్తి క్రమం మీద వారికి నిర్ణయాధికారం ఉండదు. కొద్దిపాటి అజమాయిషీ మాత్రమే ఉంటుంది. ప్రధానమయిన నిర్ణయాలు పైస్థాయి అధికారులు, కేంద్ర ప్లానింగ్ బాధ్యులు తీసుకుంటారు. అంతిమంగా ప్రధాన నిర్ణయాలు పార్టీవే అయి వుంటాయి. ఈ నిర్ణయాల గురించి కార్మికులను 'మహా అయితే సంప్రదించడం మాత్రం చేసారు', సాంస్కృతిక విప్లవకాలంలో కూడ. 'అదైనా అన్ని అంశాలలోనూ కాదు. ఇక్కడొక అంశంలో, అక్కడొక అంశంలో మాత్రమే' అని బెతెల్‌హాం అంటాడు. ఈ విధంగా పునరుత్పత్తి క్రమంలో మౌలికంగా పరివర్తన సాధించకపోవడం వల్ల ఉత్పత్తి క్రమంలో తెచ్చిన పాక్షికమయిన మార్పులు ముందుకు సాగలేకపోయాయి అని కూడ గుర్తిస్తాడు (పేజీ 158 చివరిలైన్లు).

ఈ గుర్తింపును ముందుకు తీసుకుపోకపోవడం బెతెల్‌హాంలోని ముఖ్యమయిన లోపం. తీసుకుపోతే కొన్ని విషయాలు అర్థమయి ఉండేవి.

పునరుత్పత్తి క్రమం మీద కూడ శ్రామికులకు ఆధిపత్యం రావడానికి చాలాకాలం పడుతుంది. ఆ కారణంగానే సాంస్కృతిక విప్లవం దాన్ని సాధించలేకపోయింది. అందుకే ఆ ఆధిపత్యం వచ్చేవరకు కార్మికుల తరఫున పార్టీ లేదా పార్టీచేత నియమించబడ్డ నిపుణులు ఈ పని చేయక తప్పలేదు. మరి ఈ సంబంధాన్ని ఎట్లా అర్థం చేసుకోవాలి? అది ఎప్పుడు సోషలిస్టు సంబంధం అవుతుంది, ఎప్పుడు బూర్జువా సంబంధం అవుతుంది? ఈ నిర్ణయాలు తీసుకునే వ్యక్తులను ఎప్పుడు కార్మికవర్గం యొక్క అగ్రగామి దళంగా గుర్తించాలి, ఎప్పుడు కొత్త బూర్జువా వర్గంగా గుర్తించాలి? ఫ్యాక్టరీ లోపల ('కార్మిక మేనేజ్‌మెంట్' వగైరా) సోషలిస్టు సంబంధాలు లేకుండ బూర్జువా సంబంధాలు ఉన్నంతకాలం ఆ ఫ్యాక్టరీలోని మేనేజర్లు, నిపుణులు, సూపర్‌వైజర్లు మొదలయిన వాళ్ళను కొత్త బూర్జువా వర్గంగా బెతెల్‌హాం లెక్కిస్తాడు. అంతవరకు బాగానే వుందనుకున్నా, ఉత్పత్తి క్రమం కన్నా పునరుత్పత్తి క్రమం

కీలకమయినదని అర్థం చేసుకుంటే, నిజమయిన ఆధిపత్యం చెలాయించేది ఫ్యాక్టరీ మేనేజర్లు కాదు, పైస్థాయి అధికారులు (పార్టీ నాయకత్వంతో సహా) అని గుర్తిస్తాము. అటువంటప్పుడు పునరుత్పత్తి క్రమంలో ఏది సోషలిస్టు సంబంధమో ఏది బూర్జువా సంబంధమో చర్చించకుండ నిజమయిన కొత్త బూర్జువా వర్గాన్ని గుర్తించగలుగుతామా? పునరుత్పత్తి క్రమంలో సోషలిస్టు సంబంధం నెలకొనడానికి చాలాకాలం పడుతుంది కాబట్టి, అంతవరకు సమాజంలోని పైస్థాయి అధికారులంతా (పార్టీతో సహా) కొత్త బూర్జువా వర్గంగా లెక్కించవలసిందేనా? ఇది చాలా లోపభూయిష్టమయిన అవగాహన అని వేరే వివరించనక్కరలేదు. మొత్తానికి ఆధునిక రివిజనిజం, పెట్టుబడిదారీ పునరుద్ధరణ మొదలయిన వాటికి గల వర్గపునాదిని విశ్లేషించడంలో బెతెల్‌హాం వ్యాసం చాలా అసంతృప్తికరంగా వుంది.

2. సోషలిస్టు విప్లవం అనేది ఆర్థిక పునాదిని మాత్రమే కాదు, రాజ్యాధికారాన్ని కూడ ఒక్కసారిగా మార్చదు. కార్మికవర్గం బూర్జువా రాజ్యాంగ యంత్రాన్ని చేజిక్కించుకొని తాను నడపడం సాధ్యం కాదు. అది బూర్జువా రాజ్యాంగ యంత్రాన్ని నాశనం చేసి కొత్త రాజ్యాంగయంత్రాన్ని నిర్మించాలని లెనిన్ చెప్పాడు. సోషలిస్టు విప్లవం ఏ విధంగానయితే ఆర్థిక పునాదిలో ఒక్క ఆస్తి సంబంధాన్ని మాత్రమే వెనువెంటనే విప్లవీకరించడం ప్రారంభిస్తుందో, రాజ్యాధికారం విషయంలో కూడ వెనువెంటనే కేవలం రాజ్యాంగయంత్రం మీద బూర్జువా పెత్తనం స్థానంలో కార్మికవర్గం ఆధిపత్యాన్ని ప్రవేశపెడుతుంది. అంటే బూర్జువా రాజ్యాంగయంత్రం యొక్క నిర్మాణం ఎప్పట్లాగే కొనసాగుతుంది. కాని ఊరి మునిసిపాలిటీల నుండి కేంద్ర బ్యూరోక్రసీ వరకు బూర్జువా రాజ్యాంగయంత్రంలో భాగమైన పాలనా యంత్రాంగం అంతా కూడ కార్మిక ఆధిపత్యంలోకి వస్తుంది. అయితే లెనిన్ చెప్పినట్టుగా దీనిని ఉన్నదున్నట్టే తన ప్రయోజనాల కోసం వాడుకోవడం కార్మిక వర్గానికి సాధ్యం కాదు. దాన్ని మొత్తం ధ్వంసం చేసి కొత్త రాజ్యాంగయంత్రాన్ని నిర్మించాలి. ఈ విషయాన్ని కూడ సాంస్కృతిక విప్లవమే గుర్తించి ఆచరించే ప్రయత్నం చేయాల్సి వచ్చింది. అంతవరకు సోవియట్ నమూనాను అనుసరించారు. ఆ నమూనాలో పాత పాలనాయంత్రాంగం అట్లాగే కొనసాగుతూ దాని మీద పార్టీ అజమాయిషీ మాత్రం కొత్తగా ఏర్పడింది. ఉదాహరణకు, పురపాలనను నిర్వహించే మునిసిపాలిటీలు ఎప్పటిలాగే ఉంటాయి. అయితే ఇప్పుడొక

నగరపార్టీ కమిటీ ఆ పురపాలనా యంత్రాంగం మీద అజమాయిషీ చేస్తుంది. ఈ పార్టీ కమిటీని ఆ నగర ప్రజలు ఎన్నుకోరు. పార్టీయే నియమిస్తుంది (మహా అయితే పార్టీసభ్యులు ఎన్నుకోవచ్చు). అన్ని స్థాయిలలోని పాలనా యంత్రాంగమూ ఇంతే.

అయితే మార్క్స్ కార్మిక నియంతృత్వంలోని రాజ్యాంగయంత్రానికి ప్యారిస్ కమ్యూన్‌ను నమూనాగా చూపాడు. పాలనాయంత్రాంగాన్ని ప్రజలు ఎన్నుకుంటారు. పాలనాధికారులకు అతితక్కువ జీతాలుంటాయి. వాళ్ళు సరిగ్గా పనిచేయకపోతే వాళ్ళను వెనక్కి తీసుకునే హక్కు ప్రజలకుంటుంది. లెనిన్ కూడ కార్మికుల చేత, రైతుల చేత ఎన్నుకోబడ్డ సోవియట్లకు సర్వాధికారాలూ ఇవ్వాలన్నాడు. అయితే అది ఆయన కాలంలోగాని, తరువాతగాని రష్యాలో అమలు కాలేదు. చైనాలో మాత్రం సాంస్కృతిక విప్లవకాలంలో అమలుచేసే ప్రయత్నం చేసారు. చాలాచోట్ల పార్టీ నియమించిన పార్టీ కమిటీల స్థానంలో ప్రజలు ఎన్నుకున్న విప్లవ కమిటీలను ఏర్పరచారు. ఇది పాక్షికమయిన మార్పు మాత్రమే. ఎందుకంటే పరిపాలనాయంత్రాంగం నిర్మాణం మాత్రం పాత పద్ధతిలోనే కొనసాగింది. ఒక్క షాంగై నగరంలో మాత్రమే కమ్యూన్ ఏర్పరచే ప్రయత్నం చేసారు. అది కూడ ఎక్కువకాలం నిలవలేదు.

3. 'సోషలిజం కమ్యూనిజానికి పరిణామం చెందాలి' (Socialism must make the transition to Communism) అని మావో తన 'క్రిటిక్'లో అంటాడు. సోషలిజం ఒక పరిణామదశ. పెట్టుబడిదార్లను కూలదోసిన తరువాత కార్మిక నియంతృత్వాన్ని నెలకొల్పి సమాజాన్ని కమ్యూనిజం వైపు నడిపించే దశ సోషలిజం. పరిణామదశ ఆ పరిణామాన్ని సాధించాలి. అప్పుడే అది సార్థకమయినట్టు. కమ్యూనిజాన్ని సాధించడం అంటే అన్ని సామాజిక సంబంధాలనూ విప్లవీకరించి అయిదువేల సంవత్సరాల నాగరికత క్రమంలో పేరుకుపోయిన కుళ్ళునంతా కడిగేయాలి. అసమానతనూ దోపిడీ పీడనలనూ రూపుమాపాలి. గ్రామానికీ పట్టణానికీ, బుద్ధి జీవులకూ శారీరక శ్రమచేసే వాళ్ళకూ, స్త్రీలకూ పురుషులకూ మధ్యన వుండే అసమాన సంబంధాలను తొలగించాలి.

గ్రామానికీ పట్టణానికీ మధ్యనున్న అసమాన సంబంధాన్ని తొలగించే ప్రయత్నం చైనాలో 1958 నుండే ప్రారంభమయింది. దీనికి అవలంబించిన నిర్మాణం వ్యవసాయ కమ్యూన్ వ్యవస్థ. కమ్యూన్ అనేది కొన్ని గ్రామాల కలయిక. భూమి,

తదితర ఉత్పత్తి సాధనాలు చాలావరకు కమ్యూన్ యొక్క సమిష్టి ఆస్తిగా వుంటాయి. ఈ కమ్యూన్‌ను పారిశ్రామికంగా కూడ వీలయినంత స్వయం సమృద్ధం చేసే ప్రయత్నం చేసారు. చివరికి విద్యుత్తు, ఉక్కు వంటి పరిశ్రమలను కూడ కమ్యూన్‌ల పెరట్లోకి తీసుకొచ్చారు. పరిశ్రమలనూ, వాటికి అనుబంధమయిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్నీ గ్రామాలకు తీసుకుపోయినప్పుడే గ్రామాలకూ పట్టణాలకూ మధ్యనున్న అసమానత నాశనమవుతుంది. యావత్ బూర్జువా ప్రపంచం ఈ ప్రయోజనాన్ని దుందుడుకుతనమని దూషించింది. ఇప్పటి ప్రభుత్వం కూడ వారికి వంతపాడుతూ దానిని 'విఘాతం'గా (disaster) ప్రకటించింది. గ్రామాల పారిశ్రామీకరణ స్థానంలో వ్యవసాయ ఆధునీకరణ అనే కార్యక్రమాన్ని ముందుకు తెస్తోంది. ఈ రెండింటికీ పరస్పర విరుద్ధ స్వభావం ఉంటుంది. గ్రామాల పారిశ్రామీకరణ అనేది పరిశ్రమలను గ్రామాలకు తెచ్చి గ్రామాల పరాధీనతను తొలగిస్తుంది. తద్వారా వ్యవసాయ ఆధునీకరణను కూడ సాధిస్తుంది. అది లేకుండ కేవలం వ్యవసాయాన్ని ఆధునీకరిస్తే అది గ్రామాలను మరింతగా పట్టణాల మీద ఆధారపడేలాగ చేస్తుంది.

ఉదాహరణకు మన దేశంలో గ్రామాల మీద పట్టణాల పెత్తనం అనేది వ్యవసాయరంగం యొక్క ఆధునీకరణ తరువాత పెరిగిందేగాని తరగలేదు. పట్టణాల మీదే కాదు, సామ్రాజ్యవాద దేశాల మీద, సామ్రాజ్యవాద ద్రవ్యసంస్థల మీద ఆధారపడడం కూడ ఎక్కువ అవుతుంది. గ్రామాలు పట్టణాలకు ఆహారం సరఫరా చేస్తూ, పట్టణాల నుండి యంత్రాలూ, ఆధునిక సామగ్రిని దిగుమతి చేసుకోవడమనేది పెట్టుబడిదారీ అసమాన సంబంధాల స్వరూపం. దీనిని వ్యతిరేకించడానికి 1958 నుండి చేసిన ప్రయత్నాన్నంతా కాదని ఇవ్వాళ ఈ అసమాన సంబంధాన్ని పునరుత్పత్తి చేస్తున్నారు.

బౌద్ధికశ్రమకూ శారీరకశ్రమకూ మధ్యనున్న వర్గసమాజ సంబంధం వేతనాలలోని తేడాలను తొలగించినంత మాత్రాన రూపుమాసిపోదు. ప్రొఫెసర్లకూ కూలీలకూ ఇచ్చే వేతనాలలోని అంతరాన్ని చాలావరకు తగ్గించారు కాని అది చాలదు. ఈ రెండు రకాల శ్రమకూ మధ్యనున్న సహజ గతితార్కిక సంబంధాన్ని గుర్తించి అమలులోకి తేవాలి. సామాజిక ఉత్పత్తి యొక్క అనుభవం నుండి విజ్ఞానం పుడుతుంది. ఆ విజ్ఞానం తిరిగి ఉత్పత్తి రంగాన్ని అభివృద్ధి చేస్తుంది. గతితార్కిక సంబంధం యొక్క

రెండు ధ్రువాలను వర్గసమాజం తొలుత విడగొట్టింది. పెట్టుబడిదారీ సమాజం దానిని పూర్తిగా వేరుచేసింది. వాటిని తిరిగి కలపడం కోసం ఫ్యాక్టరీలలో త్రీ-ఇన్-వన్ బృందాలు (కార్మికులు, కేడర్లు, నిపుణులు కలిసి నిర్ణయాలు తీసుకునే ఏర్పాటు) ఏర్పరచారు. అంతకంటే లోతయిన ప్రయోగం విద్యారంగంలో జరిగింది. అంతవరకు, నిరక్షరాస్యతను తొలగించడం మినహా, ఇతర విషయాలలో అది బూర్జువా విద్యావిధానం కంటే మరీ భిన్నంగా ఏమీ వుండేది కాదు. పేదవర్గాలు ప్రాథమిక విద్యతో ఆపేయడం, ఉన్నత విద్యకు అధికారుల, నిపుణుల, కేడర్ల పిల్లలు మాత్రమే రావడం జరిగేది. సాంస్కృతిక విప్లవకాలంలో కొన్ని ముఖ్యమయిన మార్పులు ప్రవేశపెట్టారు. ఉన్నత విద్యను అభ్యసించదలచుకున్నవారంతా ముందు కొంతకాలం ఉత్పత్తిలో పాల్గొనాలి. ఒక ఫ్యాక్టరీలోనో, గ్రామీణ కమ్యూన్‌లోనో పనిచేయాలి. ఆ పిమ్మట కూడ, తోటి శ్రామికుల రికమెండేషన్ మీదనే ఉన్నత విద్యకు పోగలరు. కాలేజీలలో కూడ గణనీయమయిన శాతం సీట్లు కార్మిక కర్షక వర్గాలకు కేటాయించారు. ఫ్యాక్టరీలు, గ్రామీణ కమ్యూన్లు తమలో నుండి కొందరిని ఎంపిక చేసి ఈ సీట్లకు కేండిడేట్లను పంపుతారు. కాలేజీలలో ఉన్నత విద్య చెప్పే ప్రొఫెసర్లు కూడ (కేడర్లు, అధికారులు, నిపుణులలాగ) సంవత్సరంలో కొంతకాలం శారీరక శ్రమ చేయాలి. చెప్పే చదువులో కూడ మార్పులు సాధించారు. బుద్ధిని ఉన్నతంగాను, శారీరకశ్రమను అల్పంగాను చూసే బూర్జువా సంస్కృతిలో గణితం వంటివి ఒక కృత్రిమ 'ప్రెస్టీజ్'ను సంపాదించు కుంటాయి. దాన్ని తొలగించే ప్రయత్నం చేసారు.

అన్ని రంగాలలో కంటే ఈ రంగంలో అతివాదం ఎక్కువ పనిచేసినట్లు బెతెల్‌హాం రచనను బట్టి అనిపిస్తుంది. అసలు ఉన్నత విద్యే అక్కరలేదనీ, నిపుణులే అక్కరలేదనీ అనేదాకా వచ్చారు. విజ్ఞానమంతా అనుభవం నుండే వస్తుంది, పుస్తకాల నుండి రాదన్నారు. 'పుస్తక జ్ఞానాన్ని' కించపరిచి మేధావులను హీనంగా చూసారు. విజ్ఞానమంతా అనుభవం నుండి వచ్చేమాట వాస్తవమే కాని పుస్తకాలకూ, అనుభవానికీ వైరుధ్యం చూడడమే వర్గ సమాజ ప్రభావం. పుస్తకాలలో వుండేది ఇతరుల అనుభవమే తప్ప ఒకరి కపోలకల్పన కాదు. మన అనుభవం నుండే మనకు విజ్ఞానం రాదు, మొత్తం చారిత్రక అనుభవం నుండి వస్తుంది. వర్గసమాజమే అనుభవం నుండి పుస్తకజ్ఞానాన్ని విడగొట్టి 'శాస్త్రజ్ఞానం' ఆకాశం నుండి ఊడిపడుతుందని

సిద్ధాంతీకరించింది. ఈ మార్మికతలో పడిపోయి విప్లవకారులు పుస్తక జ్ఞానాన్నీ అనుభవాన్నీ పరస్పర విరుద్ధమయిన విషయాలుగా భావించడం పొరబాటవుతుంది.

ఇప్పటి నాయకత్వం విద్యా విధానాన్ని మళ్ళీ మొదటికి తెచ్చింది. బౌద్ధిక శ్రమకూ శారీరక శ్రమకూ మధ్యనున్న సహజ గతితార్కిక సంబంధాన్ని నిర్మాణంలోకి తెచ్చే ప్రయత్నానికి తిలోదకాలిచ్చి వాటిని తిరిగి విడగొట్టింది. మేధావులు శారీరక శ్రమ చేయాలనే సంప్రదాయాన్ని వదిలిపెట్టారు. అలాగే శ్రామిక వర్గాల యువకులకు ప్రోత్సాహమిచ్చే సంప్రదాయాన్ని కూడ వదిలిపెట్టి, అందరినీ 'సమంగా' పోటీపడి శ్రద్ధగా చదువుకొని పరీక్షలు పాసు కమ్మంటున్నారు. అసమానంగా వున్నవారు 'సమంగా' ఎట్లా పోటీపడతారు? బూర్జువా 'సమానత్వం' ఇదే గదా?

కుటుంబ వ్యవస్థలోనూ కళాసాహిత్య రంగాలలోనూ సామాజిక సంబంధాలను విప్లవీకరించే ప్రయత్నం సాంస్కృతిక విప్లవం ఏ తీరుగా చేసిందో బెతెల్‌హేం వివరించలేదు. కళాసాహిత్య రంగాలలో నడిచిన అతివాదం ఇందుకు కారణం కావచ్చు. చియాంగ్ చింగ్ ఆమోదించినవే ప్రజాకళలు అనేంతటి అతివాదం నడిచింది.

4. ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాలు కలిసినదే సామాజిక ఆర్థిక పునాది. విప్లవం అనేది ఉత్పత్తి సంబంధాలను మార్చడం ద్వారా ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి మార్గం సుగమం చేస్తుంది. ఇది మార్క్సిస్టులందరూ ఆమోదించే చారిత్రక భౌతికవాద సిద్ధాంతం. కాని దీన్ని వివరించడంలో రెండు రకాల దృక్పథాలు ముందుకొచ్చాయి. ఒకటి 'ఉత్పత్తి శక్తుల సిద్ధాంతం'. దీని ప్రకారం ఉత్పత్తి సంబంధాలలో మార్పు ఒక్కసారిగా వచ్చేస్తుంది. వచ్చిన తరువాత ఆ మార్పును ఆసరా చేసుకొని ఉత్పత్తి శక్తులు నిరాటంకంగా అభివృద్ధి చెందుతూ పోతాయి. మళ్ళీ మరొక విప్లవం వచ్చేదాకా ఇక ఉత్పత్తి సంబంధాలను మార్చాల్సిన అవసరం వుండదు. ఇది సోవియట్ రష్యాలోను, తూర్పు యూరప్ దేశాలలోను అధికారస్థాయిలో చాలాకాలంగా వున్న సిద్ధాంతం. ప్రస్తుత చైనా నాయకత్వం కూడ దీనిని ఆమోదిస్తున్నది. చైనాలో 'సోషలిస్టు విప్లవం' అనేది 1956లో జరిగిపోయింది. అంటే ఆనాటికి ఉత్పత్తి సంబంధాలు సోషలిస్టుగా మారిపోయాయి. ఇక మిగిలింది, ఈ సోషలిస్టు సంబంధాలను ఉపయోగించుకొని ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేయడం మాత్రమే. కృషినంతా దీని మీద కేంద్రీకరించాలి. దీని కోసం సామ్రాజ్యవాదులతో స్నేహం అవసరమైతే స్నేహం చేయాలి. పెట్టుబడి

అవసరమయితే ప్రపంచ బ్యాంకు నుండి దిగుమతి చేసుకోవాలి. బహుళజాతి గుత్త పెట్టుబడిదారీ సంస్థలను ఆహ్వానించాల్సి వస్తే ఆహ్వానించాలి. కార్మికులను ఇనప క్రమశిక్షణలో ఉంచడం అవసరమైతే ఉంచాలి. వాళ్ళకు డబ్బు ఆశ చూపించి ఎక్కువ ఉత్పత్తి చేయించాలి. రైతులకు ఇంటి పెరట్లో ఉత్పత్తి చేసుకొని, బజార్లో అమ్ముకునేలా ప్రోత్సాహం కల్పించాలి. విద్యా విధానంలో 'సమానత్వం' ప్రసక్తి లేకుండ నిపుణులను మాత్రమే పైకి పోనిచ్చే కఠిన పరీక్షా విధానాన్ని ప్రవేశపెట్టాలి. ఏది చేసినా, ఉత్పత్తి పెరిగినంత కాలం అది సోషలిజమే, ఎందుకంటే ఉత్పత్తి సంబంధాలు సోషలిస్టు సంబంధాలు కాబట్టి.

ఈ 'ఉత్పత్తి శక్తుల సిద్ధాంతానికి' వ్యతిరేకంగా వచ్చిందే 'ఉత్పత్తి సంబంధాల సిద్ధాంతం'. ఉత్పత్తి సంబంధాలు ఒక్కరోజులో మారిపోయి శాశ్వతమయిన రూపం తీసుకోవు. ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందేకొద్దీ ప్రతి దశలోనూ ఉత్పత్తి సంబంధాలు మారతాయి. అంతేకాదు. ప్రతీ దశలోనూ ఉత్పత్తి సంబంధాలను మార్చడం ద్వారానే ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందుతాయి. ఉత్పత్తి సంబంధాలను నిరంతరం విప్లవీకరించడం ద్వారానే ఉత్పత్తి శక్తుల నిరంతర పురోగమనం సాధ్యమవుతుంది. అంతేకాదు – ఉత్పత్తి సంబంధాలను, ఉపరితలాన్ని విప్లవీకరించకపోతే అది ఉత్పత్తి శక్తుల మీద తిరిగి ప్రభావం వేసి వాటి అభివృద్ధిని ఆపేస్తుంది. బెతెల్‌హాం దీనికి ఒక ఉదాహరణ ఇస్తాడు. వ్యవసాయ ఆధునీకరణ పట్టణాల మీద ఆధారపడి జరిగితే – వ్యవసాయ కమ్యూన్లు ఉపయోగించే యంత్ర పరికరాల విడిభాగాల కోసం వారు పట్టణాలలోని ట్రాక్టర్ స్టేషన్ల మీద ఆధారపడడం, అవి సకాలంలో అందక ఇబ్బంది పడడం – ఇలాంటివి తప్పవని ఒక ఉదాహరణ ఇస్తాడు. మన దేశంలో రైతులకు ఇది నిత్యజీవిత అనుభవమే.

కమ్యూన్లనే పారిశ్రామీకరించి పారిశ్రామిక పరిజ్ఞానాన్ని గ్రామాలకు తీసుకుపోతే ఈ ఇబ్బంది వుండదు. అంటే 'గ్రామాలకు పట్టణాలకు మధ్య అసమానతను తొలగించడం' అనే ఉత్పత్తి సంబంధాల సమస్యకూ, 'గ్రామాలను ఆధునీకరించడం' అనే ఉత్పత్తి శక్తుల సమస్యకూ విరోధం లేకపోవడం అటుంచి, మొదటిది సాధిస్తేనే రెండవది సాధ్యమవుతుందని. మరొక రకంగా చెప్పాలంటే 'కమ్యూనిజాన్ని నిర్మించడం', 'ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేయడం' అనేవి ఎంత మాత్రం పరస్పర విరుద్ధమయిన

విషయాలు కావు. జోగీజోగీ రాసుకుంటే రాలేది బూడిదే అన్నట్లు భిక్షగాళ్ళ సమానత్వం కమ్యూనిజం కాదు. కమ్యూనిజం బాగా అభివృద్ధి చెందిన ఉత్పత్తి శక్తుల మీద ఆధారపడుతుంది. ఈ రెండు కర్తవ్యాలూ సోషలిస్టు దశలో పూరించాలి. కమ్యూనిజాన్ని నిర్మించాలి, ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేయాలి. ఈ రెండింటికీ మధ్య విరోధం వుందని 'ఉత్పత్తి శక్తుల సిద్ధాంతం' నమ్ముతుంది. ముందు ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేసి ఆ తరువాత కమ్యూనిజాన్ని నిర్మించాలని నమ్ముతుంది. ఈ రెండిటికీ మధ్య విరోధం లేదని, కమ్యూనిజాన్ని నిర్మించడం ద్వారానే ఉత్పత్తి శక్తుల అభివృద్ధి సాధ్యమవుతుందని 'ఉత్పత్తి సంబంధాల సిద్ధాంతం' అంటుంది. 1956 నుండి చైనా అనుభవం ఆచరణాత్మకంగా ప్రతిపాదించిన విషయాలలో ఇది ఒకటి. ప్రస్తుత నాయకత్వం ఇందులో స్పష్టంగా వెనకడుగు వేసింది. 'నాలుగు ఆధునీకరణలకు' అన్నిటినీ లోబరచాలన్నది డెంగ్ ఆలోచనా విధానం. బెతెల్‌హాం దీనికి చాలా ఉదాహరణలిస్తాడు.

5. సోషలిస్టు విప్లవం ఒక్కసారిగా ఆర్థికవ్యవస్థను గాని సమాజాన్ని గాని మార్చదు. పాత సమాజపు అవశేషాలు చాలాకాలం కొనసాగుతాయి. పాత భూస్వామ్య వర్గం, పాత పెట్టుబడిదారీ వర్గం వర్గాలుగా నాశనమయినా వ్యక్తులుగా వాళ్ళందరూ నాశనం కారు. పైగా చిన్నతరహా సరుకుల ఉత్పత్తి (petty - Commodity production) లో పెట్టుబడిదారీ పద్ధతులూ సంబంధాలే కొనసాగుతాయి. గ్రామాలలోని వ్యవసాయ సమిష్టి క్షేత్రాలుగాని, కమ్యూన్లుగాని రైతుల చేతిలో కొంతమేరకు స్వంత ఆస్తిని మిగల్చక తప్పదు (పెరటితోటలు, గొర్రెలు, కోళ్ళు, వగైరా). పట్టణాలలో కూడ చిన్న చిన్న ఉత్పత్తులు పెట్టుబడిదారీ పద్ధతిలో కొంతకాలం కొనసాగక తప్పదు. ఇవన్నీ కూడ తమంతటతామే బూర్జువా చైతన్యాన్ని ఉత్పత్తి చేస్తాయి. ఈ రెండు అంశాలు – ఒకటి పాత దోపిడీవర్గాల అవశేషాలు, రెండు పట్టణాలలోనూ గ్రామాలలోనూ జరిగే చిన్నతరహా సరుకుల ఉత్పత్తి – సోషలిస్టు సమాజాన్ని తిరిగి వర్గ సమాజం దిశకు మళ్ళించే ప్రయత్నం చేస్తాయని లెనిన్ కాలం నుండి కమ్యూనిస్టులు నమ్ముతూ వచ్చారు. వీటికి వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాటం సాగించాల్సి వుంటుందని కూడ అన్నారు. ఈ పోరాటం వర్గపోరాటం అవుతుందని, అంటే రాజ్యాధికారం కోసం జరిగే పోరాటం అవుతుందని గుర్తించారు. ఈ కోణం నుండి చూస్తే సాంస్కృతిక విప్లవం రాజ్యాధికారం కోసం జరిగిన వర్గపోరాటమే. ఉపరితలాన్ని విప్లవీకరించడానికో లేక ఉత్పత్తి సంబంధాలను ముందుకు తీసుకొని పోవడానికో ప్రారంభమయినా, ఆ సమస్యల

పరిష్కారం రాజ్యాధికారంతో ముడిపడి వుంటుంది కాబట్టి అది చివరికి రాజ్యాధికారం కోసం జరిగే వర్గపోరాటం కాక  తప్పలేదు.

ఈ విషయంలో బెతెల్‌హేం ఒక ముఖ్యమయిన సవరణ చేస్తాడు. తిరోగామి శక్తుల మూలం కోసం మనం చూడవలసింది పాతదోపిడీ వర్గాల అవశేషాలలోగానీ, చిన్న తరహా సరుకుల ఉత్పత్తిలోగానీ కాదంటాడు. 'అవశేషాలు' అనేది ఒక వర్గం కాదు. పాత దోపిడీవర్గాలలో కొందరు మంచి పదవులలో వుంటారు, కొందరు మధ్యస్తంగా వుంటారు, కొందరు శ్రామికులుంటారు. వీళ్ళందరికీ ఒక 'వర్గం'గా ప్రతీఘాతుక విప్లవం నడిపే అవసరంగాని అవకాశంగాని ఎక్కడిది? చిన్నతరహా సరుకుల ఉత్పత్తి చేసేవాళ్ళు ఒక వర్గమే అయినప్పటికీ, వాళ్ళది సామాజిక ఉత్పత్తిలో 'చిన్న'స్థానం. వాళ్ళు తిరోగామి శక్తులకు విస్తృతమయిన పునాదిని ఏర్పరచగలరుగాని వాళ్ళే ప్రధానమయిన తిరోగామి వర్గం కాజాలరు. మరి అసలయిన ప్రతీపశక్తులు ఎక్కడున్నాయంటే – 'అవశేషాల'లోనూ, అప్రధానమయిన ఉత్పత్తి రంగంలోనూ వాటి కోసం చూడకుండా – నూతనంగా నిర్మాణమవుతున్న వ్యవస్థ గర్భంలోనే చూడమంటాడు. అంటే భారీ పరిశ్రమలను సామాజిక ఆస్తిగానూ, గ్రామీణ భూమిని సమిష్టి ఆస్తిగానూ మార్చి అంతటితో ఆ రంగాలలో కొత్త బూర్జువా వర్గానికి స్థానం లేదనుకొని, మిగిలిపోయిన చిన్నతరహా సరుకుల ఉత్పత్తిలో కొత్త బూర్జువావర్గం యొక్క పునాది కోసం వెతకకుండా, ఆ భారీ పరిశ్రమలలోనే, సమిష్టి ఆస్తిలోనే వాటి కోసం వెతకమంటాడు. ఇవే సమాజం యొక్క ఆర్థిక రంగానికి ఇప్పుడు అసలైన కేంద్రం (Core). కొత్త బూర్జువా వర్గం  ఇక్కడి నుండి రావలసిందేగాని పాత అవశేషాల నుండి గాని, చిన్నతరహా ఉత్పత్తి నుండి గాని కాదు. అది ఈ కేంద్ర రంగం నుండి ఎట్లా వస్తుందంటే దానికి గల కారణం ఇదివరకే చర్చించాము. నూతన వ్యవస్థ ఆస్తి సంబంధాలను కొంత మేరకు మారుస్తుంది గాని, తక్కిన ఉత్పత్తి సంబంధాలలో బూర్జువా లక్షణాలు చాలా మేరకు కొనసాగుతాయి. వీటి నుండే కొత్త బూర్జువా వర్గం పుడుతుందని బెతెల్‌హేం అభిప్రాయం. ఇది చాలా ముఖ్యమయిన విషయం.

కాని ఇక్కడ బెతెల్‌హేం చేసిన ఒక పొరబాటును పైన కూడ చర్చించాము. ఆయన నూతన వ్యవస్థలోని పునరుత్పత్తి క్రమాన్ని కాక ఉత్పత్తిక్రమాన్ని మాత్రమే దృష్టిలో పెట్టుకోవడం వల్ల ఫ్యాక్టరీ తదితర ఉత్పత్తి రంగాలలోని అధికారులు, నిపుణులు

మాత్రమే బెతెల్‌హాంకు కొత్త బూర్జువా వర్గంగా కనబడతారు. నిజానికి వీళ్ళు కొత్త బూర్జువా వర్గం యొక్క కిందిభాగమే తప్ప బడా సెక్షన్ కాదు. అసలయిన బూర్జువా వర్గం కోసం పైస్థాయి అధికారులలోనూ, పార్టీలోని అగ్రనాయకులలోనూ వెతకాల్సి వుంటుంది. మావో చెప్పినట్టు, కొత్త బూర్జువా వర్గం ఎక్కడో లేదు, పార్టీ కేంద్రంలోనే వుంది. రెండవది, పరిణామ వ్యవస్థ అయిన సోషలిస్టుదశలో పార్టీకి ఉండే అగ్రగామి కర్తవ్యాన్ని బెతెల్‌హాం లెక్కలోకి తీసుకున్నట్టు కనిపించదు. దీని వల్ల కార్మికులో రైతులో కానివారంతా బూర్జువాలుగా కనబడతారు. కాని, ప్రత్యక్షంగా కార్మికవర్గ అజమాయిషీ లేకుండ కార్మికవర్గం యొక్క అగ్రగామిదళంగా పార్టీ సమాజాన్ని నడిపించడం, 'బూర్జువా' అధికారులనూ నిపుణులనూ సంస్కరించి కార్మికవర్గ ప్రయోజనాల కోసం వారి చేత పనిచేయించడం (ఈ కర్తవ్యానికి మావో అత్యంత ప్రాముఖ్యత ఇచ్చాడు), కార్మికవర్గం తనలోని పాతభావాల బూజును వదిలించుకొని సోషలిస్టు వ్యవస్థకు అనుగుణ్యంగా తన చైతన్యాన్ని దిద్దుకునే క్రమంలో అధ్యాపక పాత్రను నిర్వహించడం – ఇవన్నీ చాలాకాలంపాటు అనివార్యమని అంగీకరిస్తే, మరి ఈ రాజకీయ సంబంధాన్ని పక్కకుపెట్టి కేవలం ఆర్థిక సంబంధాల ప్రాతిపదిక మీద వర్గ విశ్లేషణ జరపడం ఎంతవరకు సబబు?

అన్ని రంగాలలోనూ సోషలిస్టు సంబంధాలను నెలకొల్పడానికి చాలాకాలం పడుతుంది. ఒక్కొక్కసారి ముందడుగు తీసి వెనకడుగు వేయాల్సి వుంటుంది. అటువంటి సందర్భంలో మార్పు సాధించేంతవరకు ఆ సంబంధాలను బూర్జువా సంబంధాలుగానూ, వాటి వల్ల అధికారం పొందే వర్గాన్ని బూర్జువావర్గంగానూ పరిగణించడం యాంత్రికమయిన అవగాహన అవుతుంది. అది సరయినదా కాదా అన్నది పార్టీ తన అగ్రగామి కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నదా లేదా అన్న విషయం మీద ఆధారపడి వుంటుంది. దీనికి కొలబద్ద ఏమిటి?

బెతెల్‌హాం ఈ వ్యాసాన్ని ప్రచురించిన తరువాత అతని అభిప్రాయాలను విమర్శిస్తూ 'మంత్లీ రివ్యూ'లో కొన్ని వ్యాసాలు వచ్చాయి. ప్రధాన విమర్శ ఏమిటంటే సాంస్కృతిక విప్లవం విద్యారంగాన్ని చిన్నాభిన్నం చేసింది. చదువు చెప్పడం, చదువుకోవడం మానేసారు. కార్మికులు పని చేయడం మానేసి పూర్తిగా క్రమశిక్షణ లేకుండ పోయారు. రైళ్ళు టైముకు నడవడం మానేసాయి. ఈ అరాచకం వల్ల దేశం ఎంతగానో నష్టపోయింది. పరిస్థితిని తిరిగి అదుపుచేసి సోషలిజాన్ని కాపాడడం

కోసం కొత్త ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. అందుకే కార్మికుల క్రమశిక్షణ మీద, సంస్థల నిర్వాహకుల బాధ్యతల మీద, విద్యార్థుల శ్రద్ధాసక్తుల మీద దృష్టి కేంద్రీకరించవలసి వచ్చింది. అంటే పార్టీ కార్మిక వర్గం యొక్క అగ్రగామి దళంగా సోషలిజాన్ని కాపాడే కర్తవ్యాన్ని నిర్వహిస్తోందే తప్ప అది రివిజనిజం కాదు.

ఈ విమర్శను ప్రచురించి 'మంత్లీరివ్యూ' సంపాదకులు దాని మీద ఒక సంపాదకీయం రాసారు. అందులో ఒక ముఖ్యమయిన మాట చెప్పారు. సాంస్కృతిక విప్లవ కాలంలో కొంత అతివాదం, అరాచకం నడిచినట్టు అందరూ అంగీకరిస్తున్నారు. కొత్త ప్రభుత్వం తీసుకున్న చర్యలను విడివిడిగా పరిశీలిస్తే అవి ఈ అరాచకాన్ని సవరించడానికి తీసుకున్నవా లేక రివిజనిస్టు చర్యలా అన్నది వివాదాస్పదంగానే ఉంటుంది (ముఖ్యంగా విషయాన్ని బయటి నుండి పరిశీలించే విదేశీయులకు). కాని అసలు సంగతి తాత్వికరంగంలో, అంటే సిద్ధాంతరంగంలో బయటపడుతుంది. ఈ అవగాహనతో 'మంత్లీరివ్యూ' సంపాదకులు కొత్త నాయకత్వం యొక్క చర్యల మీద కాక తాత్విక సిద్ధాంత అభిప్రాయాల మీద కేంద్రీకరించి ఆ నాయకత్వం యొక్క రివిజనిస్టు స్వభావాన్ని నిరూపించగలిగారు. పన్నెండవ కాంగ్రెస్ తీర్మానాలలోని సిద్ధాంత అభిప్రాయాలు ఈ విషయాన్ని స్పష్టం చేసాయి.

## సాంస్కృతిక విప్లవం వైఫల్యం

సాంస్కృతిక విప్లవం ఓడిపోవడానికి గల కారణాల గురించి బెతెల్‌హాం కొన్ని అభిప్రాయాలు వెలిబుచ్చాడు. వాటికి రంగనాయకమ్మగారు చిలువలూ పలువలూ అల్లి ఒక అభాస చిత్రాన్ని (Caricature) ఇచ్చారు. రంగనాయకమ్మగారి సృజనాత్మకత చాలా బలంగా పనిచేసిన అంశాలు రెండున్నాయి. ఒకటి 'వ్యక్తి పూజ' (personality cult), రెండు చైనా కమ్యూనిస్టు పార్టీ వ్యవహారాలలోని అక్రమాలు (ప్రధానంగా ప్రజల నుండి విషయాలను గోప్యంగా వుంచే 'మార్మికత'). వీటి గురించి రంగనాయకమ్మగారు వెలిబుచ్చిన అభిప్రాయాలలో కొన్ని ఆయా సందర్భాలలో సరయినవే కావచ్చుగాని, ఆమె అనుసరించిన యాంత్రికమయిన హేతువాద ఆలోచనా పద్ధతిని విమర్శించక తప్పదు. ఉదాహరణకు 'మార్మికత' గురించి చర్చిస్తూ చైనా కమ్యూనిస్టు పార్టీ ఏటేటా మహాసభలు జరపలేదనీ, అన్ని నిర్ణయాలు పొలిట్‌బ్యూరో తీసుకునేదనీ, ఆ నిర్ణయాలకు గల కారణాలేమిటో చైనా ప్రజలకు పార్టీ చెప్పలేదని

విమర్శించారు. 8వ పార్టీ మహాసభ 1956లో జరగగా, 9వ పార్టీ మహాసభ 13 ఏళ్ళ తర్వాత 1969లో జరిగిందని ఉదాహరణగా చూపించారు. పార్టీ మహాసభలు క్రమబద్ధంగా జరగవలసిందే అన్న దాని గురించి అభిప్రాయభేదాలు లేవు. సంఘటనల ఒత్తిడిని కారణంగా చూపించి ప్రజాస్వామిక పద్ధతులను విస్మరించడం తప్పని మావో విమర్శించాడు కూడ. ఇదంతా నిజమే అయినప్పటికీ కమ్యూనిస్టు పార్టీ అనేది మున్సిపల్ కార్పొరేషన్ లాంటిది కాదు. దాని ప్రధాన కర్తవ్యం – సంవత్సరానికొకసారి సమావేశమై బడ్జెట్‌ను ఆమోదించడం కాదు. దాని కర్తవ్యం విప్లవం నడపడం, ఆ విప్లవ పోరాటంలో ప్రజల్ని విలీనం చేయడం. ఏటేటా జరిగే మహాసభలు ఇందుకు ఉపకరణం మాత్రమే. సరిగ్గా 1956 నుండి 1969 వరకు చైనాలో అపూర్వమైన విప్లవ పోరాటాల వెల్లువ ముందుకు వచ్చింది. ప్రపంచంలో వేరే ఏ దేశ చరిత్రలోనూ ఈ 13 సంవత్సరాలతో పోల్చదగ్గ విప్లవదశ లేదు. ఫ్రెంచి విప్లవంలో లేదు, బోల్షివిక్ విప్లవంలోనూ లేదు. ఒక్కొక్కటీ ఒక మహత్తర విప్లవ పోరాటం అనదగ్గ వ్యవసాయ సమిష్టీకరణ, గ్రేట్ లీప్ ఫార్వర్డ్, సాంస్కృతిక విప్లవం ఒకదాని తరువాత ఒకటి ఈ 13 ఏళ్ళలో జరిగాయి. ప్రజలు కోట్ల సంఖ్యలో చైతన్యవంతంగా ఈ పోరాటాలలో పాల్గొన్నారు. అయినా ఆ 13 ఏళ్ళలో పార్టీ మహాసభ జరగలేదు కాబట్టి ప్రజలకు పార్టీ రాజకీయాలు తెలియలేదని రంగనాయకమ్మగారు మనల్ని నమ్మమంటున్నారు.

చైనా విప్లవంలోని ప్రత్యేకత ఏమిటంటే ప్రజల సమస్యల పరిష్కారాన్ని బ్యూరోక్రాటిక్‌గా కాకుండ ప్రజా ఉద్యమాల ద్వారా సాధించడం. అక్షరాస్యత, పరిశుభ్రత, ప్రాథమిక వైద్యం అన్నీ కూడ వారు ఉద్యమాల ద్వారా సాధించారు. 235–36 పేజీలలో రంగనాయకమ్మగారు ఎలకల్ని చంపే ఉద్యమాన్ని గురించి చాలా అపహాస్యంగా రాసారు. చైనాలో నిజంగానే ఎలకల్నీ పందికొక్కుల్నీ చంపడాన్ని ఉద్యమాలుగా తీసుకున్నారు. 'ఎలుకల్ని చంపదల్చుకున్నవాళ్ళు చంపి ఊరుకోక దాన్ని ఒక ఉద్యమం చేయడం ఎందుకు?' అని విసుక్కున్న పాశ్చాత్యులు చాలామంది ఉన్నారు. జోన్ రాబిన్‌సన్ వంటి సానుభూతి గల మేధావికి కూడ ఇది విచిత్రం అనిపించింది. నలుగురు పంచాయితీ ఉద్యోగులకు ఎలుకల మందూ బోన్లూ సరఫరా చేస్తే అయిపోయేదానికి ఇంత 'రభస' ఎందుకు అని వారి ఉద్దేశం. అయినా ఈ రభస ద్వారానే ప్రజలు తమ జీవితాన్ని తామే నడుపుకునే చైతన్యాన్ని సాధించుకుంటారన్న నమ్మకంతో చైనా కమ్యూనిస్టు పార్టీ ఈ పద్ధతినే అనుసరించింది.

ఇలా బ్యూరోక్రాటిక్ పద్ధతులలో కాక ఉద్యమం ద్వారా సమాజాన్ని నడిపించాలని ప్రయత్నించే పార్టీలో నిర్మాణపరమయిన లోపాలు ఉండడం సహజం. వాటిని సవరించుకోవలసిందే. కాని అంతమాత్రం చేత ప్రజలకు పార్టీ రాజకీయపంథా ఏమిటో తెలియదనడం మొండెం నుండి తలను విడగొట్టి చూడడం అవుతుంది. లిన్ పియావో ఎందుకు పైకి వచ్చాడో, ఎందుకు పడిపోయాడో ప్రజలకు తెలియజెప్పలేదని ఆరోపణ. ఇది వాస్తవమనే అనుకుందాం. కాని ఆ విషయం తెలియనంత మాత్రాన ప్రజల నుండి పార్టీ రాజకీయాలు 'మర్మంగా' ఉంచబడ్డట్టేనా? పార్టీ రాజకీయాలంటే లిన్ పియావో, లీ షావ్ చీల పుట్టుపూర్వోత్తరాలు కాదు గదా? నిత్యం వర్గపోరాటంలో పాల్గొంటూ విప్లవాత్మకమైన వ్యవస్థ నిర్మాణంలో భాగం పంచుకుంటున్న ప్రజలకు ఆ వర్గపోరాటం యొక్క రాజకీయాలు అర్థం కాకపోవడమేమిటి? ప్రజలూ, కేడర్, వివిధ స్థాయిలలోని నాయకులూ నిత్యం కలిసి పోరాటంలో పాల్గొంటున్నప్పుడు ఎన్నో విషయాలు చర్చకు రాక తప్పదు. వాటికి స్పష్టంగా సమాధానం ఇవ్వకా తప్పదు. ఆ చర్చలన్నీ డాక్యుమెంట్ల రూపం తీసుకోకపోవచ్చు. చైనా విప్లవ చరిత్ర రాయదల్చుకున్న వాళ్ళకు కావలసిన కాగితాలు దొరక్కపోవచ్చు. అసలు ఒక విప్లవ పోరాటాన్ని కేవలం పార్టీ తీర్మానాల సహాయంతో అర్థం చేసుకోవాలని ప్రయత్నించడమే ఒక రకమయిన మార్మికత (Fetishism).

'వ్యక్తి పూజ' విషయం కూడ ఇంతే. కమ్యూనిస్టులు వ్యక్తి పూజలను ఒప్పుకోరు. ఒక గొప్ప నాయకుడిని గౌరవించడంలో తప్పేముంది అనడం సరయిన సమాధానం కాదు. గౌరవించడం వేరు, 'పూజ' (Cult) వేరు. చైనాలో మావోకు సంబంధించి వ్యక్తి పూజ చాలా ఎక్కువగా జరిగిన మాట కూడ వాస్తవమే. గౌరవించడమే ఉద్దేశ్యం అయితే పది నిలువుల ఎత్తు చిత్రపటాలు నిలబెట్టాల్సిన అవసరం లేదు. కాని దీనిని కూడ వర్గపోరాటం నుండి వేరు చేసి చూడకూడదు. మన దేశంలో కాంగ్రెస్ నాయకులు గాంధీ పూజలను వోట్లు సంపాదించుకోవడం కోసం వాడుకున్నారు. ప్రజలలో జాతీయోద్యమ క్రమంలో గాంధీ పట్ల ఏర్పడ్డ గౌరవభావాన్ని ఆయన చనిపోయిన తరువాత విగ్రహ ప్రతిష్ఠాపన ద్వారా భక్తిభావంగా మార్చి వోట్ల రూపంలో సొమ్ము చేసుకున్నారు. చైనాలో కూడ సాంస్కృతిక విప్లవ కాలంలో మావో తన ప్రత్యర్థులను ఎదుర్కోవడం కోసం తన 'పూజ'ను వాడుకున్నాడన్న ఆరోపణ ఆయన మీద వుంది. ఇది చాలా పాక్షికమయిన వాస్తవం. మావో పూజకు అత్యధికంగా బాధ్యులయిన రెడ్

గార్డ్సును మావో సృష్టించలేదు. వాళ్ళంతట వాళ్ళే పుట్టుకొచ్చారు. వందా రెండు వందలు కాదు, కోట్ల సంఖ్యలో పుట్టుకొచ్చారు. రివిజనిజం బలపడుతున్న సమయంలో దానికి వ్యతిరేకంగా విప్లవ ప్రజావెల్లువగా ముందుకొచ్చారు. సాంస్కృతిక విప్లవ సైన్యంగా తమంతట తామే ఏర్పడ్డారు. ఇలా ఏర్పడ్డ వాళ్ళకు ఉత్సాహం, ఆవేశం, చారిత్రక ఉత్తేజం ఉన్నంతగా సిద్ధాంత నాయకత్వం లేదు. వాళ్ళలో వాళ్ళు ఏది రివిజనిజం, ఏది విప్లవం అని గందరగోళంగా పోట్లాడుకున్నారు, చంపుకున్నారు. కొందరు ఈ గందరగోళంలో విప్లవం అనుకొని రివిజనిజానికే సాధనాలుగా ఉపయోగపడ్డారు. నిజానికి ఆనాడు వాళ్ళకు కావలసింది విప్లవానికి దారి చూపగల విప్లవ పార్టీ. అటువంటి విప్లవ పార్టీని నిర్మించుకోలేకపోవడం సాంస్కృతిక విప్లవం వైఫల్యానికి గల ముఖ్య కారణం. ఈ విషయం బెతెల్‌హేంకు గాని రంగనాయకమ్మగారికి గాని అందలేదు. విప్లవ పోరాటానికి విప్లవపార్టీ కావాలి అన్నది తప్ప వాళ్ళకు తక్కిన లోపాలన్నీ కనిపించాయి. అయితే ఒక వెల్లువగా, ఎవరి నిర్ణయం లేకుండా ముంచెత్తిన రెడ్‌గార్డ్సు ప్రవాహం ఎవ్వరికీ అంతటి తీరికను ఇవ్వలేదు. మరొకరకంగా చెప్పాలంటే రెడ్‌గార్డ్సు యొక్క అంతఃకలహం విప్లవపార్టీ ఏర్పాటు కోసం జరిగిన తొలి ఘర్షణ. అది పూర్తికాకముందే సాంస్కృతిక విప్లవం ఓడిపోయింది. ఆ లోటును భర్తీచేసే ప్రయత్నం చేసింది 'మావో పూజ'. విప్లవపార్టీ గనక వుంటే ఏ పాత్రను (నిర్మాణాత్మకంగా, కేంద్రీకృత ప్రజాస్వామ్య పద్ధతిలో) నిర్వహించి ఉండేదో దానిని తన పరపతితో నిర్వహించాలని మావో ప్రయత్నించినట్టు ఎడ్గార్ స్నో రచనలను బట్టి అనిపిస్తుంది.

'మావోపూజ' విప్లవపార్టీ యొక్క అభాసరూపం. విప్లవపార్టీ ఏర్పాటుకు అవసరమయిన పోరాట క్రమంలో తొలిదశ. ఈ నిర్దిష్టమయిన నేపథ్యాన్ని (తీవ్రమైన స్పాంటేనియస్ వర్గపోరాట నేపథ్యాన్ని) అర్థం చేసుకోకుండా 'వ్యక్తిపూజ తప్పు' అని ఎన్నిసార్లు ప్రకటించినా మనకు ఏమీ అర్థం కాదు. చైనా కమ్యూనిస్టు పార్టీనిగాని మావోనుగాని విమర్శించవద్దని ఎవరూ అనరు. కాని మార్క్సిస్టు విమర్శ నిర్దిష్టమయిన వర్గపోరాట విశ్లేషణ నుండి పుట్టాలి. నైరూప్య (abstract) సూత్రాల నుండి కాదు. అటువంటి సూత్రాల వల్ల గణిత సమీకరణాలు తప్ప ప్రపంచంలో వేరే ఏవీ అర్థం కావు. 'వ్యక్తిపూజ' అనేది నైరూప్యంగా వుండదు. నిర్దిష్టంగా వుంటుంది. మావో పూజకూ స్టాలిన్ పూజకూ కిం ఇల్ సుంగ్ పూజకూ గాంధీపూజకూ చాలా తేడాలున్నాయి. రంగనాయకమ్మగారి విమర్శ చైనా విప్లవం యొక్క నిర్దిష్టమయిన

చారిత్రక పోరాట క్రమం నుండి కాక, నిర్మాణ సూత్రాల తార్కిక క్రమం నుండి పుట్టింది. సూత్రం ప్రకారం ఇలా వుండాలి, అలా లేదు అని ప్రవర్తనా నియమావళిలాగ అభ్యంతరం తెలపడమేగాని ఆ సూత్రం ఏ అనుభవం నుండి పుట్టింది, ఆ అనుభవాన్ని విశ్లేషించడానికి అనుగుణ్యమయిన సూత్రం ఏమిటి అన్న ఆలోచన లేదు. సామాజిక మార్పును రివిజనిస్టు పద్ధతులలో కాక విప్లవ పద్ధతులలో సాధించాలి అనే ఆరాటం చైనా విప్లవాన్ని నడిపిన ఆదర్శాలలో ఒకటి. దీనికి కావలసిన నూతన నిర్మాణం కోసం సాంస్కృతిక విప్లవకాలంలో చైనా విప్లవం అన్వేషించింది. ఈ అన్వేషణ విఫలమయింది. చైనా విప్లవాన్ని విశ్లేషించేటప్పుడు మన దృష్టికి కేంద్రస్థానంలో ఉండవలసింది ఈ విషయమేగాని సార్వత్రికంగా ఏర్పరచుకున్న నిర్మాణ నియమావళి కాదు. రంగనాయకమ్మగారు చైనా విప్లవాన్ని విశ్లేషించలేదు, ఆడిట్ చేసారు.

బెతెల్‌హేం వ్యాసంలోగాని రంగనాయకమ్మగారి వ్యాఖ్యలోగాని ప్రస్తావనకు రాని మరొక్క విషయం ఉంది. సామ్రాజ్యవాద యుగంలో సామ్రాజ్యవాదపు గొలుసు బలహీనంగా వున్నచోటే విప్లవం బద్దలవుతుందని లెనిన్ చెప్పాడు. అయితే ప్రపంచ వ్యాపితంగా విప్లవం వచ్చేవరకు అది సంపూర్ణంగా విజయవంతం కాదు. ఒక దేశంలో మొదలయిన విప్లవ పరిణామం నిరంతరాయంగా పోరాటం చేసుకుంటూ విప్లవ సమాజం నిర్మాణాన్ని ముందుకు తీసుకొనిపోతూనే వుంటుంది. కాని ప్రపంచంలో సామ్రాజ్యవాదం ఇంకా ఒక బలమయిన శక్తిగా వుండగా ఆ పోరాటం ఆ ఒక్క దేశంలోనే (ఎన్ని ముందడుగులు వేసినా) సమగ్రమయిన విజయాన్ని సాధించదు. ఈ వాస్తవాన్ని ట్రాట్స్కీయిస్టులు గతితార్కికంగా అర్థం చేసుకోక పిడివాదపు పద్ధతిలో ఒక 'బ్రహ్మముడి'గా తయారు చేయబట్టి పాశ్చాత్య మార్క్సిస్టులు (బెతెల్‌హేం లాంటివాళ్ళు) ఈ వాస్తవాన్ని గుర్తించడానికే వెనకాడుతున్నారు. అది పొరబాటు. అంతర్జాతీయ విప్లవం మందకొడిగా వుండడం చైనాలో సాంస్కృతిక విప్లవం ఓటమికి గల ముఖ్య కారణాలలో ఒకటి.

## ముగింపు

ఇంగ్లీష్‌లో బెతెల్‌హేం వ్యాసం చదివినవారికి నిరాశగాని నిస్పృహగాని కలగదు. కొత్త ఆలోచనలు మొలకెత్తుతాయి, పాత అభిప్రాయాలను కొత్త కోణం నుండి చూసే

ఆసక్తి కలుగుతుంది. కాని దాని తెలుగు అనువాదం చదివితే మానవ భవితవ్యాన్ని గురించి నిరుత్సాహం కలుగుతోందని పాఠకులు చాలామంది భయపడుతున్నట్టు అనిపిస్తోంది. దీనికి ఆ పాఠకుల (అంటే సామాన్య తెలుగు కమ్యూనిస్టు సానుభూతిపరుల) మానసిక జడత్వాన్ని ఎంతగా తప్పుపట్టాలో రంగనాయకమ్మగారిని కూడ అంతగా తప్పుపట్టాలి. రంగనాయకమ్మగారు పది విషయాల గురించి తమ అభిప్రాయాలను నిర్భయంగా చెప్పారు. దానికి ఎవరూ అభ్యంతరం తెలపరు. కాని సాహసం ఉన్నచోట దానితోబాటు ఉండవలసిన బాధ్యత కొన్నిచోట్ల (ముఖ్యంగా చివరి పేజీలలో) లోపించినట్టు అనిపిస్తుంది.

(చైనాలో ఏం జరుగుతోంది? - ఫ్రెంచిమూలం : చార్లెస్ బెతెల్‌హాం; ఇంగ్లీషు నుండి అనువాదం : ఉదయ్‌కుమార్, గాంధి; ముందుమాట, చివరిమాట, ఫుట్‌నోట్లు : రంగనాయకమ్మ; జార్జిరెడ్డి పబ్లికేషన్స్ ట్రస్ట్, హైదరాబాద్. వెల : 14–00 రూపాయలు)

సృజన మాసపత్రిక
*14* సెప్టెంబర్ *1984*

## 'చైనాలో ఏం జరుగుతోంది?'
### సమీక్షా వ్యాసంపై సందేహాలు

'సృజన' సెప్టెంబర్ సంచికలో 'చైనాలో ఏం జరుగుతోంది?' అన్న పుస్తకంపై బాలగోపాల్‌గారి సమీక్షా వ్యాసం చదివాక నాకు కొన్ని సందేహాలు కలుగుతున్నాయి. ఆయన నుంచి గాని పాఠకుల నుంచి గాని వీటికి సమాధానాలు దొరుకుతాయేమోనని రాస్తున్నాను.

“చైనాలో ఏం జరుగుతోంది? అన్న ప్రశ్న తన ప్రాముఖ్యతను చాలావరకు కోల్పోయింది. చైనాలో ఏం జరుగుతోందో అందరికీ తెలుసు.” ఈ మొట్టమొదటి అభిప్రాయాన్ని గురించి ఆలోచిద్దాం. బెతెల్‌హామ్ వ్యాసాలు రాసేనాటికీ ఇప్పటికీ చైనాలో వచ్చిన మార్పు సందేహాతీతమైన నిర్ణయానికి చేరుస్తున్న మాట నిజమే. అయితే అది “అందరికీ తెలుసు” అని సులభంగా తేల్చివేయదగింది కాదు. అందరికీ తెలిసిన మాటే నిజమైతే బెతెల్‌హామ్ లాంటి మార్క్సిస్టులు, ఎడ్గార్ స్నో లాంటి ఉదారవాదులు సాంస్కృతిక విప్లవాన్ని గురించి ఇచ్చిన చిత్రం ఎంతవరకు

వాస్తవమైనదో, ఎంతవరకు కాల్పనికమైనదో తెలీదని సమీక్షకుడికే సందిగ్ధం కలిగేది కాదు.

సాంస్కృతిక విప్లవదశను గూర్చిన సమాచారం పూర్తిగా తెలీకపోవచ్చుగాని, చైనాలో రివిజనిజం ప్రవేశించిందన్న సంగతి స్పష్టంగానే అర్థమవుతుంది కదా అంటే, సాంస్కృతిక విప్లవాన్ని గురించి తెలుసుకుంటే గాని దాన్ని వ్యతిరేకిస్తున్న రివిజనిజం స్వరూపాన్ని పూర్తిగా తెలుసుకున్నట్టు కాదు. మావో రాసిన 'క్రిటిక్ ఆఫ్ సోవియట్ ఎకనమిక్స్' అనే పుస్తకాన్ని పార్టీలో చర్చకే రాసివుంటారని, అందులో పునాదిలో మార్పు రావలసిన అవసరాన్ని గురించి చెప్పడం వల్లనే రివిజనిస్టులు సాంస్కృతిక విప్లవాన్ని వ్యతిరేకించి వుంటారని సమీక్షకుడు అన్నారు. అందువల్ల సాంస్కృతిక విప్లవానికీ, రివిజనిజానికీ అంత దగ్గర సంబంధమున్నప్పుడు, సాంస్కృతిక విప్లవం గురించి వాస్తవం ఏమిటో ఇంకా తెలీని దశలో 'రివిజనిజం' మాత్రం 'అందరికీ తెలిసింది' అవుతుందా?

సాంస్కృతిక విప్లవానుకూలురు, వ్యతిరేకులు ఇస్తున్న చిత్రాలను బట్టి ఏది వాస్తవమైందో తెలుసుకోలేకపోతే, చైనాలో రివిజనిజం ప్రవేశించిన సంగతి తెలుసు కోవడం కూడా సాధ్యం కాదు. ఎందుకంటే ఇక్కడా రెండు రకాల అభిప్రాయాలున్నాయి. ఇటీవల చైనా అన్ని రంగాలలో గొప్ప అభివృద్ధిని సాధించినట్టు తెలిపే సమాచారం తక్కువేమీ రాలేదు. అంతేకాక, రివిజనిజం కూడా ఒక దశలో ఆగిపోయేది కాదు. దాని దిశలో అది ముందుకు పోతూనే వుంటుంది. చైనాలో ఆ పరిస్థితి మారినప్పుడో, ఆ పరిస్థితి పూర్తి పెట్టుబడిదారుగానో, సామ్రాజ్యవాదిగానో ఎదిగినప్పుడో మాత్రమే 'చైనాలో ఏం జరుగుతోంది?' అన్న ప్రశ్నకు ప్రాముఖ్యత పోతుందని, అంతవరకు వున్నట్టేనని  అనుకుంటున్నాను.

రంగనాయకమ్మగారి విశ్లేషణతో తనకు మౌలికంగా విభేదం వుందని, గతితార్కిక భౌతికవాద సిద్ధాంతానికి ఆ విధానం దూరమైందని, అందుకు ఉదాహరణగా పుస్తకంలో (271–72 పేజీలు) మావో భార్యకు రాసిన ఉత్తరంపై ఆమె వ్యాఖ్యలను చదివితే అర్థమవుతుందని అన్నారు. "సరదాకి మాట్లాడే మాటల్లో ఒకదానికొకటి పొంతన వుండకపోవచ్చు. అలా  తీసుకోవడానికి ఎవరికీ అభ్యంతరం వుండదు" అన్న రంగనాయకమ్మగారు అలా తీసుకోకుండా "మితవాదులకు, విప్లవకారులకు ఉపయోగపడే

మాటలు మాట్లాడతాడు కాబోలు తెలిసే", "విప్లవ నాయకుల్లో మార్మికత్వం పెళ్ళాలకు రాసే ఉత్తరాలదాకా వెళ్ళింది" అని వ్యాఖ్యలు చేయడం ఆయన అన్నట్టు 'నిస్పృహ'తో కూడిన ఆక్రోశం కావచ్చు కాని, "ఈ ఉత్తరం పార్టీ డాక్యుమెంట్ ఎలా అయింది?" అన్న ఆమె ప్రశ్న నిర్లక్ష్యం చేయతగింది కాదు. అలాగే 'వ్యక్తిపూజ' గురించి ఆమె చేసిన ఆలోచన అంతా తోసివేయతగిందీ కాదు. వ్యక్తి పూజను ఎవరు ప్రోత్సహిస్తారు? ఎవరికి లాభిస్తుంది? అని ఆలోచించినా, చైనాలో జరిగిన వ్యక్తి పూజ దుష్ఫలితం భారత విప్లవకారుల్లో కూడా ప్రవేశించి 'మావో మా అధ్యక్షుడు' అనే అశాస్త్రీయ ధోరణికి దారితీసిందన్నది గుర్తుచేసుకున్నా దాన్ని సమర్థించకూడదని గ్రహించవచ్చు. 'గతితార్కిక' దృష్టిలో 'వ్యక్తి పూజ' కూడా ఒక దశలో విప్లవ పురోగమనానికి తోడ్పడి వుంటే, ఆ ఫలితం ఇవ్వాళ కూడా మనం స్పష్టంగా గుర్తించగలిగేట్టు వుండాలి. అలా కాక గాంధీ పూజకీ మావో పూజకీ తేడా వుందనో, దాన్ని గురించి కొంత అతిశయ ప్రచారం జరిగివుండవచ్చునో చెప్పడం 'గతితార్కికం' కాదు. 'వెరైటీ' వుంది కనుక 'వ్యక్తి పూజ' తప్పులేదనడం కన్నా, దాని వల్ల విప్లవానికి నిజంగా మేలు జరిగిందా, హాని జరిగిందా అని పరిశీలించాలి.

ఇవాళ రివిజనిస్టులు దాన్నే ప్రధాన ఆయుధంగా తీసుకోవడం వల్ల, సహజంగా 'వ్యక్తి పూజ' సామాజికవాదానికి అనుకూలం కాదు కనుక, అది విప్లవానికి హాని కలిగించిందనే (విప్లవం...ఎన్నికల్లో గెలవడం లాంటిది కాదు కనుక) నిర్ణయించుకోక తప్పదు. మేలు జరిగిందంటే దాన్ని నిరూపించడం అన్న వాళ్ళ బాధ్యత. ఉపరితలాన్ని ప్రక్షాళన చేయడం మాత్రమే కాక పునాదినే సోషలిస్టుగా మార్చాలని చైనా నాయకులు గుర్తించకపోవడం వాళ్ళ సిద్ధాంత అవగాహనలో పొరపాటుగా వ్యాఖ్యానిస్తూ, "సాంస్కృతిక విప్లవంలో ఉపరితలాన్ని మార్చడానికి చేసిన ప్రయత్నాలు పునాదిదాకా దారితీసాయి" అన్న రంగనాయకమ్మగారి అభిప్రాయాన్ని 'శుద్ధతర్కం'గా భావించారు బాలగోపాల్‌గారు.

చైనా కమ్యూనిస్టు పార్టీకి 'గతితర్కం' వుందని వివరించారు. ప్రజలకు కనీస కార్యక్రమాన్ని ఇచ్చి, వాళ్ళు దాన్ని అందుకుని ముందుకు వెళ్ళినప్పుడు పార్టీ తన కార్యక్రమాన్ని మరింత అభివృద్ధి చేసుకునే విధానాన్ని అనుసరించిందని, ఈ విషయంలో పార్టీని తప్పుపట్టడానికి వీల్లేదని అన్నారు. అంటే, ప్రతి దశలోను కేవలం

నాయకులు కాక కార్యక్రమాలలో ప్రజల్ని పాల్గొనేట్టు పార్టీ పనిచేస్తూ వచ్చిందన్నమాట.

మరి 'సాంస్కృతిక విప్లవం' ఎందుకు విజయవంతం కాలేదు? ఇందుకు పార్టీని తప్పుపట్టకపోతే ప్రజలను తప్పుపట్టాలా? బాలగోపాల్‌గారు చెప్పిన 'గతితర్కం' ప్రకారం ప్రజలు ఆ కార్యక్రమాన్ని అందుకుని ముందుకు వెళ్ళే సందర్భంలో మాత్రమే తదుపరి కార్యక్రమాన్ని పార్టీ తీసుకుంటుంది కనుక ఈ పరిస్థితే వుండకూడదు. వుంది కనుక, సిద్ధాంత అవగాహనలో పొరపాటు జరిగిందనుకోక మరేమనుకోవాలి? అలా అనుకోవడాన్ని 'శుద్ధతర్కం'గా ఆక్షేపించిన బాలగోపాల్‌గారు 'ఉపరితలాన్ని విప్లవీకరించడానికి బయలుదేరిన విప్లవం పునాదిలోనే యింకా విప్లవం రావలసి వుందని గుర్తించింది' అన్నారు. మాటల తేడా, మూడు విప్లవాల తేడా తప్ప రంగనాయకమ్మగారు చెప్పిన అభిప్రాయానికీ, దీనికీ భేదమేమిటి?

"సాంస్కృతిక విప్లవం వైఫల్యం చెందడానికి కారణం విప్లవ పార్టీని నిర్మించుకో లేకపోవడం. ఈ విషయం బెతెల్‌హామ్‌కి గాని, రంగనాయకమ్మగారికి గాని అందలేదు" అనడం చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది. వాళ్ళిద్దరికీ ఆ సంగతి అర్థమయిందా లేదా అన్నది అలా వుంచుదాం. నాకూ, నాలాంటి వారెందరికో బాలగోపాల్‌గారు చెబుతున్నది ఏ మాత్రం అర్థం కాలేదనే అనుకుంటున్నాను. విప్లవ పార్టీ నిర్మాణమే కాకపోతే విప్లవం ఎలా సాధ్యమయినట్టు? అంతకుముందు ఆయన వివరించిన 'గతితర్కం' గతేమయినట్టు? "చైనా విప్లవంలోని ప్రత్యేకత ఏమంటే ప్రజా ఉద్యమం ద్వారా ముందుకు రావడం. రెగ్యులారిటీ ప్రకారం నడవడానికి కమ్యూనిస్టు పార్టీ మునిసిపల్ కార్పొరేషన్ లాంటిది కాదు. దాని కర్తవ్యం విప్లవం నడపడం, విప్లవంలో ప్రజల్ని పాల్గొనేట్టు చేయడం..." అన్నారే! ఇదంతా విప్లవపార్టీ నిర్మాణం కాకుండానే జరిగిందా? తను ముందు చెప్పిందేమిటో తనే విస్మరించి, దిగ్భ్రాంతిని కల్గించే కారణం చెప్పి, బెతెల్‌హామ్, రంగనాయకమ్మగారు గ్రహించలేక పోయారని ఆక్షేపించడమేమిటి?

బాలగోపాల్‌గారి విజ్ఞత, విచక్షణల మీద విశ్వాసం వున్న నాకు ఈ సమీక్షా వ్యాసం చాలా ఆశ్చర్యం కల్గిస్తున్నది. ఇంక – తెలుగులో వచ్చిన ఈ పుస్తకం చదివిన దగ్గర్నుంచి చాలామంది పాఠకులు మానవ భవితవ్యం గురించి భయపడటం సంగతి. బెతెల్‌హామ్ పుస్తకానికి, రంగనాయకమ్మగారి పుస్తకానికి వున్న తేడా నాకు తెలీదు

కాని, ఒక దేశంలో విప్లవం విజయవంతమైనా, అక్కడ పార్టీలోను, నాయకుల్లోను, దేశంలోపలి పరిస్థితిలోను విప్లవానుకూల పరిస్థితులు లేకపోతే విప్లవం నిలవదని చెప్పే 'శుద్ధతర్కం' కన్నా పార్టీలో, నాయకుల్లో ఎటువంటి లోపాలు లేకపోయినా, దేశం లోపలి పరిస్థితితో పనిలేకుండా, ప్రపంచవ్యాప్తంగా విప్లవ పరిస్థితి లేకపోతే మాత్రం అక్కడ విప్లవం నిలవదని చెప్పే 'గతితర్కమే' ఎక్కువ భయాన్ని, అవిశ్వాసాన్ని కలిగిస్తుందనుకుంటున్నాను. అందుకు 'గతితర్కం' లోపం కాదని, ఇలా చెప్పడం 'గతితర్కం'గా అన్వయించడంలోనే లోపముందని అనుకుంటున్నాను.

**–పి. రామకృష్ణారెడ్డి**

**జవాబు**

రామకృష్ణారెడ్డిగారి లేఖలో నాలుగు విషయాలకు సమాధానం చెప్పాల్సిన అవసరం వుంది.

1. 'సాంస్కృతిక విప్లవాన్ని గురించి తెలుసుకుంటే గాని దాన్ని వ్యతిరేకిస్తున్న రివిజనిజం స్వరూపాన్ని పూర్తిగా తెలుసుకున్నట్లు కాదు' అన్నారు. ఇక్కడ పూర్తిగా తెలుసుకోవడం, తెలుసుకోకపోవడం అనేది సమస్య కాదు. దాన్ని రివిజనిజంగా గుర్తించడానికి సాంస్కృతిక విప్లవాన్ని గురించి ఒక అంతిమ నిర్ణయానికి రావలసిన అవసరం లేదు. నేను ఈ విషయాన్ని నా సమీక్షలో వివరించాననే అనుకున్నాను. సోషలిస్టు దశలో వర్గపోరాటాలకు తావులేదనడం, ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేయడమే ప్రధాన కర్తవ్యం అనడం, వర్గస్వభావంతో ప్రమేయం లేని ఆధునీకరణను ప్రధాన లక్ష్యంగా ముందుకు తేవడం, పాశ్చాత్య దేశాల నుండి పెట్టుబడినీ సాంకేతిక పరిజ్ఞానాన్నీ పెద్దఎత్తున దిగుమతి చేసుకోవడం, సామ్రాజ్యవాద, సోషల్ సామ్రాజ్యవాద దేశాలతో శాంతియుత సహజీవనం కోసం పాకులాడడం – ఇవన్నీ రివిజనిస్టు లక్షణాలే. ఒకవేళ సాంస్కృతిక విప్లవంలో జరిగినవి అన్నీ తప్పులే అయినా ఇవి రివిజనిస్టు లక్షణాలు కాకుండ పోవు.

2. 'సాంస్కృతిక విప్లవంలో ఉపరితలాన్ని మార్చడానికి చేసిన ప్రయత్నాలు పునాదిదాకా దారితీసాయి' అన్న రంగనాయకమ్మగారి మాటలను నేను శుద్ధతర్కం అనలేదు. చైనా కమ్యూనిస్టు పార్టీ తన తీర్మానాలలో ఈ విషయాన్ని గుర్తించినట్టుగా ప్రకటించనంత మాత్రాన దీన్ని పార్టీ యొక్క అవగాహనలో లోపంగా ఎంచడాన్ని

‘శుద్ధతర్కం’ (అంటే అచారిత్రకమయిన వాదన) అన్నాను. అలా అనడానికి గల కారణాన్ని కూడ వివరించాను.

3. వ్యక్తి పూజను కమ్యూనిస్టులు అంగీకరించరని, దాని గురించి రెండు అభిప్రాయాలకు తావు లేదని స్పష్టంగానే చెప్పాను. అయితే దీన్ని కూడ అచారిత్రకం (ahistorical) గా చూడకూడదు అన్న అభిప్రాయంతో సాంస్కృతిక విప్లవంలో అది ఏ సందర్భంలో ముందుకొచ్చిందో (నాకు అర్థమయిన మేరకు) వివరించే ప్రయత్నం చేసాను. వ్యక్తి పూజ తప్పు కాదని నేను అనలేదు. అది నా అభిప్రాయం కాదు.

4. 1949లో విప్లవం సాధించిన నాటికి, ఆ తరువాత చాలాకాలం వరకు చైనా కమ్యూనిస్టు పార్టీ విప్లవపార్టీయే. కాని సాంస్కృతిక విప్లవం కాలానికి పార్టీ కేంద్రంలోనే రివిజనిజం బలపడింది. దాన్ని పారదోలడానికి అంతర్గత పోరాటం చాలకనే మావో పార్టీ మీదికే తిరగబడమని ప్రజలకు పిలుపిచ్చాడు. ఆ తిరుగుబాటుకు నాయకత్వం వహించడానికి (అంటే కొత్త బూర్జువా వర్గంతో వర్గపోరాటం నడపడానికి) ఒక (కొత్త) విప్లవపార్టీ అవసరమైంది. దాన్ని నిర్మించుకోలేకపోవడం సాంస్కృతిక విప్లవం వైఫల్యానికి గల ముఖ్య కారణాలలో ఒకటి. ఈ విషయాన్ని రంగనాయకమ్మ గారు, బెతెల్‌హేం గుర్తించలేదని అన్నాను. ఇందులో అర్థం కాకపోవడానికి ఏముందో నాకు అర్థం కావడం లేదు.

మిగిలినవి (ఏమయినా వుంటే) అభిప్రాయభేదాలు. నా అభిప్రాయాలు సమీక్షలో తెలిపాను.

**– కె.బాలగోపాల్**

# చైనాలో ఏం జరుగుతోంది?

అన్ని ప్రాణాలు పోకపోతే చైనా సంఘటనలను ఒక ప్రహసనంగా వర్ణించి వుండవచ్చును. ఒక శక్తివంతమైన చారిత్రక వాస్తవాన్ని అబద్ధాల రూపంలో చర్చించుకోవడం మనకు కొత్త విషయం కాదుగానీ ఇన్ని అబద్ధాలు ఒకే సమయంలో వినడం అరుదే. చైనా పాలకులు చెప్తున్నవి దాదాపు అన్నీ అబద్ధాలే. ఇటు ఉద్యమకారులు చెప్తున్న వాటిలో సగానికి సగం అబద్ధాలు కాకున్నా సందేహాస్పదమైన సత్యాలు. ఇక పాశ్చాత్య పరిశీలకులూ, మన మేధావులూ చేస్తున్న వ్యాఖ్యానంలో అజ్ఞానం, అమాయకత్వాలతో బాటు అవకాశవాదమూ, ఉద్దేశ్యపూర్వకమైన వక్రీకరణ సమపాళ్ళలో ఉన్నాయి. చైనాలో సామ్రాజ్యవాద, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు ప్రారంభమైన నాటి నుండీ ఏ ఉద్యమం వచ్చినా లక్షలాది ప్రజానీకం పాల్గొన్నారు. గత 70 ఏళ్ళుగా చైనాలో జరిగినన్ని ప్రజా ఉద్యమాలు ప్రపంచంలో వేరే ఏ దేశ చరిత్రలోనూ ఎన్నడూ జరగలేదు. విప్లవానికి పూర్వమే కాదు, విప్లవం తరువాత కూడ అధికార కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలోనే పెద్దఎత్తున ప్రజా ఉద్యమాలు జరిగాయి.

బంజరు భూములను సాగులోకి తేవడానికి జనం పలుగులూ, పారలూ పట్టుకొని లక్షలాదిగా ఉద్యమించారు. లక్షల ఎకరాల భూమిని సాగులోకి తెచ్చారు. నిరక్షరాస్యతను రూపుమాపడానికి విద్యార్థులూ విద్యావంతులూ వేల సంఖ్యలో గ్రామాలకు తరలి వెళ్ళారు. మన దేశం ఇంకా ప్రధానంగా నిరక్షరాస్యుల దేశంగా వుండగానే చైనాలో నూటికి తొంభై మంది విద్యావంతులను తయారుచేసారు. దేశానికి అవసరమయిన ఉక్కు తయారు చేయడం కోసం రైతాంగమే సొంత చొరవతో చిన్న చిన్న ఉక్కు మిల్లులను వేల సంఖ్యలో స్థాపించి నిర్వహించారు. ఒకప్పుడు పారిశ్రామికంగా మన కంటే వెనుకబడిన చైనా ఇవ్వాళ మన కంటే మూడు రెట్లు ఎక్కువ ఉక్కు ఉత్పత్తి చేస్తోంది. చివరికి, మురికివాడలలో ఈగలనూ, దోమలనూ

నాశనం చేసే కర్తవ్యాన్ని కూడ మునిసిపాలిటీలకు అప్పజెప్పకుండా జనమే ఉద్యమంగా చేపట్టి, మూడవ ప్రపంచ దేశాలలో చైనా అంత పరిశుభ్రమయిన దేశం లేదనే పేరు సంపాదించుకొన్నారు. ఈ ఉద్యమాలలో ఏ ఒక్కటీ మన పత్రికలలో చోటు చేసుకోలేదు. ప్రజా ఉద్యమాలుగా మన మేధావులు వీటిని ప్రస్తుతించలేదు. విప్లవానంతర చైనా చరిత్రనంతా కూడ అల్లరిమూకల విధ్వంసక చేష్టలుగా ఇన్నాళ్ళూ వర్ణిస్తూ వచ్చారు. ఇవ్వాళ అకస్మాత్తుగా మొట్టమొదటిసారిగా చైనాలో ఒక ప్రజా ఉద్యమం వచ్చిందని మనకు చెప్తున్నారు.

జూన్ 4వ తేదీన బీజింగ్‌లో జరిగిన మారణకాండకు నిర్ణయం మే నెలలోనే జరిగిందని తెలుస్తోంది. అయితే చైనా సైన్యంలో ఒక బలమయిన సెక్షను వ్యతిరేకించడంతో అది వెంటనే అమలు కాలేదు. 100 మందికి పైగా సీనియర్ సైనిక అధికారులు తమ నిరసన తెలుపుతూ చైనా ప్రభుత్వానికి ఉత్తరం రాసారట. అసాధారణమైన ఈ చర్యకు మన మేధావులు హర్షం తెలుపుతున్నారు. సంతోషమే. కాని ఆ స్వేచ్ఛ చైనా సైన్యానికి ఎక్కడి నుండి వచ్చిందని అడిగితే ఏం సమాధానం చెబుతారు? 'ప్రజా విముక్తి సైన్యం ప్రజల మీద కాల్పులు జరపదు' అని వాళ్ళు అన్నారట. ప్రజాస్వామ్య దేశాలని పిలిచే ఏ దేశంలోనయినా సైన్యానికి అంతటి చైతన్యం వుందా? మన దేశంలో 100 మంది సీనియర్ సైనిక అధికారులు కాదు కదా ఒక్క సిపాయి సహితం పంజాబులో గానీ శ్రీలంకలో గానీ నాగాలాండ్‌లో గానీ (ఆ మాటకొస్తే ఆదిలాబాద్‌లో గానీ) 'స్వతంత్ర భారత సాయుధ దళాలు అమాయకుల మీద కాల్పులు జరపడానికి వీలులేద'ని తుపాకి ఎక్కుపెట్టడానికి నిరాకరిస్తే ఈ మేధావులలో ఎంతమంది దానిని 'ప్రజాస్వామ్యానికి' చిహ్నంగా భావిస్తారు? ఎంతమంది దానిని దేశద్రోహం అంటారు? మొన్నటి జూన్ 4వ తేదీన బీజింగ్ నగరంలో ఎంత మంది చనిపోయారో 1984 నవంబర్ నెల చివరి రోజులలో ఢిల్లీ నగరంలోనూ అంతమంది చనిపోయారన్న సంగతి మనం మరిచిపోయాం. ఆనాడు నోరు మెదపని వాళ్ళు ఇవ్వాళ 'ఘోరం ఘోరం' అంటున్నారంటే అందులో మానవత్వం కంటే రాజకీయ అవకాశవాదమే ఎక్కువ ఉంది.

ప్రపంచ ప్రజల ముందు నరహంతకుడిగా నిలబడ్డ డెంగ్ కోసం ఎవరూ కన్నీళ్ళు కార్చనవసరం లేదు. అతను తన ప్రత్యర్థులతో వ్యవహరిస్తున్న పద్ధతిలో

మావో కూడ వ్యవహరించి వుంటే అతను ఇవ్వాళ బ్రతికి వుండేవాడే కాదు. తిరిగి అధికారంలోకి రాగలిగి ఉండేవాడూ కాదు. హత్యలు రాజకీయ విభేదాలకు పరిష్కారం కాజాలవని మావో గట్టిగా నమ్మాడు. ఆ నమ్మకాన్ని జూన్ 4వ తేదీన అతి భయంకర పద్ధతిలో పూడ్చిపెట్టడంతో విప్లవానంతర చైనా చరిత్రలో ఒక శకం గడిచిపోయిందన్న వాస్తవాన్ని డెంగ్ ప్రపంచానికి స్పష్టం చేశాడు. అతనే స్పష్టం చేయడం భావ్యమే, ఎందుచేతనంటే ఈ కొత్త శకాన్ని నిర్వచించే శక్తులకు సారథి అతడే. చైనాలో ఏం జరుగుతోందో తమకు బాగా తెలిసినట్టు అందరూ రాస్తున్నారు గానీ నిజంగా ఏం జరుగుతోందో తెలుసుకోవడానికి కావలసిన సమాచారం ఎవరి దగ్గరా లేదు. అయితే ప్రస్తుత కల్లోలం వెనుక వున్న కొన్ని శక్తులను గుర్తించడం మట్టుకు అసాధ్యం కాదు.

కొన్ని ఏళ్ళుగా చైనా ఆర్థికరంగంలో మౌలికమయిన మార్పులు ప్రవేశపెట్టడం జరుగుతోంది. సమిష్టి ప్రయోజనాల కోసం వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగించడం, సమసమాజ ఆశయంతో పనిచేయడం అనే సోషలిస్టు విధానాన్ని వదిలిపెట్టి పాశ్చాత్య పెట్టుబడులనూ, సాంకేతిక ప్రక్రియలనూ విచ్చలవిడిగా దిగుమతి చేసుకొని స్వప్రయోజనం అనే ప్రోత్సాహకం ప్రాతిపదికగా ఆర్థికరంగాన్ని నడపడం జరుగుతోంది. స్వంత ఆస్తులు పెంచుకొనే అవకాశం కల్పించారు. చాలామంది యువకులు పాశ్చాత్య దేశాలకు పోయి వచ్చారు. పాశ్చాత్య నిపుణులూ సలహాదారులూ చైనాలోకి ప్రవేశించారు. దీని వలన కొన్ని విలువలూ కోరికలూ చైనా సామాజిక జీవితంలో చోటు చేసుకున్నాయి. ప్రజాస్వామిక హక్కులు కావాలన్న న్యాయమయిన కోరికలతోపాటు 'కన్స్యూమరిజం' అనే వినిమయ చాపల్యం కూడ చైనా నగరవాసులకు అంటుకుంది. ఈ చాపల్యానికి నీతి గానీ దూరదృష్టి గానీ సమిష్టి ప్రయోజనం గానీ అడ్డు రావని ఈ కలర్ టి.వి. వీడియో దశాబ్దంలో మనం అనుభవపూర్వకంగా తెలుసుకొన్నాం. అది సమసమాజాన్ని అక్కరకు రాని ఆదర్శంగా భావిస్తుందని, సామాజిక బాధ్యతలను చాదస్తం అని హేళన చేస్తుందని కూడ మనకు తెలుసును. ఇవ్వాళ చైనాలో జరుగుతున్న అలజడి వెనుక ఈ మిశ్రమ చైతన్యం ఒక బలమైన శక్తి. అయితే అదొక్కటే ఇంతటి ప్రజా వెల్లువకు దారితీయజాలదు. ఈ పాశ్చాత్య ప్రభావానికి చైనా పాలకుల రాజకీయ తిరోగమనం తోడయింది. సోషలిస్టు సమాజ నిర్మాణంలో వైయక్తిక హక్కులను ఏ మేరకు నియంత్రించడం న్యాయమనేది ఇవ్వాళ

మార్క్సిస్టులలో చర్చనీయాంశంగా వున్న ప్రశ్న. ఇప్పటివరకు సోషలిస్టు దేశాలలో నడుస్తున్న వ్యవస్థలో అనవసరమయిన నిర్బంధం వుండేదేమోనని ఇప్పుడు చాలామంది భావిస్తున్నారు. వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ, నిష్పాక్షికమయిన నేర విచారణ యంత్రాంగం అనేవి మన మేధావులు చెబుతున్నట్టు ప్రజాస్వామ్య సర్వస్వం కాకున్నా అవి మౌలికమయిన నాగరిక లక్షణాలనీ, భయంతో ప్రజలకు ఆ హక్కులను లేకుండా చేయడం భావ్యం కాదనీ భావిస్తున్నారు. అయితే దేశపాలకులు సోషలిజం అనే ఆదర్శానికి కట్టుబడి వున్నంతకాలం ప్రజలు ఎంతో కొంత అసంతృప్తితోనయినా ఆ నిర్బంధాన్ని సహించే అవకాశం వుంది. కాని సోషలిజం అనే ఆదర్శాన్ని పూర్తిగా వదిలిపెట్టి ఆ పేరు మీద నిర్బంధాన్ని మట్టుకు కొనసాగిస్తామంటే ప్రజలు ఒప్పుకోవలసిన అవసరం లేదు.

మూడవది, ఆర్థిక రంగంలో ప్రవేశపెట్టిన మార్పులతోబాటు వచ్చిన అవలక్షణాలు. పెట్టుబడిదారీ 'మార్కెట్' అనేది ఆధునిక కాలానికి సరిపోయే ఏకైక ఆర్థిక నిర్మాణం అని రష్యాలో గోర్బచేవ్, చైనాలో డెంగ్ రెండు శతాబ్దాలు ఆలస్యంగా కనుక్కొన్నారు. అది అబద్ధం అని ఒక శతాబ్దం క్రితం మార్క్స్ వివరంగా నిరూపించిన విషయాన్ని తిరిగి మళ్ళీ అనుభవపూర్వకంగా 'కనుక్కోవడానికి' ఇంకెంత కాలం పడుతుందో చూడాలి. ఈ లోపల చైనాలో విప్లవానంతరం చూసి ఎరుగని ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, అసమానతలు, అవినీతి చోటు చేసుకొన్నాయి. మనమయితే ఆకలి చావుల నుండి బోఫోర్స్ దాకా అన్నిటికీ అలవాటుపడ్డాము గాని చైనా ఆర్థికరంగం ఇన్నాళ్ళూ కొన్ని ఆదర్శాలకు కట్టుబడి వుంది కాబట్టి వాళ్ళు మన లాగా నవ్వుకొని ఊరుకోలేమన్నారు.

చివరిగా, ఇన్నాళ్ళకు మార్క్సిజం కాలం చేసిందన్న ఆనందాతిశయంతో పరధర్మం అన్న జంకు కూడ లేకుండా తామే తద్దినాలు పెడుతున్న వాళ్ళకు కొంచెం బాధ కలిగించినా చైనా సంఘటనల వెనుక మరొక శక్తి కూడ వుందేమోనని అనుమానించక తప్పదు. డెంగ్ తిరోగమన రాజకీయాలకు చైనా ప్రజలలో సర్వత్రా ఆమోదం లేదు. నోరుండేవాళ్ళ అభిప్రాయాలకు దొరికే ప్రచారం నోరులేని వాళ్ళ అభిప్రాయాలకు దొరకకపోవచ్చును గాక. కాని ఆ 'అసమ్మతి వర్గం' దన్ను ప్రస్తుత ఉద్యమానికి లేకపోతే, మావో పట్ల గానీ చౌఎన్ లై పట్ల గానీ పెద్దగా గౌరవం

అభిమానం ఉన్నాయని భావించడానికి వీలులేని విద్యార్థి ఉద్యమ నాయకులు ఆ ఇద్దరికి వ్యతిరేకంగా ఒక్క మాట సహితం అనడానికి ఎందుకు జంకుతున్నారు?

ఈ నాలుగు ప్రభావాలలో ఏది ఏ మోతాదులో ఉందో ఊహించే ప్రయత్నం ప్రస్తుతానికి దుస్సాహసం అవుతుంది. సత్యం దానంతటదే వార్త కాదు. అసత్యం అంతమాత్రం చేత వార్త కాకుండా పోదు. యావత్ప్రపంచానికి తమకు అనుకూలమైన రంగుటద్దాలు తొడగగల శక్తులు ఇవ్వాళ ప్రపంచాన్ని ఏలుతున్నాయి. ఆ అద్దాలు రంగు మార్చే రోజు వచ్చిన నాడు వాస్తవాలు బయటపడతాయి.

*ఉదయం దినపత్రిక*

*24 జూన్ 1989*

# చైనా ఆర్థికాభివృద్ధి-సింహావలోకనం

నేను మాట్లాడేదానికీ పౌరహక్కుల సంఘానికీ ఏమీ సంబంధం లేదు. ఇవి కేవలం నా వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే. 'చైనా అర్థికాభివృద్ధి – సింహావలోకనం' మీద మాట్లాడమని అన్నారు. కొంతవరకు విఠల్‌రాజన్‌గారు ఆ కర్తవ్యాన్ని తను మాట్లాడే క్రమంలో పూర్తి చేశారు. చైనా ఆర్థికాభివృద్ధి, అక్కడి ఆర్థిక వ్యవస్థలో జరిగినటువంటి పరిణామాలు చెప్పారు. సమస్య ఎక్కడ వస్తుందంటే చైనాలో గానీ, కమ్యూనిస్టు పార్టీలు పరిపాలించిన ఏ దేశంలోనైనా గానీ వాస్తవంగా ఏం జరిగిందో తెలుసుకోవడంలోనే చాలా ఇబ్బందులు ఉంటాయి. ఆ దేశాల్లోపల పత్రికా స్వేచ్ఛ అని మనం ఏదైతే ఇక్కడ అలవాటుపడి ఉన్నామో, దాంట్లో ఎన్ని పరిమితులు ఉన్నప్పటికీ, అటువంటి పత్రికా స్వేచ్ఛ లేకపోవటం – పత్రికా స్వేచ్ఛే కాదు – మేధావులకి గానీ, రచయితలకి గానీ, విశ్లేషకులకు గానీ తమ అభిప్రాయాలను స్వతంత్రంగా చెప్పే స్వేచ్ఛ అన్ని సందర్భాలలో లేకపోవటం పెద్ద సమస్య.

అయితే అసలే లేదని కాదు, అది రకరకాల మోతాదుల్లో, ఒక్కో దేశంలో ఒక్కో రకంగా ఉంది. మొత్తానికి పరిమితులైతే ఉన్నాయి ఆ స్వేచ్ఛ మీద. వాళ్ళకు, అంటే దేశం లోపల ప్రొఫెసర్‌లు అయినవాళ్ళకు కూడ పూర్తి సమాచారం అందుబాటులో లేకపోవడం – మన దేశంలో ఉందని కాదు – కాని ఈ మాత్రం కూడ చాలా సందర్భాలలో ఆ దేశాల్లో మేధావులకు అందుబాటులో లేకపోవటం వల్ల, ఆ దేశాన్ని పరిపాలించిన వాళ్ళు తమ గురించి తాము ఏమి చెప్పదల్చుకుంటారో దాన్నే మనం ఆ దేశ చరిత్రగా స్వీకరించేటటువంటి ప్రమాదం ఉంటుంది. లేదా బయటనుంచి పోయినవాళ్ళు, విదేశీ పర్యాటకులు – వాళ్ళు సానుభూతిపరులు కావచ్చు, వ్యతిరేకులు కావచ్చు – 2 నెలలో, 3 నెలలో లేదా సంవత్సరానికి రెండు నెలల చొప్పున నాలుగేళ్ళో, ఐదేళ్ళో అక్కడ గడిపి తాము చూడగలిగింది చూసి రాస్తారు.

అక్కడ  కూడ వారి చేతులు, కాళ్ళు కట్టి పడేస్తారని కాదు కానీ దేశంలో ఎక్కడికైనా పోవచ్చు, ఏ విషయాన్ని అయినా తెలుసుకోవచ్చు అనేంత పూర్తి స్వేచ్ఛ చైనాలో కూడ చాలా సందర్భాలలో లేదు. ఈ అన్ని విషయాలలో రష్యా కంటే, తూర్పు యూరప్ దేశాల కంటే చైనా మెరుగైనప్పటికీ పూర్తి స్వేచ్ఛ అయితే అక్కడ కూడ లేదు. అలా పోయిన వాళ్ళు చాలామంది – ఉదాహరణకు చైనాలో ఒక దశలో 50 వేలు, 60 వేలు, 70 వేలు కమ్యూన్‌లదాకా ఉండేవి – నేను ఫలానా కమ్యూన్ చూస్తాను అని అంటే కొన్ని సందర్భాలలో చూపించేవాళ్ళు. కొన్నిటి విషయంలో మౌనంగా ఆ అవకాశం కలగనీయకుండా చేసేవాళ్ళు అనే వాళ్ళు. పుస్తకాల్లో రాశారు కూడ. అట్లని వాళ్ళకు నిజాలు తెలుసుకునే అవకాశం పూర్తిగా లేదనేది కూడ వాస్తవం కాదు. చాలా సందర్భాలలో ప్రజలతో మాట్లాడగలిగారు. ఫ్యాక్టరీలలోకి, కమ్యూన్‌లలోకి, పొలాలలోకి పోయి మాట్లాడగలిగారు.

మొత్తం మీద చైనా పాలకులు తమ గురించి, తమ విధానాల గురించి తాము చెప్పదల్చుకున్నవి లేదా విదేశాల నుంచి వచ్చినటువంటి పరిశీలకులు తమకుండే దృక్పథంతో తాము చూడగలిగినదాన్ని, తాము తెలుసుకోగలిగిన దాన్ని వ్యాఖ్యానించి రాసినవి మన ముందు ఉన్నాయి. ఈ విదేశీ పరిశీలకుల్లో వ్యతిరేకులు కొంతమంది అయితే, సానుభూతితో చూసినవాళ్ళు కొందరు. ఇందులో మళ్ళీ రెండు రకాలు. మార్క్సిస్టు దృక్పథం ఉన్నవాళ్ళు కొందరు, మార్క్సిస్టులు కాకపోయినప్పటికీ మావో ఆలోచన, ఆయన ఆచరణలోని మానవతా అంశాల నుండి – రొమాంటిసిజం, కాల్పనిక వాదం అనే మాట మిత్రులు వాడారు – చాలా ఉత్తేజితమైనటువంటి వాళ్ళు ఆ దృక్పథంతో చేసినటువంటి వ్యాఖ్యానాలు ఉన్నాయి. ఇట్లా రకరకాల భాష్యాలు, వ్యాఖ్యానాలు మనకు అందుబాటులో ఉన్నాయి. వీటి నుంచి తెలుసుకొనే ప్రయత్నం చేయాలి. వీటి వల్ల ఉపయోగం లేదు అనుకోవడానికి వీల్లేదు. మనుషులు ఉత్తేజాన్ని పొందటమైనా, జ్ఞానాన్ని సంపాదించడమైనా రకరకాల మార్గాల్లో చేస్తుంటారు. ఇప్పుడు విఠల్‌రాజన్‌గారు చెప్పింది – అదే సాంస్కృతిక విప్లవం కాకపోయినా ఆ ఉత్తేజం, ఆ భావన, ఆ ఆలోచనను సాంస్కృతిక విప్లవం ప్రచారం చేయగలిగింది ప్రపంచ వ్యాప్తంగా. ఆ ప్రచారం ఇచ్చిన ఉత్తేజమే భవిష్యత్ కార్యాచరణకు మనుషులకు ప్రేరణ కలిగిస్తుంది. అది కూడ ఒక శక్తి కాగలుగుతుంది. అందుకే పొద్దున జ్ఞాన

సిద్ధాంతాన్ని గురించి చర్చ వచ్చినప్పుడు అంత సింపుల్‌గా పదార్థం, చైతన్యం అంటే సరిపోదు అని అనుకున్నది.

ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని చైనా ఆర్థిక పరిణామాల గురించి చెప్పాలంటే 1957 వరకు అంటే మొదటి పంచవర్ష ప్రణాళిక అంతమయ్యేవరకు వారు భారీ పరిశ్రమలకు ప్రాధాన్యం ఇచ్చి, వ్యవసాయ రంగంలో ప్రాథమిక సహకార క్షేత్రాలను నెలకొల్పి, ప్రధానంగా సోవియట్ రష్యాలాగా, సోవియట్ యూనియన్ నుంచి నేర్చుకుందాం అనే ఒక స్లోగన్‌తో పని చేశారు. ఆ తరువాత 1958–59 Great Leap Forward కాలంలో కమ్యూన్‌లు చాలా పెద్దఎత్తున, చాలా వేగంగా నెలకొల్పారు. ఆ కమ్యూన్‌ల ఆధ్వర్యంలో Walking on Two Legs అనే పాలసీని – అంటే ఒక వైపు పెద్ద పరిశ్రమలను నెలకొల్పుతూ, మరొకవైపు కమ్యూన్‌ల లోపల చిన్న పరిశ్రమలను చాలా పెద్ద సంఖ్యలో నెలకొల్పుతూ పోవటం – అనుసరించారు. కమ్యూన్‌ల లోపల మళ్ళీ సాంస్కృతిక విప్లవ కాలంలో జరిగినంత కాకపోయినా ప్రాథమిక దశలో సామాజిక సంబంధాల ప్రజాస్వామీకరణ, సమానత్వ సాధన Great Leap Forward తర్వాత ఒక 2, 3 సంవత్సరాలు చేశారు. ఆ తర్వాత 1960–61లో రెండేళ్ళు క్షామంతో ఇబ్బందిపడ్డారు. సరిగ్గా అదే సమయంలో సోవియట్ రష్యా తన ఆర్థిక సహాయాన్ని వెనక్కి తీసుకుంది.

మొదటి పంచవర్ష ప్రణాళిక సమయంలో సోవియట్ రష్యా ఇచ్చిన సహాయం వారికి చాలా ఉపకరించింది. కాని 1960లో అకస్మాత్తుగా 300 భారీ పరిశ్రమలు నెలకొల్పటానికి సహాయం చేస్తామని చెప్పినవాళ్ళు 150 నెలకొల్పిన తరువాత దాదాపు సగంలో వెనక్కి వెళ్ళిపోయారు. ఆ పెట్టుబడి, ఆ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకొని చైనా ఆ తర్వాత కాలంలో అంటే 1961 నుంచి 64, 65 దాకా సోవియట్ రష్యాలో ఒకప్పుడు అనుసరించిన New Economic Policy లాంటిదే అనుసరించి Great Leap Forward కాలంలో తీసుకువచ్చిన మార్పును కొంతవరకు వెనక్కు తీసుకొనిపోయారు. దాని తరవాత సాంస్కృతిక విప్లవంలో Great Leap Forward కంటే ఎక్కువగా Left Policies ను ఆశ్రయించటం, చివరకు సాంస్కృతిక విప్లవం విఫలమైన తరువాత క్రమక్రమంగా ప్రపంచంలోని పెద్ద ఆర్థికశక్తి అని కాదు కానీ, ఒక శక్తివంతమైన, స్థిరమైన ఆర్థిక వ్యవస్థ కలిగిన శక్తిగా చైనా పాశ్చాత్య గుత్త పెట్టుబడిదారీ సంస్థలను చాలా ఆకర్షిస్తోంది. అక్కడ బ్రహ్మాండమైన మార్కెట్ ఉంది,

కోట్లాది ప్రజానీకం ఉన్నారు, వాళ్ళకు కొనుగోలు శక్తి ఉంది, మనం అమ్మడమే తరువాయి అనేటటువంటి ఒక అభిప్రాయం పాశ్చాత్య సంస్థలకు కలిగింది. ఇవ్వాళ చైనా International Monetary Fund దగ్గర, ప్రపంచ బ్యాంకు దగ్గర చాలా పెద్దఎత్తున అప్పులు తీసుకుంటున్నది. GATT లో సభ్యదేశంగా ఉన్న భారతదేశమే డంకెల్ ప్రతిపాదనలపైన సంతకం చెయ్యాలా, వద్దా అనే సందిగ్ధంలో ఉండగా – చెయ్యటం తప్పు అని మనం అంటున్నాం – GATT లో సభ్యత్వం కూడ లేని చైనా అప్పుడే డంకెల్ ప్రతిపాదనలకు ఒప్పుకుంటున్నాం అని ప్రకటించేసింది. ఇదే సింహావలోకనం అంటే. రెండు వాక్యాల్లో చెప్పాలంటే గత 40 సంవత్సరాల పరిస్థితి ఇది.

మళ్ళీ వెనక్కి పోదాం. దీన్నంతా ఏ చట్రంలో చూడాలి అంటే పవర్ స్ట్రగుల్‌గా చూడొచ్చు లేదా ఒక సుందర స్వప్నాన్ని వాస్తవం చెయ్యాలనే ఆకాంక్ష, దాని సాకారం కోసం జరిగిన ప్రయత్నంగా చూడొచ్చు. రెండింటిలో ఏదైనా సరే – ఏ నిర్దిష్టమైన సందర్భంలో వాటిని వాళ్ళు అమలు చేశారు అనేది అర్థం చేసుకొంటే నేలమీద కాళ్ళు నిలబెట్టి ఆలోచించినవాళ్ళం అవుతాం. అది ఏమిటంటే చైనాను ఒక ఆధునిక, పారిశ్రామిక దేశంగా మార్చే ప్రయత్నం. మార్క్స్ సోషలిజాన్ని గురించి ఆలోచించినప్పుడు, దాని గురించి సిద్ధాంతం చేసినప్పుడు, పెట్టుబడిదారీ వ్యవస్థలో, పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల చట్రంలో ఉత్పత్తి శక్తుల పురోగమనం సాధ్యం కాదు అనుకున్నప్పుడు, ఇంకా పురోగమనం కావాలి అనే ఆకాంక్ష సమాజంలో ఏ వర్గాల్లో అయితే ఉంటుందో వాళ్ళు నూతన రాజ్యాన్ని, నూతన వ్యవస్థను ఏర్పాటు చేస్తారు అని భావించాడు. కాబట్టి కార్మికవర్గానికి లేదా కార్మికవర్గ పార్టీకి రాజ్యాధికారం వచ్చిన తరవాత అది దేశాన్ని ఏ రకంగా ఆర్థికంగా అభివృద్ధి చేస్తుందనేది మార్క్స్‌కు సమస్య కాదు. ఆయన ఆ ప్రశ్న వేసుకోలేదు. ఆయన చట్రంలో ఆ ప్రశ్నే లేదు.

కమ్యూనిస్టు పార్టీలు విప్లవం ద్వారా అధికారానికి వచ్చిన అన్ని దేశాలలో కూడ ఎదుర్కొన్న సమస్య – ఒక వెనుకబడిన దేశాన్ని ఏ రకంగా ఆధునిక దేశంగా మార్చాలనేది. దీనికి జవాబు మార్క్స్ రచనల్లో ఎక్కడా దొరకదు. ఒక వెనకబడిన దేశాన్ని కమ్యూనిస్టు పార్టీ తాను అధికారంలో ఉండి కార్మిక నియంతృత్వం అనే పేరు మీద పరిపాలన చేస్తూ ఏ రకంగా ఒక ఆధునిక దేశంగా మార్చాలి అనేది ఇప్పటి ప్రశ్న. ఈ మార్చే క్రమంలో దాన్ని సోషలిస్టు దేశంగా కూడ, సోషలిస్టు

వ్యవస్థగా కూడ నిర్మాణం చెయ్యాలి. అది వెంటనే జరగాలా? లేక కొంత దశ వరకు కమ్యూనిస్టు పార్టీ అధికారం కింద పెట్టుబడిదారీ నమూనాలోనే అభివృద్ధి జరిగిన తర్వాత సోషలిజానికి పరిణామం చెందాలా? ఈ ప్రశ్నలన్నీ కూడ దాదాపు ట్రాట్స్కీ, మెన్షివిక్‌లు, లెనిన్‌లు సంఘర్షించుకున్న కాలం నుండి మొన్నటి వరకూ చర్చగా సాగుతూనే ఉన్నాయి. ఆ పోలెమిక్స్‌లోకి మనం పోవాల్సిన అవసరం లేదు.

అంటే కమ్యూనిస్టు విప్లవం అనే పేరు మీద రాజ్యాధికారానికి వచ్చినటువంటి కమ్యూనిస్టు పార్టీలు ఎదుర్కొన్న సమస్య సోషలిజాన్ని అత్యధికంగా అభివృద్ధి చెందినటువంటి ఉత్పత్తి సాధనాల ప్రాతిపదిక మీద నిర్మాణం చెయ్యడం కాదు. అసలు ఉత్పత్తి సాధనాలను, ఉత్పత్తి శక్తులను ఏ రకంగా ఆధునీకరించాలి? ఏ రకంగా సోషలిజాన్ని నిర్మించాలి? లేకపోతే పూర్తిగా ఆధునిక దేశం అయిపోయేంత వరకు ఆగి తర్వాత సోషలిజాన్ని నిర్మాణం చేయవలసి ఉంటుందా? సోషలిజాన్ని నిర్మాణం చేసే ప్రయత్నం, ఉత్పత్తి శక్తుల ఆధునీకరణ, పెంపుదల – ఈ రెంటికి మధ్య ఉండే సంబంధం ఏమిటి? మొదటిది ఎక్కువ వేగంగా చేస్తే రెండోది వెనుకబడి పోతుందా? రెండోది వేగవంతం చేస్తూ పోతే మొదటిది పూర్తిగా కుంటుపడి పోతుందా? ఇదీ వారి సమస్య. ఈ ప్రశ్నలు రష్యా విప్లవంలోనూ, ఆ తరువాత విప్లవాలు జరిగిన అన్ని దేశాల్లోనూ, చైనాలో కూడ వచ్చాయి. వీటి గురించి అభిప్రాయభేదాలు, ఘర్షణ చాలా జరిగాయి. ఇదొక వర్గ సంఘర్షణ అని చెప్పి మావో సిద్ధాంతీకరించాడు కూడ. అయితే దాన్ని వర్గ సంఘర్షణ అనుకోవాలా? లేకపోతే సోషలిజం నిర్మాణానికి సంబంధించి ఒక వెనకబడిన దేశంలోని రెండు భిన్న పంథాలుగా మాత్రమే అనుకోవాలా అనేది ప్రశ్న. మిత్రులు వేసిన కరపత్రంలో కూడ ఇవన్నీ ఉన్నాయి. చైనా ఎట్లాంటి దేశం? 1949లో కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు ఆ దేశంలోని వెనకబాటుతనాన్ని మనం కూడ ఊహించలేం. అంత వెనుకబడిన దేశం. మనని కనీసం ఒక దేశంగా బ్రిటిషు రాజ్యం పరిపాలించింది. వాళ్ళ అవసరాల కోసం అయినా, ఎగుమతి దిగుమతి అవసరాల కోసం అయినా – రైల్వే లైన్లు, కాలువలు, అక్కడక్కడా హార్బర్లు, కొన్ని ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశారు. వాళ్ళకు దళారులుగా ఉన్నటువంటి మన దేశ వ్యాపారస్తులు మేం కూడ ఫ్యాక్టరీలు పెట్టుకుంటామని చెప్పి అహ్మదాబాద్‌లోనూ, మరొకచోటా నూలు మిల్లులు పెట్టారు, బట్టల మిల్లులు పెట్టారు.

చైనాలో అటువంటిది ఏమీ లేదు. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జపాన్ దేశాలు స్థానికంగా ఉన్నటువంటి బాగా దిగజారిపోయిన ఫ్యూడల్ ప్రభువుల అండతో చైనాను చాలా ఘోరంగా దోచుకోవడం జరిగింది. పూర్తిగా మన నిజాం నవాబు లాంటి ఒక ప్రభువు వాళ్ళని పరిపాలించాడు. స్థానికంగా ఆయనకు అధికారం లేని చోట వార్‌లార్డులు పరిపాలించేవాళ్ళు.

ఒక ఉదాహరణ చెప్పాలంటే చైనా భూభాగం భారతదేశం కంటే చాలా ఎక్కువ. అయినా 1947 నాటి భారతదేశాన్ని, 1949 నాటి చైనాని పోల్చి చూసుకుంటే మనకున్న రైల్వే లైన్లలో 3వ వంతు మాత్రమే చైనాకు ఆనాడు ఉండింది. రోడ్లు అయినా అంతే, కాలువలైనా అంతే, పరిశ్రమలైనా అంతే. వ్యవసాయరంగం మీద విపరీతమైన జనాభా ఒత్తిడి ఉండేది. మనకున్నంత సాగు యోగ్యమైన భూమి కూడ చైనాలో లేదు. చాలా భాగం వ్యవసాయానికి పనికిరానటువంటి విపరీతమైన చలి ప్రదేశాలు, కొండ ప్రదేశాలు. జనాభాలో 10 శాతం ఉండే భూస్వాములు 70 శాతం దాకా భూమి కలిగి ఉండేవాళ్ళు అని చెపుతారు. నిజానికి అక్కడ 20 ఎకరాలు ఉంటే భూస్వామే. వందల, వేల ఎకరాలు ఉన్నవాళ్లు కూడ ఉండి ఉండవచ్చునుగాని, 20 ఎకరాలు ఉన్నవాడిని కూడ పెద్ద భూస్వామిగా భావించేటటువంటి పరిస్థితి చైనాలో ఉండింది. మనకు హిందూ సివిల్ చట్టంలో ఉన్నట్టే వాళ్ళకి కూడ తండ్రి ఆస్తి కొడుకులందరికీ సమానంగా పంచడమనేది ఉంది కాబట్టి ఆ భూమి మళ్ళీ మళ్ళీ ముక్కలుగా అయిపోవడం, వాళ్ళు ఎవరికైనా కౌలుకి ఇస్తే, ఆ రైతు కూడ తన కొడుకులకు దాన్ని కౌలుగానే చిన్న చిన్న ముక్కలుగా చేసి ఇవ్వడం జరిగేది. అందుకే వాటిని వాళ్ళు రిబ్బన్స్ అంటారు. అంటే రిబ్బన్‌లాగా సన్నగా పొడుగ్గా ఉంటుంది ఒక్కొక్క ప్లాటు కూడ. అది సొంత భూమీ కావచ్చు లేక కౌలుకు తీసుకున్నదీ కావచ్చు. అది ఎంత సన్నగా ఉంటుంది అంటే కాడికి ఎద్దుల్ని కడితే ఒక ఎద్దు ఒకరి పొలంలో ఉంటే రెండో ఎద్దు పక్కవాడి పొలంలో ఉంటుందట. అంత పల్చటి కారిడార్ లాంటి, రిబ్బన్ లాంటి భూభాగాలలో సేద్యం చేసేవాళ్ళు.

ఇటువంటి వ్యవసాయక పరిస్థితుల్లో, పూర్తిగా వెనకబడిన పారిశ్రామిక పరిస్థితులలో ఒక ఆధునిక దేశంగా చైనాను ఏ రకంగా తీర్చిదిద్దాలి అనేది అప్పుడు వాళ్ళముందున్న ప్రశ్న. రష్యాలోనూ ఇదే ప్రశ్న 1917లో వచ్చింది. తర్వాత చైనాలో,

ఆ తర్వాత వియత్నాంలోనూ వచ్చింది. అన్ని దేశాలలోనూ తరతమ భేదాలతో ఇదే ప్రశ్న వచ్చింది. ప్రాథమికంగా వాళ్ళకు ఏమి కావాలంటే పెట్టుబడుల భారీ సమీకరణ. పరిశ్రమలు పెట్టడానికైనా, వ్యవసాయాన్ని ఆధునీకరించడానికైనా, ప్రాజెక్టులు కట్టడానికైనా, రిజర్వాయర్లు కట్టడానికైనా, రోడ్లకు, రైల్వే లైన్లకు, టెలిఫోన్‌లకు అన్నిటికీ పెట్టుబడి కావాల్సి ఉంటుంది. ఈ పెట్టుబడి ఎక్కడినుంచి రావాలి అనేది వెనుకబడిన దేశాల ఆధునీకరణలో చాలా ప్రధానమైనటువంటి సమస్య. దీనిని రష్యాలో ఒక రకంగా పరిష్కారం చేశారు. ఏం చేశారు అనంటే బలవంతంగా రైతాంగాన్ని సహకార వ్యవసాయంలోకి తోసి వాళ్ళు పండించిన పంటలో అతి తక్కువ మాత్రమే వాళ్ళ దగ్గర ఉండనిచ్చి మిగిలినదంతా ప్రభుత్వం తీసేసుకొని, ఆ తీసుకొన్న ధాన్యాన్ని రకరకాల రూపాల్లో పెట్టుబడిగా మార్చి దేశ పారిశ్రామీకరణకు ఉపయోగించారు. దానితోపాటు రైతాంగం మీద స్టాలిన్ ఆధ్వర్యంలో విపరీతమైనటువంటి హింస కూడ ప్రయోగించారు.

కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చిన అనేక ఇతర దేశాల్లో కూడ ఇటువంటివి జరిగాయి. మనబోటి దేశం సమస్య కూడ ఇదే. రాజకీయ వ్యవస్థ వేరే కావచ్చు. మన దేశం ఏం చేసిందంటే బ్రిటిష్‌వాళ్ళు మిగిల్చిపోయిన విదేశీ మారకద్రవ్యాన్ని వాడుకోవడంతోపాటు రైతాంగం ఉత్పత్తులకు తక్కువ ధరలు చెల్లించి పెట్టుబడిని సమీకరించుకుంది. శరద్‌జోషిలాంటి వాళ్ళు దీని గురించి ఎప్పుడూ వాదిస్తూ ఉండేవారు కూడ. దేశ పారిశ్రామీకరణ కోసం రైతులకు గిట్టుబాటు ధరలు లేకుండా చేశారని, రష్యాలో స్టాలిన్ బలవంతంగా చేస్తే మీరు మార్కెట్ ద్వారా చేస్తున్నారని. ఆ రకంగా రైతులకు తక్కువ మొత్తాలు చెల్లించి పెట్టుబడి రూపంలో దాన్ని పారిశ్రామీకరణ కోసం వాడుకోవడం, విదేశాల నుండి అప్పులు తీసుకోవడం, అవి తీర్చలేక చెల్లింపుల లోటు వస్తే మళ్ళీ IMF నుంచి అప్పులు తీసుకోవడం – ఈ రకమైన పద్ధతిని మనం కొనసాగిస్తూ ఉన్నాం.

చైనాలో కూడ మొదటి పంచవర్ష ప్రణాళికకు తమ దగ్గరున్న పెట్టుబడి అంతా పెట్టేసి రష్యా నమూనాలో భారీ పరిశ్రమలకు ప్రాధాన్యం ఇచ్చారు. వ్యవసాయ రంగంలో ఏం చేశారంటే మొదటే పెద్దఎత్తున సహకార క్షేత్రాల్ని ఏర్పాటు చెయ్యకుండా ఐదేసి, పదేసి కుటుంబాల వాళ్ళను కలిపి ఒక ప్రయోగం చేశారు. వాళ్ళలో ఒకరికి ఎడ్లు ఉంటే నాగలి ఉండదు. ఒకరికి నాగలి ఉంటే ఎడ్లు ఉండవు. ఇంకొకరికి విత్తనాలు

ఉండవు. పరస్పర సహకారంతో ఒకరి వద్ద మరొకరు కావాల్సిన పరికరాలు తీసుకొని వ్యవసాయం చేసుకోండి, వచ్చిన ఫలితాన్ని మీకున్న భూమి జాగాను బట్టి పంచుకోండి అనే పద్ధతిని ప్రారంభించారు. వీటికి mutual aid teams అని పేరు పెట్టారు. అక్కడ నుంచి ఒక అడుగు ముందుకేసి కిందిస్థాయి సహకార క్షేత్రాలను ఏర్పాటు చేశారు. 20 కుటుంబాలు, 30 కుటుంబాలు, 40 కుటుంబాలు కలిసి తమ భూమిని ఉమ్మడిగా సాగుచేసుకుంటూ ఎవరి భూమి ఎంత అనే దానిని బట్టి పంటలో వాటాలు వేసుకుంటారు. అంతకంటే పై స్థాయిలోని సహకార క్షేత్రాలు – అవి నూరు కుటుంబాలు కావచ్చు, నూటయాభై కుటుంబాలు కావచ్చు – తమకున్న భూమిని, తమకున్న ఉత్పత్తి పరికరాలను ఉమ్మడిగా వాడుకుంటాయి. అయితే ఎవరి భూమి ఎంత అనే విషయాన్ని పక్కకుపెట్టి చేసిన పనిని బట్టి ప్రతిఫలాన్ని తీసుకోవడం ప్రారంభించారు. ఇవన్నీ ఒక రోజులో జరిగినవి కావు. ఒక క్రమంలో జరిగినవి. అయితే ఈ దశ వరకు ఎవరికైనా సరే సహకార క్షేత్రం నుండి బయటకు వెళ్ళిపోయే స్వేచ్ఛ ఉండింది. కొట్లాటలు వస్తే నా భూమి నాకు ఇచ్చేయండి, నేను దాంట్లో ఉండను అని వెళ్ళిపోయే స్వేచ్ఛ ఉండింది. అయితే కొన్నిచోట్ల ఆ స్వేచ్ఛ లేకపోయింది. ఈ రకమైన పద్ధతిలో సహకార క్షేత్రాలు క్రమంగా పెంపొందించుకుంటూ పోయారు. వ్యవసాయ రంగంలో పెట్టుబడి లేమి మొదట్లో చాలా ప్రధానమైన సమస్య కాబట్టి పెట్టుబడి ఎక్కువ పెట్టవలసిన అవసరం లేకుండా వ్యవసాయాన్ని క్రమంగా అభివృద్ధి చేయడానికి ఈ పద్ధతి దోహదం చేసింది. అయితే ఇదీ సరిపోలేదు. దేశం ఆర్థిక పురోగమనం కోసం ఇంకా చాలా పెద్దఎత్తున పెట్టుబడి సమీకరణ జరపాల్సి వచ్చింది. దాన్ని ఏ రకంగా చెయ్యాలి అనే ప్రశ్న వచ్చింది.

ఈ మధ్య కాలంలో ముఖ్యంగా చైనా అనుభవం తరువాత Development Economics లో ఇవ్వాళ ఒక సిద్ధాంతంగానే ముందుకు వస్తున్నది ఏమిటంటే మనుషులు తమ జీవితాలను బాగుచేసుకునే క్రమంలో చైతన్యవంతంగా పాల్గొంటే వారిలో ఉత్తేజం గాని, ఉత్సాహం గాని ఎక్కువగా ఉంటుందని. దాని వల్ల వాళ్ళు కూలి కోసం చేసే శ్రమ కంటే ఎక్కువ శ్రమ చేస్తారు. తమ కోసం కాబట్టి, తమ భవితవ్యం కోసం కాబట్టి ఉచితంగా కూడ శ్రమ చేస్తారు. విదేశాల నుంచి పెట్టుబడి దిగుమతి చేసుకోవడమో, లేకపోతే రైతాంగం నుంచి తక్కువ ధరకు ధాన్యం కొని దాన్ని పెట్టుబడిగా వాడుకోవడమో కంటే వెనుకబడిన దేశాల ప్రజానీకానికి తమ

జీవితాలను తాము బాగుచేసుకోవడంలో, దాంట్లో భాగం పంచుకోవడంలో ఉండే ఉత్సాహం ఏదైతే ఉంటుందో అదే పెట్టుబడి అవుతుంది అనేది ఇవ్వాళ Development Economics లో ఒక సూత్రంగా ఉంది. చైనాలో కూడ దీన్ని అమలు చేసే ప్రయత్నం చేశారు. దీంట్లో పవర్ స్ట్రగుల్ లేదా The Great Leap Forward (1957 తరవాత దశ) ప్రభావం లేనే లేదా అంటే ఉండొచ్చు. ఎందుకంటే మనకు తెలియని చాలా వివరాలు క్రమక్రమంగా ఇక్కడొకటి, అక్కడొకటి బయటకు వస్తుంటాయి. ప్రజలను ఉత్తేజితులు చేయడం ద్వారా దేశాన్ని అభివృద్ధి చేయడం అనే అంశంతో సంబంధం లేని విషయాలు కూడ అందులో ఉండి ఉండొచ్చు. ఆర్థిక పురోగమనంతో సంబంధం ఉన్నటువంటి ఒక ఆదర్శవంతమైన ఊహ మావోలో ఉంటే ఉండవచ్చు. మనం మరీ కళ్ళు మూసుకొని భ్రమలతో, ఆదర్శవంతంగా ఆలోచించాల్సిన అవసరం లేదు. అలాగని మరీ Cynical గా ఆలోచించాల్సిన అవసరమూ లేదు.

Great Leap Forward పేరుతో పిలవబడే రెండో దశలో, అంటే 1957 తరువాత వ్యవసాయ సహకార క్షేత్రాల్లోకి దాదాపు నూటికి 80 శాతం రైతాంగం వచ్చేసింది. సహకార క్షేత్రాల దశను దాటి గ్రామీణ ప్రాంతాల్లో కమ్యూన్‌ల ఏర్పాటు కూడ చేసుకున్నారు. ఒక కమ్యూన్ అంటే కేవలం వ్యవసాయ అవసరాల కోసం భూమిని సమిష్టిగా కలిగి వుండి మీ పశువులు, మా పశువులు, మీ నాగలి, మా నాగలి కలిపి దున్నుకోవడం అని మాత్రమే కాకుండా ఆ వచ్చేటటువంటి పంట నుంచి చేసిన పనిని బట్టి వర్క్ పాయింట్స్ లెక్క కట్టి, దాని ప్రకారం ఆదాయం పంచుకుని మిగులు ఏదైతే ఉంటుందో దాన్ని తనకు తానే నిర్వహించుకొనే యూనిట్. వాళ్ళవరకు వాళ్ళే ఒక గవర్నమెంట్. ఆ మిగులులో కొంత పన్ను ప్రభుత్వానికి కడతారు. అది ప్రభుత్వానికి పారిశ్రామిక రంగంలో పెట్టుబడిగా పనికొస్తుంది. కాని స్థానికంగా వ్యవసాయ రంగానికి సంబంధించినంత వరకు మాత్రం తాము పండించిన దాంట్లో మిగులును ఉపయోగించుకొని – ఎప్పుడో ప్రభుత్వం వచ్చి రిజర్వాయరు కట్టిస్తుంది, చెక్ డ్యాం కట్టిస్తుంది, బావులు తవ్విస్తుంది అనే పద్ధతిలో కాకుండా – వాటిని తామే ఏర్పాటు చేసుకుంటారు. సమిష్టిగా పండించుకోవటం వల్ల కొంత ఎక్కువ మిగల్చగలుగుతారు. దాంట్లో ప్రభుత్వానికి పన్ను కట్టగా మిగిలింది డ్యామ్‌లు

కట్టుకోవటానికి, ముఖ్యంగా చాలా పెద్ద రిజర్వాయర్లు కట్టుకోవడానికి ఉపయోగించుకున్నారు. భూమిని చదును చేయడం లాంటి పనులకు కూడ వాళ్ళు చాలా పెద్దఎత్తున తమ శ్రమనే ఉపయోగించారు. చిన్న డ్యాములను కూడ తమ శ్రమతోనే కట్టుకున్నారు. మన దగ్గరయితే ప్రభుత్వం ప్రాజెక్టు మంజూరు చెయ్యాలి. ప్రపంచబ్యాంకు దగ్గరికి అప్పు కోసం పోవాలి. వాళ్ళు అప్పు ఇవ్వాలి. అప్పు ఇచ్చిన తరువాత ఎవడో కాంట్రాక్టరు ఆ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలి. వాడు దాంట్లో మట్టినో దేన్నో కలపాలి. అది కూలిపోవాలి. ఇవేమీ లేకుండా వాటిని కట్టుకునేది తమ కోసమే కాబట్టి తమ శ్రమతో, తమకు మిగిలిన దాంతో వాళ్ళు కట్టుకుంటారు. భూమి లేని కూలివాళ్ళు ఎవరన్నా ఉంటే వాళ్ళను కూలికి నియమించుకుంటారు. వాళ్ళకు తాము పండించిన దాంట్లో మిగిలింది ఇస్తారు.

నేను ఒక విధానంగా దీనిని చెప్తున్నాను. ఈ విధానం అమలులో జరిగిన అవకతవకలు, మిగిలిన విషయాలు పక్కకుపెట్టి చెబుతున్నాను. చైనా వాళ్ళు తమ భూమిని బాగుచేసుకోవడం గురించి మీరు కూడ చాలా నవలల్లో చదివే ఉంటారు. అసలు ఏ మాత్రం ఆవాసయోగ్యం కావు అనుకున్నటువంటి భూములను కూడ తమ శ్రమతో కొన్ని లక్షల ఎకరాలను చైనాలో సాగు కిందికి తీసుకువచ్చారు. ఇది ఒక దీర్ఘకాలిక ఆర్థిక క్రమంలో దేనికి దోహదం చేసిందంటే విదేశాలకు గులాములు కాకుండా తమ కాళ్ళమీద తాము నిలబడేందుకు, పెట్టుబడి కొరత అనే సమస్యను పరిష్కరించేందుకు వారికి ఉపయోగపడింది. దీంట్లో వేరే రాజకీయాలు, ఆదర్శాలు లేవా అంటే ఉండొచ్చు. దీంతోపాటు ఈ కమ్యూన్‌లలో మరొక ప్రయోగాన్ని కూడ ఆ దశలో ప్రవేశపెట్టారు. అది చాలా వివాదాస్పదమైనది. విఠల్‌రాజన్ కూడ ప్రస్తావించారు Walking on Two Legs అని. ఈ మాటను చాలా సందర్భాలలో మావో ప్రయోగిస్తారు. చైనా రాజకీయాలలో తరచుగా చెప్తారు. దీని అర్థం పెద్ద పరిశ్రమలే కాకుండా చిన్న చిన్న పరిశ్రమలు కూడ స్థానిక అవసరాల కోసం, స్థానిక వనరులతో కమ్యూన్‌లలోనే కొన్ని వస్తువులను తయారుచేస్తాయి. అవి ఎరువులు కావచ్చు, పురుగుల మందులు లాంటివి కావచ్చు. నాగలికీ, వాటికీ ఉపయోగించే ఇనుప ముక్కలు కావచ్చు. చెప్పులు లాంటివి కావచ్చు. మొత్తంమీద స్థానికంగా ఉపయోగించే వస్తువులను స్థానిక వనరులతో చిన్న చిన్న కంపెనీలు పెట్టుకొని స్థానికంగానే వాటిని తయారు చేసింది చైనా.

దాంతోపాటు Backyard Furnance అని చెప్పి, ఇనుము, ఉక్కు ఉత్పత్తిని కమ్యూన్‌లలోనే చిన్న చిన్న Blast Furnance లు పెట్టి తయారు చేసే ప్రయోగం కూడ చేశారు. వీటిని కొంత వివరంగా పరిశీలించిన ఎకానమిస్టులు – ఆ రెండింటిని కలపకూడదు, వేర్వేరుగా చూడాలి అన్నారు. ఎందుకంటే ఈ Backyard Furnances చాలావరకు విఫలమయ్యాయి, ఆర్థికంగా చాలా నష్టం కూడ జరిగిందని అన్నారు వాటి వల్ల. అయితే ప్రజలకు అనుభవం రాలేదా? ఒక ఉత్సాహం రాలేదా? అంటే వచ్చింది. Furnace పనులు, Factory పనులు లాంటివి పట్టణాలలో ఉండే కార్మికులే చేస్తారు, అవి మాకు అర్థం కావు అని రైతాంగం అనుకోకుండా మేం కూడ చెయ్యగలం అని అనుకోవడం మనిషికి ఆత్మస్థైర్యం ఇస్తుంది. ఆ ధైర్యం మనిషిని మరింత సంపూర్ణమైన మనిషిగా తయారు చేస్తుంది. సోషలిజం అనుకున్నా, విప్లవం అనుకున్నా, ఏదనుకున్నా అదొక ముఖ్యమైన ఆదర్శం. ఆ ఆదర్శంలో ఇదొక ముఖ్యమైన అంశం. మనిషిని మరింత నిండైన మనిషిగా, నేను పొలం మాత్రమే దున్నగలను, వేరేమీ చెయ్యలేను అనుకోకుండా నేను ఇది కూడ చెయ్యగలను అనే నమ్మకం ఇస్తుంది. అది విఫలం కావచ్చు, వృథా కూడ కావచ్చు. కొన్ని వృథా అయినప్పటికీ కమ్యూన్‌ల ఆధ్వర్యంలో చిన్న చిన్న పరిశ్రమలు ఏవైతే నెలకొల్పాలని ప్రయత్నం చేశారో అవి చాలావరకు విజయవంతమయ్యాయి.

ఈ చిన్న స్థాయి పరిశ్రమలు అనేవి అక్కడ చాలా పెద్దఎత్తునే వచ్చాయి. చైనాకు పోయి వచ్చిన ఒక ఎకానమిస్ట్ అంటాడు – భారతదేశాన్ని, చైనాని పోలిస్తే ఇక్కడ మన Small Scale Sector అంతా కూడ ప్రభుత్వాన్ని దోచుకోవడం కోసం చిన్న చిన్న కంపెనీలు పెట్టుకోవటం, డబ్బులు తీసుకోవటం, ఎగ్గొట్టేయటం, sick అని ప్రకటించుకోవడం – ఇదే జరిగింది. కాని అక్కడ కమ్యూన్‌లలో ప్రజల శ్రమ, వాళ్ళ ఆలోచనలు, సైంటిస్టులు నేర్పించేటటువంటి టెక్నాలజీ, వాటిని ఉపయోగించుకొని స్థానిక వనరులతో వాళ్ళు ఎన్నిటినో తయారు చేసుకున్నారు. వాళ్ళకి ఆత్మవిశ్వాసం పెరిగింది. వాళ్ళు మరింత సంపూర్ణమైన మనుషులుగా మారారు. మేధో శ్రమ అనండి, శారీరక శ్రమ అనండి లేక పారిశ్రామిక సాంకేతికత అనండి, వ్యవసాయ సాంకేతికత అనండి – ఆ తేడాలు తగ్గిపోవటానికి ఈ ప్రయోగం దోహదపడింది. ఇది వాళ్ళు బాగానే చేయగలిగారు.

ఇదే కాకుండా సోవియట్ రష్యాలో చాలా ప్రధానమైన లోపంగా ఉన్న కేంద్రీకృత ప్రణాళికా రచనను వాళ్ళు కొంతవరకు సరిదిద్దుకోగలిగారు. రష్యాలో దాని వల్ల విపరీతమైన కేంద్రీకృతం జరిగి, బ్యూరోక్రసీ పెరిగి మూర్ఖమైన నిర్ణయాలు, మూఢమైన నిర్ణయాలు, వాస్తవాలతో ఏమీ సంబంధం లేని నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. కొన్ని జోకులు చెప్తారు. గోర్బచెవ్ వచ్చిన తరువాతే విషయాలు బయటకు వస్తున్నాయి. అప్పుడు చెప్పటానికి స్వేచ్ఛ లేదు. సోవియట్ రష్యాలోనూ లేదు, చైనాలోనూ లేదు. ఒక ఉదంతం ఏమిటంటే – మాస్కో నుంచి బూట్ల సరఫరా జరగాలి. 2500 కి.మీ. దూరంలో ఉన్నటువంటి తమ గ్రామానికి బూట్లు వస్తాయి, వస్తాయి అని ఆ గ్రామస్తులంతా కాచుకొని ఉన్నారు. చలికాలం. ఒక రోజు గూడ్సు ట్రెయిన్‌లో మొత్తం బూట్లు దిగాయి. తీరా విప్పి చూస్తే అన్నీ ఎడమకాలి బూట్లే ఉన్నాయంట. కుడి, ఎడమ కలిపిన జత కాకుండా కేవలం ఎడమకాలి బూట్లే ఉన్నాయంట దాన్నిండా. ఈ రకమైనవి చాలా జరిగాయంటారు. చైనాలో కూడ జరిగాయి, జరగలేదని కాదు. అన్ని చోట్లా జరిగాయి. ఎవరో కొద్దిమంది – వాళ్ళలో ఎంత లెక్కలు, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నా – దేశంలోని అన్ని రకాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కేంద్రీకృత ప్రణాళికా రచన చేసి, దాన్ని సమన్వయం చేసుకుని, అన్ని నిర్ణయాలు చేయగలుగుతారు అనుకోవడం సరియైన ఆలోచనే కాదు. ఆ విషయం అర్థం కావడానికి రష్యాకు చాలా కాలం పట్టింది. ఆ అనుభవం నుండి చైనావాళ్ళు కొంతవరకు నేర్చుకొని దాదాపు రెండవ పంచవర్ష ప్రణాళిక కాలం నుంచి వికేంద్రీకరణ ప్రారంభించారు. అదెలాగంటే పెద్ద పరిశ్రమలను మాత్రమే కేంద్రీకృతంగా నిర్వహించేవారు. చిన్నస్థాయి పరిశ్రమలన్నిట్లో రాష్ట్రాల వాళ్ళకు నిర్వహణా స్వేచ్ఛ ఉండేది. అయితే చైనాలో రాష్ట్రాలు చాలా పెద్దవి కాబట్టి అప్పటికీ కేంద్రీకృతమే కావచ్చు. అప్పటికీ బ్యూరోక్రాటిక్కే కావచ్చుగానీ అయినా ఆ మాత్రం తేడాను మొదటి నుంచి కూడ వాళ్ళు పాటించడం మొదలుపెట్టారు.

ఇక్కడ మనం కొన్ని విషయాలలో జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే మెచ్చుకునేటప్పుడు మెచ్చుకోవడం ఎంత అవసరమో democratisation లాంటి మాటలు ఉపయోగించేటప్పుడు జాగ్రత్తగా ఉండడం కూడ అంతే అవసరం. కేంద్రీకృతంగా పీకింగ్ (బీజింగ్) లో కూర్చొని అన్ని నిర్ణయాలు జరుగుతాయనేది కొన్ని సందర్భాలలో మంచిదే. అలాగే ఇంకా కిందిస్థాయి నిర్ణయాలు అంటే ఒక కమ్యూన్‌లో ఉపయోగించే ఎరువులు ఎక్కడ తయారు చేసుకోవాలనే నిర్ణయం కమ్యూన్

అడ్మినిస్ట్రేషనే చేయడం కూడ మంచిదే. కేవలం పన్ను ఒక్కటే ప్రభుత్వానికి కడతారు లేదా తాము ఉత్పత్తి చేసే దానిలోంచి ఏమైనా మిగిలితే ప్రభుత్వంతో అగ్రిమెంట్ పెట్టుకొని సరఫరా చేస్తారు. ఇంతవరకూ ప్రజాస్వామికమే.

కాని ఎంత సాంస్కృతిక విప్లవంలో అయినా, Great Leap Forward కాలంలో అయినా మొత్తం మావో చేసిన ప్రయోగమంతా ప్రజాస్వామికంగా ఏమీ జరగలేదు. వికేంద్రీకరణ అంటే కిందిస్థాయిలో నిర్ణయాలు తీసుకోవటం – కొంతవరకే జరిగింది. అలాగే రాజకీయంగా తిరోగామి శక్తులను ప్రతిఘటించాలి అనుకున్నప్పుడు Right to Rebel అనే పిలుపును, అంటే ప్రతిఘటించే స్వేచ్ఛను, హక్కును ఒక రాజకీయ సంఘర్షణలో భాగంగా ఇవ్వడం జరిగింది. సమాజంలో దొంతర్లు దొంతర్లుగా అసమానతలు ఏవైతే ఉంటాయో వాటికి వ్యతిరేకంగా పోరాడడం, ప్రతిఘటించడం, సామాజిక సంబంధాలలో సమానత్వాన్ని పెంపొందించడం – ఆ అర్థంలో ప్రజాస్వామీకరణ ఉంది. కాని పౌరులుగా ఏదైతే మనం హక్కులు, స్వేచ్ఛ అనుకుంటామో, ప్రజాస్వామ్యం అనుకుంటామో వాటి ఛాయలు అక్కడ వెతికితే మాత్రం కష్టమే. అది మావో ఆలోచనలలో అయినా సరే, మావో ఆధ్వర్యంలో జరిగినటువంటి సాంస్కృతిక విప్లవంలో అయినా సరే. పోరాటంలో భాగంగా పోస్టర్లు వెయ్యండి అన్నాడు కాని అది పోరాటంలో భాగంగా మాత్రమే. అది తిరోగామి శక్తులను ప్రతిఘటించటం కోసం మాత్రమే. పరిస్థితులతో నిమిత్తం లేకుండా ప్రజాస్వామ్యం అని మనం దేన్నయితే అనుకుంటామో – దానికి బూర్జువా ప్రజాస్వామ్యం అని పేరు పెట్టినా, ఏ పేరు పెట్టినా – మనుషుల స్వేచ్ఛాయుతమైన జీవితానికి అది అవసరం. దాని గురించి ఒక concept ఏదీ కనిపించదు. ప్రతిఘటించు, పోరాడు, ఎదిరించు, హక్కులు డిమాండ్ చేయి అనే పిలుపు చైనాలో అనేక సందర్భాలలో ఇవ్వడం జరిగింది కాని వాటికి ఒక వ్యవస్థ, ఒక గ్యారంటీ, వ్యవస్థితమైనటువంటి భద్రత – ఇవి మాత్రం మనకు కనిపించవు. వీటిని కూడ మనం దృష్టిలో పెట్టుకొని విషయాలు చర్చించుకోవాలి. మంచి చెడు మొత్తం విషయాలు మన దృష్టిలో ఉండటం అవసరం.

సరే ఇప్పుడు ఆర్థిక వ్యవస్థ దగ్గరకు మళ్ళీ వస్తే పైన చెప్పిన ప్రయోగాలన్నీ చేశారు. ఆ ప్రయోగాలు చేసే క్రమంలో 1952 నుంచి 1960 వరకు వాళ్ళకు రష్యా సహాయంగా ఉండింది. శిక్షణ ఇవ్వటానికి రష్యా వాళ్ళు మొదట ఒప్పుకున్నారు. కొన్ని బిలియన్ల డాలర్ల పెట్టుబడిని సమకూర్చడానికి కూడ ఒప్పుకున్నారు, ఇచ్చారు

కూడ. ఆ పరిశ్రమలు సగం వరకు పూర్తయి మిగిలినవి సగం సగం నడుస్తూ ఉండగా రాజకీయ విభేదాల వల్ల రష్యా వాళ్ళు అకస్మాత్తుగా మొత్తం వదిలిపెట్టి వెనక్కి వెళ్ళిపోయారు. ఈ లోపల చైనాలో ఇంజనీర్లు కొంత నేర్చుకున్నారు. సాంకేతిక నిపుణులు కొంత నేర్చుకున్నారు. కాని అది సంపూర్ణం కాదు. అది సరిపోలేదు. వాటిని వేగంగా పూర్తి చేయటానికి. సరిగ్గా అదే సమయంలో రెండు సంవత్సరాలు తీవ్రమైన క్షామం ఏర్పడింది. అది ఎంత తీవ్రం అంటే Yellow river అని చెప్పి ఒక నది ఉంటుంది చైనాలో, అది ఎప్పుడూ ఎండిపోదట. అటువంటిది 3 వారాలు చుక్క నీళ్ళు లేకుండా ఎండిపోయిందట ఆ నది. అంత తీవ్రమైన క్షామం అని చెప్తుకుంటారు. 1959–61 ఆ రెండు సంవత్సరాలూ కరువు రావడం, రష్యా వాళ్ళు అకస్మాత్తుగా వెనక్కి వెళ్ళిపోవడంతో అంతవరకు జరిగినటువంటి ప్రయోగం – ప్రాథమిక పెట్టుబడి సమీకరణ, పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయ రంగం అభివృద్ధి, Land reclamation, రిజర్వాయర్లు కట్టుకోవడం – ఇవన్నీ దెబ్బతిన్నాయి.

ఎప్పుడైతే కరువు వస్తుందో అంతవరకు సమిష్టిగా కలిసి పనిచేసుకుంటున్న వాళ్ళలో సహజంగానే తేడాలు వస్తాయి. కొట్లాటలు వస్తాయి. ఘర్షణలు వస్తాయి. నా భూమి నాదే, నీ భూమి నీదే పో అనుకున్నారు. ఇట్లాంటి ఘర్షణలు కమ్యూన్‌లలో కూడ వచ్చాయి. కమ్యూన్‌లలో ఏమైనా మిగిలితే ఆ మిగులును దేని కోసం ఖర్చు పెడదామనుకునే విషయాలలో గొడవలు వచ్చాయి. మనుషులకు ఇంకా ఆకలి అనేది సమస్యగా ఉంది కాబట్టి ఆ మిగులును తమ కోసం దాచిపెట్టుకుందాం అనుకునేవాళ్ళు ఏర్పడి కొంచెం అవినీతి వచ్చింది. ఈ సమస్యలన్నీ కమ్యూన్‌లలో, కమ్యూన్‌ల బయటా కూడ రాజకీయాలుగా మారాయి. చివరికి రాజకీయ ఘర్షణ రూపం తీసుకొన్నాయి. ఎక్కడ దీన్ని పవర్‌స్ట్రగుల్‌గా చూస్తాము, ఎక్కడ పునాదిలో ఉన్న సంక్షోభంగా చూస్తాము అంటే రెండింటికీ ముడి తప్పనిసరిగా ఉంటుంది. అది అర్థం చేసుకుంటే ఇదా, అదా అనే చర్చ అనవసరమవుతుంది. దాదాపు మొదటి నుంచి చైనా కమ్యూనిస్టు పార్టీలో మావో ఎప్పుడూ మైనార్టీగానే, బలహీనుడుగానే ఉంటూ వచ్చాడు. 1961 నుంచి 64, 65 వరకు సమిష్టి క్షేత్రాలను కొంతవరకు ప్రైవేట్‌పరం చెయ్యడం, ప్రైవేటు ప్లాట్లు కావాలంటే పెట్టుకోవచ్చు అని చెప్పడం జరిగింది. ఒకప్పుడు మీరు ఈ సమిష్టి క్షేత్రానికి ఎంత భూమి ఇచ్చారో దాన్ని జ్ఞాపకం పెట్టుకొని దాని ప్రకారం మీరు కొంత అదనంగా తీసుకోవచ్చు వంటి ఏర్పాట్లు, మార్పులు జరిగాయి. లేదా పండించిన

దాంట్లో కొంత మాత్రం ప్రభుత్వానికి ఇచ్చి మిగిలిన దాన్ని మీరు స్వేచ్ఛగా బయట అమ్ముకోవచ్చు అని చెప్పారు. దానితో నల్లబజారు విపరీతమై ప్రభుత్వం ప్రకటించిన ధర కంటే 30 రెట్లు, 40 రెట్లు, 50 రెట్లు ఎక్కువ ధరకు అమ్మకాలు జరిగాయి. ఇవన్నీ కూడ చైనాలో ఒక 2, 3 సంవత్సరాల పాటు కొనసాగాయి. ఈ నేపథ్యాన్ని – అంటే ఆర్థిక పెట్టుబడి సంచయం, పారిశ్రామీకరణ, వ్యవసాయ, పారిశ్రామిక, ఆర్థిక రంగాలలో పురోగమనం – వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని ఆలోచించాలి. ఎందుకంటే అదొక ప్రధాన సమస్య. వేరే పవర్ స్ట్రగుల్ ఉన్నా, ఆదర్శాలు ఉన్నా, సోషలిజం నిర్మాణమున్నా అన్నీ దీంతో ముడిపడి ఉండవలసినవే కాబట్టి అక్కడి నుంచి పరిశీలిస్తూ వస్తే సాంస్కృతిక విప్లవం కాలం దగ్గరకు వచ్చేటప్పటికి ఈ పరిస్థితి కనిపిస్తుంది.

అప్పుడు మళ్ళీ ఒక పిలుపు. దేశం తిరిగి పెట్టుబడిదారీ దిశ వైపు వెళ్ళిపోతూ ఉంది, Great Leap Forward కంటే ఇంకింత ఎక్కువ చైతన్యంగా ముందుకు పోయి సోషలిస్టు సంబంధాలను నెలకొల్పటం ద్వారా మన ఆర్థిక సమస్యను పరిష్కారం చేసుకుందాము అని మావో పిలుపునిచ్చారు. దానికే Bombard the Headquarters అని పేరు. పార్టీ నాయకత్వం వెనకబడి పోతోంది కాబట్టి, వారందరూ తిరోగాములు అయిపోతున్నారు కాబట్టి, పెట్టుబడిదారీ మార్గీయులు అయిపోతున్నారు కాబట్టి వాళ్ళ మీద దాడి చేయండి, పార్టీ కేంద్ర నాయకత్వం మీద మాత్రమే కాదు, ప్రతి ఫ్యాక్టరీలో, ప్రతి కమ్యూన్‌లో అన్ని చోట్ల కూడ అధికారంలో ఉండేవాళ్ళు – వాళ్ళు పార్టీ వాళ్ళుగానీ, వేరే ఎవరయినాగానీ – వాళ్ళ మీద, వాళ్ళ తిరోగమనం మీద దాడి చేయండి అని మావో పిలుపు ఇవ్వడం, సాంస్కృతిక విప్లవం ఆ రకంగా ప్రారంభం కావడం, దీన్ని నేపథ్యంగా పెట్టుకొని చూస్తే మనకు అక్కడ లింక్ కనిపిస్తుంది.

ఇక్కడ మళ్ళీ మనం వెనక్కి పోయి ఇంకో ప్రశ్న వేసుకోవాలి. 1961–64 మధ్య ఒక రకమైన నూతన ఆర్థిక విధానం అమలులోకి వచ్చింది. మరి మావో ఎందుకు దాన్ని ప్రతిఘటించాడు? తన ప్రతిఘటనను ఆయన ఏ రకంగా సిద్ధాంతీకరించాడు? కేవలం అధికారం కోసమే చేశాడనే వాదనలను కాసేపు పక్కన పెడదాం. మావో ఏ రకంగా దాన్ని అర్థం చేసుకున్నాడనే ప్రశ్న మనకు ముఖ్యం. పొద్దున కొంత చర్చ Good politics in command and improve production అని మావో అన్న విషయం అంజయ్య గారు గుర్తించలేదని కొంత చర్చ వచ్చింది. సుబ్రహ్మణ్యం కొంత వివరణ ఇచ్చాడు. నేననుకుంటా ఒక పాయింట్ అందరమూ

మిస్ అయ్యాం – ఒక కీలకమైన పాయింట్. ఆ పాయింట్‌ను మొదట్లో కొంత ప్రస్తావించాను, మళ్ళీ ఇక్కడ చెప్తాను.

ఉత్పత్తి శక్తుల మీద ఆధారపడే ఉత్పత్తి సంబంధాలు ఉంటాయి. అయినప్పటికీ కొంత స్వతంత్రంగా కూడ ఉంటాయి కాబట్టి ఉత్పత్తి సంబంధాల గురించి విడిగా కూడ మాట్లాడొచ్చు అనో అటువంటిది కాదు ఇక్కడ. ఉత్పత్తి సంబంధాలు మార్చటం ద్వారానే ఉత్పత్తి శక్తులు మరింత ఎక్కువగా అభివృద్ధి చేయగలుగుతాము అనే ఆలోచన కూడ మావోలో ఉంది. అది కరెక్టా, కరెక్ట్ కాదా, ఇది మార్క్సిజం అవునా కాదా అనేది పక్కకు పెడదాం. మావో ఆలోచనలను మార్క్స్‌ను రిఫరెన్స్ పాయింట్ చేసుకొని రైటా, తప్పా అని చూస్తామా? లేక మావో ఆలోచనలైనా, లెనిన్ ఆలోచనలైనా, మార్క్స్ ఆలోచనలైనా – అన్నిటినీ కూడ సోషలిజం అనే ఆదర్శానికి రిఫరెన్స్ చేసుకొని ఎవరు ఎంతవరకు కరెక్టు అని ఆలోచిస్తామా అనేది కూడ ఒక చర్చ కావచ్చు. మార్క్స్‌నే ఎందుకు ప్రాతిపదికగా తీసుకోవాలి? అని కూడ ఒక ప్రశ్న కావచ్చు. మావో ఆలోచనలో ఒక అంశం ఏముంది అంటే ఉత్పత్తి సంబంధాల విప్లవీకరణ అనేది విపరీతంగా వెనకబడి ఉంటే అది పునాదిని వెనక్కి లాగుతుంది కాబట్టి ఉపరితలాన్ని కూడ విప్లవీకరించాలి అని. అనేక సామాజిక సంబంధాలుంటాయి. వాటిని మార్చకపోతే మనం పునాది ఎంత అభివృద్ధి చేసినా సరే సమాజం వెనక్కి పోతుంది కాబట్టి వాటిని మార్చాలి. ఉత్పత్తి శక్తులు – ఉత్పత్తి సంబంధాలు, పునాది – ఉపరితలం అనేవి one to one గా ఉండవు. కొంత స్వేచ్ఛ ఉంటుంది. కొంత స్వయం ప్రతిపత్తి ఉంటుంది. కాబట్టి విడిగా దాని గురించి ఆలోచించాలి అనే కాకుండా ఉత్పత్తి శక్తుల్లో పురోగమనం కావాలంటే కూడ ఉత్పత్తి సంబంధాలను మరింత విప్లవీకరించాలి. ఉపరితలాన్ని విప్లవీకరించాలి. దాని ద్వారా మనుషుల్లో వచ్చేటటువంటి చైతన్యమూ, ఆలోచనా, మరింత నిండైన మనషులు కావటం, మరింత బాధ్యతాయుతమైన మనుషులు కావటం, తమ జీవితాల మీద తమకు కంట్రోల్ అనేది పెరగడం...ఇవన్నీ ఉత్పత్తి శక్తుల పురోగమనానికి దోహదం చేస్తాయన్న ఆలోచన కూడ మావోకు ఉండింది.

మావో రచనల్లో చాలా సందర్భాలలో మనకు అది స్పష్టంగానే కనిపిస్తుంది. ఒక ఫ్యాక్టరీలో కార్మికులు ఉంటారు. ఏ సూపర్‌వైజరో వచ్చి, ఇంజనీరో వచ్చి ఇట్లా

చేయండి, అట్లా చేయండి అంటే పని చేస్తూ ఉంటారు అనుకుందాం. ఆ సంబంధమే ఉండకూడదు, అది పోవాలి. సూపర్‌వైజర్ అంటూ ఎవరైనా ఉన్నా సరే ఆ సూపర్‌వైజర్ కూడ ఫ్యాక్టరీ కార్మికులతో కలిసి పనిచేయాలి, అందరూ కలిసి ఫ్యాక్టరీని నడపాలి. ఆ ఆలోచనే ఒక సోషలిస్టు ఆలోచన, ఒక పురోగామి ఆలోచన. విడిగా కూడ దాన్ని కాంక్షించవచ్చు, కాంక్షించాలి. కానీ ఆ రకమైన ఆలోచన అమలు చేయడం ద్వారా కార్మికులకు పెరిగేటటువంటి బాధ్యత, కార్మికులకు పెరిగేటటువంటి భాగస్వామ్యం – ఇది మరింత ఎక్కువ ఉత్పత్తి చేయటానికి, ఉత్పత్తి శక్తులను మరింత ముందుకు తీసుకొని పోవటానికి, మరింత సృజనాత్మకంగా పనిచేయటానికి దోహదం చేస్తుంది.

ఎక్కువ పెట్టుబడి పెట్టి హెవీ ఇండస్ట్రీని మీరు అభివృద్ధి చేస్తే కదా ఆర్థిక వ్యవస్థ ఆధునికం అయ్యేది, మీరు ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్లు కమ్యూన్‌లలో తయారుచేస్తూ పోతే ఎప్పుడు అభివృద్ధి అవుతారు అంటారు. సంప్రదాయకంగా వేప గాని, మరొకటి గాని వాటికుండే క్రిమి సంహారక లక్షణాలు ఏవైతే రైతాంగానికి పరిచయం ఉంటాయో వాటి నుంచి చిన్న టెక్నాలజీని అభివృద్ధి చేసుకుని వారు కొన్ని పురుగు మందులు తయారుచేస్తారు. ఎరువులు తయారు చేస్తారు. మనం ఎట్లాగైతే పశువుల పేడ వాడతామో చైనాలో ఎరువుగా పందుల మలాన్ని ఎక్కువగా వాడతారు. క్రమంగా ఆ ఎరువు నుంచి ఇంకెంత ఆధునికమైన ఎరువును తయారు చేయగలుగుతామనేది వాళ్ళు ఆలోచించుకోగలుగుతారు. ఇదేం చేస్తుంది? కేవలం ఎరువులు సప్లయ్ చేయటం మాత్రమే కాదు, వాళ్ళను చిన్న చిన్న సైంటిస్టులను చేస్తుంది. మరింత నిండైన జీవితాన్ని వాళ్ళకిస్తుంది. మరింత బాధ్యతాయుతమైన అస్థిత్వాన్ని వాళ్ళకిస్తుంది. ఇది ఒక కాంక్షణీయమైన పురోగమనమనే కాకుండా ఉత్పత్తి శక్తులను మరింత అభివృద్ధి చేయడానికి కూడ ఇది దోహదం చేస్తుంది అనే ఆలోచన మావోలో ఉంది. దీన్ని – the problem of capital accumulation, the problem of capital formation ని developing economy కి, అంటే – పెట్టుబడి ఎక్కడి నుంచి రావాలి అనే ప్రశ్నకు లింక్ చేసుకుంటే అమెరికా నుంచి పెట్టుబడి అక్కర్లేదు మాకు. రైతాంగాన్ని దోచుకొని సోవియట్ రష్యాలో చేసినట్లుగా ఆ రకంగా పెట్టుబడి సేకరించాల్సిన అవసరం లేదు మాకు. ఉత్పత్తి సంబంధాలను ఉపరితలాన్ని విప్లవీకరించడం ద్వారా, సమాజంలో అరలు అరలుగా, దొంతర్లు దొంతర్లుగా ఉన్న అనేక రకాల అసమానతలను పోగొట్టడం ద్వారా మనుషుల్లో పెరిగే చైతన్యం ఏదైతే ఉంటుందో దాంతో వాళ్ళు మరింత ఎక్కువ పనిచేస్తారు. ఎక్కువగా పని చేయడమే వారికున్న పెట్టుబడి లేమిని తీరుస్తుంది అనే

రకంగా కూడ మావో ఆచరణ నుంచి, చైనా ఆచరణ నుంచి సిద్ధాంతీకరించడం జరిగింది. ఇట్లే జరిగిందా? ఇంత బాగా జరిగిందా అంటే నేనూ అలా అనుకోవటం లేదు. ఎందుకంటే మనుషులన్నాక రకరకాల ఘర్షణలు ఉంటాయి. రాజకీయ ఘర్షణలు ఉంటాయి. వ్యక్తిగత స్వార్థాలు వుంటాయి. చాలా వైఫల్యాలు ఉంటాయి. ముఖ్యంగా Great Leap Forward లో. మనకు తర్వాతి కాలంలో తెలుస్తూ ఉంది. కాని ఆ ఆదర్శం నుంచి, ఆ దృక్పథం నుంచి, ఆ ఆలోచన నుంచి ఒక సూత్రీకరణ వచ్చింది. ఆ సూత్రీకరణ సమాజాన్ని ముందుకు తీసుకుపోవటానికి ఉపయోగపడే ఒక ఆలోచన. అది మనకు ఉత్తేజాన్ని ఇస్తుంది. అందుకే నేను మొదట్లో అన్నట్లుగా విఠల్‌రాజన్‌గారు చెప్పినట్లే సాంస్కృతిక విప్లవం అనే ఆలోచన మనకు ఒక ఉత్తేజం. అదే ఒక రాజకీయ శక్తి.

పదార్థము, చైతన్యము అనే వాటిని మరీ సింపుల్‌గా చూడకూడదు. పదార్థము నుండి చైతన్యము వస్తుంది, పదార్థము లేకపోతే చైతన్యం రాదు అనుకోవడం సరైంది కాదు. జ్ఞాన సిద్ధాంతాన్ని మరింత సంక్లిష్టంగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. అందుకోసమే ఆదర్శాలుగానీ, ఉత్తేజంగానీ, నైతికతగానీ అవి – ఆ నీతి epistemology లో భాగం కావాలి. It is part of our cognitive process. అది వేరే చర్చ అనుకోండి. అది జ్ఞాన సిద్ధాంతం మీద చర్చ. ఆ ఉత్తేజం అనేది సాంస్కృతిక విప్లవాన్ని ముందుకు తీసుకుపోవడానికి మనకు ఉపయోగపడే ఒక సందేశం ఇస్తుంది. కమ్యూన్‌లలో ఉత్పత్తి, ఉత్పత్తికి కావలసిన ఏర్పాట్లు చేయడం మాత్రమే కాకుండా సమాజంలో అనేక ఇతర రకాల అసమానతలు ఏవైతే ఉంటాయో వాటిని ప్రయత్నపూర్వకంగా పోగొట్టే క్రమం ఒకటి సాంస్కృతిక విప్లవ కాలంలో ప్రారంభం అయింది. ఇది మళ్ళీ Economy కి లింక్ అయింది అని చెప్పటం కోసమే ఈ విషయాలు చెప్తున్నాను.

మావో Unconventional గా ఆలోచించాడు అని చలసాని ప్రసాద్‌గారు ముందు చెప్పి తరువాత ఎందుకో సర్దుకున్నారు. సర్దుకోవాల్సిన అవసరం ఏమీ లేదు. Unconventional గానే ఆలోచించాడు. Conventional అంటే సంప్రదాయం. ఏది సంప్రదాయం? మార్క్స్ నుంచి లెనిన్ దాకా, స్టాలిన్ దాకా ఒక సంప్రదాయం ఉంది. మావో దానికి భిన్నంగా ఆలోచించాడు. ఆ భిన్నత్వంలో తప్పులు, లోపాలు ఉండొచ్చు. ఉదాహరణకు ఆయన వ్యక్తి పూజను విపరీతంగా ప్రోత్సహించిన తీరు. విఠల్‌రాజన్‌గారు వ్యక్తి పూజను Gang of Four, ఇంకొంతమంది చేశారు అన్నారు

గానీ నిజానికి మావో దానిని ప్రోత్సహించాడు. ప్రోత్సహించానని ఒప్పుకున్నాడు కూడ. అదొక రాజకీయ ప్రయోజనం కోసం పనికి వచ్చింది అని నమ్మిన వాళ్ళలో నేను కూడ ఒకడిని ఒకప్పుడు. అది తప్పని ఇవ్వాళ అనుకుంటున్నా. ఎందుకంటే చైనాకు పోయి వచ్చిన చాలామంది సానుభూతిపరులు చెప్తున్నది ఏమిటంటే అక్కడ జనంతో మాట్లాడితే అప్పటి ప్రభుత్వ విధానం ఏముంటుందో దాన్నే వాళ్ళందరూ చెప్తారట. జోన్ రాబిన్‌సన్ లాంటి వాళ్ళు, విలియం హింటన్ లాంటి వాళ్ళు అందరూ అదే చెప్తారు. సాంస్కృతిక విప్లవ సమయంలో అయినా అంతే, దానికి ముందైనా అంతే, తరువాత అయినా అంతే, ఇవ్వాళ పోయినా అంతే. ప్రభుత్వ విధానం ఏమిటో అదే చెప్పడమంటే ఏమిటి? రాజకీయ అవసరాల కోసం, ప్రయోజనాల కోసం వ్యక్తి పూజను ఒకప్పుడు ఉపయోగించుకున్నాడు, పోనీలే అనుకుందాం అనుకున్నా అది మరి ప్రజల చైతన్యానికి అడ్డం రాదా? ప్రజల్లో చైతన్యం లేకపోవడాన్ని అది కప్పేయదా? ఇవన్నీ కూడ ప్రశ్నలే.

అందువల్ల Unconventional అనేదాన్ని ఒప్పుకుంటూ కూడ విమర్శనాత్మకంగా చూడడం అవసరమే. అయితే Unconventional అని ఒప్పుకోవడం కూడ అవసరమే. ఆ అసంప్రదాయకమైనటువంటి మావో ఆలోచనలలో ఒకటి ఏమిటంటే కమ్యూనిస్ట్ పార్టీ చేతికి రాజ్యాధికారం వచ్చిన తరువాత కూడ – అంటే మామూలు కమ్యూనిస్టు పరిభాషలో కార్మిక నియంతృత్వం వచ్చిన తరువాత కూడ – సంఘర్షణ అనేది కొనసాగుతుంది అని. అది శత్రుపూరితమైన సంఘర్షణ కూడ కావచ్చు. రాజ్యంపైన కమ్యూనిస్టు పార్టీకి లేక కార్మిక వర్గానికి అధికారం వచ్చిన తరువాత ఇంక అంతా సాఫీగా అయిపోతుంది, చిన్న చిన్న సంఘర్షణలు, చిన్న చిన్న సమస్యలు మాత్రమే ఉంటాయి అని అనుకోవడానికి ఏమీ లేదు. సమాజంలో ఎన్నో రకాల అసమానతలు ఉంటాయి. ఆ అన్ని రకాల అసమానతల మీద కూడ పోరాటం చేయాల్సి ఉంటుంది. ఈ అసమానతల మీద పోరాటం చెయ్యకపోతే తిరోగమనానికి, ప్రతీఘాతుక విప్లవానికి, తిరిగి పెట్టుబడిదారీ వ్యవస్థ ఏర్పడటానికి మార్గం సుగమం అవుతుందనే పాఠాన్ని మనం తీసుకోవచ్చు.

(అసంపూర్ణం. చివరి భాగం సరిగా రికార్డు కాలేదు.)

*విజయవాడలో జరిగిన 'మార్క్సిస్టు అధ్యయన వేదిక' సదస్సులో చేసిన ప్రసంగం*

*1 జనవరి 1994*

# 'జనచైనా' స్వర్ణ ప్రస్థానం

ఆస్తి సంబంధాలను సమూలంగా మార్చి, తద్వారా సమాజాన్ని సమూలంగా మార్చాలన్న లక్ష్యంతో కమ్యూనిస్టు పార్టీలు రాజ్యాధికారాన్ని చేజిక్కించుకున్న 'విప్లవాల'న్నిటిలోకి అత్యధికంగా ప్రజల మద్దతు ఉన్న ప్రయత్నంగా 'చైనా విప్లవం' పేరు పొందింది.

కాని 50 సంవత్సరాల తర్వాత ఆ విప్లవంలో ఏకపార్టీ నియంతృత్వం తప్ప వేరే ఏమీ మిగలలేదు. వేరే ఏ ప్రయోజనమూ రాలేదని కాదు. అట్టడుగు ప్రజానీకానికి తిండి, చదువు, ఆరోగ్యం కల్పించి అభివృద్ధి ఫలాలను అందుకోవడానికి కావలసిన బలాన్ని కొంత ఇవ్వగలిగింది చైనా. ఇందులో సగం కూడ సాధించని మనం చైనాను ఈసడించుకోనవసరం లేదు. కానీ మానవ జీవితాన్ని సమూలంగా మార్చాలన్న చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రయత్నం మనకు ఏమైనా మిగిలించిందా అంటే ఆ పని ఏ విధంగా చేయాలన్న దాని కంటే ఏ విధంగా చేయకూడదన్న జ్ఞానాన్ని మిగిలించిందని చెప్పుకోవలసి ఉంటుందేమో!

సమిష్టి శ్రమకు, సమిష్టి జీవన విధానానికి నిదర్శనంగా నిలిచే ప్రయోగాలనేకం చైనాలో జరిగాయని భావించడం కద్దు. ఒక దశలో చైనా కమ్యూన్ల అనుభవాల గురించి చాలా ప్రచురణలు వచ్చాయి. మనబోటి దేశాలలో చాలామందికి చాలా ఉత్తేజం ఇచ్చాయి. కానీ ఇప్పుడు ఆలోచిస్తే ఆ పుస్తకాల రచయితలంతా తాము ఏమి చూడదలచుకున్నారో అదే చూసారేమోనని అనిపించకమానదు. ఈ పుస్తకాల రచయితలంతా పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ కల్పించిన జీవితం పట్ల విముఖత పెంచుకొని ప్రత్యామ్నాయం ఏ కొంచెం కనిపించినా దానిని విశ్వసించడానికి సిద్ధంగా ఉన్న పాశ్చాత్యులే తప్ప ఒక్కరూ చైనీయులు కారు. నిజానికి రష్యాలో స్టాలిన్ నియంతృత్వం అత్యంత తీవ్రంగా ఉన్న తరుణంలో సహితం ఆ దేశం నుండి

బయటికొచ్చయినా సరే అక్కడి జీవితాన్ని గురించి రాసిన రష్యన్లు ఉన్నారు గానీ చైనా గురించి చైనీయులు రాసిన పుస్తకాలు (అధికార కమ్యూనిస్టు ప్రచురణలు తప్ప) దాదాపు మృగ్యమనే చెప్పాలి. పైగా చైనా విప్లవం పట్ల చాలా సానుభూతి గల పరిశీలకులు సహితం ఆ దేశంలో ఏ దశలోనయినా ప్రభుత్వం ఏం చెప్తుందో ప్రజలంతా అదే చెప్తారు తప్ప భిన్నస్వరాలు వినిపించవని అంటారు.

అందువల్ల 'చైనా విప్లవం' అనే దానిలో నిజంగా ఏం జరిగిందో మనకు స్పష్టంగా తెలుసుననుకోను. తెలిసిన మేరకు సోషలిజం కోసం అనుసరించవలసిన విషయాల కంటే అనుసరించకూడనివే ఎక్కువ ఉన్నాయేమో.

దైనందిన జీవిత క్రమంలో తనను తాను ఏ రోజుకారోజు పునఃసృష్టి చేసుకునే దానినే 'వ్యవస్థ' అనగలం. ఆ అర్థంలో ఒక్క చైనాలోనే కాదు, రష్యాతో సహా ఏ దేశంలోనూ ఇప్పటిదాకా సోషలిస్టు వ్యవస్థ అనేది తాత్కాలికంగా కూడ ఏర్పడలేదు. సోషలిజానికి సంబంధించిన ప్రయోగాలు మాత్రమే ఈ దేశాలన్నింటిలోనూ జరిగాయి. రాజ్యాధికార బలంతో నిలిచేది 'వ్యవస్థ' కాదు. ఇంకొక రకంగా చెప్పాలంటే పౌరసమాజంలో భాగమయినదే ఒక సామాజిక వ్యవస్థ అనిపించుకుంటుంది. రాజ్యాన్ని ఆలంబన చేసుకొని బతికే దానికి ఆ పేరు పెట్టలేము. ఇప్పటిదాకా సోషలిజం అనేది రాజ్యాన్ని ఆలంబన చేసుకొని బతికింది. రాజకీయం అగ్రభాగాన ఉండాలనీ, అది రాజ్యాధికారం రూపంలో ఉండాలనీ నమ్మే మావోయిజం దృష్టికి ఇదొక బలహీనతగా కనిపించకపోవచ్చును గానీ ఇది నిజానికి తీవ్రమైన బలహీనత.

పోనీ ఆ రాజ్యాధికారం ప్రజాస్వామ్య రూపంలో ఉండి ఉంటే ఆ మేరకైనా సోషలిజం పౌరసమాజంలో భాగమయిందని అనగలుగుదుమేమో. కానీ చైనా రాజ్యం ప్రజాస్వామ్యానికి చాలా దూరం. కమ్యూనిజానికి సంబంధించిన ప్రయోగాలలో చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రజలకు చాలా భాగస్వామ్యం కల్పించినట్టు చెప్పుకునే ఉదంతాలు అనేకం ఉన్నాయి. అది నిజమేననుకున్నా, ఆ పార్టీతో విభేదించే స్వేచ్ఛ మాత్రం ప్రజలకు లేదు. ఆ పార్టీ విధానాల పట్ల ఆమోద అనామోదాలు తెలిపే స్వేచ్ఛ లేదు.

ప్రజాస్వామ్యం పాశ్చాత్యదేశాల నమూనాలోనే ఉండాలా అని ప్రశ్నిస్తారేమో. ఉండనక్కరలేదు. కానీ ఏదో ఒక నమూనాలోనయితే ఉండాలి. ప్రజలకు విభేదించడానికీ తిరస్కరించడానికీ అవకాశం లేని ఏక పార్టీ నమూనా కలదే ప్రజాస్వామ్యం అనలేము.

దిగజారిన పార్టీని తిరస్కరించమనీ, అధిష్ఠానాన్ని బద్దలు కొట్టమనీ మావో పిలుపు ఇచ్చాడు గానీ అది చైనా రాజ్యాంగం కల్పించిన హక్కు కాదు. రాజ్యాంగంలోనే అటువంటి హక్కు కల్పించే ప్రయత్నమేదీ మావో చేయలేదు. పార్టీ గాడి తప్పిందనుకున్నప్పుడు ఆయన ఒక రాజకీయ కార్యక్రమంగా ప్రజలకిచ్చిన పిలుపు అది.

మావో గట్టిగా నమ్మిన కమ్యూనిస్టు ఆదర్శానికే చైనా కమ్యూనిస్టు పార్టీ దూరమయిన తరువాత జరిగిన తియానన్మెన్ స్క్వేర్ ఊచకోత గురించి విన్నాము. ఈ మధ్యనే టిబెట్‌లో అంతర్జాతీయ మానవహక్కుల ప్రకటనను స్థానిక భాషలోకి అనువదించి కరపత్రంగా అచ్చువేసి పంచుతున్నందుకు ఒక మానవహక్కుల కార్యకర్తకు చైనా న్యాయవ్యవస్థ 18 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. అతనొక్కడే కాదు, చైనా రాజ్యాంగం పౌరులకు సాధారణ పౌర రాజకీయ హక్కులు కల్పించాలని డిమాండ్ చేసిన మానవహక్కుల కార్యకర్తలందరూ జైలులోనే ఉన్నారు. ఈ వికారం మావో చనిపోయిన తరువాత పుట్టినది కాదు. మొదటి నుండి ఉన్నదే. టిబెట్ ప్రజలపైన అణచివేత కూడ మొదటి నుండి ఉన్నదే.

సమసమాజాన్ని మించిన సామాజిక రాజకీయ ఆదర్శమేదీ ఉండజాలదు. అయితే దానిని ఏ విధంగా సాధించాలన్న ప్రశ్నకు ఈ రోజు స్పష్టమైన జవాబేదీ లేదు. ఒక శాస్త్రీయమైన జవాబు ఉందన్న విశ్వాసంతో ప్రారంభమైన ఇరవయ్యవ శతాబ్దం ఆ జవాబును ఆచరణలో పెట్టడానికి జరిగిన మహత్తరమైన ప్రయత్నాలను చూసింది. కానీ చివరికి సందేహంతోనే ముగుస్తున్నది.

'చైనా విప్లవం' అందులో భాగమే. రష్యా విప్లవం మిగిలించిన సందేహాలకు సాంస్కృతిక విప్లవం అనే సమాధానాన్ని చైనా – అందులోనూ మావో ఆలోచనా సరళి – ఇచ్చిందని నమ్మేవారున్నారు. సాంస్కృతిక విప్లవం అనే భావనను కొంచెం సేపు పక్కనపెట్టి చైనాలో వాస్తవంగా నడిచిన సాంస్కృతిక విప్లవాన్ని పరిశీలిస్తే, మనకు ఏ సమాధానమూ కనిపించదు. రాజ్యం తన కర్రపెత్తనం ద్వారా మనుషులనూ మానవ సంబంధాలనూ మార్చాలని ప్రయత్నించడం రష్యా విప్లవం ఎదుర్కొన్న సమస్యలకు మూల కారణమైతే, చైనా సాంస్కృతిక విప్లవం ఆ కర్రపెత్తనాన్ని రాజ్యం చేతి నుండి మిలిటెంట్ల చేతిలో (రెడ్ గార్డ్స్ చేతిలో) పెట్టింది. బలప్రయోగం పైన

విశ్వాసం రెండు నమూనాలలోనూ ఉన్న సామాన్య లక్షణం. కానీ బలప్రయోగానికి మానవ సామాజిక ప్రగతిలో ఉండగల పాత్ర స్వల్పమే. పాత వ్యవస్థను ధ్వంసం చేయడంలో కొంత ఉండవచ్చు (అది కూడ మామూలుగా ఊహించుకునేంత కాదు). కానీ నూతన పరిస్థితుల రూపకల్పనలో బలప్రయోగానికీ నిర్బంధానికీ ఉండగల పాత్ర చాలా చాలా స్వల్పం. 'సాంస్కృతిక విప్లవం' అనేది సంస్కృతిలోనూ సామాజిక సంబంధాలలోనూ మార్పు తీసుకొచ్చే ప్రయత్నమయినట్టయితే ఆ క్రియకూ, చైనాలో ఆ పేరు మీద నడచిన పోరాటానికీ పొంతన ఏమీ లేదు.

ఇది 'సాంస్కృతిక విప్లవం' ఎవరో కొందరు అతివాదుల చేతిలోకి పోవడం వల్ల, లేదా కొన్ని అతివాద పొరబాట్లు జరగడం వల్ల వచ్చిన సమస్య కాదు. పాతను వ్యతిరేకించే క్రమంలో జరిగే పోరాటానికీ, కొత్తను నిర్మించడం కోసం జరిగే కృషికీ మధ్య చాలా తేడా ఉంటుందని గుర్తించకుండ రెండింటినీ ఒకే అవిచ్ఛిన్న క్రమంలో దశలుగా లేక ఒకే క్రమానికి పార్శ్వాలుగా చూడడంలోనే లోపం ఉంది. మొదటి దానికి అనుసరించే పద్ధతులే రెండవ కృషికి కూడ తగినవనే ఆలోచనలోనే ఉంది. అసమాన సామాజిక వ్యవస్థను అధిగమించడానికి వర్గపోరాటమే సరయిన మార్గమని అనుకున్నా, సాంస్కృతిక విప్లవం అనే భావన ఏ లక్ష్యాలనయితే తన ముందు పెట్టుకుందో ఆ లక్ష్యాలు కూడ వర్గపోరాటం ద్వారానే సిద్ధిస్తాయనే మావో ఆలోచనే లోపభూయిష్టమైనది.

అయితే ఈ లోపం కేవలం మావోది కాదు. పోరాటం, పునర్నిర్మాణం అనే క్రియలు స్వాభావికంగానే చాలా భిన్నమైన నైజం గల ప్రక్రియలన్న అవగాహన మార్క్స్‌తో సహా మార్క్సిస్టు సంప్రదాయంలో ఏ ఒక్కరిలోనూ కనిపించదు.

ఈ రోజు పెట్టుబడిదారీ వ్యవస్థను ఎందుకు వ్యతిరేకించాలన్నది ప్రశ్న కాదు. గుత్తపెట్టుబడిదారీ కార్పొరేషన్ల గుప్పిట్లో ఉన్న సమకాలీన పెట్టుబడిదారీ వ్యవస్థ చాలా మందికి చాలా ఆశలు చూపించే మాట వాస్తవమే అయినా, అది తన వికృత స్వభావాన్ని దాచిపెట్టలేదు. అది ఎంత వికృతంగా ఉన్నా దాని వల్ల వచ్చే ప్రయోజనాల కోసం దానిని ఆదరించే వాళ్ళుంటారు గానీ అదొక అందమైన సమాజం అని దబాయించే వాళ్ళెవరూ ఈ రోజు లేరు.

కానీ దానిని (పెట్టుబడిదారీ వ్యవస్థను) ఏ విధంగా అధిగమించాలన్న ప్రశ్నకు ఈ శతాబ్దంలో జరిగిన కమ్యూనిస్టు ప్రయోగాలు కచ్చితమైన జవాబు ఇవ్వలేక పోయాయి. కార్మిక వర్గం తన పోరాటాల ద్వారా పెట్టుబడిదారీ వ్యవస్థను కూలదోస్తుందని నమ్మే పరిస్థితి పోయింది. ఒక వర్గానికే పరిమితం కాని విశాలమైన కృషి అవసరం అని సోషలిస్టు పోరాటాల అనుభవం నుండి అర్థం అవుతున్నది.

అంతకంటే ముఖ్యంగా, మనుషులు శ్రమనూ సంపదనూ బాధ్యతలనూ సమిష్టిగా పంచుకునే సమాజాన్ని ఏ విధంగా నిర్మించగలమన్న ప్రశ్న ప్రశ్నగానే మిగిలిపోయింది. చైనాలో మావో చేపట్టిన 'సాంస్కృతిక విప్లవం' అనే రాజకీయ భావనలో ఈ ప్రశ్నకు జవాబు ఉందని పదే పదే అనడం, వినడం జరుగుతున్నది గానీ దానిని ఆమోదించడానికి అవసరమైన సైద్ధాంతిక విశ్లేషణ గానీ చారిత్రక వివరణ గానీ లేవు.

అటువంటి విశ్లేషణ గానీ వివరణ గానీ ఇవ్వాలంటే సంస్కృతి గురించీ, సంస్కృతికీ మానవ వ్యక్తిత్వానికీ మధ్యనున్న సంక్లిష్టమైన సంబంధాన్ని గురించీ అవగాహన ఉండాలి. వామపక్షవాదులలో సాంస్కృతిక రంగమే తమ కార్యరంగం అని చెప్పుకునే వారికి సహితం ఈ అవగాహన లేదు. అవేమీ లేకుండ సాంస్కృతిక విప్లవాన్ని కమ్యూనిస్టు ప్రయోగంలోని శేష ప్రశ్నలకు జవాబుగా ప్రచారం చేయడం, చైనా దానికి ఒక నిదర్శనమని చెప్పుకోవడం ఆనవాయితీ అయిపోయింది. 'చైనా విప్లవం' ఆరంభమైన 50 ఏళ్ళ సందర్భంగా ఈ మాటలే మరొక్కసారి వినబోతాము గానీ మన అవగాహన దాని వల్ల ఆవగింజంత కూడ మెరుగుపడబోదు.

*'వార్త' ఆదివారం అనుబంధం*
*3 అక్టోబరు 1999*

## టిబెట్




# టిబెటన్లు ఏమైతే ఎవరికేం పట్టింది?

పదిహేడవ కర్మపా టిబెట్ నుండి పారిపోయి వచ్చాడనగానే మన పాలకులకు నోరు పడిపోయింది. ఇప్పటికీ మాటలు రావడం లేదు. పాకిస్తాన్ మీద రెచ్చిపోయి ప్రకటనలు చేయడానికి మనం సిద్ధమే గానీ చైనాను ఏమైనా అనాలంటే భయం.

కర్మపా అనేది ఒక పదవి. టిబెట్‌లోని బౌద్ధమత శాఖలలో ఒకటయిన కాగ్యుశాఖ అధినేతను కర్మపా అంటారు. ఇప్పుడా పదవికి పోటీ ఉంది. చైనా టిబెట్‌ను ఆక్రమించుకున్న తరువాత టిబెటన్ బౌద్ధులు అత్యధికంగా భారతదేశం వచ్చి ఇక్కడా అక్కడా స్థిరపడడంతో అక్కడి బౌద్ధశాఖల అంతర్గత రాజకీయాలు కూడ ఎగుమతి అయ్యాయి. మతం మత్తుమందు అని నమ్మే చైనా పాలకులు ఈ రాజకీయాలలో జోక్యం చేసుకోవడానికి మాత్రం వెనకాడడం లేదు. చైనా కమ్యూనిస్టు పార్టీ పాలననూ, టిబెట్‌పైన చైనా పెత్తనాన్నీ అంగీకరించే వారినే వివిధ బౌద్ధశాఖల నాయకులుగా ఎంపిక కానిస్తున్నారు. 17వ కర్మపాగా చైనా పాలకుల చేత గుర్తింపు పొందిన ఈ పిల్లవాడిని ఆ రాజకీయాలలో భాగంగా చైనాయే ఇక్కడికి పంపిందా లేక అతనే చైనాకు గులాంగా ఉండడం ఇష్టంలేక పారిపోయి వచ్చాడా అనేది ప్రశ్నార్థకంగా ఉందని పత్రికలు రాస్తున్నాయి.

బాధాకరమైన టిబెట్ గాథను ఇటువంటి కుమ్ములాటలకు కుదించివేసి మాట్లాడుకుంటే మనకు కొంచెం ఆత్మ సంతృప్తి. కానీ టిబెటన్లది నిజంగా బాధాకరమైన చరిత్ర. అన్యాయమైన దురాక్రమణకు గురి కావడం ఒక ఎత్తయితే దానిని గురించి అమెరికా వంటి ఇతర దురాక్రమణదారులు తప్ప వేరే ఎవ్వరూ మాట్లాడకపోవడం మరీ బాధాకరం.

మామూలుగా ఎవరికైనా అన్యాయం జరిగితే వామపక్షవాదులు ఖండిస్తారు. చేయగలిగిన మేరకు ఆందోళన చేస్తారు. కానీ టిబెట్‌ను ఆక్రమించుకున్నది మావో నాయకత్వంలోని చైనా కాబట్టి వామపక్షవాదులు మౌనంగా ఉన్నారు. అమెరికా వంటి దేశాలు చేసే విమర్శకెట్లాగూ విలువ లేదు. చైనా ప్రభుత్వం పరిభాషలో టిబెటన్ల స్వాతంత్ర్య కాంక్ష ఫ్యూడల్ సంస్కృతిని కాపాడాలనుకునే బౌద్ధమతాధిపతుల తిరోగామి కాంక్ష అయింది. పాపం టిబెటన్లు – వియత్నాం ప్రజలలాగ, దక్షిణాఫ్రికా ప్రజలలాగ – హీరోలు సహితం కాలేకపోయారు.

ఇది చిన్న విషయం కాదు. ఏదైనా పోరాటం చేసే ప్రజలు ఇతరుల కళ్ళలో గుర్తింపు కోరుకుంటారు. అందులోనూ అణచివేతను సిద్ధాంతీకరించడంలోనూ, ప్రతిఘటనను రాజకీయ ఆచరణలో భాగం చేయడంలోనూ అగ్రగామిగా నిలబడ్డ వామపక్షవాదుల కళ్ళలో గుర్తింపు కోరుకుంటారు. గుర్తింపు లభించిన మేరకు వారికి మనో బలం లభిస్తుంది. టిబెటన్లకు అది దక్కలేదు.

టిబెటన్ సమాజాన్ని అదుపులో పెట్టుకోవాలంటే అక్కడ బౌద్ధమత శాఖలపైన పెత్తనం నెలకొల్పాలని చైనా కమ్యూనిస్టు పార్టీ మొదట్లోనే గ్రహించింది. ఏ ఫ్యూడల్ వ్యవస్థ పునఃస్థాపనకు దలైలామా 'టిబెట్ స్వాతంత్ర్య పోరాటం' అని పేరు పెట్టాడని చైనా నిందించిందో ఆ వ్యవస్థకు గుండెకాయ వంటిదయిన బౌద్ధమత వ్యవస్థను తన అదుపులోకి తీసుకుంది. మతాధిపతుల ఎంపికకు ఆమోద అనామోదాలు తెలియజేయడం ద్వారా 'టిబెట్ చైనాలో విడదీయరాని భాగం' అని అంగీకరించేవారు మాత్రమే బౌద్ధమత వ్యవస్థ అధిపతులుగా ఉండేటట్టు చూసుకుంది. కొందరిని తానే మతాధికారులుగా నిలబెడుతున్నది. ఇప్పుడు పారిపోయి వచ్చిన 17వ కర్మపా ఏడేళ్ళ కింద – కేవలం ఏడేళ్ళ వయసులో ఉన్నప్పుడు – కర్మపాగా చైనా ప్రభుత్వం చేత గుర్తింపు పొందినవాడే. బౌద్ధమత శాఖల అధిపతుల ప్రభావం టిబెటన్లపై బలంగా

ఉంటుంది కాబట్టి ఇది ప్రజలను అదుపులో పెట్టుకోవడానికి చైనాకు ఉపయోగపడింది. ఒక దశలో బౌద్ధ ఆరామాలను పెద్దఎత్తున ధ్వంసం చేసిన చైనా ఆ తరువాత 'అది పొరబాటు' అని ఒప్పుకునింది గానీ టిబెట్‌పై తన పట్టును సడలించలేదు. సడలించే ఉద్దేశ్యం కూడ దానికి ఏ కోశానా లేదు. టిబెటన్లు పెద్దగా పోరాటమూ చేయలేదు. దానికి చాలా కారణాలున్నాయిగానీ బహుశా అన్నింటికంటే ముఖ్యమైనదేమిటంటే వామపక్ష నియంతృత్వాలు దుర్భేద్యమైనవి. వాటి మీద పోరాటం చేయడం చాలా కష్టం.

ఒకప్పుడు చైనా 'కమ్యూనిస్టు చైనా' కాబట్టి టిబెట్‌కు జరిగిన అన్యాయం గురించి ప్రపంచంలోని అభ్యుదయవాదులలో అధికభాగం మాట్లాడలేదు. ఇప్పుడు చైనా 'కమ్యూనిస్టు చైనా'గా గుర్తింపు పోగొట్టుకుందిగానీ ఒక కొత్త ప్రతిష్ట సంపాదించు కునింది. గ్లోబలైజేషన్ పంథాలో వేగంగా, విజయవంతంగా పురోగమిస్తున్న దేశాలలో అగ్రగామిగా చైనాకిప్పుడు గుర్తింపు వచ్చింది. దాని వల్ల చైనాకు వ్యతిరేకంగా ఇప్పుడసలు ఎవ్వరూ మాట్లాడరు. 1959లో టిబెటన్ల జాతీయ తిరుగుబాటును చైనా క్రూరంగా అణచివేసినప్పుడు దలైలామాతో సహా దాదాపు ఒక లక్ష మంది టిబెటన్లు ఇండియాకు పారిపోయి రాగా, అప్పటికింకా పూర్తిగా ఆత్మగౌరవం కోల్పోని భారత ప్రభుత్వం బహిరంగంగానే వారిని ఆహ్వానించింది. హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాల టిబెటన్ ప్రవాస ప్రభుత్వానికి కేంద్రం అయింది. అంతకు మించి – తూర్పు పాకిస్తాన్‌లో చేసినట్లు, జాఫ్నాలో కొంతకాలం చేసినట్టు – భారత ప్రభుత్వం ఏమీ చేయకపోయినా ఆనాడు ఆ మాత్రమైనా చేసింది.

ఇప్పుడు ఆ పాటి ఆత్మగౌరవం కూడ భారత పాలకులలో లేదు. మేధావులు సహితం 'కర్మపా వ్యవహారం'లో చైనాకు కోపం తెప్పించకుండ వ్యవహరించడమే మంచిదని భారత ప్రభుత్వానికి సలహా ఇస్తున్నారు. ఏ విషయంలోనయినా లాభనష్టాలు లెక్కించడం తప్ప వేరే నీతి ఏదీ లేదని నమ్మడం ఈనాటి విజ్ఞత కాబట్టి అందులో ఆశ్చర్యమేమీ లేదు.

17వ కర్మపా చైనా నుండి పారిపోవడం మరొక్కసారి టిబెటన్ల దాస్యం మీద ప్రపంచం దృష్టిని నిలబెట్టిందని అనుకున్నా (సందేహం ఎందుకంటే, అతని మతశాఖ అయిన కాగ్యుశాఖకు అతి పవిత్ర చిహ్నమైన నల్ల టోపీని సిక్కిం నుండి తీసుకొని

వెనక్కిపోయి తన పెత్తనాన్ని టిబెట్‌లోని కాగ్యుశాఖపైన పదిలంగా నెలకొల్పుకోడానికి చైనా ప్రభుత్వమే అతనిని పంపిందన్న వదంతి ఒకటి ఉంది కాబట్టి) దాని వల్ల పెద్ద మార్పేమీ రాబోదు. ఇప్పుడు అంతర్జాతీయ రాజకీయ నీతిని నిర్వచించేదీ నిలబెట్టేదీ అమెరికాయే. అమెరికా చైనా పాలకుల 'మానవహక్కుల అతిక్రమణ' గురించి తాను ఆందోళన చెందుతున్నట్లుగా ప్రపంచ ప్రజలకు అప్పుడప్పుడు అభిప్రాయం కలిగిస్తుంటుంది గానీ అభిప్రాయం కలిగించడం వినా వేరే ఏమీ చేయకుండ, ఏమీ అనకుండ జాగ్రత్త పడుతుంటుంది. అమెరికా కళ్ళకిప్పుడు చైనా ఒక కమ్యూనిస్టు పాలిత దేశమూ కాదు, ఏక పార్టీ నియంతృత్వమూ కాదు, ప్రజలకు కనీస రాజకీయ స్వేచ్ఛ లేని నిరంకుశ రాజ్యమూ కాదు, టిబెట్‌ను వలసగా మార్చుకున్న ప్రాంతీయ అగ్రరాజ్యమూ కాదు. అమెరికా కళ్ళలో చైనా ఒక పెద్ద మార్కెట్. అటువంటి చైనాను – ఒక కర్మపా పారిపోయి వచ్చినంత మాత్రాన – అమెరికా ఇబ్బంది పెట్టదు. అమెరికా నీతే ఇప్పుడు అంతర్జాతీయ నీతి కాబట్టి వేరే ఎవ్వరూ కూడ చైనాను ఏమీ అనరు.

17వ కర్మపా ఉదంతం నాలుగు రోజులు వార్తలలో ఉండి ఆ తరువాత అదృశ్యమయిపోతుంది.

*ప్రజాతంత్ర వారపత్రిక*

*6 ఫిబ్రవరి 2000*

# అక్కడ విజయం... ఇక్కడ తప్పిదం

బీజింగ్ ఒలింపిక్స్ గడిచిపోతే మళ్ళీ అటువంటి అవకాశం రాదన్న స్పృహతో చైనాను ఇరకాటంలో పెట్టడానికి టిబెటన్లు చేస్తున్న ప్రయత్నం, వారికెవ్వరూ ప్రోత్సాహం ఇవ్వడానికి వీలులేదంటూ ప్రపంచ దేశాలకు చైనా జారీచేస్తున్న హుకుం కొంత కాలంగా వార్తల్లో ఉన్నాయి. చైనాకు నొప్పి కలిగించడం ఇప్పుడు ఏ దేశానికీ ఇష్టం లేదు కాబట్టి ఉపశమనంగా నాలుగు మాటలు ప్రవచించి ఆ పైన చోద్యం చూడడం ప్రపంచ దేశాల పాత్ర అయింది. మన వాళ్ళయితే ఒలింపిక్ జ్యోతిని కాపాడడానికి 365 మంది టిబెటన్ కాందిశీకులను అరెస్టు చేసి ఢిల్లీ తీహార్ జైలులో పెట్టారు. జ్యోతి మన సరిహద్దు దాటిపోయి రెండు వారాలయినా వారిని ఇంకా విడుదల చేయలేదు. మార్చి 10 నాడు టిబెటన్ రాజధాని లాసాలో జరిగిన హింసాకాండతో ఇది మొదలయింది. ఇన్నాళ్ళు గడిచినా ఆ రోజు ఏం జరిగిందనేది అస్పష్టంగానే ఉంది, ఎంతమంది చనిపోయారన్నదీ అస్పష్టంగానే ఉంది. 13 నుండి 142 దాకా అనేక సంఖ్యలు ప్రచారం అయ్యాయి. మార్చి 10 అంటే 1959లో జరిగిన మొదటి టిబెటన్ తిరుగుబాటు వార్షిక దినం అది. ఎప్పటిలాగే ఆ వార్షిక దినం సందర్భంగా లాసాలోని ప్రధాన బౌద్ధ ఆరామానికి చెందిన భిక్షువులు శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టారనీ, పోలీసులు అనవసరమైన అసహనం ప్రదర్శించడం వల్ల టిబెటన్లు ఉద్రిక్తులయి చైనీయులపై, పోలీసులపైన దాడులు జరిపారనీ, పోలీసులు విచక్షణారహితంగా కాల్పులు జరిపి 100కు పైగా ప్రాణాలు తీసారనీ ఒక కథనం.

ఒలింపిక్స్ క్రీడల నేపథ్యంలో చైనాను అప్రతిష్ఠపాలు చేసే దురుద్దేశ్యంతో టిబెటన్లు అన్యజాతీయులను అతిక్రూరంగా నరికి చంపారనీ, తప్పనిసరయి పోలీసులు రంగంలోకి దిగి పరిమితంగానే దుండగులపైన కాల్పులు జరిపి అదుపు చేసారనీ ఇంకొక కథనం. ఈ రెండింటికీ ఏ పొంతనా లేదనేది స్పష్టమే.

వేరే ఎక్కడా కనీస వాస్తవాలు ఇంత సందిగ్ధంగా ఉండిపోవు. ప్రజలకు రాజకీయ స్వేచ్ఛ లేకపోయినా మీడియాకు తన వృత్తి సంబంధమైన స్వేచ్ఛయినా ఉంటే ఈ స్థితి రాదు. కానీ చైనాలో రెండూ లేవు. చైనా గురించి ఏ చర్చ చేయాలన్నా ఇదొక పెద్ద అవరోధం. ఆ దేశంలో 'సెజ్'లు విజయవంతంగా నడుస్తున్నాయనీ, పెద్ద పెద్ద డ్యాంలు నిరాఘాటంగా నిర్మిస్తున్నారనీ, భారతదేశంలో అవే పనులు చేస్తే చైనా అభిమానులయిన వామపక్షజీవులు వ్యతిరేకిస్తారనీ ఒక విమర్శ కొంతకాలంగా వింటున్నాం. వామపక్ష భావాలు గల వారందరూ చైనా ప్రభుత్వాన్ని సమర్థించడం లేదు గానీ చైనాలో ప్రజలకు రాజకీయ స్వేచ్ఛ కనీస పరిమాణంలో కూడ లేదనీ, ప్రభుత్వ విధానాల పట్ల నిరసన తెలిపే హక్కు లేదనీ, అందువల్ల ఆ దేశ ప్రభుత్వం సాధించే 'విజయాలు' వేరొకరికి ఆదర్శం కాజాలవనీ అనడానికి మన దేశంలోని అభ్యుదయవాదులు చాలావరకు బిడియపడుతున్న మాట వాస్తవమే. ఆ బిడియం అనవసరం.

అయినా వాదన కోసం చైనా కళ్ళతోనే విషయాన్ని చూడదలచుకున్నా, టిబెటన్లు నిరాయుధులయిన అన్యజాతీయులను ఊచకోత కోసారన్న అభియోగాన్నీ, ఒలింపిక్స్ సందర్భంగా చైనాను భ్రష్టు పట్టించడానికి పోలీసులను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడ్డారన్న అభియోగాన్నీ ఒకే గాటన కట్టడానికి వీలు లేదు. మొదటిది (నిజంగా జరిగి ఉంటే) నిర్ద్వంద్వంగా ఖండించవలసిన విషయమే. కానీ రెండవ దాని గురించి అదే అనగలమా? మౌనాన్ని భగ్నం చేయడానికి ఉద్యమాలు తరచుగా ఎంచుకునే మార్గం కాదా అది? చైనా పాలకపార్టీ తనను తాను ఇప్పటికీ కమ్యూనిస్టు పార్టీగానే చెప్పుకుంటుంది కాబట్టి ఇది కమ్యూనిస్టులతో సహా సకల ఉద్యమాలూ చేపట్టే ఎత్తుగడేననీ, దానిని అన్ని సందర్భాలలోను ఖండించలేమనీ వారికి చెప్పనవసరం ఉండకూడదు.

వామపక్ష భావాలు గల వారికి రాజకీయ మొగమాటం అడ్డం వచ్చి ఉండవచ్చు. మిగిలిన వారి నోళ్ళేమయ్యాయి? భారత్‌ది వట్టి అవకాశవాదం. 'నీ ఆక్రమణలను నేను విమర్శించను, నా ఆక్రమణలను నువ్వు విమర్శించకు' అనేది భారత్ – చైనాల మధ్యనున్న అక్రమ ఒడంబడిక. భారత్ సిక్కింను కలిపేసుకున్న వైనం సందేహాస్పదమైనది అనడంలో సందేహం అక్కరలేదు. దీనిని ఒకనాడు విమర్శించిన చైనా ఇప్పుడు

సిక్కిం భారత్‌లో అంతర్భాగమేనని ఒప్పేసుకుంది. కశ్మీర్ విషయంలో చైనా భారత్‌ను విమర్శించడం తగ్గించింది. ఈశాన్య భారతంలో ఈ రెండు దేశాల మధ్య (స్థానిక ప్రజల ఇష్టాఇష్టాలతో నిమిత్తం లేకుండా) సాగుతున్న భూవివాదాన్ని కూడ సామరస్యంగా పరిష్కరించుకోడానికి చైనా సిద్ధంగా ఉంది. దానికి మారుగా మన వారు టిబెట్ గురించి మాట్లాడరు.

పాశ్చాత్య దేశాలంటారా, వారి కళ్ళకు చైనా వేగంగా పెరుగుతున్న ఒక మార్కెట్ తప్ప ఒక దేశం కాదు, ఒక నాగరికత కాదు, ఒక సంస్కృతీ కాదు. చైనా క్రమం తప్పకుండా 10 శాతం వృద్ధిరేటు కలిగి ఉంటున్నది. పాశ్చాత్య దేశాలు ఆ వృద్ధిరేటు వైపు ఆకలిగా చూస్తున్నాయి. ఆ దేశాలు ఇరవై ఏళ్ళుగా తీవ్ర ఆర్థిక మాంద్యంలో ఉన్నాయి. సగటున 3 లేక 4 శాతం మించి వృద్ధి పొందలేకున్నాయి. అందువల్ల సరుకులు, సాంకేతిక జ్ఞానం అమ్ముకునే అవకాశం, పెట్టుబడులు పెట్టే అవకాశం వారికి అత్యంత ప్రధానమైనవి. చైనా ఆ అవకాశం ఇవ్వగలదు. అటువంటి దేశాన్ని విమర్శించడానికి వాళ్ళకు నోళ్ళు రావు. కాబట్టే టిబెటన్లతో సామరస్యంగా సమస్య పరిష్కరించుకోమని చైనా ప్రభుత్వానికి హితోపదేశం చేసి ఊరుకుంటున్నారు.

సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవలసిందే, సందేహమేమీ లేదు. కాని అసలు సమస్య ఏమిటి? సమస్య దగ్గరకొచ్చేసరికి అందరూ టిబెటన్లకే హితవు చెప్తున్నారు. టిబెటన్లకు స్వాతంత్ర్యం కోరుకునే హక్కు లేదనేది ప్రపంచ పెద్దల అభిప్రాయం. చారిత్రకంగా టిబెట్ పాలకులెప్పుడూ చైనాకు లొంగే ఉన్నారని అంటున్నారు. దలైలామా గుంపుకు చెందిన కొద్దిమంది భిక్షువులను, వారి అనుయాయులనూ మినహాయిస్తే తక్కిన టిబెటన్లందరూ చైనా పాలనను అంగీకరించారని అంటున్నారు. చైనా టిబెట్‌కు చాలా అభివృద్ధి తీసుకొచ్చిందంటున్నారు.

ఇవన్నీ టిబెటన్లే అంటే అదొక రకం. కానీ వారికి ఆ స్వేచ్ఛ ఎప్పుడూ ఇవ్వలేదు. 'జాతీయత' అనేది ఒక భావన. ఒక ప్రాంతంలో నివసించి ఒక సంస్కృతిని పంచుకొని ఒక భాష మాట్లాడే ప్రజల మనోభావనలో ఇది తరచుగా ఒక అంశంగా ఉంటుంది. ఇతరులు ఆ భావనను గౌరవించి కలిసి ఉండేటట్లయితే బహుళ జాతుల సమాజం సాధ్యమే. బహుళ జాతుల రాజ్యమూ సాధ్యమే. అది లేనప్పుడు స్వంత రాజ్యంలో బతకాలన్న కాంక్ష ముందుకొస్తుంది. స్వయం నిర్ణయాధికారం దానికి సాధనం. ఈ

కాంక్ష సహేతుకమా కాదా అన్న మీమాంసలో 'రుజువు చేసుకునే బాధ్యత' వారి మీద కంటే ఇతరుల మీదనే ఎక్కువ ఉంటుంది. సహజీవనం చేయవచ్చునన్న విశ్వాసం వారు కలిగించారా అన్న ప్రశ్నను పొరుగు జాతి లేక జాతులవారు ఎదుర్కొనవలసి ఉంటుంది. ఒక్కొక్కసారి అన్యాయమైన సాంస్కృతిక లక్షణాలనూ, ప్రాదేశిక వనరులపైన సంకుచితమైన గుత్తాధిపత్యాన్నీ, ఆ ప్రదేశంలో నివసించే మైనారిటీ ప్రజాసమూహాల పట్ల అణచివేత వైఖరినీ 'జాతీయత' చాటున దాచుకోవడం జరుగుతున్న మాట వాస్తవమే. అయినప్పటికీ ఒక ప్రజల స్వీయ గుర్తింపులో భాగమైన జాతీయతా భావన పట్ల సగౌరవంగా, సున్నితంగా వ్యవహరించడం తప్పనిసరి. చరిత్రనూ అభివృద్ధినీ కారణంగా చూపించి ఆ భావనే నిరాధారమైనదని కొట్టి పారేయడం న్యాయం కాదు.

పైగా ఈ విషయంలో 'అభివృద్ధి'కి రెండు వైపులా పదును ఉంటుంది. అది తరచుగా పొరుగు వారి ఆధిపత్యాన్ని పెంచుతుంది. 2006లో చైనా టిబెట్‌కు రైలు మార్గం వేసింది. రోడ్డు రవాణా చాలా అభివృద్ధి చేసింది. కానీ దాని పర్యవసానంగా టిబెట్‌లోకి చైనీయుల ('హాన్' జాతి అంటారు) వలస పెరిగింది. టిబెట్‌లో సాధించిన అభివృద్ధి వల్ల పెరిగిన అవకాశాలను ఎక్కువ భాగం వారే స్వంతం చేసుకున్నారు. దీనితో టిబెటన్లలో నిరసన చాలా పెరిగింది. నిజానికి మొన్నటి అల్లర్లను ఒలింపిక్స్‌తో ముడిపెడుతున్నారు గానీ, అంతకంటే బలమైన సంబంధం చైనా టిబెట్‌లో సాధించిన అభివృద్ధి తీరుతెన్నులతో ఉంది. ఆ అభివృద్ధి పెంచిన ప్రాంతీయ అసమానతలతో ఉంది.

తమ స్థితిని నిరసిస్తున్న టిబెటన్లందరూ కూడ స్వాతంత్ర్యం కోరుకోవడం లేదు. దలైలామా చైనా లోపల స్వయం ప్రతిపత్తి ఇస్తే చాలంటున్నాడు. హాంగ్‌కాంగ్‌కూ తైవాన్‌కూ ఇచ్చిన స్వయం ప్రతిపత్తి టిబెట్‌కూ ఇమ్మంటున్నాడు. చైనా దానికీ సిద్ధంగా లేదు. హాంగ్‌కాంగ్, తైవాన్‌లు బుజ్జగించి దగ్గరుంచుకోవలసిన ప్రాంతాలు కాబట్టి వాటిని బుజ్జగిస్తాం, టిబెట్‌కు అంత గౌరవం ఎక్కడిది అన్నది చైనా వైఖరి. కార్పొరేట్ పెట్టుబడికి హాంగ్‌కాంగ్, తైవాన్‌లు స్థావరాలు కాగా టిబెట్ స్వయం నిర్ణయాధికార కాంక్ష సంప్రదాయక సాంస్కృతిక ప్రత్యేకత పైన ప్రధానంగా ఆధారపడడం ఈ వివక్షకు కారణం. బిలియన్ల డాలర్ల పెట్టుబడికి కేంద్రమైన హాంగ్‌కాంగ్‌నూ, బౌద్ధ

విహారాలు ఆరామాలు తప్ప ఏమీ లేని టిబెట్‌నూ ఒకే గాటన ఎందుకు కట్టాలి అన్నది చైనా పాలకులు అర్థం చేసుకున్న మార్క్సిజం.

వేగవంతమైన అభివృద్ధినీ, సమర్థవంతమైన నియంతృత్వాన్నీ ఏకసమయంలో నిలబెట్టుకున్న దేశం చైనా. అటువంటి దేశ పాలకుల మెడలు వంచి తమ హక్కులు కాపాడుకోవడం ఎవరికైనా కష్టమే. ఈ రెండింటి మధ్య వైరుధ్యం ఉందనీ, అది ఏదో ఒక రోజు బద్దలు కాక తప్పదనీ తియానన్‌మెన్ స్క్వేర్ మారణకాండ నాటి నుండి విశ్లేషకులు అంటూనే ఉన్నారు. ఆ ఘడియ కనుచూపుమేరలో లేనందువల్ల ఈ విశ్లేషణలను చాదస్తపు ఆశాభావంగా కొట్టిపారేయడం సహజం. అయినప్పటికీ – అంతే నిరాశ గొల్పిన పాకిస్తాన్ రాజకీయ పరిస్థితి ఎంత వేగంగా మారిందో చూస్తే కొంత ధైర్యం కలగక మానదు. టిబెటన్ల స్థితి కొంత భిన్నంగా ఉంటే ఆ ఘడియ కోసం ఎదురుచూస్తూ కూర్చోకుండ దానిని దగ్గరకు తెచ్చే కృషి చేయమని హితవు చెప్పి ఉండవచ్చును గాని వారి నిస్సహాయత ఎంతటిదంటే ఆశ కోల్పోకుండ వేచి ఉండమని మాత్రమే చెప్పగలం. ఈ లోపల భారత్‌తో సహా ఇతర ప్రపంచ దేశాలు అవకాశవాదాన్ని విడిచిపెట్టి టిబెటన్ల స్వయం నిర్ణయాధికార కాంక్ష విషయంలో సూత్రబద్ధమైన వైఖరి అనుసరించడం ఎవరికి వారు ప్రకటించుకునే ఉన్నత విలువలకూ సంప్రదాయాలకూ అనుగుణంగా ఉంటుంది.

*ప్రజాతంత్ర వారపత్రిక*
*4 మే 2008*

## నేపాల్




# ప్రజాస్వామ్య పునాదులపైనే సోషలిజం!

**నే**పాల్ రాజకీయ పరిణామాల గురించి చాలా వ్యాఖ్యలు వింటున్నాం. వాటన్నిటినీ సమీక్షించడానికి ఒక వ్యాసం సరిపోదు గానీ, నేపాలీ మావోయిస్టులకు లభించింది ఒక చారిత్రక అవకాశం అన్న విషయాన్ని – ఆ పార్టీతో సహా – ఎంతమంది గుర్తిస్తున్నారు?

ప్రతి చిన్న సందర్భాన్నీ చరిత్రాత్మకం అనడం జర్నలిజం పుణ్యాన అలవాటయి పోయింది కాబట్టి ఇది నిజమైన అర్థంలో చరిత్రాత్మకం అని వివరించాలి.

ప్రజలకు రాజకీయ ప్రజాస్వామ్యాన్ని నిరాకరించి సోషలిజం నిర్మించాలని చూస్తే అది సాగదన్నది 20వ శతాబ్దపు చరిత్ర నేర్పిన ముఖ్య పాఠాలలో ఒకటి. సోవియట్ రష్యాతో మొదలుపెట్టి యూరప్‌లోని అన్ని కమ్యూనిస్టు పాలిత రాజ్యాలూ పతనం కావడానికి ఏకైక కారణం రాజకీయ ప్రజాస్వామ్యం లోపించడమే కాకపోవచ్చు. అయితే ఆ తరువాత అక్కడ నెలకొన్న పాశ్చాత్య తరహా రాజకీయార్థిక వ్యవస్థలోని పెట్టుబడిదారీ అంశాన్ని ఆ దేశాల ప్రజలు త్వరలోనే నిరసించారుగానీ రాజకీయ ప్రజాస్వామ్యాన్ని మాత్రం నిరసించలేదు. మళ్ళీ కమ్యూనిస్టు లేక సోషలిస్టు పార్టీల పాలనే కోరుకున్నప్పుడు కూడ వారికి ఓట్లేసి ఎన్నుకున్నారే తప్ప వారికి నియంతలుగా పట్టం గట్టలేదు.

ఇక మీదట సోషలిజం నిర్మించే ప్రయత్నం ఎక్కడ జరిగినా అది ప్రజాస్వామ్య వ్యవస్థ ద్వారానే జరగక తప్పదు. ఒకవేళ ఒక కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటం ద్వారా అధికారానికి వచ్చినా అది సోషలిస్టు సమాజ నిర్మాణానికి సంబంధించిన కృషిని రాజకీయ ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూనే జరపవలసి ఉంటుంది. ఈ సందేశంతో పాటు దీనికి అనుసరించవలసిన మార్గమేమిటన్న ప్రశ్నను 20వ శతాబ్దం వదిలి వెళ్ళింది.

దీనికి సంబంధించిన సిద్ధాంత చర్చ యూరప్‌లో ఎప్పటి నుండో జరుగుతున్నది గానీ కమ్యూనిస్టు పార్టీలు బలంగా ఉన్న మనబోటి దేశాలలో ఎప్పుడూ జరగలేదు. ఇప్పుడూ జరగడం లేదు. అన్ని వైఫల్యాలకు బయట సామ్రాజ్యవాదం, లోపల రివిజనిజం కారణం అన్న విశ్లేషణ మన దగ్గర కమ్యూనిస్టు మేధావులకు సంతృప్తిని ఇస్తున్నది.

ఈ చర్చను చేసే అవకాశం, దానిని ఆచరణలో పెట్టి మంచిచెడులు గుర్తించే అవకాశం నేపాల్ మావోయిస్టులకు దక్కింది. దానికి కావలసిన విజ్ఞత వారిలో ఉందా అంటే తెలీదనే చెప్పాలి. వారిలో కొంచెం ఇంగ్లీష్ చదువులు, ప్రపంచ చరిత్ర, సిద్ధాంత విశ్లేషణా అలవడ్డవారు మన మార్క్సిస్టు నేతలైన యేచూరి, కారత్‌ల సహవిద్యార్థులనీ, వారు వీరి వద్ద రాజకీయ సలహాలు తీసుకుంటున్నారనీ వింటున్నాం. వీరి రాజకీయ విజ్ఞత ఏ పాటిదో మనం చూస్తూనే ఉన్నాము కాబట్టి వీరి సహాధ్యాయుల నుండి ఆశించగలిగింది కొంచెమే. ఇకపోతే చదువుల కోసం ఢిల్లీకి రాకుండ నేపాల్ కొండలలోనే ఉండిపోయినవారు జీవిత అనుభవం నుండి, ప్రజలలో పనిచేసిన అనుభవం నుండి నేర్చుకున్న విజ్ఞత ఏమైనా ఉంటే అది ఇప్పుడు అక్కరకు రావచ్చు. కానీ దాని గురించి మనకేం తెలీదు.

రాజ్యాంగ పరిషత్‌లో అందరి కంటే ఎక్కువ సీట్లు మావోయిస్టులకు దక్కాయి గానీ అది మొత్తంలో మూడవ వంతే. అయితే మరొక పెద్ద పార్టీ అయిన సిపిఎన్ (యుఎంఎల్)కు పాలనా విధానాలకు సంబంధించిన చాలా విషయాలలో మావోయిస్టులతో ఏకాభిప్రాయం ఉండే ఉండాలి కాబట్టి రాజ్యాంగ రచనలో వారితో జట్టుకట్టి మెలకువతో మెలిగినట్టయితే సోషలిజాన్ని పాలనా విలువగా వ్యవస్థీకరించే రాజ్యాంగం రాయవచ్చు. రాజ్యాంగాన్ని ఎప్పుడయినా సవరించినా ఈ మౌలిక

విలువలకు విరుద్ధంగా తిరగరాయడానికి వీలు లేదన్న నియమం కూడ రాయవచ్చు. ఒకవేళ నేపాలీ కాంగ్రెస్ పార్టీ సోషలిస్టు నమూనా రాజ్యాంగాన్ని రచించడానికే అడ్డు నిలిస్తే రెండు కమ్యూనిస్టు పార్టీలు ఆ అంశం మీదనే రాజీనామా చేసి రాజ్యాంగ పరిషత్‌కు మళ్ళీ ఎన్నికలు జరిగే పరిస్థితి కల్పించవచ్చు.

కానీ నేపాల్ మావోయిస్టులు రాజ్యాంగ రచన కంటే ఎక్కువగా మధ్యంతర ప్రభుత్వం మీదనే దృష్టి పెడుతున్నట్టు కనిపిస్తున్నది. దానిలో ఎవరికి ఏ పదవులుండాలన్నది ఒక ముఖ్య వివాదంగా ఉన్నట్టుంది. ఈ అభిప్రాయం నిజం కాకపోవచ్చు, వాస్తవాలు పత్రికలలో వార్తల రూపం తీసుకునే ప్రక్రియ నుండి పుట్టిన భ్రమ కావచ్చు. అయితే ప్రచండ అనే ఆ పార్టీ నాయకుడు ఇస్తున్న ఇంటర్వ్యూలు ఇదే అభిప్రాయాన్ని కలిగిస్తున్నాయి.

దానికి తోడు తమ ప్రజా సైన్యాన్ని నిరాయుధీకరించడానికి వారు నిరాకరించడం. అన్ని పార్టీలూ ఎన్నికల రంగంలో సమానంగా పోటీ చేయడానికి, రేపు ఆమోదించబోయే రాజ్యాంగ నిర్ణయాలకు అనుగుణంగా పరిపాలించడానికి అంగీకరించినప్పుడు ఒకరి దగ్గర మాత్రం సైన్యం ఉండడం ఏ విధంగా సబబు? మొన్నటి ఎన్నికలలో మావోయిస్టులు 'ప్రజాసైన్యం' సహాయంతో వోట్లు పొందారన్న అభియోగం ఎవరూ వేయలేదు గానీ ఆ అనుమానం ఎప్పుడూ రాకుండా ఉంటుందన్న భరోసా ఏమిటి? ఒకవేళ ఇతరులు తమను సమానంగా చూస్తారని, గెలిస్తే పరిపాలించనిస్తారని నమ్మకం లేనట్టయితే తమ సైన్యం నిరాయుధీకరణకొక గడువయినా సూచించాలి. ఎప్పటికీ ఒక రాజకీయ వ్యవస్థలో ఒక పక్షానికి సాయుధ బలగం ఉండడం ఎట్లా ఆమోదనీయం అవుతుంది? చట్టబద్ధ పాలనకు భరోసా ఏముంటుంది?

నిజానికి రాజ్యాంగ రచన తరువాత మావోయిస్టులు దృష్టి పెట్టవలసింది పరిపాలనా పద్ధతుల మీద. సోషలిస్టు రాజ్యాంగాన్ని రాసుకున్నా దాని పట్ల పూర్తి ఏకీభావం లేని పార్టీలు కూడ రాజకీయ రంగంలో ఉంటాయి. సెక్యులర్ రాజ్యాంగం రాసుకున్న భారత రాజకీయ వ్యవస్థలో భారతీయ జనతాపార్టీ ఉన్నట్టు. వారు తమ పద్ధతులలో భ్రమలు కల్పించో, భయాలు కల్పించో ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తారు. రాజకీయ ప్రజాస్వామ్యాన్ని స్వీకరించినప్పుడు వారి స్వేచ్ఛను అంగీకరించక తప్పదు. ఎప్పుడయినా ప్రజాస్వామ్య పద్ధతులలోనే ప్రజలు వారి వైపు ఆకర్షితులు

కాకుండా అడ్డుకట్ట వేస్తూ ఉండాలి. మళ్ళీ మళ్ళీ సోషలిజాన్ని నిర్మించే సంకల్పం ఉండే పార్టీనే – ఒంటరిగానైనా, ఉమ్మడిగానైనా – గెలిచేటట్టు చూసుకోవాలి.

దీనికి రాజకీయ మెలకువలు చాలా నేర్చుకోవాలి. అధికారం, ఆపైన ఆయుధాలు ఉన్నాయని ప్రజల మీద దాదాగిరీ చేసే బలహీనతకు లోను కాకూడదు. ఇప్పటికే మావోయిస్టు పార్టీకి అనుబంధమైన యువ కమ్యూనిస్టు లీగ్ కార్యకర్తలు దూకుడుగా నడుచుకోవడం మానుకోలేదన్న అభియోగాలు ఇతర పార్టీలు చేస్తున్నాయి. అయితే ఆ సంస్థను మావోయిస్టులు రద్దు చేయాలన్న ఇతర పార్టీల డిమాండు న్యాయమైనది కాదు. పార్టీకి యువజన సంఘం ఉండడంలో తప్పేమీ లేదు. అయితే వారు ప్రజాస్వామికంగా నడుచుకోవడం నేర్చుకోవాలి. దీని గురించి కూడ మావోయిస్టుల నుండి స్పందన లేదు.

నిజానికి తొలి దశలో ఆర్థిక రంగంలో అవసరమైన రాజీలకు మావోయిస్టులు ఇప్పటికే సిద్ధపడ్డారు. పెట్టుబడిదార్లపైన చర్యలేవీ తీసుకోమనీ, విదేశీ పెట్టుబడిని కూడ ఆహ్వానిస్తామనీ ప్రకటించారు. పెట్టుబడిదారులు బాగా తక్కువ ఉన్న, సాంకేతికంగా బాగా వెనుకబడి ఉన్న దేశం నేపాల్. సాంకేతిక పురోగతి సాధించేంత వరకు విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం తప్పనిసరే కావచ్చు.

ఆర్థిక రంగంలో సోషలిస్టు లక్ష్యానికి భిన్నమైన ఈ రాజీలకు సిద్ధపడే విజ్ఞత ప్రదర్శించిన వారు, రాజకీయ రంగంలో సోషలిస్టు భావనలో భాగం కాక తప్పని రాజకీయ ప్రజాస్వామ్యం విషయంలో అదే విజ్ఞత ప్రదర్శించడం లేదన్న అభిప్రాయం నిజమైతే అది దురదృష్టకరమే. ఆ సందేహం మాత్రం బలంగా కలుగుతున్నది. పరిపాలించినంత కాలం పోరాట దశలో అలవాటయిన పద్ధతులతో సాగించుకోవడం, మళ్ళీ ఎన్నికలొస్తే అదే పద్ధతులలో గెలిచే ప్రయత్నం చేయడం, అది సాధ్యం కాకపోతే రాజకీయ వ్యవస్థ నుండి వైదొలగి 'మమ్మల్ని కొనసాగనివ్వలేదు' అన్న నింద వేయడం – ఈ ఎత్తుగడ నేపాల్ మావోయిస్టుల మనస్సులలో ఉందా? అందుకోసమేనా 'ప్రజాసైన్యాన్ని' రద్దు చేయడానికి నిరాకరిస్తున్నారు?

*ప్రజాతంత్ర వారపత్రిక*

*18 మే 2008*

United Nation Organization

# ఐక్యరాజ్యసమితిని కాపాడడానికి ఎవరు సిద్ధంగా ఉన్నారు?

ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ కోఫీ అన్నన్‌ను చూస్తే ఈ మధ్య జాలి కలుగుతున్నది. ప్రపంచ దేశాలు అంతర్రాష్ట్ర సమస్యల శాంతియుత పరిష్కారం కోసం ఏర్పాటు చేసుకున్న సంస్థకు ఆయన సెక్రటరీ జనరల్. కానీ ఒక బలమైన దేశం ఒక బలహీనమైన దేశంపై పాశవికంగా దాడికి పాల్పడుతుంటే ఏమీ చేయలేక, మన దగ్గర ప్రభుత్వం తప్పుడు పనులు చేస్తే పెద్దమనుషులు నిస్సహాయంగా మీటింగ్‌లు పెట్టుకొని 'ఇలా చేయకపోతే బాగుండేది' అంటూ పెదవి చప్పరించినట్లు 'ఇరాక్ సమస్య వేరే రకంగా పరిష్కారం అయి ఉంటే బాగుండేది' అని బాధపడడం తప్ప కోఫీ అన్నన్ ఏమీ చేయలేకపోతున్నారు.

ఇరాక్ దగ్గర అత్యంత ప్రమాదకరమైన మారణాయుధాలు ఉన్నాయని అమెరికా అభియోగం. నిజానికి అమెరికా దగ్గర అంతకంటే ప్రమాదకరమైనవి ఉన్నాయి. అందరి దగ్గరున్న ప్రమాదకరమైన మారణాయుధాలనూ ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో తొలగించి వేస్తే బాగుండేది. కానీ జరుగుతున్నది అది కాదు. ఎన్ని ప్రమాదకరమైన ఆయుధాలున్నప్పటికీ అమెరికా, రష్యా వంటి దేశాలు 'బాధ్యతాయుతంగా'

వ్యవహరిస్తాయనీ, 'బాధ్యత' తెలియని ఇరాక్ వంటి దేశాల చేతులలో ప్రమాదకరమైన ఆయుధాలు ఉండకుండా చూడడం అవసరమనీ పాశ్చాత్య దేశాల వాదన.

ఇది తెల్లజాతి దురహంకారం తప్ప వేరే ఏమీ కాదు. కానీ ఈ జాత్యహంకారం ఐక్యరాజ్యసమితికి కొత్త కాదు. ఐక్యరాజ్యసమితిలోని అన్ని దేశాలూ సమాన హోదా కలిగి లేవనేది తెలిసిన విషయమే. భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం ఉన్న కొన్ని దేశాలున్నాయి. వాటికి ఐక్యరాజ్యసమితి నిర్ణయాల విషయంలో 'వీటో' అధికారం ఉంది. దీని గురించి ఐక్యరాజ్యసమితి ఏర్పడిన నాటి నుండి బడుగుదేశాలు గొడవ చేస్తూనే ఉన్నాయి. అన్ని దేశాలకూ సమాన ప్రతిపత్తి ఉండాలని డిమాండ్ చేస్తున్నాయి. కానీ అమెరికా, రష్యా వంటి అగ్రరాజ్యాలు ఒప్పుకోవడం లేదు. చిన్నా పెద్దా తేడా లేకుండా అన్ని దేశాలకూ ఒకే ప్రతిపత్తి ఇచ్చేస్తే 'బాధ్యత తెలియని' చిన్నాచితక దేశాలు ప్రపంచ వ్యవహారాలను నిర్ణయించి పారేసే ప్రమాదం ఉందన్న వాదనతో వాళ్ళు తమ ప్రత్యేక ప్రతిపత్తిని సమర్థించుకుంటున్నారు.

ఇప్పటికే జనరల్ అసెంబ్లీలో పెద్ద సంఖ్యలో ఉన్న ఆఫ్రికా, ఆసియా దేశాలు తరచుగా 'బాధ్యతగల' పెద్ద దేశాల మాట వినకుండా అనేక విషయాలలో ఏకగ్రీవ తీర్మానాలు చేస్తుండడం వల్ల అమెరికాకు చాలా కోపంగా ఉంది. ఆ తీర్మానాలకు అవి రాసిన కాగితం విలువ కంటే ఎక్కువ లేదు కాబట్టి సరిపోయింది గానీ లేకపోతే ఈ పాటికి ప్రపంచ భద్రత ఏమైపోయేదని అమెరికా తరచుగా గొణుక్కుంటూ ఉంది.

అమెరికా, సోవియట్ రష్యాల ప్రచ్ఛన్న పోరు నడిచిన రోజులలో ఐక్యరాజ్యసమితి ఆ రెండు రాజ్యాల కొట్లాటలకు వేదికగా ఉండింది. ప్రపంచంలో ఎక్కడ ఏ ఘర్షణ జరిగినా అమెరికా ఒక పక్షం, సోవియట్ రష్యా ఒక పక్షం తీసుకొని వీటోలు ప్రయోగించి ఐక్యరాజ్యసమితి ఏమీ చేయలేకుండా చేశారు. కశ్మీర్ ఒక చక్కటి ఉదాహరణ. కశ్మీర్ ప్రస్తావన ఐక్యరాజ్యసమితిలో పాకిస్తాన్ ఎప్పుడు తీసుకొచ్చినా భారతదేశం తరఫున రష్యా వీటో ప్రయోగించేది. దానితో, చేసిన తీర్మానాలను పునరుద్ఘాటించడం తప్ప కశ్మీర్ విషయంలో ఐక్యరాజ్యసమితి ఏమీ చేయలేకపోయింది.

సోవియట్ కూటమి పతనమై ప్రచ్ఛన్న యుద్ధం ముగియడంతో ఐక్యరాజ్యసమితికి ఈ పీడ నుండి విముక్తి లభించిందని నమ్మిన వారికి త్వరలోనే ఆశాభంగం అయింది.

రెండు అగ్రరాజ్యాల పోరుకు వేదికగా ఉండిన ఐక్యరాజ్యసమితి త్వరలోనే ఒక అగ్రరాజ్యానికి సాధనంగా మారి, ప్రస్తుతం ఆ అగ్రరాజ్యం సహితం పట్టించుకోని ఒక అక్కరలేని వేదికగా మారింది. అ పరిణామాలకు కేంద్ర విషయం ఇరాక్ నియంత సద్దాం హుస్సేన్‌కు 'బుద్ధి చెప్పాలని' అమెరికా చేస్తున్న ప్రయత్నం. సద్దాం హుస్సేన్ మంచివాడని ఎవరూ అనలేరు. కానీ అతని లాంటి నియంతలు ప్రపంచం నలుమూలలా ఉన్నారు. వారిలో అమెరికా ప్రయోజనాలకు అడ్డం తగిలిన వారికి మాత్రమే చెడ్డపేరు వస్తుంది.

ఇరాక్ ప్రజలను హింసించడం ద్వారా సద్దాం హుస్సేన్ అధికారాన్ని నీరసింపజేయాలనే క్రూరమైన ఆలోచనను అమెరికా అమలు చేయదలచుకుంది. దీనికి ఐక్యరాజ్యసమితిని సాధనంగా వాడుకుంది. ప్రపంచ దేశాల మధ్య సమస్యలు యుద్ధం దాకా పోకుండా శాంతియుతంగా పరిష్కారం కావడం కోసం కృషిచేసే ప్రధాన లక్ష్యంతో ఏర్పాటయిన ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోనే అమెరికా కొన్నేళ్ళ కింద ఇరాక్‌పైన యుద్ధానికి దిగింది. ఇంతకంటే వికృతమైన చర్య వేరే ఏదీ ఉండదు. ఐక్యరాజ్యసమితి ఆవిర్భావానికి సంబంధించిన చరిత్రను పూర్తిగా మరచిపోయిన బిల్‌క్లింటన్ వంటి థర్డ్‌రేట్ రాజకీయ నాయకులకు అది వికృతంగా తోచకపోవచ్చుగాక.

యుద్ధం చేయడమే కాక ఇరాక్ ప్రజలను తీవ్రమైన బాధలకు లోను చేసే ఆంక్షలు సహితం ప్రయోగించారు. ఇరాక్‌కు ప్రధాన ఆధారమైన పెట్రోలియం ఎగుమతులు సహితం నిలుపు చేయగలిగారు. అత్యవసరమైన మందులు దొరకక కనీసం 5 లక్షల మంది పిల్లలు ఇరాక్‌లో ఈ ఆంక్షల ఫలితంగా చనిపోయారని అంచనా. వేరే సందర్భంలో ఒక అగ్రరాజ్యం ఒక బడుగు దేశాన్ని ఈ రకంగా హింసిస్తే దానిని ఆపడానికి జోక్యం చేసుకోవలసిన ఐక్యరాజ్యసమితి స్వయంగా ఈ ఘోరంలో భాగం కావడం ఈ మొత్తం ప్రహసనంలో అత్యంత బాధాకరమైన విషయం.

1998 వచ్చేసరికి ఐక్యరాజ్యసమితిని ఈ విధంగా వాడుకునే ప్రయత్నం కూడ అనవసరమని బిల్‌క్లింటన్ భావించాడు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఒక పక్క సమావేశం అయి ఉండగానే, భద్రతా మండలికి ఒక్క మాట కూడ చెప్పకుండా ఇరాక్‌పైన దాడి చేశాడు. ఇంగ్లాండ్ (మరొక శాశ్వత సభ్య దేశం) క్లింటన్‌తో

కలిసిపోయింది. చిన్నా చితక దేశాల 'బాధ్యతారాహిత్యం' గురించి తరచూ వాపోయే ఈ పెద్ద దేశాలు ఇంతకంటే బాధ్యతారహితంగా ఎవరు ప్రవర్తించగలరో చూడండన్నట్టు ప్రపంచానికి సవాలు విసిరాయి. కోఫీ అన్నన్ 'తప్పు తప్పు' అంటూ విలేఖరుల దగ్గర వాపోవడం తప్ప ఏమీ చేయలేకుండ ఉన్నాడు.

అయినప్పటికీ ఐక్యరాజ్యసమితి తొలినాటి లక్ష్యాన్ని కాపాడుకోవడం అవసరం. లేకపోతే దేశాల మధ్య సమస్యలకు, యుద్ధం తప్ప వేరే పరిష్కారం లేదన్న ఆటవిక నీతిని ఆమోదించడం అవుతుంది. కానీ ఈనాటి 'గ్లోబలైజేషన్' నేపథ్యంలో అమెరికాను కాదని ఈ పని చేయడానికి ఏ దేశం సిద్ధంగా ఉంది?

*బహుజన మహాబోధి పత్రిక*

*జనవరి 1999*

# 'నాటో'మేటిక్ విధ్వంసం ఎన్నాళ్ళు?

**కా**లచక్రం గుండ్రంగా తిరిగి మళ్ళీ మళ్ళీ మొదటికి వస్తుందన్న భావన ఆధునిక ఆలోచనా రీతులకు నచ్చదుగానీ అప్పుడప్పుడు అట్లా జరుగుతూ ఉంటుంది.

'కొసావో పరిణామాలు' దీనికొక ఉదాహరణ. ఒక్క కొసావో పరిణామాలే కాదు. మొత్తంగా యుగొస్లావియా పరిణామాలే దీనికొక ఉదాహరణ అని చెప్పుకోవచ్చు.

దేశాల మధ్య సమస్యల పరిష్కారానికి యుద్ధం ఒక అనాగరికమైన సాధనం అన్న ఆలోచనలో 20వ శతాబ్దం మొదలయిందని చెప్పవచ్చు. దాని ఫలితంగానే లీగ్ ఆఫ్ నేషన్స్, ఆ తరువాత ఐక్యరాజ్యసమితి ఏర్పడ్డాయి. ఇప్పుడు కండబలం గల కొన్ని దేశాలు బలప్రయోగంతో అంతర్జాతీయ సమస్యలను పరిష్కరిస్తాయనీ, అదే వాటికి సరైన పరిష్కార మార్గమనీ బిల్‌క్లింటన్, టోనీ బ్లెయిర్‌ల వంటి నాయకులు చేస్తున్న ప్రతిపాదనతో ఈ శతాబ్దం ముగుస్తున్నది.

'నాటో' ద్వారా కొసావో సమస్య సందర్భంగా యుగొస్లావియాలో అమలవుతున్న ఈ సూత్రాన్ని రష్యా వ్యతిరేకిస్తున్న మాట సత్యమే కానీ అందులో చారిత్రక విలువల పట్ల గౌరవం కన్నా 'స్లావ్' జాతి అభిమానమే ఎక్కువ. రష్యాలో ఈ జాత్యభిమానం ఎంత దూరం పోయిందంటే బోస్నియాలోనూ, ఇప్పుడు కొసావాలోనూ అల్పజాతీయుల పైన సెర్బియన్లు పాల్పడిన దారుణమైన హింసను మరిచిపోయి, రష్యా, యుగొస్లావియాలు ఒక సమాఖ్యలో ఏకం కావాలని రష్యా కమ్యూనిస్టు పార్టీతో సహా దాదాపు అన్ని పార్టీలూ ఆ దేశంలో ఉవ్విళ్ళూరుతున్నాయట. గుండ్రంగా తిరిగిన కాలచక్రానికి ఇది కూడ ఒక ఉదాహరణ. నాజీల హింసాకాండ ఫలితంగా జాతి దురహంకారాన్ని తీవ్రంగా ద్వేషించడం ఈ శతాబ్దమే నేర్పింది. ఆ దురహంకారాన్ని చాలా సాహసంతో ఎదుర్కొన్న వారిలో రష్యన్లు, యుగొస్లావియన్లు ముఖ్యులు. కానీ శతాబ్ది అంతానికి

హిట్లర్‌ను తలపుకు తెస్తున్నవాళ్ళు యుగొస్లావ్ నాయకుడు మిలోసెవిచ్, అతని నేతృత్వంలో యుగొస్లావియాతో కలిసిపోవాలని ఆరాటపడుతున్న తోటి స్లావ్ జాతీయులైన రష్యన్లు.

గత శతాబ్దంలో యూరప్‌లో రెండు దేశాల మధ్య ఏ సమస్య తలెత్తినా, ఒక దేశ పాలకులు విజృంభించి ఇరుగుపొరుగుకు ప్రమాదకరంగా తయరయినా (లేదా తమ రాజ్యంలోని పొరుగు జాతీయులపైన అణచివేతకు పాల్పడినా) యూరోపియన్ దేశాలు రెండు కూటములుగా విడిపోయి యుద్ధం చేసుకునేవి. ఒక్క యూరప్‌లోనే కాదు, ప్రపంచమంతటా ఇదే జరిగింది. యుద్ధ సాంకేతిక నైపుణ్యం పెరిగేకొద్దీ అది విపరీతమైన మారణకాండకు దారితీసింది. పాశ్చాత్యులు 1914-1919 మధ్య కాలంలో జరిగిన మొదటి ప్రపంచ యుద్ధంలో ఈ విషయాన్ని గ్రహించారు. అంతర్జాతీయ సమస్యల పరిష్కారానికి వేరే మార్గం వెతకాలని భావించారు.

ప్రయోజనాలను అనుసరించి దేశాలు కూటములుగా విడిపోయి మంచి చెడులతో నిమిత్తం లేకుండా యుద్ధాలు చేసుకునే పద్ధతి వల్ల జరిగేది నైతికంగానూ, భౌతికంగానూ ధ్వంసమేనని గుర్తించారు. అన్ని దేశాలూ సభ్యులుగా ఉన్న కూటమి ఏర్పాటు చేసుకుని సమస్యల పరిష్కారానికి కొన్ని నియమాలను, పద్ధతులను పెట్టుకొని వాటికి కట్టుబడి నడుచుకోవడం నాగరికత అనిపించుకుంటుందని గుర్తించారు. లీగ్ ఆఫ్ నేషన్స్ ఈ ఆదర్శం నుంచే పుట్టింది.

అయితే మళ్ళీ తీవ్రమయిన సమస్యలు వచ్చేసరికి ఆ సంస్థ తట్టుకోలేకపోయింది. ఆ సంస్థనూ, అది చూపించే పరిష్కార మార్గాలనూ పక్కనబెట్టి దేశాలు మళ్ళీ బలప్రయోగాన్ని ఆశ్రయించాయి. ఈసారి నిజంగానే ప్రపంచ యుద్ధం అనదగ్గ యుద్ధం - రెండవ ప్రపంచ యుద్ధం - జరిగింది. విపరీతమైన విధ్వంసాన్ని ప్రపంచ ప్రజలకు రుచి చూపించింది. రాబోయే యుద్ధాల విధ్వంసక శక్తికి సూచికగా హీరోషిమా, నాగసాకిల అణువిస్ఫోటనంతో అది ముగిసింది.

పాలకుల సంగతి ఎట్లా ఉన్నా యుద్ధం పట్ల వ్యతిరేకత సమాజంలో బలంగా నెలకొంది. లీగ్ ఆఫ్ నేషన్స్ కంటే సమర్థవంతమైన అంతర్జాతీయ సమస్యల పరిష్కార యంత్రాంగాన్ని నెలకొల్పాలన్న కాంక్ష బలంగా ముందుకొచ్చింది. దాని ఫలితం ఐక్యరాజ్యసమితి.

యాభై సంవత్సరాల తరువాత ఐక్యరాజ్యసమితి పతనం అంచును చేరుకుంది. దాని గురించి బాధపడే వాళ్ళు కూడ కనబడడం లేదు. ఒకనాడు ఇటువంటి విషయాల గురించి ఆలోచించగల నాయకులు ఒక దేశంలో కాకపోతే ఒక దేశంలోనయినా ఉండేవారు. వర్తమానాన్ని మానవ నాగరికతా స్రవంతిలో ఒక ఘట్టంగా గుర్తించి నాగరికత పెంపుదల గురించి ఆలోచించే వాతావరణం ఒక మేరకైనా ఉండేది. ఇప్పుడు గ్రామ ముఠా నాయకుల స్థాయి మనుషులు దేశాలను ఏలుతున్నారు. వాళ్ళ చేతులలో మాత్రం అపారమైన విధ్వంసక శక్తి ఉంది. ప్రపంచాన్ని ఒకసారి కాదు, అనేకసార్లు ధ్వంసం చేయగల శక్తి ఉంది. దాని నుంచి పుట్టే అహంకారమూ వారి ఆలోచనలలో ఉంది.

ఈ శక్తి అత్యధికంగా ఉన్న అమెరికా ఐక్యరాజ్యసమితిని బహిరంగంగానే తృణీకరిస్తున్నది. సద్దాం హుస్సేన్ విషయంలోనయినా మిలోసెవిచ్ విషయంలోనయినా ఐక్యరాజ్యసమితి మూలసూత్రాలను అనుసరించి ప్రపంచ దేశాలను ఒక్కతాటి మీద నిలబెట్టి ఆ ఇద్దరు నియంతలు సృష్టిస్తున్న సమస్యలను ఎదుర్కోవడానికి వ్యూహరచన చేయడం అమెరికాకు వృథా అనిపించింది. సైనిక దాడులు జరిపి, బాంబులు వేసి విధ్వంసం సృష్టించి వారిద్దరినీ అదుపులోకి తెచ్చే బలప్రయోగ సామర్థ్యం తన దగ్గరుండగా, శాంతియుత పరిష్కారానికి పెద్దపీట వేసే ఐక్యరాజ్యసమితి విధాన నియమాలను అనుసరించడం దండగ అని బిల్‌క్లింటన్ అభిప్రాయపడ్డాడు. ఇరాక్‌పై మొదటిసారి ఐక్యరాజ్యసమితి చేతనే దాడి చేయించాడు. శాంతియుత పరిష్కార మార్గాల అన్వేషణలో భాగంగా ఏర్పడిన ఐక్యరాజ్యసమితి చేతనే యుద్ధం చేయించడంలో గల చారిత్రక అనౌచిత్యం బిల్‌క్లింటన్ వంటి థర్డ్‌గ్రేడ్ రాజకీయవేత్తలకు అర్థం కావడం కష్టమనుకోండి. ఆ తరువాత ఐక్యరాజ్యసమితితో ప్రమేయం లేకుండా ఇంగ్లండ్‌ను కలుపుకుని ఇరాక్‌పైన దాడి చేశాడు. 'తప్పు తప్పు' అని చిన్నపిల్లల ఆకతాయి చేష్టలను జవసత్వాలుడిగిన ముసలివాళ్ళు నిస్సహాయంగా వారించినట్టుగా వారించడం తప్ప ఐక్యరాజ్యసమితి ఏమీ చేయలేకపోయింది. బిల్‌క్లింటన్‌కు టోనీ బ్లెయిర్ తోడుకావడం వామపక్షవాదులందరినీ తలదించుకునేటట్లు చేసింది. ఎందుకంటే బ్రిటిష్ రాజకీయాలలో టోనీబ్లెయిర్ ఒకప్పుడు తీవ్ర వామపక్షవాది.

యుగొస్లావియా దగ్గరకొచ్చేసరికి బిల్‌క్లింటన్‌కు నాటో గుర్తుకొచ్చింది. సోవియట్ రష్యా బతికి ఉన్న రోజులలో సోవియట్ వ్యతిరేక ఉమ్మడి కూటమి

సైనిక శక్తిగా నాటో ఉనికిలోకి వచ్చింది. నాటో శక్తులు రేపోమాపో తమపైన దాడిచేయబోతున్నాయన్న ప్రచారం సోవియట్ కూటమి తరచూ చేసేది. అదెప్పుడూ జరగలేదు గానీ, సోవియట్ రష్యా అంతరించిపోయిన తరువాత నాటో ప్రకటిత అవసరం తొలగిపోయింది. తరువాత ప్రపంచంలో మిగిలిపోయిన ఏకైక పోలీసుకు నాటో కాల్బలంగా ఉపయోగపడింది. ఈ శతాబ్దపు తొలి సంవత్సరాలలో లీగ్ ఆఫ్ నేషన్స్ ఆవిర్భావానికి నాందిగా అంతర్జాతీయ సమస్యల పరిష్కారంలో బలప్రయోగం పాత్ర గురించి, శాంతి సామరస్యాల పాత్ర గురించి, ఎదుగుతున్న భౌతిక నాగరికతతో పాటు ఎదగవలసి వున్న రాజకీయ నాగరికత గురించి ఇవే దేశాలలో తత్వవేత్తలూ, సాహిత్యకారులూ, రాజకీయవేత్తలూ చేసిన చర్చనొకసారి గుర్తుతెచ్చుకుంటే ఈ చారిత్రక తిరోగమనం చాలా వికృతంగా తోచక మానదు.

నిజమే, సద్దాం హుస్సేన్ గానీ మిలోసెవిచ్ గానీ నాగరికులు కారు. ఏ నాగరికతా విలువలను ప్రమాణంగా పెట్టుకుని బిల్‌క్లింటన్‌నూ, టోనీబ్లెయిర్‌నూ విమర్శిస్తున్నామో, ఆ విలువలకు వారిద్దరూ చాలా దూరం. కానీ వారిద్దరినీ ఎదుర్కోవడానికి అమెరికా ఎంచుకున్న మార్గం వారి కంటే ఏమైనా నాగరికమైనదా అనేది ప్రశ్న. వారి నుండి నాగరికతను కాపాడతామని ఉరికి ముందుకొస్తున్న అమెరికా, ఇంగ్లండ్ దేశాల నాయకులకు మరీ ఆ ఇద్దరంత క్రూరంగా ఉండాల్సిన అవసరం లేదు కాబట్టి వారి కంటే నాగరికంగా కనిపిస్తున్నారు గానీ నిజంగా వారి కంటే వీళ్ళేమైనా మెరుగయిన మనుషులా అనేది కూడ ఒక ప్రశ్నే.

అమెరికా వ్యూహం ఫలితాన్ని ఇవ్వకపోవడానికి ఇది కూడ ఒక కారణమే. తన చేతికింద ఏ రోజు అయినా అరడజను నియంతలకు ఆశ్రయం ఇచ్చే అమెరికాకు సద్దాం హుస్సేన్‌ను గానీ, మిలోసెవిచ్‌ను గానీ నియంతలు అంటూ శిక్షించడానికి బయలుదేరే నైతిక అర్హత లేదనేది ఇప్పుడు విశ్వవాప్తంగా గుర్తింపు పొందిన విషయం. ఈ సత్యం ఇరాక్‌లోనూ, యుగొస్లావియాలోనూ ఆ ఇద్దరు నియంతలకు సానుభూతిని పెంచింది. రౌడీ అయిన కొడుకును పోలీసులు తంతే అప్పటివరకు వాడిని రౌడీ అని తిట్టిపోసిన తల్లిదండ్రులు సైతం 'మా వాడొక్కడే ఈ ఊరిలో రౌడీయా? ఎంతమంది రౌడీలతో పోలీసులు లాలూచీ పడడం లేదు?' అంటూ ఆవేశపడినట్లు.

ఇరాక్ సంగతి ఎక్కువ తెలియదుగానీ, యుగొస్లావియాలో మిలోసెవిచ్ జాత్యహంకార రాజకీయాలను వ్యతిరేకించే వాళ్ళు చాలామందే ఉన్నారు. వాళ్ళంతా

ఇప్పుడు (నాటో దాడుల అనంతరం) మిలోసెవిచ్‌తో తమకున్న విభేదాలు మరిచిపోయి అతని వెనుక సమీకృతమవుతున్నారు. బహుశా ఇరాక్‌లో కూడ ఇదే వాస్తవమై ఉంటుంది.

ఎందుకంటే ఈ నియంతలిద్దరినీ అధికారం నుంచి తొలగించే హక్కును ఆ దేశాల ప్రజల చేతి నుంచి అమెరికా తీసుకుంది. వాళ్ళను అధికారం నుండి తొలగించడం తన తక్షణ లక్ష్యమని బహిరంగంగానే ప్రకటించింది. ఆత్మగౌరవం ఉన్న ప్రజలెవ్వరికైనా అది కోపం తెప్పించక తప్పదు. ఆ ప్రజల సార్వభౌమత్వంలో తాను జోక్యం చేసుకుంటున్నదన్న స్పృహ అమెరికాకు లేదు. ఆ మాత్రం సున్నితత్వానికి అమెరికా పాలకుల ఆలోచనలలో తావు లేదు.

నిజానికి దేశాల సార్వభౌమత్వానికి హాని కలిగించకుండా అంతర్జాతీయ వివాదాల పరిష్కారం కోసం కృషి చేయాలన్నది ఐక్యరాజ్యసమితి లక్ష్యాలలో ఒకటి. ఆ కృషిలో ఐక్యరాజ్యసమితి పెద్దగా విజయం సాధించకున్నప్పటికీ అంతర్జాతీయ రాజకీయాలలో ఇది కాంక్షించదగ్గ సూత్రం. ఎందుకంటే దేశాల సార్వభౌమత్వమంటే సారాంశంలో ప్రజల సార్వభౌమత్వమే. దేశాన్ని మంచివాళ్ళు పరిపాలించాలా, చెడ్డవాళ్ళు పరిపాలించాలా, దుర్మార్గులు అధికారంలోకి వస్తే వాళ్ళను ఏ విధంగా తొలగించాలి అనేవి ఆ దేశాల ప్రజలకే వదిలివేయవలసిన విషయాలు. ఇది 'ప్రజలు' అనే భావనకు అద్భుతమైన లక్షణాలను, ఊహాజనితమైన విజ్ఞతను ఆపాదించడం కోసం అంటున్నది కాదు. అయితే ప్రజాస్వామ్యం  వేరొక రకంగా ఉండజాలదని గుర్తించడం అవసరం. అమెరికా పాలకులకు తెలిసిన మంచి ఎంత అనేది అటుంచి, దానిని ఇతర దేశాల ప్రజలపైన బలప్రయోగంతో రుద్దాలని చూడడం సహించరాని అహంకారం. అంతర్జాతీయ సంబంధాలలో ప్రజాస్వామ్య విలువలను కొంత మేరకయినా నిలబెట్టడం కోసం ఈ శతాబ్దంలో జరిగిన ప్రయత్నాలన్నీ చివరికి ఇక్కడికి చేరుకోవడం చాలా బాధాకరమైన విషయం.

టిటో నిర్మించతలపెట్టిన యుగొస్లావియా చివరికి మిలోసెవిచ్ బ్రాండు సెర్బియన్ జాత్యహంకారానికీ, బోస్నియా, కొసావో ఊచకోతలకూ దారితీయడం అంతే బాధాకరమైన విషయం. స్టాలిన్‌తో టిటో విభేదించడం వల్ల అతని రాజకీయ కృషి భారతదేశంలో వామపక్షవాదులకు సైతం పెద్దగా తెలియదు. కానీ నిజానికి

సోవియట్ రష్యా కంటే జాతి సమస్యను నిజాయితీగా పరిష్కరించడానికి యుగొస్లావియాలో మెరుగైన ప్రయత్నం జరిగింది. టిటో బతికుండగా అది విజయవంతమైనట్లే తోచింది కాని ఎంతమాత్రం కాలేదనీ, పరిష్కారమైనట్టు కనిపించిన యుగొస్లావ్ జాతి సమస్య వెనుక భయంకరమైన విద్వేషం మిగిలి ఉందని ఇప్పుడు అర్థం అవుతున్నది. సామాజిక సమస్యలు ఏ మేరకయితే ప్రజాస్వామికంగా పరిష్కారమవుతాయో ఆ మేరకే అవి నిజంగా పరిష్కారమవుతాయనీ, 'మంచివాళ్ళ' ఏకపార్టీ నియంతృత్వంలో జరిగే పరిష్కారాలు భ్రమాపూరితమైన పరిష్కారాలే కాక అవి సమస్యలను దాచిపెట్టడానికి మాత్రమే పనికొస్తాయనీ యుగొస్లావియా దయనీయ చరిత్ర నుంచి మనం గ్రహించగల్గితే మిలోసెవిచ్ వల్ల కూడ కొంత మేలు జరిగినట్లే.

ఈ లోపల ప్రపంచం ముందున్న సమస్య – అంతర్జాతీయ రాజకీయాలను అమెరికా పెత్తనం నుంచి కాపాడి ప్రజాస్వామ్య సూత్రాల ప్రాతిపదిక మీద ఏ విధంగా నిలబెట్టాలనేది. అంతదూరం పోలేకపోయినా, కనీసం అంతర్జాతీయ సమస్యల నాగరిక పరిష్కారం కోసం ఒక యంత్రాంగాన్ని రూపొందించాలని ఈ శతాబ్దంలో మొదలుపెట్టి పాక్షికంగా మాత్రమే సఫలమైన ప్రయోగానికి గోరీ కట్టడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నం నుంచి నాగరికతను ఏ విధంగా కాపాడాలనే సమస్యనయితే ప్రపంచం ఎదుర్కొని పరిష్కరించుకోవలసిందే.

*ఆంధ్రప్రభ దినపత్రిక*
*29 ఏప్రిల్ 1999*

# ఐక్యరాజ్యసమితి: గతి - గమ్యం

**జా**ర్జి బుష్ రెండవసారి గెలవడంతో ఐక్యరాజ్యసమితి సంపూర్ణ పతనం ఖరారయినట్టే భావించవచ్చు. అది ఉండి ఏం చేసింది గనుక అంటారేమో. దాని వ్యవస్థాపక లక్ష్యాలకు తగినట్టు నడుచుకొని ఉంటే చాలా చేసేదే. దాని నిర్మాణమే ఆ లక్ష్యాలకు విరుద్ధంగా ఉండడం వల్ల కొంత, అగ్రరాజ్యాలు తమ పోటీలో దానిని ఒక పావుగా వాడుకోవడానికి సంకోచించని కారణంగా కొంత చేయలేకపోయింది. అయితే అది బతికివుంటే ఎప్పటికయినా దానిని బాగుపరిచే అవకాశం ఉండేదేమో. కాని ఇప్పుడు ఆ ఆశా పోయింది.

బుష్ ప్రకటించి ఆచరిస్తున్న 'ముందు జాగ్రత్త దాడుల' సిద్ధాంతం ఐక్యరాజ్య సమితి వ్యవస్థాపక నియమాలకే వ్యతిరేకం. ఆత్మరక్షణలో తప్ప ఏ దేశమూ మరొక దేశంపై బలప్రయోగానికి పాల్పడకూడదనీ, ఒక దేశం చర్యల వల్ల మరొక దేశం ప్రయోజనాలకు నష్టం కలిగినట్టయితే ఆ దేశం ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేయాలి తప్ప ప్రత్యక్ష చర్యలకు దిగకూడదనీ ఆ సంస్థ నియమం. ఆ తర్వాత ఐక్యరాజ్యసమితి ఇరువురి మధ్యా రాజీ ప్రయత్నాలు చేస్తుంది. ఎంత చెప్పినా వినని దేశం మీద ఆర్థిక ఆంక్షల రూపంలో ఒత్తిడి పెడుతుంది.

బలప్రయోగాన్ని ఆఖరి ప్రత్యామ్నాయం చేయడం ఈ నియమాల లక్ష్యం. ఇవి ఒక్కరోజు అకస్మాత్తుగా ఊడిపడిన లక్ష్యాలు కావు. 19వ శతాబ్దం చివరి దశ నుండి యూరప్‌లో 'ప్రపంచ ప్రభుత్వం' గురించి ఆలోచనలు జరిగాయి. ఒక దేశంలో పౌరులు ఆత్మరక్షణలో తప్ప ఇతరత్రా హింసకు పాల్పడకుండా నిరోధించడానికి ఒక ప్రభుత్వాన్ని ఏర్పరచుకున్నట్టు, రాజులు ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడకుండ చూసే ప్రపంచ ప్రభుత్వం ఎందుకు ఉండకూడదు అంటూ రాజనీతి తత్వవేత్తలు వివేచించారు. మరి దేశం లోపల పౌరులను అదుపు చేయడానికి రాజ్యం చేతిలో

పోలీసులు, సైన్యం ఉన్నట్లు ప్రపంచ ప్రభుత్వం అదుపాజ్ఞలలో ప్రపంచ పోలీసులు, సైన్యమూ ఉంటాయా? ఉంటే వాటిని అదుపు చేసేది ఎవరు? ప్రపంచ ప్రభుత్వానికి అవసరమైన ఖర్చు ఎవరు చెల్లిస్తారు? ప్రపంచ ప్రజలందరూ పన్నులు కడతారా? ప్రపంచ ప్రభుత్వం ఉంటే ప్రపంచ న్యాయస్థానం కూడ ఉండాలి కదా? అది ఏ చట్టాన్ని అమలు చేస్తుంది?

ఇత్యాది ప్రశ్నలు యూరోపియన్ తత్వవేత్తలు పంతొమ్మిదవ శతాబ్దంలో చాలా ఆసక్తికరంగా చర్చించారు. అయితే యూరప్‌లో నాగరికత చాలా ఎదిగిందనీ, ఇంక యుద్ధాలు జరగవని కూడ వారిలో చాలామంది అనుకోవడం వల్ల ఈ చర్చ కొంచెం తీరికగానే జరుపుకున్నారు. 1870లో ఫ్రాన్స్‌కూ, జర్మనీకీ జరిగిన యుద్ధం తరువాత నలభై ఏళ్ళకు పైగా యూరప్‌లో యుద్ధాలు లేవు. అంతకుముందు ఇంతటి విరామం ఎప్పుడూ లేదు. అదే సమయంలో విద్యుచ్ఛక్తి, చమురు మొదలయినవాటి వినియోగం విస్తరించి పారిశ్రామిక పురోగతి వేగం పుంజుకుంది. వైజ్ఞానిక ఆవిష్కరణలు అన్ని శాస్త్రాలలోనూ ఇతోధికంగా జరిగాయి. 19వ శతాబ్దపు చివరి భాగంలో దక్షిణాఫ్రికాలోను, 20వ శతాబ్దపు తొలి సంవత్సరాలలో రష్యా, జపాన్‌ల మధ్య యుద్ధాలు జరిగాయి తప్ప యూరప్ మాత్రం ప్రశాంతంగానే ఉంది. యూరప్ యుద్ధాన్ని అధిగమించి నాగరికతనూ సంస్కారాన్నీ సాధించేసిందని యూరోపియన్ మేధావులు తమ గురించి తాము ప్రశంసా పూర్వకంగా అనుకోసాగారు కూడ.

1914లో మొదలయిన మొదటి ప్రపంచ యుద్ధం ఈ విశ్వాసాన్ని బలంగా దెబ్బతీసింది. దానికి 'ప్రపంచ యుద్ధం' అని పేరు పెట్టినప్పటికీ అది ప్రధానంగా యూరోపియన్ దేశాల మధ్య యుద్ధం. ఆ యుద్ధంలో అంతకు ముందెన్నడూ ఏ యుద్ధంలోనూ చనిపోనంత మంది చనిపోయారు. అంతకుముందు ప్రపంచం చూసి ఎరుగని శక్తివంతమైన తుపాకులు, ట్యాంకులు, సబ్‌మెరైన్‌లు మొట్టమొదటిసారి ఆ యుద్ధంలో వినియోగించారు. దీనితో అప్పటిదాకా తాత్విక చర్చగా ఉండినది ఆచరణ రూపం తీసుకోక తప్పదన్న అభిప్రాయానికి తత్వవేత్తలేకాక ప్రభుత్వాధినేతలు కూడ వచ్చారు. ప్రపంచ ప్రభుత్వం లాంటిదేమీ ఏర్పడలేదుగానీ 'లీగ్ ఆఫ్ నేషన్స్' అనే ఒక ఉమ్మడి వేదిక ఏర్పడింది.

అయితే మొదటి ప్రపంచ యుద్ధంలో ఓడిపోయి సర్వం కోల్పోయిన జర్మనీలోని ఆర్థిక రాజకీయ సంక్షోభం హిట్లర్ రూపంలో మరొక ప్రపంచ యుద్ధానికి

దారితీయకుండ లీగ్ ఆఫ్ నేషన్స్ ఆపలేకపోయింది. ఇది కూడ ప్రధానంగా యూరప్ దేశాల యుద్ధమే అయినప్పటికీ ప్రపంచంలోని అన్ని దేశాలనూ ఏదో ఒక మేరకు తాకింది. అనూహ్యమైన మానవ హననానికి దారితీసింది.

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత లీగ్ ఆఫ్ నేషన్స్ కంటే కొంచెం పటిష్టమైన వ్యవస్థగా ఐక్యరాజ్యసమితి పుట్టింది. అయితే దానిని ఏర్పాటు చేసిన యుద్ధ విజేతలు ఆ 'అంతర్జాతీయ వ్యవస్థ' తమ చెప్పుచేతలలో ఉండేటట్టు ఏర్పాటు చేసుకున్నారు. వోటు హక్కుంటూ ఉన్న దేశాలలో ప్రతీ ఒక్కరికీ ఒక వోటు ఉంటుంది. అన్ని వోట్లకూ ఒకే విలువ ఉంటుంది. కానీ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలోని అయిదు శాశ్వత సభ్యదేశాలకు ఒక్కొక్కదానికి ప్రపంచంలోని తక్కిన అన్ని దేశాల ఉమ్మడి వోటును తిరస్కరించే 'వీటో' హక్కు ఇవ్వబడింది. అదేమంటే చిన్న చిన్న దేశాలు బాధ్యతారహితంగా వ్యవహరించే ప్రమాదం ఉంది కాబట్టి 'బాధ్యత' గల పెద్దలకు వీటో హక్కు ఉండాలన్నారు. ఆయా దేశాల పౌరుల వోటు హక్కు విషయంలోనూ ఒకప్పుడు ఇదే రకమైన అభ్యంతరం తలెత్తిన విషయం వారు మరిచిపోయారేమో. ఆస్తి లేని పేదలకు, నల్లజాతీయులకు, స్త్రీలకు వోటు హక్కు ఇవ్వాలని డిమాండ్ చేసినప్పుడు వారంతా 'బాధ్యత తెలియని' వారు కాబట్టి ఆస్తి గల తెల్లజాతి పురుషులకే వోటు హక్కు ఉండాలని అన్నారు. ఆ అభ్యంతరాలకి కాలం చెల్లిపోయిన అర్ధ శతాబ్దానికి అంతర్జాతీయ రాజకీయ వ్యవస్థలో తిరిగి అదే పాట వినిపించటానికి అగ్రరాజ్యాలకు సిగ్గనిపించలేదు.

యుద్ధాలను నివారించడం కోసం పుట్టిన ఐక్యరాజ్యసమితి ఒక్క యుద్ధాన్నయినా నివారించిందా అనేది చాలా చర్చకూ, వివాదానికీ దారితీసిన విషయం. ఐక్యరాజ్యసమితి ఏర్పడిన తరువాత దాదాపు 45 సంవత్సరాల పాటు ప్రపంచ రాజకీయాలను అమెరికా, రష్యాల ప్రచ్ఛన్న యుద్ధం శాసించింది. ఆ రెండు దేశాలకూ ఐక్యరాజ్యసమితిలో వీటో హక్కు ఉన్న కారణంగా ఐక్యరాజ్యసమితి నిర్ణయాలను వారి ప్రయోజనాల నుండి వేరు చేయడం చాలా కష్టమైపోయింది.

అయితే యుద్ధాలను నివారించే కర్తవ్యమే కాక వేరే కొన్ని అంశాలు కూడ ఐక్యరాజ్యసమితి అజెండాలో భాగం అయ్యాయి. ఇవి కూడ ఆనాటి చారిత్రక సందర్భం నుండి పుట్టినవే. ఒకటి, ప్రతీ దేశమూ తన పౌరుల పౌర రాజకీయ హక్కుల రక్షణకు

కట్టుబడి ఉండాలని ఒత్తిడి పెట్టడం, అందుకు కావలసిన ప్రమాణాలను రూపొందించడం. రెండు, వలసలుగా లేక పరాధీనులుగా ఉన్న జాతుల స్వయం నిర్ణయాధికారానికి అంతర్జాతీయ చట్టంలో గుర్తింపు ఇవ్వడం; మూడు, సంపదలోనూ, జీవన ప్రమాణాలలోనూ చాలా అసమానతలున్న ఈ ప్రపంచంలో బడుగుదేశాల ప్రజల సామాజిక ఆర్థిక భద్రత కోసం కొంత కృషి చేయడం.

ఒక దేశ ప్రజలతో ఆ దేశ ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరిస్తుందనేది ఆ దేశ ప్రయోజనానికీ రాజకీయ వ్యవస్థకూ సంబంధించిన విషయం. దేశాల మధ్య శాంతి నెలకొల్పడానికి ఆవిర్భవించిన ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలకు దానితో సంబంధం ఉండనక్కరలేదు. కానీ హిట్లర్ పుణ్యాన ఒక దేశ పౌరుల పౌరహక్కులు మానవాళికి సంబంధించిన విషయం అన్న గుర్తింపు లభించింది. హిట్లర్ అప్పటి జర్మనీ రాజ్యాంగం కింద ఎన్నికయిన పాలకుడే. అయితే అతని ప్రభుత్వం ఒక పద్ధతి ప్రకారం తన పౌరులనే కబళించింది. యూదులను, కమ్యూనిస్టులను, సోషలిస్టులను, నాజీ పార్టీ విధానాలతో విభేదించిన వారిని ఒక్కొక్కరినీ లక్షల సంఖ్యలో అతి క్రూరంగా హతమార్చింది. ఒక దేశ ప్రజల హక్కులను ఆ దేశపు ప్రయోజనానికి వదిలేయడానికి వీలు లేదన్న అవగాహన దీనితో బలపడింది. అన్ని దేశాలూ, అన్ని ప్రభుత్వాలూ గౌరవించవలసిన కొన్ని కనీస హక్కులుంటాయన్న స్పృహ పెరిగింది. వీటి క్రోడీకరణ ఐక్యరాజ్యసమితి చేసిన పనులలో ఒకటి. అంతర్జాతీయ మానవహక్కుల ప్రకటన (1948), అంతర్జాతీయ పౌర రాజకీయ హక్కుల ఒడంబడిక (1966), అంతర్జాతీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కుల ఒడంబడిక (1966), మరణ దండన నిషేధానికి ఒప్పందం (1989), జాతి హననం (జెనోసైడ్) అంతానికి ఒడంబడిక (1948), అన్ని రకాల జాతి వివక్ష అంతానికి అంతర్జాతీయ ఒడంబడిక (1965), స్త్రీలపైన అన్ని రూపాలలో జరిగే వివక్ష అంతానికి ఒడంబడిక (1979), శరణార్థుల స్థితిగతులకు సంబంధించిన ఒడంబడిక (1950), క్రూరమైన అమానుషమైన శిక్షలను నిషేధించే ఒడంబడిక (1984), పిల్లల హక్కుల ఒడంబడిక (1989), మూలవాసీ, ఆదివాసీ ప్రజలకు సంబంధించిన ఒడంబడిక (1989), ఖైదీల హక్కులకు సంబంధించిన కనీస నియమాల ప్రకటన (1977) – ఐక్యరాజ్యసమితి రూపకల్పన చేసిన ముఖ్యమైన హక్కుల ప్రకటనలు.

వీటి మీద అక్కడ సంతకం చేయడం, ఇంటికొచ్చి మరిచిపోవడం ప్రభుత్వాలకు అలవాటయి పోయిన మాట వాస్తవమే. అయితే ఈ ప్రకటనలకు 'అంతర్జాతీయ చట్టం'గా గుర్తింపు లభించడం ఆయా దేశాలలో ప్రజాస్వామ్య పోరాటాలకు బలం చేకూర్చింది. 'నువ్వే సంతకం చేసావు. అమలు చేయి' అని అడిగే అవకాశం లభించింది. దేశపు ప్రయోజనాలలో ఈ నియమాలు భాగమేననీ, అవి చట్టంలోని హక్కుల వంటివేననీ కోర్టులలో వాదించే అవకాశమూ లభించింది. భారత సుప్రీంకోర్టు ఈ ఒడంబడికల వెలుగులో ఖైదీల హక్కులను, స్త్రీల హక్కులను వ్యాఖ్యానించడం దీనికొక ఉదాహరణ.

జాతుల స్వయం నిర్ణయాధికారం అనేది లీగ్ ఆఫ్ నేషన్స్ కాలం నుండే ఒక అంతర్జాతీయ మానవహక్కుల సూత్రంగా గుర్తింపు పొంది వుంది. యూరప్‌లోని మధ్యయుగాల అవశేషాలయిన పెద్ద సామ్రాజ్యాల ఆధిపత్యానికి బలయిన చిన్న జాతులు, పాశ్చాత్య వలసవాద దోపిడీకి లోనయిన ఆసియా, ఆఫ్రికా జాతులు స్వేచ్ఛనూ స్వాతంత్ర్యాన్నీ కోరుకోవడం ఆయా ఆధిపత్య దేశాల ప్రయోజనాల దృష్టిలో రాజద్రోహం, కుట్ర మొదలైన నేరాలుగా కనిపించవచ్చును గానీ అది ఒక న్యాయమైన స్వయం నిర్ణయాధికార ఆకాంక్ష అన్న గుర్తింపు మొదటి ప్రపంచ యుద్ధ కాలం నుండి పెరిగింది. ఐక్యరాజ్యసమితి రూపొందించిన ఒడంబడికలలోనూ, ప్రకటనలలోనూ అదొక విలువగా చోటు చేసుకుంది.

యుద్ధాలు నివారించే విషయంలోనూ, సభ్యదేశాల అంతర్గత పౌర రాజకీయ హక్కులను పెంపొందించడంలోనూ ఐక్యరాజ్యసమితి ఆచరణలో ఎంత సాధించింది అని చూస్తే తీవ్రమైన నిరాశే మిగులుతుంది. జాతుల నిర్ణయాధికారాన్ని గురించి, యుద్ధాల అవాంఛనీయత గురించి ఆర్భాటంగా నియమాలు ప్రకటించుకున్న ఐక్యరాజ్యసమితి, అమెరికా అండతో పాలస్తీనా ప్రజల ఉనికిపైన ఇజ్రాయిల్ చేసిన, చేస్తున్న ప్రాణాంతకమైన దాడులను ఏ మాత్రం ఆపలేకపోయింది. సర్వసభ్య సమావేశంలో ఆవేశపూరితమైన ఉపన్యాసాలు, తీర్మానాలు, భద్రతా మండలిలో అమెరికా వీటోలు, 'నీ తీర్మానాలకు గోలీమారో' అన్న పద్ధతిలో ఐక్యరాజ్యసమితిని వెక్కిరించిన ఇజ్రాయిల్ తిరస్కార ప్రవచనాలను 50 ఏళ్ళుగా ప్రపంచం చూస్తూనే ఉంది. అయితే ప్రత్యక్షంగా అమెరికా వంటి అగ్రరాజ్యాల అంతర్జాతీయ ఆధిపత్య ప్రయోజనాలకు భంగం కలిగించని విషయాలలో ఐక్యరాజ్యసమితి నుండి ఆవిర్భవించిన ఒత్తిడి ఇంకొంచెం ఎక్కువ ప్రయోజనమే ఇవ్వగలిగింది. ఈ రోజు

ప్రపంచంలోని మెజారిటీ దేశాలు మరణదండన అమలు చేయడం లేదంటే ఐక్యరాజ్యసమితిలో జరిగిన చర్చలు, ఆ సంస్థ చేపట్టిన ప్రకటనలు, పెట్టిన ఒత్తిడి ఒక కారణం అని చెప్పక తప్పదు. స్త్రీల హక్కుల విషయంలోనూ, పర్యావరణ పరిరక్షణ విషయంలోనూ కూడ ఐక్యరాజ్యసమితి కొంత సాధించగలిగింది. స్త్రీల విషయంలో మత సంప్రదాయాల మొండితనం, పర్యావరణం విషయంలో పాశ్చాత్య దేశాల ఖరీదైన జీవన ప్రమాణం అనుల్లంఘనీయం అన్న సెక్యులర్ మొండితనం ఆటంకంగా నిలిచినప్పటికీ కొంత అవగాహన, కొన్ని సంస్కరణలు సాధ్యం అయ్యాయి.

యునెస్కో, ప్రపంచ ఆరోగ్య సంస్థ, యుఎన్‌డిపి మొదలయిన సంస్థల ద్వారా ఐక్యరాజ్యసమితి చేసిన సామాజిక, ఆర్థిక కృషి మరింత వివాదాస్పదమయింది. ఆ కృషిని ఉన్నంతలో బీద దేశాల బీద ప్రజానీకానికి కొంత ఊరట కలిగించే ప్రయత్నంగా చూడాలా లేక సామ్రాజ్యవాద అసమానతలను స్థిరీకరించే ప్రయత్నంగా చూడాలా అన్న చర్చ చాలా జరిగింది. ఏ సంస్కరణాత్మక ప్రయత్నమైనా అప్పటి అసమానతలను స్థిరీకరించే కుట్రేనని రాడికల్ సిద్ధాంతవేత్తలే కాక సంస్కరణాత్మక కృషికి కూడ మానవ నాగరికతా ప్రగతిలో ఒక స్థానం ఉందని నమ్మే వారు సహితం ఐక్యరాజ్యసమితి చేపట్టిన మానవతావాద కృషిపైన ఈ విమర్శ పెట్టారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్నా యునెస్కో వంటి సంస్థల మీద ఈ విమర్శ ఎక్కువగా ఉంది.

దీని వెనక ఉన్న ఒక వాస్తవం 19వ శతాబ్దపు 'ప్రపంచ ప్రభుత్వం' చర్చలో తలెత్తిన ఒక సంశయాన్ని మనకు గుర్తు చేస్తుంది. ఒక దేశాన్ని ఏలే ప్రభుత్వం పన్ను వసూళ్ల రూపంలోనూ, కరెన్సీ ముద్రణ రూపంలోనూ తన పరిపాలనకు అవసరమైన ఆర్థిక వనరులు సమకూర్చుకుంటుంది. కాని 'ప్రపంచ ప్రభుత్వానికి' ఆర్థిక వనరులు ఎక్కడి నుండి వస్తాయి? ప్రపంచ దేశాలు తలా ఇంత ఇచ్చేటట్టయితే ఎక్కువ ఇచ్చే దేశాల ప్రభావం ఎక్కువ ఉండదా?

ఐక్యరాజ్యసమితికి ఆర్థిక వనరులు ఎక్కువగా వచ్చేది అమెరికా నుండే. అందువల్ల అమెరికా ఐక్యరాజ్యసమితి పైన పైకి కనిపించని పెత్తనం చాలా చేస్తుంది. యునెస్కో వంటి సంస్థలు చేపట్టే కృషి పట్ల అమెరికాకు పెద్దగా సదభిప్రాయం ఎప్పుడూ లేదు. ధనిక దేశాలు తమ సంపదలో కొంత పేద దేశాలతో పంచుకోవాలన్న అభిప్రాయమేదయితే ఐక్యరాజ్యసమితి అప్పుడప్పుడు వ్యక్తం చేస్తుంటుందో దాని పట్ల

అమెరికాకు గౌరవం లేదు. పేదలు తమ చేతకానితనం వల్ల పేదరికంలో ఉంటారనీ, వారి పట్ల అయ్యోపాపం అనే వైఖరి వారిని మరింత సోమరులను చేస్తుందనీ అమెరికా సిద్ధాంతం. కాబట్టి ఆర్థిక సామాజిక రంగాలలో ఐక్యరాజ్యసమితి చేసే కృషి చాలా పరిమితంగా ఉండాలనీ, అది కూడ 'అభివృద్ధి'కి దోహదకారిగా ఉండాలనీ అమెరికా పట్టుదల. ఎప్పటికప్పుడు నిధులు కత్తిరించేస్తానన్న బెదిరింపులతో అజెండాను శాసిస్తుంటుంది. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాలలో తమను ఊరికే ఆడిపోసుకునే మూడవ ప్రపంచ దేశాలలోని పిల్లల చదువులకు, క్షామ సహాయానికి నిధులు తాము ఎందుకు సమకూర్చాలని ఆ దేశ విధానకర్తల నిరసన. కాబట్టి ప్రపంచ భద్రతకు ఏ మేరకు అవసరమో ఆ మేరకు మాత్రమే ఐరాస కృషిని కుదించాలని వారి ప్రయత్నం.

అయితే తక్షణ ప్రయోజనాలను ఐక్యరాజ్యసమితి ఏ మేరకు సాధించింది అనేదే కాక నాగరికతా విలువలను ఏ మేరకు పెంపొందించగలిగింది అనేది కూడ ప్రమాణమయితే ఆ సంస్థ కృషి గురించి మన అంచనా ఇంకొంత మెరుగుగా ఉంటుంది. పాలస్తీనా ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కును ఐక్యరాజ్యసమితి ఏ మాత్రం కాపాడలేకపోయిన మాట నిజమే కాని 'స్వయం నిర్ణయాధికారం' అనేది సకల జాతుల హక్కు అనే భావన అణగారిన జాతులకు ఇవ్వగల మానసిక బలాన్ని చూడాలంటే కశ్మీర్, నాగాలాండ్ లాంటి ప్రాంతాలను చూడాలి. అక్కడి ప్రజలు తమ డిమాండుకు మద్దతుగా అంతర్జాతీయ మానవహక్కుల ప్రకటనలోనూ, పౌర రాజకీయ హక్కుల ఒడంబడికలోనూ పొందుపరచిన స్వయం నిర్ణయాధికార హక్కును భారత ప్రయోజన బలప్రయోగ అధికారం ముఖం మీద ఒక సవాలుగా విసురుతుంటారు. దానికి 'అంతర్జాతీయ గుర్తింపు' ఉంది అనేది వారికి చాలా ఆత్మస్థైర్యాన్ని ఇస్తుంది. ఇది పర్యావరణ, జాతి వివక్ష, స్త్రీల హక్కులు, శ్రామికుల హక్కులు మొదలయిన అన్నిటికీ వర్తిస్తుంది. మానవ నాగరికత పురోగమనంలో ఉత్పాదక శక్తుల పోగుదల ఎంత ముఖ్యమో విలువల పోగుదలా అంతే ముఖ్యమని గుర్తించినట్టయితే, 19,20 శతాబ్దాలలో బలంగా ముందుకొచ్చిన రాజకీయ, ఆర్థిక, సామాజిక విలువల క్రోడీకరణలో ఐక్యరాజ్యసమితి నిర్వహించిన పాత్ర స్వల్పమైనది కాదని గ్రహిస్తాం.

ఏమయితేనేం, ఇప్పుడు ఆ సంస్థ ఉనికే ప్రశ్నార్థకమయింది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అమెరికా, రష్యాలు ఐక్యరాజ్యసమితితో ఫుట్‌బాల్ ఆడుకుంటున్న తరుణంలో ప్రచ్ఛన్న యుద్ధం ముగిస్తే తప్ప ఐక్యరాజ్యసమితి బాగుపడదని విశ్లేషకులు వ్యాఖ్యానించేవారు. కానీ ఆ తరువాత దాని ఉనికికే ప్రమాదం వచ్చింది. అమెరికా దానిని తన జేబులో వేసుకొని ఇష్టమొచ్చినట్టు పని చేయించుకోవడం మొదలుపెట్టింది. ఆఫ్ఘనిస్తాన్ యుద్ధం దీనికి పరాకాష్ట. అయితే ఇరాక్ యుద్ధం వచ్చేసరికి అమెరికా ఐక్యరాజ్యసమితికి ఆ మాత్రం 'గౌరవం' కూడ ఇవ్వలేదు. దానిని పూర్తిగా పక్కన పెట్టి తానే ప్రపంచ ప్రభుత్వమై వ్యవహరించసాగింది.

ఐక్యరాజ్యసమితి స్థాపన వెనక ఉన్న ఆకాంక్షను నిజమయిన అర్థంలో బతికించుకోవడం ఇవ్వాళ్టి అవసరం. దాని బదులు భారత్ స్వంత అస్తిత్వం కోల్పోయిన ఆ సంస్థలో పర్మనెంట్ సీటు (బహుశా వీటో అధికారం కూడ) పొందాలన్న తాపత్రయంలో నిమగ్నమై ఉంది. భారత ప్రజలుగా మనం అంతకంటే భిన్నంగా ఆలోచించగలగాలి.

*ఉద్యమం మాసపత్రిక*
*అక్టోబర్ - డిసెంబర్ 2004*

## మానవహక్కుల వేదిక ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1 | శివమెత్తిన సేన | జనవరి 1999 |
| 2 | ఎండమావి 2020 | మే 1999 |
| 3 | మానవ హక్కులు–1999 (బులెటిన్–1) | నవంబర్ 1999 |
| 4 | మానవ హక్కులు–2000 (బులెటిన్–2) | జూన్ 2000 |
| 5 | మానవ హక్కులు–2001 (బులెటిన్–3) | మార్చి 2001 |
| 6 | యుద్ధ సత్యాలు (బులెటిన్–4) | నవంబర్ 2001 |
| 7 | మానవ హక్కులు–2002 (బులెటిన్–5) | ఏప్రిల్ 2002 |
| 8 | గాంధీ గుజరాత్‌లో గాడ్సే రాజ్యం | జూన్ 2002 |
| 9 | ఎవరిదీ అడవి? | ఫిబ్రవరి 2003 |
| 10 | మానవ హక్కులు–2004 (బులెటిన్–6) | ఫిబ్రవరి 2004 |
| 11 | మణిపూర్ : ఎందుకింత ఆగ్రహం? | డిసెంబర్ 2004 |
| 12 | ఆరుగాలం కరువు | మే 2005 |
| 13 | మానవ హక్కులు–2005 (బులెటిన్–7) | మే 2005 |
| 14 | Death, Displacement & Deprivation: The War in Dantewara: A Report | డిసెంబర్ 2006 |
| 15 | మానవ హక్కులు–2007 (బులెటిన్–8) | మే 2007 |
| 16 | ఆదివాసీ సమాజంలో అంతర్యుద్ధం | మే 2007 |
| 17 | మానవ హక్కులు–2008 (బులెటిన్–9) | డిసెంబర్ 2008 |
| 18 | Kashmir: Will The Pain Never End? | డిసెంబర్ 2008 |
| 19 | మానవ హక్కులు–2009 (బులెటిన్–10) | జూన్ 2009 |
| 20 | సచార్ చెప్పిన సత్యాలు | జూలై 2009 |
| 21 | కంధమాల్ నుండి కరావళి దాకా: ప్రజాస్వామ్యం పైన సంఘ్ పరివార్ దాడి | అక్టోబర్ 2009 |
| 22 | హక్కుల ఉద్యమం–తాత్విక దృక్పథం, కె.బాలగోపాల్ | అక్టోబర్, 2010 |
| 23 | మా బాలగోపాల్ (బులెటిన్–11) | అక్టోబర్ 2010 |
| 24 | మానవ హక్కులు–2011 (బులెటిన్–12) | అక్టోబర్ 2011 |
| 25 | హక్కుల బాటసారి : బుర్ర రాములు రచనలు | అక్టోబర్ 2011 |
| 26 | ఆ శిక్షే ఒక నేరం, కె.బాలగోపాల్ | ఏప్రిల్,2012 |

27 Of capital and other punishments, K. Balagopal అక్టోబర్, 2012
28 The Terrible Cost of an Inhuman Counter-Insurgency అక్టోబర్ 2013
29 మానవ హక్కులు-2013 (బులెటిన్-13) అక్టోబర్ 2013
30 ముస్లిం ఐడెంటిటీ-హిందూత్వ రాజకీయాలు, కె.బాలగోపాల్ 6 డిసెంబర్ 2013
31 చుండూరు: ఒక మారణకాండ తరువాత అక్టోబర్ 2014
32 Tsunduru: An Atrocity and Its aftermath అక్టోబర్ 2014
33 నక్సలిజంపై రాజ్యం అణచివేత : మూల్యం చెల్లిస్తున్న ఆదివాసులు అక్టోబర్ 2014
34 పాలస్తీనా ప్రజాపోరాటం, కె.బాలగోపాల్ అక్టోబర్ 2014
35 ఆదివాసులు : ఛత్తీస్‌గఢ్, కంధమాల్ పై వ్యాసాలు, నివేదికలు, కె.బాలగోపాల్ అక్టోబర్ 2015
36 అభివృద్ధి-విధ్వంసం : భూమి, భావజాలం, కోర్టులు, కోస్టల్ కారిడార్, కె.బాలగోపాల్ అక్టోబర్ 2015
37 విస్థాపన-విధ్వంసం, కె.బాలగోపాల్ అక్టోబర్ 2016
38 మానవ హక్కులు-2015 (బులెటిన్-14) అక్టోబర్ 2015
39 విశాఖకు 7వ నెంబరు కాలుష్య హెచ్చరిక అక్టోబర్ 2016
41 సరళీకరణ-విధ్వంసం, కె.బాలగోపాల్ అక్టోబర్ 2017
40 ఎన్నికలు-ప్రజాస్వామ్యం, కె.బాలగోపాల్ అక్టోబర్ 2017
42 మానవ హక్కులు-2017 (బులెటిన్-15) అక్టోబర్ 2017
43 అణుశక్తి-విధ్వంసం, కె.బాలగోపాల్ సెప్టెంబర్ 2018
44 హిందూ మత జాతీయవాద రాజకీయాలు, జి.శివ నాగేశ్వరరావు సెప్టెంబర్ 2018
45 కరువు-వ్యవసాయ సంబంధాలు, కె.బాలగోపాల్ అక్టోబర్ 2018
46. విజన్-విధ్వంసం, కె. బాలగోపాల్ అక్టోబర్ 2019
47. అణచివేత-అణచివేత చట్టాలు, కె. బాలగోపాల్ డిసెంబర్ 2019
48. అంతర్జాతీయం, కె. బాలగోపాల్ (చరిత్ర-వర్తమానం, ఆధిపత్యాలు-ప్రత్యామ్నాయాలు) అక్టోబర్ 2020

ANTHARJATEYAM (ESSAYS)
BY
K. BALAGOPAL



సోవియట్ సమాజం ఎంత అనాకర్షణీయమైన వ్యవస్థ అయినా అది ఉండబట్టే అంతర్జాతీయ రాజకీయాలలో అమెరికా సామ్రాజ్యదాహం కొంత మేరకు అదుపులో ఉండిందని ఇప్పుడు స్పష్టంగా అర్థం అవుతున్నది. అమెరికా, రష్యా కూటముల మధ్య 50 ఏళ్ళపాటు ఉండిన సమతుల్యం అసమతుల్యమే అయినా, అణు యుద్ధం అంచున ఉన్న శాంతే అయినా, చిన్నాచితక దేశాలను పెద్దవారి ప్రయోజనాల కోసం కొట్లాడించిన ప్రచ్ఛన్న యుద్ధమే అయినా ఐక్యరాజ్యసమితి రూపంలో మానవ నాగరికత సాధించినట్లు కనిపించిన ప్రౌఢత్వానికి మూలం అదేనని ఇప్పుడు అర్థం అవుతున్నది. ఎప్పటికప్పుడు మనం 'అధికుల'మని పిలుచుకునే లక్షణాలను అధిగమించేస్తున్నామని నమ్మాలన్న అహంభావపూరితమైన ఆరాటం చాలా విజ్ఞులుగా కనిపించే విశ్లేషకుల కళ్ళకు సహితం పొరలు కప్పకుండా ఉంటే ఈ సత్యాన్ని అంతకు ముందే గ్రహించి ఉందుమేమో. మానవులు ఏవో ప్రత్యేకమైన పరిస్థితులలో తప్ప 'అమానవీయం' అని పిలుచుకునే గుణాలను అధిగమించి బతకలేదనేది గత చరిత్రకు మాత్రమే సంబంధించిన వాస్తవం కాదనీ, వర్తమాన సత్యం కూడాననీ, బహుశ మనిషికి సంబంధించిన సార్వజనీన సత్యమనీ గ్రహించి ఉందుమేమో కూడ.

మానవహక్కుల వేదిక(HRF) ప్రచురణ

₹ 200